# కమిషన్ నివేదికలు
# సామాజిక న్యాయం



కె. బాలగోపాల్

మానవ హక్కుల వేదిక

# కమిషన్ నివేదికలు

# సామాజిక న్యాయం

కె. బాలగోపాల్

HRF

మానవహక్కుల వేదిక ప్రచురణ

"మన రాష్ట్ర ప్రభుత్వం మానవహక్కుల కమిషన్ తనకు శత్రువయినట్టే వ్యవహరించింది. 'నక్సలైట్ల వేటలో నువ్వు బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడుతున్నావంట' అని ప్రభుత్వాన్ని సవివరంగా అడగడానికి మానవ హక్కుల కమిషన్ రాష్ట్రానికి రాగా, డ్రగ్స్ ఇన్‌స్పెక్టరు మందుల అంగళ్ళను సోదా చేయడానికి వచ్చినప్పుడు అంగళ్ళ యజమానులు సీసాలు మార్చి, లేబుల్స్ తారుమారు చేసి, డబ్బాలు వెనక గదిలో దాచిపెట్టి ఇన్‌స్పెక్టర్‌ను మభ్య పెట్టడానికి ప్రయత్నించినట్టు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం నిజాలేవీ కమిషన్ కళ్ళకు కనిపించకుండ ఉండడానికి, అబద్ధాలను సహేతుకమయిన సత్యాలుగా చూపించడానికి నల్ల బజారు మందుల వ్యాపారి పడినంత ప్రయాస పడింది.

చట్టాన్ని సంరక్షించే బాధ్యతగల ప్రభుత్వం అనుసరించవలసిన వైఖరి ఇదేనా? అన్ని దేశాలలోనూ పౌరులు, పౌర బృందాలు చేసే నేరాలను నిరోధించడానికి, శిక్షించడానికి పోలీసు వ్యవస్థ, కోర్టు వ్యవస్థ ఉన్నాయి. కానీ ఆ పోలీసు వ్యవస్థ ఒక్కొక్క దేశంలోనూ చేస్తున్న నేరాలను నియంత్రించడానికి గానీ, విచారించి శిక్షించడానికి గానీ ఎక్కడా ఒక యంత్రాంగం లేదు కాబట్టి అన్ని దేశాల ప్రభుత్వాలూ ఇందుకోసం ఒక స్వతంత్ర యంత్రాంగాన్ని నెలకొల్పాలని అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు, ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కమిషన్ ఒత్తిడి చేయగా పి.వి. నరసింహారావు ప్రభుత్వం ఈ జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను నెలకొల్పింది. దేశ ప్రభుత్వంలో భాగమయిన పోలీసు, పారామిలిటరీ, మిలిటరీ యంత్రాంగాలు ప్రజలపైన అత్యాచారాలకు పాల్పడుతున్నాయన్న అభియోగాన్ని విచారించి నిజానిజాలు తేటతెల్లం చేయడం కోసం భారత ప్రభుత్వమే నెలకొల్పిన సంస్థ ఇది. ఆ యంత్రాంగాన్ని తానే శత్రువుగా పరిగణించడం ప్రభుత్వానికి తగునా?"

**కె. బాలగోపాల్**

# కమిషన్ నివేదికలు - సామాజిక న్యాయం

మానవహక్కుల వేదిక ప్రచురణ

**A Human Rights Forum Publication**

ప్రచురణ సంఖ్య : 62
ప్రచురణ : డిసెంబర్ 2024

వెల : 300 రూపాయలు

**ముద్రణ :**
అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ,
126 శాంతినగర్, హైదరాబాద్ - 28
ఫోన్ : 23391364, 233041941
Email: anupamaprinters@yahoo.co.in

**ప్రతులకు:**
ఫోన్ : 9985411455
Email: vasantha.aj@gmail.com

**నవోదయ, నవ తెలంగాణ బుక్‌హౌస్‌లు**

మా వెబ్‌సైట్: www.humanrightsforum.org
బాలగోపాల్ రచనల కోసం : www.balagopal.org

# మా మాట

రెండేళ్ల క్రితం 'కోర్టు తీర్పులు – సామాజిక న్యాయం' పుస్తకం తీసుకొచ్చాం. ఇప్పుడు దానికి కొనసాగింపుగా 'కమిషన్ నివేదికలు – సామాజిక న్యాయం' తీసుకొస్తున్నాం. కోర్టు తీర్పులు చర్చించబడినంతగా కమిటీలు, కమిషన్ల నివేదికలు ప్రజాక్షేత్రంలో చర్చించబడవు. మండల్, సచార్ కమిషన్ లాంటి కొన్ని మాత్రమే దీనికి మినహాయింపు. సాధారణంగా నేరుగా లబ్ధి పొందే లేదా నష్టపోయే వర్గాలు మాత్రమే ఈ నివేదికలను చదివి వాటి సిఫార్సులను అమలు చేయమనో, తిరస్కరించమనో ప్రభుత్వాలను డిమాండ్ చేస్తుంటాయి. అవే ఎక్కువగా మీడియాలో వార్తలుగా వస్తుంటాయి. అయితే బాలగోపాల్ గారు తన హక్కుల ప్రయాణం ప్రారంభ దశ నుండి ప్రజా ప్రయోజనం ఉన్నాయనుకున్న అన్ని కమిటీలకు, కమిషన్లకు చాలా ప్రాముఖ్యం ఇస్తూ వచ్చారు. రాష్ట్రంలోనే కాదు, జాతీయ స్థాయిలో ఏర్పాటైన కమిషన్ల నివేదికలపై కూడా స్పందిస్తూనే వచ్చారు. ప్రజాస్వామ్య సంవాదంలోనూ, సామాజిక న్యాయ సాధనలోనూ వాటి పాత్రను ఆయన గుర్తించి, గౌరవించినట్టుగా ఇంకెవరూ చేసినట్టు కనిపించదు.

1986 నుండి 2009 వరకు తన మొత్తం హక్కుల ప్రయాణంలో ఆయన అనేక కమిటీలు, కమిషన్ల నివేదికలపై విస్తృతంగా రాశారు. కొన్నిసార్లు కమిషన్ల ఏర్పాటు దశ నుండే వాటికి సూచనలు ఇచ్చారు. ప్రకటనల రూపంలో, కరపత్రాల రూపంలో, పత్రికలలో వ్యాసాల రూపంలో, హక్కుల సంఘం తరఫున ఇచ్చే వినతిపత్రాల రూపంలో, బుక్‌లెట్‌ల రూపంలో, ఉపన్యాసాల రూపంలో వాటిలోని అంశాలను ప్రజలకు తెలియజేయడానికి శాయశక్తులా కృషి చేశారు. జాగ్రత్తగా చదివితే

– ఇందులోని ఒక్కొక్క వ్యాసం వెనక ఆయా నివేదికల ద్వారా ప్రజలకు మేలు జరగాలన్న ఆయన తపన, ఆరాటం, హాని జరగకూడదన్న పట్టుదల కనిపిస్తాయి.

ఒక హక్కుల కార్యకర్తగానే కాదు, పరిశోధకుడిగా, ప్రజా మేధావిగా బాలగోపాల్ ఈ నివేదికలను లోతుగా విశ్లేషించి, వాటి మంచిచెడులను సమాజానికి తెలియజేశారు. కమిషన్లు సేకరించిన సమాచారం, వాటిని అవి పరిశీలించిన పద్ధతి, చేసిన సిఫార్సులు, అన్నిటినీ క్షుణ్ణంగా పరిశీలించి ఏవి ప్రజానుకూలమైనవో, ఏవి కావో, ఏవి ప్రజాస్వామ్యానికి దోహదపడేవో, ఏవి కావో సహేతుకంగా వివరించి చెప్పిన వ్యాసాలు ఇవి. చట్టం చెప్పే న్యాయం మాత్రమే కాదు, సామాజిక న్యాయం కూడా ఉందా లేదా అని సాధికారికంగా చెప్పడం ఈ వ్యాసాల విశిష్టత.

జీవన్ రెడ్డి గారి మీద ఇతరత్రా ఎంత గౌరవం ఉన్నా సాయుధ బలగాల చట్టం మీద ఆయన నేతృత్వంలోని కమిటీ చేసిన సిఫార్సును బాలగోపాల్ చాలా ఘాటుగా విమర్శించారు. “ఒక వ్యక్తిని నేరుగా కాల్చి చంపడానికి సాయుధ బలగాల చట్టం సైనిక బలగాల సిబ్బందికి ఇచ్చిన అధికారం ఎంతవరకు సబబు అన్న ప్రశ్న ప్రధానంగా వేసుకోవలసి ఉండింది. వేసుకోకుండా, రాజ్యం ఉనికినే ప్రశ్నించే ఉద్యమాలు నడుస్తున్న చోట సి.ఆర్.పి.సి సైనిక బలగాలకు కల్పించే పాత్ర, ఇచ్చే అధికారాలు చాలవనీ, సాయుధ బలగాల చట్టం ఇచ్చే విశేష అధికారాలు అవసరమనీ నిర్ణయించడం (ఎంత మర్యాదగా చెప్పాలన్నా) విచారకరం అనక తప్పదు... జీవన్ రెడ్డి గారు క్షమిస్తే వికృతమైన ఆలోచన అని కూడ అనక తప్పదు” అని రాశారు. సచార్ కమిటీ నివేదికను ప్రశంసిస్తూనే “దాని సిఫారసులే ఆ నివేదికలోని అత్యంత బలహీనమైన అంశం” అన్నారు. అంటరానితనం నిర్మూలించడానికి పున్నయ్య కమిషన్ చేసిన సూచనలు మరీ సుతిమెత్తగా ఉన్నాయని కూడా నిర్మొహమాటంగా అన్నారు.

ఈ పుస్తకంలో వచ్చిన వ్యాసాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు సంబంధించిన అంశాలకు మాత్రమే పరిమితం కాదు. జాతీయ లేబర్ కమిషన్, లా కమిషన్, బొంబాయి అల్లర్ల మీద ఏర్పాటైన శ్రీకృష్ణ కమిషన్, 11 వ ఫైనాన్స్ కమిషన్ మొదలైన జాతీయ ప్రాముఖ్యత ఉన్న ఎన్నో కమిషన్ రిపోర్టులను పరిశీలించి రాసిన వ్యాసాలు కూడా ఇందులో ఉన్నాయి.

ఇవన్నీ ప్రధానంగా తెలుగులో రాసిన వ్యాసాలు. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఎన్‌కౌంటర్‌ల మీద, పోలీస్ కస్టడీ మరణాల మీద జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదులు మాత్రమే తెలుగులోకి చేసిన అనువాదాలు (బాలగోపాల్ గారు చేసినవే). ఇంగ్లీషులో కమిషన్లకు ఇచ్చిన సబ్మిషన్లు (అవి ఫిర్యాదుల రూపంలో, అభిప్రాయాల రూపంలో, సూచనల రూపంలో, నిజనిర్ధారణ ఆధారంగా చేసిన ఫిర్యాదుల రూపంలో ఉన్నాయి కాబట్టి సబ్మిషన్‌లనే ఆంగ్ల పదాన్నే వాడుతున్నాం) 20 కి పైనే ఉన్నాయి. వాటిలో 27 మంది చనిపోయిన సింగరేణి 7 LEP, 8 A Incline గనుల్లో జరిగిన ప్రమాదాల మీదా, 22 మంది చనిపోయిన HPCL వంటి పారిశ్రామిక ప్రమాదాల మీదా ఇచ్చిన సబ్మిషన్లు ఉన్నాయి. రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు, విద్యుత్ కమిషన్‌కు ఇచ్చిన సబ్మిషన్లు ఉన్నాయి. వాటిని ఇందులో చేర్చలేదు. కొన్ని దొరకలేదు కూడా. అయితే వీటిలో మేము ఎంతో ప్రయత్నించినా దొరకని వ్యాసం ఒకటుంది. అది మిస్సింగ్ కేసుల మీద టి.ఎల్.ఎన్. రెడ్డి కమిషన్‌కు ఇచ్చిన సబ్మిషన్. అందులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన మిస్సింగ్ కేసుల వివరాలన్నీ ఉన్నాయి. ఆ నివేదికను అసెంబ్లీకి సమర్పించారో లేదో ఇప్పటికీ అస్పష్టంగానే ఉంది. దీని గురించి బాలగోపాల్ APCLC ప్రధాన కార్యదర్శిగా 9 వ రాష్ట్ర మహాసభల కోసం రాసిన కార్యదర్శి నివేదికలో ఈ కింది వాక్యాలు ఉన్నాయి.

*పోలీసు కస్టడీ నుండి 'మాయం' అయిన వారి గురించి టి.ఎల్.ఎన్.రెడ్డి కమిషన్ జరిపిన న్యాయ విచారణ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రెండేళ్ళు తొక్కి పెట్టింది. ఆ నివేదికలను బయటపెట్టాలని మనం 1994 ఏప్రిల్ నెలలో ఆందోళన చేపట్టాము. అయిలయ్య, రాజమల్లు, మరొక 43 మంది గురించి టి.ఎల్.ఎన్. రెడ్డి కమిషన్ న్యాయ విచారణ జరిపింది. మనం ఒత్తిడి పెట్టగా రాష్ట్ర ప్రభుత్వం ఆ నివేదికలను అసెంబ్లీలో పెట్టింది.*

*కమిషన్ 6 కేసులలో మాత్రం పోలీసులను దోషులుగా గుర్తించింది. అయినప్పటికీ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ తర్వాత వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ఆ 6 కేసులలో కూడా ఎటువంటి చర్యా తీసుకోలేదు. ఈ మహాసభల తర్వాత దీని గురించి మనం ఆందోళన చేపట్టవలసి ఉంది.*

బాలగోపాల్ ఇంత స్పష్టంగా రాశారు కాని ఆ నివేదికను ప్రవేశపెట్టినట్లు అసెంబ్లీ రికార్డులలో మాత్రం లేదు. రాజకీయ నాయకులో, పోలీసు, సివిల్ ఉన్నతాధికారులో మాత్రమే ఈ మిస్టరీని ఛేదించగలరేమో. ఏమైనప్పటికీ ఆ నివేదిక గాని, APCLC ఇచ్చిన సబ్మిషన్ గాని మాకు దొరకలేదు. నిజానికి దాని కోసమే ఈ పుస్తకాన్ని ఇంతకాలం ఆపాం. అలాగే ఇందులో పేర్కొన్న కమిటీలు, కమిషన్‌ల నియామకాల తేదీలు, terms of references, సభ్యుల పేర్లు, సిఫార్సులు అమలయిందీ లేనిదీ, అమలైతే ఏ మేరకు అమలైందీ వంటి వివరాలు కూడా ఇందులో పొందుపరచాలనుకున్నాం. కాని ఈ డిజిటల్ యుగంలో కూడా అవి అరకొరగా మాత్రమే దొరకడంతో ఆ ప్రయత్నం విరమించుకున్నాం.

ఇందులో చర్చించబడిన అంశాలన్నీ భారత రాజకీయ సంవాదంలో చాలా ముఖ్య పాత్ర పోషించినవి, మరెంతో కాలం పోషించబోయేవి కూడా. కాబట్టి అందరూ చదివి వీటిని తమ అవగాహనలో భాగం చేసుకోవాలని కోరుతున్నాం.

**మానవహక్కుల వేదిక**

5 డిసెంబరు 2024

# ఇందులో...


1. **మురళీధరరావు కమిషన్ నివేదిక:**
   రిజర్వేషన్ల పైన దాడిని వ్యతిరేకించండి 11
2. **మండల్ కమిషన్ నివేదిక:**
   వ్యతిరేకించే వారిదే దురుద్దేశం 25
3. **జస్టిస్ గంగాధరరావు కమిటీ నివేదిక:**
   చుండూరు న్యాయ విచారణ : పూర్తిగా దళిత వ్యతిరేకం 31
4. **జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు:**
   ఆంధ్రప్రదేశ్‌లో 'ఎన్‌కౌంటర్లు' 43
5. **టి.ఎల్.ఎన్. రెడ్డి కమిషన్ నివేదిక:**
   న్యాయమూ లేదు, విచారణా లేదు : రెండోసారి రసూల్ హత్య 57
6. **జాతీయ మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర సందర్శన:**
   ప్రజలు, మఫ్టీ ప్రజలు, మానవహక్కులు 99
7. **జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు:**
   ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు కస్టడీ మరణాలు 109
8. **'నక్సలైట్ సమస్య' పై న్యాయవాదుల కమిటీ రిపోర్టు:**
   చెత్తబుట్టకు చేరాల్సిన నివేదిక 131
9. **రెండవ జాతీయ లేబర్ కమిషన్:**
   లేబర్ కమిషన్ ముసుగులో జరగబోతున్నది ఏమిటి? 145
10. **శ్రీకృష్ణ కమిషన్ నివేదిక:**
    శివమెత్తిన సేన 151
11. **పున్నయ్య కమిషన్‌కు సూచనలు:**
    దళితులకు చేయాల్సింది ఇంకా చాలా ఉంది 199

12. **లా కమిషన్ సిఫార్సులు:**
ఎన్నికల సంస్కరణలు, రాజ్యాంగ సమీక్ష ఎందుకోసం? 207
13. **లా కమిషన్ నివేదిక:**
ఎన్నికల సంస్కరణలు స్థిరత్వం కోసమేనా? 212
14. **11వ ఫైనాన్స్ కమిషన్ నివేదిక:**
ఆర్థికసంఘం సిఫార్సులు అంత అన్యాయంగా లేవు 224
15. **పున్నయ్య కమిషన్ నివేదిక:**
కొంత సత్యం కొరవ భ్రమలు 228
16. **రెండవ లేబర్ కమిషన్ రిపోర్టు:**
కాగల కార్యానికి ముందస్తు ఆశీస్సులు 239
17. **జీవన్‌రెడ్డి కమిటీ నివేదిక:**
నిర్బంధ చట్టాల్ని కేంద్రీకృతం చేసే సిఫార్సులు 257
18. **జాతీయ మానవ హక్కుల కమిషన్:**
విచారణలు, విషాదాలు! 272
19. **సచార్ కమిటీ నివేదిక:**
సామాజిక స్థాయిలో ముస్లింలు దళితులకే దగ్గర 277
20. **లాయర్ల ఆందోళనపై శ్రీకృష్ణ కమిషన్ రిపోర్టు:**
మద్రాసు హైకోర్టు రగడ ముందూ వెనకా 312
21. **సోమశేఖర కమిషన్:**
దారి తప్పిన 'విచారణ' 317

# రిజర్వేషన్ల పైన దాడిని వ్యతిరేకించండి

వెనుకబడిన వర్గాలకు ఉద్యోగాలలో, కళాశాల సీట్లలో రిజర్వేషన్లను 25 శాతం నుండి 44 శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జి.వోను హైకోర్టు మొన్నటి సెప్టెంబర్ 5వ తేదీన కొట్టి వేయటంతో రిజర్వేషన్ల నాటకంలో ప్రథమ అంకం పూర్తి అయింది. సుప్రీంకోర్టుకు అప్పీలు చేయబోనని రాష్ట్ర ప్రభుత్వం నవ సంఘర్షణ సమితి ప్రతినిధులకు హామీ యివ్వటంతో రెండవ అంకం తెర లేవకుండానే ముగిసింది. మూడవ అంకం ఏమిటో, అది చరమాంకం అవుతుందో కాదో అని ప్రజలంతా ఎదురు చూస్తున్నారు. ఈ నాటకం ప్రహసనమా, విషాదాంతమా లేక సామాజిక మార్పులో ఒక ఉదంతమా అనేది ప్రజలందరినీ వేధిస్తున్న ప్రశ్న.

నవ సంఘర్షణ సమితి పేరిట రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ ఉద్యమం ప్రారంభం అయినప్పటి నుండి హైకోర్టు తీర్పు ఇచ్చిన నాటిదాకా జరిగిన సంఘటనలు, రేగిన సంవాదాలు పరిశీలించదగ్గవి. రిజర్వేషన్లను వ్యతిరేకించే వర్గాల అభిప్రాయాలు, వాదనలు శర పరంపరగా జనం మీద పడ్డాయి. ప్రభుత్వం, పత్రికలు, ఇతర ప్రసార సాధనాలు ఇచ్చిన తోడ్పాటు ఫలితంగా ఈ వాదనలు విస్తృతంగా ప్రాచుర్యం పొందాయి. వెనుకబడ్డ వర్గాలు అసంఘటితంగా ఉండడం వల్ల ఇవతలి వైపు నుండి సమాధానం మృగ్యం అనిపించేటంత తగ్గు స్వరంతో వినవచ్చింది. రిజర్వేషన్ల సమస్య పైన చర్చ – అసలు దాన్ని చర్చ అనదల్చుకుంటే – పూర్తిగా ఏకపక్షంగా సాగింది.

ఈ అసమతుల్యాన్ని సవరించడం మా బాధ్యతగా భావిస్తున్నాం. రిజర్వేషన్ల వ్యతిరేక ఆందోళన లేవదీసిన ఒక్కొక్క ప్రశ్ననూ వరుస క్రమంలో పరిశీలించి

సమాధానం ఇస్తాం. ఈ ప్రయత్నం నుండి మొత్తం సమస్యను అర్థం చేసుకోవడానికి అవసరమైన అవగాహన గూడ ఏర్పడుతుందని ఆశిస్తాం.

1. మొన్నటి జీ.వోలో పెంచిన రిజర్వేషన్లను కలిపితే మొత్తం రిజర్వేషన్లు 71 శాతానికి చేరుకున్నాయి. ఇవి చాలా ఎక్కువ అనీ, మొత్తం రిజర్వేషన్లు 50 శాతం కంటే ఎక్కువ ఉండడానికి వీలులేదనీ జి.వోను వ్యతిరేకించే వాళ్లు వాదించారు. మొత్తం అన్ని రిజర్వేషన్లూ కలిపి 50 శాతం కంటే ఎక్కువ ఉండకుంటే బాగుంటుందని సుప్రీంకోర్టు 1963 లో 'బాలాజీ కేసు'లో (బాలాజీ వర్సస్ స్టేట్ ఆఫ్ మైసూరు) అభిప్రాయపడింది. అయితే చాలామందికి అర్థం కావలసిన విషయం ఏమిటంటే ఒక మామూలు పౌరుడి అభిప్రాయానికి ఏ మాత్రం విలువ ఉందో సుప్రీంకోర్టు వెలిబుచ్చిన ఈ అభిప్రాయానికి గూడ ఆ మాత్రమే విలువ ఉంది. రిజర్వేషన్లు 50 శాతం కంటే ఎక్కువ ఉండడానికి వీలులేదని శాసించే హక్కు సుప్రీంకోర్టుకు లేదు. ఆ అభిప్రాయం క్రింది కోర్టులకు శిరోధార్యం కాదు.

ఉద్యోగాలు, విద్య తదితర విషయాలలో కుల, మత, లైంగిక వివక్ష చూపడానికి వీలులేదని రాజ్యాంగంలోని 15, 16 అధికరణాలు అంటాయి. ఇవి ప్రాథమిక హక్కులు. అయితే వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు గాని, ఇతర ప్రత్యేక సౌకర్యాలు గాని కల్పిస్తే అది కుల వివక్ష కాదని, అధికరణాలు 15, 16 లకు వ్యతిరేకం కాదని రాజ్యాంగమే అంటుంది. ఈ మినహాయింపు 15(4), 16(4) క్లాజులలో ఉంది. వీటిని ఆధారం చేసుకొనే రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు కల్పించడం జరుగుతోంది. రిజర్వేషన్లు 50 శాతం దాటితే అది కుల వివక్ష అయిపోతుందని ఈ అధికరణాలు అనడం లేదు. నిజానికి అధికరణం 15(4)లో గాని, 16(4) లో గాని రిజర్వేషన్ల పరిమాణం మీద ఎటువంటి పరిమితీ లేదు. 100 శాతం రిజర్వేషన్లు ఇచ్చినా అది ఆయా అధికరణాలకు వ్యతిరేకం కాజాలదు. ఏదయినా పరిమితి పెట్టదల్చుకున్నా అది రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా పార్లమెంటు చేయవలసిందే గాని నిర్హేతుకంగా 50 శాతాన్ని మించడానికి వీలులేదని శాసించే అధికారం సుప్రీంకోర్టుకు లేదు. సుప్రీంకోర్టుకు లేని ఈ అధికారాన్ని గౌరవించాల్సిన బాధ్యత హైకోర్టులకు లేదు. కోర్టులు శాసనాలు చేయలేవు. రాజ్యాంగాన్ని సవరించలేవు. శాసనాలను వ్యాఖ్యానించటం మాత్రమే కోర్టుల బాధ్యత.

అదలాగుంచి, 50 శాతం పరిమితిని మించి రిజర్వేషన్లు ఉండడానికి వీలులేదని నిర్ణయించడంలో సబబు ఏమిటి ? 50 అనే అంకెకు ఉండే ప్రాముఖ్యత ఏమిటి? 49 గాని, 51 గాని ఎందుకు కాకూడదు? 70 ఎందుకు కాకూడదు? మన దేశంలో నిరక్షరాస్యుల సంఖ్య జనాభాలో 65 శాతం ఉంది. గ్రామీణ ప్రాంతాలలో పేదల సంఖ్య 65 నుండి 70 శాతం దాకా ఉంది. అటువంటప్పుడు అన్ని రకాల రిజర్వేషన్లూ కలిపి 50 శాతం మించరాదన్న ప్రమాణం ఎక్కడి నుంచి పుట్టింది ?

మురళీధరరావు కమిషన్ తన సిఫార్సుల సమర్థనకు ఒక పద్ధతిని ప్రయోగించింది. రాష్ట్ర జనాభాలో వెనుకబడ్డ వర్గాలు 52 శాతం అని మురళీధరరావు అంచనా వేశాడు. అందులో 8 శాతం మంది అగ్రవర్ణాల వారితో నేరుగా పోటీపడగలరని నిర్ణయించాడు. కాబట్టి తక్కిన 44 శాతం ప్రజానీకానికి రిజర్వేషన్ల అవసరం ఉందని నిర్ధారించి, వెనుకబడిన వర్గాల రిజర్వేషన్లు 25 శాతం నుండి 44 శాతానికి పెంచాలని సూచించాడు. ఈ వాదనలో ఒక పద్ధతి ఉంది, సబబు ఉంది. "జనాభాలో వెనుకబడిన వర్గాలు ఎంత శాతం ఉంటే అంత రిజర్వేషన్ ఇవ్వవచ్చు. ఇది తప్పని ఎట్లాగంటారు?" అని జస్టిస్ ముర్తజా ఫజల్ అలీ ఒక తీర్పు ఇస్తూ అన్నారు.

2. రాష్ట్ర జనాభాలో వెనుకబడిన వర్గాలు 52 శాతం ఉన్నారని మురళీధరరావు వేసిన అంచనా సరయింది కాదని వాదించారు. వెనుకబడ్డ వర్గాలు 35 శాతం కంటే ఎక్కువ లేరని అగ్రవర్ణాలు అంచనా వేశారు. కోర్టు అంగీకరించింది.

ప్రస్తుతం జనాభా లెక్కలు కుల ప్రాతిపదిక మీద తీయడం లేదు. కేవలం షెడ్యూల్డు కులాలు, తెగలు, అల్ప సంఖ్యాక మతాలు మాత్రమే రికార్డు అవుతున్నాయి. తక్కిన కులాలు ఎంత ఉందీ తెలియదు.

1931లో ఆఖరిసారిగా కులం ప్రాతిపదిక మీద జనాభా లెక్కలు తీయడం జరిగింది. కాబట్టి ఇప్పుడు జనాభాలో వెనుకబడిన వర్గాలు ఎంత శాతం ఉన్నారో తెలుసుకోవాలంటే 1931లో ఎంత ఉండేవారో తెలుసుకొని, దానికి సరయిన సవరణలు చేసి అంచనా వేయాలి. మొన్నటి హైకోర్టు కేసులో ఇరుపక్షాలు ఆ పని చేశారు. అగ్రవర్ణాల వాళ్ళు 1931లో లెక్కలు కట్టేటప్పుడు కాపు అన్న పేరుతో ఉన్న

కులాలన్నింటినీ అగ్రవర్ణాలుగా లెక్కకట్టి అగ్రవర్ణాల జనాభా 35 శాతం ఉన్నదని, కాబట్టి వెనుకబడిన కులాల జనాభా 33 శాతం ఉన్నదని అంచనా వేశారు. అయితే నిజానికి 'కాపు' కులాలలో మున్నూరు కాపు, తూర్పు కాపు, ముత్రాసి, గాజుల, బలిజ తదితర కులాలు వెనుకబడ్డ కులాలు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటే అగ్రవర్ణాలు యిచ్చిన లెక్క తప్పని అర్థం అవుతుంది. అంతేకాక, 1931 లెక్కలలో వడ్డెర, ఎరుకల, దొమ్మరి తదితర కులాలను లెక్కకట్టలేదు. ముస్లింలలోనూ, క్రిస్టియన్లలోనూ ఉన్న వెనుకబడిన వర్గాలనూ అప్పుడు విడిగా లెక్క పెట్టలేదు. వీళ్ళ జనాభా గూడ చేరిస్తే వెనుకబడిన వర్గాల జనాభా ఇంకా ఎక్కువ అవుతుంది. అంతేకాక, మన దేశంలో సాధారణంగా ధనికుల కంటే పేదల జనాభా పెరుగుదల రేటు ఎక్కువగా ఉంది. కాబట్టి 1931లో వెనుకబడిన వర్గాల జనాభా శాతం ఎంత ఉన్నదో అంతకంటే ఇప్పుడు ఎక్కువ ఉంటుంది. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుంటే ఇప్పుడు జనాభాలో వెనుకబడిన వర్గాల జనాభా 50 శాతం దాకా ఉంటుందని చెప్పవచ్చు. ఈ విషయం రాష్ట్ర ప్రభుత్వం కోర్టులో వివరించింది. అయినా కోర్టు పట్టించుకోలేదు. ఒకవేళ కోర్టుకు ఇంకా అనుమానం ఉండి వుంటే ఆ జీ.వోను కొట్టి వేయకుండా కులం ప్రాతిపదిక మీద జనాభా లెక్కలు తీసి నివేదిక సమర్పించమని ప్రభుత్వానికి ఆదేశం ఇచ్చి ఉండవలసింది. కోర్టు ఆ పని చేయకుండ తన పాటికి తను ఒక 'అంచనా'కు వచ్చి జనాభాలో వెనుకబడిన వర్గాలు 35.5 శాతం కంటే ఎక్కువ లేరని ప్రకటించింది. ఎంతో సాంకేతిక నైపుణ్యంతో కూడుకున్న జనాభా లెక్కలను బెంచి మీద కూర్చొన్న ముగ్గురు జడ్జీలు ఎట్లా నిర్ధారించారో అనూహ్యంగా ఉంది.

3. వెనుకబడ్డ వర్గాలకు, షెడ్యూల్డు కులాలకు, తెగలకు రిజర్వేషన్లు ఇవ్వడం వల్ల అగ్రవర్ణాలకు చెందిన పేదవాళ్లకు ఉద్యోగాలు, కాలేజీ సీట్లు దొరక్కుండా పోతున్నాయని వాదించారు. హైదరాబాద్‌లో ఒక యువకుడు ఇదే సమయంలో ఆత్మహత్య చేసుకోగా అతని ఆత్మహత్యకు రిజర్వేషన్లే కారణం అని ప్రచారం చేశారు. రిజర్వేషన్ సౌకర్యం పొందుతున్న ప్రజానీకం ఉమ్మడిగా ఆ యువకుడిని హత్య చేశారన్నట్టు చాలా అసహ్యమయిన దుష్ప్రచారం చేశారు. ఇది అర్థరహితమయిన వాదన అని వివరించనక్కర లేదు. రిజర్వేషన్లు ఉన్న ఉద్యోగాలను తొలగించవు, లేని ఉద్యోగాలు కల్పించవు. ఉన్న ఉద్యోగాలను నిరుద్యోగుల మధ్య ఎట్లా పంచాలో నిర్ణయిస్తాయి.

అంత మాత్రమే. మన దేశంలో రెండు కోట్లకు పైగా నమోదయిన నిరుద్యోగులు ఉన్నారనీ, మన రాష్ట్రంలో 25 లక్షల మంది ఉన్నారనీ అధికార గణాంకాలే చెబుతాయి. నమోదు చేసుకోని నిరుద్యోగులనూ, సంవత్సరంలో నాలుగయిదు నెలలే పని దొరికే అర్ధ నిరుద్యోగులనూ లెక్కపెడితే ఈ సంఖ్యలు ఎన్ని రెట్లు పెరుగుతాయో ! రిజర్వేషన్లు నిరుద్యోగం సమస్యకు కారణం కాదు. అందరికీ ఉద్యోగాలు కల్పించగల ఆర్థిక వ్యవస్థ కోసం పోరాడడం సరయిన పని అవుతుంది. అప్పుడే అందరి సమస్యా పరిష్కారం అవుతుంది.

అది దీర్ఘకాలిక పరిష్కారం అనుకుంటే కనీసం ప్రభుత్వరంగ ఉద్యోగాల వ్యాప్తి కోసం పోరాడితే బాగుండేది. ప్రభుత్వరంగ ఉద్యోగాలు వ్యాప్తి చెందకపోగా కుదించుకపోతున్నాయి. ఆధునీకరణ పేరిట రిట్రెంచ్‌మెంట్లు పెరిగిపోగా పొదుపు పేరిట రిక్రూట్‌మెంట్ నిలిపివేస్తున్నారు. ఒకవేళ రిక్రూట్‌మెంట్ మీద నిషేధం ఎత్తి వేసినా 9000 ఉద్యోగాలు మాత్రమే వస్తాయి. మరి రాష్ట్రంలో నమోదు అయిన నిరుద్యోగుల సంఖ్య ఏమో 25 లక్షలు ఉంది. ఇది గూడ వెంటనే అయ్యేది కాదనుకుంటే అగ్రవర్ణాలలోని పేదవాళ్లు తమకు గూడ ఆర్థిక ప్రాతిపదిక మీద రిజర్వేషన్లు కల్పించాలని పోరాడవచ్చును. మొన్న పెంచిన వాటితో కలిపి షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, వెనుకబడ్డ వర్గాల రిజర్వేషన్లు మొత్తం రిజర్వేషన్లలో 71 శాతం అయ్యాయి. అగ్రవర్ణాలలోని (ముస్లిం, క్రిస్టియన్ అగ్రవర్ణాలతో సహా) పేదవాళ్లకు ఆర్థిక ప్రాతిపదిక మీద మరొక 20 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరి ఉంటే సబబుగా ఉండేది. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలో ఒకటయిన అధికరణం 48 'సమాజంలోని బలహీన వర్గాలకు' ప్రత్యేక రాయితీలు కల్పించే బాధ్యత ప్రభుత్వం మీద పెడుతుది. దీని కింద అగ్రవర్ణాలలోని పేదవాళ్లు గూడ ఒక బలహీన వర్గంగా రాయితీలు పొందవచ్చును. అది ఒకవేళ 15, 16 అధికరణాలకు వ్యతిరేకం అవుతుందనుకుంటే రాజ్యాంగ సవరణ ద్వారా ఆ పరిస్థితిని సవరించవచ్చును. అందుకోసం అగ్రవర్ణాలలోని పేదవాళ్లు ఉద్యమిస్తే దేశమంతా వారిని సమర్థిస్తుంది కూడ. వెనుకబడిన వర్గాల మద్దతు కూడ వారికి తప్పకుండ ఉంటుంది. ఈ పని చేయకుండా రిజర్వేషన్ల మీద దాడి చేయడం వల్ల కులవైషమ్యాలు రెచ్చగొట్టడమే అగ్రవర్ణాల యువకులు సాధించిన ఏకైక ఫలితం.

4. ఈ దాడిలో ప్రధానంగా చేసిన వాదన రిజర్వేషన్ల వల్ల 'ప్రతిభ'కు గుర్తింపు లేకుండా పోతుందన్నది. రిజర్వేషన్ల ద్వారా కాలేజి సీట్లూ, ఉద్యోగాలూ సంపాదించుకునే వాళ్ళకు 'ప్రతిభ' ఉండదనీ, 'ప్రతిభ' గల అగ్రవర్ణాల యువకులకు తత్ఫలితంగా సీట్లూ, ఉద్యోగాలూ లేకుండ పోయి దేశం వాళ్ల సామర్థ్యాన్ని ఉపయోగించుకోలేక నష్టపోతున్నదని వాదించారు. ఈ వాదన ఎక్కడిదాకా పోయిందంటే అగ్రవర్ణాలకు మాత్రమే ప్రతిభ ఉంటుందనీ, ఇతరులు చేతకాని వాళ్లనీ స్పష్టంగా ధ్వనించడం మొదలయింది. రిజర్వేషన్లు 'ఎయిడ్స్' అంత ప్రమాదకరమైన వ్యాధి అనీ, వెనుకబడిన కులాలలో పుట్టి రిజర్వేషన్ మీద వైద్యులయిన వాళ్లు కాలు తీయమంటే కన్ను తీసేస్తారనీ, ఇంజనీర్లు వంతెనలు కడితే కూలిపోతాయనీ పోస్టర్లు, ప్లకార్డులు ప్రదర్శించారు. అగ్రవర్ణాల కుల అహంకారం పట్టంగట్టుకొని ఆరువారాల పాటు నిరాఘాటంగా మన రాష్ట్ర రహదార్లలో ఊరేగింది.

తిట్టుకు తిట్టుతో సమాధానం చెప్పడం తేలికే. 40 ఏండ్లుగా ఈ దేశాన్ని పరిపాలిస్తున్న వాళ్లలో అత్యధికులు అగ్రవర్ణాలకు చెందినవాళ్లే. రాజకీయ నాయకులే కాదు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారస్తులు, భూస్వాములు, వైజ్ఞానికులు, బ్యూరోక్రాట్లు, సాంకేతిక నిపుణులు, యావత్ 'భారత భాగ్య విధాతలు' ఎక్కువగా వాళ్లే. 40 ఏళ్లలో వాళ్లు దేశాన్ని ఎక్కడి దాకా తెచ్చారో చూస్తూనే ఉన్నాం. 1947లో జనాభా ఎంత ఉన్నదో ఇప్పుడు దేశంలో పేదల జనాభా అంత వుంది. అక్కడి దాకా తెచ్చింది వీళ్ల 'ప్రతిభ' దేశాన్ని. ఈ 'ప్రతిభ' ఇంకింత రాణించకపోతే మించిపోయింది ఏమిటో అర్థం కావడం లేదు. తప్పుడు వైద్యం వేసే వైద్యుల జాబితా, కూలిపోయే వంతెనలు కట్టే ఇంజనీర్ల, కాంట్రాక్టర్ల జాబితా తయారు చేస్తే అందులో అత్యధికులు అగ్రవర్ణాల వాళ్లే అయి ఉంటారనటంలో ఎటువంటి సందేహానికి ఆస్కారం లేదు.

అయితే ఈ విషయాన్ని ఇంకొంచెం లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. 'ప్రతిభ'ను గురించి మాట్లాడుతున్న వాళ్లు ఆ మాటకు ఇస్తున్న నిర్వచనం ఏమిటి, దానిని కొలవడానికి ఉపయోగిస్తున్న ప్రమాణం ఏమిటి అనేవి చూడాలి. ప్రతిభ అంటే పని చేయడంలో సామర్థ్యం అనీ, దానిని కొలిచేది పరీక్షలలో వచ్చే మార్కులనీ వీళ్ల అభిప్రాయం. ఈ రెండు అభిప్రాయాలనూ కొంచెం పరిశీలించాలి.

**మొదటిది,** ఒక వ్యక్తికి కేవలం సామర్థ్యం ఉండడం వల్ల సమాజానికి ఉపయోగం ఏమయినా ఉంటుందా? చాలా సామర్థ్యం ఉన్న వైద్యుడు 100 రూపాయల

కన్సల్టేషన్ ఫీజుతో ఫైవ్‌స్టార్ వైద్యం చేయవచ్చును. చాలా మంది అదే చేస్తున్నారు గూడ. చాలా సామర్థ్యం గల ఇంజనీరు అత్యంత ధనికుల కోసం అత్యంత ఆధునికమయిన బంగళాలు డిజైన్ చేయడంలో తన సామర్థ్యాన్నంతా వినియోగించ వచ్చును. అలాగే చాలా సామర్థ్యం గల వైజ్ఞానికుడు ప్రపంచాన్ని నాశనం చేసే అణ్వాయుధాల తయారీలో తన విజ్ఞానాన్నంతా వినియోగించవచ్చును. అంతకంటే హేయంగా వీళ్లు తమ సామర్థ్యాన్నంతా నీతి బాహ్యమయిన పనులలో వినియోగించవచ్చును. స్మగ్లర్లు, లంచగొండ్లు, దొంగ వ్యాపారస్తులు గూడ కావచ్చును. ఇవేవీ కాకపోయినా తమ సామర్థ్యాన్ని ఈ దేశ ప్రజల మేలు కోసం వినియోగించాలన్న పట్టింపు లేకుంటే, డిగ్రీ సంపాదించుకోగానే విదేశాలకు వలస పోవచ్చును. నిజానికి అత్యంత 'ప్రతిభావంతులు' అయిన విద్యార్థులంతా విదేశాలకే పోతున్నారు గూడ. వీళ్ల విద్య మీద ఈ దేశ ప్రజలు కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నారు. ఆ ఖర్చు లేకపోతే వీళ్ల 'ప్రతిభ' అసలు రాణించేది కాదు. కాని వీళ్లు ప్రజలకు అందుకు మారుగా ఏమీ ఇవ్వకపోగా విదేశాలకు పోతున్నారు.

ఒక్క మాటలో చెప్పాలంటే మనిషికి ఉండే విలువలను ప్రస్తావించకుండా ప్రతిభ గురించి, సామర్థ్యాన్ని గురించి మాట్లాడడంలో అర్థం లేదు. ప్రజల క్షేమాన్ని కాంక్షించే విలువలు ఉండేవాళ్ల సామర్థ్యం వల్లనే ప్రజలకు మేలు జరుగుతుంది. అదే సామాజికంగా ఉపయోగకరమయిన సామర్థ్యం. మరి ఇవ్వాళ బంగారు పతకాలు పొందుతున్న విద్యార్థులందరిలో – పోనీ కొందరిలోనయినా – ఈ రకమయిన విలువలు ఉన్నాయా?

**రెండవది,** మార్కులకూ సామర్థ్యానికీ సంబంధం ఎంతమాత్రం ఉంది? ముక్కున పట్టుకుపోయి కాగితం మీద కక్కేసే పరీక్షా విధానం మనది. ఇది సామర్థ్యాన్ని కొలవదు. మహా అయితే జ్ఞాపకశక్తినీ, కంఠస్తం చేయడంలో నైపుణ్యాన్నీ కొలుస్తుంది. దాని వల్ల పని చేయడంలో సామర్థ్యం వస్తుందన్న భరోసా ఎంతమాత్రం లేదు. పని పట్ల శ్రద్ధ గాని, పనిలో నిమగ్నత గాని వుంటుందని అంతకంటే భరోసా లేదు. ఉద్యోగాలలోనయినా వృత్తులలోనయినా సమర్థవంతంగా పనిచేస్తున్న వాళ్ళకు కాలేజిలో వచ్చిన మార్కులు ఏపాటివో ఎవరయినా పోల్చిచూశారా?

మరొక ప్రశ్న గూడ వేయాలి. ప్రభుత్వ ఉద్యోగాలు 'ప్రతిభ' ఉన్నవాళ్ళకే ఇయ్యాలంటున్నారు. ఇది ఒక్క ప్రభుత్వ ఉద్యోగాలకేనా లేక అన్నిటికీ వర్తిస్తుందా?

కొడుకుకు ప్రతిభ ఉంటేనే తండ్రి ఆస్తికి వారసుడవుతున్నాడా? ఒక వ్యక్తి చనిపోగానే అతని ఆస్తిని అతని పిల్లలకు కాక ప్రతిభ గల వాళ్ళకు ఇస్తామంటే ఒప్పుకుంటారా? భూమి గల వాళ్ళందరికీ వ్యవసాయం చేయడంలో ప్రతిభ ఉందా? సేద్యం చేయడంలో ప్రతిభ ఉన్న వాళ్ళకే భూమిని అంతా పంచేస్తామంటే 'రిజర్వేషన్ వ్యతిరేక' ఉద్యమకారులు ఒప్పుకుంటారా? యంత్రాలను నడిపించడం చేతకాని యజమానులకు ఫ్యాక్టరీలు చెందడానికి వీలులేదు, యంత్రాలు నడిపించడంలో సామర్థ్యం గల కార్మికులకే చెందాలంటే ఒప్పుకుంటారా? అక్కడిదాకా పోవద్దు. ఇప్పుడున్న రిజర్వేషన్లు ప్రభుత్వరంగానికి మాత్రమే కదా వర్తిస్తున్నాయి! ప్రభుత్వరంగంలో మాత్రమే ఉద్యోగ ప్రకటనలు ఇవ్వడం, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ నుండి పేర్లు తెచ్చుకోవడం, పరీక్ష లేక ఇంటర్వ్యూ నిర్వహించడం ఇవన్నీ జరుగుతున్నాయి. ఏ ప్రైవేట్ సెక్టార్‌లోనూ అటువంటిదేమీ లేదు. యాజమాన్యం తనకు ఇష్టమైన వాళ్ళకు ఉద్యోగాలు ఇస్తుంది. ఎక్కువగా బంధుమిత్రులకు ఇచ్చుకుంటారు. యాజమాన్యం ఎక్కువగా అగ్రవర్ణాల చేతులలో ఉంటుంది కాబట్టి ఉద్యోగాలు గూడ ఎక్కువగా వారికే పోతాయి. ఇట్లా కాకుండ ప్రైవేట్ సెక్టార్ గూడ ప్రభుత్వరంగ ప్రమాణాలను అనుసరించాలనీ, 44 శాతం కాకుంటే 25 శాతం రిజరేషన్లు అయినా ఇవ్వాలనీ ఒప్పుకుంటారా?

చివరి విషయం, అసలు ప్రతిభ ఎక్కడి నుండి వస్తుంది అనేది. 'ప్రతిభ' పోతుందని గొంతు చించుకొంటున్న వాళ్ళంతా తమకు చాలా ప్రతిభ ఉందనీ, అది తమ 'స్వంతం' అనీ, స్వార్జితం అనీ భావిస్తున్నట్టుంది. 'ప్రతిభ' సామాజికమైనది. ఒక వ్యక్తికి గల ప్రతిభ వెనుక 3000 సంవత్సరాల చారిత్రక విజయాలున్నాయి. ఇవాళ తన చుట్టూ ఉన్న కోట్లాది ప్రజల శ్రమ ఉంది. అలనాటి చారిత్రక విజయాలయినా, ఈ నాటి శ్రమ ఫలమయినా అందరికీ సమంగా దక్కడం లేదు. కొందరికి ఎక్కువగా, కొందరికి చాలా ఎక్కువగా దక్కుతున్నాయి. కొందరికి ఏ మాత్రం దక్కడం లేదు. ఈ సంపదనంతా అనుభవించనిదే ఎవ్వరూ 'ప్రతిభ' సంపాదించుకోలేదు. అగ్రవర్ణాలకు చెందిన వాళ్ళకు చారిత్రక కారణాల వల్ల మూడు సహస్రాబ్దాల నాగరికత ఫలితాలు ఎక్కువగా అందుబాట్లో ఉంటాయి. వెనుకబడ్డ కులాలకు అంతగా వుండవు. చదువుకోవడానికి, సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి ఆస్తిపరులకు ఉండే అవకాశాలు ఆస్తిలేనివారికి ఉండవు. చిన్నప్పుడు మున్సిపల్

స్కూళ్ళలో చదువుకొన్న వాళ్ళకూ, కాన్వెంటు స్కూళ్ళలో చదువుకొన్న వాళ్ళకూ ఒకే 'ప్రతిభ' ఉండదు. ఈ 'ప్రతిభ'ను నిర్ణయించడంలో ఆర్థిక స్థితిగతులు ప్రధానం అయితే కులం గూడ ఒక ముఖ్య అంశంగా పని చేస్తుంది. ప్రతిభను సంపాదించుకోవడంలో వారు ఇవ్వాళ్టి పేద ప్రజలకూ, వాళ్ళ తాత ముత్తాతలకూ తామెంతగా ఋణపడి ఉన్నారో మరిచిపోయి తమ 'ప్రతిభ' అంతా తమ స్వార్జితమే అనుకొని అహంకారంతో విర్రవీగడం సరయింది కాదు. ఈ అహంకారం నవ సంఘర్షణ సమితి ఎంచుకొన్న ఉద్యమ రూపాలలోనే ఉంది. బూట్లు పాలిష్ చేయడం, రోడ్లు ఊడ్వటం, మూటలు మోయటం ఇవన్నీ ఆయా వృత్తుల పట్ల న్యూనతా భావంతో చేసిన పనులే తప్ప గౌరవంతో కాదు.

పుస్తక విజ్ఞానం సాంస్కృతికమయినది. పుస్తకాలలో మనం చదువుకొనేది కేవలం కొన్ని విషయాలు కావు, ఒక సంస్కృతిని, భావ వాతావరణాన్ని, ప్రాపంచిక దృక్పథాన్ని. వాటిలో అంతర్భాగంగా విషయ పరిజ్ఞానాన్ని పొందుతాం. ఈ సంస్కృతి ప్రధానంగా శతాబ్దాలుగా చలామణి అవుతున్న భారతీయ సంస్కృతి, దానికి కొత్తగా అతికించుకున్న ఆంగ్లేయ సంస్కృతి. అందుకే పుస్తక విద్య నేర్చుకోవడంలో భారతీయ సంస్కృతికి అసలు సిసలు కర్తలూ వారసులూ అయిన బ్రాహ్మణ తదితర అగ్రవర్ణాలకు ఉన్న సౌలభ్యం ఇతరులకు ఉండదు. ఎంత సమంగా పోటీ పడమన్నా ఇతరులు పోటీ పడలేరు. ఆర్థికంగా సమానులయినప్పటికీ అగ్రవర్ణాలకూ వెనుకబడ్డ కులాలకూ సాంస్కృతిక విషయాలలో ఈ వ్యత్యాసం ఉంటుంది. ఉదాహరణకు ఒక భారతీయుడిని అమెరికాకు తీసుకుపోయి స్కూల్లో ప్రవేశపెట్టి స్థానికులతో పోటీపడమంటే పడలేడు. తనది కాని సంస్కృతిలో, తనది కాని భావ వాతావరణంలో పుస్తక విజ్ఞానం పొందడంలో అతను తెల్లవాళ్ళతో సరితూగలేడు. ఈ విషయాన్ని అక్కడున్న భారతీయులు – ఎక్కువగా అగ్రవర్ణాలకు చెందిన వాళ్ళు – ఇప్పటికే గుర్తించి తమకు ప్రత్యేక రాయితీలు కావాలని గొడవ చేస్తున్నారు. గుజరాత్‌లో రెండేళ్ళ క్రితం రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమం నడిపి, వెనుకబడ్డ కులాల వాళ్ళు తమతో సమంగా పోటీపడాలి తప్ప రిజర్వేషన్లు అడగడానికి వీలులేదని గొడవచేసి పెద్దఎత్తున దళిత, ముస్లిం గృహాల దహనానికి పాల్పడ్డ అగ్రవర్ణాలలో ముఖ్యంగా పటేల్ కులస్తులు ఉన్నారు. అయితే పెద్దసంఖ్యలో అమెరికాలో స్థిరపడ్డ ఇదే పటేల్ కులస్తులు అక్కడ మాత్రం

తమను ఒక అల్ప సంఖ్యాక జాతిగా పరిగణించి ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని అలజడి చేస్తున్నారు.

5. రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమకారులు మరొక వాదన తీసుకొస్తున్నారు. రిజర్వేషన్లు ఆర్థిక ప్రాతిపదిక మీదనే తప్ప కులం ప్రాతిపదిక మీద ఉండకూడదనీ, ఏ కులానికి చెందిన వాళ్లయినా పేదవాళ్లు ఒకటేననీ అంటున్నారు. విద్య వంటి సాంస్కృతిక విషయానికి సంబంధించి ఇది సరయిన అవగాహన కాదని పైన చూసాము.

ఈ విషయంలో శాస్త్రీయ భావాలు గల వ్యక్తులకు గూడ చాలా గందరగోళం వుంది కాబట్టి విషయాన్ని వేరే కోణం నుంచి గూడ చూడాలి. సమాజంలో ఉన్నవాళ్లు లేనివాళ్ళు అనే విభజన ఉందనీ, అదే ప్రధానమనీ ఇంతమంది పెద్దలు ఇవాళ అకస్మాత్తుగా ఒప్పుకొంటున్నారంటేనే సందేహానికి ఆస్కారం కలుగుతున్నది. మరొక సందర్భంలో వర్గాల గురించి, వర్గ వ్యత్యాసాల గురించి మాట్లాడితే తోకమీద లేచి చిందులు తొక్కే మహానుభావులంతా ఆర్థిక అసమానతే నిజమయిన అసమానత అని సంపాదకీయాలలో, ఉపన్యాసాలలో, కోర్టు సంవాదాలలో పునఃపునరుద్ఘాటిస్తున్నారంటేనే ఎక్కడో ఏదో మతలబు ఉందని అనుమానించక తప్పదు.

ఆస్తిపరులయిన వర్గం యొక్క ఆధిపత్యం వర్గ ఆధిపత్యమే గాని కుల ఆధిపత్యం కాదనేది గూడ వాస్తవమే. అయితే ఇవ్వాళ అగ్రవర్ణాలకు చెందిన ఆస్తిపరులు తమ ఆస్తినీ అంతస్తునూ అధికారాన్నీ నిలబెట్టుకునేందుకు అత్యధికంగా కులాన్ని ఒక సాధనంగా వాడుకుంటున్నారు. ఇవ్వాళ మన సమాజంలో కులం నిర్వహిస్తున్న ప్రముఖమయిన పాత్రలలో ఇది ఒకటి. సామాజిక వ్యవస్థలో కులం ప్రత్యక్షంగా ప్రధానమయింది కాదు గాని, పరోక్షంగా వర్గ ఆధిపత్యాన్ని నిలబెట్టడంలో అది ప్రముఖ పాత్ర నిర్వహిస్తున్నది. భూమి తగాదాలలోను, కూలివాళ్లను అణచి వేయడంలోనూ భూస్వాములు తమ కులానికి చెందిన మందీ మార్బలాన్ని వాడుకోవడం తెలిసిన సంగతే. అంతేకాక, పెట్టుబడిదారీ భూస్వామ్య వర్గాలకు చెందినవాళ్లు పార్లమెంటు నుండి పంచాయితీ ఎన్నికలలో, వ్యవసాయ పరపతి సంఘాలలో, గ్రామీణ బ్యాంకులలో, మార్కెటింగ్ సొసైటీలలో, ఇంకా ఎన్ని రాజకీయార్థిక సంస్థలుంటే అన్నింటిలోనూ తమ ప్రాబల్యాన్ని నిలబెట్టుకోవడానికి కులాన్ని ఒక సాధనంగా వాడుకుంటున్నారు. కాంట్రాక్టర్లకు కాంట్రాక్టులు, పెట్టుబడిదార్లకు ప్రభుత్వ రుణాలు,

వ్యాపారస్తులకు ఎగుమతి దిగుమతి లైసెన్సులు, బ్రోకర్లకు దళారీతనం చేసే అవకాశాలు కులాన్ని వాడుకోకుండ రావడం లేదు. ఆర్థిక రాజకీయ రంగాలలో పాలకవర్గ ఆధిపత్యాన్ని నిర్మించడంలో, నిలబెట్టడంలో కులం ఈ విధంగా ఒక బలమైన పరికరంగా ఉపయోగపడుతోంది. తండ్రులు తమ కులాన్ని వాడుకొని ఈ విధంగా బలపడబట్టే కొడుకులకు అన్ని అవకాశాలూ సమకూరి 'ప్రతిభ' వచ్చింది. ఇవ్వాళ 'ప్రతిభ'ను బ్యానర్లకు ఎక్కించి ఊరేగుతున్న యువకుల 'ప్రతిభ' కులప్రమేయం లేకుండా ఊడిపడలేదు. వాళ్ల తండ్రుల ఆస్తులయినా వ్యాపారాలయినా రాజకీయ ప్రాబల్యమయినా కులాన్ని వాడుకోకుండ పుట్టలేదు. నిలవలేదు.

ఈ విధంగా తాము కులాన్ని నిస్సిగ్గుగా ఒకవైపు వాడుకొంటూ పేదవాళ్ళు మాత్రం ఒక ముష్టి గుమాస్తా ఉద్యోగం సంపాదించడానికి గూడ పనికిరాని పట్టా పొందేందుకు డిగ్రీ కాలేజిలో సీటు సంపాదించేందుకు కులాన్ని ఒక సాధనంగా వాడుకోవడానికి వీలులేదని వాదించే రెండు నాల్కల వైఖరిని మౌనంగా ఆమోదించడం క్షంతవ్యం కాదు. రిజర్వేషన్లు సమాజాన్ని కులం ప్రాతిపదిక మీద చీలుస్తున్నాయనే వాదన ఈ రెండు నాల్కల వైఖరిలో భాగమే. మన దేశం 3,000 సంవత్సరాలుగా కులం ప్రాతిపదిక మీద చీలే వుంది. ఇవ్వాల్టికీ ధనికులు ఈ చీలికను తమ ప్రయోజనాల కోసం యథేచ్ఛగా వాడుకుంటూనే వున్నారు. పేదలు గూడ వాడుకోవాలని చూసేసరికి నీతి వాక్యాలు ముందుకొస్తాయి. అంతిమంగా శ్రామికులంతా ఒకటయి పోరాటం చేసి శ్రామిక రాజ్యాన్ని స్థాపించుకోక తప్పదు. ఆ పోరాటంలో అన్ని కులాలకు చెందిన పేదవాళ్ళూ ఒకటికాక తప్పదు. అన్ని కులాలకు చెందిన ఆస్తిపరులూ ఒకటికాక తప్పదు. "అంతిమంగా" అంటే ఎప్పుడో భవిష్యత్తులో అని కాదు. ఇప్పుడు మన చుట్టూ ఆ పోరాటం సాగుతూనే వుంది. ఆ పోరాటం ముందుకొచ్చేటప్పటికి ఆర్థిక అసమానతలే నిజమయిన అసమానతలనీ, ఆర్థిక ప్రాతిపదిక మీదనే ప్రజల్ని వర్గీకరించాలనీ ఇప్పుడు ఉపన్యసిస్తున్న పెద్దలంతా పోలీసులను, మిలటరీనీ పిలిపించమని కేకలేస్తారు. అందులో అగ్రవర్ణాలకు చెందిన నాయకులే కాక, వెనుకబడ్డ వర్గాల నాయకులుగా చలామణీ అవుతున్నవాళ్ళు గూడ వున్నారు.

ఈ రిజర్వేషన్ల గురించి చర్చించుకునేటప్పుడు మనం ఆ అంతిమ పరిష్కారాన్ని గురించి మాట్లాడడం లేదు. రిజర్వేషన్ల వల్ల వ్యవస్థ మారదు. విప్లవం రాదు. నిరుద్యోగ

సమస్య పరిష్కారం కాదు. ఉన్న ఉద్యోగాలనూ విద్యావకాశాలనూ ఎట్లా పంచుకోవాలి అన్నదే సమస్య. అందులో అసమానతలున్నంత కాలం అసమానులను సమంగా పోటీ పడమనకుండా ప్రత్యేక సౌకర్యాలు కల్పించడం, వాటిని గౌరవించడం అవసరం. దీని వల్ల వెనుకబడ్డ వర్గాలలోని ధనికులు మాత్రమే బాగుపడుతున్నారని వాదిసున్నారు. మన దేశంలో ప్రస్తుతం ఉన్న వ్యవస్థలో దేనివల్లనయినా ధనికులే బాగుపడతారు. పారిశ్రామిక ప్రగతి వల్ల ధనికులే బాగుపడతారు. వైజ్ఞానిక పురోగమనం వల్ల ధనికులే బాగుపడతారు. వ్యవసాయంలో హరిత విప్లవం వల్ల ధనికులే బాగుపడతారు. విశ్వవిద్యాలయాలలో ఉన్నత విద్య వల్ల ధనికులే బాగుపడతారు. అయితే వీటన్నిటినీ ధనికుల ప్రగతిగా గాక దేశ ప్రగతిగా భావించే వాళ్ళకు రిజర్వేషన్ల వల్ల మాత్రం వెనుకబడ్డ కులాలలోని ధనికులే బాగుపడుతున్నారని శ్రీరంగనీతులు చెప్పే అర్హత లేదు. అంతేకాక, రిజర్వేషన్ల వల్ల కేవలం ధనికులు మాత్రమే బాగుపడుతున్నారనేది వాస్తవం గూడ కాదు. తండ్రి పాలేరుగా పనిచేస్తూ, లేక తాటిచెట్టెక్కి కల్లు తీస్తూ కొడుకును రిజర్వేషన్ల పుణ్యాన కాలేజీలో చదివించుకొంటున్న కుటుంబాలు అసంఖ్యాకం కాకున్నా కొన్ని అయితే వున్నాయి.

6. ఇక జరగబోయేది ఏమిటన్నది చివరి సమస్య. హైకోర్టు జీ.వోను కొట్టేసినందుకు బహుశా అందరి కంటే రాష్ట్ర ప్రభుత్వమే ఎక్కువగా సంతోషిస్తుందేమో. ఎన్టీఆర్‌కు ఒక వైపు వెనుకబడ్డ వర్గాల సానుభూతి దక్కింది. వేరొక వైపు అగ్రవర్ణాలు హైకోర్టు తీర్పుతో సంతృప్తి చెందారు. జీ.వోను నిజంగా అమలు చేయాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదన్న విషయం గత రెండు నెలల కాలంలో పలు విధాల బయట పడింది. జీ.వోను వ్యతిరేకిస్తూ నవ సంఘర్షణ సమితి నడిపిన ఉద్యమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అసాధారణమైన ఔదార్యంతో సహించింది. ఎన్టీఆర్ అధికారానికి వచ్చిన తరువాత రాజ్యాంగంలోని అధికరణం 19(1) లోని స్వేచ్ఛలను నిరాటంకంగా అనుభవించిన మొట్టమొదటి ఉద్యమం రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమం. వేరెవ్వరు ఉద్యమాలు నడిపినా పోలీసులను పెట్టి తలలూ, వీపులూ పగులగొట్టే ప్రభుత్వం ఈ ఆందోళనను మాత్రం అత్యంత సహనంతో కొనసాగనిచ్చింది. అదే జీ.వోను సమర్థిస్తూ ప్రదర్శనను జరిపిన వెనుకబడిన వర్గాలను మాత్రం లాఠీ చార్జీలకు గురిచేసి తీవ్రంగా కొట్టించింది. హైకోర్టు జీ.వోను రాజ్యాంగ వ్యతిరేకమని కొట్టేస్తూ తీర్పు ఇచ్చీ ఇవ్వగానే

రాష్ట్ర ప్రభుత్వం తనదే గెలుపయినట్లు – నవ సంఘర్షణ సమితి ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించి, సుప్రీంకోర్టుకు అప్పీలుకు పోబోమని హామీ యిచ్చి చేతులు దులుపేసుకుంది. మామూలుగా ఎవరైనా ఎంత చిన్న విషయం మీదనయినా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోర్టుకు పోతే సుప్రీంకోర్టుకు లాగి గాని ప్రభుత్వం తన ఓటమిని అంగీకరించదు. ఈ ఒక్క విషయంలో మాత్రం తన జీ.వోను హైకోర్టు కొట్టేసినా గూడ ప్రభుత్వం చాలా వినయంగా ఆ తీర్పును శిరసావహిస్తానని ఒప్పుకొంది. రాష్ట్ర ప్రభుత్వానికి రిజర్వేషన్ల పెంపుదల విషయంలో నిజాయితీ లేదని అర్థం చేసుకోకపోతే ఈ తలక్రిందులు వ్యవహారం అర్థం కాదు.

ప్రభుత్వ వైఖరి ఇట్లా వుండగా మరోవైపు వెనుకబడిన వర్గాల ప్రజలు చాలా అసంఘటితంగా ఉన్నారు. రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమకారుల దాడిని వారు ఎదుర్కోలేక పోయారు. దీనికి వాళ్ల వెనుకబాటుతనం ఒక కారణమైతే నాలుగైదు కులాలు గాక 101 కులాలుగా చీలి ఉండటం ఇంకొక కారణం. కాగా మరొక ముఖ్యమయిన కారణం గూడ వుంది. వెనుకబడిన కులాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో రిజర్వేషన్లకు మద్దతు ఇస్తూ ఉద్యమంలో పాల్గొనాలంటే ఆ ఉద్యమం రిజర్వేషన్ల పరిరక్షణకు పరిమితం అయితే చాలదు. ఎందుకంటే రిజర్వేషన్లు ఆ కులాలలో కొద్దిమంది సమస్యగా మాత్రమే చూడబడుతున్నాయి. వెనుకబడ్డ కులాలలో చాలామంది ఉన్నత విద్యను గాని, ప్రభుత్వ ఉద్యోగాలను గాని ఆశించే స్థితిలో గూడ లేరు. వాళ్ళ సమస్యలు వేరే ఉన్నాయి. అన్ని రంగాలలోను వాళ్ల సాంప్రదాయక వృత్తులకూ జీవన విధానానికీ మన ఆర్థిక వ్యవస్థ తావు లేకుండా చేస్తున్నది. పద్మశాలీలు, కమ్మరులు, వడ్రంగులూ అందరూ తమ వృత్తులు వదలి పరిశ్రమలలో నౌకరీల కోసం దూర ప్రాంతాలకు వలస పోతున్నారు. పారిశ్రామిక రంగంలో ఆధునీకరణ పేరిట ఉద్యోగావకాశాలు పడిపోయే కొద్దీ ఇది గూడ సాధ్యం కావడం లేదు. వలసపోయిన వాళ్లు చాలామంది ఈ మధ్యకాలంలో గ్రామాలకు తిరిగి వస్తున్నారు. సారాయి వంటి మాదక ద్రవ్యాల అమ్మకాన్ని కాంట్రాక్టులకు ఇవ్వడం వల్ల కాంట్రాక్టర్ల గుత్తాధిపత్యం పెరిగి తరతరాలుగా సారాయి కాచి అమ్ముకుంటున్న పేదప్రజలు జీవనాధారం కోల్పోయారు. సారాయి ధర గూడ విపరీతంగా పెరిగింది. అడవులలో టేకు తోటలు, గ్రామ పోరంబోకులలో సోషల్ ఫారెస్ట్రీ పేరిట యూకలిప్టస్ తోటలు పెంచడంతో గొల్లవాళ్లకు గొర్రెలను, మేకలను మేపుకొనడం పెద్ద సమస్య అయిపోయింది.

చెరువులలో చేపలు పట్టే హక్కును సహితం కాంట్రాకర్లకు వేలం పాటలో యివ్వడంతో మత్స్యకారుల జీవనం దెబ్బ తింటున్నది. వాళ్లు ఈ మధ్య హైదరాబాద్‌లో ఊరేగింపులు తీసి ఎన్.టి.ఆర్. లాఠీ దెబ్బలు గూడ రుచి చూసారు. సరిగ్గా అదే సమయంలో నవ సంఘర్షణ సమితి వాళ్ళు వెనుకబడ్డ కులాలకు ప్రతిభ లేదని దూషిస్తూ ఎటువంటి నిర్బంధం లేకుండా ఊరేగింపులు తీస్తున్నారు. చాకలి, మంగలి కులాల వారేమో సాంప్రదాయక పద్ధతులలో వృత్తి కొనసాగిస్తే గిరాకీ చాలక, ఆధునిక లాండ్రీలు, హెయిర్ కటింగ్ సెలూన్లు పెట్టుకోవడానికి పెట్టుబడి దొరకక ఇబ్బందులకు గురి అవుతున్నారు. వడ్డెర, ఎరుకల, దొమ్మరి మొదలయిన కులాల వాళ్ళు నీతిగా బతికినా వాళ్ళను పోలీసులు వృత్తి దొంగలుగా భావించి తరచూ అరెస్టు చేసి చిత్రహింసలకు గురిచేస్తుంటారు. ఇక వ్యవసాయరంగంలో వుండే వెనుకబడ్డ వర్గాల సంగతి చెప్పనవసరం లేదు. కనీస వేతన చట్టాలు అమలు చేయక పోవడం, భూసంస్కరణ చట్టాలు అమలు చేయక పోవడం, కరువు పనులు సక్రమంగా అమలు చేయక పోవడం, నీటిపారుదల సౌకర్యాలు పెరగక పోవడం, పంట నష్టమయినప్పుడు రుణాలు మాఫీ చెయ్యకపోవడం ఇవన్నీ వాళ్ళు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలు.

ఇన్ని రకాల సమస్యలున్న ప్రజానీకాన్ని రిజర్వేషన్ల పరిరక్షణ కోసం ముందుకు రమ్మంటే రాకపోవడంలో వింత లేదు. పేద ప్రజలకు ఉండే అన్ని రకాల సమస్యలలో భాగంగా రిజర్వేషన్లను చూసినప్పుడే పేద ప్రజలు గూడ రిజర్వేషన్ల సమస్యను తమ సమస్యలలో భాగంగా చూస్తారు. రిజర్వేషన్ల పరిరక్షణ అనేది ప్రజాస్వామిక ఉద్యమంలో భాగం కావాలి. అది విడిగా ఉన్నంత కాలం విఫలం కాక తప్పదు. అది మొత్తం ప్రజాస్వామిక ఉద్యమంలో భాగం అయిన నాడు అగ్రవర్ణాలలోని పేదవాళ్ళు సహితం రిజర్వేషన్లు న్యాయమయినవని ఒప్పుకొంటారు. అయితే ఈ దృక్పథం కుల సంఘాల నాయకులకు ఎంతవరకు ఆమోదనీయం అవుతుందో అనుమానమే. తమ కులాల వెనుకబాటుతనం పేరు చెప్పుకొని తమ స్వార్థం చూసుకోవడం వాళ్ళకు బాగా అలవాటయింది. కనీసం యువతరమయినా సరి అయిన అవగాహనతో ముందుకొస్తే బలమయిన ఉద్యమాన్ని నడపగలుగుతాము.

*'రిజర్వేషన్ల సంరక్షణ వేదిక' పేరుతో అచ్చయింది*

*అక్టోబరు 1986*

# వ్యతిరేకించే వారిదే దురుద్దేశం

**కేం**ద్రప్రభుత్వం మండల్ కమిషన్ నివేదికననుసరించి ఉద్యోగాలలో వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్ ప్రకటించగానే దేశవ్యాప్తంగా రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళన ప్రారంభమైంది. విద్యార్థులే కాక రాజకీయ నాయకులు, న్యాయవాదులు, జర్నలిస్టులు, సైంటిస్టులు కూడ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్నారు. రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనకారులు కులం ఆధారంగా మండల్ కమిషన్ నివేదిక రిజర్వేషన్లను సూచించిందని ఆరోపణలు చేస్తున్నారు. పత్రికలు ఈ ఆరోపణలకు విస్తృత ప్రచారాన్ని కల్పిస్తున్నాయి.

నివేదికను జాగ్రత్తగా పరిశీలిస్తే నివేదిక అశాస్త్రీయమైనదని కొందరు చేస్తున్న ప్రచారం దురుద్దేశంతో కూడుకున్నదని స్పష్టమవుతుంది. మండల్ కమిషన్ ఈ నివేదికను రూపొందించడం కోసం దేశవ్యాప్తంగా పర్యటించి వివిధ ప్రాంతాల్లోని రాజకీయ నాయకులను, ప్రజాకార్యకర్తలను కలిసి సంప్రదింపులు జరిపింది. సామాజిక శాస్త్రవేత్తల అభిప్రాయాలను సేకరించింది. కోర్టుల తీర్పులను నిశితంగా పరిశీలించింది. దేశంలోని ప్రతి జిల్లా నుంచి రెండు గ్రామాలను, ఒక పట్టణాన్ని ఎంపిక చేసుకుని సర్వే జరిపింది. ఉద్యోగాలలో వివిధ కులాల ప్రాతినిధ్యాన్ని పరిశీలించింది. ఇంత జరిగిన తర్వాతే నివేదిక రూపకల్పన జరిగింది. కులాన్నే రిజర్వేషన్లకు ప్రాతిపదికగా ఎంచుకోటానికి కారణాలను నివేదిక చాలా స్పష్టంగా వివరించింది.

మన సమాజం కులం ఆధారంగా విభజింపబడింది. ఈ విభజనను ధర్మశాస్త్రాలన్నీ సమర్థించాయి. అంతేకాదు, ధర్మశాస్త్రాలు ప్రతి కులానికి ఒక స్థాయిని, ఆ స్థాయిని బట్టి విధులను నిర్వచించాయి. సామాజిక స్థాయి, విధులతో పాటు

జీవితంలోని దాదాపు అన్ని అంశాలను కులమే నిర్దేశిస్తుంది. తిండి, బట్ట, నివాసం వంటి అంశాలన్నీ కులాన్ని బట్టి మారుతుంటాయి.

కుల వ్యవస్థ ఉచ్ఛ నీచ వర్ణాలుగా ప్రజలను విడగొట్టింది. ఇందులో ఉన్నత స్థాయి పొందిన వర్ణాలు తమ ఆధిపత్యాన్ని కాపాడుకోవటం కోసం ధర్మశాస్త్రాల మద్దతుతో, రాజ్య యంత్రాంగం సహాయంతో కులవ్యవస్థను పకడ్బందీగా కాపాడాయి.

కాలక్రమేణా కులవ్యవస్థలో మార్పుచేర్పులు వచ్చాయి. బ్రిటిష్‌వారు ప్రవేశపెట్టిన సమన్యాయపాలన, పారిశ్రామీకరణ, పట్టణాల అభివృద్ధి, సార్వజనీన వయోజన ఓటు హక్కు వంటి మార్పులు కులవ్యవస్థలో మార్పులను తెచ్చాయి. అయితే ఈ మార్పుల వలన కులవ్యవస్థ విచ్ఛిన్నం కాలేదు. కులానికి చెందిన కొన్ని సాంప్రదాయకమైన లక్షణాలు కొంత సడలినా కులం ఆధారంగా కొందరు ఆధిపత్యం చలాయించడం కొనసాగుతూనే ఉన్నది. పైగా కులం రాజకీయ నాయకత్వాన్ని పొందటానికి కావలసిన ప్రజాసమీకరణకు ఒక సాధనంగా మారింది.

ఇటువంటి సమాజంలో అందరినీ సమానంగా పరిగణించడం వలన వెనుకబడిన కులాలకు నష్టం వాటిల్లుతుంది. అసమానులను సమానులుగా చూడటమంటే అసమానతను కాపాడటమే అవుతుంది. (To treat unequals as equals is to perpetuate inequality.) అందువలన వెనుకబడిన కులాలకు ప్రత్యేక రాయితీలు కల్పించాలి.

అయితే వెనుకబడిన కులాలు అంటే ఏవి? ఏయే కులాలైతే సామాజికంగా విద్యాపరంగా వెనుకబాటుతనాన్ని అనుభవిస్తున్నాయో అవే వెనుకబడిన కులాలు. సామాజికంగా వెనుకబడినా లేదా కేవలం విద్యాపరంగా వెనుకబడినా ఏ కులమూ వెనుకబడిన కులం కాలేదు కనుక రెండు రంగాలలోనూ వెనుకబాటుతనం గల కులమే వెనుకబడిన కులం.

సామాజిక, విద్యారంగాలలో వెనుకబాటుతనాన్ని మదింపు వేయటానికి ఈ కింది కారణాలను కమిషన్ పరిగణనలోకి తీసుకొన్నది.

**సామాజికపరమైన కారణాలు**

1. ఇతరులచే వెనుకబడిన కులంగా పరిగణించబడే కులాలు.
2. జీవనం కోసం శారీరక శ్రమపై ఆధారపడే కులాలు.
3. 17 సంవత్సరాల వయస్సులోపు పెళ్ళిళ్లు జరిగే స్త్రీల శాతం రాష్ట్ర సగటుతో పోల్చి చూసినపుడు 25 శాతం కంటే ఎక్కువ, పురుషుల శాతం 10 కంటే ఎక్కువగా వున్న కులాలు. పట్టణాలలోనైతే రాష్ట్ర సగటుతో పోల్చి చూస్తే స్త్రీల విషయంలో 10 శాతం, పురుషులలో 5 శాతం ఎక్కువగా గల కులాలు.
4. పనిలో స్త్రీల భాగస్వామ్యం రాష్ట్ర సగటుకన్నా 25 శాతం ఎక్కువ గల కులాలు.

**విద్యావిషయాలు**

1. 5–15 సంవత్సరాల మధ్య వయసుగల బాల బాలికల్లో అసలు బడికే వెళ్ళని వారి శాతం రాష్ట్ర సగటుకన్నా 25 శాతం ఎక్కువ గల కులాలు.
2. పైన పేర్కొన్న వయస్సు గ్రూపులో చదువు మధ్యలో మానేసేవారు (dropouts) రాష్ట్ర సగటుకన్నా 25శాతం ఎక్కువగా నున్న కులాలు.
3. మెట్రిక్యులేట్ల సంఖ్య రాష్ట్ర సగటుకన్నా 25శాతం తక్కువ గల కులాలు.

**ఆర్థిక కారణాలు**

1. కుటుంబ ఆస్తుల సగటు విలువ రాష్ట్ర సగటుకన్నా 25 శాతం తక్కువ గల కులాలు.
2. కచ్చా ఇళ్ళలో నివసించే వారి సంఖ్య రాష్ట్ర సగటుకన్నా 25 శాతం ఎక్కువ గల కులాలు.
3. 50 శాతం పైగా కుటుంబాలు మంచినీటి సౌకర్యం కోసం కనీసం $^1/_2$ కి.మీ. దూరం వెళ్ళవలసి వచ్చే కులాలు.
4. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వినిమయ ఋణాలు తీసుకున్న వారి సంఖ్య రాష్ట్ర సగటుకన్నా 25 శాతం ఎక్కువ గల కులాలు.

ఈ విషయాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి వెనుకబడిన కులాలను గుర్తించడం జరిగింది. కొన్ని కులాలు (చాలా చిన్న గ్రూపులుగా వుండేవి) సర్వే చేసిన గ్రామాల్లో ఉండకపోవచ్చు. అటువంటి కులాలను రాష్ట్ర జాబితాను పరిశీలించి, ఇంతవరకు జరిపిన సర్వేల ఆధారంగా రాజకీయ నాయకులు, ప్రజాకార్యకర్తల అభిప్రాయాలను దృష్టిలో ఉంచుకుని వెనుకబడిన కులాల జాబితాలో చేర్చారు.

ఈ విధంగా గుర్తించబడిన కులాల ప్రాతినిధ్యం కేంద్ర సర్వీసుల్లో చాలా తక్కువగా ఉన్నది.

ఇన్ని అంశాలను పరిశీలించిన మీదట, వివిధ రాష్ట్రాల్లో రిజర్వేషన్ల అమలు తీరుతెన్నులు, రిజర్వేషన్లను అమలు పరిచినప్పుడు అగ్రవర్ణాల నుంచి వచ్చిన వ్యతిరేకతను దృష్టిలో వుంచుకొని కమిషన్ రికమెండేషన్లను రూపొందించింది. కమిషన్ నివేదికలో ఇచ్చిన సూచనలు ఇలా వున్నాయి.

1. ఉద్యోగాలలో 27 శాతం రిజర్వేషన్లు
2. విద్యాలయాల్లో 27 శాతం రిజర్వేషన్లు
3. వెనుకబడిన తరగతుల వారి కోసం ప్రత్యేక స్కూళ్ళు, హాస్టళ్ళు
4. ప్రత్యేక వృత్తి శిక్షణ
5. వృత్తుల పరిరక్షణకు సాంకేతిక, ఆర్థిక సహాయం
6. అందుకై ప్రత్యేక ఆర్థిక సంస్థల ఏర్పాటు
7. భూసంస్కరణల చట్టాల అమలు

రిజర్వేషన్లకు వ్యతిరేకంగా సహజంగా వచ్చే ప్రశ్నలకు కూడ కమిషన్ సమాధానాలు ఇచ్చింది. రిజర్వేషన్ల వలన ధనికులకే లాభం జరుగుతుందని, రిజర్వేషన్ల వలన వెనుకబడిన కులాలకు చెందిన పేదలకు ఒరిగేదేమీ లేదని, అగ్రవర్ణాల పిల్లలు దాని వలన బాధపడతారని రిజర్వేషన్ వ్యతిరేకులు సాధారణంగా అంటూ వుంటారు. ఈ వాదనలకు మండల్ నివేదికలో జవాబులు వున్నాయి.

బ్రిటిష్ వాళ్లు కూడ ఈ దేశాన్ని వదిలి పెట్టాలంటే బాధపడ్డారు. అలాగని భారతీయులు స్వాతంత్ర్యం కోసం డిమాండ్ చేయకుండా ఊరుకోలేదు. తెల్లవాళ్ళు బాధపడతారని శ్వేతజాతి దురహంకారానికి వ్యతిరేకంగా పోరాటం ఆపలేదు. అదే విధంగా కొంతమంది బాధపడతారని కులవ్యవస్థ నిర్మూలనకు జరిగే ప్రయత్నాలు ఆగవు.

రిజర్వేషన్ల వలన మొత్తం వెనుకబడిన కులాల వారంతా అభివృద్ధి చెందుతారని అనుకుంటే భ్రమే అవుతుంది. ఎవ్వరైనా రిజర్వేషన్ వలన కలెక్టరో, పోలీసు సూపరింటెండెంటో అయితే దాని వలన లాభపడేది కులానికి చెందిన ఒక వ్యక్తే కావచ్చు గాని ఆ కులానికి చెందినవారు తమ సామాజిక స్థాయి పెరిగిందన్న సంతృప్తిని పొందుతారు.

ప్రజాస్వామిక వ్యవస్థలో ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పాలనలో భాగస్వామ్యం కావాలని డిమాండ్ చేసే హక్కు ఉంటుంది. దానిని కొంతైనా అమలు పరచడం అవసరం. 52 శాతం పైన జనాభాగల వర్గానికి ప్రాతినిధ్యం కల్పించని పరిస్థితిని మార్చడంలో రిజర్వేషన్లు ఒక సాధనం.

అయితే ఎక్కువ భాగం రాయితీలు వెనుకబడిన కులాలవారిలోని పై స్థాయి వారికే సంక్రమించే అవకాశం ఉన్నదనే వాదం ఉంది. ఏ కార్యక్రమం అమలులోనైనా ఇది తప్పదు. ఏ సంస్కరణ కార్యక్రమమైనా క్రమంగానే దిగువనున్న వారిని చేరుతుంది.

నేటి విద్యావ్యవస్థ వెనుకబడిన కులాల అవసరాలకు తగినట్టుగా లేదని కమిషన్ గుర్తించింది. బ్రిటిష్‌వారు ప్రవేశపెట్టిన విద్యావ్యవస్థ ఎన్నో విమర్శలకు గురైనా ఇంతవరకు మార్పులకు నోచుకోలేదు. అయితే విద్యావ్యవస్థ సంస్కరణ కమిషన్ పరిధిలోకి రాదు కనుక కేవలం ఉన్న వ్యవస్థలో వెనుకబడిన కులాలకు అవకాశాలను పెంచటానికి సూచనలు మాత్రమే చేశారు. వెనుకబడిన కులాల విద్యార్థులు చదువుకోవటానికి వివిధ సంక్షేమ కార్యక్రమాలను (ప్రత్యేక రెసిడెన్షియల్ స్కూళ్ళు, స్కాలర్ షిప్పులు, హాస్టళ్ళు తదితరాలు) సమన్వయపరచి సమగ్రంగా అమలు జరపాలని కమిషన్ సూచించింది.

ఇప్పుడున్న వ్యవస్థలో అగ్రవర్ణాల పిల్లలతో వెనుకబడిన కులాల పిల్లలు సమానంగా పోటీ పడలేక పోవటానికి కారణం కేవలం వారి కుటుంబ వాతావరణంలో

తేడాలేనని కమిషన్ గుర్తించింది. అందుకే పోటీపడడానికి అనువైన వాతావరణం కల్పించడానికి వారి తల్లిదండ్రులకు కూడ వయోజన విద్యావకాశాలు కల్పించాలి.

కేవలం రిజర్వేషన్ల వలన, ఆర్థిక, సాంకేతిక సహాయాల వలన వెనుకబాటుతనం పోదని కమిషన్ గుర్తించింది. జనాభాలో 1/4 వంతు మాత్రమే గల అగ్రవర్ణాల వారు ఉత్పత్తి సాధనాలపై గుత్తాధిపత్యం పొంది దాని ఆధారంగా ఆధిపత్యం చెలాయించ గలుగుతున్నారు. ఆ ఆధిపత్యం వారికి రాజకీయాధికారాన్నిచ్చింది. దానికి తోడుగా ప్రభుత్వ యంత్రాంగంలో దాదాపు అందరూ అగ్రవర్ణాలవారే. వారితోనున్న కుల సంబంధాల ఆధారంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని తమకు అనుగుణంగా ఉపయోగించు కోగలుగుతున్నారు. అందుకే ఇప్పుడున్న ఉత్పత్తి సంబంధాలను విప్లవాత్మకంగా మార్చకుండా వెనుకబడిన కులాల సంపూర్ణ అభివృద్ధి సాధ్యం కాదు. వెనువెంటనే పారిశ్రామిక రంగంలో మార్పులు సాధ్యం కాకపోయినా, వ్యవసాయ రంగంలో మార్పులు తేవడానికి అవసరమైన చట్టాలున్నాయి. వాటి అమలులో ఇప్పటికే ఆలస్యం జరిగింది. అందుకని వెంటనే భూ పరిమితి చట్టాల సక్రమ అమలుకు కృషిచేయాలని కమిషన్ సూచించింది.

ఈ విధంగా కమిషన్ వెనుకబడిన కులాల గుర్తింపుకై తీవ్ర కృషి చేసింది. ఇప్పుడు రిజర్వేషన్ వ్యతిరేకులు తమ డిమాండ్లను సాధించడం కోసం రిజర్వేషన్ల వలన తమ ఆధిపత్యం ఎక్కడ పోతుందోననే బాధతో నివేదికపై బురద చల్లటానికి ప్రయత్నం చేస్తున్నారు. నివేదిక అశాస్త్రీయమైందని రుజువు చేసి, ఆ నివేదిక ఆధారంగా వచ్చిన రిజర్వేషన్లను రూపుమాపాలని చూస్తున్నారు. అందుకే నివేదికను సక్రమంగా పరిశీలించి సమర్థించవలసిన అవసరం చాలా ఉంది.

స్వేఛ్ఛ మాసపత్రిక
*ఆగస్టు 1990*

❖ ఇదే అంశంపై ఇంగ్లీషులో 'This Anti-Mandal Mania' అనే వ్యాసం, 'మండల్ కమిషన్–జడలు విప్పిన కులతత్వం' శీర్షికతో ఒక తెలుగు ఉపన్యాసం (ఆడియో) balagopal.org లో ఉన్నాయి.

# చుండూరు న్యాయ విచారణ: పూర్తిగా దళిత వ్యతిరేకం

ఎట్టకేలకు చుండూరు న్యాయవిచారణ నివేదిక బయటికి వచ్చింది. జస్టిస్ గంగాధరరావుగారు ప్రభుత్వం పరిశీలించమన్న అన్ని అంశాలను పరిశీలించి 98 పేజీల నివేదిక రాసారు. దళితులు ఈ న్యాయవిచారణ కమిషన్‌ను బహిష్కరించడం తనకు ఒక ప్రతిబంధకం అయిందనీ, దళితేతరులు (అగ్రకులాలకు ఇది వారు పెట్టిన పేరు) పూర్తి నిజం చెప్పడానికి ఇష్టపడలేదనీ, కాబట్టి తాను ప్రధానంగా పోలీసులు, రెవెన్యూ అధికారుల సాక్ష్యాలపైన ఆధారపడవలసి వచ్చిందనీ జస్టిస్ గంగాధరరావు గారు నివేదిక మొదట్లోనే ఒప్పుకున్నారు. తన నిర్ధారణలకు ఆ అధికారుల సాక్ష్యాలే ఆధారమని అన్నారు.

ఇది పూర్తిగా నిజం కాదని నివేదిక చదివిన వారికెవరికయినా అనిపించక తప్పదు. జస్టిస్ గంగాధరరావుగారికి స్వంత అభిప్రాయాలు చాలా ఉన్నాయి. వేరే సాక్ష్యాలు లేనిచోట ఈ అభిప్రాయాలతో ఆ ఖాళీలను పూరించారు.

చుండూరు మారణకాండ ఎందుకు జరిగింది అనేది ప్రభుత్వం ఆయనను పరిశీలించమన్న మొదటి ప్రశ్న. దీనికి ఆయన స్పష్టమయిన జవాబు ఇచ్చారు. దళిత (ప్రధానంగా మాల) కులానికి చెందిన యువకులు ఇతర కులాల మహిళలను వేధించటం వంటి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడడం వల్ల అప్పటికే మాలలకూ ఇతర కులాలకూ మధ్యనున్న మనస్పర్థలు పెరిగి ఇతర కులాలు మాలలపైన దాడి చేసే పరిస్థితి ఏర్పడిందనేది ఈ ప్రశ్నకు వారిచ్చే జవాబు. 'సర్వజనాభ్యుదయ పోరాట

సమితి' పేరిట అగ్రకులాలు ఆనాడు ప్రచారం చేసిన అవగాహన ఇదే. ఎటొచ్చీ గంగాధరరావుగారు అక్కడున్నది దళితులు – అగ్రకులాలు అనే విషయాన్ని కూడ కప్పిపెట్టి, మాలలు – ఇతర కులాలు అంటూ చర్చించారు. అందుకే నివేదికలో ఎక్కడా ఆయన అగ్రకులాలు అన్న మాటే వాడలేదు. దళితేతరులు అన్న మాటే ఉపయోగించారు. అయితే తన అభిప్రాయం వేరు, చుండూరు అగ్రకులాల అభిప్రాయం వేరు అని చెప్పడం కోసం 'వాళ్ళ వాంగ్మూలాలలో వాళ్ళు గొడవంతా మాల యువకులు ఇతర కులాల స్త్రీలని వేధించడం వల్లనే వచ్చిందనీ, లేకపోతే అన్ని కులాలూ సఖ్యంగా బ్రతికేవారనీ అన్నారు. అది చాలావరకు నిజమేగానీ అదే ఏకైక కారణం అని నేను అనుకోవడం లేదు' అంటూ భేదం చూపించుకున్నారు. 'ఏకైక కారణానికి' 'చాలావరకు నిజమే' అనేది భేదమే అనుకుంటే జస్టిస్ గంగాధరరావుగారికీ, సర్వజనాభ్యుదయ పోరాట సమితికీ భేదం ఉందని ఒప్పుకోక తప్పదు.

చుండూరు హత్యాకాండకు పాల్పడింది ఎవరు అనేది ప్రభుత్వం ఆయనను పరిశీలించమన్న రెండవ ప్రశ్న. దీనికి మట్టుకు ఆయన జవాబు చెప్పలేదు. ఎందుకంటే దళితులు ఆయన ముందు హాజరు కాలేదు, హంతకుల వివరాలు చెప్పలేదు కాబట్టి. పోలీసులు దగ్గర దళితుల నుండి రికార్డు చేసుకున్న సెక్షన్ 161 స్టేట్‌మెంట్లు ఉన్నాయి కదా అంటారేమోనని చెప్పి, ఆ స్టేట్‌మెంట్లు ప్రామాణికం కావనీ, వాటిలోని నిజానిజాలు తేల్చడానికి వారిని క్రాస్ ఎగ్జామిన్ చేసే అవకాశం తనకు దొరకలేదనీ ఆయన అంటారు. అందువల్ల పోలీసులకు దళితులు ఇచ్చిన వాంగ్మూలాలలో హంతకుల పేర్లు ఉన్నప్పటికీ ఈ విషయంలో తానొక నిర్ధారణకు రాలేకపోతున్నానన్నారు. ఇది న్యాయమయిన వైఖరే. బాధితులు సహకరించకపోతే హంతకులు ఎవరనేది నిర్ణయించి ప్రకటించడం సాహసమే అవుతుంది. కానీ ఈ హేతుబద్ధమయిన వైఖరి మొదటి విషయంలో ఎందుకు సాధ్యం కాలేదు? బాధితుల ఘర్షణకు గల కారణం మట్టుకు గుర్తించడం ఏ విధంగా సాధ్యం అయింది? రెండవ విషయంలో బాధితులు పోలీసులకు ఇచ్చిన స్టేట్‌మెంట్లయినా ఉన్నాయి. అవి ప్రామాణికం కాకపోవడం వేరే విషయం. మొదటి విషయంలో ఆ మాత్రం కూడ బాధితుల అభిప్రాయం తెలుసుకునే అవకాశం లేదు కదా! అయినా ఆ విషయంలో ఎటువంటి మొహమాటం లేకుండా జస్టిస్ గంగాధరరావుగారు ఏ విధంగా నిర్ధారణకు రాగలిగారు?

నిజానికి ఏదయినా ఒక విషయం మీద న్యాయవిచారణ జరపడానికి ఉపక్రమించినప్పుడు ఇరుపక్షాలు కాకపోయినా కనీసం బాధితులు సహకరించాలి. ఏ కారణంగానయితేనేమి, బాధితులు సహకరించదలచుకోకపోతే నిజాయితీ గల న్యాయ విచారణాధికారి తనకిచ్చిన బాధ్యత నిర్వర్తించడం సాధ్యం కాదని ప్రభుత్వానికి చెప్పి తప్పుకోవాలి. కానీ న్యాయవిచారణలను న్యాయనిర్ణయానికి సంబంధించిన విధిగా కాక కేవలం జీతం ఇచ్చే ఉద్యోగంగా చూడడం ఇవాళ్టి నీతి కాబట్టి ఈ రకమయిన మొహమాటానికి తావులేకుండా పోయింది.

పోలీసు అధికారుల వైఫల్యం ఏమయినా ఉందా అనేది మూడవ ప్రశ్న. పట్టపగలు భీకరంగా హత్యాకాండ జరిగితే దాని గురించి మరుసటి రోజుదాకా ఆ ఊరిలోనే ఉన్న పోలీసు అధికారులకు తెలియలేదు. ఇందులో కేవలం వైఫల్యం కాదు, లాలూచీ కూడ ఉందని దళితులు ఆనాడు ఆరోపించారు. లాలూచీ లేదనుకుంటే చుండూరు అగ్రకులస్తులు పోలీసులను చాలా తెలివిగా బుట్టలో వేసుకున్నారనుకోవాలి. ఆగస్టు 6 పొద్దున్న సి.ఐ. సాయిబాబా, తెనాలి తాలూకా వేమూరు, చుండూరు, అమృతలూరు ఎస్.ఐలు కలిసి అంతకుముందు జరిగిన ఘర్షణలలో నిందితులను అరెస్టు చేయడానికి బయలుదేరారు. మొదట అగ్రకులస్తుల ఇళ్లు వెతికారు. అక్కడెవ్వరూ దొరకలేదు. తరువాత దళితుల ఇళ్ళమీదకి పోయారు. దళితులు పోలీసులను చూసి పారిపోయారు. తరువాత పోలీసులంతా తమ స్టేషన్‌కు తిరిగి వచ్చారు. అంతలో కొందరు రెడ్లు పోలీస్ స్టేషన్‌కు వచ్చి దళితులు నలుగురు రెడ్లపైన దాడి చేసారని ఫిర్యాదు చేసారు. పోలీసులు వాళ్ళ స్టేట్‌మెంట్ రాసుకుని దాడిచేసిన వారి కోసం వెతకడానికి పోయారు. అదే సమయంలో రెడ్లు పెద్ద సంఖ్యలో పోగయి పొలాలవైపు పోతుండడం పోలీసులు చూసారు. వాళ్ళ చేతులలో కర్రలున్నాయి. వాళ్ళు వందల సంఖ్యలో ఉన్నారు. పోలీసులు వాళ్ళను కొంతదూరం తరిమి వెనక్కి వచ్చారు. రెడ్లు పొలాల వెంబడి దళితులను తరిమి నరికి హతమారుస్తుండగా పోలీసులు కడుపులో చల్ల కదలకుండా చుండూరులో కూర్చున్నారు. పైగా, దళితుల వల్ల అగ్రకులాల పిల్లలకు ప్రమాదం ఉంటుందేమోనని వాళ్ళను స్కూలు నుండి సురక్షితంగా ఇంటికి తీసుకొనిరావడానికి అమృతలూరు ఎస్.ఐ. ఆధ్వర్యంలో బందోబస్తు కూడ ఏర్పాటయింది. నిజానికి రక్తసిక్తమయిన ఆ మధ్యాహ్నం చుండూరులో పోలీసులు

చేసిన ఏకైక కార్యక్రమం ఇది. మారణకాండ నుండి ప్రాణాలతో తప్పించుకున్న కొందరు దళితులు ఆ రాత్రి బాగా పొద్దుపోయిన తరువాత తెనాలి ఆర్.డి.వో.కు జరిగిన దారుణం గురించి చెప్పిన తరువాత గానీ హత్యాకాండ గురించి అధికారులు మేలుకోలేదు. అప్పుడు కూడ పోలీసులలో వెంటనే చలనం లేదు. ఆర్.డి.వో సి.ఐ. సాయిబాబాను అడగగా అంతా ప్రశాంతంగానే ఉందనీ, ఎవ్వరూ చనిపోలేదనీ జవాబు చెప్పాడు. 7వ తేదీ పొద్దున దాకా శవాల కోసం వెతకడం ప్రారంభించలేదు.

ఇదంతా న్యాయవిచారణ కమిషన్ ముందు నమోదయిన సాక్ష్యం. నివేదికలో జస్టిస్ గంగాధరరావుగారు ఏకరువు పెట్టిన సాక్ష్యం. కర్రలు పట్టుకొని పెద్దగుంపుగా పొలాల వెంబడి పోతున్న అగ్రకులస్తులను ఊరికే కొంచెం దూరం తరిమి వెనక్కి రాకుండా, చెదరగొట్టేంతవరకు తరిమే ప్రయత్నం ఎందుకు చేయలేదన్న ప్రశ్న గంగాధరరావుగారు పోలీసులను అడిగారు. అంతకుముందు పోలీసుల దాడికి భయపడి దళితులు పొలాలలోకి పారిపోయిన సంగతి పోలీసులకు తెలుసు, పారిపోతూ మరి కొందరు రెడ్లను కొట్టి పోయారన్న ఫిర్యాదు కూడ పోలీసుల వద్ద ఉంది. అటువంటప్పుడు గుంపుగా కర్రలు పట్టుకొని పోతున్న అగ్రకులస్తులు పారిపోయిన దళితులపైన దాడి చేస్తారేమోనన్న అనుమానం పోలీసులకు ఎందుకు రాలేదని గంగాధరరావుగారు ప్రశ్నించారు. కనీసం రాత్రి తెనాలి ఆర్.డి.వో. ఫోన్ చేసి అడిగినప్పుడయినా ఎందుకు గ్రహించలేకపోయారనీ, అంతా ప్రశాంతంగా ఉందనే సమాధానం ఏ విధంగా ఇవ్వగలిగారనీ ప్రశ్నించారు. చివరికి పోలీసుల వైఫల్యం గురించి ఆయన అభిప్రాయమేమిటంటే, సి.ఐ. సాయిబాబా గ్రామంలో దళితులపైన దాడి జరగకుండా రక్షణ కల్పించడంలో సఫలీకృతుడయ్యాడు. అయితే పొలాలలోనూ పొరుగూరిలోనూ దాడి జరగకుండా నిరోధించలేకపోవడం ఆయన వైఫల్యం. దీనికి అప్పటికే ప్రభుత్వం విధించిన తాత్కాలిక సస్పెన్షన్ చాలని జస్టిస్ గంగాధరరావుగారి అభిప్రాయం. అంటే ఆయన కొత్తగా సూచించే శిక్షగానీ చేసే విచారణగానీ ఏమీ లేదు. ఇక చుండూరు ఎస్.ఐ. శ్రీనివాసులు మాటకొస్తే, ఇతర కులాల స్త్రీలను మాల యువకులు వేధించినప్పుడు ఆయన సకాలంలో సరయిన చర్య తీసుకోకపోవడం వల్లనే పరిస్థితి ఇక్కడిదాకా వచ్చిందంట. అంటే దళితులను ఎస్.ఐ. సకాలంలో అణచి వేయకపోవడం వల్ల దళితులపైన హత్యాకాండకు దారితీసే పరిస్థితులు

ఉత్పన్నమయ్యాయని! కాబట్టి శ్రీనివాసులను చుండూరు నుండి బదిలీ చేసి అతని స్థానంలో ఒక 'గట్టి మనిషి'ని వేయాలని జస్టిస్ గంగాధరరావుగారి సూచన. 'గట్టి మనిషి' అంటే దళితులు తమను వేధిస్తున్నారని అగ్రకులస్తులు ఫిర్యాదు చేయగానే దళితుల పైన కఠినమయిన చర్యలు తీసుకునే వాడని అర్థం. అటువంటి ఎస్.ఐ.లను చుండూరు వంటి ఊళ్ళలో వేస్తే ఏ మారణకాండలూ జరగవని జస్టిస్ గంగాధరరావుగారి అభిప్రాయం.

ఆగస్టు 10వ తేదీన (చుండూరు మృతుల అంత్యక్రియలు జరిగిన దినం) జరిగిన అల్లరిని, దహనకాండను, మల్లారెడ్డి హత్యను నివారించడం ఎందుకు సాధ్యం కాలేదనేది కమీషన్ ముందున్న నాలుగవ ప్రశ్న. ఈ ప్రశ్నను చర్చించేటప్పుడు జస్టిస్ గంగాధరరావుగారు రెండు విషయాలను కీలకంగా భావించారు. ఒకటి, మృత దేహాలను బోస్ విగ్రహం దగ్గరే పూడ్చి పెట్టాలని దళిత నాయకులు పట్టుపట్టడం. రెండు వరవరరావు, గద్దర్, కత్తిపద్మారావు వంటి నాయకులు హాజరు కావడం వల్ల జనం అసహనంగా ఉండడం. చుండూరు దళితులు గతంలో ఉపయోగిస్తున్న స్మశానంలో ఇంతమందిని ఖననం చేయడానికి చోటు లేదని అందరూ ఒప్పుకున్నారని, అయితే అందుకు ప్రత్యామ్నాయంగా రెవెన్యూ అధికారులు చూపించిన రెండు స్థలాలను దళిత నాయకులు తిరస్కరించడానికి కారణం వాళ్ళు ముందుగానే ఊరి మధ్యనున్న బోసుబొమ్మ దగ్గర మృతదేహాలను ఖననం చేయాలని నిర్ణయించుకోవడమేనని జస్టిస్ గంగాధరరావుగారు అంటారు. ఈ నిర్ణయం 9వ తేదీనే జరిగిందనీ అంటాడు. గ్రామస్తులు దీనికి ఒప్పుకోరన్న విషయం అటుంచి, గ్రామం మధ్యన శవాలను పూడ్చి పెట్టడం 'హైందవ సాంప్రదాయానికి విరుద్ధం' అని ఆ నిర్ణయాన్ని విమర్శిస్తారు. చుండూరు దళితులు ఎక్కువగా క్రైస్తవులు కాబట్టి ఈ 'హైందవ సంప్రదాయం' తమకు వర్తించదని వారు జవాబు చెప్తే? పొలాల మధ్య దళితులను నరకడానికి అభ్యంతరం చెప్పని హైందవ సంప్రదాయం ఊరి మధ్యన ఖననానికి అభ్యంతరం ఎందుకు చెప్పాలని అడిగితే?

హైందవ సాంప్రదాయానికి విరుద్ధమైన ఈ నిర్ణయాన్ని దళిత నాయకులు 9వ తేదీనే తీసుకోగా, 10వ తేదీన అంత్యక్రియల సమయంలో చుండూరుకు వచ్చిన జిల్లా కలెక్టర్ ఊరి మధ్య శవాలను పూడ్చి పెట్టకూడదని, అలా జరగనివ్వమని

వాళ్ళతో కచ్చితంగా చెప్పకుండా వాళ్ళను నిర్ణయం మార్చుకొమ్మని అడుక్కున్నాడని జస్టిస్ గంగాధరరావుగారు జిల్లా కలెక్టరును అభిశంసించారు. కాబట్టి కలెక్టర్‌ను బదిలీ చేసి 'గట్టి మనిషి'ని గుంటూరు జిల్లాలో వేయాలని సూచించారు. 'గట్టి మనిషి' అంటే అర్థమేమిటో మళ్ళీ స్పష్టమే. దళితులు హైందవ సాంప్రదాయానికీ, అగ్రకులాల ఇష్టానికీ, అధికారుల సూచనలకూ విరుద్ధంగా నడుచుకుంటే నిర్దాక్షిణ్యంగా ఆపేవాడని అర్థం. ఏ విధంగా ఆపగలడు? అంత జనసమ్మర్థంలో ఆయనకున్న మార్గం ఒకటే. పోలీసులను పురమాయించి కాల్పులు జరిపించాలి. మరికొంతమందిని చంపి అంత్యక్రియల కార్యక్రమాన్ని చెల్లాచెదరు చేయాలి. ఈ పనే చేసి ఉండాలని జస్టిస్ గంగాధరరావుగారి అభిమతమా? కాదు. అంతమంది జనం ఉన్నప్పుడు కాల్పులు జరపడం, చెదరగొట్టడం సరయిన చర్య కాదనీ పోలీసులు ఆ పని చేయకపోవడమే మంచిదయిందనీ ఆయన ఎస్.పి. మీనాను, డి.ఐ.జి. అరవిందరావును అభినందిస్తారు. మరి అట్లాంటప్పుడు కలెక్టర్ 'కాదు కూడద'ని కచ్చితంగా చెప్పడం ఎట్లా? ఈ కలెక్టర్ బదులు 'గట్టి మనిషి' ఉంటే ఏం చేసేవాడు? అసలు ఊరి మధ్య ఖననం చేయాలన్న నిర్ణయానికీ ఆ సాయంత్రం జరిగిన దహనకాండకూ మల్లారెడ్డి హత్యకూ ఎటువంటి సంబంధం లేదు. అంత్యక్రియలు ఎక్కడ జరిగినా ఆనాటి ప్రతీకార చర్యలు జరిగేవేనేమో. అటువంటప్పుడు జస్టిస్ గంగాధరరావుగారు ఈ చర్చ ఎందుకు చేసినట్టు?

ఆయన ముందున్న అయిదవ ప్రశ్న ఒక నెల రోజుల తరువాత (సెప్టెంబర్ 10వ తేదీన) జరిగిన కాల్పులు. చుండూరు శిబిరంలో నిరాహారదీక్ష చేస్తున్న దేవరపల్లి ప్రసాదరావు, మద్దు దయాసాగర్‌లను అరెస్టు చేసి ఆస్పత్రికి పంపించడానికి సెప్టెంబర్ 10వ తేదీ సాయంత్రం పోలీసులు బయలుదేరారు. తమ న్యాయమయిన ఆందోళనను పోలీసులు ఈ విధంగా భగ్నం చేయడం పట్ల దళితులు నిరసన వ్యక్తం చేసారు. ఆ నేపథ్యంలో చిన సోమ్లానాయక్ అనే హెడ్ కానిస్టేబుల్ కాల్పులు జరపగా అనిల్ కుమార్ చనిపోయాడు. ఈ కాల్పులు సమర్థనీయమా కాదా అనేది నిర్ణయించాలంటే కేవలం పోలీసుల సాక్ష్యం సరిపోదు. దళితుల సాక్ష్యం కావాలి, సహకారం కావాలి. అది లేకపోయినప్పటికీ జస్టిస్ గంగాధరరావుగారు తొణకకుండా తన కర్తవ్యం ముగించగలిగారంటే ఆశ్చర్యం కలగకమానదు. కాల్పుల గురించి పోలీసులు చెప్పిన

కథనంలో వైరుధ్యాలున్నాయని ఆయనే గుర్తించాల్సింది. దళితులలో కొందరు తీవ్రవాదులు చేరారనీ, వాళ్ళు కర్రలు, రాళ్ళు, సూదులు, కారప్పొడి వంటి ఆయుధాలు ధరించి పోలీసుల పైన రాళ్ళు విసరడమే కాక సూదులతో పొడిచారంట, పోలీసుల బీర్జాలను పిసికారంట. ఇది డి.ఎస్.పి. నుండి కానిస్టేబుళ్ళదాకా అందరి సాక్ష్యం. ఇది అసంబద్ధంగా, విడ్డూరంగా ఉందని జస్టిస్ గంగాధరరావుగారికి తోచలేదు. అనిల్ కుమార్ స్వయంగా చిన సోమ్లానాయక్ పైన రాయి వేసి గాయపరచగా అతను ఆత్మరక్షణ కోసం ఎదురుకాల్పులు జరిపాడనేది ఇతర పోలీసు సిబ్బంది కథనం. కాల్పులు జరిపిన సోమ్లానాయక్ మాత్రం తన పైన రాయి విసిరిందెవరో తెలీదంటాడు. రాయి తగిలి కింద పడిపోయాడంట. లేచి చూసేసరికి దళితులు రాళ్ళతో, గొడ్డళ్ళతో దాడికి వస్తున్నారంట. చుట్టూ చూస్తే కాపాడే నాథుడు కనిపించలేదంట. ఇంక గత్యంతరం లేక రెండు రౌండ్లు కాల్చి స్పృహ తప్పి పడిపోయాడంట.

ఇంతా చేసి అతని తల మీద ఉన్నది చిన్న గాయమే. పుర్రె ఎముకకు గాయం కాలేదు, కేవలం చర్మానికే గాయం అయింది. అతని ఒంటి మీద వేరే ఏ గాయమూ లేదు. వేరే ఎవ్వరి ఒంటి మీదా గాయాలు లేవు. అదేమంటే సూదులతో పొడిచారనీ, బీర్జాలు పిసికారనీ అంటారు!

చినసోమ్లానాయక్ కాల్పులు జరపడంలో 'ఆత్మరక్షణ' పరిధిని అధిగమించాడని జస్టిస్ గంగాధరరావు భావిస్తూనే, అతనికి ఎవరినీ చంపే ఉద్దేశ్యం లేదనీ పైగా ఈ పని తన విధి నిర్వహణలో భాగంగా చేసాడనీ అందువల్ల అతని పైన క్రిమినల్ కేసు పెట్టనవసరం లేదని నిర్ధారించారు. ఒకప్పటి రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నుండి ఇటువంటి అభిప్రాయం వినవలసి రావడం చాలా ఆశ్చర్యకరం. ఎవరయినా ఒక వ్యక్తి నిష్కారణంగా భయపడి జనంలోకి కాల్పులు జరిపి ఒకరి ప్రాణం తీస్తే అది 'ఆత్మరక్షణ పరిధిని అధిగమించే చర్య అయినప్పటికీ అతనికి ఎవరినీ చంపే ఉద్దేశ్యం లేదు కాబట్టి అతనిపైన కేసు పెట్టనవసరం లేదని' గంగాధరరావుగారు అంటారా? అది నిష్కారణంగా భయపడి చేసిన కాల్పులు కాదనీ, దళితుల తలలో నాల్కలాగా ఉన్న అనిల్ కుమార్‌ను కావాలనే కాల్చి చంపారనీ చుండూరు దళితులు అంటున్నారు. రాళ్ళు వేయడం, సూదులతో పొడవడం, బీర్జాలు పిసకడం వట్టి అబద్ధం అంటున్నారు. పోలీసులు నిరాహారదీక్షకు కూర్చున్న వారిని బలవంతంగా

తొలగించడానికి వచ్చి శిబిరం దగ్గర వున్న తిండి గింజలను చిందర వందర చేసి దౌర్జన్యం చేయగా దళితులు ప్రతిఘటించారనీ, అనిల్ కుమార్ ఘర్షణను శాంతపరచి గొడవ కాకుండా చూసే ప్రయత్నం చేసాడనీ, పోలీసులు కావాలనే అతనిని కాల్చి చంపారనీ చుండూరు దళితులు అంటున్నారు. వాళ్ళు కమీషన్‌కు సహకరించలేదు కాబట్టి వాళ్ళ సాక్ష్యం నమోదు కాలేదు. బాధితుల సాక్ష్యం నమోదు కానంతమాత్రాన వచ్చిన ఇబ్బంది ఏమీ లేదని జస్టిస్ గంగాధరరావు గారు భావించారు కాబట్టి కేవలం పోలీసుల సాక్ష్యాన్ని ఆధారం చేసుకొని నిర్ధారణకు వచ్చారు. పోనీ అదే నిజమనుకున్నా ఆయన చేసిన నిర్ధారణ ప్రకారమే హెడ్ కానిస్టేబుల్ సోమ్లానాయక్ పైన సెక్షన్ 302 కాకపోయినా 304 అయినా పెట్టనక్కరలేదా? నిరాధారంగా భయపడి కాల్పులు జరిపితే అది విధి నిర్వహణ అవుతుందా? డ్యూటీలో ఉన్నప్పుడు పోలీసులు ఏమి చేసినా అది విధి నిర్వహణ అవుతుందా? వాళ్ళు నిర్వహించవలసిన విధితో దానికి హేతుబద్ధమయిన సంబంధం ఉండనవసరం లేదా? న్యాయశాస్త్ర కోవిదులయిన జస్టిస్ గంగాధరరావుగారికి ఈ ప్రశ్నలు కొత్తవా? లేకపోతే హైకోర్టు న్యాయమూర్తి అయినంతమాత్రాన ఆయన న్యాయశాస్త్ర కోవిదుడయి ఉంటాడని భావించడం మన మూర్ఖత్వమా?

ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండడానికి కమిషన్ ప్రభుత్వానికి ఏమి సూచిస్తుందనేది చివరి ప్రశ్న. దళితుల పునరావాసానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఈ సందర్భంగా జస్టిస్ గంగాధరరావుగారు ప్రస్తావిస్తూ 'అవి అత్యంత ఉదారంగా ఉన్నాయి' అన్నారు. వాటి పరిస్థితి ఏమిటో దళితులు చెప్పకపోయినా దినపత్రికలు చదివి గంగాధరరావుగారు తెలుసుకొని ఉంటే బాగుండేది. క్లుప్తంగా చెప్పాలంటే 'అత్యంత ఉదారమయిన' ఈ హామీలలో ఒక్కటి మట్టుకే అమలయింది. అదేమిటంటే ఒక్కొక్క దళిత కుటుంబానికి రెండేసి గేదెలను ఇవ్వడం. ఒక గేదె ఉచితంగా, ఒకటి అప్పుగా ఇచ్చారు. ఇప్పుడు ఈ గేదెల పాలే అమ్ముకుని బ్రతుకుతున్నారు చుండూరు దళితులు. ఒక్కొక్క కుటుంబానికి 1 ఎకరం వ్యవసాయభూమి ఇస్తామన్నారు. 700 కుటుంబాలు లెక్క చూపిస్తే 550 కుటుంబాలను మట్టుకే గుర్తిస్తామని చెప్పి వారిలో 57 కుటుంబాలకు మట్టుకే ఒక ఎకరం చొప్పున భూమి ఇచ్చారు. అందులో 26 ఎకరాలు మట్టుకే వ్యవసాయ యోగ్యమయినది.

('పంచపాండవులు మంచం కోళ్ళు.....' జ్ఞాపకం వస్తోందా?) ఒక్కొక్క కుటుంబానికి ఒక్కొక్క ఇల్లు కట్టిస్తామన్నారు కానీ ఇప్పటికి (అంటే దాడి జరిగి సంవత్సరన్నర గడిచిన తరువాత) సగం ఇళ్ళు మట్టుకే తయారయ్యాయి. చదువుకున్న వాళ్ళందరికీ ఉద్యోగాలిస్తామన్నారు. కానీ నిన్నటిదాకా ఒక్కరికీ ఇవ్వలేదు. ఇప్పుడు ఇంటర్ పాసయిన వాళ్ళకు ఉద్యోగాలిచ్చే ప్రయత్నం ప్రారంభం అయిందని తెలుస్తోంది. కానీ పదవతరగతి పాసయి ఆపేసిన వాళ్ళు కూడ ఏవో కొన్ని ఉద్యోగాలకు అర్హులే కదా? వాళ్ళకెప్పుడిస్తారు? 'పునరావాస చర్యలు' కాక కేసు సత్వరం ముగియడం కోసం చుండూరు కేసు కోసమే ఒక ప్రత్యేక కోర్టు నెలకొల్పి ప్రత్యేక జడ్జినీ, ప్రత్యేక పి.పినీ నియమిస్తామని హామీ ఇచ్చారు. చేసిందేమిటంటే చుండూరులో ఒక కోర్టు బిల్డింగ్ కట్టారు. కానీ కేసు మట్టుకు గుంటూరులో ఉన్న మూడు జిల్లాల ఎస్.సి., ఎస్.టి. అత్యాచారాల ప్రత్యేక కోర్టులో అన్ని కేసులలో ఒక కేసుగా మాత్రమే విచారణ జరుగుతున్నది. తేడా ఏమంటే ఈ కేసు వాయిదా ఉన్న రోజున జడ్జిగారు గుంటూరు బదులు చుండూరులో కూర్చుంటారు! ఇవీ గంగాధరరావుగారికి 'అత్యంత ఉదారంగా' కనిపించిన చర్యలు!

భవిష్యత్తులో ఇటువంటి దాడులు ఎక్కడా జరగకుండా ఉండాలంటే ఏమేమి చర్యలు తీసుకోవాలో కూడ జస్టిస్ గంగాధరరావుగారు సూచించారు. పోలీసు యంత్రాంగాన్ని పటిష్టం చేయాలి, సరయిన శిక్షణ ఇవ్వాలి, ఇంటలిజెన్స్ అభివృద్ధి కావాలి మొదలయిన సాధారణ సూచనలను పక్కనపెడితే కొన్ని చెప్పుకోదగ్గ అభిప్రాయాలను, సలహాలను ప్రభుత్వం ముందుంచారు. వీటిని ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఎందుకంటే మేధావులు, న్యాయమూర్తులు, ఉదారులు అని మనం అనుకునే వాళ్ళ ఆలోచనలు ఎంత బాగున్నాయో తెలుసుకోవడం అవసరం. వీటిని వారి మాటలలోనే తెలుసుకుందాం.

1. చుండూరులో ఘర్షణకు కారణం అగ్రకులాల సంప్రదాయక ఆధిపత్యాన్ని చదువుకున్న దళితులు సవాలు చేయడం. అది విలువలకు కూడ సవాలు. ఇతర కులాలు దళితులను తక్కువగా చూడాలని ప్రయత్నించగా, అగ్రకులాలతో సమంగా ఆధునికతను సాధించుకున్న దళితులు సామాజికంగా గుర్తింపు కావాలని కోరుకుంటున్నారు. ఈ సమానత్వం తిరస్కరించబడిన కారణంగా కొందరు దళిత

యువకులు దూకుడుగా ప్రవర్తిస్తున్నారు. వాళ్ళు ఇతర కులాలను కావాలని రెచ్చగొడుతున్నారు. చుండూరులో ఈ రెచ్చగొట్టే చర్యలు స్త్రీలను వేధించడం, బలాత్కరించడం మొదలయిన రూపాలు తీసుకున్నాయి. స్త్రీలను వేధించడం అనేది అన్నిచోట్ల ఉండే విషయమే అయినప్పటికీ, అగ్రకులాల స్త్రీలను దళితులు వేధిస్తే ఉత్పన్నమయ్యే పరిస్థితులు భిన్నంగా ఉంటాయి. అగ్రకులాలలో చాలా బలమయిన నిరసన తప్పనిసరిగా పుడుతుంది. వాళ్ళు దళితులను వేధించడానికి అవకాశం కోసం చూస్తుంటారు. ఈ రకమయిన రెచ్చగొట్టే చర్యలను అదుపు చేయడానికి ఒకటే మార్గం ఉంది. వాటికి బాధ్యులయిన వారిని వెంటనే గుర్తించి తగు చర్య తీసుకోవాలి. పోలీసులు ఉండవలసినంత చురుగ్గా లేరు. 'చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకోవడం వ్యర్థం' అనే నానుడి అన్ని శాంతి భద్రతల సమస్యలకూ వర్తిస్తుంది. స్థానిక ఎస్.ఐ. ఈ దుష్ప్రవర్తనను వెంటనే గుర్తించి దోషులపైన చర్య తీసుకొని ఉంటే పరిస్థితి అదుపులోకి వచ్చేది. కాబట్టి సున్నితమయిన పరిస్థితి ఉన్న చుండూరు వంటి గ్రామాలలో, సకాలంలో గట్టి చర్యలు తీసుకోగల పోలీస్ అధికారులను నియమించాలని నేను సూచిస్తున్నాను.

2. గతంలో గ్రామాలలో ప్రభుత్వానికి కళ్ళు, చెవులుగా పనిచేసే గ్రామాధికారులు ఉండేవారు. వారి ద్వారా గ్రామ పరిస్థితులు ప్రభుత్వానికి తెలిసేవి. గ్రామ మునసబే గ్రామ మేజిస్ట్రేటుగా వ్యవహరించేవాడు. స్థానికుడు కావడం వల్ల అతను పోలీసులకూ రెవిన్యూ వారికీ సమాచారం సేకరించడానికి ఉపయోగపడేవాడు. అంతేకాక గ్రామంలో శాంతిభద్రతలకు అతనే బాధ్యుడు. కాబట్టి గ్రామంలో ప్రభుత్వానికి వెన్నెముకగా ఉండి ప్రభుత్వానికి గ్రామానికి అనుసంధానం కుదిర్చే గ్రామ అధికారులను ప్రభుత్వం నియమించాలి.

3. రాజకీయ పార్టీలు, నాయకులు ఇటువంటి ఘర్షణల వల్ల ప్రయోజనం పొందే ప్రయత్నం చేయకూడదు. దాని వల్ల కుల సంఘర్షణలు పెరుగుతాయి తప్ప ఏ కులానికీ ప్రయోజనం కలగదు. కాబట్టి కుల ఘర్షణలలో ఎవ్వరూ ఏ కులం పక్షమూ తీసుకోకూడదనే ప్రవర్తనా నియమావళి అన్ని రాజకీయ పార్టీలు రూపొందించుకోవాలి. కులాలను ఐక్యంచేసి ఘర్షణను తొలగించే మార్గాన్ని అన్ని

రాజకీయ పార్టీలు కలిసి కూర్చొని అన్వేషించాలి. ఈ ప్రవర్తనా నియమావళి గ్రామస్థాయిలో కూడ అమలు కావాలి.

4. సున్నితమయిన విషయాలలో వేలు పెట్టి రాజకీయంగా ప్రయోజనం పొందడం అలవాటయిపోయిన నాయకమ్మన్యులు కొందరున్నారు. సంఘటన జరగడానికి కారణభూతమయిన పరిస్థితులు ఏవయినా కానీగాక, సమస్యను ఆ గ్రామానికే పరిమితం చేసి ఇతర ప్రాంతాలలో దాని ప్రభావం పడకుండా చూడడం అవసరం. కాబట్టి గ్రామంలోకి అటువంటి వ్యక్తుల రాకపోకలను నిరోధించడం అవసరం.

5. దళితులు, దళితేతరులు గ్రామాలలో తరతరాలుగా నివసిస్తున్నారు. కొందరు వ్యక్తులు గ్రామం వదిలి మెరుగయిన బ్రతుకు కోసం బయటికి పోవచ్చునేమో గానీ ఒక కులం మొత్తంగా ఎక్కడికీ పోలేదు. ఇతర కులాలను కాదని విడిగా బ్రతక జాలదు. కాబట్టి తాత్కాలికంగా కులాల మధ్య ఏ ఘర్షణలు వచ్చినా అది శాశ్వత ఎడబాటుకు దారి తీయకూడదు. కాబట్టి ప్రభుత్వం తీసుకునే పునరావాస చర్యలు దళితులకు సహాయం చేయడానికి ఉపయోగపడడమే కాక, గ్రామాన్ని సామాజికంగా, ఆర్థికంగా ఐక్యం చేసేటట్టు ఉండాలి. నా అభిప్రాయంలో ప్రత్యేక హాస్టళ్ళు, ప్రత్యేక స్కూళ్ళు, ప్రత్యేక గృహాలు కులాల ఐక్యతకు కాక విభేదాలను పెంచడానికి దోహదం చేస్తాయి.

వీటిలో మొదటిది (పైన చెప్పినట్టు) సర్వజనాభ్యుదయ పోరాట సమితి అవగాహన. రెండవది ఊడబీకిన మునసబు కరణంల (పటేల్ పట్వారీ) మనస్సులను రంజింపజేసే సూచన. గ్రామాలలో ప్రభుత్వానికి 'వెన్నెముకగా' 'అనుసంధానంగా' ఉంటూ వాళ్లు చేసిన ఘనకార్యాలు ఎవరికి తెలియనివి! అగ్రకులాలు దళితులపైన దాడి చేస్తే 'ఎవరి పక్షం తీసుకోకుండా ఇద్దరినీ కలిపే ప్రయత్నం చేయాల'నే మూడవ సూచన గ్రామ పెత్తందార్ల మనస్సుకు హత్తుకునే సూచన. వాళ్ళ అభిప్రాయం ఎప్పుడూ అదే! నాలుగవది ఎస్.పి. మీనా మనస్ఫూర్తిగా నమ్మి శాయశక్తులా అమలు చేసిన అభిప్రాయం. ప్రజల సమస్యల నుండి ఉత్పన్నమయ్యే ఉద్యమాలను, ఉద్యమకారులను సంఘవ్యతిరేక చర్యలుగా, వ్యక్తులుగా చూసే పోలీసు దృక్పథం నుండి పుట్టిన అభిప్రాయం ఇది. అయిదవది మండల్ వ్యతిరేక ఉద్యమకారులు మెడకు మైక్ కట్టుకుని

ప్రచారం చేసిన అవగాహన. ప్రత్యేక హాస్టళ్ళు, ప్రత్యేక కాలనీలు దళితులు కోరుకోవడం వల్ల రాలేదు. అగ్రకులాల వైఖరి వల్ల వచ్చాయి. ప్రత్యేకంగా కట్టకపోతే దళితులకు హాస్టళ్ళు, ఇళ్ళు లేకుండానే పోతాయేమో జస్టిస్ గంగాధరరావుగారు కొంచెం ఆలోచిస్తే బాగుంటుంది.

ఇన్ని చెప్పిన తరువాత వారు నేరవిచారణ త్వరగా జరిపించి హంతకులను శిక్షించాలనీ, దళితుల పునరావాసం కంటే వారి హక్కుల పరిరక్షణకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలనీ, అగ్రకులాలు వారిని వేధించకుండా చూడాలని ప్రభుత్వానికి హితోపదేశం చేసి ఏం ప్రయోజనం?

స్వేచ్ఛ మాసపత్రిక
*జనవరి – ఫిబ్రవరి 1993*

# ఆంధ్రప్రదేశ్‌లో 'ఎన్‌కౌంటర్లు'

**1991,** 92, 93 సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన 'ఎన్‌కౌంటర్' మరణాల గురించి ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం జాతీయ మానవహక్కుల కమిషన్‌కు వివరమయిన ఫిర్యాదు సమర్పించింది. కమిషన్ ఆ ఫిర్యాదును స్వీకరించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీస్ జారీ చేసింది. ఆ ఫిర్యాదు పూర్తి పాఠాన్ని ఇక్కడ ఇస్తున్నాం. (ఫిర్యాదుకు అనుబంధంగా జత చేసిన 'ఎన్‌కౌంటర్ల' జాబితా ఏ నెలకానెల 'స్వేచ్ఛ'లో ఇచ్చినదే.)

**గౌరవనీయులైన**

**జాతీయ మానవహక్కుల కమిషన్ అధ్యక్షులకు,**

ఈ ఫిర్యాదు ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న 'ఎన్‌కౌంటర్' హత్యలకు సంబంధించినది.

ఫిర్యాదుదారులమయిన మేము ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (ఎపిసిఎల్‌సి) అధ్యక్ష ప్రధాన కార్యదర్శులము. ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం న్యాయవాదులు, అధ్యాపకులు, రచయితలు, పాత్రికేయులు తదితర మేధోవృత్తులకు చెందిన వ్యక్తులు పనిచేసే సంస్థ. మేము గడచిన రెండు దశాబ్దాలుగా పౌరులకు (ప్రత్యేకించి పేదలు, దళితులు, స్త్రీలు, ఆదివాసులకు) ఉండే చట్టపరమయిన హక్కులను కాపాడడానికీ, పరిపాలనా యంత్రాంగంలోనూ సామాజిక ఆర్థిక రాజకీయ జీవితంలోనూ ప్రజాతంత్ర విలువలనూ ప్రమాణాలనూ కాపాడడానికి కృషి చేస్తున్నాము. హక్కులకు సంబంధించిన సాహిత్యాన్ని ప్రచురించడం, సభలు సమావేశాల ద్వారా ప్రచారం చేయడం, శాంతియుత పద్ధతులలో నిరసన తెలియజేయడం, కోర్టులలో కేసులు వేయడం,

విచారణలలో పాల్గొనడం తదితర పద్ధతులలో మేము హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తున్నాము.

మేము తొలినుండి ఆందోళన చేస్తున్న విషయాలలో ఒకటి, 'ఎన్‌కౌంటర్' పేరిట పోలీసులు పౌరులను చంపడం. ఈ విధంగా చనిపోయిన వారినందరినీ పోలీసులు 'సాయుధ నక్సలైట్లు'గా వర్ణిస్తారు. కానీ వాళ్ళు సాయుధ నక్సలైట్లనేది సంశయాస్పదమే, వాళ్లు ఎదురుకాల్పులలో చనిపోయారనేదీ సంశయాస్పదమే.

'ఎన్‌కౌంటర్లు' అని పిలవబడే ఈ ఘటనల గురించి ఎపిసిఎల్‌సి ఎప్పటికప్పుడు నిజనిర్ధారణ కమిటీలను నియమించి సాక్షులతో, ఇరుగుపొరుగు వ్యక్తులతో, పంచనామా, శవపరీక్ష మొదలయిన ప్రక్రియలు నిర్వహించే అధికారులతో మాట్లాడి వాస్తవాలు సేకరించింది. 'ఎన్‌కౌంటర్'లో పాల్గొన్న పోలీసులతో మాట్లాడడం సాధ్యమయితే వాళ్లతో కూడ మా నిజనిర్ధారణ కమిటీలు మాట్లాడాయి.

వందలాది నిజనిర్ధారణ కమిటీల నివేదికల ఆధారంగా 'ఎన్‌కౌంటర్లు' అనేవి అధికభాగం పోలీసులు లేక పారామిలిటరీ బలగాలు చేసే హత్యలేనని మేము చెప్పగలము. ఒక వ్యక్తిని లేక వ్యక్తులను కస్టడీలోకి తీసుకోవడం, సమాచారం రాబట్టడం కోసం చిత్రహింసలు పెట్టడం, ఆ తరువాత కాల్చి పారేయడం జరుగుతున్నది. ఈ రకంగా చేసిన హత్యలకు 'ఎన్‌కౌంటర్' అని పేరు పెడుతున్నారు. సాయుధ నక్సలైట్ దళం పోలీసులపైన దాడి చేయగా పోలీసులు ప్రాణరక్షణ నిమిత్తం ఎదురుకాల్పులు జరిపారనీ, ఈ క్రమంలో ఒకరు లేక కొందరు నక్సలైట్లు చనిపోయారనీ ప్రకటిస్తున్నారు. ఈ కథ మరింత నమ్మశక్యంగా ఉండడం కోసం తరచుగా మృతులకు నక్సలైట్ సాయుధ దళాలు ధరించే యూనిఫారంలు తొడిగి శవం పక్కన ఒక తుపాకీ పెడుతున్నారు.

## పూర్వరంగం

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్-లెనినిస్ట్) లేక నక్సలైట్లు అని పిలవబడే పార్టీలు ఆంధ్రప్రదేశ్‌లో ఆరవ దశకం చివరిభాగం నుండి పనిచేస్తున్నాయి. పీడితుల హక్కులను కాపాడడానికీ, కమ్యూనిస్టు విప్లవం సాధించడానికీ సాయుధ పోరాట

మార్గాన్ని ఈ పార్టీలు విశ్వసిస్తాయి. ఈ పార్టీలకు సాయుధ దళాలు ఉన్నాయి. కొందరు నక్సలైట్ కార్యకర్తలు కూడ ఆయుధాలు ధరించి ఉంటారు.

నక్సలైట్లు ఆదివాసులను, భూమిలేని పేదలను, పారిశ్రామిక కార్మికులను, గని కార్మికులను, స్త్రీలను, విద్యార్థులను, రైతులను వివిధ ప్రజాసంఘాలలో సంఘటితపరచి ఉద్యమాలు నిర్వహిస్తారు. ఇటువంటి సంఘటిత ఉద్యమాల ద్వారా వ్యవసాయరంగంలోనూ, అటవీ ఉత్పత్తులలోను, గనులలోను, ఫ్యాక్టరీలలోను కార్మికుల కూలి రేట్లు, వేతనాలను గణనీయంగా పెంచగలిగారు. పేదలకు ప్రభుత్వ భూమిని, భూస్వాముల భూమిని; ఆదివాసులకు లక్షల ఎకరాల అటవీభూమిని పంచగలిగారు. భూస్వాములు, ప్రభుత్వ సిబ్బంది, ముఖ్యంగా అటవీ సిబ్బంది ప్రజలచేత చేయించుకునే వెట్టిచాకిరీని నిరోధించగలిగారు. స్త్రీలపైన, దళితుల పైన వేధింపులను ప్రతిఘటించారు. గని కార్మికుల, ఇతర పారిశ్రామిక కార్మికుల హక్కులను, పనిపరిస్థితులను మెరుగు పరచగలిగారు.

కొన్ని సిపిఐ (ఎం–ఎల్) పార్టీలు ఎన్నికలలో పాల్గొనవు. కొన్ని పాల్గొంటాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభలో రెండు సిపిఐ (ఎం–ఎల్) పార్టీలకు చెందిన ఇద్దరు శాసనసభ్యులు ఉన్నారు. వారిలో ఒకరు గిరిజన రిజర్వ్‌డ్ నియోజకవర్గం ప్రతినిధి. అంతేకాక డజన్ల సంఖ్యలో గ్రామ సర్పంచ్‌లు, కొందరు మండల ప్రజాపరిషత్ అధ్యక్షులున్నారు.

నక్సలైట్ పార్టీలు, ముఖ్యంగా నిషేధించబడిన సిపిఐ (ఎం–ఎల్) (పీపుల్స్‌వార్), హింసాత్మక చర్యలకు పాల్పడతాయనేది విదితమే. భూస్వాములను, కాంట్రాక్టర్లను, పోలీస్ ఇన్ఫార్మర్లుగా భావించే వ్యక్తులను చంపడం, ప్రముఖ వ్యక్తులను కిడ్నాప్ చేసి బందీలైన తమ సహచరులను విడిపించుకోవాలని యత్నించడం, పోలీసు నిర్బంధానికి నిరసనగా ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ ఆస్తులను ధ్వంసం చేయడం మొదలయిన రూపాలలో వారు హింసకు పాల్పడుతుంటారు. నక్సలైట్లు పాల్పడే ఈ హింసను ఎపిసిఎల్‌సి ప్రోత్సహించదు, సమర్థించదు. అయితే మేము ప్రభుత్వానికి రెండు విషయాలు ఎప్పుడూ చెప్తున్నాం.

(1) హింసకు ఎవరు పాల్పడినా వారిని చట్టం నిర్దేశించే పద్ధతిలో మాత్రమే విచారించి శిక్షించాలి. చట్టబాహ్యమయిన పద్ధతులలో చిత్రహింసలకు గురి

చేయకూడదు. హత్యలు చేయకూడదు. అది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21లకు విరుద్ధం.

(2) నక్సలైట్ ఉద్యమం గణనీయమైన సామాజిక పునాది ఉన్న రాజకీయ ఉద్యమం. అటువంటి ఉద్యమం ఒకవేళ హింసను చేపట్టినా దానిని కేవలం శాంతిభద్రతలకు సంబంధించిన విషయంగా చూడకూడదు. సమాజంలో బలంగా నెలకొని ఉన్న పీడన, ఆ పీడనకు ఫలితమైన నిరసన ఈ ఉద్యమానికి మూలం అని గుర్తించాలి. దానిని ఎదుర్కొనడానికి చట్టబద్ధమైన భద్రతాచర్యలను చేపడుతూనే, ప్రధానంగా ఆ ఉద్యమంతో సామాజికంగా రాజకీయంగా వ్యవహరించాలి.

ఈ సూచనలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎన్నడూ పట్టించుకోలేదు. నక్సలైట్ ఉద్యమానికి ఉన్న సామాజిక ఆర్థిక రాజకీయ పునాదిని ప్రభుత్వం ఒప్పుకోదు. కేవలం హింస, విధ్వంసాలను మాత్రమే చూపిస్తుంది. అంతే కాకుండ ఆ హింసను ఎదుర్కొనడానికి ప్రభుత్వం ఉద్యమాన్ని, దానిలో భాగస్వాములు, మద్దతుదారులు అయిన పీడిత ప్రజలనూ చట్టవిరుద్ధమయిన అణచివేతకు గురిచేసే విధానాన్ని అనుసరిస్తున్నది.

అక్రమ నిర్బంధం, పోలీసు కస్టడీలో చిత్రహింసలు, లైంగిక అత్యాచారాలు, పేదప్రజల గృహాల విధ్వంసం, వాళ్ల పొలాలు బీడు పెట్టడం, మూకుమ్మడిగా వారిని తప్పుడు కేసులలో ఇరికించడం, 'ఎన్‌కౌంటర్ల' పేరిట మనుషులను చట్టబాహ్యంగా చంపడం, మనుషులను 'మాయం' చేయడం – ఇదీ 25 సంవత్సరాలకు పైగా నక్సలైట్ ఉద్యమాన్ని ఎదుర్కొవడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం.

## ఎన్‌కౌంటర్ హత్యలు

ఈ ఫిర్యాదు ఎన్‌కౌంటర్ హత్యల గురించి కాబట్టి ఇకపైన విషయానికే పరిమితమవుతాము.

'ఎన్‌కౌంటర్' కథలు ఎప్పుడూ ఒకే సమూనాలో ఉంటాయి. పోలీసులు నక్సలైట్ల కోసం వెతుకుతుంటారు. వెతికే క్రమంలో పోలీసులకు నక్సలైట్లు కనపడతారు. లేదా నక్సలైట్లు పోలీసులను గమనిస్తారు. ఆ నక్సలైట్లు కొందరు వ్యక్తులు కావచ్చు,

లేకపోతే సాయుధ నక్సలైట్ దళం కావచ్చు. పోలీసులు నక్సలైట్లను గమనించినట్లయితే వాళ్లను లొంగిపొమ్మని హెచ్చరిస్తారు. నక్సలైట్లు వినకుండ పోలీసులపైన దాడి చేస్తారు. లేదా నక్సలైట్లే పోలీసులను మొదట గమనించి ఉంటే, వారు ఎటువంటి హెచ్చరిక లేకుండ పోలీసులపైన దాడి చేస్తారు. ఏ విధంగా జరిగినా పోలీసులకు ప్రాణాపాయం ఏర్పడుతుంది. అందువల్ల పోలీసులు ఆత్మరక్షణార్థం ఎదురుకాల్పులు జరుపుతారు. కొంతసేపు ఎదురుకాల్పులు జరిపిన తరువాత నక్సలైట్లు నిష్క్రమిస్తారు. పోలీసులు ఆ స్థలాన్ని వెతకగా ఒకటో రెండో మరికొన్నో నక్సలైట్ల శవాలు కనపడతాయి.

ఇదీ వారి కథనం. ఇందులో ఉన్న రెండు అంశాలను వేరు చేసి చెప్పుకోవాలి.

(i) ఎన్‌కౌంటర్ మృతులు మొదట పోలీసులపైన కాల్పులు జరపగా పోలీసులు ఆత్మరక్షణార్థం వారిపై తిరిగి కాల్పులు జరిపారు.

(ii) మృతులు సాయుధ నక్సలైట్లు.

అయితే మా నిజనిర్ధారణ కమిటీల నివేదికను బట్టి అత్యధిక సంఘటనలలో పై రెండు అంశాలు అవాస్తవమని అర్థం అవుతుంది.

ఈ విషయంపైన విచారణ జరపమని మేము గౌరవనీయమైన కమిషన్‌ను కోరుతున్నాము.

అధికభాగం 'ఎన్‌కౌంటర్' ఘటనలలో మృతులు నక్సలైట్లన్నది వాస్తవం కాదు. వాళ్లు పోలీసులకు ప్రాణాపాయం కలిగించగా పోలీసులు ఆత్మరక్షణార్థం కాల్పులు జరిపి వాళ్లను చంపారనేది కూడ వాస్తవం కాదు. అధికభాగం ఘటనలలో మృతులు నిరాయుధులైన గ్రామీణులు. పోలీసులు వాళ్లను కస్టడీలోకి తీసుకొని ఉద్దేశ్యపూర్వకంగా కాల్చిచంపడమే 'ఎన్‌కౌంటర్'.

ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్ ఉద్యమానికి సంబంధించిన మొట్టమొదటి ఎన్‌కౌంటర్ మార్చి 1968లో జరిగింది. ఆ తరువాత క్రమం తప్పకుండ జరుగుతున్నాయి. సంవత్సరాల వారీగా 'ఎన్‌కౌంటర్ల' గణాంకాలు ఈ పట్టికలో చూడవచ్చు.

| సంవత్సరం | 'ఎన్‌కౌంటర్ల'లో చనిపోయినవారి సంఖ్య |
|---|---|
| 1968–1977 | 335 (సుమారు) |
| 1978 | -- |
| 1979 | -- |
| 1980 | 7 |
| 1981 | 5 |
| 1982 | 4 |
| 1983 | 3 |
| 1984 | -- |
| 1985 | 35 |
| 1986 | 20 |
| 1987 | 29 |
| 1988 | 61 |
| 1989 | 51 |
| 1990 | 20 |
| 1991 | 104 |
| 1992 | 256 |
| 1993 | 136 |
| | మొత్తం 1066 |

ఈ హత్యలు 1991, 92, 93 సంవత్సరాలలో తీవ్రస్థాయిని చేరుకున్నాయని పై పట్టిక చూపిస్తుంది. ఈ మూడు సంవత్సరాలలో 'ఎన్‌కౌంటర్ల'లో 496 మంది చనిపోయారు. ఈ ఘటనలకు సంబంధించి మా నిజనిర్ధారణ కమిటీలు సేకరించిన వివరాలను ఈ ఫిర్యాదుకు అనుబంధంగా సమర్పిస్తున్నాము.

## అనుబంధం వివరణ

'ఎన్‌కౌంటర్' మృతులు ఎవరు?

అనుబంధంలో వారిని ఈ కింది విధంగా వర్గీకరించాము.

(1) నక్సలైట్ కార్యకర్తలు. అంటే సిపిఐ (ఎం.ఎల్) పార్టీల సాయుధ రహస్య కార్యకర్తలు.

(2) రైతాంగం, రైతాంగ యువకులు, గిరిజన యువకులు. నక్సలైట్ పార్టీలకు అనుబంధంగా పనిచేసే బహిరంగ ప్రజాసంఘాల కార్యకర్తలను కూడ ఈ కోవలో చేర్చాము.

(3) ఇతర గ్రామీణ పేదలు. అంటే రైతాంగం కాని గ్రామీణ శ్రామికులు, చిన్నచిన్న వ్యాపారస్తులు వగైరా.

(4) విద్యార్థులు, నిరుద్యోగ యువకులు.

(5) సిపిఐ (ఎం.ఎల్) పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు

(6) నక్సలైట్ కార్యకలాపాలు కాక ఇతర నేరాలతో సంబంధం ఉన్న వ్యక్తులు.

(7) ఎవరయినదీ తెలియని వ్యక్తులు.

అనుబంధంలోని సమాచారాన్ని ఇక్కడ సంగ్రహంగా వివరిస్తాము. 1991, 92, 93 సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్‌లో 285 ఎన్‌కౌంటర్ ఘటనలు జరిగాయనీ, వాటిలో 496 మంది చనిపోయారనీ అనుబంధం తెలియచేస్తుంది. అందులో 22 మంది స్త్రీలు కాగా 474 మంది పురుషులు.

ప్రతి సంఘటనలోనూ మొట్టమొదట నక్సలైట్లు కాల్పులు జరిపారనీ, పోలీసులు ఆత్మరక్షణార్థం తిరిగి కాల్పులు జరిపారనీ అధికార కథనం. అయితే 285 ఘటనలలో 5 ఘటనలలో మాత్రమే పోలీసులు చనిపోవటం లేక గాయపడటం జరిగింది. విడిగా మందుపాతర ఘటనల్లోనూ, దాడులలోనూ నక్సలైట్లు చాలామంది పోలీసులను చంపారు. కాని 'ఎన్‌కౌంటర్ల'లో పోలీసులు చనిపోవటం చాలా అరుదు. దీనినిబట్టే 'ఎన్‌కౌంటర్' కథలను అనుమానించవలసి వస్తుంది.

పైన పేర్కొన్న వర్గీకరణ ప్రకారం ఈ 496 మంది ఏ కోవకు చెందిన వ్యక్తులనేది ఈ పట్టిక తెలియచేస్తుంది.

| | |
|---|---|
| నక్సలైట్ కార్యకర్తలు | 204 |
| రైతులు, రైతాంగ యువకులు, గిరిజన యువకులు | 210 |
| ఇతర గ్రామీణ పేదలు | 30 |
| విద్యార్థులు, నిరుద్యోగ యువకులు | 11 |
| ప్రజాప్రతినిధులు | 2 |
| ఇతర నేరాలతో సంబంధం ఉన్నవారు | 8 |
| తెలియదు | 31 |
| మొత్తం | 496 |

మృతులలో 204 మంది (అంటే 41.1 శాతం) మాత్రమే నక్సలైట్ కార్యకర్తలని పట్టిక తెలియచేస్తుంది. వీళ్ళు సాయుధులయి వుండే అవకాశం వుంది. అయితే అంతమాత్రం చేత వీళ్ళు నిజమయిన ఎదురుకాల్పులతో చనిపోయారనుకోనవసరం లేదు. వీళ్ళలో చాలామందిని ఆదమరచి ఉన్న సమయంలో కస్టడీలోకి తీసుకొని కాల్చేసారని పట్టికలోని ఆఖరి కాలమ్ తెలియచేస్తుంది.

మృతులలో 210 మంది (అంటే 42.3 శాతం) రైతులు, రైతాంగ యువకులు, లేక గిరిజన యువకులు. 'ఎన్‌కౌంటర్' మృతులలో అధిక సంఖ్యాకమయిన వర్గం ఇదే. ఇక్కడ 'రైతాంగం' అనే మాటను విస్తృతమయిన అర్థంలో ప్రయోగిస్తున్నాం. భూమి గల రైతులనే కాక భూమి లేని కూలీలను కూడ 'రైతాంగం'లోనే చేర్చాము. ఎందుకంటే ఎన్‌కౌంటర్లు అధికంగా జరిగే వెనుకబడిన తెలంగాణ జిల్లాలలో వ్యవసాయ కూలీలలో చాలామందికి అంతోయింతో భూమి ఉండడం (పట్టా వున్నా లేకపోయినా) అరుదు కాదు. అదే సమయంలో 1 హెక్టారు వరకు భూమి వున్న రైతులు పొట్టగడవడానికి అది సరిపోక కూలి కూడ చేస్తుంటారు.

మృతులలో మరొక 30 మంది పై వర్గానికి సన్నిహిత సంబంధం వున్న గ్రామీణ వ్యవసాయేతర శ్రామిక వర్గానికి చెందినవారు. అంటే గీతకార్మికులు,

రాళ్ళు కొట్టేవారు, పండ్లు అమ్ముకునేవారు, రిక్షా కార్మికులు, ఆటో డ్రైవర్లు, చిల్లర వ్యాపారస్తులు మొదలయినవారు. వీరిలో ఒకరు ఒక తెలుగు దినపత్రిక విలేఖరి (సీరియల్ నెం. 58) కాగా ఒకరు పోలీసు వ్యవస్థలోనే పనిచేసే హోంగార్డు (సీరియల్ నెం. 187). ఈ హోంగార్డు నక్సలైట్ల ఏజెంటుగా పనిచేస్తున్నాడని అనుమానించి పోలీసులు అతనిని చంపారు.

మృతులలో 11 మంది విద్యార్థులు లేక నిరుద్యోగ యువకులు. వారిలో ఒక 6 సంవత్సరాల గిరిజన బాలిక, ఒక 11 సంవత్సరాల గిరిజన బాలుడు కూడ ఉన్నారు. (సీరియల్ నెం. 35). ఒక గిరిజన ఆశ్రమ పాఠశాలలో నక్సలైట్లు అధ్యాపకులతోను విద్యార్థులతోను మాట్లాడుతుండగా పోలీసులు దాడి చేసి విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో ఈ యిద్దరు పాఠశాల విద్యార్థులు చనిపోయారు.

మృతులలో ఎనిమిదిమంది నక్సలైట్లతో సంబంధంలేని ఇతర నేరాలలో అనుమానితులు. అయితే వారిలో కొందరు (సీరియల్ నెం. 68) తాము నక్సలైట్లమని చెప్పుకొని ఉండవచ్చును. ఈ కోవకు చెందిన వ్యక్తులను కూడ ఎన్‌కౌంటర్ల పేరిట చంపి నక్సలైట్లలో ఎందుకు కలుపుతారనేది ప్రశ్నార్థకమే. బహుశా లాకప్పులో ప్రశ్నించే క్రమంలో వారు చనిపోగా, కస్టడీ మరణాన్ని గురించి ఇబ్బందికరమయిన ప్రశ్నలు ఎదుర్కోవాల్సి ఉంటుందని వాళ్ళ శరీరాలలో తూటాలు నింపి ఎన్‌కౌంటర్ మృతులుగా చూపిస్తున్నారేమో.

మృతులలో ఇద్దరు సిపిఐ (ఎం.ఎల్) కు చెందిన ప్రజాప్రతినిధులు. ఒకరు టేకులపల్లి గ్రామ ఉప సర్పంచ్ కాగా ఒకరు టేకులపల్లి మండలం ఉపాధ్యక్షురాలు (సీరియల్ నెం. 20).

మృతులలో 31 మంది ఎవరయినదీ తెలీదు.

నిరాయుధులయిన ఎన్‌కౌంటర్ మృతులంతా ఎవరు? ఈ రైతులు, రైతాంగ యువకులు, గిరిజన యువకులు, ఇతర గ్రామీణ శ్రామికులు, విద్యార్థులు, నిరుద్యోగ యువకులు, ప్రజాప్రతినిధులు ఎవరు?

వీళ్ళంతా నిరుపేద పీడిత వర్గాలకు చెందినవారు. ఈ వర్గాలకు చెందిన 261 మంది (మొత్తంలో 54.4 శాతం) ఎన్‌కౌంటర్ మృతులలో ఇద్దరు తప్ప

మిగిలినవాళ్ళంతా గ్రామాలకు, చిన్న ఊర్లకు చెందినవారే. 261 లో 9 మంది మట్టుకే అగ్రకుల హిందువులు. 15 మంది గిరిజనులు, 10 మంది ముస్లింలు, 227 మంది షెడ్యూల్డు లేక వెనుకబడిన కులాలకు చెందినవారు.

పీడిత వర్గాలకు చెందిన ఈ నిరాయుధ 'ఎన్‌కౌంటర్' మృతులంతా నక్సలైట్ల సానుభూతిపరులుగా లేక మద్దతుదారులుగా అనుమానించబడే వ్యక్తులు. నక్సలైట్లకు ఆశ్రయం ఇస్తారనీ, అన్నం పెడతారనీ, కొరియర్లుగా పనిచేస్తారనీ వాళ్ళగురించి పోలీసులకు అనుమానం. నక్సలైట్ల ప్రోద్బలంతో స్థానికంగా భూస్వాములకు, రాజకీయ నాయకులకు, అధికార యంత్రాంగానికి వ్యతిరేకంగా ఆందోళన చేపడతారని అనుమానం. వీరిలో కొంతమంది నక్సలైట్ పార్టీలకు అనుబంధంగా పనిచేసే కార్మిక రైతాంగ మహిళా సంఘాల కార్యకర్తలు. చాలామంది మాజీ కార్యకర్తలు, పోలీసులకు సరండర్ అయి కోర్టులో కేసులకు హాజరవుతూ సాధారణ జీవితం గడుపుతున్నవారు. అయితే నక్సలైట్లతో ఇంకా తమ సంబంధాలు కొనసాగిస్తున్నారని వీళ్ళగురించి పోలీసులకు అనుమానం.

ఇటువంటి వ్యక్తులను ఇంటినుండి, లేక తమ పని స్థలం నుండి పోలీసులు పట్టుకొని తీసుకొనిపోయి చిత్రహింసలు పెట్టి కాల్చి చంపి 'ఎన్‌కౌంటర్' అంటారు.

ఈ హత్యలకు ఒక ముఖ్యమైన కారణం ప్రతీకారవాంఛ. 1991, 92, 93 సంవత్సరాలలో అనేక సంఘటనలలో నక్సలైట్లు పోలీసులను, సి.ఆర్.పి లేక బి.ఎస్.ఎఫ్ సిబ్బందిని, కాంగ్రెస్ నాయకులను, ఇతర ప్రముఖులను చంపారు. ఇటువంటి సంఘటన ఎప్పుడు జరిగినా పోలీసులు స్థానికంగా నక్సలైట్ల సానుభూతిపరులయిన యువకులను కస్టడీలోకి తీసుకుంటారు. వాళ్లను పై సంఘటన జరిగిన స్థలం దగ్గరే కాల్చి చంపి ఆ సంఘటనకు బాధ్యులయిన సాయుధ నక్సలైట్లతో ఎన్‌కౌంటర్ జరిగిందని కథ చెప్తారు. కథ నమ్మశక్యంగా ఉండేందుకు మృతులకు నక్సలైట్ల యూనిఫారాలు తొడిగి శవం ప్రక్కన ఒక ఆయుధం పెడతారు. ప్రముఖమైన కొన్ని ప్రతీకార సంఘటనలను అనుబంధం నుండి ఉటంకిస్తాము.

1992 సెప్టెంబరు 24న నక్సలైట్లు వరంగల్ జిల్లాలో ఒక బి.ఎస్.ఎఫ్. వ్యాన్‌ను పేల్చేసి 13 మంది జవాన్లను చంపారు. చావు తప్పించుకున్న జవాన్లు

కోపోద్రిక్తులయి పరిసరాలలో పశువులు మేపుతున్న నలుగురు యువకులను అక్కడికక్కడే కాల్చి చంపారు. (సీరియల్ నెం. 174). తరువాత, 1993 ఫిబ్రవరి 13న, సరండరయి కండిషనల్ బెయిల్ మీద పోలీస్ స్టేషన్‌కు క్రమం తప్పకుండ హాజరవుతున్న ఒక యువకుడిని అదే చోటికి తీసుకొచ్చి కాల్చి చంపారు. (సీరియల్ నెం. 204). మళ్ళీ, 1993 ఆగస్ట్ 13న, మరొక ముగ్గురు రైతాంగ యువకులను కస్టడీలోకి తీసుకొని అదే చోటికి తీసుకొచ్చి కాల్చి చంపారు.

అదే జిల్లాలో తాడ్వాయి పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్‌ను నక్సలైట్లు చంపగా దానికి ప్రతీకారంగా పోలీసులు రెండు వేరువేరు సంఘటనలలో నలుగురు రైతాంగ యువకులను కాల్చి చంపారు (సీరియల్ నెం. 70,73).

కరీంనగర్ జిల్లాలో 1993 అక్టోబర్ 12న నక్సలైట్లు సారంగాపూర్ సమీపంలో మందుపాతర పేల్చి ముగ్గురు కానిస్టేబుళ్ళను చంపగా అందుకు ప్రతీకారంగా పోలీసులు ఒక వరుసగా జరిగిన ఎన్‌కౌంటర్లలో 12 మంది రైతులను, రైతాంగ యువకులను పట్టుకొచ్చి కాల్చి చంపారు (సీరియల్ నెం. 264, 265, 236, 268, 269, 270).

మహబూబ్‌నగర్ జిల్లాలో నక్సలైట్లు 1993 నవంబర్ 14న జిల్లా ఎస్.పి.నీ మరికొందరు పోలీసులనూ ఒక మందుపాతర పేల్చి చంపగా దానికి ప్రతీకారంగా పోలీసులు నలుగురు గ్రామస్తులను కస్టడీలోకి తీసుకొని 1993 నవంబర్ 27న కాల్చి చంపారు. (సీరియల్ నెం. 278)

ఇవి ప్రముఖ ప్రతీకార సంఘటనలు మాత్రమే. ఇంకా ఉదాహరణలు అనుబంధంలో చూడవచ్చు.

కొన్ని హత్యలు ఎన్నికల నేపథ్యంలో జరిగాయి. సిపిఐ (ఎం-ఎల్) పార్టీలలో కొన్ని పార్లమెంటు, అసెంబ్లీ తదితర ఎన్నికలలో పాల్గొంటాయి. వాళ్లు ఎప్పుడు పాల్గొన్నా వారి ప్రచార కార్యక్రమాన్ని పోలీసులు హింసాత్మక చర్యల ద్వారా ఆటంకపరుస్తారు. అందులో భాగంగా ఎన్‌కౌంటర్లు కూడ చేస్తారు. సీరియల్ నెం. 20 లోని సంఘటన ఆ కోవకు చెందిన ఒక ఘటన. స్థానిక సిపిఐ (ఎం-ఎల్) శాసనసభ్యుని మద్దతుదార్లయిన గిరిజన ప్రజానీకాన్ని భయభ్రాంతులు చేయడంకోసం జరిపిన ఆ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ప్రజాప్రతినిధులతో సహా అయిదుగురు

చనిపోయారు. దాదాపు అదే సమయంలో కరీంనగర్ జిల్లాలో మరొక సిపిఐ (ఎం–ఎల్) శాసనసభ్యుడు ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల నియోజకవర్గం ప్రాంతంలో కూడ ఒక వరుసగా ఎన్కౌంటర్లు జరిగాయి. (సీరియల్ నెం. 11, 16, 19).

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చాలాకాలంగా నక్సలైట్లకు 'సరెండర్' కమ్మని పిలుపునిస్తూ ఉంది. ఆయుధాలను పోలీసులకు అప్పగించి తమ రాజకీయాలను త్యజించమని ఆహ్వానిస్తూ ఉంది. 'సరెండర్ అయిన వారికి భూమి, అప్పులు, ఉద్యోగాలు మొదలయిన రూపాలలో పునరావాసం ఇస్తానంటూ ఉంది. కానీ నిజానికి సరండర్ అయిన వాళ్ళను పోలీసులు వేధిస్తున్నారు. నక్సలైట్లతో సంబంధాలు కొనసాగిస్తున్నారన్న అనుమానంతో వేధిస్తున్నారు. పోలీసులు చేసే ప్రతీకార హత్యలకు ఈ 'సరండర్ అయిన వ్యక్తులు బలి అవుతున్నారు. సరండర్ అయిన తరువాత క్రమం తప్పకుండ వాళ్ళు పోలీస్ స్టేషన్లో హాజరు కావలసి ఉంటుంది కాబట్టి వాళ్ళను పోలీసులు ఎప్పుడు చంపదలచుకున్నా అందుబాట్లో ఉంటారు.

1993 సంవత్సరంలో ఈ రకంగా ఎన్కౌంటర్లలో హతమయినటువంటి సరెండర్ అయిన వ్యక్తులు చాలామంది ఉన్నారు (ఉదాహరణకు సీరియల్ నెం. 204, 216, 221, 224, 229, 230, 235, 244, 245, 248, 254, 260, 270, 273, 278). 'సరండర్' అయ్యే ఉద్దేశ్యంతో పోలీసుల దగ్గరకు పోయిన వ్యక్తులను పట్టుకొని చంపిన సంఘటనలు కూడ ఉన్నాయి.

## ఎన్కౌంటర్ హత్యలు – చట్టం

'ఎన్కౌంటర్' అనేది పోలీసుల కథనం ప్రకారమే ఆత్మరక్షణలో చేసే హత్య. 'ఎన్కౌంటర్' జరిగిన తరువాత ఆ ఘటనలో పాల్గొన్న పోలీసులు సమీప పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు నమోదు చేస్తారు. ఆ ఫిర్యాదు ఐపిసి సెక్షన్ 307 క్రింద నమోదవుతుంది. (ఆయుధాలకు, పేలుడు పదార్థాలకు సంబంధించిన ఇతర సెక్షన్లు కూడ దీనికి జత అవుతాయి). అంటే నక్సలైట్లు పోలీసులపైన హత్యా ప్రయత్నం చేసారన్న కేసు నమోదవుతుంది. ఆ హత్యా ప్రయత్నం ఫలితంగా పోలీసులకు ప్రాణాపాయం కలిగి ఆత్మరక్షణార్థం ఎదురుకాల్పులు జరిపారనీ నక్సలైట్లు చనిపోయారనీ పోలీసులు ఫిర్యాదు చెప్తుంది.

కానీ చట్టం ప్రకారం అటువంటి ఫిర్యాదును రెండు కేసులుగా నమోదు చేయాలి. ఒకటి సెక్షన్ 307 క్రింద, ఒకటి సెక్షన్ 302 క్రింద. అంటే హత్యా ప్రయత్నం చేసారని నక్సలైట్ల పైన ఒక కేసు, హత్య చేసినందుకు పోలీసులపైన ఒక కేసు పెట్టాలి.

కేవలం అనుమానం మీద కాల్పులు జరిపి చంపే అధికారం పోలీసులకు ఇచ్చే చట్టం ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కటే ఉంది. అది ఆం.ప్ర. కల్లోలిత ప్రాంతాల చట్టం. ఈ చట్టం వర్తించాలంటే సంబంధిత ప్రాంతాన్ని కల్లోలిత ప్రాంతంగా ప్రకటించవలసి ఉంటుంది. అయితే 1990 తరువాత ఈ రాష్ట్రంలో ప్రకటిత కల్లోలిత ప్రాంతాలేవీ లేవు.

కాబట్టి పాలీసులు కాల్పులు జరిపితే దానిని సమర్థించుకోవడానికి రెండే చట్టాలున్నాయి. ఒకటి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని అధ్యాయం 10 లోని సెక్షన్ 129 (2), ఈ అధ్యాయం పౌరభద్రతకూ శాంతికి సంబంధించిన అధ్యాయం. అయితే సెక్షన్ 129(2) క్రింద కాల్పులను సమర్థించుకునేటట్టయితే అదే అధ్యాయంలోని నియమావళిని, పోలీస్ మాన్యువల్‌లోని నియమావళిని తప్పనిసరిగా పాటించవలసి ఉంటుంది. రెండవ మార్గం ఇండియల్ పీనల్ కోడ్‌లోని అధ్యాయం క్రింద సమర్థించుకోవడం. ఆత్మరక్షణలో ఒకరి ప్రాణం తీసే హక్కును సెక్షన్ 100 వివరిస్తుంది.

'ఎన్‌కౌంటర్' హత్యలను సమర్థించుకోవడానికి పోలీసులు పై రెండు మార్గాలలో రెండవ దానిని అనుసరిస్తున్నారు. అంటే ఐపిసిలోని 'ఆత్మరక్షణ' సెక్షన్ క్రింద సమర్థించుకుంటున్నారు. అటువంటప్పుడు సాక్ష్యాధారాల చట్టం సెక్షన్ 105కు వాళ్ళు బద్దులయి ఉండాలి. ఆ సెక్షన్ ప్రకారం ఐపిసి నాలుగవ అధ్యాయంలోని మినహాయింపుల క్రింద తమ నేరాలను సమర్థించుకునేవారు ఆ మినహాయింపు తమకు వర్తిస్తుందని తామే కోర్టుకు నచ్చజెప్పవలసి ఉంటుంది.

కాబట్టి 'ఎన్‌కౌంటర్' ఘటన జరిగినప్పుడు సంబంధిత పోలీసుల పైన ఐపిసి సెక్షన్ 302 క్రింద కేసు పెట్టవలసి ఉంటుంది. వాళ్లను అరెస్టు చేసి కోర్టులో విచారించవలసి ఉంటుంది. ఆత్మరక్షణ చేసుకోవడానికి చంపవలసిన అవసరం ఏర్పడిందని ముద్దాయిలయిన పోలీసులే కోర్టుకు నచ్చచెప్పవలసి ఉంటుంది.

చట్టబద్ధమయిన ఈ పద్ధతిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుసరించడం లేదు. కేవలం సిఆర్‌పిసి సెక్షన్ 176 కింద ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ చేత మెజిస్టీరియల్ విచారణలు జరిపించి ఊరుకుంటున్నారు. ఈ విచారణల నివేదికలను బహిరంగపరచరు. వాటిపైన చర్య తీసుకోరు. చాలా సందర్భాలలో పోలీసులు సాక్షులను బెదిరించి విచారణ ఎదుట హాజరు కానివ్వరు. ఒకవేళ సాక్షులు వాంగ్మూలం ఇచ్చినా విచారణ నివేదిక పైన చర్య తీసుకోరు. 285 ఎన్‌కౌంటర్ ఘటనల్లోకీ రెండిటి మీద మాత్రమే న్యాయవిచారణ జరిపించారు.

అత్యధికంగా నిరుపేద, పీడిత కుటుంబాలకు చెందిన మృతుల బంధువులు ఈ విధంగా న్యాయానికి దూరంకావడమే కాక, జీవనాధారాన్ని కూడ కోల్పోతున్నారు. ఎందుకంటే మృతులలో నక్సలైట్ కార్యకర్తలను మినహాయిస్తే మిగిలిన వారంతా తమ కుటుంబాలను పోషించేవారే.

పై వివరణను దృష్టిలో ఉంచుకొని గౌరవ కమిషన్ ఈ క్రింది చర్యలు చేపట్టాలని కోరుతున్నాం.

(i) అనుబంధంలో ఏకరవు పెట్టిన అన్ని 'ఎన్‌కౌంటర్' ఘటనలపైన జరిగిన మెజిస్టీరియల్ విచారణల నివేదికలు తెప్పించి, వాటిని పరిశీలించి, వాటిపైన చర్య తీసుకొమ్మని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించాలి.

(ii) అనుబంధంలో పేర్కొన్న ఎన్‌కౌంటర్ ఘటనల పైన సాక్ష్యాలు సేకరించడానికి ఒక విచారణ కమిషన్‌ను నెలకొల్పాలి.

(iii) ఎన్‌కౌంటర్ మృతుల (వారు నక్సలైట్ కార్యకర్తలయినా కాకున్నా) కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించే విషయంలో ప్రమాణాలు ఏర్పరచుకోవడానికి ప్రభుత్వానికి తగు సూచనలు ఇవ్వాలి.

(iv) ఇటువంటి శాసనేతర మరణకాండను నిరోధించేందుకు పోలీసు శాఖకు స్పష్టమయిన సూచనలు చేయాలి.

(v) ఎన్‌కౌంటర్ ఘటనలను ఐపిసి సెక్షన్ 302 క్రింద హత్యకేసులుగా నమోదు చేసుకొని తమంతట తామే విచారణ జరిపించే విషయంలో స్థానిక న్యాయస్థానాలకు తగు సూచనలు ఇవ్వాలి.

స్వేచ్ఛ మాసపత్రిక
మార్చి – ఏప్రిల్ 1994

# న్యాయమూ లేదు, విచారణా లేదు రెండోసారి రసూల్ హత్య

**1991** డిసెంబర్ 28 తెల్లవారుజామున రంగారెడ్డి జిల్లా ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మసీదుగూడ గ్రామ శివారులోని ఒక పాడుబడిన కట్టడంలో జరిగిన ఒక 'ఎన్‌కౌంటర్'లో ఇద్దరు గుర్తు తెలియని పీపుల్స్‌వార్ నక్సలైట్లు చనిపోయారనీ, మరికొందరు తప్పించుకొని పారిపోయారనీ పోలీసులు ప్రకటించారు. శవాలను ఫోటో తీయడానికి ప్రయత్నించిన పత్రికా ఫోటోగ్రాఫర్లను అనుమతించలేదు. తామే నేలమీద పడి ఉన్న శవాలను ముఖం స్పష్టంగా కనపడకుండా ఒక పక్క నుండి ఫోటో తీసి పత్రికలకు ఇచ్చారు. 28వ తేదీ సాయంత్రం శవపరీక్ష చేయించి 29 సాయంత్రం 'గుర్తు తెలియని' ఆ రెండు శవాలను పోలీసులే దహనం చేసేసారు. అప్పటికే మృతుల పేర్లు నెమ్మదిగా బయటకు వచ్చాయి. ఒకరు 'ఉదయం' దినపత్రిక విలేకరి గులాం రసూల్ అనీ, రెండవ వ్యక్తి హైదరాబాద్ నివాసి అయిన విజయ ప్రసాదరావు అనే నిరుద్యోగ యువకుడనీ 29వ తేదీ మధ్యాహ్నానికే వారి బంధు మిత్రులు అనుమానించసాగారు. 29 సాయంత్రం శవాలను దహనం చేసిన పోలీసులు 30వ తేదీ పొద్దున్న పేపర్లలో మృతుల పేర్లు వచ్చినాక, మృతులలో ఒకరు 'సత్యం దళ సభ్యుడయిన గులాం రసూల్' అని ఆ రాత్రి ప్రకటించారు. ఆ తరువాత రసూల్ విలేకరి ముసుగులో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సత్యం దళం నక్సలైట్ అనీ, అతని మారు పేరు జగన్ అనీ ప్రకటించారు.

విలేఖరుల సంఘాలే కాక వివిధ రాజకీయ పార్టీలు, పౌరహక్కుల సంస్థలు, ప్రజలు చాలా ఆందోళన చేయగా రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ టి.ఎల్.ఎన్. రెడ్డిగారిని

టి.ఎల్.ఎన్. రెడ్డి కమిషన్ నివేదికలో ఏముంది?



# న్యాయమూ లేదు, విచారణా లేదు

# రెండోసారి రసూల్ హత్య




APUWJ & APCLC

ఏక సభ్య విచారణ కమిషన్‌గా 1992 ఫిబ్రవరి 19వ తేదీన నియమించింది. టి.ఎల్.ఎన్. రెడ్డి కమిషన్ 39 మంది సాక్షులనూ, అనేక లిఖిత పత్రాలనూ విచారించి తన నివేదిక ప్రభుత్వానికి సమర్పించింది. ప్రభుత్వం దానిని ఆమోదించి 1994 ఫిబ్రవరి నెలలో అసెంబ్లీ ముందు పెట్టింది. నివేదిక మీద చర్చ జరగాలని ప్రతిపక్షాలు పట్టుబట్టినా ప్రభుత్వం అనుమతించలేదు.

టి.ఎల్.ఎన్. రెడ్డి కమిషన్ ఎటువంటి సంకోచం లేకుండ ఈ క్రింది విషయాలు నిర్ధారించింది.

1. మసీదుగూడ 'ఎన్‌కౌంటర్' పూర్తిగా పోలీసులు చెప్పినట్టే జరిగింది.

2. గులాం రసూల్, విజయ ప్రసాదరావులు ఇద్దరూ నక్సలైట్లే. రసూల్ జగన్ అనే పేరుతో వ్యవహరిస్తూ వ్యాపారస్తులను బెదిరించి నక్సలైట్ల కోసం డబ్బులు వసూలు చేసేవాడు.

3. రసూల్ పట్ల పోలీసులకు వ్యతిరేకత ఉందని చెప్పడానికి వివిధ సాక్షులు ప్రవేశపెట్టిన సాక్ష్యాలలో కొన్ని కల్పితమైనవి, కొన్ని నిరాధారమైనవి, కొన్ని అప్రధానమైనవి.

4. 'ఎన్‌కౌంటర్' గురించి పోలీసులు చెప్పిన కథనం అసంబద్ధం అని రుజువు చేయడానికి ప్రవేశ పెట్టిన సాక్ష్యాలు కూడ అంతే. అందులో కొంత పూర్తిగా కల్పితమైనది, కొంత నిరాధారమైనది, కొంత లెక్కలోకి తీసుకోదగినది కాదు.

టి.ఎల్.ఎన్. రెడ్డి కమిషన్ నివేదిక బయటకు రాగానే రాష్ట్రంలో చాలా సంచలనం రేగింది. ప్రతిపక్ష పార్టీలూ, విలేఖరులూ, పౌరహక్కుల సంస్థలూ ఇది ఆమోదించదగ్గ నివేదిక కాదని నిరసన తెలిపాయి. ప్రభుత్వం ఈ నివేదికను తిరస్కరించి కొత్తగా న్యాయ విచారణ జరిపించాలని కోరాయి. ప్రభుత్వం మట్టుకు ససేమిరా అనింది. నివేదికను తిరస్కరించేది లేదనింది. మళ్లీ న్యాయ విచారణ జరిపించేది లేదనింది.

అసలు టి.ఎల్.ఎన్.రెడ్డి కమిషన్ ఎదుట నమోదయిన సాక్ష్యం ఏమిటి? దానిని కమిషన్ ఏ విధంగా అర్థం చేసుకుంది? ఏ విధంగా వ్యాఖ్యానించింది? న్యాయ విచారణ కమిషన్ సాక్ష్యాలు సేకరించడానికి అన్ని ప్రయత్నాలూ చేయాలనీ, నమోదయిన

సాక్ష్యాన్ని హేతుబద్ధంగా వ్యాఖ్యానించాలనీ ఆశిస్తాము. టి.ఎల్.ఎన్. రెడ్డి కమిషన్ ఈ ప్రమాణాలను అనుసరించి నడుచుకుందా? కమిషన్ బాధితుల అభిప్రాయలతో పూర్తిగా ఏకీభవించాలని ఎవ్వరూ కోరుకోరు. అట్లా కోరుకోవడం న్యాయం కూడ కాదు. కానీ నమోదయిన సాక్ష్యానికి కట్టుబడి ఉండాలని కోరుకుంటాం. సాక్ష్యాలు సేకరించడంలోను, వాటిని అర్థం చేసుకోవడంలోను నిష్పాక్షికంగా, హేతుబద్ధంగా వ్యవహరించాలని కోరుకుంటాం. అది న్యాయమైన కోరిక. ఈ దృష్టితో టి.ఎల్.ఎన్. రెడ్డి కమిషన్ నివేదికను పరిశీలించడం ఈ ప్రచురణ ఉద్దేశ్యం. కమిషన్ ఎదుట నమోదయిన సాక్ష్యాల ఆధారంగానే ఈ నివేదికను పరిశీలిస్తాము. నమోదు కాని విషయాలను ప్రమాణంగా తీసుకొని నివేదికను విమర్శించడం భావ్యం కాదు.

1. కోటగాని ప్రకాశ్ అనే కారు డ్రైవర్ కమిషన్‌కు వివరంగానే తన వాంగ్మూలం ఇచ్చాడు. నగరంలో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న ప్రకాశ్‌కు అతని సమీప బంధువు (తమ్ముడి బావమరిది) అయిన ఒక వ్యక్తితో ఘర్షణ ఉండింది. అతను ప్రకాశ్‌కు నాలుగు వేల రూపాయలు ఇవ్వవలసి ఉండింది. ఇవ్వకపోగా, అడిగినందుకు గూండాలను పెట్టి దాడి చేయించాడు, బెదిరించాడు. ఆ డబ్బు అడగవద్దంటూ గూండాలు 1991 జూలై 5వ తేదీన ప్రకాశ్‌పైన దాడి చేసి కత్తితో పొడిచి గాయపరిచారు. ఈ విషయం ప్రకాశ్ అదే రోజు మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేసాడు. వాళ్లు కేసు నమోదు చేసుకోక పోయేసరికి అతను ఆగస్ట్ 28న రంగారెడ్డి జిల్లా ఎస్.పి. భాస్కర రెడ్డిని కలిసి మేడ్చల్ పోలీసుల పైన ఫిర్యాదు చేసాడు.

ఇక్కడి దాకా ప్రకాశ్ సాక్ష్యాన్ని కమిషన్ ఎదుట మేడ్చల్ ఎస్.ఐ. రంగారెడ్డి, జిల్లా ఎస్.పి. భాస్కర రెడ్డి ధృవీకరించారు. అయితే ప్రకాశ్ ఫిర్యాదుపైన చర్య తీసుకోనందుకు వాళ్లు కమిషన్‌కు రెండు కారణాలు చెప్పారు. ప్రకాశ్‌కు గూండాల దాడిలో కలిగిన గాయం స్వల్పమైనది. అది ఐ.పి.సి సెక్షన్ 323 కిందికి వస్తుంది. సెక్షన్ 323 కాగ్నిజబుల్ నేరం కాదు. అంతేకాక ప్రకాశ్ తన గాయాన్ని పరీక్ష చేయించుకోవడానికి ఆస్పత్రికి పోయేందుకు నిరాకరించాడు. అందువల్ల తాము చర్య తీసుకోలేదని పోలీసులు తమ వాంగ్మూలంలో చెప్పారు.

పోలీస్ స్టేషన్ దాకా తానే పోయి ఫిర్యాదు చేసిన ప్రకాశ్ ఆస్పత్రికి పోవడానికి ఎందుకు నిరాకరిస్తాడు? ఆస్పత్రికి పోవడానికి నిరాకరించిన వాడు మళ్లీ ఎస్.పి.

దగ్గరికి పోయి తన ఫిర్యాదు పైన మేడ్చల్ పోలీసులు చర్య తీసుకోలేదని గొడవ ఎందుకు చేస్తాడు? ఈ ప్రశ్నలు కమిషన్ వేసుకోలేదు. ప్రకాశ్ ఫిర్యాదు పైన పోలీసులు చర్య తీసుకోకపోవడం పూర్తిగా సమర్థనీయం అనే అభిప్రాయానికి కమిషన్ వచ్చింది.

ప్రకాశ్‌కు ఆ దాడిలో జరిగిన గాయం చాలా స్వల్పమయినది కాబట్టి అది అతిచిన్న సంఘటన అనీ, కాగ్నైజబుల్ నేరం కాదనీ, పోలీసులు దాని పైన చర్య తీసుకోక పోవడం సమర్థనీయమేననీ కమిషన్ తన నివేదికలో ఒకే పేజీలో రెండు సార్లు ప్రకటించింది. కానీ కత్తితో గాయం చేస్తే, అది చిన్న గాయమే అయినా కాగ్నైజబుల్ నేరమేనని చట్టం అంటుంది (ఐ.పి.సి లోని సెక్షన్ 323 కాక 324 కిందికి వస్తుంది), దానికి శిక్ష 3 ఏళ్లు. దాని మీద పోలీసులు తప్పక కేసు రిజిస్టర్ చేయాలి. అంతేకాక, ప్రకాశ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది కేవలం ఆ స్వల్పమైన గాయం గురించి కాదు. తనకు రావలసిన బకాయి నాలుగు వేలు అడగవద్దని బెదిరించడం కోసం గూండాలను పెట్టి దాడి చేయించారని ప్రకాశ్ ఫిర్యాదు. ఇటువంటి దాడిలో కలిగిన గాయం స్వల్పమే అయినా (అసలు గాయమే అవక పోయినా) ఆ రకమైన బెదిరింపు చట్టంలో 'క్రిమినల్ ఇంటిమిడేషన్' (ఐ.పి.సి సెక్షన్ 506) అనే నేరం. దీనికి రెండేళ్లు శిక్ష అంటే ప్రకాశ్‌పైన జరిగిన దాడి చట్టం దృష్టిలో సెక్షన్ 324, 506 ల క్రింద నేరం. వీటిలో మొదటిది కాగ్నైజబుల్ నేరం. ఒక దానికి మూడేళ్లు గరిష్ట శిక్ష, రెండవ దానికి రెండేళ్లు గరిష్ట శిక్ష .

ఇటువంటి కేసులో ఫిర్యాదుపైన చర్య తీసుకోకపోవడం 'సమర్థనీయమే'నని ఒక రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి అభిప్రాయపడడం సబబేనా?

2. దీనికీ మసీదుగూడ 'ఎన్‌కౌంటర్'కూ సంబంధం ఏమిటంటారేమో. ప్రకాశ్ తన వాంగ్మూలంలో ఇంకా చాలా విషయాలు చెప్పాడు. వాటిని కమిషన్ తేలికగా కొట్టి పారేయకపోతే మసీదుగూడ ఎన్‌కౌంటర్ నిజమైన ఎన్‌కౌంటర్ అనే అభిప్రాయానికి రాగలిగేది కాదు.

తనకు జరిగిన అన్యాయాన్ని గురించి ఎస్.పి.కి ఆగస్ట్ 28న ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకపోయేసరికి ప్రకాశ్ తన సమస్యను గులాం రసూల్ దగ్గరికి తీసుకొనిపోయాడు. గులాం రసూల్‌తో తనకు పరిచయమేమీ లేదనీ, కాకతాళీయంగా రోడ్లో కలిసాననీ ప్రకాశ్ తన వాంగ్మూలంలో చెప్పాడు.

గులాం రసూల్ ప్రకాశ్‌కు న్యాయం చేకూర్చడానికి చాలా కృషి చేసాడు. అతనితోపాటు మేడ్చల్ పోలీసు స్టేషన్‌కు పోయి అతని ఫిర్యాదు పైన చర్య ఎందుకు తీసుకోలేదని అడిగాడు. 1991 డిసెంబర్ 26వ తేదీన (అంటే ఎన్‌కౌంటర్‌కు రెండు రోజులు ముందు) రసూల్, ప్రకాశ్ కలిసి రంగారెడ్డి జిల్లా ఎస్.పి భాస్కరరెడ్డి దగ్గరకు పోయారు. అక్కడ రసూల్‌కూ భాస్కరరెడ్డికీ వాగ్వివాదం జరిగింది. ప్రకాశ్ పైన దాడి చేసిన గూండాలు కొత్తదాసు మనుషులు కాబట్టి పోలీసులు చర్య తీసుకోవడం లేదని రసూల్ ఆరోపించాడు. రసూల్‌కు నక్సలైట్లతో సంబంధాలున్నాయనీ, అండర్ గ్రౌండ్ నక్సలైట్ల ఆచూకీ తెలుసనీ ఎస్.పి ఎదురు ఆరోపణ వేసాడు. తరువాత రసూల్, ప్రకాశ్ రాష్ట్ర డి.జి.పి. ప్రభాకరరావు దగ్గరకు పోయి రంగారెడ్డి జిల్లా పోలీసుల వైఖరి గురించి ఫిర్యాదు చేసారు. డి.జి.పి. వారి సమక్షంలోనే ఎస్.పి. భాస్కరరెడ్డికి ఫోన్ చేసి మందలించాడు. మళ్లీ రసూల్, ప్రకాశ్ ఎస్.పి. దగ్గరకు పోయారు. మళ్లీ ఘర్షణ జరిగింది. ఒకరి అంతు ఒకరు చూసుకుంటామని బెదిరించుకున్నారు.

ఎస్.పి.కి రసూల్‌కు ఘర్షణ అయిన సమయంలో సరూర్‌నగర్ డి.ఎస్.పి రాజయ్య కూడ అక్కడ ఉన్నాడు. ఎన్.టి.ఆర్ నగర్ భూముల విషయంలో ఈ పోలీస్ అధికారి నిర్వర్తించిన పాత్ర గురించి గులాం రసూల్ రాసిన రిపోర్టుల విషయాన్ని డి.ఎస్.పి రాజయ్య ప్రస్తావించి కోపంగా మాట్లాడాడు. రసూల్‌ను నక్సలైట్ అని డి.ఎస్.పి. దూషించాడు. కొంత ఘర్షణ జరిగిన తరువాత మరుసటి రోజు (అంటే డిసెంబరు 27న) ప్రకాశ్ మేడ్చల్ పోలీస్ స్టేషన్‌కు పోతే అతని ఫిర్యాదు నమోదు చేసుకొని కేసు చేపట్టడం జరుగుతుందని ఎస్.పి చెప్పాడు.

ప్రకాశ్ వాంగ్మూలం నుండి కమిషన్ కొన్ని ప్రశ్నలు సహజంగానే వేసుకోవలసి ఉంటుంది. డిసెంబర్ 26కు పూర్వం రసూల్‌తో భాస్కరరెడ్డికి, రాజయ్యకూ పరిచయం లేదని ఒకవేళ అనుకున్నా 26వ తేదీన అంతసేపు రసూల్‌తో అంత దీర్ఘంగా వాగ్వివాదం జరిగిన తరువాత 28వ తేదీన చనిపోయిన రసూల్‌ను వాళ్లు 'గుర్తు తెలియన తీవ్రవాది' అని ఎట్లా అనగలిగారు? జిల్లా ఎస్.పికీ, డి.ఎస్.పికీ ముఖ పరిచయం ఉన్న వ్యక్తి 'గుర్తు తెలియని తీవ్రవాది'గా మట్టిలో కలవడం ఎట్లా సాధ్యమయింది? పోలీసుల కథనం మొత్తం అసంబద్ధం అని నమ్మడానికి ఇదొక్కటి చాలదా?

కానీ కమిషన్ ప్రకాశ్ చెప్పిన విషయాన్ని నమ్మలేదు. డిసెంబర్ 26వ తేదీన జరిగినట్టు ప్రకాశ్ చెప్పిన విషయాలేవీ జరగలేదని కమిషన్ నిర్ధారించింది.

ఎందుకు? డిసెంబర్ 26న ప్రకాశ్ చెప్పిన సంఘటన అసలు జరగనేలేదని ఎస్.పి భాస్కర్ రెడ్డి, డి.ఎస్.పి రాజయ్య కమిషన్‌కు వాంగ్మూలం ఇచ్చారు. తాము అసలు గులాం రసూల్ అనే విలేఖరిని ఎరుగనే ఎరుగమని అన్నారు. కమిషన్ వాళ్ల వాంగ్మూలాలను నమ్మదలచుకుంది. ప్రకాశ్ వాంగ్మూలాన్ని నమ్మదలచుకోలేదు.

ఎందుకు? ప్రకాశ్ వ్యక్తిత్వం మంచిది కాదనీ, అతను నీతివంతుడు కాడనీ ప్రకాశ్ సోదరుడు సదానందం అనే వ్యక్తి స్వయంగా కమిషన్ ఎదుట వాంగ్మూలం ఇచ్చాడంట. టి.ఎల్.ఎన్.రెడ్డి కమిషన్ విచారణ జరుగుతూ ఉందని కానీ, ప్రకాశ్ ఆ కమిషన్ ఎదుట వాంగ్మూలం ఇచ్చాడని కానీ, ప్రకాశ్ వ్యక్తిత్వం మంచిదో చెడ్డదో తెలుసుకొనే అవసరం, తెలుసుకోవాలన్న కోరిక ఆ కమిషన్‌కు ఉంటుందని కానీ ఆ సదానందానికి తెలిసే అవకాశం లేదు కాబట్టి అతనిని కమిషన్ స్వయంగానయినా పిలిపించుకొని ఉండాలి లేదా పోలీసులు తీసుకొచ్చి ఉండాలి.

అదే విధంగా రాజయ్య, భాస్కరరెడ్డి వ్యక్తిత్వాలకు సర్టిఫికేట్లు ఇచ్చే వారిని పిలిపించుకోవాలనే ఆలోచన మట్టుకు కమిషన్‌కు వచ్చినట్లు లేదు. వాళ్ల మాటలను ఎటువంటి 'క్యారక్టర్ సర్టిఫికేట్' లేకుండానే కమిషన్ నమ్మదలచుకుంది.

అంతే కాదు, ప్రకాశ్‌కు డబ్బు విషయంలో ఘర్షణ ఉండింది ఈ సదానందం బావమరిదితోనే. తనపైన జరిగిన దాడికి పూర్వ రంగంగా ప్రకాశ్ చెప్పిన కథనానికి పూర్తిగా విరుద్ధమైన కథనం సదానందం చెప్పాడు. మూడవ సాక్ష్యమేమీ లేకుండ కమిషన్ సదానందాన్ని నమ్మింది. ఎందుకు నమ్మింది?

అక్కడితో కమిషన్ వ్యాఖ్యానాలు ఆగిపోలేదు. ఒక చిన్న విషయంలో ప్రకాశ్ వంటి అర్భకుడు ఇచ్చిన చిన్న ఫిర్యాదును గులాం రసూల్ వంటి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివి వివిధ పత్రికలలో విలేఖరిగా పనిచేసిన వ్యక్తి అంతగా పట్టించుకొని ఉంటాడంటే నమ్మశక్యం కాదని కమిషన్ నిర్ధారించింది. ప్రకాశ్ అతనికి బంధువు కాదు. స్నేహితుడు కాదు. అటువంటి వాడికి సంబంధించిన చిన్న ఫిర్యాదును డి.జి.పి దాకా గులాం రసూల్ తీసుకుపోయి ఉంటాడంటే నమ్మలేకుండా ఉన్నానని జస్టిస్ టి.ఎల్.ఎన్. రెడ్డి గారు అంటారు.

కొత్తదాసు గూండాల దాడిలో ప్రకాశ్‌కు తగిలిన గాయం చిన్నదే అయినా ఆ విషయం చిన్నది కాదు. ప్రకాశ్ దృష్టికి చిన్నది కాదు. రసూల్ దృష్టికీ చిన్నది కాదు. 4,000 రూపాయల బకాయి ఒక కారు డ్రైవర్‌కు చిన్న విషయం కాదు. ఒక అండర్ వరల్డ్ గుండాకు భయపడి, లేదా అతనితో లాలూచీ పడి పోలీసులు చట్టపరంగా తాము తీసుకోవలసిన చర్యలు తీసుకొనక పోవడం ఒక విలేఖరి దృష్టిలో, ఒక ప్రజాస్వామికవాది దృష్టిలో చిన్న విషయం కాదు. దాని గురించి రసూల్ గొడవ చేయడంలో ఆశ్చర్య పోవలసిందేమీ లేదు.

అంతే కాదు, ఎవరికయినా ఏదయినా అన్యాయం జరిగితే తన శాయశక్తులా న్యాయం కోసం కృషి చేసే స్వభావం రసూల్‌కు ఉండిందని పలువురు సాక్షులు వాంగ్మూలం ఇచ్చారు. పోలీసులు రసూల్ 'నక్సలైట్' అని రుజువు చేయడానికి ప్రవేశ పెట్టిన సాక్ష్యాలను సక్రమంగా అర్థం చేసుకుంటే వాటి భావం కూడా ఇదే. అయినప్పటికీ ప్రకాశ్ విషయంలో రసూల్ అంతటి ఆసక్తి తీసుకొని ఉండడం నమ్మశక్యంగా లేదని కమిషన్ భావించింది. అన్యాయం పట్ల నిరసన, కష్టాలలో ఉన్న వారి పట్ల సానుభూతి, సహాయతత్పరత రసూల్‌కు ఉండేవని సాక్షులు చెప్పినప్పటికీ, ఆ గుణాలు అతనిలో ఉండి ఉండవనీ ప్రకాశ్ చెప్పింది అబద్ధమే అయి ఉండాలనీ కమిషన్ ఏ ఆధారాలతో నిర్ణయించింది? ఎందుకు నిర్ణయించింది?

3. 1991 మే 21న తమిళనాడులో రాజీవ్ గాంధీని ఎవరో హత్య చేయగా మన రాష్ట్రంలో అనేక చోట్ల కాంగ్రెస్ వారు విధ్వంసానికీ, దొమ్మీలకూ పాల్పడ్డారు. అప్పట్లో గులాం రసూల్ భువనగిరిలో విలేకరిగా ఉన్నాడు. భువనగిరిలో పోలీసులు కాంగ్రెస్ వారి విధ్వంసాన్ని ఎదుర్కొనే పేరుతో సెక్షన్ 144 ప్రకటింపజేసి జనాన్ని చెదరగొట్టసాగారు. ఆ లాఠీచార్జీలో ఒక పేద రిక్షావాలా తీవ్రంగా గాయపడ్డాడు. రసూల్ ఆ రిక్షా అతన్ని ఒక ప్రభుత్వ జీపులో ఆస్పత్రికి తీసుకుపోయి, అతను ఆస్పత్రిలో చనిపోగా అతని శవాన్ని తీసుకొచ్చి సి.ఐ సుదర్శన రెడ్డి కార్యాలయంలో పడేసి సి.ఐతో ఘర్షణకు దిగాడు. ఒక పేదవాడి ప్రాణాన్ని నిష్కారణంగా తీసారని గొడవ పెట్టుకున్నాడు. సుదర్శన రెడ్డి రసూల్‌ను నక్సలైట్ అని దూషించాడు. ఈ ఉదంతం రసూల్ తండ్రి గులాం ముస్తఫా కమిషన్‌కు ఇచ్చిన వాంగ్మూలంలో ఉంది. పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి వివిధ పత్రికలలో విలేకరిగా పనిచేసిన గులాం

రసూల్ తనకు స్నేహితుడు, బంధువు కాని ఒక దిక్కు మాలిన రిక్షావాడి చావు గురించి వార్త రాసి ఊరుకోకుండ ఇంత గొడవ ఎందుకు పెట్టుకున్నాడు?

4. ఆలేరు మండలం టంగుటూరు గ్రామ సర్పంచ్ అరుణ కమిషన్‌కు తన వాంగ్మూలం ఇచ్చింది. ఆమె భర్తను పీపుల్స్‌వార్ నక్సలైట్లు చంపిన తరువాత ఆమె అతని స్థానంలో సర్పంచ్ అయింది. ఆమె భర్త సర్పంచ్‌గా ఉండగా గ్రామ పనుల కోసం ప్రభుత్వ నిధి నుండి కొంత డబ్బు తీసుకున్నాడు. దానినతను సక్రమంగానే వినియోగించాడు. కానీ అకౌంట్లు పూర్తిగా సమర్పించక ముందే చనిపోయాడు. దీని విషయంలో ఆడిటర్లు గొడవ పెట్టగా వాళ్ళకు సర్ది చెప్పడానికి రసూల్ అరుణకు చాలా సహాయం చేసాడు. తన సమయాన్ని, తనకున్న పరపతినీ ఆమెకు సహాయం చేయడానికి వినియోగించాడు. పీపుల్స్‌వార్ మనిషిగా చెప్పబడుతున్న గులాం రసూల్ ఆ పార్టీవాళ్లు చంపిన వ్యక్తి భార్యకు ఇంతగా సహాయం ఎందుకు చేసాడు?

గులాం రసూల్ వ్యక్తిత్వాన్ని గురించి తన ఎదుట నమోదయిన ఈ సాక్ష్యాన్ని కమిషన్ లెక్కలోకి తీసుకోకుండా, ముక్కు ముఖం తెలియని కారు డ్రైవర్ ప్రకాశ్‌కు సహాయం చేయడానికి రసూల్ అంత శ్రమ తీసుకొని ఉంటాడనుకోవడం అసంబద్ధం అని నిర్ణయించింది. కాబట్టి డిసెంబర్ 26వ తేదీన ఎస్.పి. భాస్కర రెడ్డితోనూ, డి.ఎస్.పి రాజయ్యతోనూ రసూల్‌కు జరిగినట్టు ప్రకాశ్ చెప్పిన భేటీ అబద్ధం అని కమిషన్ నిర్ణయించింది. అందువల్ల రసూల్ 'గుర్తు తెలియని తీవ్రవాది' ఎట్లా అయ్యాడన్న ప్రశ్న వేసుకోలేదు.

5. ప్రకాశ్ వాంగ్మూలం అక్కడితో అయిపోలేదు. ఎస్.పి చెప్పినట్టు డిసెంబర్ 27వ తేదీ మధ్యాహ్నం మేడ్చల్ పోలీస్ స్టేషన్‌కు పోదామని అతను తయారయ్యాడు. రసూల్ వస్తాడని ఎదురు చూస్తున్నాడు. అంతలో మేడ్చల్ పోలీస్ స్టేషన్ నుండి ఇద్దరు కానిస్టేబుళ్లు వచ్చి ప్రకాశ్‌ను మేడ్చల్ రమ్మన్నారు. అక్కడ అతనిని రాత్రి 11-00 గంటల దాకా ఊరికే కూర్చోపెట్టారు. ఆ సమయంలో మేడ్చల్ ఎస్.ఐకి ఫోన్ వచ్చింది. అతను ఫోన్‌లో మాట్లాడిన తరువాత ప్రకాశ్‌ను పిలిచి అతని చేత బలవంతంగా కొన్ని వాక్యాలు రాయించుకునే ప్రయత్నం చేసాడు. ప్రకాశ్ ఒప్పుకోక పోతే పోలీసులు బాగా హింసించారు. అప్పటికి తన కేసు విషయంలో ప్రకాశ్ చాలాసార్లు ఆ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఉండడం వల్ల ఆ స్టేషన్ రైటర్‌తో ప్రకాశ్‌కు

స్నేహం ఏర్పడింది. ఎస్.ఐ రాయమన్నది రాయకపోతే అనవసరంగా ప్రాణాలు పోతాయని ఆ రైటర్ ప్రకాశ్‌ను సానుభూతిగా హెచ్చరించాడు. ఇంక చేసేది లేక ప్రకాశ్ ఈ కింది వాక్యాలు రాసి సంతకం చేసాడు :

తేదీ. 27-12-1991

*శ్రీయుత గౌరవనీయులైన*
*మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ గారికి,*
*రంగారెడ్డి జిల్లా*

*అయ్యా,*

*నేను కె. ప్రకాశ్ వ్రాయుట ఏమనగా 'ఉదయం' పత్రికా విలేఖరి గులాం రసూల్ నక్సలైటు. గులాం రసూల్‌కు మూడు హత్యలతో సంబంధం ఉంది. వారి పేర్లను కింద రాయుచున్నాను.*

*1. ధర్మా విఠల్ రెడ్డి*
*2. హయగ్రీవాచారి*
*3. కృష్ణమాచారి*
*4. రసూల్ మారు పేరు జగన్.*

ఇట్లు
*కె. ప్రకాశ్.*

ఇది రాసి ఇచ్చిన తరువాత ప్రకాశ్‌ను ఇంటికి పంపించారు. 28 తెల్లవారుజామున జరిగిన 'ఎన్‌కౌంటర్' కథనం 29న పేపర్లలో వచ్చింది. కాని మృతులు పేర్లు రాలేదు. చనిపోయిన వారిలో రసూల్ ఒకడు అన్న సంగతి 30వ తేదీ పేపర్లలో వచ్చింది. ఆ తరువాత రసూల్ నక్సలైట్ అని, అతనికి అనేక నేరాలతో సంబంధం ఉందని పోలీసులు ప్రకటించారు. కారు డ్రైవర్ ప్రకాశ్ గాభరాపడి మేడ్చల్ పోలీస్ స్టేషన్‌కు పోయి తాను రాసి ఇచ్చిన కాగితం ఇమ్మని రైటర్‌ను అడిగాడు. కాగితం ఇవ్వలేను కానీ జిరాక్స్ కాపీ కావాలంటే తీసుకొమ్మని రైటర్ ప్రకాశ్‌కు దాని జిరాక్స్ కాపీ ఇచ్చాడు. ఆ జిరాక్స్ కాపీని ప్రకాశ్ టి.ఎల్.ఎన్. రెడ్డి కమిషన్‌కు సమర్పించాడు.

ఈ వాంగ్మూలం 'ఎన్‌కౌంటర్' కథనాన్ని గురించి అనేక ప్రశ్నలు లేవనెత్తుతుంది. పోలీసులు ప్రకాశ్ చేత బలవంతంగా ఆ కాగితం ఎందుకు రాయించుకున్నారు? మరుసటి రోజు పొద్దున 'జరగబోయే' ఎదురుకాల్పుల గురించి ముందే కలగన్నారా? లేకపోతే అప్పటికే (అంటే 27వ తేదీ రాత్రికే) రసూల్ పోలీసుల కస్టడీలో ఉన్నాడా?

కానీ కమిషన్ ప్రకాశ్ వాంగ్మూలంలోని ఇతర విషయాల లాగ ఈ విషయాన్ని కూడ నమ్మదలచుకోలేదు. 'ఇది పూర్తిగా అబద్ధం అని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు' అని జస్టిస్ టి.ఎల్.ఎన్. రెడ్డి ప్రకటించారు. ఎందువల్ల?

'ఒక చిన్న విషయంలో ఎస్.పి. దాకా పోయి గొడవ పెట్టుకున్న వ్యక్తి నుండి బుద్ధి ఉన్న పోలీసులు ఎవరూ ఇటువంటి పత్రం రాయించుకోరు. దాని వల్ల ఒనగూడే ప్రయోజనం ఏమీ లేదు. ధర్మా విఠల్ రెడ్డి, హయగ్రీవాచారి, కృష్ణమాచారిల హత్య కేసులతో మేడ్చల్ పోలీసులకు ఎటువంటి సంబంధం లేదు. అవి వరంగల్ జిల్లాలో జరిగాయి. వాటిని వరంగల్ పోలీసులు పరిశోధిస్తున్నారు. పైగా ఈ పత్రం జిరాక్స్ కాపీని ప్రకాశ్ మేడ్చల్ పోలీస్ స్టేషన్ స్టాంపుతో సహా కమిషన్‌కు అందజేసాడు. ఆ జిరాక్స్ కాపీ ప్రకాశ్‌కు అందడం ఎట్లా సాధ్యం ? ప్రకాశ్ ఈ పత్రాన్ని కల్పించాడనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ కథ మొత్తం కల్పించి ఒక డాక్యుమెంట్ పుట్టించగల మనిషి పోలీసులకు వ్యతిరేకంగా అబద్ధం చెప్పడానికి ఎంత దూరమైన పోగలడు. ఈ సాక్షి వాంగ్మూలానికి ఎటువంటి విలువ యివ్వడానికి వీలులేదని నా అభిప్రాయం' అని టి.ఎల్.ఎన్. రెడ్డిగారు అన్నారు.

పాపం కారు డ్రైవర్ ప్రకాశ్ ఈ కథలో అసలు విలన్ అయిపోయాడు.

ఈ అబద్ధపు పనులు ప్రకాశ్ ఎందుకు చేసినట్టు? అతను రసూల్‌కు స్నేహితుడు కాడు, బంధువు కాడు. కాబట్టి అతని కోసం రసూల్ అంత శ్రమ తీసుకుని ఉండడు అని కమిషన్ వాదించింది. మరి ప్రకాశ్ ఈ శ్రమంతా ఎవరి కోసం తీసుకున్నట్టు? అతను రసూల్ బంధువు కాడు, మిత్రుడూ కాడు. అతను నక్సలైట్ కాడు. అతను పౌరహక్కుల సంఘం సభ్యుడు కాడు. పత్రికా విలేకరి కాడు. పోలీసుల పైన కోపమున్న వృత్తి నేరస్థుడూ కాడు. అతను ఒట్టి కారు డ్రైవరు. ఎటువంటి రాజకీయ కళంకం లేని కారు డ్రైవరు. అతనికి పోలీసుల మీద యింత కసి ఎందుకుంది? ఇంతటి

అబద్ధపు కథ కల్పించి చెపితే పోలీసులు తనకి హాని చేస్తారని అతనికి భయమెందుకు కలగలేదు? ప్రకాశ్ ఏమాశించి ఈ కల్పనకు పాల్పడ్డాడు?

పోలీసులు ప్రకాశ్ చేత ఆ కాగితం ఎందుకు రాయించుకుని వుంటారో వూహించడం కష్టం కాదు. ప్రకాశ్ కథనం అబద్ధమని కొట్టిపారేయకుండా యితర సాక్ష్యాలతో దాన్ని జోడించి చూస్తే అసలు ఏం జరిగిందో కమిషన్ ఊహించగలిగి వుండేది. దానిని పూర్తిగా రుజువు చెయ్యడం సాధ్యం కాకపోయినా పోలీసుల కథనం అనుమానాస్పదం అనే వాదనకు బలం చేకూరేది.

27 సాయంత్రం నుండి రసూల్, విజయప్రసాద్‌రావులు కనిపించడం లేదు. వాళ్లను పోలీసులు అపహరించి తీసుకు పోయారనే అనుమానం వుంది. రసూల్ మీద పోలీసులకు కోపం వుండిందన్న సంగతి కమిషన్ ముందు వాంగ్మూలం యిచ్చిన సాక్షులు చాలామంది చెప్పారు. తండ్రి, అన్న చెప్పారు. తోటి విలేఖరులు చెప్పారు. రసూల్‌ను నక్సలైట్లతో ముడి పెట్టే ప్రయత్నం పోలీసులు చేస్తున్నారని కూడ సాక్షులు చెప్పారు. భువనగిరి సి.ఐ. ఈ ప్రయత్నం తరచుగా చేసేవాడని రసూల్ తండ్రి చెప్పాడు. డిసెంబర్ 26న ఎస్.పి. భాస్కర రెడ్డి, డి.ఎస్.పి. రాజయ్యలతో రసూల్‌కు జరిగిన వాగ్వివాదంలో వాళ్లిద్దరూ రసూల్ పైన ఈ నింద మోపారని ప్రకాశ్ చెప్పాడు.

కాబట్టి ఆ రాత్రి ప్రకాశ్‌తో బలవంతంగా ఆ నాలుగు వాక్యాలు రాయించు కున్నారంటే బహుశ అప్పటికి రసూల్ పోలీసుల కస్టడీలో వున్నాడని భావించకూడదా? అప్పటికి అతనిని చంపే ఉద్దేశం పోలీసులకు లేదని, నక్సలైట్లు చేసిన ఆ మూడు హత్యలలో రసూల్‌ను ఇరికించి కేసు పెట్టే ఆలోచనలో వున్నారని అనుకోవడం అసంబద్ధంగా వుంటుందా?

ఆ రకంగా రాయించుకున్న వాక్యాలకు కోర్టులో విలువ లేని మాట వాస్తవమే. అయినప్పటికీ పోలీసులు అటువంటి ఒప్పుకోలు పత్రాలు రాయించుకుంటూనే వుంటారు. అది కొత్త సంగతి కాదు. ప్రజలలో చాలామందికి చట్టం తెలియదు కాబట్టి అటువంటి పత్రాలు వారిని బెదిరించడానికి, లొంగదీసుకోవడానికి ఉపయోగపడతాయి. ఇద్దరు స్నేహితుల్ని అరెస్టు చేసి, వేరు వేరు పోలీసు స్టేషన్లలో పెట్టి చిత్రహింసలు చేసి, ఒకరిమీద ఒకరి చేత అబద్ధపు ఆరోపణలు రాయించుకుని సంతకం చేయించుకుంటుంటారు. కోర్టులో విలువలేని ఇటువంటి పత్రాలు

బలవంతంగా రాయించుకోవడం ఒక చిత్రహింసల ప్రక్రియ. అది మనుషులను మానసికంగా లొంగదీసుకోవడానికి ఉపయోగపడుతుంది. ఒకరి చేత రాయించుకుని వాడు ఒప్పేసుకున్నాడని రెండవ వ్యక్తిని బెదిరించి ఆ వ్యక్తి చేత సమాచారం చెప్పించడం పోలీసులు రివాజుగా చేసే పని.

ధర్మా విఠల్‌రెడ్డి, హయగ్రీవాచారి, కృష్ణమాచారిల హత్యలు మేడ్చల్ పరిధిలో జరగలేదనే వాదన కూడ పోలీసు సంస్కృతికి అప్రస్తుతమే. (ఐతే అవి మూడు వరంగల్ జిల్లాలో జరిగాయన్న కమిషన్ అభిప్రాయం వాస్తవం కాదు. ఒకటి వరంగల్‌లో, ఒకటి నల్గొండలో, ఒకటి హైదరాబాదులో జరిగిగాయి.) మేడ్చల్ పోలీసులకు ఆ కేసులను పరిశోధించే అధికారం వుందా అనేది సమస్య కాదు. ప్రకాశ్ చేతనే బలవంతంగా రసూల్ నక్సలైట్ అని చెప్పించాలి. తనకు మేలు చేసిన మనిషి మీద అతని చేతనే నింద మోపించాలి. తన నుండి మేలు పొందిన వ్యక్తి తన మీద అబద్ధపు ఆరోపణ చేశాడన్న బాధ రసూల్ అనుభవించాలి. రసూల్ ద్వారా డి.జి.పి. చేత తమను తిట్టించినందుకు యిది ప్రకాశ్‌కు రంగారెడ్డి జిల్లా పోలీసులు విధించిన శిక్ష, ప్రకాశ్‌కు అయాచితంగా సహాయం చేసినందుకు రసూల్‌కు వేసిన శిక్ష, ఎవరి చావు వాళ్ళు చావకుండా ఒకరికొకరు సహాయం చేసుకునే మానవతకు పోలీసు వ్యవస్థ వేసిన శిక్ష.

ఆ తర్వాత ఏ కారణంగానో రసూల్‌ను కేసులో ఇరికించి జైలుకు పంపించకుండా చంపి ఎన్‌కౌంటర్ కథ అల్లారు. బహుశ చంపే ఉద్దేశం లేకున్నప్పటికీ కసికొద్దీ కొట్టిన క్రమంలో రసూల్ ప్రాణం పోయిందేమో! లేకపోతే తమ ఉద్దేశమే మార్చుకున్నారో?!

ప్రకాశ్ వాంగ్మూలాన్ని నిష్కారణంగా అబద్ధమని కొట్టి పారేయకుండా ఈ రకంగా అర్థం చేసుకోకూడదా! దీనికి రుజువు ఏముందని కమిషన్ అడగవచ్చు. రుజువు లేదు. కాని ఈ రకంగా జరిగి వుండవచ్చునని నమోదైన వాంగ్మూలాల ఆధారంగా భావించగలిగితే మసీదుగూడ ఎన్‌కౌంటర్ నిజమైన ఎన్‌కౌంటరేనని నిర్ద్వంద్వంగా నిర్ధారించడం జరిగేది కాదు.

ప్రకాశ్ వాంగ్మూలం అబద్ధమని కమిషన్ నిష్కారణంగా ఎందుకు కొట్టేయాలి?

6. మసీదుగూడ ఎన్‌కౌంటర్ గురించి రెండు కథనాలు వున్నాయని కమిషన్ గుర్తించింది.

ఒకటి ఎ.పి.సి.ఎల్.సి., ఎ.పి.యు.డబ్ల్యు.జె. (పౌరహక్కుల సంఘం, జర్నలిస్టుల సంఘం) చెప్పినది. అదేమిటంటే 27 సాయంత్రం విజయప్రసాదరావును స్కూటర్ మీద ఎక్కించుకుని తీసుకుపోతున్న రసూల్‌ను – అంబర్ పేట ప్రాంతంలో పోలీసులు అటకాయించి యిద్దరినీ తీసుకుపోయి 28 తెల్లవారుజామున మసీదుగూడ వూరు శివారులోని పాడుబడిన కట్టడంలో కాల్చి పడేశారు.

దీనికి పై రెండు సంస్థలు చూపించిన ఆధారం ఏమిటి? ఏమీ లేదు. తమ అభియోగం తప్ప వేరే ప్రత్యక్ష ఆధారాలేవీ పై రెండు సంస్థలూ చూపించలేక పోయాయని కమిషన్ అనింది. అది నిజమైన మాటే. ప్రత్యక్ష ఆధారాలు ఎవరికీ దొరకలేదు.

రెండవ కథనం పోలీసులది. 27వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత వనస్థలిపురం సి.ఐ. మురళీధరరావుకు మసీదుగూడ శివారులోని పాడుబడిన గదులలో పీపుల్స్‌వార్ నక్సలైట్లు సమావేశమై వున్నట్లు సమాచారం అందింది. ఆయన సరూర్ నగర్ డి.ఎస్.పి. రాజయ్యకు ఈ విషయం చెప్పగా వారు సరూర్‌నగర్ సి.ఐ. రామిరెడ్డినీ, సాయుధ బలగాలనూ తీసుకుని మసీదుగూడ పొమ్మని సలహా ఇచ్చారు. ఉప్పల్ సి.ఐ. సెలవులో వున్నందున రామిరెడ్డి ఉప్పల్‌కు కూడ ఇన్‌ఛార్జిగా వున్నాడు. మొత్తానికి అందరూ కలిసి మసీదుగూడ బయల్దేరారు. నాలుగు గంటలకు ఆ పాడుబడిన గదుల దగ్గరకు చేరుకున్నారు. వీళ్లు సమీపించగానే నక్సలైట్లు వున్న గదుల నుండి కాల్పులు మొదలయ్యాయి. పోలీసులు బయటి కాంపౌండ్ గోడ చాటు చేసుకున్నారు. తాము పోలీసులమని చెప్పారు. కాల్పులు ఆపేయమని హెచ్చరించారు. ఐనా నక్సలైట్లు ఆపకుండా కాల్పులు జరుపుతూనే వున్నారు. అప్పుడు పోలీసులు కూడ గదుల మీదికి ఎదురుకాల్పులు జరిపారు. రెండు, మూడు నిమిషాల్లో అవతలి వైపు నుండి కాల్పులు ఆగిపోయాయి. అప్పుడు పోలీసులు కాంపౌండ్‌లోకి ప్రవేశించి పాడుబడిన ఆ గదులను సమీపించగా ఉత్తరం వైపున్న గదిలో ఒకటి, ఆ గది బయట ఉత్తరం దిక్కుగా మరొకటి రెండు శవాలు కనిపించాయి. డిటోనేటర్లు, జిలటిన్ స్టిక్స్, రివాల్వర్లు, ఒక కరెంటు వైరు ముక్క, ఖాళీ తూటాలు వగైరాలు కనిపించాయి.

దీనికి పోలీసులు చూపించిన ఆధారాలేమిటి? ఏమీ లేదు. తమ కథనం తప్ప వేరే ప్రత్యక్ష ఆధారమేమీ చూపించలేదు. ఆ వూరి వాళ్లెవరూ పోలీసు కథనాన్ని సమర్థిస్తూ సాక్ష్యం చెప్పలేదు. పొరుగూళ్ల వాళ్లూ చెప్పలేదు. పౌరహక్కుల సంఘం, జర్నలిస్టుల సంఘం ఏ మాత్రం ప్రత్యక్ష సాక్ష్యాధారాలు చూపించాయో పోలీసులు కూడ ఆ మాత్రమే చూపించారు.

కాని కమిషన్ అభిప్రాయం అది కాదు. పౌరహక్కుల సంఘం, జర్నలిస్టుల సంఘం తమ కథనానికి ప్రత్యక్ష ఆధారాలు చూపించలేకపోవడం వల్ల వారి కథనం వీగిపోయిందట. కాని పోలీసులు మాత్రం ప్రత్యక్ష సాక్ష్యం చూపించారంది కమిషన్.

వారు చూపించిన ఆ సాక్ష్యం ఏమిటో తెలుసుకోవాలని మీకు ఉత్సాహం కలుగుతోందా? ఇన్నాళ్లూ తెలియని కొత్త విషయమేదో యిప్పుడు తెలుసుకోబోతున్నామని అనుకుంటున్నారా? అయితే వినండి. పోలీసు కథనానికి – నలుగురు సాక్షులున్నారు. వాళ్లందరూ ఆ కథనాన్ని సమర్థించారు. సి.ఐ. మురళీధరరావు సమర్థించాడు. సి.ఐ. రామిరెడ్డి సమర్థించాడు. హెడ్ కానిస్టేబుల్ పరశురామిరెడ్డి సమర్థించాడు. హెడ్ కానిస్టేబుల్ మాణిక్యరెడ్డి సమర్థించాడు. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులందరూ పోలీసు కథనాన్ని సమర్థించారు. అందరి వాంగ్మూలాలూ ఎఫ్.ఐ.ఆర్‌ను సమర్థించాయి. ఎక్కడా అభిప్రాయ భేదం లేదు. అందువల్ల పోలీసు కథనానికి బలం చేకూరిందని కమిషన్ భావించింది. 'ఎ.పి.సి.ఎల్.సి., ఎ.పి.యు.డబ్ల్యు.జె. తమ కథనాన్ని చెప్పాయి కాని ఒక్క సాక్షిని కూడ ప్రవేశ పెట్టలేదు. పోలీసులు నలుగురు సాక్షులను ప్రవేశ పెట్టారు' అంటుంది కమిషన్. పైగా కేవలం అభియోగాలు వేసి వూరుకోకుండా పోలీసులు 'పాజిటివ్ సాక్ష్యం' ప్రవేశపెట్టారని అనింది.

జస్టిస్ టి.ఎల్.ఎన్.రెడ్డిగారి విజ్ఞతను శంకించడం మా ఉద్దేశం కాదు కాని యిది హాస్యాస్పదమైన వాదన అనక తప్పదు. ఇదే రకంగా వాదించేటట్లయితే న్యాయ విచారణ జరపకుండానే అన్ని ఎన్‌కౌంటర్లూ నిజమైనవేనని ముందే ప్రకటించవచ్చు. ప్రతి ఎన్‌కౌంటర్ కథకూ పోలీసుల వైపు నుండి నలుగురు కాకపోతే పదిమంది ప్రత్యక్ష సాక్షులుంటారు. వాళ్ళందరూ ఉద్యోగ ధర్మంగా ఒకే కథ చెపుతారు. అవతలి వేపు ఒక్క ప్రత్యక్ష సాక్షి కూడ వుండకపోవచ్చు.

పోనీ, పోలీసుల కథనానికి పోలీసుల సాక్ష్యం నుండి బలం చేకూరిందని ఒప్పుకుందాం. కాని దానిలో అసంబద్ధత వుండవచ్చు కదా! పరస్పర విరుద్ధ విషయాలు వుండవచ్చు కదా! పోలీసుల ప్రవర్తనే పోలీసుల కథనం గురించి సంశయం రేకెత్తించేటట్లు వుండవచ్చు కదా!

ఈ అనుమానం కమిషన్‌కి రాకపోలేదు. దీనికి సంబంధించిన సాక్ష్యాలన్నిటినీ కమిషన్ పరిశీలించింది. పరిశీలించి కొట్టి పారేసింది. కారు డ్రైవర్ ప్రకాశ్ సాక్ష్యానికి ఏ గతి పట్టిందో యిప్పటికే చూశాం. తక్కిన సాక్ష్యాలను కమిషన్ ఏ విధంగా కొట్టి పారేసిందో చూద్దాం.

7. తెలుగుదేశం పార్టీకి చెందిన ధర్మవరం ఎం.ఎల్.ఎ. జి. నాగిరెడ్డి కమిషన్ ముందు తన సాక్ష్యం చెప్పాడు. విజయ ప్రసాదరావు పొరుగింటి వాళ్లకు నాగిరెడ్డితో పరిచయం వుంది. అంతే తప్ప నాగిరెడ్డికి మసీదుగూడ ఎన్‌కౌంటర్ మృతులతో వేరే ఏ సంబంధం లేదు. నక్సలైట్లతో అసలు సంబంధం లేదు.

29వ తేదీ పొద్దున పేపర్లో ఎన్‌కౌంటర్ మృతుల ఫోటో వచ్చింది. నేలమీద పడివున్న శవాలను ఒక పక్క నుండి తీసిన ఫోటోలు కావడం వలన అవి సులభంగా గుర్తు పట్టేటట్లుగా లేవు. విలేఖరి రసూల్‌ను రోజూ ఆఫీసులో చూసే 'ఉదయం' పేపరు సిబ్బంది సహితం తాము అచ్చు వేస్తున్నది తమ సహ ఉద్యోగి ఫోటో అని గుర్తుపట్టలేదు. కాని విజయప్రసాదరావు ఫోటో కొంచెం మెరుగ్గా వుంది. అతని సోదరి పేపర్లో ఎన్‌కౌంటర్ మృతుల ఫోటో చూసి అందులో ఒకరు తన తమ్ముడని గుర్తించింది. ఈ విషయం ఆమె పొరుగింటి వారికి తెలియజేయగా వారు తమకు పరిచయస్థుడైన ఎం.ఎల్.ఎ. నాగిరెడ్డికి తెలియజేశారు. నాగిరెడ్డి రెండవ వ్యక్తి ఎవరై ఉండవచ్చునని వాకబు చేశాడు. విజయప్రసాదరావు ఆఖరుసారి యింటినుండి బయటకు పోయింది గులాం రసూల్ అనే విలేఖరితోననీ, రసూల్ అతనికి 'ఈనాడు'లో ఉద్యోగం యిప్పించే ప్రయత్నం చేస్తున్నాడని తెలిసింది. అప్పుడు నాగిరెడ్డి 'ఈనాడు', 'ఉదయం' కార్యాలయాలకు ఫోన్ చేసి ఆ రోజు పేపర్లో అచ్చయిన ఎన్‌కౌంటర్ మృతుల ఫోటోలలో ఒకటి గులాం రసూల్‌ది అయి ఉండవచ్చునా అని అడిగారు. వాళ్లు మొదట నమ్మలేదు కాని ఆయన ఒత్తిడి చేయగా పోలీసులు యిచ్చిన ఫోటోను ఎన్‌లార్జ్ చేసి పరీక్షగా చూశారు. గులాం రసూల్‌ను గుర్తుపట్టారు. అతని బంధువులను తీసుకొచ్చి చూపించారు. వాళ్లు కూడ గుర్తుపట్టారు.

ఇదంతా 29వ తేదీ పొద్దున, మధ్యాహ్నం జరిగింది. చనిపోయింది రసూల్, విజయ ప్రసాద్‌రావులేనని నిర్ధారణ అయిన తర్వాత నాగిరెడ్డి రాష్ట్ర హోంమంత్రి మైసూరా రెడ్డికి ఫోన్ చేశాడు. మసీదుగూడ ఎన్‌కౌంటర్లో చనిపోయిన వాళ్లలో 'ఉదయం' విలేఖరి గులాం రసూల్ ఒకరని నీకు తెలుసా అని అడిగారు. ఇద్దరికీ ఫోన్ మీద కొంత సేపు వాగ్వివాదం జరిగింది. కనీసం శవాలను మృతుల బంధువులకు యివ్వాలని, తాను ఆ బంధువులను తీసుకుని గాంధీ ఆస్పత్రి మార్చురీకి పోతున్నానని నాగిరెడ్డి హోం మంత్రికి చెప్పాడు. చెప్పి మార్చురీకి పోయి అక్కడ శవాలు ఉన్న సంగతి నిర్ధారించుకుని మృతుల బంధువులను తీసుకొస్తానని చెప్పి వెళ్లాడు. ఐతే బంధువులను తీసుకుని ఆయన మార్చురీకి తిరిగి వచ్చేసరికి అప్పుడే పోలీసులు వచ్చి శవాలను తీసుకుపోయారని మార్చురీ సిబ్బంది చెప్పారు.

29 సాయంత్రం ఐదుగంటలకు తాము శవాలను మార్చురీ నుండి తీసి దహనం చేశామని కమిషన్ ఎదుట వాంగ్మూలం యిచ్చిన ఇబ్రహీంపట్నం సి.ఐ. లక్ష్మీనారాయణ (ఈ కేసులో ఇన్‌వెస్టిగేటింగ్ ఆఫీసరు) అన్నాడు. నాగిరెడ్డి వాంగ్మూలం ఆధారంగా కమిషన్ పోలీసుల కథనాన్ని ప్రశ్నించి వుండవచ్చు. 28 తెల్లవారుజామున ఎన్‌కౌంటర్ జరిగింది. చనిపోయింది 'గుర్తు తెలియని తీవ్రవాదులు' అని పోలీసులు అన్నారు. వాళ్ల మృతదేహాలు యిక్కడొకటి, అక్కడొకటి పడి వున్న ఫోటోలు 29 పొద్దున పేపర్లో వచ్చాయి. '29 సాయంత్రం 5 గంటల సమయానికి ఎవరూ వచ్చి ఆ మృతులు మా వాళ్లు' అని శవాల కోసం అడగలేదు. కాబట్టి పోలీసులే తగలబెట్టారని సి.ఐ. లక్ష్మీనారాయణ వాంగ్మూలం.

అంత తొందర ఏమొచ్చింది? శవ పరీక్ష జరిగిన తర్వాత 24 గంటలు మార్చురీలో వుంచారని, 24 గంటల కంటే ఎక్కువ సేపు ఉంచాలన్న నియమం తన దృష్టికి రాలేదని కమిషన్ అంటోంది. దహనం చేయటంలో పోలీసుల తొందరపాటు ఏమీ లేదని అంటోంది. కాని శవపరీక్ష జరిగిన తర్వాత ఎంత సేపు ఉంచారన్నది లెక్క కాదు. పేపర్‌లో వార్త, ఫోటో వచ్చాక ఎంతసేపు ఉంచారన్నది లెక్క. వార్త, ఫోటో పేపర్లో వచ్చింది 29 పొద్దున. ఫోటోలు ఒకవేళ గుర్తు పట్టేటట్టే వున్నా మృతులు నల్గొండ లేదా వరంగల్ గ్రామీణ ప్రాంతాలకు చెందినవారై వుంటే వాళ్ల బంధువులు ఫోటోలను చూసి గుర్తుపట్టి ఏడుపు దిగమింగి హైదరాబాద్ వచ్చి రంగారెడ్డి జిల్లా

ఎస్.పి. ఆఫీస్ ఎక్కడుందో వెతికి తెలుసుకుని అక్కడికి పోయి మృతుడు మావాడేనని చెప్పేసరికి సాయంత్రం కాదా? సాయంత్రం ఐదుగంటలకే బయటకు తీసి తగలబెట్టడం తగిన సమయం యిచ్చినట్టేనని కమిషన్ ఎట్లా భావించింది?

ఐనా ఫోటోలు అసలు గుర్తుపట్టేటట్టు లేవని నాగిరెడ్డి వాంగ్మూలం స్పష్టం చేస్తుంది. నాగిరెడ్డి వాంగ్మూలమే కాదు, గులాం రసూల్ సహ ఉద్యోగి ప్రతాపరెడ్డి వాంగ్మూలం, రసూల్ తండ్రి, సోదరుల వాంగ్మూలాలు కూడ ఈ విషయాన్ని స్పష్టం చేస్తాయి. తాము తమ పేపర్లో అచ్చు వేసింది తమ సహ ఉద్యోగి ఫోటోయేనని 'ఉదయం' సిబ్బందే గుర్తుపట్టలేదు.

ఫోటోలు గుర్తుపట్టేటట్టు లేనపుడు పోలీసులు ఏం చేయాలి? మార్చురీలో ఉన్న శవాల ముఖాలను నేరుగా ఫోటో తీసి మరుసటి రోజు పేపర్లో వేయించి ఆ తరువాత కనీసం రెండు దినాలయినా ఆగితే, ఇవ్వవలసిన సమయం ఇచ్చినట్టు అవుతుంది. వాళ్ల ముఖాలు కాల్పులలో దెబ్బతిన్నాయా అంటే లేదు. ముఖాలకు దెబ్బ తగలలేదని శవ పరీక్ష నివేదిక స్పష్టం చేస్తుంది. ముఖాల ఫోటోలు తీయించి ప్రచురించి ఉండవచ్చు. పోలీసులు ఈ పని ఎందుకు చేయలేదు? ఈ పని చేయకుండ 'ఎవరూ ముందుకు రాలేదని' ఎందుకు దహనం చేసారు? ఈ ప్రశ్న కమిషన్‌కు ఎందుకు తోచలేదు?

ముఖాలు కనబడే ఫోటోలు తాము తీయించి ప్రచురించకపోవడమే కాదు, ఎన్‌కౌంటర్ స్థలం దగ్గరికి వచ్చిన పత్రికా ఫోటోగ్రాఫర్లను పోలీసులు అనుమతించలేదు. ఎందుకు అనుమతించలేదు? గుర్తుపట్టగల ఫోటోలు పేపర్‌లో రాకుండా ఉండడం కోసం పోలీసులు ప్రయత్నించారని దీనిని బట్టి అర్థం కావడం లేదా?

పత్రికా ఫోటోగ్రాఫర్లను ఫోటోలు తీయడానికి అనుమతించలేదని జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు తన వాంగ్మూలంలో చెప్పాడు. అయితే ఆ ఫోటోగ్రాఫర్లు ఎవరో పేర్కొనలేదని కమిషన్ అంటుంది. అందువల్ల ఈ ఆరోపణను లెక్కలోకి తీసుకోదు.

కానీ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తన వాంగ్మూలంతో పాటు మసీదుగూడ ఎన్‌కౌంటర్ పైన 'ఎడిటర్స్ గిల్డ్' ప్రకటించిన నివేదికను కూడ జత చేసారు. దానిలో పోలీసులు ఆటంకపరచిన ఫోటోగ్రాఫర్ల పేర్లను స్పష్టంగా పేర్కొన్నారు. వాళ్ళు 'సియాసత్' ఫోటోగ్రాఫర్ షౌకత్ హుస్సేన్, 'ఉదయం' ఫోటోగ్రాఫర్ బి.కె.

రమేశ్. ఆ నివేదిక టి.ఎల్.ఎన్. రెడ్డి కమిషన్‌కు సమర్పించబడింది. కమిషన్ ఆ యిద్దరు ఫోటోగ్రాఫర్లకు సమన్స్ పంపించి పిలిపించుకొని ఉండవచ్చును. ఆ పని ఎందుకు చేయలేదు? సమన్స్ జారీ చేసే అధికారం న్యాయవిచారణ కమిషన్‌లకు చట్టం ఎందుకు ఇచ్చినట్టు?

అలాగని కమిషన్ ఎవ్వరికీ సమన్స్ పంపించకుండ పోలేదు. పోలీసుల కథనానికి వ్యతిరేకంగా నమోదైన సాక్ష్యాన్ని వ్యతిరేకించగల వాళ్లను తానే చొరవ తీసుకొని పిలిపించుకొని సాక్ష్యం నమోదు చేసుకుంది. కానీ పోలీసుల కథనాన్ని వ్యతిరేకించే సాక్ష్యానికి దోహదం చేయగల వారిని ఒక్కరిని కూడ పిలిపించుకోలేదు. సమన్స్ పంపించలేదు. ఈ సంగతి తరువాత వివరంగా చూద్దాము.

29 సాయంత్రం 5-00 గంటల దాకా ఆ శవాలు మా వాళ్లవేనంటూ ఎవరూ ముందుకు రాలేదనడం కూడ వాస్తవం కాదు. ఈ సంగతి నాగిరెడ్డి వాంగ్మూలం తెలియచేస్తుంది. అంతకుముందే విజయప్రసాదరావు సోదరి తన తమ్ముడిని గుర్తించడం, ఆ సంగతి నాగిరెడ్డికి తెలియడం, రెండవ వ్యక్తి రసూల్ అయి ఉండాలని నాగిరెడ్డి ఊహించడం, ఫోటోలు ఎన్‌లార్జ్ చేయించడం, అప్పుడు రసూల్ బంధువులు, సహ ఉద్యోగులు గుర్తించడం, నాగిరెడ్డి హోం మంత్రికి ఈ సంగతి చెప్పి శవాలు బంధువులకు ఇప్పించాలని చెప్పడం, నాగిరెడ్డి మార్చురీకి పోయి ఫలాన శవాల కోసం వాళ్ల బంధువులు వస్తారని చెప్పి ఆ బంధువులను తేవడం కోసం వెళ్లడం - ఇదంతా సాయంత్రం 5-00 గంటల లోపల జరిగింది. సరిగ్గా మృతుల బంధువులు వచ్చి శవాలను తీసుకుపోబోయే సమయానికి పోలీసులు తీసుకుపోయి కాల్చేస్తారు. 'ఎవ్వరూ ముందుకు రాలేదు కాబట్టి మేమే దహనం చేసాం' అన్నారు. కానీ హోంమంత్రికి చెప్తే ప్రభుత్వానికి చెప్పినట్టు కాదా? పోలీసులకు తెలియచేయవలసిన బాధ్యత హోంమంత్రికి లేదా? ఆయన ఎందుకు తెలియచేయలేదు? లేక, ఆయన తెలియజేయబట్టే శవాలు మాయం అయ్యాయా? త్వరగా వాటిని తీసుకొని పోయి దహనం చేయకపోతే కొంపలు మునుగుతాయని మైసూరా రెడ్డి భాస్కర రెడ్డికి చెప్పడం వల్లనే శవాలు మార్చురీ నుండి అకస్మాత్తుగా కాటికి తరలించబడ్డాయా?

నాగిరెడ్డి వాంగ్మూలాన్ని బట్టి ఈ అనుమానాలన్నీ కమిషన్‌కు రావాలి. కానీ రాలేదు. రాకుండ పోవడం ఎట్లా సాధ్యం అయింది?

చాలా సులభంగా సాధ్యం అయింది. కమిషన్ నాగిరెడ్డి వాంగ్మూలాన్ని (ప్రకాశ్ వాంగ్మూలం లాగా) అబద్ధం, కల్పితం అనలేదు అసలు దాన్ని లెక్క చెయ్యలేదు. నివేదికలో ఎక్కడా నాగిరెడ్డి వాంగ్మూలాన్ని కమిషన్ ప్రస్తావించలేదు. విశ్లేషించలేదు. సాక్షుల జాబితాలో మాత్రం నాగిరెడ్డి పేరు వుంది. నాగిరెడ్డి వాంగ్మూలాన్ని కమిషన్ యింత పూర్తిగా ఎందుకు విస్మరించింది?

చనిపోయిన వాళ్లలో ఒకరు ముస్లిం, ఒకరు క్రైస్తవుడు అయినప్పటికీ శవాలను పోలీసులు పూడ్చి పెట్టే బదులు వారి మతాచారాలకు భిన్నంగా దహనం చేశారని, యిది పోలీసుల నేరాన్ని రుజువు చేస్తుందని చాలామంది చేసిన వాదనను కమిషన్ పరిశీలించింది.

వాళ్లు ఏ మతస్తులయినదీ పోలీసులకు తెలియాలి కదా, ఎట్లా తెలుస్తుంది? రసూల్ ముస్లిం కాబట్టి సున్తీ చేయించుకొని ఉంటాడు. గుర్తు తెలియని శవాన్ని గుర్తుపట్టే ప్రయత్నంలో పోలీసులు ఈ విషయాన్ని తప్పక గమనించి వుంటారు. దీనికి కమిషన్ ఏం సమాధానం చెపుతుందంటే ఇద్దరు మృతులలో ఒకరు సున్తీ చేయించుకున్న సంగతి పోలీసులు తప్పక గమనించే వుంటారు కాని అంతమాత్రం చేత అతను ముస్లిం అనుకోనవసరం లేదు. ఎందుకంటే ముస్లింలు కాని వాళ్లు కూడ ఈ రోజుల్లో వివిధ కారణాల వల్ల సున్తీ చేయించుకుంటున్నారు.

ఇక విజయ ప్రసాదరావు క్రైస్తవుడని ఎట్లా తెలియాలి? అతని మెడలో క్రాస్ ఉందంటున్నారు. కాని ఆ సంగతి తన దగ్గర వాంగ్మూలం యిచ్చిన సాక్షులెవరూ చెప్పలేదంటారు టి.ఎల్.ఎన్. రెడ్డిగారు. విజయప్రసాదరావు తల్లి ఎలిజిబెత్ కమిషన్ ఎదుట వాంగ్మూలం యిచ్చారు. ఆమె ఒకవేళ తన వాంగ్మూలంలో ఆ సంగతి చెప్పకపోతే కమిషన్ ఆమెను రెండోసారి పిలిపించుకుని ఆమె కుమారుడి మెళ్లో క్రాస్ ఉన్నదీ లేనిదీ నిర్ధారించుకుని వుండవచ్చు కదా! 'నాకెవరూ చెప్పలేదని' అనడం ఎందుకు?

8. గులాం రసూల్ తండ్రి గులాం ముస్తఫా, అన్న గులాం అహమ్మద్ తమ వాంగ్మూలాలు యిచ్చారు. వాళ్లు నల్గొండ జిల్లా ఆలేరు మండలం షారాజిపేట వాస్తవ్యులు. నేత గుడ్డలను బ్లీచ్ చెయ్యడం వాళ్ల వృత్తి. ఇంటికి కొద్ది దూరంలో వాళ్ల కార్ఖానా వుంది.

28వ తేదీ సాయంత్రం (అంటే ఎన్‌కౌంటర్ జరిగిన రోజు సాయంత్రం) ఆలేరు ఎస్.ఐ. పాషామియా షారాజిపేటకు కానిస్టేబుళ్లను పంపించి గులాం అహమ్మద్‌ను రమ్మన్నాడు. ఏమన్నా డబ్బులుంటే తీసుకొని రమ్మన్నాడు. అహమ్మద్ ఆలేరు పోలీసు స్టేషన్‌కు పోగా అక్కడ కొంతసేపు కూర్చోబెట్టారు. కొంత సేపటికి భువనగిరి సి.ఐ. సుదర్శన్ రెడ్డి ఆలేరు ఎస్.ఐ.కు ఫోన్ చేశాడు. గులాం అహమ్మదును భువనగిరికి తీసుకు రమ్మనమని సి.ఐ. అంటున్నట్టు అహమ్మద్‌కు అర్థమైంది. కాని ఎస్.ఐ. పాషామియా అహమ్మద్ మంచివాడని, అతనిని శంకించవలసిన అవసరం లేదని సి.ఐ.కు నచ్చజెప్పి ఫోన్ పెట్టేశాడు. పెట్టేసి అహమ్మద్‌తో యింటికి పొమ్మని చెప్తూ, మరుసటిరోజు సి.ఐ. షారాజిపేటపై దాడి చేయబోతున్నాడని వూళ్లో వుండవద్దని హెచ్చరించాడు. అహమ్మద్ 29 పొద్దున హైదరాబాద్ వెళ్లిపోయాడు.

29 సాయంత్రం తండ్రి గులాం ముస్తఫా గ్రామంలో వుండగానే సాయుధ పోలీసులు పెద్ద సంఖ్యలో షారాజిపేటపైన దాడి చేశారు. ఇంట్లో వున్న ముస్తఫాతో మాటమంతీ లేకుండ అతని కార్ఖానా పైన దాడిచేసి సోదాచేసి వస్తువులను చిందర వందర చేసి వెళ్లిపోయారు.

30వ తేదీన రసూల్ మరణం గురించి గ్రామంలో తెలిసింది. ఆలేరు ఎస్.ఐ. రసూల్ తండ్రితో మాట్లాడుతూ తనకీ సంగతి 28 నాడు అహమ్మద్‌ను పోలీసు స్టేషన్‌కి పిలిచినప్పుడే తెలిసిందని, ఐతే చెప్పడానికి మనస్కరించలేదని చెప్పాడు.

29 సాయంత్రం దాకా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పోలీసులు మసీదుగూడ మృతులు 'గుర్తుతెలియని తీవ్రవాదులు' అని అంటుండగా ఆలేరు ఎస్.ఐ.కి చనిపోయింది రసూలని 28 నాడే ఎలా తెలిసింది? అసలు 28 సాయంత్రం గులాం అహమ్మద్‌ను ఆలేరు పోలీసు స్టేషనుకు ఎందుకు పిలిపించినట్టు? అతనిని భువనగిరికి తీసుకురమ్మని సి.ఐ. ఎందుకు ఒత్తిడి చేసినట్టు? 29 సాయంత్రం షారాజిపేట పైన పోలీసులు నిష్కారణంగా దాడిచేసి గులాం ముస్తఫాతో ఒక్కమాట మాట్లాడకుండా అతని కార్ఖానాను ఎందుకు సోదా చేసినట్టు? ఎన్‌కౌంటర్‌లో ఒక వ్యక్తిని చంపేస్తే అతని యింటిపైన ఆ తర్వాత దాడి చేసి బీభత్సం సృష్టించడం, బంధువులను బెదిరించడం తెలంగాణలో పోలీసులు తరచుగా చేసే పనే. కాని చనిపోయింది రసూలని 29 రాత్రి దాకా పోలీసులకు తెలియదు కదా! మరి ఈ ప్రవర్తనను ఏ రకంగా అర్థం చేసుకోవాలి?

టి.ఎల్.ఎన్. రెడ్డి కమిషన్ దీని గురించి ఏమంటుంది?

ఏమంటుందంటే పై సంఘటనలు ఏవీ జరగనే లేదంటుంది. గులామ్ ముస్తఫా, గులామ్ అహమ్మద్‌ల వాంగ్మూలాలు అబద్ధాల పుట్టలంటుంది. వాళ్లు చెప్పిన సంఘటనలు 28, 29 తేదీలలో జరగనే లేదని ఆలేరు ఎస్.ఐ. పాషామియా కమిషన్ ఎదుట హాజరై చెప్పాడు కాబట్టి ఆ సంఘటనలు జరగలేదని కమిషన్ నిర్ణయించింది. ఒకవేళ నిజంగానే జరిగి వున్నా ఆలేరు ఎస్.ఐ. ఒప్పుకుంటాడా? ఒక 'నక్సలైట్' కుటుంబం పట్ల సానుభూతి చూపించాడనే నింద వస్తుందని భయపడడా? అతని వాంగ్మూలం సహజంగానే ఉద్యోగ భయంతో యిచ్చింది అయి ఉంటుందని కమిషన్ ఎందుకు అనుకోలేకపోయింది?

ఎస్.ఐ. పాషామియా తనంతట తాను కమిషన్ దగ్గరకు రాలేదు. కమిషన్ ఆయనకు సమన్స్ పంపించి పిలిపించింది. ఎందుకోసం? గులాం ముస్తఫా, గులాం అహమ్మదు చెప్పింది నిజమో కాదో తెలుసుకోవడం కోసం. ఇది మంచి పద్ధతే. కాని అదే విధంగా ఫోటోలు తీసే ప్రయత్నంలో అటకాయించబడ్డ పత్రికా ఫోటోగ్రాఫర్లు షౌకత్ హుస్సేన్, బి.కె.రమేశ్‌లను కూడ పిలిపించి వాంగ్మూలాలు తీసుకుని వుండవచ్చు కదా! ఆ పని ఎందుకు చేయలేదు? విజయప్రసాదరావు తల్లిని పిలిపించి అతని మెళ్లో క్రాస్ ఉండిందీ లేనిదీ కనుక్కుని వుండవచ్చు కదా! ఆ పని ఎందుకు చేయలేదు?

9. పౌరహక్కుల సంఘం న్యాయవాది కన్నబిరాన్ కాల్పులు జరిగాయని పోలీసులు చెపుతున్న పాడుబడిన కట్టడాన్ని నైసర్గికంగా విశ్లేషించి ఎన్‌కౌంటర్ కథ ఎంతవరకు సంభవమని ప్రశ్నించారు.

'ఎన్‌కౌంటర్ ' ఏ విధంగా జరిగిందనేది ఎంఆర్‌వో సంతకం చేసిన పంచనామా నివేదికలో ఒక రకంగా ఉంది. కమిషన్ ముందు సాక్ష్యం చెప్పిన ఒక్కొక్క పోలీస్ అధికారి వాంగ్మూలంలో ఒక్కొక్క రకంగా ఉంది. దీనిని బట్టి 'ఎన్‌కౌంటర్'లో పాల్గొన్నట్టు చెప్పబడుతున్న ఈ పోలీసులంతా అసలు 'ఎన్‌కౌంటర్' స్థలాన్ని చూసారా? మసీదుగూడ గ్రామానికి ఎన్నడయినా పోయారా అన్న అనుమానాలు వస్తాయి. ఒక్కొక్కరి వాంగ్మూలంలో భిన్నంగా కనిపించే ఎన్‌కౌంటర్ ఘటనను కన్నబిరాన్ చిత్రపటం రూపంలో గీయించి కమిషన్ ముందు ఉంచారు. ఈ తేడాను ఏ విధంగా వివరిస్తారని ప్రశ్నించారు.

ఆ ప్రశ్న కమిషన్ పోలీసులను అడిగిందో లేదో, వాళ్లు ఏమి జవాబు చెప్పారో మనకు తెలీదు. ఎందుకంటే కమిషన్ తన నివేదికలో ఈ విషయాన్ని అసలు ప్రస్తావించనే లేదు.

మసీదుగూడ గ్రామం శివారులో ఒక మూల ఒక పాడుబడిన కాంపౌండ్ వుంది. ఇది దాదాపు చతురస్రాకారంలో వుంది. ఒక్కొక్క పక్క 130 నుండి 136 అడుగుల పొడవుంది. తూర్పున కాంపౌండ్ గోడకు రెండు గేట్లున్నయ్యి. గేట్లకు ఎదురుగా పడమటి గోడను ఆనుకుని నాలుగు గదులున్నాయి. మధ్య రెండు పెద్దగదులు, వాటి ఉత్తర దక్షిణంగా రెండు చిన్న గదులు వున్నాయి. మధ్యనున్న గదులకు తూర్పు పక్కన (అంటే గేట్లకు అభిముఖంగా) తలుపులు, కిటికీలు వున్నాయి. మిగిలిన రెండు గదుల నుండి ఉత్తర దక్షిణం దిక్కులుగా బయటకి పోయే అవకాశం వుంది.

పోలీసులు తూర్పు గోడకు వున్న గేటు పక్కన నిలబడి కాల్చారు. నక్సలైట్లు మధ్య రెండు గదులలో వున్నారు. రెండు మూడు నిమిషాల కంటే ఎక్కువ సేపు కాల్పులు జరగలేదు. పోలీసుల తూటాలు ఉత్తరం వైపున వున్న మధ్య గది కిటికీగుండా లోపలికి పోయి మృతులిద్దరికీ ఛాతీల్లో తగిలాయి. ఒకతను అక్కడే పడి చనిపోయాడు. రెండవతను ఉత్తరం దిక్కున వున్న గది దాటి బయటకు వచ్చి పడి చనిపోయాడు. మిగిలినవాళ్లు అదే రకంగా బయటకు వచ్చి పారిపోయారు.

మృతులిద్దరికీ నేరుగా ముందుభాగం నుండి ఛాతీలో తూటాలు తగిలాయి. వీపునుండి బయటకు పోయాయి. కటిక చీకట్లో 120 అడుగుల దూరం నుండి కిటికిలోకి కాలుస్తూ రెండే రెండు నిమిషాలలో ఇద్దరినీ నేరుగా ఛాతిలోనే గాయపరచడం సాధ్యమా అని కన్నబిరాన్ ప్రశ్నించారు. నక్సలైట్లు సులభంగా గదిలో దాక్కుని పోలీసులను కొన్ని గంటల సేపు ఎదుర్కొని వుండవచ్చును కదా అన్నారు.

అంతేకాక బుల్లెట్లు మృతుల శరీరంలో మీదినుండి కిందికి ప్రయాణించాయి. దూరంగా వున్న పోలీసులు కిటికీ గుండా కాలిస్తే బుల్లెట్ శరీరంలో నేరుగా పోతుంది. కాని మీదినుంచి కిందికి పోయే అవకాశం లేదని కన్నబిరాన్ అన్నారు. పౌరహక్కుల సంఘం బాధ్యులయిన గాంధి ఆస్పత్రి రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజగోపాలన్ కూడ యిదే అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఈ వాదనను అంగీకరించలేమని కమిషన్ అనింది. ఈ వాదనల్లోని తర్కానికి జవాబు చెప్పే ప్రయత్నం కమిషన్ చేయలేదు. ఒకవైపు ముగ్గురు పోలీసులు అనేక రౌండ్లు కాల్చారని, అవతలివైపు చనిపోయిన ఇద్దరే కాక యింకా కొంతమంది నక్సలైట్లు వున్నారని, ఎవరు ఎప్పుడు ఏ పొజిషన్‌లో వున్నారో తెలియదని, అందువల్ల కన్నబిరాన్ గారి వాదనను అంగీకరించలేమని కమిషన్ అనింది.

తర్కబద్ధమైన వాదనకు జవాబు చెప్పకుండా ఈ రకంగా కొట్టి పారేయడం సబబేనా?

10. ఫోరెన్సిక్, బాలిస్టిక్స్ నిపుణుల అభిప్రాయాలు కూడ పోలీసుల కథనాలకు మద్దతును యిస్తున్నాయని కమిషన్ నిర్ణయించిన పద్ధతి కూడ ఆసక్తికరమైనది.

రసూల్, విజయప్రసాద్‌రావుల శరీరాల మీద తూటాలు తగిలిన చోట బట్టలకు నల్లటి మరకలు వున్నాయా అనే ప్రశ్నను కమిషన్ చాలాసేపు చర్చించింది. వాళ్లను బహుశ రివాల్వరుతో కాల్చి వుండవచ్చని డాక్టర్ రాజగోపాలన్ అభిప్రాయ పడినందువల్ల వాళ్లను చంపింది రివాల్వర్‌తోనా లేక రైఫిల్‌తోనా అనే ప్రశ్నను కూడ కమిషన్ చర్చించింది. బాలిస్టిక్స్ నిపుణుడు శివకుమార్ వాంగ్మూలం ఆధారంగా వారిని కాల్చింది రైఫిళ్లతోనేనని కమిషన్ నిర్ధారించింది. బాగానే వుంది. వాళ్ల బట్టల మీద నల్లటి మరకలు లేవు కాబట్టి ఒక మీటరు నుండి మూడు వేల మీటర్ల లోపు దూరాన నిలబడి పోలీసులు వాళ్లను కాల్చారని ఆ నిపుణుడు అభిప్రాయపడ్డాడు. తాము 120 అడుగుల దూరం నుండి కాల్పులు జరిపామన్న పోలీసుల కథనానికి యిది విరుద్ధంగా లేదని కమిషన్ అంటుంది. ఇంత అస్పష్టమైన చర్చ కమిషన్ ఎందుకు చేయాలో అర్థం కాదు. పట్టుకుని కాల్చినా ఒక మీటరు కంటే ఎక్కువ దూరంలో నిలబెట్టి కాల్చవచ్చు. అప్పుడు కూడ బట్టలపై నల్లటి మరకలు వుండవు. రివాల్వరుతో కాక రైఫిల్ తో కాల్చవచ్చు. బాలిస్టిక్స్ నిపుణుడు చెప్పిన సాక్ష్యాన్ని బట్టి జరిగినది యిది కాదని కమిషన్ అనగలదా? మృతుల శరీరాలకు తుపాకి ఆనించేంత దగ్గరగా పెట్టి కాలిస్తే ఆ సంగతి బాలిస్టిక్స్ నిపుణుడు నిర్ధారించగలుగుతాడు. కాని వేరే ఏ విధంగా జరిగినా అది బాలిస్టిక్స్ పరిశోధనలో తెలిసే అవకాశం లేదు. బాలిస్టిక్స్ నిపుణుడి సాక్ష్యం పోలీసుల కథనానికి మాత్రమే కాదు పది రకాల (పరస్పర భిన్నమైన) కథనాలకు కూడ మద్దతు యివ్వగలదు. ఆ సాక్ష్యం స్వభావమే అంత.

పోలీసులు రసూల్‌ను, విజయప్రసాదరావును పట్టుకుని తీసుకొచ్చి గదిలో ఒకరిని, గది బయట ఒకరిని చేతులు ఎత్తి నిలబడమని ఆదేశించి తాము ఒక మీటరు కంటే ఎక్కువ దూరాన నిలబడి కాల్చేశారనుకోండి. అప్పుడు శవాల శరీరాలపై బుల్లెట్ గాయాలు యింతకంటే భిన్నంగా కనిపిస్తాయా? బాలిస్టిక్స్ నిపుణుడి నివేదిక యింతకంటే భిన్నంగా వుంటుందా?

శవపరీక్ష చేసిన ఫోరెన్సిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ దూడయ్యగారు, శవపరీక్ష రిపోర్టును పరిశీలించిన ఫోరెన్సిక్ ప్రొఫెసర్ పట్నాయక్ గారు కూడ మృతులు బుల్లెట్ గాయాల వల్ల చనిపోయారని, అవి రైఫిల్ గాయాలని, నాలుగు నుండి మూడు వేల మీటర్ల లోపు దూరం నుండి కాల్చిన గాయాలని అభిప్రాయపడ్డారు. ఇది కూడ పోలీసుల కథనానికి అనుకూలంగా వుందని కమిషన్ భావించింది. పైన చెప్పినట్టు యిది పోలీసుల కథనానికే కాదు దానికి పూర్తిగా భిన్నమైన కథనానికి కూడ అనుకూలంగా వుండగలదు.

ఈ చర్చ వల్ల ఏం రుజువయిందో టి.ఎల్.ఎన్.రెడ్డి గారికే తెలియాలి.

11. గులాం రసూల్, విజయ ప్రసాదరావులు యిద్దరూ నక్సలైట్లేనని రుజువు చేయడానికి టి.ఎల్.ఎన్.రెడ్డి కమిషన్ చాలా శ్రమ తీసుకున్న సంగతి యిప్పటికే పత్రికలలో వచ్చింది. కమిషన్ ఈ విషయంలో చాలా విమర్శకు గురైంది కూడ. వాళ్లిద్దరూ నక్సలైట్లేనని ఒకవేళ రుజువయితే మాత్రం ఏం? నక్సలైట్లయితే తీసుకుని పోయి కాల్చి పారేయొచ్చా?

వాళ్లిద్దరూ నక్సలైట్లేనని రుజువు చేయడానికి కమిషన్ అంత శ్రమ ఎందుకు తీసుకుందో తెలిస్తే ఈ రకమైన ప్రశ్నలు తలెత్తవు. నక్సలైట్లయితే కాల్చి పారేయొచ్చని కమిషన్ అనలేదు.

మసీదుగూడ ఎన్‌కౌంటర్ గురించి పోలీసులు చెప్పిన కథనానికి అనుకూలంగా అందులో పాల్గొన్న నలుగురు పోలీసులూ సాక్ష్యం చెప్పారు. ఫోరెన్సిక్ నిపుణులు, బాలిస్టిక్స్ నిపుణుడు యిచ్చిన వాంగ్మూలాలు కూడ పోలీసుల కథనానికి బలం చేకూర్చాయి. పోలీసుల కథనం అసంబద్ధమనీ లేదా పోలీసుల ప్రవర్తన అనుమానాస్పదంగా వుందని కొందరు సాక్షులు యిచ్చిన వాంగ్మూలం, చేసిన వాదన

నమ్మశక్యం కాదు; విశ్వసనీయం కాదని కమిషన్ భావించింది. ఇదంతా యిప్పటికే ఏ విధంగా రుజువై పోయిందో చూశాం. ఇంక మిగిలిన ప్రశ్న ఏమిటంటే, పత్రికా విలేఖరి అయిన గులాం రసూల్, పోస్ట్ గ్రాడ్యుయేట్ అయిన విజయప్రసాదరావులు అంత రాత్రివేళ ఆ పాడుబడిన గదిలో, గ్రామానికి ఒక కిలోమీటరు దూరంలో, గుట్టల మధ్య నక్సలైట్లతో ఎందుకు కూర్చుని వుంటారు? వాళ్లు కూడ నక్సలైట్లేనని రుజువయితే ఈ సంశయం కూడ తీరిపోతుంది. పోలీసుల కథ పూర్తిగా రుజువయి పోతుంది.

'ఈ ప్రశ్నకు జవాబు చెప్పడం కోసమా అన్నట్టు పోలీసులు గులాం రసూల్, విజయప్రసాదరావులకు ఆలేరు ప్రాంతంలో పనిచేస్తున్న పీపుల్స్‌వార్ నక్సలైట్లతో వున్న సన్నిహిత సంబంధాన్ని గురించి చెప్పే సాక్షులను ప్రవేశపెట్టారు' అని కమిషన్ అంటుంది.

ఏ ఆలేరు దళంతోనైతే వాళ్లిద్దరికీ సంబంధాలు వున్నాయని చివరికి కమిషన్ నిర్ధారించిందో ఆ ఆలేరు దళంలో పనిచేసి లొంగిపోయిన మాజీ నక్సలైట్లను పోలీసులు సాక్షులుగా ప్రవేశపెట్టారు. నలుగురు మాజీ నక్సలైట్లు సాక్ష్యం చెప్పారు. రసూల్‌కు తమ పార్టీతో సంబంధాలు వుండేవని, పార్టీ రహస్య సమావేశాలకు హాజరయ్యే వాడని, పార్టీ తరపున వ్యాపారస్తుల దగ్గర బలవంతంగా డబ్బులు వసూలు చేసేవాడని, పార్టీకి సలహాలిచ్చేవాడని చెప్పారు. జగన్ అనే మారు పేరుతో వ్యవహరించే వాడని చెప్పారు. రసూల్‌తో పాటు విజయప్రసాదరావు కూడ హాజరయ్యేవాడని చెప్పారు.

రసూల్ జగన్ అనే మారు పేరుతో వ్యవహరించే వాడని, రివాల్వరు చూపించి తమ దగ్గర పార్టీ పేరిట పెద్ద మొత్తాలు వసూలు చేశాడని మరో నలుగురు వ్యక్తులు కూడ కమిషన్‌కు వాంగ్మూలం యిచ్చారు.

వీళ్లందర్నీ పోలీసులే తీసుకొచ్చారు కాబట్టి వీళ్ల సాక్ష్యం నమ్మదగినది కాదేమోనన్న సంశయం కమిషన్‌కు రాలేదు. నక్సలైట్లకు వ్యతిరేకంగా సాక్ష్యం యిస్తే నక్సలైట్లు ప్రతీకారం తీర్చుకుంటారని తెలిసి కూడ వీళ్లందరూ ధైర్యంగా వాంగ్మూలం ఇచ్చారంటే ఆ వాంగ్మూలం నిజమే అయ్యుండాలని కమిషన్ భావించింది. ఈ ఒక్క వాదనతో వీళ్లందరి సాక్ష్యాన్ని స్వతంత్రమైన ఆధారాలేమీ లేకుండా నమ్మదలచుకుంది.

(ప్రకాశ్ కూడ పోలీసులు ప్రతీకారం తీర్చుకుంటారని తెలిసి కూడ వాళ్లకు వ్యతిరేకంగా సాక్ష్యం యిచ్చాడు. మరి అతని వాంగ్మూలం కమిషన్ ఎందుకు నమ్మలేదు?)

నక్సలైట్లు కానివాళ్లకు నక్సలైట్లని ముద్రవేస్తే నక్సలైట్లకు కోపం ఎందుకు వస్తుంది? వాళ్లు ప్రతీకారం ఎందుకు తీర్చుకుంటారు? కాని రసూల్, విజయ ప్రసాదరావులకు నక్సలైటు ముద్ర వేయడం వల్ల పోలీసులకు ప్రయోజనం చాలా వుంటుంది. ఎన్‌కౌంటర్‌ను సమర్థించుకోవడానికి అది ఉపయోగపడుతుంది. కాబట్టి పోలీసులు తీసుకొచ్చిన సాక్షులు తమకు ఏ ప్రమాదం లేకుండా నక్సలైట్లు కాని వాళ్లను నక్సలైట్లు అని రుజువు చేసే కథలు చెప్పి పోలీసులకు మేలు చేయొచ్చు. వాళ్లకు లేని ప్రమాదం ఉందని కమిషన్ ఊహించి వాళ్ల వాంగ్మూలం నమ్మదగిందని సర్టిఫై చేయడం హేతుబద్ధం కాదు.

పోలీసులు తీసుకొస్తే వచ్చినవాళ్లు పోలీసులకు అనుకూలంగా కాక వ్యతిరేకంగా చెపుతారా? స్వతంత్రమైన సాక్ష్యం ఒక్కటి కూడ లేకుండా వాళ్ల సాక్ష్యం నమ్మడం సహేతుకమేనా? పోలీసులు వాళ్లను 'చంపుతామ'ని బెదిరించి తీసుకొని వచ్చి వుండవచ్చు కదా? 'హింస నక్సలైట్ల మతం అని ఎవరికి తెలియదు' అని కమిషన్ తన వాదనను సమర్థించుకోవడానికి అంటుంది. కాని హింస పోలీసుల మతం కూడ కదా? పోలీసుల కథకు అనుకూలంగా ఎవరు సాక్ష్యం చెప్పినా నక్సలైట్లు ప్రతీకారం తీర్చుకుంటారన్న భయం వుండి కూడ చెప్పారు కాబట్టి అది విశ్వసనీయమని కమిషన్ భావిస్తుంది. ప్రతీకారం తీర్చుకోవడంలో పోలీసులు ఎవరికైనా తీసిపోయారా? పోలీసుల కథకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పేవారి కథనాన్ని విశ్వసించడానికి యిదే తర్కం ఎందుకు వర్తించదు?

పోలీసులకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పడంలో ప్రమాదం వుండడం మాత్రమే కాదు, అసలు ఆ అవసరం కూడ కమిషన్ ముందు సాక్ష్యం చెప్పిన వాళ్లెవరికీ లేదు. ప్రకాశ్‌కు లేదు. నాగిరెడ్డికి లేదు. గులాం ముస్తఫాకు లేదు. గులాం అహమ్మద్‌కు లేదు. ఐనా వాళ్ల వాంగ్మూలాలను కమిషన్ చాలా సులభంగా అబద్ధాలని కొట్టిపారేస్తుంది. కాని కేసులో నిందితులైన పోలీసులకు అబద్ధాలు చెప్పించాల్సిన అవసరం వున్నప్పటికీ వాళ్లు చెప్పించిన అన్ని విషయాలను స్వతంత్ర ఆధారం ఏమీ లేకుండా కూడ కమిషన్ నమ్ముతుంది. ఈ తర్కాన్ని ఏమని వర్ణించాలో అర్థం కాదు.

తన భర్తకు నక్సలైట్లతో ఎట్టి సంబంధాలూ లేవని గులాం రసూల్ భార్య జాకీరా బేగం వాంగ్మూలం యిచ్చింది. అదే విషయం గులాం ముస్తఫా, గులాం అహమ్మద్ చెప్పారు. రసూల్ సహ ఉద్యోగి కాసుల ప్రతాపరెడ్డి కూడ చెప్పాడు. తన కుమారుడికి నక్సలైట్లంటే ఎవరో కూడ తెలియదని విజయప్రసాదరావు తల్లి ఎలిజిబెత్ చెప్పింది. వీళ్లందరి వాంగ్మూలాలను పోలీసులు ప్రవేశపెట్టిన సాక్షుల వాంగ్మూలాలకు వ్యతిరేకమైన సాక్ష్యంగా కమిషన్ భావించి వుండవచ్చు. కమిషన్ కనీసం వీళ్ల వాంగ్మూలాలను ప్రస్తావించను కూడ లేదు. వాళ్ల మాటలు ఎందుకు నమ్మకూడదు? వాళ్లు బంధుప్రీతితో, మిత్రపక్షపాతంతో అబద్ధాలు చెప్పే అవకాశం వుంది కాబట్టి నమ్మకూడదు. మరి పోలీసులు ప్రవేశపెట్టిన సాక్షులు పోలీసుల ప్రోద్బలంతో, లేకపోతే పోలీసుల నుండి తమకు రక్షణ అవసరమన్న స్వార్థంతో, లేకపోతే భయంతో అబద్ధాలు చెప్పి వుండవచ్చు కదా! స్వతంత్రమైన ఆధారాలు లేకుండా ఆ సాక్ష్యాలను ఎందుకు నమ్మాలి?

ఇద్దరు వ్యక్తులను హతమార్చారన్న తీవ్రమైన అభియోగం పోలీసుల మీద వుంది. దాన్నుండి తప్పించుకోవడానికి పోలీసులు సహజంగానే సాక్ష్యాలు ప్రవేశ పెడతారు. ఆ పని నిందితులు ఎవరైనా చేస్తారు. ఐతే ఇతరులలాగ కాక పోలీసుల చేతిలో దండనాధికారం వుంది కాబట్టి వాళ్లు భయపెట్టి బెదిరించి సాక్ష్యాలు చెప్పించగలరు. వాళ్లకు అందుబాట్లో ఎన్నో మార్గాలున్నాయి. వాళ్లు ప్రవేశపెట్టిన ఏ సాక్ష్యాన్నయినా స్వతంత్రమైన ఆధారం లేకుంటే నమ్మకుండా ఉండటం సబబుగా వుంటుంది. దాని బదులు కమిషన్ తన నివేదికలో ఆద్యంతం పోలీసులు ప్రవేశ పెట్టిన సాక్ష్యాలను ఎటువంటి విచక్షణ లేకుండా విశ్వసించింది. అబద్ధాలు చెప్పవలసిన అవసరం లేనివాళ్ల వాంగ్మూలాలను మట్టుకు అనుమానంగా చూసింది.

గులాం రసూల్‌కు నక్సలైట్లతో 'సంబంధాలు' వున్నాయా లేదా అన్న ప్రశ్నను చర్చించవలసివస్తే దానికి ఎడిటర్స్ గిల్డ్ తన నివేదికలో చక్కగా సమాధానం చెప్పింది. 'రసూల్‌కు నక్సలైట్లతో సంబంధాలు వుంటే వుండి వుండవచ్చు. సమాజంలో ఏం జరుగుతున్నదో తెలియజేయడం విలేఖరుల విధి. ఈ విధి నిర్వహణలో విలేఖరులు అనుసరించవలసిన ప్రవర్తనా నియమావళికి పోలీసుల మాన్యువల్ ప్రమాణం కాజాలదు. ఆ వృత్తికి సంబంధించిన సంస్థలు ఈ విషయాలను నిర్ణయించవలసి వుంటుంది' అని ఎడిటర్స్ గిల్డ్ అనింది. తెలంగాణ జిల్లాలలో నక్సలైట్లు ఒక

రాజకీయశక్తి. వాళ్ల రాజకీయాలతో అందరూ ఏకీభవించకపోయినా వాళ్లతో 'సంబంధాలు' లేకుండా బతకడం సాధ్యం కాదు. ముఖ్యంగా ప్రజాజీవితానికి సంబంధించిన వృత్తులు నిర్వహించే విలేఖరులు, న్యాయవాదులు, ప్రభుత్వ ఉద్యోగులు, అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు మొదలైనవాళ్లకు అసలు సాధ్యం కాదు. నక్సలైటు అనగానే కేవలం హింస జ్ఞాపకం వచ్చేవాళ్లకు యిది అర్థం కాదు.

రసూల్‌కు నక్సలైట్లతో సంబంధం వుంది అని చెప్పడానికి పోలీసులు ప్రవేశ పెట్టిన సాక్షులు చెప్పిన నిర్దిష్టమైన విషయాలు:

i) నక్సలైట్ల ప్రకటనలు పేపర్లో ప్రచురించడానికి రసూల్ తోడ్పడేవాడు. ఈ పని విలేఖరులు అందరూ తమ వృత్తిగా చేస్తారు.

ii) అరెస్టయిన రాడికల్స్‌ను విడిపించడానికి రసూల్ సహాయం చేసేవాడు. ఈ పని తెలంగాణ జిల్లాలలో ప్రతి గ్రామ సర్పంచ్, ప్రతి రాజకీయ నాయకుడు చేస్తున్నారు.

iii) శ్రీనివాసపురంలో రజిత, శ్యామ్ అనే ఇద్దరు ప్రేమికుల పెళ్లి నక్సలైట్ల సహాయంతో రసూల్ చేయించాడు. పెద్దలకు యిష్టం లేకుండా పెళ్లి చేసుకునే ప్రేమికులు నక్సలైట్లను ఆశ్రయించడం, దానికి స్థానిక సానుభూతిపరులు సహకరించడం తెలంగాణ జిల్లాలలో కొత్త సంగతి కాదు. ఇటువంటివి తరచూ జరుగుతుంటాయి. జర్నలిస్టుల సంఘం కూడ యిలాంటి పెళ్లిళ్లను తమ కార్యాలయంలోనే చేయించిన సంఘటనలు వున్నాయి.

iv) రసూల్, విజయప్రసాదరావులు నక్సలైట్ల రహస్య సమావేశాలలో పాల్గొనేవారు. ఈ సంగతి పోలీసుల ద్వారా కమిషన్ దగ్గరికి వచ్చిన మాజీ దళసభ్యులు మాత్రమే చెప్పారు. దీనికి స్వతంత్రమైన ఆధారం లేదు.

v) రసూల్ అనేక సాంఘిక సమస్యలలో జోక్యం చేసుకుని నక్సలైటని చెప్పి డబ్బు వసూలు చేసుకున్నాడు. పేదవాళ్లకు అన్యాయం చేసిన ధనవంతులను బెదిరించి నక్సలైటునని చెప్పి డబ్బులు వసూలు చేసుకున్నాడు. దీనిలో డబ్బులు వసూలు చేసుకోవడం అనే అంశాన్ని తీసేస్తే మిగిలిన విషయాలను

సులభంగానే అర్థం చేసుకోవచ్చు. ఎక్కడ అన్యాయం జరిగినా జోక్యం చేసుకోవడం, అన్యాయం చేసేవారిని ఎదిరించడం రసూల్ స్వభావమని పోలీసులు తీసుకొచ్చిన ఈ సాక్షులే కాక రసూల్ తండ్రి, అన్న, కారు డ్రైవరు ప్రకాశ్ కూడ చెప్పారు. ఐతే పోలీసులు తీసుకొచ్చిన సాక్షులు అదనంగా ఏం చెప్పారంటే రసూల్ ఆ విధంగా జోక్యం చేసుకొని నక్సలైట్ల తరపున ఐదు వేలో, పది వేలో బలవంతంగా వసూలు చేశాడని. రసూల్ ఎవరికి వ్యతిరేకంగానైతే జోక్యం చేసుకున్నాడో వాళ్లనే పోలీసులు సాక్షులుగా ప్రవేశపెట్టారు. వాళ్లకు రసూల్‌ను బదనాం చేయడంలో స్వార్థం వుందని కమిషన్ ఎందుకు భావించలేకపోయింది? రసూల్ జోక్యం చేసుకున్నది న్యాయం చేయడం కోసం కాదని, నక్సలైట్ల తరపున బెదిరించి డబ్బులు దండుకోవడం కోసమని వాళ్లు చెప్పడంలో ఆశ్చర్యం ఏముంది? విచిత్రమేమిటంటే డబ్బులు దండుకోవడం కోసం సాంఘిక సమస్యలలో రసూల్ జోక్యం చేసుకున్నాడని చెప్పే ఈ సాక్షులను టి.ఎల్.ఎన్. రెడ్డిగారు వెంటనే నమ్ముతారు కాని కేవలం మానవతా భావంతో తనకు సహాయం చేశాడని చెప్పిన ప్రకాశ్ సాక్ష్యం నమ్మరు. ఏ మంచితనమైతే రసూల్ ప్రాణం తీసిందో ఆ మంచితనాన్ని టి.ఎల్.ఎన్. రెడ్డిగారు నమ్మరు. అది మినహా అతని గురించి చెప్పిన మిగిలిన అన్ని సంగతులూ నమ్ముతారు.

జగన్ అని మారు పేరు పెట్టుకుని రసూల్ రాత్రిపూట జనాన్ని బెదిరించి డబ్బులు వసూలు చేసింది ఏ ప్రాంతంలో? తనకు పరిచయస్తులు లేని దూరప్రాంతంలోనా? కాదు. తన స్వగ్రామానికి సమీప ప్రాంతంలోనే, తాను పగటిపూట విలేఖరిగా వార్తలు సేకరించిన ప్రాంతంలోనే ఆయన రాత్రిపూట జగన్ అనే నక్సలైటుగా డబ్బులు వసూలు చేసేవాడట. ఇంతకంటే తెలివితక్కువతనం వేరే వుంటుందా? రసూల్ తమ నుండి బలవంతంగా డబ్బులు వసూలు చేశాడని చెప్పిన సాక్షుల ఊర్లు హబ్సిగుడా, బీబీనగర్, రాయగిరి, భువనగిరి. ఇవన్నీ రసూల్ విలేఖరిగా పనిచేసి విలేఖరిగా ప్రజలకు పరిచయమైన ప్రాంతాలే. ఇక్కడే జగన్ అనే మారు పేరుతో నక్సలైటుగా అతను పనిచేయడం, ఆ సంగతి పోలీసులకు తెలియక పోవడం సాధ్యమా?

12. నక్సలైట్ల రహస్య సమావేశాలకు రసూల్, విజయప్రసాదరావులు హాజరయ్యారని మాజీ దళసభ్యులు చెప్పారు. ఇది నిజమో అబద్ధమో తేల్చే స్వతంత్ర సాక్ష్యాన్ని సేకరించడం కష్టం. కాని వాళ్లు చెప్పిన ఒక సంగతి మాత్రం అబద్ధమని టంగుటూరు గ్రామసర్పంచ్ అరుణ తన వాంగ్మూలంలో చెప్పింది.

అరుణ భర్తను పీపుల్స్‌వార్ నక్సలైట్లు చంపిన తర్వాత రసూల్ అరుణతో సన్నిహితంగా మెలగసాగాడనీ, వాళ్లిద్దరికీ లైంగిక సంబంధం వుందని ప్రజాపంథా పార్టీవాళ్లు అనుమానించి రసూల్‌ను చంపుతామని బెదిరించారనీ, అందువల్లే రసూల్ హైదరాబాద్‌కు తరలివెళ్లిపోయాడనీ ఒక మాజీ నక్సలైట్ కమిషన్ ముందు చెప్పాడు. అరుణ తన వాంగ్మూలంలో యిదంతా అబద్ధమని వివరించింది. గ్రామ సర్పంచ్ అయిన తన భర్త చనిపోయేనాటికి గ్రామపంచాయతీ అకౌంట్‌లు పూర్తిగా సెటిల్ చేయకపోవడం, అతని తర్వాత సర్పంచ్ అయిన తనను ఆడిటర్లు ఈ విషయంలో యిబ్బంది పెట్టడం, ఈ విషయంలో రసూల్ తనకు చాలా సహాయం చేయడం ఆమె తన వాంగ్మూలంలో వివరించి చెప్పింది. తన పార్టీవాళ్లు రసూల్‌ను అనుమానించలేదని, బెదిరించలేదని చెప్పింది. కమిషన్ తన నివేదికలో అరుణ వాంగ్మూలాన్ని ఉటంకించింది కాని ఏ విషయం చెప్పడం కోసమైతే అరుణ వాంగ్మూలం యిచ్చిందో ఆ విషయాన్ని మాత్రం ప్రస్తావించలేదు.

13. రసూల్ నక్సలైటనే సంగతి పోలీసులకు ఎప్పుడు తెలిసింది. అతను విలేఖరిగా పనిచేస్తున్న ప్రాంతంలోనే జగన్ అనే మారుపేరుతో నక్సలైటుగా వ్యవహరిస్తూ వ్యాపారస్తులను బెదిరించి డబ్బులు వసూలు చేసుకుంటున్నాడనేది కదా వారి ఆరోపణ. కమిషన్‌కు వాంగ్మూలం యిచ్చిన బాధితులు చెప్పిన తేదీలను గమనిస్తే ఒకాయనను రసూల్ 1990 డిసెంబర్‌లో బెదిరించాడు. ఇంకొకాయనను 1991 జనవరిలో బెదిరించాడు. రసూల్‌ను పోలీసులు చంపింది 1991 డిసెంబర్‌లో. ఈ లోపల ఎప్పుడూ పోలీసులకు రసూల్ సంగతి తెలియలేదు. 1991 డిసెంబర్ 28 తెల్లవారుజామున అతనిని కాల్చి చంపినప్పటికి కూడ తెలియదు. డిసెంబర్ 29 సాయంత్రం 5 గంటలకు శవాలను తగలబెట్టినపుడు కూడ తెలియదు. కాని 30వ తేదీ పేపర్లలో మసీదుగూడ మృతులు గులాం రసూల్, విజయప్రసాదరావులన్న వార్త రాగా జిల్లా ఎస్.పి. భాస్కరరెడ్డి ఆ రోజంతా ముఖం చాటు చేసి ఆ రాత్రి 9 గంటలకు

ఎన్‌కౌంటర్ మృతులలో ఒకరు సత్యం దళానికి చెందిన గులాం రసూల్ అని పత్రికా ప్రకటన యిచ్చాడు. ఇది కమిషన్‌కు వింతగా అనిపించలేదా? అకస్మాత్తుగా ఆ రోజే రసూల్ సంగతి పోలీసులకు ఎలా తెలిసింది? ఎవరు చెప్పారు? కమిషన్ జిల్లా ఎస్.పి. భాస్కరరెడ్డిని పిలిపించి ఈ ప్రశ్నలు ఎందుకు అడగలేదు? తాము చంపినది రసూల్‌నని పేపర్‌లకు ఎక్కిన తర్వాత ఈ కథ కల్పించారన్న అనుమానం కమిషన్‌కు ఎందుకు రాలేదు?

14. వివిధ సందర్భాలలో రసూల్ న్యాయం పక్షాన నిలబడడం వల్ల అతనికి పోలీసులతోను, ఇతర పెత్తందార్లతోను శత్రుత్వం ఏర్పడిందని, అందువల్ల పోలీసులు అతన్ని చంపారని వివిధ సాక్షులు చేసిన వాదనను కమిషన్ పరిశీలించింది. అయితే వాటిలో పసలేదని కొట్టిపారేసింది.

హైదరాబాద్ నగరంలో భూమి కుంభకోణాల గురించి రసూల్ రిపోర్టులు రాశాడని, అందులో భాగంగా నగరంలో బాగా సంచలనం రేపిన బతుకమ్మకుంట, ఎన్టీఆర్‌నగర్ గుడిసెవాసుల సమస్యల గురించి రాశాడని పలువురు తమ వాంగ్మూలాలలో చెప్పారు. ఈ కుంభకోణాలలో పోలీసులు బలవంతులైన కబ్జాదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని రసూల్ రాయడం వల్లనే పోలీసులకు అతనిపై కోపం వచ్చిందని చెప్పారు. డిసెంబర్ 26వ తేదీన ఎస్.పి. కార్యాలయంలో రసూల్‌కు, డి.ఎస్.పి. రాజయ్యకు జరిగిన వాగ్వివాదంలో బతుకమ్మకుంట, ఎన్టీఆర్‌నగర్‌ల గురించి రసూల్ రాసిన రిపోర్టులను డి.ఎస్.పి. ప్రస్తావించి రసూల్‌ను దూషించాడని ప్రకాశ్ చెప్పాడు.

అసలు రసూల్ అనే విలేఖరితో తనకు పరిచయమే లేదని, అతను రాసిన రిపోర్టులు తాను చూడనే లేదని, బతుకమ్మ కుంట తన పరిధిలోకి రానే రాదని దీనికి జవాబుగా రాజయ్య కమిషన్‌కు చెప్పాడు. 26వ తేదీన జరిగినట్టు ప్రకాశ్ చెప్పిన సంఘటన అబద్ధమన్నాడు.

బతుకమ్మకుంట సరూర్‌నగర్ సబ్ డివిజన్‌లో లేని మాట నిజమే కాని ఎన్టీఆర్ నగర్ వుంది. ఎన్టీఆర్ నగర్ విషయంలో డి.ఎస్.పి. రాజయ్య కబ్జాదారుల గూండాలకు మద్దతుగా నిర్వర్తించిన పాత్ర గురించి అప్పట్లో అన్ని దినపత్రికలలోను వార్తలు వచ్చాయి. ఆ ఆరోపణలను ఖండిస్తూ రాజయ్య యిచ్చిన ప్రకటనలు కూడ వచ్చాయి.

కమిషన్ ఏదైనా దినపత్రిక కార్యాలయానికి సమన్స్ పంపించి ఆనాటి పత్రికల ప్రతులను తెప్పించుకుని వుండవచ్చును. 'ఉదయం' పత్రిక కార్యాలయానికి సమన్స్ పంపించి భూమి కుంభకోణాలపై రసూల్ రాసిన రిపోర్టు ప్రతులను తెప్పించుకుని వుండవచ్చును. ఈ ప్రయత్నమేదీ కమిషన్ చేయలేదు. ఆ రిపోర్టులు రాజయ్య చదివాడో లేదో ఎవరూ రుజువు చెయ్యలేరు. కాని రాజయ్యకు, యితర పోలీసు అధికారులకు, రాజకీయ నాయకులకు కోపం తెప్పించగల విధంగా రసూల్ రాశాడో లేదో రిపోర్టులు చదివితే రుజువయ్యేది. కమిషన్ ఆ ప్రయత్నం చేయకుండా తనకు ఏమీ తెలియదని రాజయ్య చెప్పాడు కాబట్టి అతనికి కక్ష వుండే అవకాశం లేదని సంతృప్తి చెందింది.

భువనగిరి సి.ఐ. సుదర్శన్ రెడ్డి రసూల్‌ను అనేక సందర్భాలలో బెదిరించిన సంగతి కూడ గులాం ముస్తఫా, గులాం అహమ్మద్‌లు తమ వాంగ్మూలాలలో చెప్పారు. రసూల్ నక్సలైట్లను ఇంటర్వ్యూ చేసి పేపర్‌లో ప్రచురించేవాడు. వాళ్లకు సంబంధించిన వార్తలు రాసేవాడు. గ్రామంలో రాడికల్స్ అరెస్టయితే విడిపించడానికి పోలీసు స్టేషన్‌కు పోయేవాడు. సి.ఐ. సుదర్శన్ రెడ్డి అతనికి నక్సలైటనే ముద్ర వేసి వేధించేవాడు.

రాజీవ్ గాంధి హత్య అనంతరం భువనగిరిలో జరిగిన అల్లర్లలో పోలీసుల లాఠీచార్జిలో చనిపోయిన రిక్షా కార్మికుడి విషయంలో గులాం రసూల్ భువనగిరి సి.ఐ.తో ఘర్షణకు దిగిన సంగతి యిప్పటికే ప్రస్తావించాం. ఈ విషయం గులాం అహమ్మద్ తన వాంగ్మూలంలో కూడ చెప్పాడు. సుదర్శన్ రెడ్డి రసూల్‌ను నక్సలైటని దూషించాడని, నీ అంతు చూస్తానన్నాడని అహమ్మద్ చెప్పాడు.

నక్సలైట్ల కోసం షారాజిపేటపైన సి.ఐ. సుదర్శన్ రెడ్డి దాడి చేసినపుడు రసూల్‌ను బెదిరించేవాడని, నక్సలైట్ల ఆచూకీ చెప్పమని ఒత్తిడి చేసేవాడని, ఒకనాడు రసూల్ చేతిలో ఎర్ర అట్ట వున్న పుస్తకం చూసి యిప్పుడు నిన్ను నక్సలైటని అరెస్టు చేస్తే ఏం చేస్తావని సి.ఐ. బెదిరించాడని అహమ్మద్ చెప్పాడు.

డిసెంబర్ 28న సి.ఐ. సుదర్శన్ రెడ్డి తనను ఆలేరు పోలీసు స్టేషన్‌కు పిలిపించుకుని అక్కడినుండి భువనగిరికి తీసుకుపోయే ప్రయత్నం చేశాడని అహమ్మద్ చెప్పాడు. ఈ సంఘటన వివరాలు పైన చూశాం. 29వ తేదీ సాయంత్రం పోలీసులు షారాజిపేట పైన దాడి చేసి తమ కార్ఖానాను చిందరవందర చేసిన వైనాన్ని రసూల్ తండ్రి గులాం ముస్తఫా తన వాంగ్మూలంలో చెప్పాడు. ఈ సంఘటన వివరాలను

కూడా పైన చూశాం. రసూల్ గ్రామం వదిలి పెట్టి హైదరాబాద్‌కు తరలిపోయిన తర్వాత పోలీసులు తరచుగా షారాజిపేటలోని తమ యింటికి వచ్చి రసూల్ గురించి వాకబు చేసేవాళ్లని అహమ్మద్ చెప్పాడు.

'ఆలేరు, భువనగిరి పోలీసులకు రసూల్‌పైన ప్రత్యేకమైన కక్ష, కోపం వున్నట్టు ఈ సాక్ష్యం రుజువు చెయ్యలేకపోయింది' అని కమిషన్ దీన్నంతా కొట్టిపారేసింది. గ్రామంలో రాడికల్స్ అరెస్టు కాగా రసూల్ భువనగిరికి పోయి వాళ్లను విడిపించగలిగాడంటే సి.ఐ. సుదర్శన్ రెడ్డికి రసూల్ పట్ల ప్రత్యేకమైన కోపం ఏమీ లేదని రుజువు అయినట్టేనని కమిషన్ అంటుంది. ఒక విలేఖరిగా పోలీసు స్టేషన్‌కు పోయినపుడు తమకు యిష్టమున్నా లేకపోయినా పోలీసులు కొంత గౌరవం యిస్తారు. అంతమాత్రం చేత పోలీసు స్టేషన్ కు రాడికల్స్ తరఫున వచ్చాడన్న కోపం మనస్సులో పెట్టుకోరన్న నమ్మకం లేదు.

ఐతే సుదర్శన్ రెడ్డికి రసూల్ మీద కోపం వుండడానికి ముఖ్యకారణంగా రసూల్ కుటుంబం భావించిన కథ వేరే వుంది. ఈ కథ గులాం ముస్తఫా తన వాంగ్మూలంలో చెప్పాడు. ముస్తఫా తాతగారి కాలంలో స్థానిక జాగీర్దారు వాళ్ల కుటుంబానికి షారాజిపేటలో 60 ఎకరాల పీర్ల ఈనాము యిచ్చాడు. ఐతే వారికి వ్యవసాయం చేసే అలవాటు లేకపోవడం వల్ల దానిని తుమ్మల చంద్రారెడ్డి అనే రైతుకు కౌలుకు యిచ్చాడు. ఈ తుమ్మల చంద్రారెడ్డి రాజకీయంగా, ఆర్థికంగా బలవంతుడు. అతని అల్లుడు ఒకప్పటి రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి కొండా వెంకట రంగారెడ్డి (రంగారెడ్డి జిల్లాకు ఈయన పేరే పెట్టారు. ఈయన మర్రి చెన్నారెడ్డికి మామగారు). ఈయన ఇల్లరికం వచ్చి షారాజిపేటలోనే స్థిరపడ్డాడు. నిజాం సంస్థానం ఉన్నంతకాలం వాళ్లు ఆ భూమికి కౌలు చెల్లించారు కాని పోలీసు యాక్షన్ తర్వాత ఆ భూమి తమదేనని ప్రకటించుకుని కౌలు చెల్లించడం మానేశారని ముస్తఫా అన్నాడు. రసూల్ పెరిగి పెద్దవాడయిన తర్వాత ఈ భూమి తిరిగి పొందడానికి చాలా కృషి చేశాడు. రెడ్లతో ఘర్షణకు దిగాడు. భువనగిరి సి.ఐ. సుదర్శన్ రెడ్డి వాళ్లకు బంధువు కావడం వల్ల ఈ క్రమంలో సుదర్శన్ రెడ్డికి, రసూల్‌కు మధ్య శత్రుత్వం పెరిగిందని ముస్తఫా చెప్పాడు.

యథాప్రకారం టి.ఎల్.ఎన్. రెడ్డిగారు ముస్తఫా కథనాన్ని వ్యతిరేకించే సాక్షి ఒకరిని పిలిపించుకున్నారు. ఆ భూమికి గ్రామంలో ప్రస్తుతం వారసుడైన కొండా కృష్ణకాంతరెడ్డిని పిలిపించుకుని అతని వాంగ్మూలం రాసుకున్నారు. దీనికి అభ్యంతరం ఏమీ లేదు కాని ఒకవైపు సాక్షులకు మాత్రమే దీనిని వర్తింపజేయడం, అవతలి వైపు ఎవరేమి చెప్పినా దానిని స్వతంత్రంగా నిర్ధారించుకునే ప్రయత్నం చేయకుండా సత్యంగా స్వీకరించడం చాలా విచిత్రమైన న్యాయవిచారణా పద్ధతి.

కృష్ణ కాంతరెడ్డి ఏం చెప్పాడు? నిజాం జమానాలో షారాజిపేట జాగీరు గ్రామం. జాగీరు గ్రామాలలో భూమిని మరొకరికి ఇనాముగా దత్తం చేసే అధికారం జాగీర్దారుకు లేదు. కాబట్టి ముస్తఫా పూర్వీకులకు జాగీర్దారు యిచ్చిన పీర్ల ఇనాము చెల్లదని కౌలుదారులు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కోర్టుకు పోయి తమకు అనుకూలంగా డిక్రీ తెచ్చుకున్నారని కృష్ణకాంతరెడ్డి చెప్పాడు. డిక్రీ కాపీని కూడ కమిషన్‌కు చూపించాడు. దానితో కమిషన్ సంతృప్తి చెంది ఆ భూమి కృష్ణకాంతరెడ్డిదేనని నిర్ణయించింది.

ఐతే ఏం రుజువయినట్టు? ఆ భూమి గురించి రసూల్ ఘర్షణ పడలేదని రుజువయిందా? సి.ఐ. సుదర్శన్ రెడ్డితో శత్రుత్వం తెచ్చుకోలేదని రుజువయిందా? చట్టంలో వున్న అనేక లొసుగుల వల్ల భూమి తగాదాలలో కోర్టు తీర్పులు ఒకరివైపు, న్యాయం యింకొకరి వైపు వుండడం కొత్త సంగతా? జాగీర్దారు తెలిసో తెలియకో ఆ భూమిని రసూల్ కుటుంబానికి ఇనాముగా యిచ్చాడు. దానిని వాళ్లు చంద్రారెడ్డికి కౌలుకు యిచ్చారు. ఆ తర్వాత కౌలుదారులు చట్టంలో జాగీర్దారుకు ఆ అధికారం లేదని వాదించి ఆ భూమి తమకే చెందుతుందని డిక్రీ తెచ్చుకున్నారు. అంతమాత్రం చేత ఆ భూమి నైతికంగా తమకే చెందుతుందని ముస్తఫా భావించడంలో తప్పు వుందా? తప్పయినా అది సహజం కాదా? ఆ కుటుంబంలో మొట్టమొదటి విద్యావంతుడైన రసూల్ ఆ భూమి కోసం ఘర్షణకు దిగడం సహజం కాదా? అతను ఘర్షణ పెట్టుకుని కౌలుదార్లకు బంధువయిన భువనగిరి సి.ఐ.కు శత్రువయ్యాడని చెపితే అసలు అతనికి చట్టంలో ఆ భూమిమీద హక్కు లేదు అని నిర్ధారించి టి.ఎల్.ఎన్. రెడ్డిగారు ఏం రుజువు చేసినట్టు? సుదర్శన్ రెడ్డికి రసూల్ పట్ల శత్రుత్వం లేదని రుజువు చేసినట్టా?

## ముగింపు

'న్యాయవిచారణ' అనేది ప్రజాజీవితంలో ప్రాముఖ్యం గల విషయాలపైన విచారణ జరిపి వాస్తవాలను వెలికితీసి ప్రభుత్వానికి తగు నిర్ణయాలు తీసుకునేందుకు ఉపయోగపడడం కోసం ఉద్దేశించబడ్డ ఒక ప్రజాస్వామిక వ్యవస్థ. దానిని ఈ రకంగా భ్రష్టు పట్టించడం వల్ల నష్టం జరిగేది కేవలం 'ఎన్‌కౌంటర్' మృతులయిన గులాం రసూల్, విజయప్రసాదరావుల కుటుంబాలకు, బంధుమిత్రులకు కాదు. అది ప్రజాస్వామ్య వ్యవస్థకే నష్టకరం. ప్రజాస్వామ్యానికి సంబంధించిన ప్రతి ఒక్క వ్యవస్థ సక్రమంగా పనిచేసినప్పుడే ప్రజాస్వామ్యం అనేదానికి అర్థం ఉంటుంది. గత కొద్ది సంవత్సరాలుగా బాధ్యతగల వాళ్లే ఒక్కొక్క ప్రజాస్వామ్య వ్యవస్థను పనిగట్టుకొని ధ్వంసం చేస్తున్నారు. స్వార్థం వల్ల కావచ్చు, అవినీతి వల్ల కావచ్చు, ధనవంతుల పట్ల పక్షపాతం వల్ల కావచ్చు, బలవంతుల కొమ్ముకాయడానికి కావచ్చు, ఒట్టి నిర్లక్ష్యం వల్ల కావచ్చు. ఎవరు ఏ కారణంగా చేసినా అందరూ కలిసి భారతదేశాన్ని ప్రజాస్వామ్యంగా వర్ణించడానికి సందేహించే స్థితి కల్పిస్తున్నారు. 'మసీదుగూడ' ఘటన పైన జస్టిస్ టి.ఎల్.ఎన్. రెడ్డిగారు ప్రకటించిన నివేదిక ఈ సంప్రదాయానికి చెందినదే.

మన రాష్ట్రంలో ఎన్నో ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయి. వాటిలో ఒక 'మసీదుగూడ' ఘటనను న్యాయ విచారణకు తగిన ఘటనగా ప్రభుత్వం ఎందుకు భావించింది? 'ప్రజాజీవితంలో ప్రాముఖ్యం గల' విషయంగా ఎందుకు భావించింది?

ప్రభుత్వం ఎందువల్ల భావించినా, ఎన్‌కౌంటర్ మృతులలో ఒకరు పత్రికా విలేఖరి కావడం మసీదుగూడ ఘటనకు ప్రత్యేకతను ఇచ్చింది. జర్నలిస్టులు వృత్తి రీత్యానే బలవంతులకూ, అధికారంలో ఉన్న వారికీ సన్నిహితంగా మెలుగుతారు. రాజీ పడకుండా తమ వృత్తికి న్యాయం చేయాలని భావించే జర్నలిస్టులు ఏదో ఒక దశలో బలవంతులకూ అధికారంలో ఉండే వారికీ శత్రువులవుతారు. అదొక వృత్తి సంబంధమైన రిస్క్. తమకు శత్రువులయిన విలేఖరులపై అధికార బలం, ధనబలం, గూండాబలం ఉన్నవాళ్లు భౌతిక దాడులకు, ఇతర రూపాలలో ప్రతీకార హింసకు పాల్పడుతుంటారు. ఈ దాడులలో ప్రాణాలు కోల్పోయిన జర్నలిస్టులు చాలా మందే ఉన్నారు. కాళ్లు చేతులు విరగ్గొట్టుకున్న వారు ఇంకా ఎక్కువ మంది ఉన్నారు.

ఈ దాడులు కేవలం కొందరు వ్యక్తుల పైన దాడులు కావు. కొందరి వృత్తి నిబద్ధత పైన దాడులు కావు. ఇవి పత్రికా స్వేచ్ఛ పైన దాడులు. తమ సామాజిక జీవితానికి సంబంధించిన అన్ని వాస్తవాలను తెలుసుకోవడానికి ప్రజలకు ఉండే మౌలికమయిన హక్కు పైన దాడులు. అంటే పత్రికా విలేఖరుల పైన జరిగే ఏ దాడి అయినా ప్రజాస్వామ్యం పైన దాడే.

అందుకే ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో అటువంటి ప్రతి దాడీ 'ప్రజా జీవితంలో ప్రాముఖ్యం గల' ఘటనే. అందుకే ప్రతీ ఎన్‌కౌంటరూ విచారణ జరిపించవలసిన విషయమే అయినా ఒక జర్నలిస్టును కాల్చి చంపిన ఘటనకు కొంత ప్రత్యేకత ఉంటుంది.

మన రాష్ట్రంలో ముఖ్యంగా తెలంగాణ జిల్లాలలో పోలీసులకూ అధికారులకూ నచ్చని రాతలు రాసే జర్నలిస్టులకు 'నక్సలైట్' అని పేరు పెట్టి వేధించడం రసూల్ హత్యతో ప్రారంభం కాలేదు. కానీ అంతవరకూ బెదిరింపులు, అరెస్టులు, చిత్రహింసలకు పరిమితమయిన వేధింపు రసూల్‌తో హత్య రూపం తీసుకుంది.

మన రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో ముఖ్యంగా తెలంగాణ జిల్లాలలో నక్సలైట్లు ఒక ప్రబల రాజకీయ శక్తి. ఇది ఎవరి ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేని ఒక వాస్తవం. నక్సలైట్ల వల్ల మంచి జరుగుతుందనుకునే వారు, చెడు జరుగుతుందనుకునే వారు, ఎవరయినా సరే ఈ వాస్తవాన్ని గుర్తించి బ్రతకక తప్పదు.

నక్సలైట్లను అణచివేయడం అనే కర్తవ్య నిర్వహణలో పోలీసులకు ప్రభుత్వం చాలా ప్రాముఖ్యం ఇవ్వడం, పోలీసులు నిత్యం అరెస్టులకూ దాడులకూ అప్పుడప్పుడూ ఎన్‌కౌంటర్లకు పాల్పడడం కూడ ఈ జిల్లాలలో ప్రముఖ వాస్తవాలే. అది మంచిదేననుకునే వారు, తప్పు అనుకునే వారు, ఎవరయినా సరే ఈ వాస్తవాన్ని కూడ గుర్తించి బ్రతకక తప్పదు.

ఈ స్థితిలో ప్రజా జీవిత వాస్తవాలను ప్రజలకు అచ్చులో చూపించే కర్తవ్యాన్ని నిర్వర్తించే విలేఖరులు ఎంత జాగ్రత్తగా వ్యవహరించినా అందరి చేత మంచి వాళ్లనిపించుకోలేరు. ఎవరికో ఒకరికి కోపం తెప్పించకుండ ఉండలేరు.

ముఖ్యంగా, పోలీసు అత్యాచారం గురించి నిర్మొగమాటంగా రాసే విలేఖరులంతా పోలీసుల కోపానికి గురి అవుతున్నారు. అటువంటి వాళ్లకు 'నక్సలైట్'

అన్న ముద్ర వేసి బెదిరించడం, దూషించడం పోలీసులకు పరిపాటి అయింది. చాలమందిని (తెలంగాణ జిల్లాలలోనే కాక నక్సలైట్ ప్రాబల్యం ఉన్న ఇతర జిల్లాలలో కూడ) పోలీసులు అరెస్టు చేసి కేసులలో ఇరికించారు. కొందరి మీద టాడా కేసులు పెట్టారు. కొందరి మీద హత్య కేసులు పెట్టారు. కొందరిని లాకప్పులో చిత్రహింసలు పెట్టారు.

నక్సలైట్లు కూడ విలేఖరులను ఇన్ఫార్మర్లుగా, లేక పోలీస్ ఏజెంట్లుగా అనుమానించి బెదిరించిన సంఘటనలు, దాడి చేసిన సంఘటనలు నిజామాబాద్, కరీంనగర్, ఇతర తెలంగాణ జిల్లాలలోను అప్పుడప్పుడు జరిగాయి, జరుగుతున్నాయి. నల్గొండ జిల్లా మోత్కూరు 'ఉదయం' విలేకరి శ్రీధర రెడ్డిని పీపుల్స్‌వార్ నక్సలైట్లు 1994 జూన్ 23-24 అర్ధరాత్రి 'ఇన్ఫార్మర్' అన్న అరోపణ పెట్టి హత్య చేసారు. వెరసి, విలేకరి వృత్తి చేసేవారు భయం భయంగా బ్రతికే వాతావరణం కల్పించారు.

### నక్సలైట్లతో సంబంధాలున్నాయని పోలీసులు నిర్బంధించిన/కేసులలో ఇరికించిన విలేకరుల జాబితా

**సోలిపేట రామలింగారెడ్డి** దుబ్బాక (మెదక్ జిల్లా) ఉదయం విలేఖరి. 1990 జూలై 31 నాడు ఇతనిని టాడా కేసులో అరెస్టు చేసారు. ఇతని ఇల్లు సోదా చేయగా ఇంట్లో బాంబులు దొరికాయని అబద్ధపు కేసు పెట్టారు. 'నీ ఉద్యోగానికి రాజీనామా చేయి. నిన్ను ఎన్‌కౌంటర్ చేయాలి. నువ్వు విలేఖరిగా ఉంటే కష్టం' అని అతనితో సిద్దిపేట సి.ఐ. అన్నాడు.

**నరాల రమణయ్య** ఇచ్చోడ (ఆదిలాబాద్ జిల్లా) ఈనాడు విలేఖరి. ఇతనిని 1991 మార్చి 27న అరెస్టు చేసి మూడు టాడా కేసులు (ఆస్తులను దహనం చేసిన కేసులు) పెట్టారు.

**సింహభొట్ల సూర్య సుదర్శనం** కోరుకొండ (తూర్పు గోదావరి జిల్లా) ఆంధ్రభూమి విలేఖరి. ఇతనిని 1990 డిసెంబర్ 13న అరెస్టు చేసి హత్య, దొమ్మీ, భూమి దురాక్రమణ మొదలయిన సెక్షన్లు పెట్టారు. కేసులో పేర్కొన్న సంఘటనలు జరిగినప్పుడు అతను నిజానికి పంజాబులో ఒక విలేకరుల బృందం పర్యటనలో ఉన్నాడు.

**వీరబోయిన యాదగిరి** మెదక్ (మెదక్ జిల్లా) ఈనాడు విలేఖరి. 1990 నవంబర్ 6న జిల్లా ఎస్.పి. సాంబశివరావు వాడి అనే గ్రామంలో ఇతనిని చంపమని ప్రజలను బహిరంగంగా రెచ్చగొట్టి, ఆ తరువాత ఇతని మీదనే 'బెదిరింపు, రెచ్చగొట్టడం' అనే నేరాల కింద ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేసాడు.

**తమటం శ్రీనివాస గౌడ్** కొల్లాపూర్ (మహబూబ్ నగర్ జిల్లా) ఆంధ్రప్రభ విలేఖరి. 1991 ఫిబ్రవరిలో ఇతనిని టాడా కింద రెండు కేసులలో అరెస్టు చేసారు. ఆస్తుల ధ్వంసం, దహనం, పోలీస్ స్టేషన్ పైన దాడి ఈయన పైన మోపిన అభియోగాలు. లాకప్పులో బట్టలు విప్పి తీవ్రంగా కొట్టారు. అయితే విలేఖరుల సంఘం ఒత్తిడి మీద కోర్టులో హాజరు పరచకుండానే విడిచి పెట్టారు.

**తెలుగు సంజీవ్ కుమార్** చిన చింతకుంట (మహబూబ్ నగర్ జిల్లా) ఈనాడు విలేఖరి. 1991 మే 7వ తేదీన ఒక ఎస్.ఐ హత్య కేసులో ఇతనిని అరెస్టు చేసి అయిదు రోజులు తీవ్రంగా చిత్రహింసలు పెట్టారు.

**బెహరా వెంకట శ్రీనివాస రావు** దాచేపల్లి (గుంటూరు జిల్లా) ఈనాడు విలేఖరి. 1990 నవంబర్ 10న అరెస్టు చేసి హెడ్ కానిస్టేబుల్ పైన దాడి చేసినట్టు కేసు పెట్టారు. బట్టలు విప్పించి వీథిలో నడిపించి లాకప్పులో తీవ్రంగా కొట్టారు.

**చాట్ల మురళీకృష్ణ** మహాముత్తారం (కరీంనగర్ జిల్లా) ఈనాడు విలేఖరి. 1990 డిసెంబర్ 28న అరెస్టు చేసి పేలుడు పదార్థాల చట్టం కింద కేసు పెట్టారు. లాకప్పులో తీవ్రంగా చిత్రహింసలు పెట్టారు.

**పి. వెంకట్రాజం** సైదాపూర్ (కరీంనగర్ జిల్లా) 'జీవగడ్డ' విలేఖరి. 1992లో అరెస్టు చేసి ఆ ఊరి సర్పంచ్ హత్య కేసులో ఇరికించారు. టాడా కింద అరెస్టు చేసారు.

**ఎస్. సారయ్య** కాటారం (కరీంనగర్ జిల్లా) ఆంధ్రభూమి విలేఖరి. ఇతనిని 1992–93 సంవత్సరాలలో 18 నెలల పాటు ప్రతి రాత్రీ మంథని ఎం.ఎల్.ఏ. (అసెంబ్లీ స్పీకర్) శ్రీపాదరావు స్వగ్రామమయిన ధన్వాడలో స్పీకర్ ఇంటిలో

ఉన్న పోలీస్ క్యాంప్‌లో బలవంతంగా పడుకోబెట్టారు. ఇతను 'మాజీ' రాడికల్ కాబట్టి ఇతను పోలీసు క్యాంప్‌లో ఉంటే నక్సలైట్లు దాడి చేయరని పోలీసుల భరోసా. స్పీకర్ ఇంటికి పోలీసుల రక్షణ, పోలీసు క్యాంపుకు విలేకరి రక్షణ.

**ఆర్. నరేందర్** ఆత్మకూరు (మహబూబ్‌నగర్ జిల్లా) ఉదయం విలేఖరి. రెండు రాజకీయ పార్టీల మధ్య దొమ్మీ జరగగా ఇతనిని కూడ ఒక పక్షాన ఉన్నట్టు కేసులో ఇరికించి 1994 మార్చి 3వ తేదీన అరెస్టు చేసారు.

**వి. చిట్టిబాబు** విడవలూరు (నెల్లూరు జిల్లా) ఆంధ్రభూమి విలేఖరి. 1994 మే 16వ తేదీన ఇతనిని అరెస్టు చేసి టాడా కేసు పెట్టారు. నాలుగు రోజులు అక్రమ నిర్బంధంలో ఉంచుకున్నారు. పీపుల్స్ వార్ గ్రూప్‌తో సంబంధాలున్నాయని అరోపించి టాడాతో పాటు పబ్లిక్ సెక్యూరిటీ ఆక్ట్ కూడ పెట్టారు.

**కె. పురుషోత్తం** పెబ్బేరు (మహబూబ్‌నగర్ జిల్లా) ఆంధ్రజ్యోతి విలేఖరి.

**వెంకట్రాముడు** అయిజ (మహబూబ్ నగర్ జిల్లా) ఆంధ్రజ్యోతి విలేఖరి. వీళ్లిద్దరినీ 1994 జూన్ 16న గద్వాల సి.ఐ, ఎస్.ఐ అరెస్టు చేసి కొట్టి, 'గులాం రసూల్ ఎన్‌కౌంటర్ మీద మళ్లీ న్యాయవిచారణ జరిపించమని ఆందోళన చేస్తారా' అని దూషించి బెయిలబుల్ కేసు పెట్టారు.

ఈ రకమయిన వాతవరణం ఉండడం పత్రికా స్వేచ్ఛకూ, ప్రజాస్వామ్యానికీ ఆరోగ్యకరం కాదు. అయినా ఈ అనారోగ్యకరమయిన వాతావరణంలోనే 'కల్లోల జిల్లాల'లో పత్రికా స్వేచ్ఛ ధైర్యంగా వెలుగుతూ ఉంది. కానీ గులాం రసూల్ హత్యపైన టి.ఎల్.ఎన్. రెడ్డి గారు ప్రకటించిన నివేదిక పత్రికా విలేఖరుల పరిస్థితిని మరింత దిగజార్చక తప్పదు. దేశాన్ని ఏలుతున్న కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు సభ్యుని యాజమాన్యంలో ఉన్న ఒక ప్రముఖ తెలుగు దినపత్రిక విలేఖరిని రాష్ట్ర రాజధాని వెలుపలే కాల్చి పారేసి శవాన్ని దొంగతనంగా దహనం చేసినా, దాని గురించి రాష్ట్రమంతా గగ్గోలు పెట్టినా, కనీసం శవాన్ని దొంగతనంగా దహనం చేసినందుకు కూడ న్యాయ విచారణ కమిషన్ తమను తప్పుపట్టకపోతే, ఇంక బోర్లగూడెంలో భూపాలపల్లిలో పనిచేసే విలేఖర్లను ఏ అర్ధరాత్రి ఏం చేసి ఏ పేరు పెట్టినా అడిగే దెవ్వరు అని పోలీసులు భావిస్తే అది వాళ్ల తప్పవుతుందా? లేకపోతే నివేదిక ప్రకటించిన

న్యాయమూర్తిగారిదీ, దానిని తిరస్కరించి కొత్తగా విచారణ జరుపకుండా 'తప్పించుకున్నాం దేవుడా' అన్నట్టు చేతులు దులుపుకున్న ప్రభుత్వానిదేనా?

మసీదుగూడ ఎన్‌కౌంటర్‌కు బాధ్యులయిన పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలనీ, విచారించి శిక్షించాలని ప్రజలు చేసిన డిమాండ్‌ను ప్రభుత్వం పట్టించుకోలేదు. ఆ ఎన్‌కౌంటర్ జరిగినప్పుడు సరూర్ నగర్ డిఎస్‌పిగా ఉన్న రాజయ్య ప్రస్తుతం కరీంనగర్ డిఎస్‌పిగా ఉన్నాడు. ఈ సంవత్సరం మార్చి నెలలో కరీంనగర్‌లో మౌనంగా ఊరేగింపు జరుపుతున్న స్త్రీలను చాలా హింసాత్మకంగా కొట్టి కస్టడీలోకి తీసుకొంటున్న పోలీసుల చర్యను ఫోటో తీస్తున్న 'ఆంధ్రప్రభ' ఫోటోగ్రాఫర్‌ను డిఎస్‌పి రాజయ్య ఆధ్వర్యంలో పోలీసులు కొట్టి గాయపరిచి కెమెరాను ధ్వంసం చేసారు. అడ్డం పోయిన ఆంధ్రప్రభ విలేఖరిని కూడ కొట్టారు.

టి.ఎల్.ఎన్. రెడ్డి కమీషన్ నివేదిక బయటకు వచ్చిన తరువాత పోలీసుల 'ఆత్మ స్థైర్యం' ఎంతగా పెరిగిందో రుజువు చేసే సంఘటన ఒకటి మహబూబ్‌నగర్ జిల్లా గద్వాలలో ఈ సంవత్సరం జూన్ 16వ తేదీన జరిగింది. మసీదుగూడ ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న అప్పటి సరూర్ నగర్ సి.ఐ మురళీధరరావు ప్రస్తుతం గద్వాల సి.ఐగా ఉన్నాడు. జూన్ 16వ తేదీన పౌరహక్కుల సంఘం మహబూబ్‌నగర్ జిల్లా శాఖ కార్యదర్శి 'ఆంధ్రజ్యోతి' పెబ్బేరు మండల విలేఖరి, న్యాయవాది అయిన పురుషోత్తంను, పౌరహక్కుల సంఘం కార్యకర్త, 'ఆంధ్రజ్యోతి' అయిజ మండల విలేకరి అయిన వెంకట్రాముడును గద్వాల ఎస్.ఐ, సి.ఐ అరెస్టు చేసి తీసుకుపోయి పోలీస్ స్టేషన్‌లో పురుషోత్తంను సి.ఐ బూటుకాలితో తన్ని కింద పడేసాడు. ఎస్.ఐ, సి.ఐ కలిసి ఇద్దరినీ బాగా కొట్టారు. మసీదుగూడ ఎన్‌కౌంటర్ గురించి మళ్లీ న్యాయవిచారణ జరిపించాలని పౌరహక్కుల సంఘం ఆ జిల్లాలో నిర్వహించిన పోస్ట్‌కార్డ్ ఉద్యమాన్ని ప్రస్తావిస్తూ, 'టి.ఎల్.ఎన్. రెడ్డి కమిషన్ మమ్మల్ని ఏం చేసిందిరా?' 'మళ్లీ విచారణ జరపమని పోస్ట్ కార్డులు రాసేంత మొనగాళ్లా మీరు?' 'నీ కోసం కూడ పోస్ట్ అచ్చు వేసుకో. నిన్ను కూడ ఎన్‌కౌంటర్ చేస్తాను' అంటూ సి.ఐ మురళీధరరావు పురుషోత్తంను కొట్టాడు.

టి.ఎల్.ఎన్. రెడ్డి కమిషన్ నివేదిక గురించి మేము ఎందుకు ఇంతగా ఆందోళన చెందుతున్నామో ఇంకా వివరించి చెప్పనవసరం లేదనుకుంటున్నాము. మేము చెప్పవలసింది సి.ఐ మురళీధరరావే స్పష్టంగా చెప్పాడు.

అందుకే టి.ఎల్.ఎన్. రెడ్డి కమిషన్ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికయినా తిరస్కరించి తిరిగి న్యాయ విచారణ జరిపించాలని కోరుతున్నాం. ప్రజాస్వామిక వాదులందరూ ప్రభుత్వం పైన ఈ డిమాండ్‌తో ఒత్తిడి పెట్టాలని కోరుతున్నాం.

కలిసి పోరాడుదాం, పత్రికా స్వేచ్ఛనూ, పౌరహక్కులనూ కాపాడుకుందాం రమ్మని ప్రజాస్వామికవాదులందరికీ పిలుపు నిస్తున్నాం.

*ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం,*
*ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్‌ల*
*సంయుక్త ప్రచురణగా వచ్చింది, జూలై 1994*

# ప్రజలు, మఫ్టీ ప్రజలు, మానవహక్కులు

**జా**తీయ మానవ హక్కుల కమిషన్ ఆంధ్రప్రదేశ్‌కు వచ్చింది, పోయింది. కమిషన్ పర్యటన అభాసుపాలయిందని కొంతమంది అంటున్నారు. ప్రహసనంగా ముగిసిందని కూడ అంటున్నారు. అది నిజమని మేము అనుకోవడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో పోలీసుల దౌర్జన్యాలు ఏ విధంగా ఉన్నాయో చూడడానికి మానవ హక్కుల కమిషన్ రాష్ట్రానికి వచ్చింది. కళ్లారా చూసింది, చూసి వాపోయింది. వెనక్కి వెళ్ళిపోయింది. ఇంతకంటే విజయవంతమయిన పర్యటన ఉండగలదా?

ఇంత విజయవంతంగా ముగించడానికి రాష్ట్ర పోలీసు యంత్రాంగం పడిన ప్రయాస స్వల్పం కాదు. నాలుగు జిల్లాల పోలీసు సిబ్బందీ, అధికారులూ వేరే పనులన్నీ మానుకొని ఈ విజయం కోసం కృషి చేసారు. కొందరు యూనిఫారంలో, కొందరు మఫ్టీలో కృషి చేసారు. అందుకు వారిని మేము మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాం.

వాళ్ళ ఉద్దేశం అది కాకపోవచ్చు 'అయ్యవారిని చేయబోయి కోతిని చేసామే' అని పోలీసు ప్రముఖులు మనస్తాపం చెందుతున్నారేమో. కథ ఎక్కడ అడ్డం తిరిగిందని దర్యాప్తు చేస్తున్నారేమో చేయనివ్వండి. అన్ని పనులూ దౌర్జన్యంతో సాధ్యమవుతాయన్న సంస్కృతిని వాళ్లు ఒంట బట్టించుకున్నారు. ఇంతకంటే పోలీస్ ట్రైనింగ్ కళాశాలల్లో ఇస్తున్న శిక్షణ వేరే ఏమీ లేదు. దాని వల్ల ప్రజలకు హాని జరిగినప్పుడు పరవాలేదనుకున్నారు. ఇప్పుడు తమ ప్రయోజనాలకే నష్టం వచ్చిందని వగచి ఏం ప్రయోజనం?

ప్రజలు పోలీసు యంత్రాంగాన్నీ ప్రభుత్వాన్నీ అడిగే ప్రశ్నలు వేరే ఉన్నాయి. అవి నిజానికి ఎప్పుడూ అడిగే ప్రశ్నలే. సందర్భం మారినప్పుడు వివరాలు మారతాయి. ప్రశ్నలు మాత్రం ఎప్పుడూ అవే. మానవ హక్కుల కమిషన్ పర్యటన సందర్భంగా చట్టం రాష్ట్ర పాలనా యంత్రాంగంపైన పెట్టిన బాధ్యత ఏమిటి? నిర్దేశించిన కర్తవ్యం ఏమిటి? పాలనా యంత్రాంగం చేసిన ఘనకార్యం ఏమిటి?

జాతీయ మానవ హక్కుల కమిషన్ ప్రభుత్వ యంత్రాంగానికి శత్రువా? లేక చట్టబద్ధ పాలన నెలకొల్పే ప్రజాస్వామిక కర్తవ్య నిర్వహణలో భాగంగా ప్రభుత్వం తన స్వయం నియంత్రణ కోసం తానే ఏర్పాటు చేసిన ఒక నాగరిక వ్యవస్థా?

మన రాష్ట్ర ప్రభుత్వం మానవహక్కుల కమిషన్ తనకు శత్రువయినట్టే వ్యవహరించింది. 'నక్సలైట్ల వేటలో నువ్వు బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడుతున్నావంట' అని ప్రభుత్వాన్ని సవివరంగా అడగడానికి మానవ హక్కుల కమిషన్ రాష్ట్రానికి రాగా, డ్రగ్స్ ఇన్‌స్పెక్టరు మందుల అంగళ్ళను సోదా చేయడానికి వచ్చినప్పుడు అంగళ్ళ యజమానులు సీసాలు మార్చి, లేబుల్స్ తారుమారు చేసి, డబ్బాలు వెనక గదిలో దాచిపెట్టి ఇన్‌స్పెక్టర్‌ను మభ్య పెట్టడానికి ప్రయత్నించినట్టు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం నిజాలేవీ కమిషన్ కళ్ళకు కనిపించకుండ ఉండడానికి, అబద్ధాలను సహేతుకమయిన సత్యాలుగా చూపించడానికి నల్ల బజారు మందుల వ్యాపారి పడినంత ప్రయాస పడింది.

చట్టాన్ని సంరక్షించే బాధ్యతగల ప్రభుత్వం అనుసరించవలసిన వైఖరి ఇదేనా? అన్ని దేశాలలోనూ పౌరులు, పౌర బృందాలు చేసే నేరాలను నిరోధించడానికి, శిక్షించడానికి పోలీసు వ్యవస్థ, కోర్టు వ్యవస్థ ఉన్నాయి. కానీ ఆ పోలీసు వ్యవస్థ ఒక్కొక్క దేశంలోనూ చేస్తున్న నేరాలను నియంత్రించడానికి గానీ, విచారించి శిక్షించడానికి గానీ ఎక్కడా ఒక యంత్రాంగం లేదు కాబట్టి అన్ని దేశాల ప్రభుత్వాలూ ఇందుకోసం ఒక స్వతంత్ర యంత్రాంగాన్ని నెలకొల్పాలని అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు, ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కమిషన్ ఒత్తిడి చేయగా పి.వి. నరసింహారావు ప్రభుత్వం ఈ జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను నెలకొల్పింది. దేశ ప్రభుత్వంలో భాగమయిన పోలీసు, పారామిలిటరీ, మిలిటరీ యంత్రాంగాలు ప్రజలపైన అత్యాచారాలకు పాల్పడుతున్నాయన్న అభియోగాన్ని విచారించి నిజానిజాలు

తేటతెల్లం చేయడం కోసం భారత ప్రభుత్వమే నెలకొల్పిన సంస్థ ఇది. ఆ యంత్రాంగాన్ని తానే శత్రువుగా పరిగణించడం ప్రభుత్వానికి తగునా?

తగునని ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం అంటూ ఉంది.

నిజమే, ఈ జాతీయ మానవహక్కుల కమిషన్ ఏర్పాటులోనే లొసుగులున్నాయని పౌర ప్రజాస్వామ్యహక్కుల సంఘాలు విమర్శించాయి, విమర్శిస్తున్నాయి. అప్పులిచ్చే విదేశీయులు, ఆ కారణంగా దబాయించే అధికారం పొందిన విదేశీయులు వాళ్ళ ప్రయోజనాల కోసమేనయితేనేం మరీ అల్లరి చేస్తున్నారు కాబట్టి 'నేను సైతం ఒక మానవ హక్కుల కమిషన్‌ను నెలకొల్పుతున్నాను చూడండి' అంటూ పి.వి గారు దీనిని నెలకొల్పారు. ధర్మ శాస్త్రకారులు చేయక తప్పదని ఆదేశించిన విషయాలను 'శాస్త్రం కోసం చేయడం' అంటే మొక్కుబడిగా చేయడం బ్రాహ్మణ సంస్కృతిలోని అతి ప్రాచీనమయిన కపట సంప్రదాయం. ఆ కపట సంప్రదాయానికి వారసుడయిన మన ప్రధాన మంత్రి అందుకు తగినట్టే ఈ మానవ హక్కుల కమిషన్‌ను నెలకొల్పాడు. దీనికి పోలీసులు చేసే నేరాలపైన నేరవిచారణ జరిపే (అంటే ప్రాసిక్యూట్ చేసే) అధికారం లేదు. శిక్ష వేసే అధికారమూ లేదు. దీనికుండేది నిజనిర్ధారణ చేసే అధికారం మాత్రమే.

ఏమయితేనేం, 'నేను సైతం నెలకొల్పాను చూడండి' అని అడిగిన వారికందరికీ పాములపర్తి వెంకట నరసింహరావు గారు చూపించారు.

ఏమయితేనేం, నిజనిర్ధారణ జరిగి వాస్తవాలను ఒక అధికార కమిషన్ ధృవీకరిస్తే అది కూడ 'గుడ్డిలో మెల్ల' అని భావించిన పౌర ప్రజాస్వామ్య హక్కుల సంఘాలు కమిషన్ పరిమితులను విమర్శిస్తూనే కమిషన్‌కు ఫిర్యాదులు పంపించాలనీ, కమిషన్ విచారణలలో సహకరించాలనీ భావించాయి. ఆంధ్రప్రదేశ్‌లో 'ఎన్‌కౌంటర్ల' పేరిట పోలీసులు చేస్తున్న హత్యాకాండ గురించి మానవ హక్కుల కమిషన్‌కు ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం వివరమయిన ఫిర్యాదు పంపించింది. 1991, 92, 93 సంవత్సరాలలో ఈ హత్యాకాండ విపరీతంగా పెరిగిందనీ, ఆ మూడేళ్ళలో 285 'ఎన్‌కౌంటర్' ఘటనలలో 496 మంది చనిపోయారనీ చెప్పింది. ఈ 496 మందిలో 204 మంది మాత్రమే నక్సలైట్ పార్టీల అండర్‌గ్రౌండ్ కార్యకర్తలనీ, మిగిలిన

వాళ్ళంతా నిరాయుధులయిన పేద రైతాంగ యువకులనీ, వారిలో 96 శాతం S.C., S.T., B.C., మైనారిటీలకు చెందినవారనీ వివరించింది. ఒక్కొక్కరినీ ఏ విధంగా (నిద్రపోతుండగా, అన్నం తింటుండగా, తాటి చెట్టెక్కి కల్లు తీస్తుండగా, పొలం దున్నుతుండగా) తీసుకుపోయి కాల్చి చంపారో విశదీకరించింది.

ఈ 285 సంఘటనలలో పాతవి కాలాతీతం వల్ల తన పరిధిలోకి రావనీ, చివరి 74 మాత్రం వస్తాయనీ మానవహక్కుల కమిషన్ అనింది. ఇవి 1993 మార్చి నెల నుండి ఆ సంవత్సరాంతం దాకా జరిగిన ఘటనలు. వాటిమీద వివరంగా విచారణ జరిపేముందు ఒకసారి 'నక్సలైట్ సమస్య' గురించి, పోలీసు అత్యాచారాల గురించి ప్రజాభిప్రాయం సేకరించడం కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యటిస్తామని కమిషన్ చెప్పింది. ఆ పర్యటనే ఆగస్టు 4 నుండి 8 దాకా రాష్ట్రంలో మానవ హక్కుల కమిషన్ జరిపిన పర్యటన.

ఈ పర్యటన పట్ల మన రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత ఏమిటి ? పర్యటన కార్యక్రమాన్ని సకాలంలో పత్రికలలో వివరంగా ప్రకటించాలి. నక్సలైట్ల హింసను ఎదుర్కొనడం అనే పేరు మీద రాష్ట్ర పోలీసు యంత్రాంగం పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడుతూ ఉందన్న ఆరోపణపైన అభిప్రాయ సేకరణ చేయడానికి జాతీయ మానవహక్కుల కమిషన్ రాష్ట్రానికి వస్తూవుంది కాబట్టి దీనికి సంబంధించిన వాస్తవాలు కమిషన్‌కు చెప్పడానికి ప్రజలంతా ముందుకు రావాలని పత్రికాముఖంగా ప్రజలకు తెలియజేయాలి. మండల కార్యాలయాలలో నోటీసులు పెట్టాలి. ఒక ప్రాంతం నుండి జనం పెద్ద సంఖ్యలో వచ్చేటట్టయితే వాళ్ళకు రవాణా ఏర్పాట్లు చేయాలేమో ఆలోచించాలి.

## మన రాష్ట్ర ప్రభుత్వం ఏం చేసింది?

కమిషన్ రాకకు కేవలం వారం దినాలుండగా పత్రికలలో అతి క్లుప్తమయిన వార్త వచ్చింది. జాతీయ మానవహక్కుల కమిషన్ అనేదేదో ఒకటి వుందట. అది ఆగస్టు 4వ తేదీన కరీంనగర్‌కు, 5వ తేదీన వరంగల్‌కు, 6వ తేదీన హైదరాబాద్‌కు, 7వ తేదీన నల్గొండకు, 8వ తేదీన సంగారెడ్డికి వస్తుందట. 8 సాయంత్రం ఢిల్లీకి వెళ్ళిపోతుందట. వస్తే వచ్చింది, పోతే పోయింది. ప్రజలు ఏం చేయాలి? ప్రజలకు

ఆ కమిషన్‌తో ఏం సంబంధం? అసలు ఆ కమిషన్ రాష్ట్రానికి ఎందుకోసం వస్తున్నది? ఏం చేయాలని వస్తున్నది?

ఇవేవీ ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో లేవు. మానవహక్కుల కమిషన్ ఆయా జిల్లాలలో మానవ హక్కుల కోసం కృషి చేస్తున్న వాళ్ళను కలుస్తుందని, ప్రభుత్వ అధికారులను, బార్ అసోసియేషన్‌ను, జిల్లా జడ్జి తదితర ప్రముఖులను కలుస్తుందని ప్రకటనలో ఉంది. వాళ్లనైనా ఎందుకు కలుస్తుందో, వాళ్లు ఏ విషయంలో తమ అభిప్రాయాలు చెప్పాలో ప్రభుత్వం తెలియజేయ లేదు. ఈ పెద్దలు కాక సామాన్య మానవులు కమిషన్‌ను కలవవచ్చునని గానీ, పోలీసుల వల్ల తమకు కలిగిన కష్టనష్టాలు చెప్పుకోవచ్చునని గానీ, నక్సలైట్ ఉద్యమం పట్ల తమ అభిప్రాయాన్ని కమిషన్‌కు వివరించవచ్చునని గానీ ఆ ప్రకటనలో ఒక్క వాక్యం కూడ లేదు.

ఇది కమిషన్‌కు సహకరించే వైఖరా ? లేకపోతే ఇబ్బందికరమయిన వాస్తవాలు, ప్రభుత్వ అభిప్రాయానికి వ్యతిరేకమైన వాదనలు వీలయినంతవరకు కమిషన్‌కు తెలియకుండా జాగ్రత్తపడే వైఖరా?

తనకు వ్యతిరేకమైన వాదన కమిషన్‌కు వినిపించే అవకాశం లేకుండా చేసిన ప్రభుత్వం తన వాదన వినిపించడానికి మాత్రం చాలా పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకుంది. పంచాయితీ చెప్పడానికి పెద్దమనుషులు వస్తున్నారంటే ఒక దోషి చేసుకునే సన్నాహాలన్నీ చేసుకుంది. నాలుగు జిల్లాల అధికార యంత్రాంగం సంపూర్ణంగా దీనిలో నిమగ్నమయింది. 'నక్సలైట్ల హింస'ను కమిషన్ ఎదుట ఆర్భాటంగా ప్రదర్శించి, వాళ్ళు ఇంత హింస చేస్తుంటే మేము చట్టాన్ని పక్కన పెట్టి అణచివేతకు పూనుకోక ఏం చేస్తాం అని కమిషన్‌ను నమ్మించ జూసింది. ఒక నేరస్తుడు ఏ పరిస్థితిలో నేను నేరం చేయవలసి వచ్చిందో చూడండని పెద్దమనుషులను నమ్మించడానికి పడే ప్రయాస అంతా పడింది.

ప్రైవేట్ నేరగాడు తన నేరాలకు సంజాయిషీ చెప్పుకోవడానికి ఈ పద్ధతి అనుసరిస్తే అర్థం చేసుకోవచ్చు. కానీ రాజ్యాంగాన్ని, చట్టాన్ని కాపాడే బాధ్యత ఉన్న ప్రభుత్వం ఈ పని చేయవచ్చా?

మానవ హక్కుల కమిషన్ 'నక్సలైట్ సమస్య' గురించి తెలుసుకోదలచుకున్న వాస్తవాలలో నక్సలైట్ల హింసాత్మక చర్యలు కూడ ఒక అంశమే. దానికి సంబంధించిన వివరాలు కమిషన్‌కు. తెలియవలసిందే. కానీ ఇది ప్రభుత్వ హింసను సమర్థించుకునే వాదన కావడానికి వీలు లేదు. సమస్య ముఖచిత్రాన్ని కమిషన్ అర్థం చేసుకోవడానికి అవసరమైన సమాచారం మాత్రమే కాగలదు. ఈ సమాచారం అందివ్వడానికి కమిషన్ పర్యటించిన నాలుగు జిల్లా కేంద్రాలలోనూ జిల్లా అధికార యంత్రాంగం నక్సలైట్ హింసకు సంబంధించిన గణాంకాల ప్రదర్శన, ఫోటో ప్రదర్శన నిర్వహించింది. వాళ్ళు ఎంతమందిని చంపిందీ, ఎన్ని బస్సులు కాలబెట్టిందీ పట్టిక రూపంలో ప్రదర్శించింది. వాళ్ళు చంపిన వాళ్ల ఫోటోలు, కాలబెట్టిన 'బస్సుల ఫోటోలు, పేల్చిన ఇళ్ళ ఫోటోలు ప్రదర్శించింది. బాగానే ఉంది. రాజ్యహింస మట్టుకే మానవ హక్కుల కమిషన్ పరిధిలోని విషయం అయినప్పటికీ, సమస్య పూర్తిగా అర్థం కావడానికి ఈ సమాచారం అవసరమే. కానీ దీనితో పాటు రెండవ హింసకు సంబంధించిన సమాచారం కూడ ప్రదర్శించాలి కదా? అసలు కమిషన్ విచారణ జరపవలసింది దాని గురించే కదా? దానిని దాచి పెట్టడంలో అర్థం ఏముంది?

పోలీసులు ఎన్‌కౌంటర్ల పేరిట చంపి, దళం యూనిఫారం తొడిగి పక్కన తుపాకీ పెట్టిన మృతదేహాల ఫోటోలు, పోలీసులు బల ప్రయోగంతో కూలగొట్టించిన నక్సలైట్ కార్యకర్తల, సానుభూతిపరుల ఇళ్ల ఫొటోలు, పోలీసులు చిత్రహింసలు పెట్టి ఆస్పత్రి పాల్జేసిన ప్రజల ఫోటోలు ప్రదర్శించి ఉండవచ్చును కదా! ఈ సమాచారం కమిషన్‌కు అవసరం కాదా? ఈ సమాచారం కమిషన్‌కు అందివ్వటం పౌరహక్కుల సంఘం కర్తవ్యం అయినట్టు, దీనికి సంజాయిషీగా నక్సలైట్ల హింసాకాండ గురించి ప్రదర్శన నిర్వహించడం మాత్రమే తన కర్తవ్యం అయినట్టు ప్రభుత్వం ప్రవర్తించడం సబబేనా? కమిషన్ ఎదుట 'ప్రభుత్వం వర్సస్ పౌరహక్కుల సంఘం' మధ్య ఒక పోటీ జరుగుతున్నట్టు పత్రికలు కూడ వర్ణించాయి. ఈ రకంగా వ్యవహరించడం ప్రభుత్వానికి సబబా? ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరయినా పోరాటం చేస్తే 'రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాన్ని కూలదోసే ప్రయత్నం' అని కేసులు పెడతారు. మరి ఈ ప్రభుత్వం మానవహక్కుల కమిషన్' ఎదుట పూర్తి సమాచారాన్ని పెట్టకుండా

'నక్సలైట్ల హింసను చూపించడం మా వంతు, మా హింసను చూపించడం పౌరహక్కుల సంఘం వంతు' అన్నట్టు వ్యవహరించడం రాజ్యాంగబద్ధమైన ప్రవర్తనేనా?

ఈ ప్రదర్శనలో భాగంగా నక్సలైట్ బాధితులను పెద్దఎత్తున పోలీసులు సమీకరించి మానవహక్కుల కమిషన్ ఎదుట హాజరు పెట్టారు. జీపులలో, లారీలలో వారిని తీసుకొచ్చారు. వరంగల్‌లో నయితే పోలీస్ స్టేషన్లకు 'కోటాలు' నిర్ణయించి మరీ 'బాధితులను' వేలసంఖ్యలో తుపాకుల పహారాలో తీసుకొచ్చారు. నక్సలైట్ల వల్ల హింసకు గురయినవారు తమ గోడు చెప్పుకోవడానికి కమిషన్ ఎదుట హాజరు కావాలనుకుంటే అభ్యంతరపెట్టేవారు ఉండరు. ఆ హింస వల్ల జీవనాధారం కోల్పోయిన కుటుంబాల పునరావాస బాధ్యతను ప్రభుత్వం తన మీద వేసుకోవాలన్నది న్యాయమయిన కోరికే. కాని వారికి మారుమూల గ్రామాల నుండి జిల్లా కేంద్రానికి రావడానికి అన్ని ఏర్పాట్లూ చేసిన ప్రభుత్వం, పోలీసు బాధితులకు కూడ అవే సదుపాయాలు కల్పించనవసరం లేదా? గ్రామాలలో నక్సలైట్ బాధితులను గుర్తించి తీసుకొచ్చే బాధ్యతను పోలీసులు తమ మీద వేసుకున్నారు. పోలీసు యంత్రాంగానికి ఉండే అన్ని వసతులూ, వనరులూ దీని కోసం వినియోగించారు. మరి పోలీసు బాధితులను తరలించి తీసుకొచ్చే బాధ్యతను వేరే ఏదయినా ప్రభుత్వశాఖకు అప్పగించనక్కరలేదా? సోషల్ వెల్ఫేర్ శాఖకో మరొకరికో అప్పజెప్పనక్కర లేదా? ఒకరు మాత్రమే ప్రభుత్వ సహాయానికి అర్హులా? వేరొకరు ఈ ప్రభుత్వానికి శత్రువులా?

అంతేకాదు 'నక్సలైట్ బాధితులను' తరలించడంలో ఉద్దేశ్యం కేవలం వాళ్ళ సమస్యలను కూడ కమిషన్ ఆలకించి సహాయం రికమెండ్ చేయాలని కాదు. అదే అయితే ఎవరికీ అభ్యంతరం ఉండదు. కానీ ఆ బాధితులతో పాటు మఫ్టీ పోలీసులనూ, హోంగార్డులనూ, రౌడీలనూ తరలించి పౌరహక్కుల సంఘం బాధ్యులను అల్లరి పెట్టడం, పౌరహక్కుల సంఘానికి వ్యతిరేకంగా నినాదాలు ఇవ్వడం, కమిషన్ కూర్చున్న ఆవరణలో ఒక భయానక వాతావరణాన్ని కల్పించడం పోలీసుల ఉద్దేశ్యం. అసలే 'యూనిఫారంలోనూ మఫ్టీలోనూ జిల్లాలోని సకల SIలు, CIలు, DSPలు, SP లు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులూ, ఇంటెలిజెన్స్ పోలీసులూ అందరూ పారాడుతున్న ఆ ఆవరణలోకి పోలీసు బాధితులు వచ్చి తమ ఫిర్యాదులు కమిషన్‌కు అందజేయడం కష్టం అనుకుంటే వరంగల్‌లో కమిషన్ విచారణ నిర్వహించిన గెస్ట్‌హౌస్‌కు దారితీసే

రోడ్డుకు ఇరుపక్కలా కనీసం 50 మంది స్టెన్‌గన్‌లు పట్టుకొని నిలబడ్డారు. వాళ్ళందరినీ దాటి ప్రజలు బూటకపు ఎన్‌కౌంటర్ల గురించి, పోలీస్ స్టేషన్‌లో చిత్రహింసల గురించి కమిషన్‌కు ఫిర్యాదు ఇవ్వడం ఎట్లా సాధ్యం ? అది చాలక 'బాధితుల' గుంపులలో మఫ్టీ పోలీసులూ, హోంగార్డులూ, రౌడీలూ చేరి నినాదాలు ఇస్తూ అల్లరి చేస్తుంటే, పౌరహక్కుల సంఘం బాధ్యులపైన, పత్రికా విలేఖరులపైన భౌతిక దాడులకు పాల్పడుతుంటే పోలీస్ బాధితులు అక్కడికి రావడం అసలు సాధ్యమేనా?

అసాధ్యం చేయడమే పోలీసుల లక్ష్యం. అందుకోసమే నాలుగు జిల్లాలలోనూ ఆ 'షో' నిర్వహించారు. తమ గొంతు తప్ప వేరే గొంతేదీ కమిషన్‌కు వినపడడానికి వీలులేదు. తమకు వ్యతిరేకమైన గొంతు అసలు వినపడడానికి వీలు లేదు. అందుకోసం కమిషన్ సమక్షంలో 'టెర్రర్' వాతావరణం సృష్టించారు. భయోత్పాతం కల్పించారు. కమిషన్ పర్యటనను మొత్తంగా హైజాక్ చేసి లండన్ వెళ్ళవలసిన విమానాన్ని న్యూయార్క్‌కు తీసుకుపోయినట్టు, పోలీసులు ఎంత హింస చేస్తున్నారో తెలుసుకోవడానికి వచ్చిన కమిషన్‌కు పోలీసులు ఎందుకు హింస చేయక తప్పదో చెప్పి పంపించారు. నక్సలైట్ బాధితులను అడ్డం పెట్టుకొని ఈ నాటకం ఆడారు. ఇది తీవ్రంగా అభ్యంతర పెట్టవలసిన విషయం.

తమ నేరాలను కప్పి పెట్టుకోవడమే కాక, పోలీసులు మానవహక్కుల కమిషన్‌కు ఒక వార్నింగ్ కూడ ఇవ్వదలచుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మానవహక్కుల కమిషన్ వేరే ఏమయినా చేయవచ్చును కానీ పోలీసు అత్యాచారాలపైన విచారణ మాత్రం జరపడానికి వీలు లేదని హెచ్చరించదలచుకున్నారు. మానవ హక్కులను స్కూళ్ల పాఠ్యాంశాలలో చేరుస్తారో, యూనివర్సిటీలకు ప్రాజెక్టులిచ్చి పరిశోధన చేయిస్తారో, గుళ్లలో మానవహక్కుల భజనలు చేయిస్తారో మాకు అనవసరం. కానీ ఎన్‌కౌంటర్ల గురించి, లాకప్పులలో చిత్రహింసల గురించి న్యాయవిచారణలు మాత్రం మేము జరగనివ్వం జాగ్రత్త అని బెదిరించదలచుకున్నారు. ఇక్కడ నడిచేది మా రాజ్యం అని చెప్పదలచుకున్నారు. ఒకవేళ మానవహక్కుల కమిషన్ మూర్ఖంగా న్యాయవిచారణలు నిర్వహించినా సాక్ష్యాలు చెప్పేవాళ్లను బ్రతకనివ్వం జాగ్రత్త అని ప్రజలను బెదిరించదలచుకున్నారు. పౌరహక్కుల సంఘానికి, పత్రికా విలేఖరులకే భద్రత లేదనీ, జాతీయ మానవహక్కుల కమిషన్ సమక్షంలోనే జిల్లాలోని అధికార యంత్రాంగమంతా

చూసి ఆనందిస్తుండగానే పౌరహక్కుల వాళ్లపైనా పేపర్ రిపోర్టర్లపైనా గూండాయిజం చేయగలమనీ, ఇంక పోలీసు అత్యాచారాల గురించి సాక్ష్యం చెప్పదలచుకున్న ప్రజలు తమ గతి ఏం కాగలదో ఆలోచించుకోవాలనీ జనానికి సందేశం ఇవ్వదలచుకున్నారు.

'ఇంతటి దౌర్జన్యం పంజాబులో, కాశ్మీర్‌లో కూడ జరుగలేదు' అని జాతీయ మానవహక్కుల కమిషన్ చైర్మన్ రంగనాథమిశ్రా గారు తన తోటి కమిషన్ సభ్యులతో వాపోయారట. ఇంతటి రౌడీ పోలీసులు దేశంలో వేరే ఏ రాష్ట్రంలోనూ లేరు మరి ! పౌరహక్కుల సంఘం బాధ్యులపైన మీ సమక్షంలోనే దాడి జరిగింది కదా అంటే 'నా మీదే దాడి చేసినా నాకు మాత్రం దిక్కేముంది' అని కూడ రంగనాథమిశ్రా గారు అన్నారు. చెడు జరగాలని కోరుకోకూడదు కానీ ఆ వింత కూడ జరిగిపోయి ఉంటే ఇంకా మిగిలిపోయిన సందేహాలేవయినా ఉంటే అవి కూడ తొలగిపోయేవి!

మఫ్టీ పోలీసులు, రౌడీల చేత 'ప్రజలు'గా అవతారమెత్తించి పోలీసుల అకృత్యాలపైన న్యాయ విచారణలేవీ జరగకుండ అడ్డుపడతామన్న స్పష్టమైన సందేశాన్ని ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఇచ్చారు. జాతీయ మానవహక్కుల కమిషన్ తన సమక్షంలో జరిగిన దాడుల వెనక దాగి ఉన్న ఈ సందేశాన్ని గుర్తించి మరింత పట్టుదలగా ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు గూండాయిజాన్ని అరికట్టడానికి కృషి చేస్తుందని ఆశిస్తాం. మా మాటకొస్తే, ఈ సందేశం మాకు కొత్త కాదు కాబట్టి మా పట్టుదలను రెండింతలు పెంచి కృషి చేయడానికి సిద్ధంగా ఉన్నామని హామీ ఇస్తున్నాం. ప్రజలు ఈ మఫ్టీ 'ప్రజల' బెదిరింపులకు భయపడకుండ తమ హక్కుల కోసం, మనందరి హక్కులకోసం ఎప్పటిలాగే ధైర్యంగా నిలబడతారని ఆశిస్తాం.

- మానవ హక్కుల కమిషన్ పర్యటన సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగం, పోలీసులు ప్రవర్తించిన తీరుకు రాష్ట్ర ముఖ్యమంత్రి బహిరంగంగా క్షమాపణ కోరాలి.
- నల్గొండలో పౌరహక్కుల సంఘం బాధ్యుల పైన, పత్రికా విలేఖరులపైన మఫ్టీలో దాడికి పాల్పడిన పోలీసు మూకకు నాయకత్వం వహించిన సూర్యాపేట DSPని, దేవరకొండ DSPని, మిర్యాలగూడెం CI ని వెంటనే ఉద్యోగాల నుండి సస్పెండ్ చేసి కేసుపెట్టి అరెస్టు చేయాలి.

- వరంగల్‌లో పౌరహక్కుల సంఘం బాధ్యులపైన జరిగిన దాడిలో మఫ్టీలో పాల్గొన్న హనుమకొండ ఎస్.ఐ ని, సుబేదారి సి.ఐ ని, మాంనూర్ ఎస్.ఐ ని, హసన్‌పర్తి ఎస్.ఐ ని ఉద్యోగాల నుండి సస్పెండ్ చేసి కేసు పెట్టి అరెస్టు చేయాలి.

*APCLC, OPDR కరపత్రంగా వచ్చింది*

*సెప్టెంబర్ 1994*

# ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు కస్టడీ మరణాలు

## జనవరి 1984 నుండి జూలై 1995 వరకు

భారతదేశంలోని అన్ని రాష్ట్రాలలో లాగే ఆంధ్రప్రదేశ్‌లో కూడ పోలీసులు కస్టడీలో క్రూరమైన హింసను ప్రయోగిస్తున్నారు. ఈ హింసను ప్రయోగించటం ఎంత సాధారణమై పోయిందంటే, అనుమానితుడు మరణించిన సందర్భాలలో తప్ప, ఇది ఎవరి దృష్టినీ ఆకర్షించడం లేదు.

ప్రజల చట్టబద్ధ, ప్రజాస్వామ్య హక్కుల కొరకు ఆందోళన చేస్తున్న సంస్థగా ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం పోలీసు కస్టడీలో జరిగే హింసకు వ్యతిరేకంగా నిరంతరం ప్రచారం చేస్తూ వుంది. మా ఈ కృషిలో భాగంగా కస్టడీ మరణాలు జరిగినప్పుడు పోలీసులు చెప్పే కథనాలలోని నిజానిజాలను పరిశీలించడానికి మేము నిజనిర్ధారణ సంఘాలను ఏర్పాటు చేస్తూ వచ్చాం. దాంట్లో భాగంగానే జనవరి 1984 నుండి జూలై 1995 మధ్యకాలంలో జరిగిన అన్ని (కొన్ని మినహా) కస్టడీ మరణాల పై నిజ నిర్ధారణ జరిపాం. వాటి ఆధారంగానే ఈ ఫిర్యాదును దాఖలు చేస్తున్నాం. కొన్ని కస్టడీ మరణాలపై మాత్రం నిజనిర్ధారణ చేయలేక పోయాం. అయితే అవి ఒక డజను కంటే ఎక్కువ లేవు. పోలీసులకు తప్ప ఎవరికీ తెలియని కస్టడీ మరణాలు కూడా కొన్ని వుండవచ్చు. వాటి గురించి పత్రికలలో వచ్చే అవకాశంగానీ, ప్రజలకు తెలిసే అవకాశంగానీ ఎలాగూ లేదు.

---

జాతీయ మానవ హక్కుల కమీషన్‌కు ఎ.పి.సి.ఎల్.సి పంపిన ఫిర్యాదు పాఠం తెలుగు అనువాదం.

మానవహక్కుల పరిరక్షణ చట్టం (1993) కింద మేము ఈ ఫిర్యాదును దాఖలు చేస్తున్నాం. ఫిర్యాదు ఇచ్చే నాటికి దానిముందు సంవత్సర కాలం వ్యవధిలో జరిగిన సంఘటనలపై మాత్రమే మానవహక్కుల కమిషన్ విచారణ జరపాలని ఈ చట్టం నిర్దేశిస్తుందని మాకు తెలుసు. కాని కస్టడీలో జరిగే హింస స్వభావాన్ని, విస్తృతిని మీకు సమగ్రంగా తెలియజేయడం కోసం జనవరి 1984 నుండి జూలై 1995 వరకు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన మొత్తం కస్టడీ చావుల గురించిన సమాచారాన్ని అనుబంధంలో యిస్తున్నాం. ఈ పట్టికలోని చివరి 24 మరణాలు మాత్రమే ప్రస్తుత ఫిర్యాదు పరిధిలోకి వస్తాయి.

జనవరి 1984 నుండి జూలై 1995 మధ్యకాలంలో ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు కస్టడీలో మొత్తం 211 మంది మరణించారు. మృతులలో ఆరుగురు స్త్రీలు, ముగ్గురు నెలల వయస్సు గల చంటి పిల్లలు. మిగిలిన వారు పురుషులు. ఈ మొత్తం బాధితులలో ఒక నెల వయస్సు వున్న చంటి పాప నుండి 75 సంవత్సరాల వయోవృద్ధుడి వరకు వున్నారు. చంటి పాపను తల్లీతండ్రితో పాటు ఒక దోపిడికి సంబంధించిన కేసులో నిర్బంధంలోకి తీసుకొని చాలాకాలం పోలీసు కస్టడీలో ఉంచుకోవడం వలన అంటువ్యాధి సోకి ఆ పాప చనిపోయింది. ఊరూరా తిరిగి గాజులు, పూసలు అమ్ముకొని జీవించే 30 మంది స్త్రీ పురుషులను వేసవికాలంలో ఒకే లాకప్పులో వుంచి, మంచి నీళ్ళు సహితం ఇవ్వకుండా నిర్బంధించడం వలన పర్వత్ హోత్ అనే 75 సంవత్సరాలు వృద్ధుడు వూపిరాడక మరణించాడు.

ఈ 211 మంది మృతులలో 84 మంది గుండెపోటు, అనారోగ్యం వంటి సహజ కారణాల వలన మరణించారని, నిర్బంధించడం వలన కాదని పోలీసులు వాదించారు. వాళ్ళ ప్రకారం వీరిలో 76 మంది ఆత్మహత్య చేసుకోవడం వలన (41 మంది ఉరి వేసుకొని, 18 మంది విషం తిని, 11 మంది నీటిలో మునిగి, ముగ్గురు ఒళ్ళు కాల్చుకొని, ఇద్దరు భవనాలపై నుండి దూకి, ఒకరు తనను తాను కత్తితో పొడుచుకొని) మరణించారు. మరో 28 మంది గురించి వారు చెప్పిన వివరాలు : 11 మంది ప్రమాదవశాత్తు, 11 మంది ఇతరులు గాయపర్చటం వలన, అయిదుగురు విపరీతంగా మద్యం తాగడం వలన, ఒకరు పాముకాటు వలన మరణించారు. మరో 17 కేసులకు సంబంధించి పోలీసులు ఎలాంటి వివరణ యివ్వలేదు. 6 కేసులలో

మాత్రమే బాధితుల మరణాలకు తాము బాధ్యులమని అంగీకరించారు. అయితే పై అన్ని కేసులలోనూ మా నిజనిర్ధారణ సంఘాలు సేకరించిన వివరాలు పోలీసులు యిచ్చిన వివరణకు భిన్నమైన అంచనాకు వచ్చే విధంగా ఉన్నాయి.

ఇక్కడో వివరణ ఇవ్వాలి. పోలీసు నిర్బంధంలో మరణం సంభవించిందంటున్నా మంటే పోలీసులే ఆ మరణానికి కారణం అని అనడం కాదు. వారు నేరుగా కారణం కావచ్చు, కాకపోవచ్చు. అయితే, ఆ మరణానికి పోలీసులు ఏదో ఒక మేరకు బాధ్యత వహించాలి అనే అర్థం మాత్రం వుంది. ఎందుకంటే పోలీసులు నిర్బంధితుల స్వేచ్ఛను (తమ బాగోగులు తాము చూసుకొనే స్వేచ్ఛతో సహా) నిరాకరించడం వలననే ఈ మరణాలు సంభవించాయి కనుక వారే నిర్బంధితుల క్షేమానికి పూర్తి బాధ్యత వహించాలి.

మేము జాబితాలో పేర్కొన్న 211 కేసులనూ పోలీసు నిర్బంధంలో జరిగిన మరణాలుగా వారు అంగీకరించకపోవచ్చు. తమ భౌతిక నిర్బంధంలో – ఉదాహరణకు లాకప్పు గదిలో జరిగిన మరణాలను మాత్రమే కస్టడీ మరణాలుగా పోలీసులు భావిస్తారు. కాని అది సంకుచిత నిర్వచనం. అంగీకరించదగిన నిర్వచనం కాదు. మరణాలు సంభవించిన సమయంలో అతను/ఆమె పోలీసుల కస్టడీలో లేనప్పటికీ, పోలీసు కస్టడీలో హింసకు గురికావడం వలననే మరణించి ఉండవచ్చు. అప్పుడు అది కస్టడీ మరణమే అవుతుంది. అంతేకాక కస్టడీ అంటే లాకప్పుగదిలో లేక ఆ పరిసరాలలో నిర్బంధించడం మాత్రమే అని అర్థం కాదు. దానికి అంతకంటే విశాలమైన అర్థం వుంది.

## పోలీసు కస్టడీలో మరణం

ఏ ఏ పరిస్థితులు పోలీసు కస్టడీ మరణం కిందికి వస్తాయో వివరిస్తాము.

కస్టడీ/నిర్బంధం అనేది ఒక వ్యక్తిని వాస్తవంగా లాకప్పు గదిలో వుంచిన సమయంతో ప్రారంభం కాదు. అంతకంటే చాలా ముందుగానే ప్రారంభమౌతుంది. ఒక వ్యక్తి స్వచ్ఛందంగా గానీ, బలవంతంగా గానీ పోలీసుల అదుపులోనికి వచ్చినప్పటి నుండి ప్రారంభమౌతుంది. అంటే ఒక వ్యక్తి స్వేచ్ఛగా తిరిగే హక్కును కోల్పోయి పోలీసుల అదుపులోనికి వచ్చినప్పటి నుండి అన్నమాట. ఆ క్షణం నుండి లాకప్పు

గదిలో వ్యక్తిని వుంచే సమయం వరకు పరిస్థితులను బట్టి ఆ గడువు ఎక్కువగానీ తక్కువ గానీ వుండవచ్చు.

ఇది 'కస్టడీ'కి మేము ఇస్తున్న కొత్త నిర్వచనమేమీ కాదు. ఈ నిర్వచనం నేర విచారణ స్మృతిలోని సెక్షన్ 46 నుండి వచ్చినదే. న్యాయస్థానాలు కూడా ఈ విషయాన్ని చాలాసార్లు ధృవీకరించాయి.

కాబట్టి, పోలీసు కస్టడిలో మరణం అంటే –

1. పోలీసులు నిర్బంధంలో వున్న వ్యక్తి పోలీసు స్టేషన్ ఆవరణలో (లాకప్పులో వున్నా లేక బయట వున్నా) మరణిస్తే అది కస్టడీ మరణమౌతుంది.

2. అలాగే ఒక వ్యక్తిని మొదట నిర్బంధంలోకి తీసుకున్న సమయానికీ లాకప్పులో వుంచడానికి మధ్య కాలంలో జరిగిన మరణం కూడా కస్టడీ మరణమే అవుతుంది.

అయితే రెండవ రకమైన మరణాలు సహజ కారణాల వలన కూడా జరగవచ్చు. మరణం మనుషులకు ఎప్పుడైనా రావచ్చు కాబట్టి మనిషిని నిర్బంధంలోకి తీసుకొని పోలీసు స్టేషనుకు తీసుకొని వెళ్ళే మధ్యలో కూడా చావు సంభవించవచ్చు. విషయం ఇంతే అయితే దీని గురించి వివరణాత్మకమైన చర్చ అనవసరం. కాని వాస్తవమేమిటంటే, అనుమానితుణ్ణి పట్టుకున్న క్షణం నుండి పోలీస్ స్టేషన్‌కు వెళ్ళేదాకా దారి పొడవునా కొట్టుకుంటూ తీసుకువెళ్లే అసహ్యమైన అలవాటు భారతీయ పోలీసులకు వుంది. ఆ హింస అంతటినీ నిర్బంధంలో హింసగానే పరిగణించాలి. కొన్నిసార్లు నిర్బంధంలోకి తీసుకొనే సమయంలో ప్రయోగించే హింస ఎంత ఎక్కువగా వుంటుందంటే అందులో నిర్బంధించే వుద్దేశమే కనిపించదు, చావబాదడమే ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తుంది. నిర్బంధంలోకి తీసుకొనే క్రమంలోనే ఈ హింస ప్రయోగించబడిందనేది అర్థం చేసుకుంటే, ఈ హింసను, ఆ హింస పరిణామాలను కూడా కస్టడీలో జరిగినవిగానే పరిగణించాలి. కామారెడ్డిలో ఇందుర్తి అమరేందర్ రెడ్డి అనే కుర్రవాణ్ణి పోలీసులు నడిరోడ్డు మీద పామును కొట్టినట్టు కొట్టి చంపడాన్ని ఇలాంటి హింసకు ఉదాహరణగా తీసుకోవచ్చు.

అయితే అనుమానితుణ్ణి పోలీసు స్టేషన్‌కు తీసుకుపోయే సందర్భంలో పోలీసులు (తప్పుగానో, ఒప్పుగానో) ఉపయోగించవలసి వచ్చే హింస నుండి పై హింసను వేరు

చేసి చూడాలి. అలా తీసుకు వెళ్తున్నప్పుడు అనుమానితుడు పారిపోవడానికి ప్రయత్నించవచ్చు. అనుమానితుడు పారిపోకుండా ఆపడానికి పోలీసులు హింసను ప్రయోగించవలసి రావచ్చు. అయితే పారిపోవడానికి ప్రయత్నించాడనే కథ వాస్తవమా లేక నిర్బంధంలో చేసిన హత్యను కప్పిపుచ్చుకోవడానికి వేసిన ఎత్తుగడా అనే విషయాన్ని నిర్ధారించుకోవలసి వుంటుంది (ఈ కోవకు చెందిన కేసులుగా కాకినాడకు చెందిన గద్దం అచ్యుతరామయ్య మరణం, అనంతపురానికి చెందిన హైదర్‌వలీ మరణాలు చెప్పుకోవచ్చు). అనుమానితుడు తప్పించుకుపోయే ప్రయత్నం చేసినందువల్ల మాత్రమే హింస ఉపయోగించబడిందనే కథనం వాస్తవమే అయినా పోలీసులు అవసరమైన కనీస హింసను మాత్రమే ప్రయోగించారా అనేది ప్రశ్నగానే మిగిలిపోతుంది. అనసరానికి మించిన హింసను ఉపయోగించిన పోలీసులను తగిన విధంగా శిక్షించాలి. ఇలాంటి హింసను నిర్బంధంలో జరిగిన హింసగా పరిగణించడం సబబు కాదు.

కానీ పోలీసులు ఒక వ్యక్తిని నిర్బంధంలోకి తీసుకొనే క్రమంలో అలవాటు ప్రకారం ప్రయోగించే హింసకు, ఆ వ్యక్తి పారిపోకుండా ఆపడానికి ప్రయోగించే హింసకు మధ్య చాలా సన్నని గీత మాత్రమే వుంటుంది. అనుమానితుడు పారిపోకుండా ఆపడానికి ప్రయోగించిన హింసగా కనిపించే సంఘటనలు, నిజానికి పోలీసులు ఉద్దేశపూర్వకంగా హింసను ప్రయోగించిన సంఘటనలు కావచ్చు. అలాంటప్పుడు ఆ హింసను కస్టడీలో జరిగిన హింసగానే పరిగణించాలి. గుంటూరులో రైల్వే పోలీసులు అప్పారావు అనే ఒక క్వారీ కార్మికుణ్ణి ఆరెస్టు చేయడానికి వచ్చి తరిమి తరిమి బండరాళ్ళతో కొట్టి చంపడం ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

పైన చెప్పిన రెండవ రకానికి చెందిన హింసా ప్రయోగం – పోలీసులు అనుమానితున్ని కోర్టుకు తీసుకెళ్ళే క్రమంలో, లేక నేర పరిశోధనలో భాగంగా స్టేషన్ నుండి బయటకు తీసుకెళ్ళే క్రమంలో కూడా చోటు చేసుకోవచ్చు. అలాంటి వాటిని కూడా నిర్బంధంలో జరిగిన హింసగానే పరిగణించాలి.

మరో విషయం చెప్పుకోవాలి. పైన చెప్పిన రెండు పరిస్థితులలో మాత్రమే కస్టడీ మరణాలు జరుగుతాయని కాదు. ఒక వ్యక్తిని పూర్తిగా విడుదల చేసిన తరువాత 'కస్టడీ మరణం' జరిగే అవకాశం వుంది. సాధారణంగా జరిగేదేమిటంటే, పోలీసులు అనుమానితున్ని తీవ్రంగా హింసిస్తారు. అతని ప్రాణం అపాయంలో పడగానే తీసికెళ్ళి

అతని ఇంటివద్దనో, రోడ్డు పక్కనో పడసిపోతారు. (1992లో అనంతపురం జిల్లా ముదిగుబ్బ గ్రామంలో బోనాల వెంకట నారాయణ మరణాన్ని దీనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు). లేకపోతే అతన్ని తీసికెళ్ళి వైద్యం చేయించమని అతని కుటుంబానికి అప్పగిస్తారు. (1993లో టెక్కలిలో జరిగిన పేడాడ రాములు మరణం దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు.) బాధితుడు ఇంకా నడవగలిగే, తిరగ గలిగే పరిస్థితిలో ఉన్నపుడు పోలీసులు అతన్ని వదిలేయవచ్చు. ఈ గాయాల వలన అతను ఆ తరువాత మరణిస్తే, అంతకు మునుపే పోలీసులు అతన్ని నిర్బంధం నుండి విడుదల చేసి వున్నంత మాత్రాన, ఆ మరణాన్ని కస్టడీ మరణంగా పరిగణించకపోవడం సహేతుకం కాదు. బాధితుడు మరణిస్తాడు అనే భయంతోనే పోలీసులు అతడిని కస్టడీ నుండి విడుదల చేశారని అనుకున్నప్పుడే కాదు, ఇతర సందర్భాలలో కూడా ఈ వాదన (కస్టడీ అనంతరం జరిగిన మరణాన్ని కూడా కస్టడీ మరణంగా పరిగణించాలనే వాదన) వర్తించవచ్చును. మరణాన్ని బాధితుడు గానీ పోలీసులు గానీ విడుదల సమయంలో ముందుగా వూహించనప్పటికీ బాధితుడు మరణిస్తాడనే భయం వలన కాక, ఇతర కారణాల వలన పోలీసులు అతన్ని విడుదల చేసినప్పటికీ, బాధితుడు మరణిస్తే, ఆ మరణం కస్టడీ హింస వల్లనే జరిగినట్లైతే, దాన్ని కస్టడీ మరణంగానే పరిగణించాలి.

బాధితుడు మారుమూల గ్రామానికి చెందని వాడు, నిరక్షరాస్యుడు, పేదవాడు కాకుంటే సరియైన వైద్య సదుపాయం పొంది మరణం నుండి తప్పించుకొని వుండేవాడు కాబట్టి ఈ మరణాన్ని కస్టడీలో జరిగిన హింస వలన సంభవించిన మరణంగా పరిగణించకూడదని వాదించటం అర్థరహితమైనది. ఎందుకంటే, బాధితుల్లో ఎక్కువ మంది సరియైన వైద్య సదుపాయం పొందలేని పేదవారు, నిరక్షరాస్యులే వుంటారు. ఆధునిక కాలంలో చావనవసరం లేని దెబ్బలకు చస్తుంటారు. ఇది పోలీసులకు బాగా తెలిసిన విషయమే.

3. ఒక వ్యక్తి పోలీసు కస్టడీ నుండి బయటకు స్వేచ్ఛగా విడుదలైనప్పటికీ లేక జైలుకు పంపబడినప్పటికీ, పోలీసు నిర్బంధంలో జరిగిన హింస వలన మరణం సంభవిస్తే, విడుదలైన తరువాత సరియైన వైద్య సదుపాయం పొందివున్నా లేకపోయినా, అలాంటి మరణాన్ని కస్టడీ మరణంగానే పరిగణించాలి. అయితే ఆ వ్యక్తి పోలీసు

కస్టడీ నుండి జైలు నిర్బంధంలోకి పోయివున్నట్లయితే, జైలులో ఆ వ్యక్తికి సరియైన వైద్య సౌకర్యం ఇవ్వనట్లైతే, ఆ మేరకు జైలు అధికారులు కూడా నిందార్హులౌతారు.

పోలీసు కస్టడీలో జరగకపోయినా, కస్టడీలో జరిగిన హింస పర్యవసానంగా జరిగే మరికొన్ని రకాలైన మరణాలు కూడా వున్నాయి. ఉదాహరణకు, కొన్ని కేసులలో, వ్యక్తుల్ని తరుచుగా పోలీసు స్టేషన్‌కు తీసుకుపోయి కొట్టడం జరుగుతుంది. ఈ హింసను భరించలేక, నిర్బంధానికీ నిర్బంధానికీ మధ్య కాలంలో ఆ వ్యక్తి ఆత్మహత్య చేసుకొంటాడు. ఇంకొన్ని కేసులలో నేర పరిశోధన కోసం పోలీసు స్టేషన్‌కు తీసికెళ్ళి చావబాది ఆ వ్యక్తిని రెండు రోజుల తరువాత మరలా రావల్సివుంటుందని చెప్పి యింటికి పంపేస్తారు. అలాంటి వ్యక్తి ఇంటికి వెళ్ళి ఆత్మహత్య చేసుకుంటాడు. ఆ కోవకు చెందిన ఉదాహరణలు చాలా వున్నప్పటికీ అలాంటి వాటిని కస్టడీ మరణానికి యిచ్చే నిర్వచనంలో చేర్చడం లేదు.

## పోలీసుల బాధ్యత

పై చెప్పిన విధంగా, పోలీసు నిర్బంధంలో ఒక వ్యక్తి మరణించాడన్నంత మాత్రాన ఆ మరణం పోలీసుల వలననే జరిగిందని చెప్పడం కాదు. పోలీసుల వలననే ఆ మరణం సంభవించి వుండవచ్చు, లేకపోవచ్చు. అది ఎలా జరిగినప్పటికి పోలీసు కస్టడీలో జరిగిన ప్రతీ మరణానికి కొంత మేరకు పోలీసులు బాధ్యత వహించాల్సి వుంటుంది. ఆ మరణాలు ఈ కింది విధంగా జరిగే అవకాశం వుంది.

1. తమ హింస వలన మనిషి మరణిస్తాడని తెలిసీ బలప్రయోగం చేస్తే పోలీసులే ప్రత్యక్షంగా ఆ మరణానికి కారణమౌతారు. భారత శిక్షా స్మృతిలోని నేరాలలో లాగా కాకుండా, ఇక్కడ బాధితుని యొక్క అన్ని రకాల అనారోగ్యానికి సంబంధించిన విషయాల గురించి పోలీసులకు అవగాహన వుందనే భావించాలి. ఎందుకంటే, ఒక వ్యక్తిని నిర్బంధంలోనికి తీసుకొనేటప్పుడు, తద్వారా తన్ను తాను సంరక్షించుకొనే స్వేచ్ఛను ఆ వ్యక్తికి నిరాకరించడం జరుగుతుంది కాబట్టి అతని ఆరోగ్యానికి సంబంధించిన విషయాలు ముందుగానే తెలుసుకొని వుండడం పోలీసుల బాధ్యత.

2. పోలీసులు ఆ వ్యక్తి చనిపోయేంతగా కొట్టక పోయినప్పటికీ, సరియైన వైద్యం జరగకపోవడం వలన ఆ వ్యక్తి మరణించవచ్చు. కస్టడీలో కొట్టడం నేరం

కాబట్టి, ఆ వ్యక్తి కస్టడిలో తన్ను తాను సంరక్షించుకోలేడు కాబట్టి. వైద్య సదుపాయం కల్పించాల్సిన బాధ్యత పూర్తిగా పోలీసులదే. కాని, పోలీసులు తరుచుగా ఆ పని చేయరు. మేము గమనించిన ప్రతి కేసులోను, పోలీసులు ఆ వ్యక్తిని చివరి నిమిషంలో డాక్టరు దగ్గరకు తీసుకుపోతారు. సాధారణంగా మృతదేహాన్ని మాత్రమే వాళ్ళు డాక్టరు దగ్గరకు తీసుకుపోతారు. ఆ వ్యక్తి పోలీసుస్టేషన్ నుండి చనిపోకముందే వెళ్ళిపోయినప్పటికీ, సరియైన వైద్య సదుపాయం అందక ఆ తరువాత అతను మరణిస్తే, చట్ట విరుద్ధంగా ఆ వ్యక్తికి గాయాలు కావడానికి పూర్తిగా పోలీసులే కారణం కాబట్టి, బాధితుని 'నిర్లక్ష్యం' అనే కారణంతో పోలీసుల్ని నింద నుండి తప్పించలేము (బాధితుని చేతిలో లేని పేదరికం లాంటి కారణాలు పోలీసులకు తెలియనివి కావు).

3. ఒక వ్యక్తి నిజంగానే అనారోగ్యం వలన కస్టడీలో చనిపోవచ్చు. చట్ట విరుద్ధంగా చాలాకాలం పోలీసు నిర్బంధంలో వుంచడం వలన ఇది జరగొచ్చు. 24 గంటలకు పైగా నిర్బంధించడం చట్ట వ్యతిరేకం గాబట్టి, ఆ వ్యక్తి చావుకు బాధ్యత ప్రత్యక్షంగా పోలీసుల మీదే వుంటుంది. ఆరెస్టు అయిన 24 గంటలలోపు ఒక వ్యక్తి మరణిస్తే కూడా, ఆ బాధ్యత పోలీసుల మీదే వుంటుంది. ఎందుకంటే వ్యక్తిని నిర్బంధించినప్పుడు పోలీసులు కలిగించిన ఆదుర్దా లేక భయం వలన కూడా అరెస్టు అయిన వ్యక్తి ఆరోగ్యం క్షీణించవచ్చు. ఇలాంటివి పోలీసులు తప్పించుకో లేనటువంటి బాధ్యతలు.

ఈ పదేళ్ళ కాలంలో పరిశీలించిన చాలా కేసులలో నిర్బంధించిన 24 గంటలలోపే వ్యక్తులు మరణించడం జరిగింది. చాలా కేసులలో పోలీసులు వారిని 24 గంటలలో మరణించే విధంగా కొడుతున్నారు. అదే విధంగా చాలా కేసులలో పోలీసు నిర్బంధం అంటే వున్న భయం, భౌతిక హింస లాంటి విభిన్న కారణాలు కలిసి చావుకు దారి తీస్తూ వున్నాయి.

4. అనుమానితుడు లాకప్పు గదిలోనో, పోలీసు స్టేషన్ పరిసరాల్లోనో ఆత్మహత్య చేసుకొన్న సంఘటనలు కొన్ని ఉన్నమాట నిజమే కాని పోలీసులు ఆత్మహత్యా సంఘటనలుగా పోలీసులు చెప్పే సంఖ్యలో వాటి సంఖ్య నిజానికి చాలా తక్కువ. కస్టడీలో జరిగే హింసాత్మక మరణాలకు పోలీసులు పెట్టే అందమైన పేరు ఆత్మహత్య. మొత్తం 211 కేసులలో 76 కేసులు ఆత్మహత్యా సంఘటనలుగా పోలీసులు పేర్కొన్నారు. పోలీసులు చెప్పే కథనాలలో చాలా వరకు అసంబద్ధమైనవి. ఎందుకంటే

లాకప్పు గదిలో వుండగా ఆత్మహత్య చేసుకోవడానికి కావల్సిన వస్తువులు, ఎవరూ లేని సమయం, అవకాశం దొరకడం చాలా కష్టం. కాని నిజంగానే నిర్బంధితుడు ఆత్మహత్య చేసుకున్న సందర్భాలు కూడ వున్నాయి. ఈ ఆత్మహత్యలు నిజానికి చాలాకాలం నిర్బంధించడం వలన, లేక చిత్రహింసల పాలు చేస్తారనే వాస్తవ భయం వలన లేక సామాజికంగానూ, వ్యక్తిగతంగానూ అవమానాల పాలు అవుతామనే భయం వలన జరగవచ్చు. మొదటి రెండు సందర్భాలలో పోలీసులు నేరుగా బాధ్యులు అవుతారు. మిగిలిన సందర్భాలలో కూడా నిర్బంధితుడు ఆత్మహత్య చేసుకొనే అవకాశం వుందని, అలాంటి వాటిని ఆపవలసిన బాధ్యత పోలీసులు మీద ఉందని పోలీసుల అర్థం చేసుకోవాలి.

5. నేరం చేసిన వ్యక్తిని ప్రజలు పట్టుకొని ప్రతీకారేచ్ఛతో కొట్టి పోలీసులకు అప్పగించిన సందర్భాలు కూడ కొన్ని వున్నాయి. మొత్తం 211 కేసులలో 10 కేసుల వరకు యిలాంటివి వున్నాయి. అలాంటి కేసులలో ఆ వ్యక్తికి మొదట వైద్య సహాయం అందించి, అతని మీద దాడి చేసిన వ్యక్తులను ఆరెస్టు చేయాల్సిన బాధ్యత పోలీసులది. అయితే ఈ రెండూ వాళ్ళు చేయరు. అతని మీద దాడి చేసిన వారిని అరెస్టు చేయక వదలి వేయడం ద్వారా పోలీసులు పరోక్షంగా వ్యక్తిగత ప్రతీకారాన్ని ప్రోత్సహిస్తారు. అంతేకాక ఆ వ్యక్తికి వైద్య సదుపాయం అందించకుండానే నిర్బంధంలో వుంచుతారు. పోలీసుల అదుపులోకి రాకముందు అతను తిన్న దెబ్బల వల్లనే ఆ వ్యక్తి ఆ తరువాత మరణించినప్పటికీ, పోలీసులు తమ బాధ్యత నుండి తప్పించు కోలేరు.

## కస్టడీ మరణాలకు శిక్ష

వివిధ రకాల కస్టడీ మరణాలలో పోలీసులకు ఎలాంటి బాధ్యత ఉంటుందో పైన చర్చించాము. వాటన్నిటిని కూడ భారతీయ శిక్షా స్మృతిలోని సెక్షన్ 302, 304, 304ఎ మరియు 306 కింద నమోదు చేయవచ్చు. ఈ సెక్షన్లతో పాటు చట్ట విరుద్ధ నిర్బంధం, నిర్బంధంలో హింస మొదలైన నేరాలను కూడ జతచేసి కేసు పెట్టవచ్చు. అయితే కస్టడీ మరణాలకు వుండే ప్రత్యేక స్వభావం వలన, రకరకాలైన కస్టడీ మరణాల గురించి, అందులో పోలీసుల బాధ్యత గురించి ఇప్పుడున్న చట్టంలో భాగంగా కాకుండా, కొత్తగా నిర్వచించడానికీ వర్గీకరించడానికీ కృషి చేయాలి. నిర్బంధంలో జరిగే హింసకు, సాధారణ హింసకు తేడా వుంది. కస్టడీలో హింసకు

పాల్పడే వారికి అధికారం వుంది కాబట్టి బాధితులు దానిని వ్యతిరేకించకుండా మౌనంగా భరించడం జరుగుతుంది. నిర్బంధంలో బల ప్రయోగం – లాఠీ, తుపాకి – చట్ట విరుద్ధం అయినప్పటికీ, వీటిని వుపయోగించే వ్యక్తికి వాటిని వుపయోగించే అధికారం వుండడం వలన ఈ హింసకు లేని కుహనా అధికారం చేకూరుతుంది. అంతే కాకుండా కస్టడీలో గాయపడినప్పుడు ఆ వ్యక్తి పట్ల పోలీసులు వహించాల్సిన బాధ్యతకు సమాంతరమైనది సాధారణ చట్టాలలో ఏదీ లేదు. కస్టడీలో హింసను ప్రయోగించమని కింద స్థాయి పోలీసుల మీద పై స్థాయి అధికారుల ఒత్తిడి వుండడం కూడా జరుగుతుంది. ఇందులో కింది స్థాయి అధికారులు మాత్రమే హింసకు పాల్పడుతున్నట్లు కనిపిస్తుంది. హింసకు లేక నేరానికి ప్రోత్సహించడాన్ని లేక ఉసికొల్పడాన్ని నేరంగా నిర్వచించే చట్టాలు ఇలాంటి పైఅధికారుల బాధ్యతలను నిర్వచించటానికి సరిపోవు.

పై అన్ని కారణాల వలన, కస్టడీ మరణాలకు సంబంధించిన శిక్షా స్మృతిని కొత్తగా నిర్వచించి, పునర్నిర్మించాలి. గౌరవనీయులైన మానవ హక్కుల కమిషన్ ఈ విషయంపై దృష్టి ఉంచి, ప్రభుత్వానికి తగు సలహా ఇవ్వాలని ఆశిస్తున్నాము.

గతంలో సుప్రీంకోర్టు, లా కమిషన్ కస్టడీలో జరిగే హింసకున్నటువంటి ప్రత్యేక స్వభావాన్ని గుర్తించాయి. సుప్రీంకోర్టు రాంసాగర్ యాదవ్ కేసులో (1985) కస్టడీలో జరిగే హింసకు స్వతంత్రమైన సాక్షులు ఉండే అవకాశం లేదు కాబట్టి, ఆరోపణను నిరూపించుకొనే బాధ్యత పోలీసుల మీద వుంటుందని చెప్పింది. 1992 లో భగవాన్ సింగ్ కేసులో కూడ సుప్రీంకోర్టు అదే అభిప్రాయాన్ని ఉద్ఘాటించింది. లా కమిషన్ తన 113 వ రిపోర్టులో కూడ అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. అప్పటినుండి ఒక దశాబ్దం గడిచిపోయినప్పటికీ ఆ సిఫార్సులను చట్టరూపంలో తేవడానికి ప్రభుత్వం ఎటువంటి ప్రయత్నం చేయలేరు.

సాధారణ చట్టం కింద కూడ పోలీసుల మీద విచారణ జరగడం లేదు. దీనికి చట్ట సవరణ అవసరమేమీ లేదు. మొత్తం 211 కేసులలో మహా అయితే 10 కేసులలో మాత్రమే నేర విచారణ ప్రారంభించబడింది. మాకు తెలిసిన మేరకు, మూడు కేసులలో మాత్రమే కోర్టులలో పోలీసులకు శిక్ష పడింది. కస్టడీలో హింసకు పాల్పడిన పోలీసులను కోర్టులలో విచారించాలి. న్యాయ విచారణ జరపడం దానికి ప్రత్యామ్నాయం కాదు. ఈ రాష్ట్రంలో ప్రజా ఒత్తిడికి లొంగి కొన్ని సంఘటనలలో న్యాయ విచారణ జరిపిన సందర్భాలు వున్నాయి. 1986 ద్వితీయార్థంలో వరసగా జరిగిన కస్టడీ మరణాలపైన

పెద్దఎత్తున నిరసన వచ్చింది. ఆ సందర్భంగా, ఇక మీదట ప్రతి కస్టడీ మరణంపైన న్యాయ విచారణ జరిపిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. చాలా కస్టడీ మరణాలపై అప్పటి ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించింది. కానీ ఆ తరువాత కస్టడి మరణాలు ఆగకుండా కొనసాగినప్పటికీ అతి కొద్ది సంఘటనల మీద మాత్రమే న్యాయ విచారణ జరిపించారు.

211 కేసులలో చివరి 24 సంఘటనలు మాత్రమే మానవ హక్కుల కమిషన్ పరిధిలోకి వస్తాయని మాకు తెలుసు. కాబట్టి ఈ 24 సంఘటనలపైనైనా సమగ్రమైన దర్యాప్తు జరపమని కమిషన్‌ను కోరుతున్నాం. ప్రాథమికమైన సాక్ష్యాధారాలు వున్నట్టు తేలిన కేసులలో పోలీసులపై కేసు నమోదు చేయమని ప్రభుత్వానికి మానవ హక్కుల కమిషన్ సూచన చేయవచ్చు.

మానవ హక్కుల పరిరక్షణ చట్టంలో ప్రతి జిల్లా సెషన్సు కోర్టును మానవ హక్కుల కోర్టుగా ప్రకటించే అవకాశం వుంది. ఈ కోర్టుకు మానవ హక్కుల ఉల్లంఘన మీద ఫిర్యాదులు స్వీకరించి, విచారించే అధికారం ఉంటుంది. ఈ నిబంధనను అమలు చేయమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఆదేశం ఇవ్వవలసిందిగా మానవహక్కుల కమిషన్‌ను కోరుతున్నాం. ఈ మానవ హక్కుల కోర్టులు కస్టడీలో జరిగిన అన్ని రకాల హింసలను గుర్తించి విచారణను ప్రారంభించవచ్చు.

## నష్టపరిహారం

మేము మా అనుబంధంలో పేర్కొన్నట్లు, పోలీసు కస్టడీలో చంపబడిన అందరూ కూడ తమ కుటుంబాల పోషకులే! వారి మరణంతో ఆ కుటుంబాలన్నీ తీవ్రమైన ఆర్థిక నిస్సహాయతకు గురౌతున్నాయి. ఈ వ్యక్తుల యొక్క ప్రాణాన్ని తీసింది ప్రభుత్వ సిబ్బందే అయినందు వల్ల, ఆ కుటుంబాలకు సరియైన నష్టపరిహారాన్ని అందించాల్సిన బాధ్యత రాజ్యానిదే.

కస్టడీలో హింసకు గురైన బాధితుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఇంతవరకు ఎటువంటి విధానం లేదు. కొన్నిసార్లు ప్రభుత్వం ఇష్టానుసారంగా రూ॥ 5,000 నుండి 10,000 (ఇది తగినంత నష్టపరిహారమేమీ కాదు) వరకు నష్టపరిహారం ఇచ్చింది. కొన్నిసార్లు రాజకీయ పార్టీల, లేక ప్రజల ఒత్తిడి ఫలితంగా బాధితుడి కుటుంబానికి రుణ సహాయమో లేక ఒక ఎకరా పొలమో

నష్టపరిహారంగా జిల్లా పరిపాలనా యంత్రాంగం ఇచ్చిన సందర్భాలు వున్నాయి. చాలా కేసులలో ఎలాంటి నష్టపరిహారం ఇవ్వనేలేదు.

ఈ విషయంలో కోర్టులు కూడ పెద్ద సహాయకారిగా లేవు. 1984–89 మధ్య కాలంలో జరిగిన కస్టడీ మరణాలపై వేసిన ఒక రిట్ పిటిషన్ చాలాకాలంగా హైకోర్టులో పెండింగ్‌లో వుంది. చిత్తూరు జిల్లా మదనపల్లెకు చెందిన బషీర్ అహ్మద్ కేసులో మాత్రం పెద్ద మొత్తంలో నష్టపరిహారం చెల్లించమని ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది.

**నీలబతి బెహరా** (1993) కేసులో పౌరుల ప్రాథమిక హక్కుల ఉల్లంఘనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అంతకు ముందు ఈ సమస్య భారత రాజ్యాంగంలోని అధికరణ 300 తో ముడిపడి వుండడం వలన నష్టపరిహారానికి సంబంధించిన రాజ్యాంగ ఆదేశం చాలా అసంతృప్తికరంగా వుండింది. ఇప్పుడు సుప్రీంకోర్టు దానిని మెరుగుపరచి 'ప్రభుత్వ అధికారుల వల్ల పౌరుల ప్రాథమిక హక్కులకు జరిగిన నష్టానికి రాజ్యం తప్పనిసరిగా పరిహారం చెల్లించ వలసిందే' అని చెప్పింది.

మానవ హక్కుల ఉల్లంఘన వలన నష్టపోయిన వారికి నష్టపరిహారాన్ని సిఫార్సు చేయడంలో మానవ హక్కుల కమిషన్ ఇప్పుడున్న చట్ట పరిమితులకు లోబడి వుండనక్కరలేదు కాని, ఈ దేశ అత్యున్నత న్యాయస్థానం ఈ విషయంలో స్పష్టమైన వైఖరిని తీసుకోవడం ఒక అనుకూలమైన విషయం. కస్టడీలో మరణానికి గురైన వారి కుటుంబానికి – వాళ్ళు తమ కుటుంబం పోషకులు అయినా కాకపోయినా– నష్టపరిహారం చెల్లించటానికి స్పష్టమైన సూచనలను మానవ హక్కుల కమిషన్ చేస్తుందని ఆశిస్తున్నాం. మేము పైన చెప్పినట్టుగా పోలీసులు, తద్వారా రాజ్యము, కస్టడీలో జరిగే మరణాలకు బాధ్యత వహించకుండా – నేరుగా మరణాలకు కారణం కానప్పటికీ– తప్పించుకోలేవు.

## కస్టడీలో జరిగే హింస యొక్క సామాజిక స్వభావం

ఒక వ్యక్తి వృత్తిపరంగా నేరస్థుడైనా లేక మోసగాడైన ధనవంతుడైనా అతన్ని కస్టడీలో చిత్రహింసలకు గురిచేయడం చట్టం దృష్ట్యా కాని, పౌరహక్కుల దృష్ట్యా కాని అంగీకరించలేనిదే కాక, క్షమించరానిది కూడ. దానిని నిరోధించాల్సిందే,

శిక్షించాల్సిందే. అయితే మరణించిన వాళ్ళు ఎక్కువ భాగం వృత్తిపరమైన దొంగల ముఠానో లేక ధనవంతులైన మోసగాళ్ళో కారు. దొంగతనానికో, సాధారణ ఘర్షణలకు పాల్పడినందుకో లేక తాగి అమర్యాదగా ప్రవర్తించినందుకో ఈ దేశంలో శ్రమ చేసుకొని బతికేవారు కస్టడీలో హింసకు గురౌతున్నారు. కస్టడీలో జరిగే హింస స్వభావం ఇలాంటిదైనప్పుడు దీని పరిష్కారం కొరకు అత్యవసరంగా కృషి చేయాల్సి వుంది.

కస్టడీలో హింసకు, క్రూరత్వానికి గురౌతున్న బాధితులలో అత్యధికులు శ్రమజీవులే తప్ప 'వృత్తి నేరస్తులు' కారు. కాకపోతే అప్పుడప్పుడు నేరాలు చేసిన వాళ్ళు కావొచ్చు. ఎక్కువభాగం రోజువారీ జీవితంలో చిన్న నేరాలకు పాల్పడిన వాళ్ళు మాత్రమే. ఈ నేర చర్యలు కూడ వారి పేదరికం నుండి, సాంఘిక వెనుకబాటుతనం నుండి పుట్టినవి తప్ప కావాలని చేసిన నేరాలు కావు. పోలీసు కస్టడీలో హింసకు గురౌతున్న వారిలో అత్యధికులు సామాజిక ఆర్థిక ఒత్తిడిలకు లోనై చిన్న నేరాలకు పాల్పడిన కూలి వాళ్ళో, రైతులో మాత్రమే కాని అవినీతికి పాల్పడిన ఒక ఉద్యోగో, లేక మోసానికి పాల్పడిన వ్యాపారవేత్తో, లేక కరడుగట్టిన వృత్తి పరమైన దొంగో కాదు. ఇది ఇవాళ్టి పోలీసు వ్యవస్థ యొక్క స్వభావాన్ని స్పష్టం చేస్తుంది. ఇలాంటి చిన్న నేరాలను సమాజం పట్టించుకోకూడదని మా అభిప్రాయం కాదు. ఆర్థిక అవసరాల రీత్యా దొంగతనానికి పాల్పడే పేదవాడు కూడ ఇంకాస్త తక్కువ పేదవాళ్ళ నుండే దొంగిలిస్తాడు. ఇలాంటి నేరాలతో క్రూరమైన పద్ధతుల ద్వారా కాక, భిన్నమైన పద్ధతుల ద్వారా వ్యవహరించాల్సి వుంది. అంతే కాకుండా క్రూరమైన పద్ధతులు సూత్రరీత్యా కూడ ప్రజాస్వామ్య దేశంలో అంగీకరించలేనివి.

మేమిచ్చిన అనుబంధంలో కస్టడీలో మరణించిన ప్రతి బాధితుని 'సామాజిక స్థితి' గురించి వివరించాము. ఈ వర్గీకరణలో ఒక బాధితుణ్ణి ఏ అర్థంలోనైనా 'నేరస్తుడు' అని చెప్పవచ్చా అనే విషయాన్ని పరిశీలించాము. ఎందుకంటే, పోలీసులు తాము కస్టడీలో ప్రయోగించే హింసను నైతికంగా సమర్థించుకోవడానికి బాధితుడిని 'తీవ్రమైన నేరానికి పాల్పడిన వాడుగా' పేర్కొంటారు. అయితే ఆ వ్యక్తి గతంలో నిజంగా ఏదైనా నేరానికి పాల్పడ్డాడా లేదా అనే ప్రాతిపదికను మేము తీసుకోలేదు. గతంలో ఇతని మీద ఏమైనా కేసులు వున్నాయా అనే విషయాన్ని కూడ ప్రమాణంగా స్వీకరించలేదు. ఆ వ్యక్తి ప్రధానంగా నేరానికి పాల్పడడం ద్వారా జీవిస్తున్నాడా లేక ఇంకేదైనా పని చేసి వచ్చే సంపాదన ద్వారా జీవిస్తున్నాడా అనే విషయాన్ని మాత్రం ప్రమాణంగా

తీసుకున్నాం. ఈ విషయాన్ని నిర్ధారించుకోవడానికి అతని జీవన పరిస్థితులను, స్థానిక ప్రజలకు, పోలీసులకు అతని పట్ల ఉన్న అభిప్రాయాలను లెక్కలోకి తీసుకున్నాం. మొదటి రకం వ్యక్తుల్ని 'నేర వృత్తి' వున్న వ్యక్తులుగాను, రెండవ రకం వారిని సాధారణ పనులు చేసుకొని జీవించే వారిగానూ పేర్కొన్నాం. వారు ఏ నేరాలకు పాల్పడనే లేదని మేము వాదించడం లేదు. అదే విధంగా నేరవృత్తిగల వాళ్లుగా మేము వర్గీకరించిన వ్యక్తుల మీద ఆరోపించబడిన నేరాలను వారు చేసారని గానీ, అందువలన వారు చిత్రహింసలకు గురికావల్సిన వాళ్ళు, చంపదగిన వాళ్ళు అని గానీ మేము భావించడం లేదు.

పై ప్రాతిపదిక ప్రకారం మేము చేసిన వర్గీకరణ ఇదీ–

రైతులు 34, పట్టణంలో పని చేసే కూలీలు 59, గ్రామీణ కూలీలు 32, నేరవృత్తి కలిగిన వ్యక్తులు 32, చిన్న వ్యాపారులు, ఊర్లు తిరిగి వస్తువులు అమ్ముకొనే వర్తకులు 11, విద్యార్థులు 6, యువకులు 19, మిగిలిన వారు 18 – మొత్తం 211.

'మిగిలిన వారు' అనే వర్గంలో నలుగురు నాల్గవ తరగతి ప్రభుత్వ ఉద్యోగులు, ఇద్దరు గృహిణులు, ముగ్గురు నక్సలైట్ కార్యకర్తలు, ముగ్గురు తల్లి ఒడిలోని చంటి పిల్లలు, ఇద్దరు డాక్టర్లు, ఒక భిక్షగాడు, వ్యక్తిగత వివరాలు తెలియని మరో ముగ్గురు వున్నారు.

పట్టణ కూలీలు, గ్రామీణ కూలీల మధ్య తేడా చాలా తక్కువగా వుందని చెప్పాలి. 'పట్టణం' అంటే పెద్ద నగరమే కాదు, చిన్న పట్టణం కూడ. వ్యవసాయ కూలీ, కల్లు పని, కంసాలి పని వంటి గ్రామ సంబంధ పనులను చేసే వారిని గ్రామీణ కూలీలుగాను, ఫ్యాక్టరీలలో, భవన నిర్మాణంలో, క్వారీలలో పనిచేసేవారిని, రిక్షాలాగే వారిని పట్టణ కూలీలుగాను పరిగణించాం. రిక్షాలాగే వాళ్ళు, ఇళ్ల నిర్మాణ పనులు చేసే వారు గ్రామాలలో నివసించినప్పటికీ దగ్గరున్న పట్టణ కేంద్రాలలో ప్రధానంగా పనిచేస్తారు. ప్రతి కేసులోను భూమి గురించిన సమాచారం లేకపోవడం వలన చిన్న రైతులను గ్రామీణ కూలీలుగా కాకుండా 'రైతులు'గా పేర్కొన్నాం. చివరిగా, ఇరవై సంవత్సరాల లోపు వయస్సు వున్న వాళ్ళను, తల్లిదండ్రుల మీద ఆధారపడి వున్న వాళ్ళను, తమ కుటుంబానికి చెందిన పొలం పనులో, ఉద్యోగాలో చేస్తున్నప్పటికీ, వారిని 'యువకులు' అనే వర్గీకరణలో చేర్చాం.

మేము సేకరించిన సమాచారం సమగ్రంగా వుందని గాని, పొరపాట్లు అస్సలు లేవని గాని మేము చెప్పడం లేదు. అయినప్పటికీ కస్టడీలో మరణించిన బాధితుల్లో 211 మందికి గాను 32 మంది ఒక అర్థంలో వృత్తిపరమైన నేరస్తులుగా భావించబడే సమాచారం వుంది. బాధితుల్లో ప్రధానమైన వర్గం 91 మంది గ్రామీణ పట్టణ కూలీలు, 34 గురు వ్యవసాయం చేసుకొనే రైతులు, మొత్తం బాధితుల్లో 'నేరస్తులు' 15 శాతానికన్నా కొద్దిగా ఎక్కువ మాత్రమే. రైతులు, కూలీలు 59 శాతం మంది దాకా వున్నారు. ముందుగానే చెప్పినట్లు ఈ చంపబడిన రైతులు, కూలీలు ఏ నేరానికి పాల్పడలేదని, నిర్దోషులని చెప్పడం మా ఉద్దేశం కాదు. కస్టడీలో జరిగే హింస యొక్క సామాజిక స్వభావాన్ని తెలపడం కోసం మాత్రమే ఇది చెప్తున్నాం. నేరం చేయడం ఒక జీవన విధానంగా అనుసరిస్తున్న 'కరడుగట్టిన నేరస్థుల' పైన (పోలీసులు చెబుతున్నట్టు) మాత్రమే కాదు ఈ కస్టడీ హింసను ప్రయోగిస్తున్నది; పరిస్థితుల ఒత్తిడి వల్లనో, తాగిన మైకంలోనో, రెచ్చగొట్టబడడం వలనో, ఏవో బలహీన క్షణాలలోనో నేరాలకు పాల్పడుతున్న శ్రమ చేసి జీవించే పౌరుల మీద ఈ హింసను పోలీసులు ప్రయోగిస్తున్నారు. శాంతి భద్రతలను కాపాడడానికి అలాంటి ప్రజల మీద ఇలాంటి హింసను ప్రయోగించవలసిన 'అవసరం' వుందంటే, మన సమాజాన్ని దాని 'శాంతి భద్రతల' స్వభావాన్ని గురించి వేరే వాఖ్యానం అవసరం లేదు.

బాధితులను కులం పరంగా వర్గీకరించినా పరిస్థితులు ఇదే విధంగా వున్నాయి. మా అనుబంధంలో మేము కులం గురించిన సమాచారాన్ని ఇవ్వలేదు. ఎందుకంటే ఇందుకు సంబంధించి మా దగ్గర సమగ్రమైన సమాచారం లేదు. అయినా విషయం స్థూలంగా ఈ విధంగా వుందని చెప్పవచ్చు. 211 మంది బాధితుల్లో బ్రాహ్మణ కులానికి చెందిన వారు ఒక్కరు కూడ లేరు. మిగిలిన అగ్రకులాల్లో ఇద్దరు వైశ్యులు, ముగ్గురు క్షత్రియులు, నలుగురు రెడ్లు, సుమారుగా 10 మంది కాపు, కమ్మ కులాలకు చెందిన వారున్నారు. అటువైపు 16 మంది షెడ్యూల్డు తెగలకు చెందిన వారు, 13 మంది ముస్లింలు వున్నారు. మిగిలిన వారు (సుమారు 160 మంది) దళిత, వెనుకబడిన కులాలకు చెందిన వారు.

ఇదే విషయాన్ని మరొక కోణం నుండి చూద్దాం. మేమిచ్చిన అనుబంధం మృతుల మీద ఆరోపించబడిన (వాస్తమైనా లేక అబద్ధమైనా) నేరం స్వభావాన్ని కూడా తెలియజేస్తుంది. అన్ని నేరాలలోకీ దొంగతనం నేరాలు అత్యధికంగా వున్నాయి.

సుమారు 45 శాతం మృతులపైన దొంగతనం నేరాలు మోపబడి ఉన్నాయి. గతంకన్నా ఎక్కువగా పేద కుటుంబాలలో కూడ స్త్రీలపై జరిగే హింసకు సంబంధించిన ఫిర్యాదులు తరచుగా అందుతున్న ఈ రోజులలో, దొంగతనం కేసులు పోలీసుల దృష్టిని ఆకర్షించినంతగా ఈ కేసులు ఆకర్షించడం లేదు. బాధితుల్లో 6 శాతం కూడ రేప్ కేసు, అత్యాచారం కేసు, భార్యను చంపిన కేసుకు సంబంధించిన వారు లేరు.

శిక్షా స్మృతి వర్గీకరించిన అన్ని రకాల దొంగతనాలు, బందిపోటు చర్యలు, బలవంతపు వసూళ్ళు లాంటివన్నీ 'దొంగతనం' అనే అంశం కింద చేర్చాం. అయితే ఇందులో ప్రభుత్వ, ప్రైవేటు రంగానికి చెందిన తెల్లచొక్కాల మోసగాళ్ళు మాత్రం లేరు. అలాంటి నేరాలు జరుగుతున్న వాస్తవాన్ని ఎవరూ కాదనలేనప్పటికీ, అలాంటి మోసాలు దొంగతనాలు దోపిడీల కంటే ఎన్నో రెట్లు ఎక్కువ నష్టకరమయినప్పటికీ, కస్టడీలో మరణించిన వారిలో అలాంటివారు ఒక్కరు కూడ లేరు. (కస్టడీలో మరణించిన వారిలో చాలా తక్కువ మంది అగ్రకులాల వాళ్ళు వుండడానికి ఇదొక కారణం.) మేము 'నేరస్తులు'గా వర్గీకరించిన 32 మంది కూడ సాధారణ నేరాలకి పాల్పడిన వారే తప్ప సమాజానికి చెడు చేసేటటువంటి ఘరానా నేరస్తులు కారు.

దొంగతనం తరువాత నేరాల పట్టికలో మనకు తరచుగా కనిపించే అంశం దాడి లేక ఆస్తుల ధ్వంసం. ఈ దాడి కేసులన్నీ కూడ పొరుగువారితో వున్న ఆస్తుల తగాదా వలన లేక సామాజిక ఉద్రిక్తత వలన లేక గ్రామంలోని ఒత్తిడి వలన జరిగే సంఘటనలు. ఈ కేసులన్నీ కూడ గ్రామంలోని సామాజిక, ఆర్థిక స్వభావమున్న వివాదాలే కాని, పట్టణాలలో పెద్దఎత్తున సంఘటితంగా జరిగే ముఠా తగదాల లాంటివి కావు.

## పోలీసు సంస్కృతి

కస్టడీలో హింసకు పాల్పడే వారిపై విచారణ జరపడం, శిక్షించడం, బాధితుని కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వడంతో పాటు పోలీసు వ్యవస్థ సంస్కృతిని సంస్కరించడానికి కృషి చేయాల్సిన అవసరం కూడ వుంది. ఇంతకు ముందు భాగంలో కస్టడీలో జరిగే హింస యొక్క సామాజిక స్వభావాన్ని వివరించడం ద్వారా పోలీసుల సంస్కృతిని సంస్కరించవలసిన ఆవశ్యకతను చెప్పాము. అనుబంధంలో చేర్చిన

వివరాలు, కస్టడీలో జరిగే హింసను ఆపవలసిన అవసరాన్ని చెబుతాయి. మృతులపై ఆరోపించబడిన నేరాలు ఈ కింది విధంగా వున్నాయి.

దొంగతనం 94, స్పష్టమైన ఆరోపణ ఏదీ లేనివి 21, దాడి లేక ఆస్తుల ధ్వంసం 16, హత్యలు 13, నక్సలైట్ కార్యకలాపాలు 13, స్త్రీల పైన హింస 12, అల్లరి 7, పోలీసులపై దాడి లేక ప్రతిఘటన 6, అపహరణ 5, జూదం 5, మిగిలినవి 19. మొత్తం 211.

(i) పట్టికలో దొంగతనం ఆరోపణగా వచ్చిన కేసులు అత్యధికంగా వుండడం గమనించదగ్గది. దీని అర్థం మిగిలిన అన్ని నేరాలకన్నా దొంగతనం ఎక్కువగా జరుగుతుందని కాదు. కానీ దొంగతనం అనేది డబ్బుకు, బంగారానికి, ఆస్తికి సంబంధించిన విషయం. మన సామాజిక సంస్కృతిలో ఇంకేది నష్టపోయినా ఫరవాలేదు కానీ, ఆస్తి నష్టపోతే మాత్రం చాలా ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాం. ఇది పోలీసుల మీద ఎక్కువ ఒత్తిడిని పెట్టడమే కాక, అంతర్గతంగా ఈ సంస్కృతి మన సామాజిక స్వభావంలో నిర్మితమై వుండడం వలన పోలీసులతోసహా ప్రతి ఒక్కరి ప్రవర్తననూ నిర్దేశిస్తుంది. ఈ విషయం ప్రస్తుతం మనకు అవసరం లేదు కాని పోలీసులు వారి విచారణలో ఆస్తికి సంబంధించిన నేరాలకు ఎందుకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు అనే ప్రశ్న మాత్రం ప్రస్తుతం మనకు అవసరం. దొంగతనం కేసులను విచారించడం అనేది పోలీసులకు లాభసాటియైన వ్యవహారం. పోలీసులు తమకు చేతనైనంత హింసను ప్రయోగించగలిగినట్లైతే, ఆస్తిని పోగొట్టుకున్న వాడు, దొంగిలించిన వాడు, దొంగిలించిన ఆస్తి ఎవరి చేతిలోకైతే వెళ్ళిందో వాళ్ళు, దొంగిలించారని తప్పుగా ఆరోపించబడిన వాళ్ళు లేక దొంగిలించిన సొమ్ముని కొన్నారని తప్పుగా ఆరోపించబడిన వాళ్ళు అందరూ కూడ పోలీసులకు డబ్బు చెల్లించుకుంటారు. అందువల్లనే కస్టడీ మృతులలో ఎక్కువ మంది దొంగతనం ఆరోపణలు ఉన్న వ్యక్తులు. ఈ అంశం గురించి మేము ఎక్కువ ప్రస్తావించదలుచుకున్నాం. ఎందుకంటే కస్టడీలో జరిగే హింసకు సంబంధించిన కారణాలను చర్చించేటప్పుడు, అవినీతికి సంబంధించిన అంశాన్ని, చాలా ముఖ్య మైనప్పటికీ, తక్కువగా ప్రస్తావిస్తారు. లాకప్పులో వుంచిన ప్రజల నుంచి, దొంగతనం ఆరోపణ వున్నప్పుడే కాదు, ఏ ఆరోపణా లేకపోయినా పోలీసులు సాధారణంగా డబ్బులు గుంజుతారు. 211 కేసులలో ఇలాంటి ఉదాహరణలు చాలా వున్నప్పటికీ ఖమ్మం జిల్లా గుండాలకు చెందిన ఒక డాక్టరు మరణం చాలా లాజ్జాకరమైన సంఘటన.

డాక్టర్ ఆషాలు దగ్గర చికిత్స పొందిన ఒక రోగి మరణించగా ఆయన పోలీసుల దగ్గరకు స్వచ్ఛందంగా అరెస్టు కావడానికి వచ్చాడు. 20 వేలు డబ్బు లాగడం కోసం పోలీసులు అతనిని 11 రోజులు అక్రమ కస్టడీలో వుంచుకోవడం వలన, గుండె జబ్బు రోగి అయిన ఆషాలు, చివరికి వారి కస్టడీలోనే మరణించాడు.

దొంగతనం నేరానికి చెందిన కేసులలో డబ్బుజేసుకొనే అవకాశం పోలీసులకు ఎక్కువ వుంటుంది. ఈ అంశాన్ని తప్పించేసి కస్టడీలో జరిగే హింస గురించి చర్చించేటప్పుడు పని వత్తిడి, సిబ్బంది కొరత లాంటి సమస్యలను చర్చిస్తారు. అవి నిజమైన సమస్యలే కావచ్చు కాని అవి మాత్రమే సమస్యలు కావు. చర్చను పూర్తిగా ఈ అంశాల మీద కేంద్రీకరించడం వలన, పోలీసు సంస్కృతి మీద నుండి దృష్టి మరల్చి, సంస్థాగత లోటుపాట్ల మీద నిందను వేయడానికి వీలౌతుంది.

(ii) పోలీసుల మీద దాడి, ప్రతిఘటన ఆరోపణలతో 6 కేసులు వున్నాయి. కాకినాడకు చెందిన గడ్డం అచ్యుతరామయ్య మీద ప్రాథమికంగా దొంగతనం ఆరోపణ వున్నప్పటికీ, పోలీసులు అరెస్టు చేయడానికి వచ్చినప్పుడు, అతను వాళ్ళను ప్రతిఘటించడమే అతను తీవ్రమైన చిత్రహింసలకు గురికావడానికి కారణం. ఈ హత్యలు, భారత పోలీసులకు ఉండే సామాన్యమైన క్రూరమైన లక్షణాన్ని తెలుపుతున్నాయి. పోలీసులను ఎవరైనా ప్రతిఘటించినా లేక వారిపై దాడి చేసినా వారిని చంపడం లేక ఎంత హాని అయినా చేయడం అనేది పోలీసులుకున్న ఒక హక్కుగా పరిగణించడం జరుగుతూ వుంది. అంటే ఒక సాధారణ పౌరుడికి వ్యతిరేకంగా చేస్తే చిన్నపాటి నేరమయ్యేది కాస్తా ఒక పోలీసుకు వ్యతిరేకంగా చేస్తే క్రూరమైన నిర్బంధ హింసకు హేతువవుతుంది. ఈ వ్యక్తిగత ప్రతీకారాన్ని పోలీసులు విధి నిర్వహణ ముసుగులో కొనసాగిస్తారు. దీనికి రాజ్యం ఆమోదం ఉండడం వలన, సమాజం దానిని అర్థం చేసుకోదగ్గది గాను లేక అనివార్యమైనది గాను అంగీకరించడం వలన ఈ ముసుగును పోలీసులు యధేచ్ఛగా వాడుకొంటున్నారు. ఈ అభ్యంతరకరమైన దృక్పథం కస్టడీలో జరిగే హింసకు చాలా వరకు దోహదం చేస్తూ వుంది. ఇలాంటి ప్రతీకారాన్ని పోలీసులు తీర్చుకోవడానికి ముద్దాయి పోలీసులను భౌతికంగా ఎదిరించో లేక గాయపరిచో ఉండనక్కరలేదు. వారి అధికారాన్ని ఎదిరించిన వాళ్ళకు లేక ఎటువంటి అసౌకర్యాన్నైనా కలిగించిన వాళ్ళకు పోలీసులు ప్రతీకారపూరిత పాఠాన్ని నేర్పుతారు.

ఖమ్మంలో డేవిడ్ రాజు జైలునుండి పారిపోవడం వలన పోలీసులు తాత్కాలిక సస్పెన్షన్‌కు గురయ్యారు. పోలీసులు అతనిని తీసుకువచ్చి కొట్టడం వలన చనిపోయాడు. ఇంకో కేసులో ఒక ఎద్దు పోలీసులను కుమ్మినందువలన ఆ కోపంతో దాని యజమాని అయిన జర్బుల అమ్రును చంపారు. మరో కేసులో పొట్టి ముకుందరావు, తొట్టుక అప్పారావులు పోలీసులు అరెస్టు చేయడానికి వచ్చినప్పుడు పారిపోయారు. పోలీసులకు కోపం వచ్చింది. మరో కేసులో బలజ హనుమంతు కింది అధికారులపై పై స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసాడు. ఇంకో కేసులో తన స్నేహితుణ్ణి అనవసరంగా కస్టడీలో పెట్టారని భావించి హనుమంతోళ్ళ రాజేశ్వర్ పోలీసులతో వాదనకు దిగాడు. పోలీసులు ఇచ్చిన ఉత్తర్వుకు వ్యతిరేకంగా, తాను తెచ్చిన తిండిని పోలీసు కస్టడీలో వున్న తన బంధువులు తినేంతవరకు తాను స్టేషన్ వద్దనే వేచివుంటానని మొండికేసినందుకు మూల జాన్ కస్టడీలో మృతుడైనాడు. పోలీసులకు కోపం తెప్పించారన్న కారణంగా పైన పేర్కొన్న వారందరూ కస్టడీలో చంపబడ్డారు.

(iii) తమ వ్యక్తిగత (Private) ప్రతీకారాన్ని తీర్చుకోవడమే కాక, కొన్ని సందర్భాల్లో ఇతరుల వ్యక్తిగత ప్రతీకారాన్ని తీర్చుకోవడానికి కూడా పోలీసులు ఒక సాధనంగా వుపయోగ పడుతున్నారు. ఇది చాలా విధాలుగా జరుగుతుంది.

ఒక దొంగగా భావించిన వాణ్ణిగానీ, నేరస్తుణ్ణిగానీ స్థానికులు లేదా అతని బాధితులు పట్టుకొంటారు. అతన్ని వాళ్ళు స్వల్ప అనుమానం మీదనో లేక ఏ సాక్ష్యము లేకపోయినా కూడ కోపంతో బాగా కొట్టి ఆ తరువాత పోలీసులకు అప్పగిస్తారు. అనుమానితుడిని గాయపరిచిన వ్యక్తులపై పోలీసులు నిజానికి కేసుపెట్టాలి. కానీ వాళ్ళ మీద ఏ కేసు పెట్టకుండా వదలి వేయడం ద్వారా పోలీసులు వ్యక్తిగత ప్రతీకారానికి సాధికారతను చేకూరుస్తున్నారు. ఆ తరువాత గాయపడ్డ ఆ అనుమానితునికి ఎలాంటి వైద్యసహాయం ఇవ్వకపోగా సాధారణంగా తాము కూడా కొడ్తారు. ఒక ధనవంతుడి తోట నుండి అరటిపళ్ళను దొంగిలించినందుకు కడుగుల శంకరయ్య అనే 16 సంవత్సరాల దళిత పిల్లవాడు కస్టడీలో మరణించడం దీనికి ఉదాహరణ. ఇలాంటి కేసులు ఇంకా చాలా వున్నాయి.

ఒక ఉన్నతాధికారి తన కింద పనిచేసే అవిధేయుడైన వ్యక్తిని పోలీసుల చేత చిత్రహింసలు పెట్టిస్తాడు. మొత్తం 211 కేసులలో ఇలాంటి కేసులు మూడు వున్నాయి.

లేకపోతే వేధింపులకు గురైన భార్యలు, తల్లిదండ్రులు, తమకు ఇబ్బంది కలిగించే భర్తకో లేక కొడుకుకో గుణపాఠం నేర్పమని (లాకప్పులో వుంచడం ద్వారా, లాఠీతో కొట్టడం ద్వారా) అభ్యర్థించిన కేసులు ఉన్నాయి. అలాంటి అభ్యర్థన సామాజికంగా దానికదే నష్టకరం కాకపోవచ్చు. ఇది సమాజంలో నాగరికమైన సంస్కరణ పద్ధతులు లేకపోవడాన్ని ప్రతిఫలిస్తుంది. కాని పోలీసులు అలా చట్ట విరుద్ధంగా బలప్రయోగాన్ని వుపయోగించి పాఠాలు చెప్పడం మొదలుపెడితే దాని వలన చాలా తీవ్రమైన పరిణామాలు వుంటాయి.

ఎటువంటి నేరారోపణ లేనటువంటి వారికి ప్రైవేటు వ్యక్తుల తరపున పోలీసులు 'పాఠాలు నేర్పడం' లాంటి సంఘటనలే కాకుండా, పోలీసులకు లంచాలిచ్చి, తమకు హాని చేసారని అనుమానించిన వాళ్ళను కొట్టమని పరోక్షంగా ప్రతీకారం తీర్చుకునే సంఘటనలూ ఉన్నాయి. ఇది కూడా కస్టడీలో జరిగే హింసకు ఒక ముఖ్యమైన కారణం. పోలీసులకు కొంత డబ్బు ఇచ్చి అనుమానితుణ్ణి కొంత ఎక్కువకాలం అక్రమ నిర్బంధంలో ఉండేటట్లు చేయడం, అతనిపై ఇంకాస్త బలప్రయోగం ఉపయోగించేటట్లు చూడడం అనేది డబ్బు ఖర్చు పెట్టగలిగిన వాళ్ళకు (ధనవంతులు మాత్రమే అని అనుకోనక్కరలేదు) ఒక అలవాటుగా తయారయ్యింది.

(iv) ఇతరుల తరఫున చట్టవిరుద్ధంగా బలాన్ని ప్రయోగించి 'గుణపాఠాలు నేర్పడం' అనేదానిని పోలీసులు ఒక సాధారణ అలవాటుగా మార్చుకున్నారు. ఇది కేవలం పోలీసుగా కాకుండా న్యాయమూర్తిగా, న్యాయాన్ని అమలుపరిచేవాడుగా ప్రవర్తించే అలవాటు. రాజకీయ వ్యవస్థ ఈ దృక్పథాన్ని పెంపొందించింది. పరోక్షంగా ఆమోదించింది. ప్రోత్సహించింది కూడ. నాగరిక ఆలోచనా విధానం శిక్షాస్మృతిని ఎంతగానైనా అభివృద్ధి చేసివుండవచ్చు కాని, భారతదేశంలో మాత్రం నేరపరిశోధన, విచారణ, శిక్ష అన్నీ కూడ జరిగేది లాకప్పులోనే. తరచూ, మూడూ ఒకేసారి జరుగుతాయి. లేక వ్యతిరేక దిశలో కూడ జరుగుతాయి. పరిశోధన కన్నా ముందే శిక్ష ప్రారంభమౌతుంది. శిక్షను అమలు చేసే క్రమంలో పరిశోధన పూర్తవుతుంది, ఆ తరువాత తీర్పు వెలువడుతుంది. నిందితుడు నిర్దోషి అనే తీర్పు కూడ వచ్చే అవకాశం వుంటుంది. శిక్షించడం అనేది సంస్కరణయుతంగా కాక, ప్రతీకారాత్మకంగా వుంటుంది.

న్యాయపరమైన శిక్ష కాక ప్రతీకారయుతమైన శిక్ష ప్రాణాల్ని తన యిష్టం వచ్చినట్లు హరిస్తుంది. మిగిలినవి అనే అంశంలో వున్న 19 మందిలో ముగ్గురు నెలల వయస్సున్న పిల్లలు. తల్లుల చేతిలో వున్న పిల్లలను పట్టించుకోకుండా పోలీసులు తల్లులను తన్నడం, కొట్టడం వలన ఆ దెబ్బలు పిల్లలకు తగిలి మరణించారు. ఇద్దరు పిల్లలు ఈ విధంగా చనిపోగా మూడవ చంటిపాప తల్లితో పాటు అక్రమ నిర్బంధంలో చాలా కాలం వుండడం వలన పోలీసు కస్టడీలో అంటువ్యాధి సోకి అనారోగ్యంతో మరణించింది.

అనుమానితులను హింసించిన విధానంలో కూడ క్రూరత్వం స్పష్టంగా కనిపిస్తుంది. ప్రకాశం జిల్లా చీరాలలో జూలై 6, 1995 న దొంగతనం కేసులో ఆరెస్టు అయిన అంగారపు మురళీకృష్ణ మూడుగంటలలోపు మరణించాడు. అతని శరీరం మీద 14 గాయాలు వున్నాయి. సంచలనం సృష్టించిన కేరళకు చెందిన నౌకాదళ ఉద్యోగి మురళీధరన్ ఒక్క రాత్రి లాకప్పులో అనేక గాయాలతో మరణించాడు. విశాఖపట్నంలోని గోపాలపట్నం పోలీసు లాకప్పులో చనిపోయిన బుడితబోయిన చిన్నారావు ఒంటిపైన సిగరెట్టుతో కాల్చిన అనేక గాయాలు వున్నాయి. మహబూబ్ నగర్ జిల్లా కోహ్లికి చెందిన కోర నారాయణకు ఎలక్ట్రిక్ షాక్‌లు ఇవ్వబడ్డాయి. కామారెడ్డికి చెందిన ఇందుర్తి అమరేందర్ రెడ్డి అనే యువకున్ని 'పామును కొట్టినట్టు' కొట్టి చంపారు. కామారెడ్డికే చెందిన కిషన్ అనే యువకుడ్ని పెద్ద బండరాళ్ళతో మోది చంపారు పోలీసులు. కరీంనగర్ భీమదేవరపల్లికి చెందిన సరోజిని అనే మహిళను కూడ బండరాళ్ళతో కొట్టి ఎముకలు విరిచి చంపారు. నరసరావుపేటకు చెందిన మస్తాన్ వలి అనే 16 సం.ల కుర్రాణ్ణి నలుగురు పోలీసులు బూటు కాళ్ళకింద తొక్కి చంపారు. అదిలాబాద్ జిల్లా నస్పూర్‌లో మల్యాల చంద్రారెడ్డిని మణికట్టు ఎముకలు, మోకాళ్ళ ఎముకలు విరగ్గొట్టి చంపారు. విజయవాడ మూడవటౌన్ పోలీసు స్టేషన్‌లో చంపబడ్డ 13 సంవత్సరాల సింహాచలం అనే కుర్రాడి గోళ్ళ చిగుర్లలో గుండు సూదులను గుచ్చారు పోలీసులు. చీరాలకు చెందిన కుక్కల రామిరెడ్డి మూడు గంటల నిర్బంధంలో 16 గాయాలకు లోనై మరణించాడు.

తుపాకి మొనలతో, లావుపాటి కర్రలతో సున్నితమైన శరీర భాగాలపై కొట్టడమే కాకుండా ఇతర పద్ధతులను కూడ పోలీసులు వుపయోగిస్తారు. వేలి గోళ్ళ కింద

గుండు సూదులను పొడవడం, చాలాసేపు తలకిందులుగా వేలాడగట్టి, తుపాకీ మొనలతో బాదడం, బోర్లపడుకున్న శరీరంపై పెద్ద పెద్ద బూటు కాళ్ళతో తొక్కడం, శరీరాన్ని బలవంతంగా ఉండ చుట్టడం ఆ తరువాత కొట్టడం, మోకాళ్ళ కింది రోకలి బండలు వుంచి, వంచిన కాళ్ళమీద ఎక్కి తొక్కడం, కొట్టడం, కాళ్ళను వేరువేరుగా రెండువైపుల లాగి, గజ్జలలో రక్తం కారేటట్లు చేయడం, మూతలేని ఖాళీసీసాపై వ్యక్తిని కూర్చోపెట్టి, సీసామూతి గుదం లోపలికి వెళ్ళేంతవరకు అతన్ని గట్టిగా నొక్కడం, కణతలకు, చెవులకు, పురుషాంగానికి విద్యుత్‌ఘాతం ఇవ్వడం, మోకాలి వెనక భాగంలో వున్న కండను, పాదాలను కోసి కారం చల్లడం, ఇద్దరు పురుషులను సెక్సులో పాల్గొనమని బలవంతం చేయడం, కస్టడీలో వున్న స్త్రీలను లైంగిక అత్యాచారానికి గురిచేయడం మొదలైన చిత్రహింసల పద్ధతులు పోలీసులు పాటిస్తున్నారు. ఇవన్నీ మా ఊహలనుండి చెబుతున్నవి కావు. ఇవే కాక, ఇలాంటి అనేక చిత్రహింసా పద్ధతులను ఆంధ్రప్రదేశ్‌లోని పోలీసు స్టేషన్లలో ఒక రొటీన్‌గా ఉపయోగిస్తున్నారు.

## అభ్యర్థనలు

ఈ ఫిర్యాదు మొదట్లోనే గౌరవనీయులైన మానవహక్కుల కమిషన్ చేపట్టవలసిన కొన్ని సాధారణ లక్ష్యాలను గురించి చెప్పాం. నిర్దిష్టంగా –

- ఈ ఫిర్యాదు పరిధిలోకి వచ్చే 1994–95 సంవత్సరంలో జరిగిన 24 లాకప్పు మరణాలపై సమగ్రమైన విచారణ జరిపించాలని కోరుతున్నాం.
- చనిపోయిన 24 మంది బంధువులకు, విచారణ రిపోర్టు కోసం ఎదురు చూడకుండా, ఒక లక్ష రూపాయలకు తక్కువ కాకుండా నష్టపరిహారాన్ని చెల్లించమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించమని కోరుతున్నాం.
- అన్ని జిల్లాల సెషన్సు కోర్టులను మానవహక్కుల కోర్టులుగా ప్రకటించాలని, ఆ కోర్టులు సమర్థవంతంగా పనిచేయటానికి కావలసిన అన్ని సదుపాయాలను ఏర్పాటు చేయమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతున్నాం.

స్వేచ్ఛ మాసపత్రిక
*16 ఆగస్ట్ 1995*

# చెత్తబుట్టకు చేరాల్సిన నివేదిక

**తె**లంగాణ జిల్లాలలో నక్సలైట్ల చర్యల వల్ల, వాటిని అదుపు చేయడానికి పోలీసులు ఉపయోగిస్తున్న పద్ధతుల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించమని రాష్ట్ర హైకోర్టు ఏప్రిల్ నెలలో ఒక న్యాయవాదుల కమిటీని నియమించింది. నక్సలైట్ల వల్ల హింసకూ, నష్టానికీ గురయిన బాధితులు కొందరు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సమర్పించిన అర్జీని ఆయన రిట్ పిటిషన్‌గా స్వీకరించి (నెం. 6829/ 97) ఆ విచారణలో భాగంగా ఆ కమిటీని నియమించారు.

ఇరువైపులా జరుగుతున్న హింస వల్ల ప్రాణానికీ ఆస్తులకూ జరుగుతున్న నష్టం ఏ రూపాలలో వుంది, ఎంత వుంది? ప్రాణానికీ ఆస్తికీ ఇప్పుడున్న భద్రత సరిపోతుందా? సరిపోకపోతే మరింత భద్రత కల్పించడానికి ఎటువంటి చర్యలు తీసుకోవాలి? చట్ట వ్యవస్థ, దానిని అమలుచేసే యంత్రాంగాలు సమర్థంగా పనిచేస్తున్నాయా? ఏవైనా ఇబ్బందులు, అవరోధాలు వున్నాయా? వుంటే వాటిని ఏ విధంగా అధిగమించాలి? నక్సలైట్ల చేతిలోనైనా, పోలీసుల చేతిలోనైనా హింసకు గురయిన వారి కోసం పునరావాస చర్యలేవయినా వున్నాయా? అవి సరిపోతాయా? సరిపోకపోతే ఇంకా ఏమి చేయవచ్చు?

న్యాయవాదుల కమిటీ ఈ ప్రశ్నలకు జవాబులు అన్వేషించి నివేదిక ఇవ్వాలని హైకోర్టు కోరింది.

ఈ ప్రశ్నలతో ఆగిపోవలసిన అవసరమేమీ లేదు. హైకోర్టు ఇంకొన్ని ప్రశ్నలు కూడ అడిగి వుండవచ్చు. నక్సలైట్ల వల్ల పేద ప్రజలు పొందిన ప్రయోజనం ఏమిటి?

నక్సలైట్లు అవసరం లేకుండ అదే ప్రయోజనం కల్గించడానికి ప్రభుత్వం ఏమి చేయగలదు? అని అడిగి వుండవచ్చు. నక్సలైట్ల వల్ల పేద ప్రజలకు జరిగిన మేలును నష్టపరచడానికి ప్రభుత్వం, పోలీసులు ఉపయోగిస్తున్న పద్ధతులేమిటి? అవి చట్ట సమ్మతమేనా? అని కూడ అడిగి వుండవచ్చును. ఇంకా చాలా అడిగి వుండవచ్చును. కాని హైకోర్టు తన విజ్ఞతతో (in its wisdom అని ఇంగ్లీష్‌లో అంటారు) పై ప్రశ్నలు మాత్రమే అడిగింది. ఇవి సమగ్రమైన ప్రశ్నలు కాకపోయినా పూర్తిగా ఏకపక్షమైన ప్రశ్నలు కూడ కావు. న్యాయవాదుల కమిటీ వీటికి నిష్పాక్షికమైన జవాబులు వెతికే ప్రయత్నం చేసి ఉంటే కొంత మేలు ఏమయినా జరిగి ఉండేదేమో.

కానీ న్యాయవాదుల కమిటీ ఈ ప్రశ్నల కంటే ఏకపక్షమైన జవాబులతో జూన్ 25న తన నివేదిక సమర్పించింది. కమిటీ అధ్యక్షులు ప్రతాపరెడ్డి గారికీ, కమిటీ సభ్యులు చాలామందికి నక్సలైట్ రాజకీయాల పట్ల ఏనాడూ సదభిప్రాయం లేదన్నది తెలిసిన సంగతే. అది వారి ఇష్టానికి సంబంధించిన విషయం. అయితే హైకోర్టు న్యాయం చేయడం కోసం వాళ్లనొక కమిటీగా వేసినప్పుడు తమ ఇష్టాయిష్టాలను కొంతసేపు పక్కన పెట్టి వీలయినంత నిష్పాక్షికంగా వ్యవహరించాలని ఆశించడంలో తప్పేమీ లేదు.

ఏప్రిల్ 12 నుండి జూన్ 6 దాకా న్యాయవాదుల కమిటీ హైదరాబాద్‌లోనూ తెలంగాణలోని పలు పట్టణాలలోనూ సమావేశాలు నిర్వహించింది. అనేక సంఘాలను పార్టీలను, సంస్థలను తమ అభిప్రాయం తెలుపమని ఆహ్వానించింది. తమంతట తాము వచ్చిన ప్రజల వాంగ్మూలాలు కూడ నమోదు చేసింది.

మొదట హైదరాబాద్‌లో రెండు రోజులపాటు నిర్వహించిన సమావేశంలో 82 మంది వాంగ్మూలాలు రికార్డు చేసింది. సిద్ధిపేటలో 116, వరంగల్‌లో 168, కరీంనగర్‌లో 158, జగిత్యాలలో 58, ఆదిలాబాద్‌లో 59, ఉట్నూరులో 15, నల్గొండలో 11, కొత్తగూడెంలో 61, నాగర్ కర్నూలులో 34 వాంగ్మూలాలు నమోదు చేసింది.

న్యాయవాదుల కమిటీ ముందుకు చాలామంది ప్రజలు వచ్చినట్టే ఈ గణాంకాలను బట్టి అనిపిస్తుంది. అది నిజమే కాని వీరిలో దాదాపు 95 శాతం నక్సలైట్ల వల్ల నష్టపోయినవారే. పోలీసుల వల్ల నష్టపోయిన వారు కూడ కమిటీ

ముందుకు రావచ్చునని కమిటీ చైర్మన్ శ్రీ ప్రతాపరెడ్డి పదే పదే పత్రికాముఖంగా ప్రకటించినప్పటికీ అతికొద్ది మంది మాత్రమే వచ్చారు. వచ్చిన నక్సలైట్ బాధితులు కూడ ఎక్కువ భాగం పోలీసులు తీసుకురాగా వచ్చిన వారేనని పత్రికలు రాసాయి. ఆ విషయంపైన మీ అభిప్రాయం ఏమిటని ప్రతాపరెడ్డి గారిని విలేఖరులు అడిగితే, ఎవరు తీసుకువచ్చారనేది ముఖ్యం కాదని, వచ్చిన వారి వాంగ్మూలం ప్రస్తుత విచారణకు ఉపకరిస్తుందా లేదా అనేదే తమకు కావాలని ఆయన అన్నారు. బాగానే ఉంది. కానీ పోలీసులు వాళ్లను స్వంత ఖర్చు మీద తీసుకు రాలేదు. ప్రభుత్వం ఖర్చు మీద తీసుకొచ్చారు. ఒకవేళ వారు బస్సులో టిక్కెట్లు కొనుక్కొని వచ్చినా వారిని సమీకరించడానికి పోలీసులు చేసిన కృషి ప్రభుత్వ పరంగా జరిగిన కృషే. హైకోర్టు నియమించిన న్యాయవాదుల కమిటీ సమక్షానికి సాక్షులను తరలించే బాధ్యత ప్రభుత్వం తన మీద వేసుకుంటే అభ్యంతరమేమీ లేదు. కానీ ప్రభుత్వం అందరిదీ అయితే కేవలం నక్సలైట్ బాధితులకే కాక పోలీసు బాధితులకు కూడ ఆ రకమైన సహాయం ఏర్పాటు చేయవలసి ఉండింది. వాళ్లను సమీకరించడానికి కూడ అదే విధంగా కృషి చేయవలసి ఉండింది. వాళ్లు కూడ పౌరులే కదా? ప్రభుత్వ సహాయానికి అర్హులే కదా? ప్రభుత్వం ఒక వర్గానికి మాత్రమే సహాయం అందించడం అభ్యంతరం కాదా? ప్రతాపరెడ్డి గారికీ వారి తోటి కమిటీ సభ్యులకూ ఎందుకో అట్లా అనిపించలేదు.

పోలీసుల చర్యల వల్ల నష్టానికి గురయిన వారు ఈ కమిటీ ఎదుటికి పెద్ద సంఖ్యలో రాకపోవడానికి గల ముఖ్య కారణం ఈ కమిటీ సమావేశాలన్నీ పోలీసుల పహారా మధ్య జరగడం. మఫ్టీలో, డ్రెస్సులో, తుపాకులతో, తుపాకులు లేకుండా డజన్ల సంఖ్యలో ప్రతీ సమావేశ స్థలం దగ్గరా పోలీసులు ఉన్నారు.

విచారణ ఏకపక్షంగా సాగుతోందని న్యాయవాదుల కమిటీ గమనించకపోలేదు. దాని గురించి విలేఖరులతో వారు మాట్లాడుతూ, 'పౌరహక్కుల సంఘానికి తాము తెలియజేసినప్పటికీ వారు పోలీసు బాధితులను తీసుకురాలేదు' అన్నారు. అక్కడికి నక్సలైట్ బాధితులను తరలించడం ప్రభుత్వం వంతు, పోలీసు బాధితులను తరలించడం పౌరహక్కుల సంఘం వంతు అయినట్టు! ప్రభుత్వంతో పోటీపడగల మందీ మార్బలం పౌరహక్కుల సంఘానికి లేవు. ఒకవేళ పోటీకి దిగినా ప్రభుత్వం ప్రజల సొమ్ము వెచ్చించి వందమందిని తీసుకొచ్చిన కాడ పౌరహక్కుల సంఘం అయిదు

మందిని కూడ తీసుకురాలేదు. అయినా 1994లో ఒకసారి ఆ ప్రయత్నమూ చేసాం. అప్పుడు జాతీయ మానవ హక్కుల కమిషన్ ఇవే తెలంగాణ పట్టణాలలో ఇదే రకంగా పోలీసుల పహారాలో కూర్చుని 'అందరి కష్టాలూ వింటాం రండి!' అని ఆహ్వానించినప్పుడు పౌరహక్కుల సంఘం కొద్దిమంది ఎన్‌కౌంటర్ మృతుల కుటుంబాలను తీసుకుపోయే ప్రయత్నం చేసింది. అప్పుడు పోలీసులు పోగుచేసిన రౌడీలు కొందరు కమిషన్ సమక్షంలోనే కరీంనగర్‌లో, వరంగల్‌లో, నల్గొండలో పౌరహక్కుల సంఘం బాధ్యులపైన దాడి చేసి అల్లరి పెట్టారు.

'పౌరహక్కుల సంఘం సహకరించడం లేదు' అన్న ప్రతాపరెడ్డి గారి ఫిర్యాదుకు జవాబుగా పై విషయాలను వివరిస్తూ పౌరహక్కుల సంఘం కరీంనగర్‌లో, మంచిర్యాలలో, వరంగల్‌లో, మహబూబ్‌నగర్‌లో పత్రికా ప్రకటనలు ఇచ్చింది. ఇదే విషయాన్ని న్యాయవాదుల కమిటీ ఛైర్మన్ ప్రతాపరెడ్డికి ఒక లేఖ ద్వారా కూడ తెలియజేసాము. వారు పోలీసు ఎస్కార్ట్ లేకుండ తెలంగాణ గ్రామాలకు పోతే పోలీసు బాధితుల వాంగ్మూలాలు పుష్కలంగా సేకరించవచ్చునని చెప్పాము. ఏ గ్రామాలకు పోవాలో సూచించడం కోసం 1996 నవంబర్ 7వ తేదీ నుండి 1997 ఏప్రిల్ దాకా రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్ల జాబితా మొత్తం ఇచ్చాము. పోలీసు కథనంతో పాటు పౌరహక్కుల సంఘం నిజనిర్ధారణ కమిటీలు సేకరించిన వాస్తవాలు కూడ ఇచ్చాము. ఆ గ్రామాలకు పోయి కేవలం ఎన్‌కౌంటర్ల గురించే కాక ఇతర రూపాల పోలీసు నిర్బంధాన్ని గురించి కూడ వాకబు చేస్తే కావలసినంత సమాచారం దొరుకుతుందని చెప్పాము.

న్యాయవాదుల కమిటీ ఆ పని చేయకపోగా మేము ఇచ్చిన ఎన్‌కౌంటర్ల సమాచారాన్ని తమ అబద్ధపు వ్యాఖ్యానాలకు అనుకూలంగా వాడుకుంది. ఈ కమిటీ నివేదికతో పౌరహక్కుల సంఘానికి ఎన్ని అభిప్రాయ భేదాలున్నా వారి అభిప్రాయం వారిదని వూరుకోవచ్చు. కానీ అబద్ధాలు చెప్పే హక్కు, అబద్ధపు పద్ధతులు అనుసరించే హక్కు ఎవరికీ లేదు.

మేము ఇచ్చిన ఎన్‌కౌంటర్ల జాబితా 1996 నవంబర్ 7 తరువాత జరిగిన ఘటనలకు సంబంధించినది. ఆ తేదీని ఎంపిక చేసుకోవడానికి ఒక కారణం ఉండింది. ఆ కారణాన్ని ప్రతాపరెడ్డి గారికి వివరించడం కూడ జరిగింది. జాతీయ

మానవ హక్కుల కమిషన్ ఆంధ్రప్రదేశ్ ఎన్‌కౌంటర్లపైన జరిపిన విచారణకు సంబంధించిన నివేదికను 1996 నవంబర్ 6న ప్రకటించింది. ప్రతీ ఎన్‌కౌంటర్‌పైనా క్రిమినల్ కేసు పెట్టాలని, స్థానిక పోలీసులు కాక వేరే ఏదయినా (సి.ఐ.డి లేక సి.బి.ఐ వంటి) నేర పరిశోధక సంస్థ చేత పరిశోధన జరిపించాలని, ఆ ఎన్‌కౌంటర్ ఘటన నిజంగానే ఆత్మరక్షణలో జరిగిందా లేదా అనేది కోర్టులో తేలాలని జాతీయ మానవహక్కుల కమిషన్ తన నివేదికలో పేర్కొంది. ఈ నివేదికను ఆమోదించినట్టు మన రాష్ట్ర ప్రభుత్వం జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు లిఖిత పూర్వకంగా తెలియజేసింది.

అయితే 1996 నవంబర్ 6 తరువాత జరిగిన ఏ ఒక్క ఎన్‌కౌంటర్ విషయంలోనూ జాతీయ మానవ హక్కుల కమిషన్ సూచనలను మన రాష్ట్ర ప్రభుత్వం పాటించలేదు. అందువల్ల ఆ తరువాత జరిగిన ఎన్‌కౌంటర్ల జాబితాను మాత్రమే మేము ఈ హైకోర్టు న్యాయవాదుల కమిటీకి ఇచ్చి, పై విషయాన్ని హైకోర్టు దృష్టికి తీసుకు రమ్మనడం జరిగింది.

పోలీసు అత్యాచారాల గురించి సమాచారం సేకరించాలంటే న్యాయవాదుల కమిటీ పోలీసు బందోబస్తు లేకుండ గ్రామాలకు పోవాలని మేము సూచించినట్లు ఇదివరకే చెప్పాము. ఏ గ్రామాలకు పోవాలో చెప్పడం కోసం ఇటీవల జరిగిన 'ఎన్‌కౌంటర్' ఘటనల వివరాలు ఇవ్వడం ఉచితంగా ఉంటుందని భావించాము. అయితే ఈ సంవత్సరం జనవరి నుండి జరిగిన ఘటనల వివరాలు ఇచ్చే బదులు గత నవంబర్ 7ను విభజన రేఖగా తీసుకుంటే పైన వివరించిన ప్రయోజనం కూడ సమకూరుతుందని భావించి ఆ విధంగా ఇవ్వడం జరిగింది.

ఈ సమాచారాన్ని న్యాయవాదుల కమిటీ ఉద్దేశ్యపూర్వకంగానే ఒక తప్పుడు ప్రయోజనం కోసం ఉపయోగించుకుంది. పోలీసులు న్యాయవాదుల కమిటీకి గడచిన అనేక సంవత్సరాలలో నక్సలైట్లు చేసిన హత్యల వివరాలు ఇచ్చారు. ఈ సంఖ్యకూ 1996 నవంబర్ 7 తరువాత జరిగిన ఎన్‌కౌంటర్ల సంఖ్యకూ పోలికే లేదు. కాల వ్యవధి ఏమిటన్నది చెప్పకుండ ప్రతాపరెడ్డి గారు ఆ సంఖ్యనూ ఈ సంఖ్యనూ పక్కపక్కన పెట్టి ఎన్‌కౌంటర్ల సంఖ్య కంటే నక్సలైట్లు చేసిన హత్యల సంఖ్య ఎన్నోరెట్లు ఎక్కువ ఉందన్న అభిప్రాయం కలిగించారు. ఇది కోర్టును తప్పుదోవ పట్టించడం కోసం

కావాలని చేసిన తప్పుడు పని. నక్సలైట్లు చేసిన హత్యలు ఎన్‌కౌంటర్ల కంటే ఎక్కువ ఉన్నాయా లేక తక్కువ వున్నాయా అనేది ఇక్కడ అప్రసుత్తం. నక్సలెట్లు పదివేల హత్యలు చేసినా పోలీసులు పదివేల హత్య కేసులు నమోదు చేయాలే తప్ప ఒక్క ఎన్‌కౌంటర్ కూడ చేయడానికి వీలు లేదనేది కూడ యిక్కడ అప్రసుత్తం. జరిగింది జరిగినట్టు కోర్టు దృష్టికి తీసుకురావడం ఈ న్యాయవాదుల కమిటీ కర్తవ్యం. రెండు సంఖ్యలనూ పోల్చడానికి పౌరహక్కుల సంఘం ఇచ్చిన సమాచారం సరిపోనట్లయితే పూర్తి సమాచారం ఇమ్మని పౌరహక్కుల సంఘాన్ని అడగవచ్చు. లేదా ప్రతి ఎన్‌కౌంటర్ గురించి ఒక ఎఫ్.ఐ.ఆర్ పోలీసు స్టేషన్లో నమోదు అయి ఉంటుంది కాబట్టి ఎన్ని ఎన్‌కౌంటర్లు జరిగాయో, ఎంతమంది చనిపోయారో చెప్పమని పోలీసులనే అడిగి ఉండవచ్చు. ఇదేదీ చేయకుండ భిన్నమైన కాలవ్యవధులకు చెందిన సమాచారాన్ని ఒక చోట చేర్చి పక్కపక్కన నిలబెట్టి కోర్టుకు తప్పుడు అభిప్రాయం కలిగించాలని చూడడం క్షంతవ్యం కాదు. ఉదాహరణకు నివేదికలోని ఈ క్రింది వాక్యాన్ని చదివితే ఎంత తప్పుడు అభిప్రాయం కలుగుతుందో అర్థం అవుతుంది.

"ఈ ప్రాంతంలో (ఆదిలాబాద్ జిల్లా) తీవ్రవాదులు 103 మందిని చంపి ఉండగా, పౌరహక్కుల సంఘం స్టేట్‌మెంట్ ప్రకారం ఎన్‌కౌంటర్లలో పోలీసుల చేతిలో చనిపోయిన వారి సంఖ్య 7 అని దయ ఉంచి గమనించాలి" (నివేదిక, పేజీ 29). పోలీసులిచ్చిన సమాచారం ఆరున్నర సంవత్సరాలకు సంబంధించినది కాగా, పౌరహక్కుల సంఘం ఇచ్చిన సమాచారం కేవలం అయిదు నెలలకు సంబంధించినది అని ప్రతాపరెడ్డి గారు కోర్టుకు వివరించరు. ఇది నిజాయితీ పరులు చేసే పనేనా?

## సలహాలు, సూచనలు:

న్యాయవాదుల కమిటీకి నక్సలైట్ బాధితులు అనేకులు తమ అర్జీలు ఇచ్చుకోవడమే కాక, పోలీసు అధికారులు కూడ నక్సలైట్ల హింసాత్మక చర్యల గురించి సమగ్రమైన సమాచారం ఇచ్చారు. 1968 నుండి 1997 జూన్ దాకా నక్సలైట్లు 2046 మందిని చంపారనీ, దాదాపు 95 కోట్ల రూపాయల ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులు ధ్వంసం చేసారనీ, మొత్తం 12 వేల చిల్లర హింసాత్మక ఘటనలకు పాల్పడ్డారనీ పోలీసుల సమాచారం. ఇదికాక వివిధ రాజకీయ పార్టీలు తమ కార్యకర్తలు నక్సలైట్ల నుండి ఎదుర్కొంటున్న ఇబ్బందులనూ, దాడులనూ న్యాయవాదుల కమిటీకి

వివరించాయి. అందరి కంటే ఆశ్చర్యకరంగా ఒక పౌరహక్కుల సంఘం (పి.యు.సి.ఎల్) ప్రతినిధి అయిన ఎం.వి.రాంమూర్తి గారు 'ప్రజాస్వామ్య వ్యవస్థకు వెలుపల ఉన్న సంస్థలు తమకు పౌర, ప్రజాస్వామ్య హక్కులు ఉన్నాయనడం విడ్డూరంగా లేక వింతగా ఉంది' అని కమిటీ ముందు చెప్పారు. ఈ మహానుభావుడొక న్యాయవాది కూడ. ఈ 'వింత లేక విడ్డూరం' రాజ్యాంగంలోనే ఉంది. రాజ్యాంగ పరిషత్‌లో (అదృష్టం కొద్దీ) ఎం.వి. రాంమూర్తి వంటి వారు లేరు. రాజ్యాంగం పౌర, ప్రజాస్వామ్య హక్కులను పౌరులందరికీ కల్పించింది. చట్టాలు అంతకంటే భిన్నంగా ఉండడానికి వీలు లేదని ఒక ప్రాథమిక హక్కైన ఆర్టికల్ 14 అంటుంది. రాజ్యాంగం పరిధిలో బ్రతికేవాళ్లకు మాత్రమే రాజ్యాంగం వర్తిస్తుందని రాజ్యాంగంలో ఎక్కడా అనలేదు. భారత రాజ్యాంగంలో వేరే ఏ లోపాలున్నా ఈ లోపం మాత్రం లేదు. రాంమూర్తి గారి ఆలోచనలలోనే ఈ లోపం ఉంది కాబట్టి వారు 'నక్సలైట్లు', ఇతర సాయుధ ముఠాలు పౌర ప్రజాస్వామ్య హక్కులు కోరడానికి వీలులేదు అనీ, 'నక్సలైట్లను రాజ్యానికి శత్రువులుగా ప్రకటించాలి' అనీ, 'నక్సలైటు ఖైదీలను యుద్ధ ఖైదీలుగా చూడాలి' అనీ సలహా ఇచ్చారు.

రాజకీయ నాయకుల నుండి, పోలీసుల నుండి, ఎం.వి.రాంమూర్తి వంటి పౌరహక్కుల నాయకుడి నుండి ఇటువంటి సలహాలూ సూచనలూ స్వీకరించిన న్యాయవాదుల కమిటీ తన వంతుగా ప్రభుత్వానికి అనేక సూచనలు ఇచ్చింది. వాటిలో ప్రత్యక్షంగా పౌరహక్కులకు సంబంధించిన వాటిని చూద్దాం. మిగిలిన వాటి గురించి ఈ దిగువ క్లుప్తంగా చెప్పుకుందాం.

టాడా వంటి చట్టాలను తిరిగి ప్రవేశపెట్టాలనీ, నక్సలైట్ ఖైదీల విచారణలో 'సమ్మరీ' ప్రొసీజర్ ప్రవేశపెట్టాలనీ, భారత శిక్షాస్మృతి (ఐ.పి.సి) లో, నేర విచారణ స్మృతి (సి.ఆర్.పి.సి) లో, భారత సాక్ష్యాధారాల చట్టం (ఎవిడెన్స్ చట్టం) లో అవసరమైన (అంటే ఏమిటో) సవరణలు చేపట్టాలని ప్రతాప్ రెడ్డి కమిటీ సలహా. ఒక్క మాటలో చెప్పాలంటే నక్సలైట్ ఖైదీలకు సహజ న్యాయసూత్రాలు కానీ, నిష్పాక్షికమైన నేర విచారణ కానీ వర్తించకూడదు. నేరం రుజువు అయ్యేంతవరకు నిర్దోషిగా భావించాలి అనే ప్రాథమికమైన న్యాయసూత్రం కూడ వర్తించకూడదు. నేరం సంపూర్ణంగా రుజువయిందా లేదా అనేది ముఖ్యం కాదు. నిర్దోషిని శిక్షించినా పర్వాలేదు. ఎక్కువ మందిని చకచకా శిక్షించి జైళ్ళలో పెట్టాలి. అదీ ముఖ్యం.

ఇంత నిర్దాక్షిణ్యంగా ఎందుకుండాలంటే నక్సలైట్లు ఒక 'జాతీయ విపత్తు' కాబట్టి. తెలంగాణలోని మారుమూల ప్రాంతాలలో నివసించే పేద ప్రజలకు వాళ్ల నుండి ప్రమాదం ఉంది. అంతేకాదు దేశ సమగ్రతకు, ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి కూడ వారి వల్ల ముప్పు ఉంది కాబట్టి.

ఇవి అదుపు తప్పిన వ్యాఖ్యలని గుర్తించడానికి మనం నక్సలైట్ల సానుభూతిపరులు కానవసరం లేదు. సాయుధ పోరాట రాజకీయాలను సమర్థించే వాళ్లము కూడ కానవసరం లేదు. నక్సలైట్ల వల్ల ప్రాణభయం ఉన్నవాళ్లు చాలామంది ఉన్న మాట వాస్తవమే. అందులో ధనవంతులే కాక పేదలు కూడ ఉన్న మాట వాస్తవమే. వీళ్ల ప్రాణాలకు ప్రభుత్వం భద్రత కల్పించాలనడం నిరాక్షేపణీయమైన సూచన. కానీ ఇవి మాత్రమే వాస్తవాలు కావు. నక్సలైట్ల వల్ల, వాళ్లు నిర్మించే ఉద్యమాల వల్ల పేద ప్రజలు చాలా ప్రయోజనం పొందారన్నది కూడ తెలంగాణలో అందరూ ఎరిగిన వాస్తవం. కూలిరేట్లు పెరిగాయి. పెత్తందార్లూ, భూస్వాములూ ఆక్రమించుకున్న భూములు పేదలకు తిరిగి వచ్చాయి. అటవీ ప్రాంతాలలో ఆదివాసులకు అటవీ శాఖ సిబ్బంది వేధింపుల నుండి రక్షణ లభించింది. ఇంకా ఎన్నో ప్రయోజనాలు ప్రజలు పొందారు. ఈ మాటలు అనడం నక్సలైట్ల రాజకీయాలను, హింసాత్మక చర్యలను సమర్థించడం కాదు, వాస్తవాన్ని ఒప్పుకోవడం. ఇది వాస్తవమయినప్పుడు నక్సలైట్లను 'జాతీయ విపత్తు' అనీ, ప్రజాస్వామ్యానికీ రాజ్యాంగానికీ పేద ప్రజలకూ శత్రువులనీ అనడం సబబేనా? అది అదుపు తప్పిన ద్వేషం అనడంలో తప్పేమయినా ఉంటుందా? వ్యక్తిగతంగా ప్రతాపరెడ్డి గారికీ వారి కమిటీ సభ్యులకూ ఏ అభిప్రాయం ఉన్నా, ప్రజా జీవితానికి సంబంధించిన ఒక ముఖ్యమైన విషయంపైన నివేదిక తయారు చేయమని వారిని రాష్ట్ర హైకోర్టు కోరినప్పుడు కొంచెం నిష్పాక్షికంగా విషయాన్ని పరిశీలించవలసిన అవసరం లేదా? మొదట హైకోర్టు నియమించిన కమిటీ సభ్యులలో 8 మంది కొద్దికాలంలోనే కమిటీ నుండి తప్పుకోవడానికి ఈ గుడ్డి ద్వేషంతో ఏకీభవించలేకపోవడమే కారణమా? వారు తప్పుకున్నారని ప్రతాపరెడ్డి గారు హైకోర్టుకు చెప్పగానే వారికి బదులు వేరే పేర్లను హైకోర్టు ఆమోదించింది. అయితే ఆ పని చేసే ముందు హైకోర్టు ఆ 8 మంది నుండి తాము తప్పుకోవడానికి గల అసలు కారణాలేమిటో అడిగి తెలుసుకొని ఉంటే బాగుండేదేమో.

న్యాయవాదుల కమిటీ దృక్పథంలో న్యాయం అనేది ఏ మాత్రం ఉందో అర్థం చేసుకోవడానికి వారిచ్చిన మరొక సూచనను ఉదాహరణగా తీసుకోవచ్చు. తెలంగాణ జిల్లాలలో నక్సలైట్ల చేతిలోనూ పోలీసుల చేతిలోనూ చాలా ప్రాణాలు పోతున్నాయి. ఈ హత్యలను ఏ విధంగా అర్థం చేసుకోవాలన్న చర్చను పక్కన పెట్టి, చనిపోయిన వాళ్లు ఎవరయినా ఎటువంటి వాళ్లయినా వాళ్ల కుటుంబాలు చేసిన పాపం ఏమీ లేదు కాబట్టి హత్య వల్ల వారి కుటుంబం నిరాశ్రయులయి ఉంటే, జీవనాధారం కోల్పోయి ఉంటే వారికి ప్రభుత్వం పునరావాసం కల్పించాలనే ఆలోచనతో విభేదించే వాళ్లెవరూ ఉండరు. కానీ ఇప్పటి దాకా ప్రభుత్వం ఈ విషయంలో ఏకపక్ష వైఖరిని అవలంబిస్తూ ఉంది. నక్సలైట్ల చేతిలో ఎవరు చనిపోయినా, వారు పేదలయినా, ధనవంతులయినా, లక్షాధికారులయిన, వారి చావు వల్ల వారి కుటుంబం ఆర్థికంగా దెబ్బతిన్నా తినకపోయినా ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తున్నది. పోలీసుల చేతిలో చనిపోయిన వారికి మాత్రం ఏమీ ఇవ్వదు. రహస్య కార్యకర్తలుగా ఉంటూ కుటుంబాలకు దూరమయిన వారు చనిపోతే ఆ కుటుంబాలకు ఆర్థికంగా వచ్చే విపత్తు ఏమీ వుండకపోవచ్చు. అయితే అటువంటి వాళ్ల విషయంలో కూడ వాళ్లు ఎక్కడున్నా బ్రతికి ఉంటే వాళ్ళ భార్యా పిల్లలను వాళ్ళ తల్లిదండ్రులు చూసుకుంటారు కాని చనిపోతే వారి పోషణ సమస్య అవుతుంది. అదట్లాగుంచి, ఎన్‌కౌంటర్లలో ఎక్కువగా చనిపోయేది కుటుంబాలకు దూరంగా ఉండే రహస్య కార్యకర్తలు కారు. తమ కుటుంబాలలోనే వుంటూ అంతో ఇంతో పని చేసి ఆర్థికంగా తోడ్పడుతూ ఉండే మిలిటెంట్లు. వీరి మరణం కుటుంబాలకు మానసికంగానే కాక ఆర్థికంగా కూడ దెబ్బే. నక్సలైట్ల చేతిలో లక్షాధికారులు చనిపోయినా కుటుంబాలకు నష్టపరిహారం ఇచ్చే ప్రభుత్వం ఎన్‌కౌంటర్లలో చనిపోయే పేద మిలిటెంట్ల కుటుంబాలకు మాత్రం ఏ రకమైన పునరావాసం కల్పించడం లేదు.

నక్సలైట్ రాజకీయాలతో పూర్తిగా విభేదించే వారు సైతం ఏ మాత్రం నిష్పాక్షిక దృష్టి ఉన్నా ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించకుండ ఉండలేరు. ప్రతాప రెడ్డి గారికి మాత్రమే అది సాధ్యం అయింది. ఒక వైపు ఆయన నక్సలైట్ బాధితులకిచ్చే నష్టపరిహారాన్ని పెంచాలని సూచిస్తూ మరొక వైపు ఎన్‌కౌంటర్ మృతుల కుటుంబాలకు నష్ట పరిహారం ఇవ్వాలా వద్దా అనే ప్రశ్నకు తమ కమిటీ ఇచ్చే జవాబు ఏమీ లేదని, అది హైకోర్టు వారి దయ అని అంటాడు!

నక్సలైట్ బాధితులకు నష్ట పరిహారం ఇవ్వడం రాష్ట్ర ప్రభుత్వం 1991లో మొదలు పెట్టింది. హతుల కుటుంబాలకు 25 వేల రూపాయలు, శాశ్వతంగా వికలాంగులయిన వారికి 10 వేల రూపాయలు, క్షతగాత్రులయిన వారికి 5 వేల రూపాయలు ఇచ్చేవారు. ఇళ్లు ధ్వంసం అయితే 20 వేలు ఇవ్వాలని 1992లో ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మొత్తాలను క్రమంగా పెంచుకుంటూ వచ్చారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ 1994లో రాష్ట్రంలో పర్యటించినపుడు నక్సలైట్ల దాడిలో చనిపోయిన వారి కుటుంబాలకు ఇచ్చే నష్ట పరిహారాన్ని 50 వేలకు పెంచాలని సూచించింది. ప్రభుత్వం మానవ హక్కుల కమిషన్ చేసిన ఈ ఒక్క సూచనను మాత్రం ఆమోదించింది. దానిని 1996లో మళ్ళీ సవరిస్తూ మృతుల కుటుంబాలకు 1 లక్ష రూపాయలు ఇవ్వాలనీ, శాశ్వతంగా వికలాంగులయిన వారికి 40 వేల రూపాయలు ఇవ్వాలనీ, తీవ్రంగా గాయపడిన వారికి 20 వేలు ఇవ్వాలనీ ప్రభుత్వం నిర్ణయించింది. మృతులు సర్పంచ్‌లు లేక ఎం.పి.టి.సిలయితే నష్ట పరిహారం ఒకటిన్నర లక్షకు, మండల అధ్యక్షులు, జడ్‌పిటిసిలు అయితే రెండు లక్షలకు పెంచారు (జి.వో.ఎం.ఎస్ నెం. 70, 26-2-1996). ఇప్పుడు ఈ న్యాయవాదుల కమిటీ ఏం సూచిస్తుందంటే మృతుల కుటుంబాలకు 2 లక్షల 50 వేలు ఇవ్వాలి. శాశ్వతంగా వికలాంగులయితే 2 లక్షలు ఇవ్వాలి. తీవ్రంగా గాయపడితే 1 లక్ష ఇవ్వాలి. నక్సలైట్లు వాళ్ళ ఆస్తిని ధ్వంసం చేస్తే దానికి మార్కెట్ విలువ కట్టి ఇవ్వాలి.

ఈ విషయంలో ఇంత ఉదారంగా ఉన్న ప్రతాపరెడ్డి గారు, పోలీసుల చేతిలో చనిపోయే ఎన్‌కౌంటర్ మృతుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలా లేదా అనే ప్రశ్న దగ్గరికొచ్చేసరికి అది బూటకపు ఎన్‌కౌంటర్ అని రుజువయితే మాత్రం నక్సలైట్ బాధితులకు ఇచ్చినట్టే నష్టపరిహారం ఇవ్వాలి గాని లేకపోతే కూడ ఇవ్వాలా లేదా అనేది హైకోర్టు వారు నిర్ణయించాలని చెప్పారు. ఏదయినా బూటకపు ఎన్‌కౌంటరా కాదా అని ఏ విధంగా తేలాలి? ఎవరు తేల్చాలి? ఈ విషయంలో మాత్రం ప్రతాప రెడ్డి గారు చేసే సూచన ఏదీ లేదు. వారు సమర్పించిన సుదీర్ఘమైన నివేదికలో ఎక్కడా ఎన్‌కౌంటర్ల పైన న్యాయస్థానాలలో విచారణ జరిపించాలన్న వాక్యం లేదు. అది జరగకుండ ఏది నిజమైన ఎన్‌కౌంటర్, ఏది బూటకం అని ఏ విధంగా నిర్ణయం కావాలి? ఎన్‌కౌంటర్ మృతుల విషయంలో నష్టపరిహారం సూచించడానికి ఇంతగా

తటపటాయించవలసిన అవసరం ఏముందంటే, 'నష్టపరిహారం ఇవ్వడం తీవ్రవాదాన్ని ప్రోత్సహించడం అవుతుంది' అని వివిధ జిల్లాల అధికారులు తమతో చెప్పారని ప్రతాప రెడ్డి గారు అంటారు.

ఇక్కడ సిపిఐ (ఎం.ఎల్) పార్టీల పట్ల, ఆ పార్టీలు నిర్వహిస్తున్న పోరాటాల పట్ల ఈ కమిటీకి ఉన్న వైఖరిని ప్రస్తావించక తప్పదు. నక్సలైట్ల ఆవిర్భావాన్ని గురించి, స్వభావాన్ని గురించి ఈ నివేదిక రెండవ అధ్యాయంలో వారు తమ అభిప్రాయాలను వివరించారు. నక్సలిజాన్ని అందరూ అభిమానించాలని, అనుసరించాలని పౌరహక్కుల సంఘం చెప్పదు. కానీ దాని పట్ల ఒక కనీస ప్రజాతంత్ర దృక్పథం ఉండడం అవసరం. అది లేని వాళ్లు – న్యాయవాదులయినా వేరొకరయినా – హైకోర్టుకు తగిన సూచనలు ఇవ్వలేరు. ఈ విషయంలో న్యాయవాదుల కమిటీ అభిప్రాయాన్ని రెండు వాక్యాలలో వివరించవచ్చును. భూసంస్కరణల అమలులోని వైఫల్యాల ఫలితంగా పేదలకూ ధనికులకూ మధ్య తేడాలు ఉండిపోయాయని ఒప్పుకుంటూనే, అభివృద్ధి చెందిన ఆంధ్ర ప్రాంత ప్రజలు తెలివయిన వాళ్లు కావడం వల్ల 'వాస్తవాలను గుర్తించి రాజీపడ్డారు అనీ', (దీని భావాన్ని మేము వివరించనవసరం లేదు!), చదువు లేని అమాయకులయిన తెలంగాణ ప్రాంత పేదలను మభ్యపెట్టి భ్రమలు చూపించి మోసం చేయడం నక్సలైట్లకు సాధ్యమయిందనీ, నక్సలైట్లకు చదువు గానీ తాత్విక అవగాహన గానీ లేవని, వాళ్లలో అధిక భాగం 'లంపెన్' స్వభావం గల వాళ్లనీ ఈ నివేదిక అంటుంది. ఇందులో ద్వేషమే తప్ప అవగాహన లేదు. ఈ రకమైన వైఖరి ఉన్న వాళ్లు ఇచ్చే సూచనలు ప్రజాస్వామికంగా ఎట్లా ఉండగలవు?

పేదరికం, అసమానతలు ఉన్నాయనీ, వాటిని పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా సఫలం కాలేదనీ ఒప్పుకోక తప్పదు కాబట్టి ఈ న్యాయవాదులు ఒప్పుకుంటారు. కాని ఈ సమస్యలకు ఒక పరిష్కారాన్ని చూపించే రాజకీయ ఉద్యమంగా నక్సలైట్ ఉద్యమాన్ని చూడడానికి ఒప్పుకోరు. ఒప్పుకుంటూ కూడ వారు చూపించే పరిష్కారంతో విభేదించవచ్చు, దానిని విమర్శించవచ్చు, మొత్తంగానే తిరస్కరించినా తిరస్కరించవచ్చు. కానీ ఆ ఉద్యమానికి ఉండే రాజకీయ స్వభావాన్ని చూడడానికి నిరాకరిస్తే దానికి మద్దతునిచ్చే ప్రజలు 'తప్పు దారి పట్టిన వారి' గాను, 'అమాయకత్వం వల్ల మోసపోయిన వారి' గాను కనిపిస్తారే తప్ప తమకు నచ్చిన రాజకీయాలను ఎంచుకున్న స్వతంత్ర

పౌరులుగా కనిపించరు. ఆ ఉద్యమం వట్టి హింసోన్మాదంగా కనిపిస్తుంది తప్ప మంచో చెడో ప్రజల సమస్యలకు సాయుధ పోరాట మార్గాన్నీ, రాజ్యాధికార లక్ష్యాన్నీ పరిష్కారంగా ఎంచుకున్న ఒక నిర్దిష్ట రాజకీయ ఉద్యమంగా కనిపించదు. ఆ విధంగా చూడడమే వారి రాజకీయాలనూ వారు చేపట్టే హింసాత్మక చర్యలనూ సమర్థించడం అనే పోలీసు వ్యాఖ్యానానికి ఈ వైఖరి దారితీస్తుంది. అటువంటి వైఖరితో చేపట్టే పరిశీలన ప్రభుత్వానికి ఇంకింత నిర్బంధం పెంచమన్న సూచన తప్ప వేరే ఏ సూచన ఇవ్వగలదు?

ప్రతాపరెడ్డి గారు చేసిన సూచనలు విషసర్పాలనో, క్రూర జంతువులనో ఏరి వేయడానికి ఇస్తున్న సూచనలలాగ వున్నాయే తప్ప ఒక రాజకీయ ఉద్యమం సాయుధ రూపం తీసుకోవడం వల్ల ఉత్పన్నమైన సమస్యలకు న్యాయ సమ్మతమైన పరిష్కారాలను వెతికే సూచనలలాగ లేవు. నక్సలైట్లు ఒక 'పీడ', ఒక 'ఉపద్రవం', ఒక 'విపత్తు'. రాజకీయ పార్టీలు నక్సలిజాన్ని 'జాతీయ విపత్తు' గా గుర్తించాలి; రాజీపడడం, మద్దతు తీసుకోవడం, మద్దతు కోరడం మానుకోవాలి – ఇవీ ప్రతాపరెడ్డిగారి సూచనలు. నిజానికి పోలీసులూ, ప్రతాపరెడ్డి గారూ ఏమనుకున్నా రాజకీయ పార్టీలు నక్సలైట్లను రాజకీయ కార్యకర్తలుగా గుర్తించక తప్పదు, వారితో (తమ అవసరాల కోసమైనా, ప్రజల అవసరాల కోసమైనా) రాజకీయంగా వ్యవహరించక తప్పదు. అదే జరుగుతూ వుంది. దీనిని 'లొంగుబాటు'గా భావించే అప్రజాస్వామిక దృక్పథం ఈ న్యాయవాదులకే సాధ్యం అయింది.

ఇప్పటికే ఈ ఉద్యమానికుండే సామాజిక, ఆర్థిక పునాదినీ, రాజకీయ స్వభావాన్నీ గుర్తించకుండ కేవలం పోలీసు చర్యలతో ఎదుర్కోవాలనుకోవడం వల్ల ప్రజలకూ, ప్రజాస్వామ్య విలువలకూ చాలా నష్టం జరిగిందని పౌరహక్కుల సంఘాలు విమర్శిస్తుంటే, ఆ పోలీసు చర్యలను మరింత పటిష్టం చేయడమే ఈ నివేదిక చేసే ప్రధాన సూచనల సారాంశం. నక్సలైట్లవల్ల ప్రాణభయం లేకుండ ఉండేందుకు తగిన పోలీసు రక్షణ కల్పించాలనడం వేరు. పోలీసు చర్యలనే ప్రభుత్వ విధానంగా చేసిన పరిపాలనా నీతిని ఆమోదించి దానికి మరింత బలం కల్పించే సూచనలు చేయడమే తమ కర్తవ్యం అనుకోవడం వేరు.

తెలంగాణ జిల్లాలలో ప్రతి పోలీస్ స్టేషన్‌లోనూ 100 నుండి 150 మంది సుశిక్షితులయిన పోలీసులను నియమించాలనీ, వారికి అత్యాధునిక ఆయుధాలు ఇవ్వాలనీ (ఇప్పుడు లేనట్టు!) సూచించారు. ఇప్పటికే తెలంగాణ జిల్లాలలోని అనేక ప్రాంతాలలో (ముఖ్యంగా అడవి ప్రాంత మండలాలలో) ఎ.కె.47లు పట్టుకొని పోలీస్ స్టేషన్ దగ్గరే కాక మండలాఫీసుల దగ్గర, బ్యాంకుల దగ్గర, ఐ.టి.డి.ఎ తదితర ప్రభుత్వ ఆఫీసుల దగ్గర తిరుగుతూ మఫ్టీ పోలీసులు ప్రజలకు దడ పుట్టిస్తున్నారు. ఈ కార్యాలయాల కొచ్చి తమ హక్కుల కోసం అడగాలన్నా, అన్యాయాన్ని ప్రశ్నించాలన్నా ప్రజలు భయపడుతున్నారు. ఇప్పుడు పోలీసులనూ, తుపాకులనూ పెంచితే పరిస్థితి దుర్భరంగా తయారవుతుంది. అక్కడితో ఆగిపోకుండ, 'అవసరమైతే మందీ మార్బలాన్ని ఉపయోగించి' నక్సలైట్ల హింసను ఎదుర్కొని ఆత్మరక్షణ చేసుకోవడానికి గ్రామస్తులకు అవకాశం ఇవ్వాలని ఈ నివేదిక సూచించింది. అంటే ప్రైవేట్ సాయుధ ముఠాలను అధికారికంగానే తయారు చేయమని అర్థం. నక్సలైట్ల వల్ల ప్రాణాపాయం ఉన్నవారు రక్షణ కోసం ప్రభుత్వం దగ్గరికి పోగలరు. పోలీస్ స్టేషన్లలో ఆశ్రయం పొందగలరు. కానీ ప్రభుత్వమే అనుమతించే ఈ సాయుధ 'గ్రామ రక్షకుల' నుండి రక్షణ కావలసిన ప్రజలు ఎవరి దగ్గరకు పోవాలి? ఎక్కడ రక్షణ పొందాలి? దీని వల్ల ప్రమాదం నక్సలైట్లకు కాదు, వాళ్ల మద్దతుదార్లయిన కూలినాలి జనానికి. కాశ్మీర్‌లో, అస్సాంలో ఈ 'ప్రయోగం' కొంతకాలంగా నడుస్తూ వుంది. దాని ఫలితాన్ని ప్రతాపరెడ్డి గారు ఒకసారి చూస్తే తాము చేసిన సూచన ఎటువంటి అరాచకానికి దారితీస్తుందో అర్థం అవుతుంది (బహుశా చూసే చేసారేమో !).

నక్సలైట్ ఉద్యమానికి పోలీసులే జవాబు అయినట్టు పోలీసు శాఖ అంతా తానయి పని చేయడం మానేసి రెవెన్యూ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, విద్యా వైద్య శాఖలు, సాంఘిక సంక్షేమ శాఖ, నీటిపారుదల, పౌరసరఫరా శాఖలు, గ్రామ పంచాయితీలు తమ విధులను నిబద్ధతతో నిర్వహిస్తే పోలీసు శాఖకు ఇంత ప్రాముఖ్యం ఇవ్వవలసిన అవసరం వుండేది కాదని పౌరహక్కుల సంఘాలు చాలాకాలంగా అంటున్నాయి. న్యాయవాదుల కమిటీ అభిప్రాయం అందుకు భిన్నంగా వుంది. రెవెన్యూ, గిరిజన సంక్షేమం, అటవీ, విద్యా తదితర శాఖలన్నీ 'తీవ్రవాదులును ఎదుర్కొనే కర్తవ్యంలో పోలీసులతో సహకరించేటట్టు, సహాయం చేసేటట్టు చూడాలి' అంటారు.

అంటే ఇప్పటికే అన్నీ తానై వ్యవహరించడం చాలదన్నట్టు పోలీసు శాఖే సర్వాంతర్యామి కావాలన్నమాట. గ్రామీణ ప్రజలను పేదరికం నుండి, నిరక్షరాస్యత నుండి, దోపిడీ పీడనల నుండి విముక్తి చేసే చర్యలు చేపట్టాలని పౌరహక్కుల సంఘాలూ, ప్రజాతంత్ర వాదులూ అంటుంటే 'గ్రామీణ ప్రజలను తీవ్రవాదుల పీడ నుండి త్వరగా విముక్తి చేయడానికి అవసరమైన సకల సదుపాయాలూ పరికరాలూ పోలీసులకు ఎప్పటికప్పుడు సమకూర్చాలి' అని ఈ న్యాయవాదులు అంటున్నారు.

ఒక చివరి ఉదాహరణ ఇచ్చి ఈ సమీక్షను ముగిస్తాము. వీరప్పన్ ఒక స్మగ్లర్. విలువైన చందనాన్నీ, ఏనుగు దంతాలనూ స్మగుల్ చేసే తన ముఠా కార్యకలాపాలలో భాగంగా దాదాపు వందమందిని హత్యచేసాడని అంటారు. అటువంటివాడు అటవీశాఖ సిబ్బందిని కిడ్నాప్ చేసి వారి విడుదలకు షరతులు పెడితే రెండు రాష్ట్ర ప్రభుత్వాలూ మొండిగా వీలులేదని కొట్టిపారేయకుండ చర్చలకు సిద్ధపడుతున్నాయి. ప్రజాస్వామ్యంలో మనుషుల ప్రాణాలకు సంబంధించిన విషయంలో ప్రభుత్వాలు పట్టువిడుపు పాటించక తప్పదు. 'నేరస్తులకు ఎట్టి పరిస్థితిలోనూ లొంగము' అనే మూర్ఖత్వం సాధ్యం కాదు. కానీ ఈ న్యాయవాదుల కమిటీ అభిప్రాయంలో నక్సలైట్లు ఖైదీల విడుదల కోసం కిడ్నాప్‌లకు పాల్పడినప్పుడు బందీల ప్రాణాలను కాపాడడం కోసం ప్రభుత్వాలు దిగిరావడం 'లొంగుబాటు' వైఖరి. అటువంటి 'బలహీనత' ప్రదర్శించినందుకు ఈ న్యాయవాదులు రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా దుయ్యబట్టారు. ఎట్టి పరిస్థితిలోనూ లొంగ కూడదని సూచించారు. చేవలేని రాజకీయనాయకులు ప్రదర్శించిన ఈ రకమైన అవకాశవాద రాజీ వైఖరుల వల్లనే నక్సలిజం పెరిగిపోతున్నదని అన్నారు.

ఇప్పటికే కరడుగట్టి వున్న ప్రభుత్వ నిర్బంధ విధానాలను మరింత మూర్ఖంగా మార్చడానికి తప్ప ఈ సూచనలు ఇంకెందుకూ పనికిరావు. హైకోర్టు వీటిని బుట్టదాఖలు చేస్తుందని ఆశిద్దాం.

స్వేచ్ఛ మాసపత్రిక
*జూన్ 1997*

# లేబర్ కమిషన్ ముసుగులో జరగబోతున్నది ఏమిటి?

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రెండవసారి జాతీయ లేబర్ కమిషన్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు వాజ్‌పేయి ప్రభుత్వం ప్రకటించింది. 'నెహ్రూ ఆర్థిక విధానాలు'గా పేరుపడిన విధానాలు అమలులో ఉన్న దశలో మొదటి జాతీయ లేబర్ కమిషన్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. వాటిని 'నెహ్రూ ఆర్థిక విధానాలు' అనడం సబబా కాదా అన్నది వేరే ప్రశ్న. అయితే ఆ విధానాల పైన జాతీయోద్యమ కాలంలో ముందుకు వచ్చిన ప్రజాతంత్ర విలువల ప్రభావం బలంగా ఉందనేది వాస్తవం. ఇప్పుడు ఆ విధానాలకు కాలం చెల్లిపోయిందని అన్ని పాలక పార్టీలూ ఏక కంఠంతో ప్రకటిస్తున్న నేపథ్యంలో రెండవ జాతీయ లేబర్ కమిషన్‌ను ఏర్పాటు చేయడం జరుగుతున్నది. ఆ మార్పే దీని అజెండాను నిర్ణయిస్తుందా?

ఈ సందేహం కార్మిక సంఘాలలో ఉంది. కాబట్టే ఏ కార్మిక సంఘమూ ప్రభుత్వ ప్రతిపాదనకు పెద్దగా ఉత్సాహంతో స్పందించలేదు. స్పందించిన కొద్దిమంది కార్మిక నాయకులూ అనుమానాలు వెలిబుచ్చారు. లేబర్ కమిషన్‌ను ఏర్పాటు చేయబోతున్నామన్న ప్రకటనతోపాటు ఆ కమిషన్ ఏమేం చేయబోతోందో సూచిస్తూ కేంద్ర కార్మిక మంత్రి వివరణ ఇవ్వడం పట్ల వారు అభ్యంతరం తెలిపారు.

నిజానికి జాతీయ లేబర్ కమిషన్‌కు ప్రభుత్వం 'టరమ్స్ ఆఫ్ రెఫరెన్సు' రూపొందించవలసి ఉంది. ఏయే విషయాలలో ప్రస్తుతం ఉన్న కార్మిక చట్టాలు, పారిశ్రామిక చట్టాలు సరిపోవని ప్రభుత్వం భావిస్తున్నదో వాటిని సూచించి ఆ విషయాలను పరిశీలించి కొత్త చట్టాలు లేక చట్ట సవరణలకు సంబంధించిన సలహాలు

ఇమ్మని ప్రభుత్వం కమిషన్‌ను కోరాలి. అంతే తప్ప ఏ రకమైన సవరణలు కమిషన్ ప్రతిపాదించబోతున్నదో ప్రభుత్వమే ప్రకటించడం భావ్యం కాదు. ప్రభుత్వం ఆలోచనలకు పూర్తిగా భిన్నమైన సూచనలు కమిషన్ నుండి రాకూడదన్న నియమమేమీ లేదు. కమిషన్ సూచనలను ప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేయాలన్న నియమం కూడ లేదు కాబట్టి దీని వల్ల నిజానికి ప్రభుత్వానికి పెద్దగా ఇబ్బందీ లేదు.

అయినప్పటికీ రెండవ జాతీయ లేబర్ కమిషన్ ఏం చేయబోతోందో సూచిస్తూ ముందుగానే కార్మిక మంత్రి ప్రకటించడంలో ఒక ఆత్రుత కనిపిస్తుంది. కార్మిక సంఘాలు దానిని కనిపెట్టి విమర్శించినట్టే, పెట్టుబడిదార్ల సంస్థలు దానిని కనిపెట్టి సంతోషంగా స్పందించాయి.

దాదాపు ఒక దశాబ్దం కింద కేంద్ర ప్రభుత్వం ఆర్థిక పారిశ్రామిక సరళీకరణ విధానాలు ప్రవేశపెట్టినప్పటి నుంచి దేశీయ ఉత్పత్తి అంతర్జాతీయ విపణిలో బాగా అమ్ముడు పోవడం, విదేశీ పెట్టుబడి పెద్ద మొత్తంలో దేశంలోకి రావడం రెండు పెద్ద అవసరాలుగా చూపించబడుతున్నాయి. దేశ ఆర్థిక అభివృద్ధిలో వీటి ప్రాముఖ్యం ఎంత అని ఆలోచిస్తున్న వారు రాజకీయ పార్టీలలోనూ, అధికార యంత్రాంగంలోనే కాదు మేధావి వర్గంలోనూ కరువయ్యారు.

ఈ 'అవసరాలకు' కార్మికుల హక్కులు ఆటంకం అయ్యాయి. ఈ విషయం మన దేశానికి చెందిన పరిశ్రమల యజమానులు, విదేశీ పెట్టుబడిదారులు కూడ పదే పదే స్పష్టం చేస్తున్నారు. ఒక వెనుకబడిన దేశం అంతర్జాతీయ విపణిలో సరుకులు అమ్ముకోవడం కోసమైనా పెట్టుబడిని ఆకర్షించడం కోసమైనా పోటీ పడాలంటే అనేక ఆటుపోట్లు ఎదుర్కోవలసి ఉంటుందనీ, దానికి అనుగుణంగానే దేశ అంతర్గత విధానాలలో మార్పులు చేసుకోవలసి ఉంటుందనీ, లేకపోతే ఈ ప్రయత్నంలో ఘోరంగా దెబ్బతినే ప్రమాదం ఉందనీ దేశ ఆర్థిక విధాన నిర్ణేతలు హెచ్చరిస్తున్నారు. ఎగుమతి దిగుమతులకు సంబంధించిన సరళీకరణ, ప్రోత్సాహకాలు ఈ విధాన మార్పులలో ఒకటి కాగా కార్మికుల హక్కుల కత్తిరింపు రెండవది.

అంతర్జాతీయ విపణిలో మనతో పోటీపడే అనేక మూడవ ప్రపంచదేశాలలో కార్మికులకు చట్టంలో భద్రతగానీ, హక్కులుగానీ మన దేశంతో పోలిస్తే తక్కువగా

ఉన్నాయి. ఆచరణలో ఈ చట్టాలు అన్ని సందర్భాలలోనూ కార్మికులకు ఇవ్వవలసిన రక్షణ ఇవ్వలేకున్నప్పటికీ పరిశ్రమల యాజమాన్యాలు వాటి గురించి సణుగుతూనే ఉన్నాయి. మన బోటి మూడవ ప్రపంచ దేశ ఉత్పత్తులు అంతర్జాతీయ విపణిలో తట్టుకుని నిలవాలంటే పెట్టుబడిదార్లకు ఇచ్చే ఇతర ప్రోత్సాహకాలతో బాటు పారిశ్రామిక చట్టాలు – కార్మిక చట్టాలు కూడ కొంత 'ఉదారం' గా ఉండాలని డిమాండ్ చేస్తున్నాయి. ఇక్కడ 'ఉదారం' అంటే అర్థం యజమానులకు లే ఆఫ్ విషయంలోనూ రిట్రెంచ్‌మెంట్ల విషయంలోనూ వేతన ఒప్పందాల విషయంలోనూ 'స్వేచ్ఛ' ఉండాలని; కార్మిక సంక్షేమం పేరిట ప్రభుత్వమూ, న్యాయస్థానాలూ జోక్యం చేసుకోకూడదని.

మరొకవైపు విదేశీ పెట్టుబడిదారీ కంపెనీలు కూడ భారతదేశంలో పెట్టుబడులు పెట్టే విషయంలో మన పాలకులు ఆశిస్తున్నంత ఉత్సాహం కనిపించడం లేదు. ఈ సంగతి మన్మోహన్ సింగ్ తొలి బడ్జెట్ నుండి ప్రతి సంవత్సరం బడ్జెట్ ఉపన్యాసంలో కేంద్ర ఆర్థిక మంత్రి చెబుతూనే ఉన్నారు. రేపు యశ్వంత్ సిన్హా కూడ చెప్పబోతారు. ఉత్పత్తి రంగంలో పెట్టుబడులు పెట్టడం కంటే షేర్ల మార్కెట్‌లోనూ ఫైనాన్స్ మార్కెట్లోనూ విదేశీ కంపెనీలు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నాయి. దీనికి మన ఆర్థిక విధాన వ్యాఖ్యాతలు చూపిస్తున్న అనేక కారణాలలో ఒకటి, భారత దేశంలో కార్మిక చట్టాలు, పారిశ్రామిక చట్టాలు మరీ 'కఠినం'గా ఉన్నాయనేది. విదేశీ కంపెనీల భాషలోనే చెప్పాలంటే వారికి 'హైర్ అండ్ ఫైర్' స్వేచ్ఛ కావాలి. అంటే కార్మికులను పనిలోకి తీసుకోవడంలోనూ, ఏ రోజయినా పని లేకపోతే పక్కన పెట్టడంలోనూ, పని నుంచి తీసేయడంలోనూ, కంపెనీని మూసేయడంలోనూ, కార్మికుల వేతనాలు నిర్ణయించడంలోనూ యాజమాన్యానికి స్వేచ్ఛ కావాలి. చట్టము, దానిని అమలు చేసే అధికార యంత్రాంగము, కోర్టులు జోక్యం చేసుకోకూడదు. ఈ కోరికను వివరించడానికి ఒక వాక్యం చాలును కానీ అది తీరాలంటే ప్రస్తుతం ఉన్న కార్మిక చట్టాలను, ముఖ్యంగా పారిశ్రామిక వివాదాల చట్టాన్ని మౌలికంగా మార్చవలసి ఉంటుంది. కార్మిక వర్గాన్ని మొత్తంగా 'అసంఘటిత' కార్మికుల స్థాయికి దిగజార్చవలసి ఉంటుంది.

రెండవ జాతీయ లేబర్ కమిషన్ 'అసంఘటిత రంగ' కార్మికుల హక్కుల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెడుతుందన్న కేంద్ర కార్మిక మంత్రి ప్రకటనకు ఈ కోణం కూడ ఉందేమో? ఆయన కొత్త జాతీయ లేబర్ కమిషన్‌కు సూచించిన అజెండాలలో రెండు

విషయాలు ఉన్నాయి. ఒకటి అసంఘటిత రంగ కార్మికుల హక్కుల గురించి సూచనలు చేయడం, రెండు ఆర్థిక సరళీకరణ విధానాల నేపథ్యంలో కార్మిక చట్టాలను పునః పరిశీలించడం. వీటిలో మొదటిది ఆహ్వానించదగినదని, రెండవది అనుమానించవలసిన విషయమని వినగానే అనిపిస్తుంది. అసంఘటిత రంగ కార్మికుల హక్కుల గురించి ఆలోచించాలని, అందుకు గట్టి చట్టాలు చేయాలని ప్రభుత్వం భావించడం మంచి విషయమనడంలో సందేహం ఏమీ అక్కరలేదు. దేశ కార్మిక వర్గంలో (వ్యవసాయాన్ని లెక్కబెట్టకుంటే కూడ) దాదాపు 90 శాతం అసంఘటిత కార్మికులే. వీరికి వర్తించే చట్టాలు లేకపోలేదుగానీ పని భద్రత అసలే లేకపోవడం అనే ప్రాథమిక బలహీనత వల్ల వాటిని అమలు చేయించుకోవడం కష్టంగా ఉంది. ఈ ప్రజానీకానికి ఏ కొంచెం బలం చేకూర్చే చట్టాలనయినా ఆ మేరకు ఆహ్వానించవలసిందే.

కానీ ఇవాళ అకస్మాత్తుగా అసంఘటిత రంగ కార్మికుల ప్రయోజనాలకు పెద్ద పీట వేయాలని ప్రభుత్వం ఆలోచించడాన్ని కూడ సరళీకృత ఆర్థిక విధానాలతో ముడిపెట్టకుండా ఉండలేము. ఆర్థిక సరళీకరణ, ప్రపంచీకరణల ఫలితంగా దేశంలో నిరుద్యోగం పెరుగుతుందా లేదా అనేది ఇప్పటికింకా వివాదాస్పదంగానే ఉంది కానీ కార్మికులు మరింతగా అసంఘటిత రంగంలోనికి నెట్టబడుతున్నారనేది ఇప్పటికే స్పష్టమవుతున్న వాస్తవం. (పారిశ్రామిక కార్మికుల దాకా ఎందుకు, తెల్ల బట్టల గౌరవం ఉన్న అధ్యాపకులు సైతం విద్య ప్రైవేటీకరణ క్రమంలో అసంఘటిత రంగంలోకి– అంటే ఏ హక్కులూ, ఏ భద్రతా లేకుండా యాజమాన్యం దయపైన బతికే స్థితికి నెట్టబడుతున్నారనేది మనం నిత్యం చూస్తున్న సత్యం.)

అత్యాధునిక సాంకేతిక ప్రక్రియలతో నడిచే పరిశ్రమలలో సైతం క్రమంగా పర్మనెంట్ కార్మికుల సంఖ్య పడిపోయి క్యాజువల్, కాంట్రాక్టు కార్మికుల సంఖ్య పెరిగిపోతున్నది. ('పర్మనెంట్ అంటే శాశ్వతం అనుకునేరు – సాపేక్షంగా కొంత ఉద్యోగ భద్రత ఉన్న వారని మాత్రమే అర్థం.) నిన్నటి దాకా పర్మనెంట్ కార్మికులు చేసిన పనిని ఈ రోజు దిన కూలీల చేత చేయించుకోవడం, లేదా కాంట్రాక్టుకు ఇవ్వడం జరుగుతున్నది. ప్రైవేట్ రంగంలోనే కాదు ఇప్పటికింకా ప్రైవేట్‌పరం కాని 'ప్రతిష్టాత్మకమైన' ప్రభుత్వ రంగ సంస్థలలోనూ ఇది జరుగుతున్నది.

అయితే ఇప్పటిదాకా ఇది చట్టాలకూ కోర్టు తీర్పులకూ వ్యతిరేకంగా జరుగుతున్నది. ఇక మీదట ఈ మార్పును చట్టబద్ధం చేయడం (అంటే కార్మిక చట్టాలను, పారిశ్రామిక వివాదాల చట్టాన్ని ఆర్థిక సరళీకరణకు అనుగుణంగా మార్చడం) రెండవ జాతీయ లేబర్ కమిషన్ ముందున్న ఒక కర్తవ్యం అని కేంద్ర కార్మిక మంత్రి ప్రకటన స్పష్టం చేస్తుంది. దీని ఫలితంగా కార్మికరంగాన్ని మరింత సంపూర్ణంగా ఆక్రమించబోయే 'అసంఘటిత' స్థితిని దృష్టిలో పెట్టుకుని అసంఘటిత రంగ కార్మికుల హక్కుల గురించి సూచనలు చేయడం రెండవ కర్తవ్యం.

ఈ రకంగా చూసినప్పుడు రెండు కర్తవ్యాల మూలమూ ఒకటే. ఇప్పటివరకూ ఉన్న కార్మిక చట్టాలు అసంఘటిత కార్మికుల కష్టాలన్నీ తీర్చకున్నా కనీసం సరయిన కారణం లేకుండా ఒక కంపెనీలో క్యాజువల్, కాంట్రాక్టు కార్మికుల సంఖ్యను పెంచే చర్యల పట్ల కొంతమేరకు వ్యతిరేక ధోరణిని కలిగి ఉన్నాయి. అనునిత్యం జరిగే పనిలో పర్మనెంట్ కార్మికులనే వినియోగించాలనే నియమం ఇప్పటివరకూ ఒక చట్టంతో సమానమైన హక్కును కలిగి ఉంది. ఏదైనా ఒక పరిశ్రమలో ఒక రకమైన పనిలో కాంట్రాక్ట్ కార్మికులను నియమించడానికి వీలు లేదని నిషేధం పెట్టే అధికారం ప్రభుత్వానికి చట్టం ఇచ్చింది. ఈ దిశగా చట్టాలను మరింత ముందుకు తీసుకు పోతూ, అప్పటికీ మిగిలిపోయే అసంఘటిత రంగ కార్మికుల రక్షణ కోసం చేయగల చట్టాలు చేస్తే హర్షించవచ్చు. దాని కోసమే ఒక జాతీయ లేబర్ కమిషన్‌ను నియమించినా హర్షించవచ్చు.

కానీ ఒకవైపు ఇప్పుడున్న చట్టాలకు కూడ విరుద్ధంగా కార్మికవర్గాన్ని మొత్తంగా అసంఘటిత స్థితిలోకి నెట్టే ఆర్థిక విధానాలను అనుసరిస్తూ, దానిని 'చట్టబద్ధం' చేసే శాసన సవరణలను జాతీయ లేబర్ కమిషన్ అజెండాలో చేర్చి మరొక వైపు అదే లేబర్ కమిషన్‌ను అసంఘటిత రంగ కార్మికుల కోసం ఏమైనా సూచనలు చేయమని పురమాయించడం మామూలు భాషలో చెప్పాలంటే చంపి చావు ఖర్చులు ఇవ్వడం లాంటిది.

*ఆంధ్రప్రభ దినపత్రిక*
*21 జనవరి 1999*

# శివమెత్తిన సేన

## శ్రీకృష్ణ కమీషన్ నివేదిక



బొంబాయి అల్లర్లలో ధ్వంసమైన జమాలుద్దీన్‌ఖాన్ అనే సైనికుడి ఇల్లు.

ఫోటోగ్రాఫర్ : సౌమిత్ర ఘోష్

మానవహక్కుల వేదిక ప్రచురణ

# శివమెత్తిన సేన

## ఇప్పుడెందుకు?

**1992** డిసెంబర్ 6–1993 జనవరి 20ల మధ్య ముంబాయి నగరంలో చెలరేగిన హింసాకాండ గురించి జస్టిస్ శ్రీకృష్ణ కమిషన్ ప్రకటించిన న్యాయవిచారణ నివేదికను సంక్షిప్తంగా తెలుగు పాఠకులకు అందచేయడం ఈ ప్రచురణ ఉద్దేశ్యం.

ఆరేళ్ల కింద జరిగిన విషయాల గురించి ఇప్పుడు ప్రచురణ ఎందుకని అడగవచ్చు. జస్టిస్ శ్రీకృష్ణ తన నివేదికను 1998 ఫిబ్రవరి 16న మహారాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు. అంటే న్యాయవిచారణ అయిదేళ్లు తీసుకుంది! విచారణాంశం స్వభావమే దీనికొక కారణం కాగా (కమిషన్ 502 మంది సాక్షులను విచారించింది, 9655 పేజీల వాంగ్మూలాలు నమోదు చేసింది, 15 వేల పేజీల డాక్యుమెంట్లు స్వీకరించింది, అడపాదడపా 536 ఆర్డర్లు జారీ చేసింది), ఆనాటి అల్లర్లకూ హత్యాకాండకూ ప్రధాన బాధ్యులయిన శివసేన – బిజెపి హిందుత్వవాదులే విచారణ మొదలయిన తరువాత మహారాష్ట్రలో అధికారానికి వచ్చి కమిషన్ విచారణకు అడ్డుపడాలని శతవిధాల ప్రయత్నించడం మరొక కారణం.

కాలయాపన చేయడానికి హిందుత్వవాద పార్టీలు చేసిన మొదటి ప్రయత్నమేమిటంటే, 1993 మార్చి 12 నాడు ముంబాయి నగరంలో జరిగిన బాంబు పేలుళ్లను కూడ ఇదే విచారణ సంఘం పరిధిలోనికి తీసుకురావాలని డిమాండ్ చేయడం. అప్పటికి మహారాష్ట్రలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పాలకులు దీనికి ఒప్పుకోలేదు. కానీ 1995లో బిజెపి–శివసేన ప్రభుత్వం మహారాష్ట్రలో అధికారానికి రాగానే, 1993 మార్చి 12 నాటి బాంబు పేలుళ్లను కూడ శ్రీకృష్ణ కమిషన్ పరిధిలోకి తీసుకొస్తూ ఆర్డర్ జారీ చేసింది. దీని వల్ల వాళ్లు సాధించదలచుకున్నది స్పష్టమే.

బాంబు పేలుళ్లకు గల్ఫ్ దేశాలలో ఉంటున్న దావూద్ ఇబ్రహీం వంటి ముంబాయి ముఠా నాయకులు బాధ్యులన్న అభిప్రాయం విస్తృతంగా ప్రాచుర్యం పొంది ఉంది కాబట్టి బాంబు పేలుళ్లనూ, అంతకు ముందు నగరంలో జరిగిన హింసాకాండనూ ఒకే విచారణలో భాగం చేయడం ద్వారా హింసాకాండలో 'విదేశీ హస్తం' ఉందంటూ హిందుత్వవాద సంస్థలు మొదటి నుండి చేస్తున్న ప్రచారానికి వాళ్లు బలం చేకూర్చదలచుకున్నారు.

1995లో ఈ విధంగా శ్రీకృష్ణ కమిషన్ పనిభారాన్ని పెంచిన హిందుత్వవాద పాలకులు, 1996 జనవరి 23న కమిషన్‌ను రద్దు చేస్తూ మరొక ఆర్డర్ జారీ చేసారు. రద్దు చేయడానికి వాళ్లు చూపించిన కారణం ఏమిటంటే 'కమిషన్ తన నివేదిక సమర్పించడానికి చాలా కాలం తీసుకుంది' అనీ, 'ఒకవేళ నివేదిక ఇప్పుడు సమర్పించినా దానివల్ల మానిపోయిన గాయాలను తిరగదోడడం తప్ప ఒరిగేది ఏమీ ఉండదు' అనీనూ!

కమిషన్ రద్దుకు అసలు కారణం ఎవరి ఊహకూ అందకుండ పోలేదు. బిజెపి, శివసేన పాలకుల ఊహలకు భిన్నంగా కమిషన్ ముందు సాక్షులు పెద్ద సంఖ్యలో వాంగ్మూలాలు నమోదు చేసారు. హిందుత్వవాదులనూ, వారి ఏజెంట్లుగా వ్యవహరించిన ముంబాయి పోలీసు యంత్రాంగాన్నీ ఇబ్బంది పెట్టే సాక్ష్యం ఇచ్చారు. జస్టిస్ శ్రీకృష్ణ కూడ ఈ విషయాలు తరచి తరచి అడుగుతున్నారు. అందువల్ల కమిషన్ నివేదిక మహారాష్ట్ర పాలకులకు ఇబ్బందికరంగా ఉండబోతుందని వారికి అర్థం అయింది.

శ్రీకృష్ణ కమిషన్ రద్దుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రాజకీయ శక్తులు, పత్రికలు, ప్రజాతంత్రవాదులు తీవ్రంగా స్పందించారు. ముంబాయి హైకోర్టులో పలువురు రిట్ పిటీషన్లు దాఖలు చేసారు. వాటి మీద తీర్పు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చేటట్టు కనిపించింది. 1996 వేసవిలో హిందుత్వవాదుల 'ఉదారవాద ముఖం' అయిన అటల్ బిహారీ వాజ్‌పేయి కేంద్రంలో 13 రోజుల ప్రభుత్వం నడిపారు. తన ఉదారవాద ముఖాన్ని కాపాడుకోవడానికే ఆయన శ్రీకృష్ణ కమిషన్‌ను పునరుద్ధరించమని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాడు. కానీ బాంబు పేలుళ్లు మాత్రం కమిషన్ అజెండాలో ఉండిపోయాయి. ఈ విధంగా 1996 మే 28న పునర్జీవం పోసుకున్న శ్రీకృష్ణ కమిషన్ 1992 డిసెంబర్ –1993 జనవరి కాలం నాటి

ముంబాయి హింసాకాండ గురించే కాక 1993 మార్చి 12 నాటి బాంబు పేలుళ్ల గురించి కూడ తన విచారణ పూర్తి చేసి 1998 ఫిబ్రవరి 16 నాడు తన నివేదికను మహారాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది.

కాబట్టి 1999 జనవరిలో దీని సారాంశాన్ని తెలుగులో ప్రచురించడం మరీ ఆలస్యమేమీ కాదు!

అంతకంటే ముఖ్యమైన కారణమేమిటంటే, శ్రీకృష్ణ కమిషన్ నివేదిక రాబోయే రోజులకు అద్దం పడుతుంది. రాబోయే రోజులని ఎందుకనాలి – వచ్చేసిన రోజులనే అనొచ్చు. హిందుత్వవాద గూండా గ్యాంగులు తమ బలప్రయోగంతో సమాజాన్ని లోబరుచుకొని తమ అభీష్టాన్ని బలవంతంగా సాధించుకుంటున్న ఘటనలు ఒకదాని తరువాత ఒకటి జరుగుతూనే ఉన్నాయి. బాబ్రీ మసీదును కూల్చేసారు. దాని గురించి ఆందోళన చేసిన ముంబాయి నగర ముస్లిం ప్రజల పైన మారణకాండ జరిపారు. ఎం.ఎఫ్.హుస్సేన్ చిత్ర ప్రదర్శనలపైన దాడి చేసి ఇంకెప్పుడూ వారికి నచ్చని చిత్రాలు గీయబోనని అతని చేత చెప్పించారు. ముంబాయిలో పాకిస్తాన్ క్రికెట్ జట్టును ఆడనివ్వమని బెదిరించి క్రికెట్ బోర్డు అధికారులే పాకిస్తాన్ జట్టు వచ్చినప్పుడు ముంబాయిలో 'మ్యాచ్' లేకుండ జాగ్రత్తపడేటట్టు చేసారు. గుజరాత్‌లోనూ ఇతర ఉత్తరాది రాష్ట్రాలలోనూ క్రైస్తవులపై దాడులు ముమ్మరం చేసి నూటికి రెండు శాతం ఉన్న క్రైస్తవులను భయభ్రాంతులు చేసారు. తమకు నచ్చని కథనం, సన్నివేశాలు ఉన్నాయని ఫైర్ సినిమా ప్రదర్శిస్తున్న థియేటర్లపై దాడి చేసి విధ్వంసం సృష్టిస్తామన్న బెదిరింపుతో అనేక నగరాలలో ఆ సినిమా ఆడకుండ చేసారు.

హిందూమతోన్మాద ఫాసిజం ఇన్నాళ్లూ కేవలం ఒక సిద్ధాంత భావన కావచ్చు. ఈరోజు అదొక సామాజిక వాస్తవం. దక్షిణ భారతదేశంలో అది ఇప్పటికింకా బలహీనంగా ఉంది కాబట్టి అది బలంగా ఉన్న ప్రాంతాలలో దాని అభీష్టానికి అడ్డం ఉన్నవారు ఎటువంటి భయాందోళనలకు గురవుతున్నారో మనకు అర్థం కావడం కష్టం కావచ్చు. కానీ అర్థం చేసుకోవటం అవసరం. ఈనాడు దేశంలో ఉన్న ముఖ్యమైన మానవహక్కుల సమస్యలలో ఇదొకటి. కేవలం మైనారిటీ మతస్తులకు మాత్రమే ప్రమాదకారి కాదు, అన్నిరకాల ప్రజాతంత్ర విలువలకూ ప్రజాస్వామ్యానికీ ప్రమాదకారి.

అందువల్ల కూడ ఈ వికృత వాస్తవానికి అద్దంపట్టే జస్టిస్ శ్రీకృష్ణ కమిషన్ నివేదిక సారాంశాన్ని ఇప్పుడు ప్రచురించడం, ప్రచారం చేయడం అవసరం.

## డిసెంబర్ 1992 : ముస్లింల ఆగ్రహం, హిందూత్వవాదుల ఆజ్యం

# ముంబాయి అల్లర్లు

'ముంబాయి అల్లర్లు' గా పేరుగాంచిన హింసాకాండ ప్రధానంగా రెండు ఘట్టాలలో జరిగింది. 1992 డిసెంబర్ 6 నాడు అయోధ్యలో హిందుత్వవాదులు బాబ్రీ మసీదును కూల్చివేసిన అనంతరం (ఆ రాత్రి నుండే) ముంబాయి నగరంలో మొదటి దఫా అల్లర్లు మొదలయ్యాయి. 12వ తేదీ దాకా సాగాయి. రెండవ దఫా అల్లర్లు 1993 జనవరి 6వ తేదీన మొదలయి 20వ తేదీ దాకా సాగాయి. మొత్తం (అధికార లెక్కల ప్రకారం) 900 మంది చనిపోయారు. వీరిలో 575 మంది ముస్లింలు, 275 మంది హిందువులు కాగా 50 మంది మతం ఏదైనదీ తెలీదు. అల్లర్లలో గాయపడిన వారు 2036 మంది. అందులో 1105 మంది ముస్లింలు, 893 మంది హిందువులు కాగా 38 మంది మతం తెలీదు. చావులకు గల కారణాలు ఈ విధంగా ఉన్నాయి.

| | |
|---|---|
| పోలీసుల కాల్పులు | 356 |
| కత్తిపోట్లు | 347 |
| సజీవదహనం | 91 |
| దొమ్మీ | 80 |
| ఇతరములు | 26 |
| మొత్తం | 900 |

శ్రీకృష్ణ కమిషన్ తన పని మొదలుపెట్టక ముందే ఈ అల్లర్ల గురించి ఒక వ్యాఖ్య ప్రచారంలోకి వచ్చేసింది. మొదటి దఫా అల్లర్లు మసీదు కూల్చివేతకు ప్రతీకారంగా ముస్లింలు పాల్పడిన హింసాకాండేననీ, మసీదు కూల్చివేత గురించి తెలియగానే వాళ్లు ముంబాయి నగరవీధులలోకి వచ్చి హిందువుల పైన, పోలీసుల పైన సంఘటితంగా దాడులకు పాల్పడ్డారనీ ఈ వ్యాఖ్య చెప్తుంది. రెండవ దఫా అల్లర్లు కూడ ముస్లింలు అమాయకులయిన హిందువుల పైన ప్రయోగించిన హత్యాకాండతో మొదలయింది కానీ అప్పటిదాకా సహించిన హిందువులు ఇక సహించలేక ప్రతీకారానికి పూనుకోవడం రెండవ ఘట్టంలోని ప్రధాన అంశమని ఈ వ్యాఖ్య అంటుంది.

మొదటి దఫా హింసాకాండలో (అంటే 1992 డిసెంబర్ 6-12 తేదీల నాటి ఘటనలలో) ముస్లింలు చొరవ తీసుకున్న ఘటనలు ఎక్కువ, రెండవదఫా (అంటే 1993 జనవరి 6 -20 తేదీల నాటి ఘటనలలో) హిందువులు హింసకు పాల్పడిన ఘటనలు ఎక్కువ అనేది వాస్తవమే. అంతేకాక ముస్లింల హింసాకాండ హిందువుల పైననే కాక పోలీసుల పైన కూడ ఎక్కుపెట్టబడిందనేది వాస్తవమే. అందువల్ల పై వ్యాఖ్య చాలా సహజమైనదిగా కనిపిస్తుంది.

కానీ దీనికి కనీసం మరొక నాలుగు విషయాలను జోడించనిదే చిత్రం పూర్తికాదనీ, పూర్తయిన ఆ చిత్రానికీ పై వ్యాఖ్యకూ ఉన్న పోలిక స్వల్పమేననీ శ్రీకృష్ణ కమిషన్ సవివరంగా చూపించగలిగింది.

(i) ముస్లింల వైపు నుండి జరిగిన హింసాకాండ ఎక్కువగా అసంఘటితంగా జరిగింది. ముస్లింలలోనూ మతతత్వ సంస్థలున్నాయి. కానీ జరిగిన హింస వారి కుట్రల ఫలితం కాదు. బాబ్రీ మసీదు కూల్చివేత పట్ల ముస్లింలలో స్పాంటేనియస్‌గా పెల్లుబికిన ఆగ్రహం ఫలితం. (దీని అర్థం ఆ హింసను శ్రీకృష్ణ కమిషన్ సమర్థించిందని కాదు.) హిందువుల వైపు నుండి జరిగిన హింస మాత్రం అత్యధిక భాగం సంఘటితంగా, కుట్ర పూరితంగా జరిగింది. శివసేన దానికి ప్రధానంగా నాయకత్వం వహించింది.

(ii) ముందు వీళ్లు చేసారు, తరువాత వాళ్లు చేసారు, పోలీసులు ఇద్దరినీ అదుపు చేయలేకపోయారు అనే ఈ చిత్రంలో కనిపించని విషయమేమిటంటే పోలీసుల వైఖరి ఎంత మాత్రం నిష్పాక్షికం కాదు. పోలీసుల వ్యవహారశైలిలో ముస్లిం వ్యతిరేకత కొట్టొచ్చినట్టు కనిపించిందనేది జస్టిస్ శ్రీకృష్ణ సోదాహరణంగా చెప్పిన విషయాలలో ఒకటి.

(iii) ముంబాయి పోలీసులలో ముస్లిం వ్యతిరేకత ఉండడమే కాదు, శివసేన హింసాకాండ పట్ల 'ఉదార' వైఖరి కూడ స్పష్టంగా ఉండింది. వారి రెచ్చగొట్టే ఉపన్యాసాలనూ ఊరేగింపులనూ 'మహా ఆరతి' కార్యక్రమాలనూ పోలీసులు కర్ఫ్యూలో సహితం అనుమతించారు. శివసేనకు చెందిన దుండగుల పేర్లు బాధితులు స్పష్టంగా చెప్పినా వారిని అరెస్టు చేయలేదు.

(iv) శివసేనకు చెందిన మరాఠీ పత్రికలు కొన్ని ఘటనలను విపరీతంగా ప్రచారం చేయడం ద్వారా, కొన్ని అభూత కల్పనలను ప్రచారం చేయడం ద్వారా

ముస్లింల పట్ల ద్వేష భావాన్ని రెచ్చగొట్టడంలో కృతకృత్యులయ్యాయి. ఉదాహరణకు అల్లర్లలో ఐ.ఎస్.ఐ (పాకిస్తాన్ గూఢచారి సంస్థ) హస్తం ఉందన్న అభిప్రాయాన్ని వాళ్లు ఎంతగా ప్రచారం చేసారంటే అప్పటి మహారాష్ట్ర గవర్నర్ సి. సుబ్రహ్మణ్యం సహితం దానిని సత్యమని నమ్మి తన దగ్గర ఏవో ఆధారాలున్నట్టు పత్రికల వారితో 'అల్లర్లలో ఐ.ఎస్.ఐ హస్తం ఉంది' అని ప్రకటించాడు. కానీ నిజానికి ముంబాయి పోలీసుల పరిశోధనలో అటువంటిదేమీ వెల్లడి కాలేదని జస్టిస్ శ్రీకృష్ణ నిరూపించగలిగారు.

ఈ కోణాలన్నిటినీ చేర్చి, అప్పటికి ప్రచారంలో ఉన్న 'వాళ్లు మొదలుపెట్టారు, వీళ్లు ప్రతీకారం తీర్చుకున్నారు' అన్న వాదన వాస్తవం కాదని జస్టిస్ శ్రీకృష్ణ చూపించినందుకే ఆయనగారి నివేదిక మీద మహారాష్ట్ర ముఖ్యమంత్రి మనోహర్ జోషి విరుచుకుపడ్డాడు. 'అది హిందూవ్యతిరేక నివేదిక' అన్నాడు. 'దానిని ఆమోదించడానికి నేనేం పాకిస్తాన్ ప్రధానమంత్రిని కాను' అన్నాడు. మనోహర్ జోషి తనను తాను మహారాష్ట్రలోని హిందువుల ముఖ్యమంత్రిగా భావిస్తున్నాడు తప్ప అందరి ప్రతినిధిగా భావించడం లేదని దీనిని బట్టి అర్థం అవుతుంది. ఈ వైఖరిని హిందువులలో కూడ శివసేన-బిజెపిల అనుయాయులను మినహాయించి తక్కిన ముంబాయి నగరవాసులు ఆమోదించారని భావించడానికి ఆధారాలేమీ లేవు.

## శివసేన పాత్ర - మొదటి ఘట్టం

1992 డిసెంబర్ 6 నాడు అయోధ్యలో హిందుత్వవాద సంఘ్ పరివార సంస్థలు బాబ్రీ మసీదును కూల్చివేసారని విని ముంబాయి ముస్లింలు రెచ్చిపోయి వీధులలోకి రావడం 'ముంబాయి అల్లర్ల' తొలి సంఘటన. కానీ ఇందులో కూడ హిందుత్వవాద సంస్థల పాత్ర ఉంది. వాళ్లు ముంబాయి నగరంలో 'విజయోత్సవ యాత్రలు' తీసి, సభలు నిర్వహించి ముస్లింలకు పుండు మీద కారం చల్లినట్లు చేయడంతో ముస్లింల ఆగ్రహం మరింత పెరిగింది.

నిజానికి ఆనాటి సభలు, ఊరేగింపులను పక్కన పెట్టినా, ముంబాయి ముస్లింలు ఆగ్రహంతో స్పందించింది ఎక్కడో అయోధ్యలో జరిగిన కూల్చివేతకేనని కూడ అనలేము. అప్పటికే దాదాపు 6 నెలలుగా విశ్వహిందూ పరిషత్, శివసేన వంటి సంస్థలు ముంబాయి నగరంలో వీధి వీధినా సభలూ సమావేశాలూ నిర్వహిస్తున్నాయి.

అయోధ్యలో రామమందిర నిర్మాణం పేరు మీద నిర్వహించిన ఈ కార్యక్రమాలలో ముస్లింల మీద ద్వేషం కక్కడం ప్రధాన విషయం. 'హిందుస్తాన్ హిందువులది. ఎవడి అయ్యదీ కాదు' అనీ, 'ఈ దేశంలో ఉండదలచుకుంటే వందేమాతరం అనవలసి ఉంటుంది' అనీ నినాదాలు ఇచ్చిన ఈ సభలలో వక్తల ఉపన్యాసాలు ముస్లింల మీద విషం కక్కాయని కమిషన్ అంటుంది.

మరాఠీలోనూ హిందీలోనే కాక తమిళంలో కూడ విద్వేష సాహిత్యం ప్రచురించారు. 1992 అక్టోబర్ 12 నాడు ముద్రించిన ఒక (తమిళ) కరపత్రంలో 'ముస్లింల పూర్వీకులు ఈ దేశాన్ని దోచుకోవడానికి దండెత్తి వచ్చారు' అనీ, 'దేశాన్ని దోచుకోవడం, తమ మతాన్ని ప్రచారం చేసుకోవడం తప్ప వారికి వేరే లక్ష్యమేదీ లేదు' అనీ అన్నారు.

1992 జూలై–డిసెంబర్ నెలల మధ్య కాలంలో ముంబాయి నగరంలో ప్రతీ వీధిలో ప్రతీ చౌరస్తాలో హిందుత్వవాద సంస్థలు డిసెంబర్ 6 కు నాందిగా రామపాదుక పూజలు, ఘంటానాద కార్యక్రమాలూ నిర్వహించాయి. ఈ కార్యక్రమాలలో ముస్లింల పైన ద్వేషం కక్కడం ప్రధాన ఉపన్యాస విషయం. పైధోనీ ప్రాంతంలో అక్టోబర్ 23 నాడు ఇటువంటి ఒక కార్యక్రమంలో ప్రఫుల్ దేశాయి అనే హిందుత్వవాద నాయకుడు 'ప్రతీ ఒక్కరిలో నిద్రాణంగా ఉన్న రాముడిని మేల్కొలుపుతాం. ఒక్క రామద్రోహినీ విడిచిపెట్టకుండ తరిమికొడతాం' అంటూ ఇచ్చిన ఉపన్యాసాన్ని జస్టిస్ శ్రీకృష్ణ ఉదహరించి, విద్వేషాన్ని రెచ్చగొట్టే ఇటువంటి ఉపన్యాసాలను ఆపడానికి గానీ, కేసులు పెట్టడానికి గానీ పోలీసులు ఏ ప్రయత్నమూ చేసినట్టు లేరని అభిశంసించారు.

అయోధ్య గురించి ప్రచారం చేసే ఈ కార్యక్రమాలను ఎందుకు అదుపు చేయలేదని జస్టిస్ శ్రీకృష్ణ తన ఎదుట హాజరయిన పోలీస్ అధికారులను ప్రశ్నించగా, అవి కేవలం మతపరమైన కార్యక్రమాలు కాబట్టి శాంతి భద్రతల నిర్వహణ పరిధిలోకి రావని తాము భావించామని అన్నారు. చివరికి డిసెంబర్ 6 నాడు ఒక పక్క అయోధ్యలో 'కరసేవ' జరుగుతుండగా కూడ, దానికి మద్దతుగా ముంబాయి నగరంలో విశ్వహిందూపరిషత్ నిర్వహించిన ఘంటానాద కార్యక్రమాలను సహితం పోలీసులు అడ్డుకోలేదని జస్టిస్ శ్రీకృష్ణ అభిశంసించారు.

డిసెంబర్ 6 కు ముందు నగరంలోని అన్ని ప్రాంతాలలోనూ నడిచిన ఈ కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకోకుండ మసీదు కూల్చివేత పట్ల ముంబాయి నగర ముస్లింలు స్పందించిన తీరును అర్థం చేసుకోలేము.

6వ తేదీనాడు కూడ అక్కడ అయోధ్యలో బాబ్రీ మసీదు కూలిపోగానే ఇక్కడ ముంబాయిలో హిందుత్వవాద సంస్థల విజయోత్సవ సభలు మొదలయ్యాయి. ఆనాటి మధ్యాహ్నం 2.30 గంటలకే ముంబాయిలోని ధారవి ప్రాంతంలో శివసేనవారు విజయోత్సాహంతో సైకిల్ ర్యాలీ తీసారు. రెండు లేక మూడు వందల మంది శివ సైనికులు పనిగట్టుకుని ముస్లింలు అధికంగా నివసించే వీధులలో ర్యాలీ తీసి కాలా ఖిల్లా దగ్గర సభ నిర్వహించారు. రెచ్చగొట్టే ఉపన్యాసాలు ఇచ్చారు. పైధోనీ ప్రాంతంలో కూడ విజయానికి సంకేతంగా ఘంటానాద కార్యక్రమం నిర్వహించారు. డోంగ్రీ ప్రాంతంలో డిసెంబర్ 5వ తేదీన నాలుగు రోడ్ల కూడలిలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మరుసటి రోజు జరగబోయే కూల్చివేత కార్యక్రమం గురించి సభ జరిగింది. 6వ తేదీన కూల్చివేత అయిపోగానే లల్‌కార్ ఘంటానాద కార్యక్రమం జరిగింది.

1992 జూలై నెల నుండి ముంబాయి నగరంలో జరుగుతున్న ఈ రెచ్చగొట్టే కార్యక్రమాలను పోలీసులు లెక్కలోకి తీసుకోకపోవడాన్ని, వాటిని అదుపు చేసే ప్రయత్నమేమీ చేయలేకపోవడాన్ని జస్టిస్ శ్రీకృష్ణ తీవ్రంగా తప్పుపట్టారు. ముస్లింల స్పందన అంత తీవ్రంగా ఉండడానికి ఇదొక ముఖ్యమైన కారణమని అభిప్రాయపడ్డారు. హిందుత్వవాద నాయకులిచ్చిన ఉపన్యాసాలను ప్రస్తావిస్తూ, 'వాటి పర్యవసానం ప్రమాదకరంగా ఉండగలదని పోలీసులు ఊహించలేక పోయారంటే అది వాళ్ల అమాయకత్వమయినా కావాలి, తెలివితక్కువతనమైనా కావాలి, పక్షపాత ధోరణి అయినా కావాలి' అంటారు.

ఈ నేపథ్యంలో డిసెంబర్ 6 రాత్రి 11 గంటల తరువాత ముంబాయి నగరంలోని వివిధ ప్రాంతాలలో ముస్లింలు కోపంగా వీధులలోకి వచ్చారు. అయితే ఆ రోజు వాళ్ల చేతులలో రాళ్లుగానీ కర్రలుగానీ లేవు. అవి కేవలం నిరసన ప్రదర్శనలు మాత్రమే. పోలీసులు ఈ విషయాన్ని అర్థం చేసుకొని నేర్పుగా వ్యవహరించి ఉంటే శాంతియుతంగా మొదలయిన ఈ ప్రదర్శనలు శాంతియుతంగానే ముగిసేవేమోగానీ పోలీసుల దురుసు ప్రవర్తన వల్ల శాంతియుతమైన ప్రదర్శనలు హింసాత్మకంగా

మారాయని జస్టిస్ శ్రీకృష్ణ అభిశంసించారు. హిందుత్వవాదులు అప్పుడయినా ఊరుకొని, వ్యవహారాన్ని పోలీసులకు విడిచి పెడితే బాగుండేది గానీ, ముస్లింల నిరసన ప్రదర్శనలకు జవాబుగా అన్నట్టు బిజెపి, శివసేన కార్యకర్తలు వీధులలోకి వచ్చి రాస్తారోకోలు నిర్వహించడం ముస్లింల ఆగ్రహాన్ని మరింత పెంచిందని కూడ ఆయన వ్యాఖ్యానిస్తారు.

## 1992 డిసెంబర్ 6 – 12 నాటి ఘటనలు

ఇది ముంబాయి అల్లర్ల తొలి ఘట్టం.

'డిసెంబర్ 1992లో ముస్లింలు పాల్పడిన దొమ్మీలను పరిశీలిస్తే అవన్నీ కూడ కోపోద్రిక్తులయిన ముస్లింల గుంపులు ఎవరి నాయకత్వం లేకుండ తమంతట తాము స్పందించిన ఘటనలేనని సాక్ష్యాలు తెలియచేస్తాయి. ఈ స్పందన శాంతియుతంగా మొదలయి త్వరలో దొమ్మీలకు దిగజారింది. హిందువులు విజయోత్సవ సభలు, రెచ్చగొట్టే నినాదాలు, రాస్తారోకోలు చేపట్టి ముస్లింలను రెచ్చగొట్టడం ద్వారా కొంతవరకు తాము కూడ ఈ దొమ్మీలకు బాధ్యులయ్యారు. హిందువులు చేపట్టిన ఈ కార్యకలాపాలన్నీ అధికభాగం శివసేన కార్యకర్తలు, కొంతమేరకు భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు నిర్వహించారు' అని ఈ ఘట్టాన్ని గురించి శ్రీకృష్ణ అభిప్రాయపడ్డారు.

బాబ్రీ మసీదును కూల్చివేసిన విషయం 6వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు ముంబాయిలో తెలిసింది. సాయుధ బలగాల సమక్షంలోనే హిందువులు ఆ విధ్వంసానికి పాల్పడగలిగారనీ, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వమే కాక కేంద్రప్రభుత్వం కూడ ఆ మసీదుకు ఏ హానీ జరగదంటూ ఇచ్చిన హామీకి భిన్నంగా ఇది జరిగిందనీ ముస్లింలు రెచ్చిపోయారు. ఇస్లాం ప్రమాదంలో పడిందంటూ ఇస్లామిక్ మతతత్వవాదులు ముస్లింలలో ఉద్రిక్తత రేకెత్తించగలిగారు. వివిధ టెలివిజన్ ఛానెల్స్ చూపించిన దృశ్యాలు కూడ ముస్లింలను ఏ విధంగా రెచ్చగొట్టాయో జస్టిస్ శ్రీకృష్ణ వివరించారు. కేంద్ర రిజర్వ్ పోలీసు బలగాలు కళ్లప్పగించి చూస్తుండగా దుండగులు మసీదును కూల్చిన ఘటనను తెరమీద చూసినవారు ఆగలేక పోయారు. పైగా అంతకు ముందు సంవత్సరం మసీదు మీదకు ఎక్కి 'కరసేవకులు' గెంతులు వేసిన ఫిలింను కూడ ఫైల్ నుండి తీసి 6వ తేదీన టీవీ ఛానెల్స్ చూపించాయి.

ఇది చాలదన్నట్టు ధారవి వంటి ప్రాంతాలలో హిందుత్వవాదులు వెంటనే విజయోత్సవ ర్యాలీలు తీయడం కూడ ముస్లింలకు పుండు మీద కారం జల్లినట్లు అయింది. అయినా 6వ తేదీన వీధులలోకి వచ్చి నిరసన తెలిపిన ముస్లింలు శాంతియుతంగానే ఆ పని చేశారు. పోలీసులు వెంటనే ఇరుపక్షాల నాయకులనూ సమావేశపరచి శాంతి సాధన కోసం కృషి చేసి ఉంటే పరిస్థితి ఏ విధంగా ఉండేదో గానీ వాళ్లు అలవాటు ప్రకారం దౌర్జన్యంగా గుంపులను చెదరగొట్టే ప్రయత్నం చేయడంతో శాంతియుతమైన నిరసన హింసాత్మక రూపం తీసుకునే పరిస్థితి ఏర్పడిందని జస్టిస్ శ్రీకృష్ణ అన్నారు.

6వ తేదీ రాత్రి నిర్మల్ నగర్‌లోని అనంత్ కానేకర్ మార్గ్‌లో ఒక వినాయకుడి గుడిలో విగ్రహం తల ఎవరో నరికేసారు. రాత్రి 11.45 గంటలకు ఈ విషయాన్ని గమనించడం జరిగింది. ఈ పని చేసింది ముస్లింలే అయి ఉంటారని అందరూ భావించారు. దేవనార్ ప్రాంతంలో ఒక భారతీయ జనతా పార్టీ నాయకుడి ఇంటి పైన ముస్లింల గుంపు రాళ్లు వేసారు. వాళ్లను అదుపు చేయడానికి ప్రయత్నించిన పోలీసులపైన వాళ్లు కోపంగా తిరగబడ్డారు. పోలీసులు పెద్దఎత్తున కాల్పులు జరిపారు. ఇది ముస్లింలకు ఆగ్రహం కలిగించింది.

7, 8 తేదీలలో హింస చాలా జరిగింది. ముస్లింలు మారణాయుధాలతో విధ్వంసానికి దిగడం, హిందువులు వాళ్లతో తలపడడం, అవి దొమ్మీగా మారడం నగరమంతటా జరిగింది.

ఉదాహరణకు బైకుల్లా పోలీస్ స్టేషన్ పరిధిలో డిసెంబర్ 7వ తేదీన 500 లేక 600 మంది ముస్లిం యువకులు బంద్ నిర్వహించే ఉద్దేశ్యంతో వాహనాల టైర్లకు గాలి తీయడం మొదలుపెట్టారు. వాళ్లను అదుపుచేసే పని పోలీసులకు విడిచిపెట్టకుండ హిందువులు పెద్దగుంపుగా వీధిలోకి వచ్చి బంద్ నిర్వాహకులతో తలపడ్డారు. దీనితో ముస్లింల నిరసన ప్రదర్శన ఇరువర్గాల దొమ్మీగా మారింది.

ముస్లింలు మెజారిటీగా ఉన్న దేవనార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోనూ డిసెంబర్ 6వ తేదీన అయోధ్యలో జరుగుతున్న కరసేవకు మద్దతుగా హిందుత్వవాద పార్టీలు ముస్లింలను రెచ్చగొడుతూ ఘంటానాద కార్యక్రమం నిర్వహించారు. 7వ తేదీన

ముస్లింలు ఎక్కడ నిరసన తెలపడానికి బయటి కొచ్చినా హిందువుల గుంపులు వారితో తలపడ్డారు. దొమ్మీలు చాలా జరిగాయి.

ధారవి ప్రాంతంలోనూ ఇదే జరిగింది. డిసెంబర్ 6 సాయంత్రం శివసేన వారు బాబ్రీ మసీదు కూల్చివేత పట్ల హర్షం తెలియజేస్తూ సైకిల్ ర్యాలీ తీసారని పైన చెప్పాము. మత ఘర్షణల చరిత్ర ఉన్న ధారవిలో ఈ ర్యాలీకి ఎందుకు అనుమతి ఇచ్చారని పోలీసులను కమిషన్ ప్రశ్నించగా, తాము అనుమతి నిరాకరించామని సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఘాగ్రె కమిషన్‌తో అన్నాడు. కానీ అతను కమిషన్‌కు చూపించిన రికార్డు మొత్తం కల్పించినదనీ, సాక్ష్యం కోసం తయారు చేసినదనీ జస్టిస్ శ్రీకృష్ణ నిర్మొహమాటంగా అన్నారు. అయినా, 'అనుమతి నిరాకరించిన' ఈ ర్యాలీకి బందోబస్తుగా పోలీసులు వారి వెంట నడిచిన మాట వాస్తవమే! ర్యాలీలో ఇచ్చిన నినాదాలు : 'కత్తి బయటకు తీసాం, మందిరం అక్కడే కడతాం', 'రాముని మీద ఒట్టు, మందిరం అక్కడే కడతాం', 'లుంగీ చేతపట్టుకొని నోట్లో పాన్ పెట్టుకొని తురకోడా పాకిస్తాన్ పారిపో', 'హిందుస్తాన్‌లో ఉండదలచుకుంటే హిందువయి ఉండాలి', 'శివసేన జిందాబాద్', 'బాల్ థాకరే జిందాబాద్', మొదలయినవి.

మరుసటి రోజు (అంటే డిసెంబర్ 7వ తేదీ) ముస్లింలు ధారవి ప్రాంతంలో నిరసన ప్రదర్శన తీసారు. అది శాంతియుతంగానే సాగింది. పోలీసులు పక్కనే ఉన్నారు. కానీ ప్రదర్శన షాహూనగర్ మీదుగా బిస్మిల్లా హోటల్ జంక్షన్ దగ్గరకు వచ్చేసరికి హిందువులు మెజారిటీగా నివసించే కోలీవాడ నుండి ప్రదర్శకుల మీద రాళ్లు పడ్డాయి. దానితో ప్రదర్శకులు రెచ్చిపోయి తిరిగి రాళ్లు వేసారు. పోలీసులు లాఠీఛార్జి చేసారు. ప్రదర్శకులు పోలీసుల పైన కూడ రాళ్లు వేసారు. పోలీసులు కోలీవాడ హిందువులను రెచ్చగొట్టి ఇంకా రాళ్లు వేయించారు. దానితో ప్రదర్శనగా మొదలయినది వేగంగా దొమ్మీగా మారింది.

జోగేశ్వరి పోలీస్ స్టేషన్ పరిధిలో కూడ డిసెంబర్ 7వ తేదీన ముస్లింల గుంపు బాబ్రీ మసీదు కూల్చివేత పట్ల నిరసన తెలుపుతూ సమావేశం కాగానే, వాళ్లను చూసి హిందువుల గుంపు కూడ సమావేశమై వారిని ఎదుర్కొనింది. ఒకరి మీద ఒకరు రాళ్లు వేసుకోవడంతో మొదలయిన ఘర్షణ దొమ్మీగా మారింది.

డిసెంబర్‌లో జరిగిన హింస అంతా ముస్లింల చొరవతో మొదలయినదే కాదు అనడానికి చాలా నిదర్శనాలు ఉన్నాయి. ఉదాహరణకు కాలాచౌకి పోలీస్‌స్టేషన్ పరిధిలో డిసెంబర్‌లో ముస్లింలవైపు నుండి జరిగిన హింస ఏదీ లేదు గానీ, డిసెంబర్ 9న ఒక ముస్లింకు చెందిన లారీని, 10వ తేదీన ఒక ముస్లింకు చెందిన స్కూటర్‌ను, మరొక ముస్లింకు చెందిన గోడౌన్‌ను తగలబెట్టడం జరిగింది. ఒక ముస్లిం యాజమాన్యంలో ఉన్న ఇండస్ట్రియల్ ఎస్టేట్‌ను లూటీ చేయడం కూడ జరిగింది.

ఖేర్వాడి పోలీస్‌స్టేషన్ పరిధిలోనూ ముస్లింలు మెజారిటీగా ఉన్న ప్రాంతాలలో డిసెంబర్ 7వ తేదీన ముస్లింల గుంపులు పోలీసులపైన, హిందువులపైన హింసకు పాల్పడగా హిందువులు మెజారిటీగా ఉన్న ప్రాంతాలలో 8వ తేదీన ముస్లింల ఇళ్లపైన, అంగళ్ల పైన దొమ్మీ, లూటీ జరిగాయి.

మాహిం పోలీస్‌స్టేషన్ పరిధిలోనూ డిసెంబర్‌లో జరిగిన దొమ్మీ, లూటీలలో ధ్వంసమయిన 748 ఇళ్లు, అంగళ్లలో 413 ముస్లింలవి కాగా 268 హిందువులవి, మిగిలినవి క్రైస్తవులవి, ప్రభుత్వానివి.

7వ తేదీన నగరంలోని వివిధ ప్రాంతాలలో ముస్లింలు 11 హైందవ దేవాలయాలను ధ్వంసం చేసారు (కొన్నిటిని పాక్షికంగా పాడు చేసారు. కొన్నిటిని పూర్తిగా ధ్వంసం చేసారు. కొన్నిటిని దహనం చేసారు). హిందువులు కూడ కొన్ని మసీదులను, మదరసాలను ధ్వంసం చేసారు. ఈ హింసను, దొమ్మీలను అదుపు చేయడానికి పోలీసులు 72 సందర్భాలలో కాల్పులు జరపగా 72 మంది ముస్లింలు, 20 మంది హిందువులు చనిపోయారు. గాయపడిన 132 మందిలో 131 మంది ముస్లింలే.

ముస్లింల గుంపులు దేవనార్‌లోనూ బైకుల్లాలోనూ మొత్తం ముగ్గురు పోలీసులను హతమార్చారు. దేవనార్‌లో చంపిన ఇద్దరినీ కత్తులతో తెగనరికి చంపారు. ఒక శవం ఏడు రోజుల తరువాత గానీ దొరకలేదు.

8వ తేదీన ఇదే వరస కొనసాగింది. దొమ్మీలు 33 పోలీస్‌స్టేషన్ల పరిధికి వ్యాపించాయి. పోలీసులు 43 చోట్ల జరిపిన కాల్పులలో 31 మంది ముస్లింలు, 21 మంది హిందువులు చనిపోయారు (మరొక ముగ్గురు మృతుల మతం తెలీదు). ధారవిలో

ఒకటి, దేవనార్‌లో నాలుగు, పార్క్‌సైట్‌లో ఒకటి, సాకినాకాలో ఒకటి మొత్తం ఏడు హిందూ దేవాలయాలను ముస్లింల గుంపులు ధ్వంసం చేసాయి. హిందువుల గుంపులు ధారవిలో రెండు మసీదులను, మాహింలోనూ భోయివాడ లోనూ ఒక్కొక్క మదరసాను, దాదర్లో ఒక దర్గాను ధ్వంసం చేసారు.

9వ తేదీన కూడ దొమ్మీలు, కత్తిపోట్లు కొనసాగాయి. పోలీసులు 28 సందర్భాలలో జరిపిన కొల్పులలో 12 మంది ముస్లింలు, అయిదుగురు హిందువులు చనిపోయారు. ఘట్‌కోపర్‌లో రెండు హిందూ దేవాలయాలు, ట్రాంబేలో ఒక మసీదు, జోగేశ్వరిలో ఒక కబరస్తాన్ (ముస్లింల శ్మశానవాటిక) ధ్వంసం చేయబడ్డాయి.

10వ తేదీ తరువాత పరిస్థితి అదుపులోకి వచ్చింది. అక్కడక్కడ ఒక్కొక్క ఘటన జరుగుతూనే ఉన్నా పెద్దఎత్తున దొమ్మీలు లేవు. కత్తిపోట్ల ఘటనలలో 11వ తేదీన, 12వ తేదీన మొత్తం 8 మంది హిందువులు, ఇద్దరు ముస్లింలు చనిపోయారు.

ఆ తరువాత అల్లర్లు చల్లారిన నేపథ్యంలో పోలీసుల మీద తీవ్రమైన విమర్శ వ్యక్తమయింది. కాల్పులలో ఎక్కువగా ముస్లింలు చనిపోవడానికి కారణం పోలీసులు పనిగట్టుకొని ముస్లింలను చంపడమేనని ముస్లిం మతనాయకులే కాదు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పత్రికలు విమర్శించాయి.

దీనికి పోలీసులు కమిషన్ ముందు చెప్పిన సమాధానమేమిటంటే, మొదటి దఫా అల్లర్లలో ఎక్కువగా హింసకు పాల్పడింది ముస్లింలే కాబట్టి కాల్పులలో ఎక్కువగా ముస్లింలు చనిపోవడం సహజం అని. చనిపోయిన వారికీ గాయపడిన వారికీ తూటాలు మోకాలి కింద కాక ఛాతీ భాగంలోనూ తలలోనూ తగలడానికి గల కారణాన్ని కూడ పోలీసులు కమిషన్ ముందు వివరించారు. కదులుతూ, మారణాయుధాలతో దొమ్మీలకు పాల్పడుతున్న వారి పైన కాల్పులు జరిపినప్పుడు ఎంత జాగ్రత్తగా కాల్పులు జరిపినా మోకాలి పై భాగంలో తూటాలు తగలవన్న భరోసా ఉండడం కష్టం అన్నారు.

ఇవి పూర్తిగా తీసిపారేయగల జవాబులు కావని జస్టిస్ శ్రీకృష్ణ భావించారు. ఒక్కొక్క ఘటనలోనూ పోలీసులు అవసరానికి లోబడి మాత్రమే కాల్పులు జరిపారా లేదా అనేది వేరే సంగతి గానీ, కావాలని ముస్లింలను కాల్చి చంపారని భావించడానికి ఆధారాలు లేవని అన్నారు. అయితే,

*'పోలీసుల ప్రవర్తనలో ముస్లింల పట్ల వ్యతిరేకత వేరే రూపాలలో వ్యక్తమయింది. దానికి సాక్ష్యాలున్నాయి. వాళ్ల పట్ల దురుసుగా ప్రవర్తించడం, ముస్లింలు ఇచ్చిన ఫిర్యాదులు కాగ్నైజబుల్ నేరాలయినా నమోదు చేసుకోకపోవడం, నమోదు చేసుకున్న కేసులు కూడ 'ఆధారాలు దొరకలేదు' అంటూ సులభంగా మూసేయడం జరిగింది. పోలీసుల మనస్సులలో ముస్లింల పట్ల ఒక సాధారణ వ్యతిరేకత ఉండింది. ముస్లింలతో వాళ్లు ప్రవర్తించిన పద్ధతిలో అది వ్యక్తం అయింది. ఆ సంగతి అడిషనల్ పోలీస్ కమీషనర్ వి.ఎన్. దేశ్‌ముఖ్ సహితం ఒప్పుకున్నారు. 1993 జనవరిలో ఈ వైఖరి మరింత నిర్దిష్ట రూపం తీసుకుంది' అని జస్టిస్ శ్రీకృష్ణ అంటారు.*

నిజానికి 1993 జనవరిలో – అంటే ముంబాయి అల్లర్ల రెండవ ఘట్టంలో – పోలీసులలోని ముస్లిం వ్యతిరేకత ఎంత తీవ్ర రూపం తీసుకుందంటే కాల్పులు జరిపినప్పుడు కూడ వారిని చంపే ఉద్దేశ్యంతోనే కాల్చారని జస్టిస్ శ్రీకృష్ణ నమ్మారు. ఆ విషయం దిగువ చూద్దాం.

## రెండవ ఘట్టానికి నాంది

ముంబాయి అల్లర్ల రెండవ ఘట్టం 1993 జనవరి 6 నుండి మొదలయింది. దీనికి నాంది ఏమిటన్న విషయాన్ని గురించి శివసేన ఒక పద్ధతి ప్రకారం ప్రచారం చేసింది. ముస్లింలు పెద్దఎత్తున హత్యాకాండ కొనసాగించడానికి సన్నద్ధమయ్యారనీ, అందులో పాకిస్తాన్ గూఢచారి సంస్థ ఐ.ఎస్.ఐ పాత్ర ఉందని ప్రచారం చేసారు. రెండు ఘటనలను దీనికి ఉదాహరణగా ప్రచారం చేసారు. ఈ ప్రచారం ఎంత సమర్థంగా జరిగిందంటే సాధారణ దినపత్రికలు, సామాన్య పరిశీలకులు సహితం ఈ రెండు ఘటనలే జనవరి అల్లర్లకు నాంది అని నమ్మారు. ఈ రెండింటిలోనూ దోషిత్వం ముస్లింలకే ఆపాదించబడింది కాబట్టి ఈ ప్రచారం ఫలితంగా 'తప్పు' మళ్లీ ముస్లింలదే అయింది. జనవరి అల్లర్లలో అత్యధికంగా దెబ్బతినింది, భీతావహులయినది ముస్లింలే కాబట్టి, హిందుత్వవాద సంస్థలు తమ మీద నింద పడకుండ తప్పించుకోవాలంటే ఈ రకమైన చిత్రం ఇయ్యవలసి వచ్చింది. ఆ పని చాలా విజయవంతంగా చేసారు.

కాని జస్టిస్ శ్రీకృష్ణ విషయాన్ని లోతుగా పరిశీలించి, శివసేన ప్రచారం చేసిన ఆ రెండు ఘటనలే జనవరి అల్లర్లకు నాంది అని భావించడానికి ఆధారమేమీ లేదనీ, ముస్లింలు మొదటి దశలోనయినా రెండవ దశలోనయినా సంఘటితంగా వ్యవహరించారని నమ్మడానికి ఆధారమేమీ లేదనీ, ఐ.ఎస్.ఐ వంటి విదేశీ హస్తం ముంబాయి అల్లర్లలో పని చేసిందని నమ్మడానికి కూడ ఆధారమేమీ లేదనీ సవివరంగా చెప్పారు.

శివసేన ప్రచారం చేసిన రెండు ఘటనలలో మొదటిది జనవరి 5 రాత్రి జరిగింది. (మణిరత్నం తీసిన 'బొంబాయి' సినిమా పుణ్యాన ఈ ఘటనే అల్లర్లకు నాంది అన్న అభిప్రాయం ఈ పాటికి దేశవ్యాప్తంగా నెలకొని ఉంటుంది.) 5వ తేదీ రాత్రి డోంగ్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని విజయ్ ట్రాన్స్‌ఫోర్ట్ కంపెనీ గోడౌన్‌లో పని చేస్తున్న ఒక హమాలీ కార్మికుడు (మరాఠీలో మఠాడి కార్మికుడు అంటారు) రాత్రి నిద్రలేచి మూత్రానికి బయటకు పోగా ఎవరో దుండగులు అతనిని పొడిచి చంపారు. అతని కేకలు విని బయటికొచ్చిన మరి ముగ్గురు హమాలీ కార్మికులను కూడ పొడిచి చంపారు. ఈ నలుగురినీ చంపింది ఎవరో, ఎందుకు చంపారో ఎవరికీ తెలియక పోయినా ఇది ముస్లింలు చేసిన హత్యేనని శివసేన పెద్దెత్తున గొడవ చేసింది. మఠాడి కార్మిక సంఘం తరువాతి రోజు బంద్ పిలుపు ఇచ్చింది. బంద్ పిలుపులో ముస్లింల ప్రస్తావన ఏమీ లేదు. నగరం నలుమూలలా పనిచేసే హమాలీ కార్మికులకు రక్షణ లేకుండ పోయిందనీ, ప్రభుత్వం రక్షణ కల్పించాలనీ పిలుపు ఇచ్చారు. అయితే బంద్ నాడు నిర్వహించిన నిరసన సభలో మాత్రం హిందుత్వవాద వక్తలు ఇది ముస్లింలు చేసిన పనేనంటూ రెచ్చగొట్టే ఉపన్యాసాలు ఇచ్చారు. అప్పటినుండి ఈ 'మఠాడి కార్మికుల హత్య'కు శివసేన ప్రచారంలో ముఖ్య స్థానం ఏర్పడింది. ఆ తరువాత జరిగిన ముస్లింల ఊచకోత యావత్తు ఈ ఘటనకు ప్రతిస్పందనగానే చూపించబడింది.

రెండవ ఘటన జనవరి 7-8 తేదీల మధ్యరాత్రి 3-00 గంటల సమయంలో జరిగింది. జోగేశ్వరి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాధాబాయి చౌల్స్‌లో దుండగులు ఒక ఇంటికి బయటినుండి గొళ్లెం పెట్టి తగలబెట్టారు. మంటలలో ఆరుగురు సజీవంగా దహనం అయి చనిపోయారు. చనిపోయింది హిందువులు, చంపినవారు ముస్లింలు. ఇది ఘోరమైన మారణకాండ అనడంలో సందేహమేమీ లేదు. అయితే ఈ ఘటనను

శివసేన వారూ, దినపత్రికలూ విపరీతంగా ప్రచారం చేసి హిందువులను రెచ్చగొట్టడమే కాక, శివసేన కార్యకర్తల ఆధ్వర్యంలో ఒక పద్ధతి ప్రకారం ఆ తరువాత జరిగిన ముస్లింల ఊచకోతను ఈ ఘటనకు హిందువుల ప్రతిస్పందనగా చిత్రీకరించడం వాస్తవాలకు దూరం అని జస్టిస్ శ్రీకృష్ణ విమర్శించారు. అయితే ఈ ప్రచారం ఎంత సమర్థంగా జరిగిందంటే శివసేన వారే కాదు, అప్పటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి (కాంగ్రెస్ పార్టీ) సుధాకరరావు నాయక్, అప్పటి ముంబాయి నగర పోలీస్ కమీషనర్ శ్రీకాంత్ బాపట్ కూడ ఇదే అభిప్రాయాన్ని ప్రకటించారు.

మతాడి కార్మికుల హత్య (ఇది చేసింది ఏ మతస్తులో అప్పటికి తెలియను కూడ తెలియదు), రాధాబాయి చౌల్స్ మారణకాండలకు హిందువులు 'న్యాయమైన ఆగ్రహంతో స్పందించడమే' జనవరి అల్లర్ల సారాంశం అన్న అభిప్రాయాన్ని (శివసేన, బిజెపిలే కాక పోలీసులు, కాంగ్రెస్ ప్రభుత్వమూ కూడ నమ్మిన అభిప్రాయాన్ని) జస్టిస్ శ్రీకృష్ణ తిరస్కరిస్తూ, 'వాస్తవాలను పరిశీలిస్తే, 1992 డిసెంబర్ 12 నుండి 1993 జనవరి 5 మధ్య ముస్లింల పైన దాడులు జరుగుతూనే ఉన్నాయని గ్రహించగలుగుతాం' అన్నారు. ముస్లింల వైపు నుండి కూడ దాడులు జరిగాయి.

* డిసెంబర్ 15న ఘట్‌కోపర్ ప్రాంతంలో ఒక కట్టెల డిపోను తగలబెట్టగా, నలుగురు ముస్లింలు అందులో సజీవంగా దహనం అయ్యారు.

* డిసెంబర్ 20న గోరేగావ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు ముస్లింలను ఒక గదిలో పెట్టి బంధించి గదికి నిప్పు పెట్టడం జరిగింది. ఇద్దరిలో ఒకరు చనిపోయారు.

* జనవరి 2న తార్‌దేవ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎం.పి.మిల్ కాంపౌండ్‌లోని ముస్లింల గుడిసెలకు నిప్పు పెట్టి దగ్ధం చేయడం జరిగింది.

* జనవరి 4వ తేదీన శివసేన నాయకత్వంలో పెద్దగుంపు జోగేశ్వరి పోలీస్ స్టేషన్‌కు ఊరేగింపుగా పోయారు. హిందువులకు రక్షణ లేకుండా పోయిందనేది వారి ఫిర్యాదు. దారిలో వారు చాచానగర్ మసీదు పైన దాడి చేసి పలువురు ముస్లింలను గాయపరిచారు. మాహిం జంక్షన్లోని మగ్దుంనగర్‌లో వున్న ముస్లింల గుడిసెలను తగలబెట్టారు.

* జనవరి 6 రాత్రి 9.00 గంటల సమయంలో మాహిం ప్రాంతంలో సంజయ్ గవాడె అనే పోలీస్ కానిస్టేబుల్, మిలింద్ వైద్య అనే శివసేన కార్పొరేటర్ నాయకత్వం వహించిన హిందువుల గుంపు చేతిలో కత్తులు పట్టుకొని ముస్లింల పైన దాడులు చేసారు. దీనితో ముస్లింలు కూడ రెచ్చిపోయారు. దాంతో పెద్దఎత్తున ఇరువర్గాలూ తలపడ్డారు.

* ఇదే సమయంలో దక్షిణ ముంబాయికి చెందిన సలీం రాంపురి, ఫిరోజ్ కొంకణి అనే ఇద్దరు వృత్తి నేరస్తుల ఆధ్వర్యంలో హిందువులను కత్తులతో పొడిచి చంపిన సంఘటనలు జరిగాయి. దీనికి ప్రతీకారంగా ముస్లింలను అదే రకంగా పొడిచిన ఘటనలు కూడ జరిగినప్పటికీ ఈ కత్తిపోటు సంఘటనలలో ఎక్కువగా దెబ్బతిన్నది హిందువులే.

మొదటి దఫా అల్లర్లకూ, రెండవ దఫా అల్లర్లకూ మధ్య జరిగిన ఇన్ని ఘటనలలోకి జనవరి 5 రాత్రి జరిగిన మతాడి కార్మికుల హత్యనూ, జనవరి 7–8 మధ్య రాత్రి రాధాబాయి చౌల్స్‌లో జరిగిన మారణకాండనూ వేరు చేసి వాటివల్లనే రెండవ దఫా అల్లర్లు చెలరేగాయని ప్రచారం చేయడంలో అర్థమేమీ లేదని జస్టిస్ శ్రీకృష్ణ అభిప్రాయపడ్డారు. ఈ ప్రచారం కేవలం ఆ తరువాత జరిగిన హింసాకాండను 'హిందువుల న్యాయమైన ఆగ్రహం' అంటూ సమర్థించడానికి పనికొచ్చింది. ఈ వ్యాఖ్యానాన్ని శివసేన, బిజెపిలే కాక కాంగ్రెస్ పార్టీ, మహారాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం కూడ స్వీకరించి ప్రచారం చేయడం వల్ల ఇదే సత్యంగా చలామణి అయింది.

కానీ జస్టిస్ శ్రీకృష్ణ తన ముందు నమోదయిన సాక్ష్యాల ఆధారంగా రెండవ దఫా అల్లర్లను వేరే రకంగా వ్యాఖ్యానించారు. ఆయన దృష్టిలో అది ప్రధానంగా హిందుత్వవాద సంస్థలు ఉద్దేశ్యపూర్వకంగా, ఒక ప్రణాళిక ప్రకారం జరిపిన హింసాకాండ. మతాడి కార్మికుల హత్యను, రాధాబాయి చౌల్స్ మారణకాండనూ కారణంగా చూపించి ప్రచారం చేయడం కూడ ఈ ప్రణాళికలో భాగమనే ఆయన నమ్ముతారు.

డిసెంబర్ 26 నుండి శివసేన ఆధ్వర్యంలో మొదలయిన 'మహా ఆరతి' కార్యక్రమాన్ని ఆయన ప్రముఖంగా ఉదహరిస్తారు. నిజానికి డిసెంబర్ 12 తరువాత అల్లర్లు తగ్గినప్పటి నుండి శుక్రవారం నమాజ్ (ప్రార్థనల)కు ముస్లింలు ఎక్కువ సంఖ్యలో

హాజరుకావడం, బాబ్రీ మసీదు కూల్చివేత గురించి, మైనారిటీల పరిస్థితి గురించి ఆవేశంగా మాట్లాడుకోవడం ముంబాయి నగరంలో పెరిగిందని ఆయన గుర్తించారు. దీనికి సమాధానంగా అన్నట్లు శివసేన ఆధ్వర్యంలో మహా ఆరతులు మొదలయ్యాయి. శుక్రవారం నమాజ్ మీటింగులు ముస్లింలు సంఘటితమవడానికి ఉపయోగ పడుతున్నాయని గుర్తించారేమో, శివసేన మహా ఆరతులలో ప్రధానంగా పెట్టిన డిమాండ్లు నమాజ్ పిలుపు మైకులలో గట్టిగా ఇవ్వడం మానేయాలనీ, మసీదు ఎదుట రోడ్డుకు అడ్డంగా ప్రార్థనలు చేయడం మానేయాలనీ. నమాజ్ సమయంలో మసీదులో చోటు చాలకపోతే రోడ్లోకి వచ్చి ప్రార్థన చేయడం, మైక్ పెట్టి భక్తులను గట్టిగా పిలవడం 'కొత్త విషయాలూ కావు, పైగా ఇతరులకు ఏమంత తీవ్రమైన ఇబ్బంది కలిగించే విషయాలూ కావు' అని జస్టిస్ శ్రీకృష్ణ వ్యాఖ్యానిస్తూ, ఇది కేవలం మహా ఆరతులను రాజకీయ కార్యక్రమంగా చేపట్టడానికి ఒక సాకుగా మాత్రమే ఉపయోగపడిందని అంటారు. మహా ఆరతులలో రెచ్చగొట్టే ఉపన్యాసాలు ఇవ్వడం, మహా ఆరతులకు హాజరయిన వాళ్లు తిరిగి పోతూ పోతూ ముస్లింలపైన దాడులు చేయడం, ముస్లింల నివాసాలు తగలబెట్టడం తరచుగా జరిగిందని జస్టిస్ శ్రీకృష్ణ సోదాహరణంగా వివరించారు. 1997 డిసెంబర్ 26న మొదలయిన మహా ఆరతులు జనవరి నెల హింసాకాండ మధ్య కూడ నిరాఘాటంగా కొనసాగి ఫిబ్రవరి మొదటివారం దాకా నడిచాయి. కర్ఫ్యూలో సహితం పోలీసులు శివసేన మహా ఆరతులకు అంతరాయం కలిగించలేదనేది తరువాత అధ్యాయంలో చూద్దాం.

కాబట్టి, జనవరి అల్లర్లకు కారణమేమిటన్న ప్రశ్నకు శివసేన ప్రచారం చేసిన (మహారాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు, చాలావరకు పత్రికలు అంగీకరించిన) జవాబును తిరస్కరిస్తూ, అది ముస్లింల హింసాకాండకు హిందువుల ప్రతిస్పందన కాదని స్పష్టం చేశారు. మరి జనవరి అల్లర్ల స్వభావం ఏమిటంటే,

> *'1992 డిసెంబర్ 15 నుండి 1993 జనవరి 5 మధ్య అనేక హింసాత్మక ఘటనలు జరిగినప్పటికీ, జనవరి 6 నుండి హిందువులు పెద్దెత్తున దొమ్మీలకూ హింసకూ పాల్పడ్డారు. హిందూ మతతత్వవాద సంస్థల రెచ్చగొట్టే ప్రచారం ఉద్విగ్నతను తారాస్థాయికి తీసుకుపోయింది. సామ్నా, నవకాల్ వంటి వార్తాపత్రికలలోని రచనలు*

*కూడ అదే పని చేసాయి. ఈ హింసాకాండకు శివసేన నాయకత్వం వహించింది. శివసేన ప్రముఖ్ బాల్ థాకరే ఆదేశాలు, రాతలు, శివసేన కార్యకర్తల ప్రకటనలు, చర్యలు మతోన్మాదాన్ని విపరీతంగా రెచ్చగొట్టాయి. అమెరికాకు చెందిన 'టైం' పత్రికకు బాల్ థాకరే ఇచ్చిన ఇంటర్వ్యూ లోనూ, శివసేన నాయకులు మధుకర్ సర్పోట్దార్, మనోహర్ జోషీల 'ప్రతీకార' సిద్ధాంతంలోనూ ఈ వైఖరి ప్రతి ఫలించింది. 'శివసేన బీభత్సమే ప్రజలకు నిజమైన రక్ష' అన్న నినాదం శివసేన కార్యకర్తల హింసాకాండకు సంకేతంగా నిలిచింది' అన్నారు.*

*మరి ముస్లింలు పాల్పడ్డ హింస మాటేమిటి అని అడిగితే, 1992 డిసెంబర్ లాగే "ఈ దశలో కూడ ముస్లింల సంస్థలుగానీ ప్రముఖ వ్యక్తులుగానీ దానికి బాధ్యులనడానికి ఆధారాలేమీ లేవు. చాలామంది ముస్లింలు, ముస్లిం మతస్తులయిన నేరగాళ్లు, హింసకు, దోపిడీకి, దహనకాండకు, దౌమ్మీకి పాల్పడిన మాట వాస్తవమే' నని అంటారు.*

*దీని విశదీకరణ రెండవ భాగంలో చూద్దాం.*

II

**జనవరి 1993: హిందుత్వవాదుల హత్యా ప్రణాళిక, పోలీసుల తోడ్పాటు**

## శివసేన పాత్ర – రెండవ ఘట్టం

1993 జనవరిలో ముస్లింల పైన జరిగిన ప్రాణాంతకమైన దాడులలో శివసేన ప్రత్యక్షపాత్ర ఉందని చూపించే అనేక ఘటనలను జస్టిస్ శ్రీకృష్ణ తన ఎదుట నమోదయిన వాంగ్మూలాల నుండి ఉటంకించారు.

జనవరి 3వ తేదీనే (అంటే హిందువుల 'ప్రతిస్పందన'కు కారణంగా చూపించబడుతున్న మతాడి కార్మికుల హత్యలు, రాధాబాయి చౌల్స్ మారణకాండ జరగక ముందే) ప్రతీక్షానగర్ ప్రాంతంలో 18 నుండి 25 సంవత్సరాల వయసు లోపల ఉన్న యువకులు చాలామంది హౌసింగ్ బోర్డ్ ఉద్యోగులమని చెప్పుకుంటూ ఇల్లిల్లూ తిరిగి ముస్లింలు నివసించే ఇళ్లను గుర్తించారు. ఆ ఇళ్లపైన సుద్దతో గుర్తులు

కూడ పెట్టారు. అందరి గురించి అడిగినట్టు చేస్తూ ముస్లింల వివరాలు మాత్రం రాసుకున్నారని, ముస్లింల ఇళ్లకు మాత్రం గుర్తులు పెట్టారని ఆ తరువాతగానీ అక్కడి నివాసులకు అర్థం కాలేదు.

ఒక వారం తరువాత – జనవరి 9,10,11 తేదీలలో – ప్రతీక్షానగర్ పైన పెద్దఎత్తున హిందూ గుంపుల దాడి జరిగింది. తలకు కాషాయం రుమాలు చుట్టుకున్న యువకులు 'జైశ్రీరాం', 'జైభవానీ', 'జైభీం', 'జై మహారాష్ట్ర' 'శివసేన జిందాబాద్' అని నినాదాలు ఇస్తూ దాడులు చేసారు. వాళ్లు వేసుకున్న టీషర్ట్‌లపైన శివసేన అని మరాఠీలో వ్రాసి ఉంది. ఆ మూడు దినాలు ప్రతీక్షానగర్‌లో ముస్లింల ఇళ్ల తలుపులు పగలగొట్టి లూటీ చేసారు, దహనం చేసారు. నలుగురు ముస్లింలను పొడిచి చంపారు. ఒక మసీదుపైన రాళ్లు వేసి పక్కనున్న ముస్లింల తోపుడు బళ్లను, వాహనాలను తగలబెట్టారు. ఒక కారులో పోతున్న ముగ్గురు ముస్లింలను ఆపి, బయటికి గుంజి, విపరీతంగా కొట్టి, తిరిగి అదే కారులోకి వాళ్లను నెట్టి దానిని తగలబెట్టి ఆ ముగ్గురినీ సజీవంగా దహనం చేసారు. ఈ ఘటన శివాజీ చౌక్ పోలీస్ పికెట్‌కు 50 గజాల లోపే జరిగింది. అప్పుడేమీ చేయని పోలీసులు నాలుగు రోజుల తరువాత ఇద్దరిని అరెస్టు చేయగా, జనవరి 15 నాడు శివసేనకు చెందిన ఎమ్మెల్యే కాళిదాస్ కోలంకర్, కార్పొరేటర్ కృష్ణా విశ్వాసరావ్, స్థానిక శాఖా ప్రముఖ్ ప్రహ్లాద్ థోంబ్రేల నాయకత్వంలో మూడు నాలుగువేల మంది వాళ్లను విడుదల చేయాలంటూ పోలీస్‌స్టేషన్ మీదికి ఊరేగింపుగా పోయారు (వీళ్లతో పాటు ఏక్‌నాథ్ గైక్వాడ్ అనే కాంగ్రెస్ ఎంఎల్ఏ కూడ ఉండడం గమనార్హం).

ఈ ప్రాంతంలో నివసించే రేష్మా ఉమర్ మక్కీ అనే మహిళ కమిషన్ ముందు తన వాంగ్మూలం వివరంగా ఇచ్చింది. పెళ్లికి ముందు ఆమె హిందూ స్త్రీ. ఉమర్ మక్కీ అనే ముస్లిం యువకుడిని ప్రేమించి, మతం మార్చుకుని పెళ్లి చేసుకొని తన పేరు రేష్మాగా మార్చుకుంది. జనవరి 3వ తేదీన శివసేన కార్యకర్తలు ప్రతీక్షానగర్‌లో ముస్లింల ఇళ్లకు గుర్తులు పెట్టినప్పుడు వీరి ఇంటికి కూడ గుర్తు పెట్టారు. 9వ తేదీన ఆ యింటి పైన శివసేన కార్యకర్తలు కత్తులతో, కర్రలతో, గొడ్డళ్లతో దాడిచేసారు. ఆమె భర్త గురించి అడిగారు. రేష్మా అతనిని ఒక పెద్ద పెట్టెలో దాచి పెట్టి ఇంట్లో లేడని బుకాయించింది. 11వ తేదీన వాళ్లు మళ్లీ వచ్చారు. 'ముస్లింను ఎందుకు పెళ్లి

చేసుకున్నావు? హిందువులంతా చచ్చిపోయారా?' అని దబాయించారు. వారిలో ముగ్గురు నలుగురు ఇంట్లోకి వచ్చి రేష్మా మెడమీద కత్తి పెట్టి అరిస్తే బట్టలు చింపేసి రేప్ చేస్తామని బెదిరించారు. ఆ తరువాత కూడ స్థానిక శివసేన కార్యకర్తలు ముస్లింను పెళ్లి చేసుకున్నందుకు తనను వేధిస్తున్నారని ఆమె కమిషన్‌కు చెప్పింది.

తన భర్తను వాళ్లు చంపేటట్టున్నారనీ తమకు సహాయం చేయమనీ రేష్మా ఆ ప్రాంత పోలీస్ ఇన్‌స్పెక్టర్ వినాయక్ పాటిల్‌కు విన్నవించుకోగా, అతను నిర్మొహమాటంగా 'ఒక ముస్లిం చస్తే, ఒక ముస్లిం తక్కువ అవుతాడులె'మ్మని జవాబు చెప్పాడు. తనను వేధిస్తున్న సంగతి చెప్తే కూడ పట్టించుకోలేదు. 'నీకు శిక్షపడే రోజు వస్తుందిలె'మ్మని రేష్మా ఇన్‌స్పెక్టర్ పాటిల్‌ను నిస్సహాయంగా శపించి వచ్చేసిందంట. అయితే ఆమె మాటలే సత్యమయ్యాయని తరువాతి రికార్డును బట్టి తెలుస్తుందని జస్టిస్ శ్రీకృష్ణ అంటారు. అతనిని రాష్ట్ర ప్రభుత్వం ఆ తరువాత విచారణ లేకుండ బర్తరఫ్ చేసింది. అనేక ఇతర ఆరోపణలతోబాటు 'మతతత్వ సంస్థలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి' అనేది అతని మీద ఉన్న ఆరోపణలలో ఒకటి. ప్రతీక్షానగర్ ఘటనలను జస్టిస్ శ్రీకృష్ణ వివరంగా సమీక్షించి, ఒక్క వినాయక్ పాటిల్ మాత్రమేకాక మొత్తంగా పోలీసులు ముస్లిం వ్యతిరేక పాత్ర నిర్వహించారన్న అభిప్రాయానికి వచ్చారు. పోలీసుల వైఖరి వల్లనే ప్రతీక్షానగర్‌లో అంత పెద్దఎత్తున దాడులు జరగగలిగాయని ఆయన అన్నారు. 'ప్రతీక్షానగర్‌లో హిందూ దుండుగులు పెద్దఎత్తున దాడికి దిగారు. వారిలో కొందరు బహిరంగంగానే తాము శివసేన కార్యకర్తలమని చెప్పుకున్నారు. మరికొందరిని బాధితులు శివసేన కార్యకర్తలుగా గుర్తించడం జరిగింది. స్థానిక పోలీసుల ప్రత్యక్ష పరోక్ష సహకారంతో వాళ్లు ముస్లింలను భీతావహులు చేసి అణచివేసారు. ఇంత పెద్దఎత్తున వాళ్లు విజయవంతంగా తమ కార్యక్రమం నిర్వహించగలిగారంటేనే పోలీసు యంత్రాంగం ఎంతగా నిష్క్రియాపరత్వానికి లోనయిందో, ఎంతగా మతతత్వ జాడ్యం పోలీసు యంత్రానికి సోకిందో అర్థం అవుతుంది' అని జస్టిస్ శ్రీకృష్ణ అన్నారు.

అయితే ఇన్‌స్పెక్టర్ వినాయక్ పాటిల్ లాగా శిక్షపడిన ముంబాయి పోలీస్ అధికారులు కొద్దిమందే. అత్యధికులు ఎటువంటి అభిశంసన లేకుండ తప్పించుకున్నారు. ఈ విషయం దిగువ చూద్దాం.

దొమ్మీలలో శివసేన నిర్వహించిన పాత్ర ప్రధానంగా 'మహా ఆరతుల'తో ముడిపడి ఉంది. రోడ్డుమీద నమాజ్ చేయడాన్ని నిరోధించాలి, నమాజ్‌కు మసీదు నుండి మైక్ ద్వారా బిగ్గరగా పిలుపు ఇవ్వడం మాన్పించాలి అన్న పాత డిమాండ్లకు కొత్త ఉద్విగ్నత కల్పిస్తూ హిందుత్వవాదులు డిసెంబర్ నెలాఖరులో 'మహా ఆరతి' కార్యక్రమాలను మొదలుపెట్టిన సంగతి పైన చెప్పాము. జనవరి వచ్చేసరికి అవి మతోన్మాదాన్ని రెచ్చగొట్టి ముస్లింలపైన దాడులకు హిందువులను సమాయత్తం చేసే కార్యక్రమాలుగా రూపాంతరం చెందాయి. ఎక్కువ భాగం దాడులు మహా ఆరతి కార్యక్రమాలకు హాజరయి నిష్క్రమిస్తున్న హిందువుల గుంపులు చేసారని శ్రీకృష్ణ కమిషన్ నివేదిక తెలియజేస్తుంది. అంతకు ముందు ఏ అల్లర్లు జరగని ప్రాంతాలలో కూడ మహా ఆరతులు మొదలు పెట్టిన తరువాత హింసాకాండ చెలరేగిందని నివేదిక సోదాహరణంగా చూపించింది.

బైకుల్లా పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు హనుమాన్ మందిర్‌ల దగ్గర జనవరి 9న కర్ఫ్యూ అమలులో ఉండగానే మహా ఆరతులు నిర్వహించారు. చవాన్ అనే ఎ.సి.పి (అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్) స్వయంగా పక్కన ఉండి ఈ మహా ఆరతులను తిలకించాడు! వీటిలో ఒక మహా ఆరతి కార్యక్రమం నుండి వెనుదిరిగి పోతున్న జనం దొమ్మీకి పాల్పడ్డారని అదే ఎ.సి.పి అంటుండగా, స్థానిక ఇన్‌స్పెక్టర్ పటాంకర్ మాత్రం ఆ జనం భజనలు పాడుకుంటూ ఇంటికి పోయారని అంటాడు! పైగా మహా ఆరతి నుండి వెనుదిరిగి పోతున్న వారి చేతిలో ఇనపరాడ్లు, బల్లాలు ఉన్నాయని సాక్షులు చెప్తున్నారు కదా, దీనిని బట్టి వాళ్లు మహా ఆరతికి వచ్చినపుడే ఆయుధాలు పట్టుకొని వచ్చినట్టున్నారు కదా, మీరు చూస్తూ ఏం చేస్తున్నారని కమిషన్ ఇన్‌స్పెక్టర్ పటాంకర్‌ను అడిగితే, ఇంటికి తిరిగి పోయి ఆయుధాలు తీసుకొని వెనక్కి వచ్చి ఉండవచ్చునని అంటాడు. 'కమిషన్‌ను తప్పుదోవ పట్టించడానికి ఇన్‌స్పెక్టర్ ఇంత బాధాకరమైన ప్రయత్నం చేయడం హేయమైన విషయం' అని జస్టిస్ శ్రీకృష్ణ వ్యాఖ్యానిస్తారు.

కొలాబా పోలీస్ స్టేషన్ పరిధిలోని వీర్‌బజరంగ్ గుడి దగ్గర జనవరి 11 రాత్రి శివసేన వారు 8 – 9 గంటల మధ్య ఒక మహా ఆరతి కార్యక్రమం నిర్వహించారు. రెచ్చగొట్టే ఉపన్యాసాలు ఇచ్చిన ఆ కార్యక్రమం నుండి వెనుదిరిగి పోతున్న జనం

చాలా కోపంగా, అసహనంగా ఉన్నారు. వాళ్ల వైఖరి గమనించిన పోలీసులు వారితోనే నడిచారు. దారిలో అబ్దుల్ రజాక్ అనే రౌడీ తారసపడ్డాడు. మహా ఆరతి నుండి పోతున్న జనం అతని వెంటపడి తరిమి పట్టుకొని పశువును వధించినట్టు వధించారు. 45 కత్తిపోట్లున్న అతని శవాన్ని పోలీసులు వెలికి తీసారు. మహా ఆరతికి హాజరయి వెనక్కి పోతున్న జనం చేతిలోకి అకస్మాత్తుగా కత్తులెక్కడి నుండి వచ్చాయన్న కమిషన్ ప్రశ్నకు పోలీసుల నుండి జవాబు లేదు.

డి.బి మార్గ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కబీర్ వాడి హనుమాన్ మందిర్ దగ్గర శివసేన ఎమ్మెల్యే చంద్రకాంత్ పడ్వాల్, కార్పొరేటర్ అరవింద్ నేర్కర్‌ల నేతృత్వంలో జనవరి 9న జరిగిన మహా ఆరతి అనంతరం తిరిగి పోతున్న గుంపు ఆ వాడలోని ప్రతి ముస్లిం దుకాణాన్నీ ధ్వంసం చేసి లూటీ చేసింది. సిఐడి స్పెషల్ బ్రాంచి చొరవతో ఈ కార్యక్రమాన్ని మొత్తం వీడియో తీయడం జరిగింది. మహా ఆరతికి హాజరయిన జనం ఉద్రిక్తులయ్యారనీ వారిలో అలజడి చెలరేగిందనీ వారిని అదుపు చేయడానికి పోలీసు సిబ్బంది బలప్రయోగానికి పాల్పడవలసి వచ్చిందనీ స్పెషల్ బ్రాంచి డైరీ చెప్తుండగా, కమిషన్ ముందు హాజరయిన సీనియర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ భకారే మాత్రం ఆ డైరీలోని రికార్డు అవాస్తవమనీ అదేం లేదనీ అంటాడు. మహా ఆరతి ప్రశాంతంగా జరుగుతుండగా పొరుగున ఉన్న గ్రాంటు రోడ్డు మసీదు నుండి ఆజాన్ పిలుపు గట్టిగా వినపడిందనీ అప్పుడు మాత్రమే జనంలో కొంత అలజడి చెలరేగిందనీ అంటాడు. కానీ స్పెషల్ బ్రాంచి పురమాయింపు మీద వీడియో తీసిన సుధీర్ నాగిన్‌లాల్ షా తన వాంగ్మూలంలో మహా ఆరతి చాలా బిగ్గరగా సాగుతుండిందనీ, ఆజాన్ పిలుపు దానిని డిస్టర్బ్ చేసేంత గట్టిగా ఏమీ లేదనీ అంటాడు. అతని వీడియోను మొత్తం తిలకించిన కమిషన్ కూడ అదే అభిప్రాయానికి వచ్చింది. కానీ సీనియర్ ఇన్‌స్పెక్టర్ భకారే మాత్రం మహా ఆరతికి వచ్చిన గుంపు తిరిగి పోతూ పోతూ పాల్పడిన హింసకు ఆజాన్‌నే కారణంగా చూపించదలచుకున్నాడు.

గాందేవి పోలీస్ స్టేషన్ పరిధిలో జనవరి నెలలో 18 చోట్ల ముస్లింల నివాసాల పైన, దుకాణాల పైన దాడులు జరిగాయి. వీటిలో ప్రతీ ఒక్కటీ శివసేన వారు, భారతీయ జనతా పార్టీ వారు మహా ఆరతి నిర్వహించిన కొద్ది సేపటికే ఆ ప్రదేశానికి దగ్గరగా జరిగాయి. మొత్తం 80 కి పైగా ఇళ్లు, దుకాణాలు లూటీకి గురయ్యాయి.

తార్‌దేవ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జనవరి 9వ తేదీన హనుమాన్ మందిర్ వద్ద మహా ఆరతి జరిగింది. బిజెపి, శివసేన, విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఆ ప్రాంతంలో విపరీతమైన టెన్షన్ ఉందని సిఐడి రిపోర్టులో ఉన్నప్పటికీ ఈ మహా ఆరతికి పోలీసులు అనుమతి ఇచ్చారు. యథావిధిగా మహా ఆరతి నుండి తిరిగి వెళుతున్న జనం దారిలో ముస్లింల ఇళ్ల పైన, దుకాణాల పైన దాడులు చేసి బీభత్సాన్ని సృష్టించారు. మహా ఆరతికి హాజరయిన వాళ్లెవరి దగ్గరా ఆయుధాలేవీ లేవని కమిషన్ ముందు పోలీస్ అధికారులు వాంగ్మూలం ఇచ్చారు. కానీ తిరిగి వెళ్లేటప్పుడు లూటీ చేయడానికి కావలసిన కత్తులు, కర్రలు, గొడ్డళ్లు వాళ్ల చేతిలో ప్రత్యక్షమయ్యాయి. ఎక్కడి నుండి వచ్చాయని పోలీస్ అధికారులను కమిషన్ ప్రశ్నిస్తే, బహుశా పోతూ పోతూ దారిలో ఉన్న హిందువుల ఇళ్ల నుండి తీసుకొన్నారేమోనని వారు జవాబు చెప్పారు!

మహా ఆరతులతో సంబంధం లేకుండ హిందుత్వవాద సంస్థలు, వారు పోగు చేసిన గుంపులు ముస్లింలపైన దాడులు చేయలేదనుకుంటే పొరబాటే. నిజానికి జనవరి నెలలో ముస్లింలపైన జరిగిన దాడులన్నిటిలోనూ హిందుత్వవాద సంస్థల పాత్ర– ముఖ్యంగా శివసేన పాత్ర ప్రత్యక్షంగానే ఉంది. దాడులకు నాందిగా ముస్లింలవైపు నుండి పెద్దఎత్తున దాడి జరగబోతున్నదని ప్రచారం ముందే చేపట్టారు. ఈ ప్రచారం హిందూవాడలలో దావానలంలాగా వ్యాపించింది. దానితో, మామూలుగా మతతత్వవాదులు కానివాళ్లు సహితం రెచ్చిపోయారు. శివసేన మూకలలో భాగమయ్యారు.

కాలాచౌకి పోలీస్ స్టేషన్ పరిధిలోని ధోంద్‌పాడ మసీదుపైన జనవరి 9 నాడు దాదాపు 12–14 వేల మంది దాడిచేసారు. ఈ గుంపుకు భాయి షింగ్రె, రమాకాంత్ రహతె, రవి చవాన్, శ్రీధర్ కదమ్, అనిల్ గైక్వాడ్ అనే శివసేన నాయకులు నేతృత్వం వహించారు. గుంపులు గుంపులుగా విడిపోయి వీళ్లు మసీదుపైన కొంత సేపు, ముస్లింల ఇళ్లపైన కొంతసేపు దాడి చేసారు. మహమ్మద్ వకీల్ ఆలం అనే వ్యక్తి పైన కిరోసిన్ పోసి సజీవంగా దహనం చేసారు. ఈ గుంపును అదుపు చేయడానికి పోలీసులు జరిపిన కాల్పులలో ముగ్గురు చనిపోయారు. మరికొంతమందిని పోలీసులు అరెస్టు చేసారు. కాని వాళ్లను విడుదల చేయాలంటూ శివసేన నాయకత్వంలోనే

మళ్లీ పెద్ద ఊరేగింపు పోలీస్ స్టేషన్ మీదికి పోయింది. రాళ్లతో, సోడాబాటిళ్లతో వాళ్లు పోలీసుల పైన దాడి చేసారు.

ఇంత బీభత్సం జరిగినప్పటికీ పోలీసులు అదే సాయంత్రం శివసేన శాఖా ప్రముఖ్ దీపక్ షిండె ఆధ్వర్యంలో స్థానిక హనుమాన్ దేవాలయంలో మహా ఆరతి జరగనిచ్చారు!

## పోలీసులు - శివసేన

పోలీసులు శివసేన హింసాత్మక కార్యకలాపాలను అటకాయించడానికి ఎటువంటి ప్రయత్నం చేయలేదన్న విషయం ఇప్పటికే సూచించాము. మహా ఆరతులు హింసకు దారి తీస్తున్నాయని తెలిసి కూడ వాటిని నిరోధించడానికి పోలీసులు ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు. పైగా కర్ఫ్యూ అమలులో ఉన్న ప్రాంతాలలో కూడ యధేచ్ఛగా జరగనిచ్చారు. సిఐడి స్పెషల్ బ్రాంచి అన్ని పోలీస్ స్టేషన్లకూ పంపించిన ఇంటలిజెన్స్ రిపోర్టులో మహా ఆరతుల వల్ల ఉండగల ప్రమాదాన్ని గురించి లిఖిత పూర్వకంగా హెచ్చరించినప్పటికీ పోలీసులు ఎంతమాత్రం జాగ్రత్త తీసుకోలేదు.

హిందువుల వైపు నుండి జరిగిన సంఘటిత హింసాకాండకు మహా ఆరతులే కేంద్రంగా పనిచేసాయని జస్టిస్ శ్రీకృష్ణ గుర్తించారు కాబట్టి ఆ కార్యక్రమాల విషయంలో పోలీసుల వైఖరిని తరచి తరచి ప్రశ్నించారు. ఒకటి రెండు మినహాయింపులతో కమిషన్ ముందు హాజరైన పోలీస్ అధికారులెవ్వరూ సరయిన జవాబు చెప్పలేదు. మహా ఆరతులకు హాజరయిన వాళ్ల చేతిలో ఎటువంటి ఆయుధాలూ లేవని ప్రతి పోలీస్ అధికారీ కమిషన్‌తో అన్నాడు. కానీ అనేక సందర్భాలలో తిరిగిపోయేటప్పుడు వాళ్లు కర్రలతో రాళ్లతోనే కాదు, కత్తులతో, గొడ్డళ్లతో ముస్లిం బస్తీలపైన దాడులు చేసినట్టు పోలీసు ఎఫ్ఐఆర్‌లే కాక కమిషన్ ముందు హాజరయిన బాధితుల వాంగ్మూలాలు కూడ తెలియజేస్తాయి. మరి ఈ ఆయుధాలు ఎక్కడినుండి వచ్చాయని అడిగితే, 'ఏమో తెలీద'ని ఒకరు, 'ఇంటికి పోయి తెచ్చుకొని ఉంటార'ని ఒకరు, 'దారిలోని హిందువుల ఇళ్లనుండి తీసుకొని ఉండవచ్చునని' ఇంకొకరు జవాబు చెప్పారు. ఇది కమిషన్‌ను తప్పుదోవ పట్టించడం తప్ప వేరే ఏమీ కాదని జస్టిస్ శ్రీకృష్ణ ముంబాయి పోలీసులను తీవ్రంగా దుయ్యబట్టారు.

అసలు ఈ మహా ఆరతుల పర్యవసానం చూసిన తరువాతైనా వాటిని ఎందుకు నిషేధించలేదని (కనీసం ఘర్షణ వాతావరణం ఉన్న ప్రాంతాలలో) జస్టిస్ శ్రీకృష్ణ చాలామంది పోలీస్ అధికారులను విచారణ సమయంలో అడిగారు. ఈ విషయంలో నిర్ణయం పై స్థాయిలోనే జరిగిందని ఆయనకు లభించిన సమాధానాలను బట్టి తెలుస్తుంది. అప్పటికి మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. పోలీస్ యంత్రాంగం వాళ్ల అదుపులో ఉంది. అయినప్పటికీ శివసేనకు కోపం తెప్పించడానికి వాళ్లకు ధైర్యం చాలలేదు.

పోలీసులకు నిషేధాజ్ఞలు ప్రకటించే అధికారం ముంబాయి పోలీస్ చట్టంలోని సెక్షన్ 37 లో ఉంది. సెక్షన్ 37 నుండి మహా ఆరతిని మినహాయించాలన్న నిర్ణయం ముంబాయి పోలీస్ కమీషనర్ డిసెంబర్ 6కు ముందే తీసుకున్నాడు. దొమ్మీలు మొదలయిన తరువాత కొంతమంది పోలీస్ అధికారులు క్రైం మీటింగ్‌లో ఆ నిర్ణయం వల్ల వస్తున్న నష్టాన్ని కమీషనర్‌కు వివరించినప్పటికీ ఆ నిర్ణయం మారలేదు. అయితే ఆ మాత్రం హెచ్చరించిన అధికారులు కొద్దిమందే ఉన్నట్టున్నారు. చాలామంది పోలీసు అధికారులు తామే శివసేన కార్యకర్తలయినట్టు ప్రవర్తించారు.

మహా ఆరతులను సెక్షన్ 37 పరిధి నుండి మినహాయించడానికి కారణమేమిటని అప్పటి నగర పోలీస్ కమీషనర్ శ్రీకాంత్ కృష్ణాజీ బాపట్‌ను కమిషన్ అడగగా, 'అవి కేవలం మత సంబంధమైన కార్యక్రమాలే తప్ప రాజకీయ కార్యక్రమాలు కావు' అని సమర్థించుకున్నాడు. ఇతర పోలీస్ అధికారులు కూడ అదే సమాధానం ఇచ్చారు. పోలీస్ కమీషనర్ వాంగ్మూలాన్ని జస్టిస్ శ్రీకృష్ణ వాఖ్యానిస్తూ 'ఇతనిని ఇతని కింది అధికారులు మోసగించి అయినా ఉండాలి, లేదా ఇతను కూడ ఈ మోసంలో భాగం అయి ఉండాలి' అంటారు.

అయితే మహా ఆరతుల పట్ల ఉదాసీన వైఖరి అవలంబించడం ఒక్కటే కాదు. ఇంకా అనేక ఇతర రూపాలలో ముంబాయి పోలీసులు హిందుత్వవాద సంస్థల పట్ల తమ పక్షపాతాన్ని ప్రదర్శించారు. వాళ్ల హింస రికార్డు కెక్కకుండ చూడడానికి చాలా హేయమైన పద్ధతులలో తాపత్రయం ప్రదర్శించారు.

1992 డిసెంబర్ 27 నాడు శివసేన వారు ఒక ఊరేగింపు తీసారు. ఊరేగింపు ఖేర్వాడి, నిర్మల్‌నగర్ పోలీస్ స్టేషన్ ప్రాంతాల నుండి సాగింది. వాళ్ల చేతిలో ఉన్న

ప్లేకార్డుల మీద 'శివసేన బీభత్సమే ప్రజలందరికీ రక్ష (Shiva Sena's terror is Public safety)' అని రాసి ఉంది. అదే నినాదం ఇచ్చారు కూడ. ఆ ఊరేగింపు గురించి ఖేర్వాడి పోలీస్ స్టేషన్లో ఆ రోజు సమాచారం నమోదు చేసిన ఇంటలిజెన్స్ జవాను ఈ విషయాన్ని సరిగ్గానే రాసాడు. కానీ ఆ తరువాత న్యాయవిచారణ ప్రకటించేసరికి ఆ స్టేషన్ పోలీసులు దానిని దిద్దారు. 'బీభత్సం' అనే మాటను దిద్ది 'దర్శనం' (మరాఠీలో ఇవి రెండూ దగ్గరగా ఉంటాయి) అనే మాట చేర్చారు. అయితే రికార్డు తెప్పించి పరిశీలించిన జస్టిస్ శ్రీకృష్ణ ఈ విషయాన్ని గమనించి తీవ్రంగా అభిశంసించారు. 'బీభత్సం'ను 'దర్శనం'గా మార్చారు గానీ బీభత్సం అన్న క్రియ ఉన్నప్పుడు మరాఠీ భాషలో కర్త స్త్రీ లింగంలో ఉంటుందనీ, దర్శనం అన్నప్పుడు తటస్థలింగంలో ఉండాలనీ, రికార్డును దిద్దిన పోలీసులు ఈ విషయాన్ని గమనించలేదనీ అంటారు. అంతేకాక, ఖేర్వాడి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఈ మార్పు చేసాడు గానీ నిర్మల్‌నగర్ పోలీసులు చేయలేదు. ఆ స్టేషన్ రికార్డులో శివసేన వారి నినాదం ఉన్నదున్నట్టే నమోదయింది. ఖేర్వాడి పోలీసుల నేరాన్ని ఇది బయట పెట్టింది.

పోలీసులు శివసేన కార్యకర్తలతో కలిసి దాడులు చేసిన సంఘటనలు కూడ కమిషన్ ఎదుట నమోదయ్యాయి. దేవనార్ పోలీస్ స్టేషన్ పరిధిలో డిసెంబర్ 9 నాడు అబీద్ అలీ కాజీ అనే వ్యక్తి ఇంటి మీద పోలీసులు దాడి చేసారు. అతనిని విపరీతంగా కొట్టి, అడ్డమొచ్చిన అతని సోదరిని కూడ కొట్టి, అతనిని స్థానిక శివసేన శాఖ కార్యాలయం వైపు లాక్కొని పోయారు. నీ సంగతి మమ్మల్నే చూసుకొమ్మంటావా లేక శివసేన వారికి అప్పగించమంటావా అని అక్కడున్న పోలీస్ ఇన్స్పెక్టర్ అతనిని బెదిరించాడు. బాగా తన్ని, 'ఇంక పారిపో' అన్నాడు. అతను పారిపోతుండగా శివసేన కార్యకర్తలు 10 లేక 12 మంది అతనిని తరిమి సైకిల్ చైన్లతోనూ హాకీ కర్రలతోనూ కొట్టిపడేసారు.

బైకుల్లా పోలీస్ స్టేషన్ పరిధిలో నివసించే షబ్బీర్ అబ్దుల్ హుసేన్ తంబావాలా వాంగ్మూలం ప్రకారం, మీనా హౌసింగ్ సొసైటీలో ఉన్న ముస్లింల ఇళ్ల మీద పోలీసుల సమక్షంలోనే దుండగులు దాడి చేసారు. ఇది కూడ ఒక 'మహా ఆరతి' పర్యవసానంగా జరిగిన దాడే. బిల్డింగ్ గేట్‌కు తాళం వేసి సాయుధ పోలీసులు కాపలా ఉండగానే దుండగులు గోడ దూకి ఇళ్ల తలుపులు పగలగొట్టి దాడికి పాల్పడ్డారు. వారిలో శేఖర్ అనే ఒక వ్యక్తి గురించి షబ్బీర్ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇచ్చాడు. అసిస్టెంట్

ఇన్‌స్పెక్టర్ జైస్వాల్ షబ్బీర్‌నూ శేఖర్‌నూ పోలీస్ స్టేషన్‌కు పిలిచాడు. అక్కడ అనంతనారాయణ్ శింగై అనే శివసేన శాఖా ప్రముఖ్ కూర్చొని ఉన్నాడు. అతని సమక్షంలో అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జైస్వాల్ షబ్బీర్‌ను రాజీ కమ్మని ఒత్తిడి చేసాడు. మత ఘర్షణలు జరుగుతున్నప్పుడు అటువంటి ఘటనలు జరుగుతుంటాయనీ, షబ్బీర్ ఆ ప్రాంతంలో ఉండదలచుకుంటే దానిని పట్టించుకోకుండ ఉండడం మంచిదనీ, రాజీపడుతున్నట్టు రాసి ఇవ్వాలనీ ఒత్తిడి పెట్టాడు. షబ్బీర్ ఒప్పుకోలేదు.

డిసెంబర్ 7వ తేదీన డోంగ్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని పహల్వి బేకరీ పైన 'శివసేన జిందాబాద్' అని నినాదాలు ఇస్తూ 100 మంది యువకులు దాడి చేసారు. వాళ్ల చేతులలో లాఠీలు, ఇనపరాడ్లు, కత్తులు ఉన్నాయి. దాడి చేసిన వారిలో బిపిన్ అనే యువకుడిని బేకరీ యాజమాన్యం గుర్తించింది. పోలీస్ కంప్లెయింట్ ఇచ్చారు. కానీ పోలీసులు బిపిన్‌ను అరెస్టు చేయలేదు. శివసేనకూ, దాడి చేసిన దుండగులకూ మధ్య నున్న సంబంధాన్ని గురించి ఇన్వెస్టిగేట్ చేయలేదు. కేసు నమోదు చేసుకొని మూసేసారు.

కాలాచౌకి పోలీస్ స్టేషన్ పరిధిలోని బొంబాయి డాక్ లేబర్ బోర్డు (బిడిఎల్‌బి) కాలనీలో జరిగిన దొమ్మీని పోలీసులు పూర్తిగా వక్రీకరించిన తీరు శివసేనను కాపాడడానికి ముంబాయి పోలీసులు ఎంత దూరమైనా పోగలరని రుజువు చేసింది. ఈ దొమ్మీ మొత్తం దిలావర్‌ఖాన్ అనే ముస్లిం నేరస్తుడి ఆధ్వర్యంలో జరిగిందని పోలీసులు కేసు నమోదు చేసారు. ఈ కాలనీలో మెజారిటీ నివాసాలు ముస్లింలవే గానీ చుట్టూ ఉన్న ప్రాంతం హిందువులు మెజారిటీగా ఉన్న ప్రాంతం. శివసేనకు బాగా ప్రాబల్యం ఉన్న ప్రాంతం. కాలనీలో జరిగిన దొమ్మీలో 39 ఆస్తులు ధ్వంసం కాగా అందులో 9 హిందువులకు చెందినవి. మిగిలిన 30 ముస్లింలకు చెందినవి. కాలనీలో ఒక శివుని ఆలయం, ఒక మసీదు ఉన్నాయి. మసీదు ధ్వంసం అయిందిగానీ ఆలయానికేమీ కాలేదు. ఆలయం పూజారిని కమిషన్ పిలిపించి అతని వాంగ్మూలం నమోదు చేసింది. దొమ్మీ జరిగిన నాడు గానీ అంతకు ముందు గానీ కాలనీలోని ముస్లింలు గుడికి ఎటువంటి హానీ కలిగించలేదని అతను అన్నాడు.

అయినప్పటికీ కాలనీలో జరిగిన దొమ్మీకి సంబంధించిన కేసులో పోలీసులు 50 మంది ముస్లింలను, ఆరుగురు హిందువులను అరెస్టు చేసారు. మరొక 12

మంది హిందువుల పేర్లు కూడ ముద్దాయిలుగా చూపించారుగానీ వాళ్లను అరెస్టు చేయలేదు. పోలీసు సిబ్బంది వాంగ్మూలాలే తప్ప కాలనీ నివాసులెవ్వరి వాంగ్మూలమూ పోలీసులు ఈ కేసులో నమోదు చేయకపోవడం చాలా విచిత్రమైన విషయం. ఘటనను మొత్తం పరిశీలించిన మీదట, 'హిందువులు కాలనీపైన దాడి చేసారనీ, ముస్లింలు దానిని తిప్పికొట్టడానికి ఎదురుదాడి మాత్రమే చేసారనీ అర్థం అవుతుంది' అని జస్టిస్ శ్రీకృష్ణ అంటారు. పోలీసులు మాత్రం ఇది దిలావర్‌ఖాన్ నాయకత్వంలో ముస్లింలు పాల్పడిన దొమ్మీ అనే భావించారు.

నిజానికి శివసేనకు బాగా ప్రాబల్యం ఉన్న కాలాచౌకీ ప్రాంతంలో డిసెంబర్ నెలలోనే శివసేన ఆధ్వర్యంలో జరిగిన రహస్య సమావేశాలలో నగరంలోని ఇతర ప్రాంతాలలో బాబ్రీ మసీదు కూల్చివేత తరువాత ముస్లింలు రెచ్చిపోయి హింసకు పాల్పడినందుకు ప్రతీకారంగా ముస్లింల పైన దాడులు చేయాలని నిర్ణయం జరిగినట్టు ఆధారాలున్నాయని కమిషన్ భావించింది. శివసేన, భారతీయ జనతా పార్టీల పేరు మీద ముస్లింలపైన ద్వేషం రెచ్చగొట్టే బోర్డులు ఈ ప్రాంతంలో ప్రదర్శించబడ్డాయి. 26 డిసెంబర్ నాడు కాలాచౌకీలోని ఒక ముఖ్య కూడలిలో (యశ్వంత్ చౌక్) ట్రాఫిక్‌ను పూర్తిగా స్తంభింపజేసిన మహా ఆరతి జరిగింది. ఈ విషయం శివసేన దినపత్రిక 'సామ్నా' లో ఘనంగా రాసుకోవడం జరిగింది. ట్రాఫిక్‌ను మొత్తం స్తంభింపజేసే కార్యక్రమాన్ని ఎందుకు అనుమతించారని కమిషన్ స్థానిక ఇన్‌స్పెక్టర్‌ను అడుగగా, అటువంటిదేమీ జరగలేదనీ, ఊరికే గొప్పకోసం శివసేన వాళ్లు తమ పత్రికలో రాసుకొని ఉండవచ్చుననీ జవాబు చెప్పాడు.

ఈ ప్రాంత డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కృష్ణలాల్ బిష్ణోయ్ వాంగ్మూలం మరీ ఆశ్చర్యం కలిగిస్తుంది. జనవరి 10 నాడు ఒక హిందువుల గుంపు అతనిని స్వయంగా కొట్టి గాయపరిచింది. జనవరి 9 నుండి 19 మధ్య అనేక సందర్భాలలో హిందువుల గుంపులు అల్లర్లకు దిగాయి. ఇవి శివసేన కార్యకర్తలు చేసినవే కదా అని కమిషన్ అతనిని ప్రశ్నించగా, దొమ్మీకి పాల్పడిన వారిలో శివసేన కార్యకర్తలు ఉన్నమాట వాస్తవమే గానీ, వారు ఆ సంస్థ కార్యకర్తలుగా పాల్గొన్నారా లేక వ్యక్తిగత హోదాలో పాల్గొన్నారా అనేది తమ పరిశోధనలో తేలలేదని జవాబు చెప్తాడు. ముస్లింలకు 'బుద్ధి చెప్పాలని' నిర్ణయం తీసుకున్న రహస్య సమావేశాలు శివసేన

ఆధ్వర్యంలో జరిగినట్టు కొందరు ముద్దాయిలు ఇచ్చిన ఒప్పుకోలును అతని దృష్టికి కమిషన్ తీసుకురాగా, అది నిజమే అనుకున్నప్పటికీ అల్లర్లలో ఒక పద్ధతి ఉన్నట్టు తనకు అనిపించలేదంటాడు. చాలా మంది శివసేన నాయకులూ ప్రముఖులూ అల్లర్లలో పాల్గొన్నట్టు తెలిపే ఆధారాలను అతని దృష్టికి తేగా, వ్యక్తులు పాల్గొనడానికి సంస్థ పాల్గొనిందని భావించడానికి తేడా ఉందని మరొకసారి అంటూ ఆ ప్రాంతంలో శివసేనకు చాలా ప్రాబల్యం ఉంది కాబట్టి ప్రజల ఒత్తిడికి తల ఒగ్గి వారికి నాయకత్వం వహించకపోతే పరువు పోతుందన్న భయంతో శివసేన నాయకులు ఆ పనిచేసి ఉండవచ్చునని వారి తరఫున సర్దిచెప్తాడు! ఈయన చిన్నా చితకా పోలీసు జవాను కాడు. ఏకంగా డిప్యూటీ పోలీస్ కమిషనరు.

'అల్లర్లు ఈ ప్రాంతంలో 10 దినాలు ఆగకుండ నిరాఘాటంగా ఎందుకు సాగగలిగాయో దీనిని బట్టి అర్థం అవుతుందనుకుంటాను' అన్న జస్టిస్ శ్రీకృష్ణ వ్యంగ్యోక్తి కంటె వేరే వ్యాఖ్య అవసరం లేదు.

ఎల్.టి. మార్గ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డైమండ్ జూబిలీ కాంపౌండ్ పైన జరిగిన దాడి మరొక ఉదాహరణ. ఆ కాంపౌండ్‌లోని 18 నివాసాలలో 200 ముస్లిం కుటుంబాలున్నాయి. 8 జనవరి రాత్రి ఆ కాంపౌండ్ బయట పెద్ద గుంపు చేరి 'జై శ్రీరాం' అని నినాదాలు ఇవ్వడం మొదలు పెట్టేసరికి కాంపౌండ్‌లోని ముస్లింలు గాభరా పడ్డారు. వారిలో ఒకరయిన ఉర్దూ బ్లిట్జ్(Blitz) వారపత్రిక సంపాదకుడు హరూన్ రషీద్ పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసాడు. వాళ్లు ఇద్దరు జవాన్లను కాంపౌండ్ గేట్ దగ్గర నిలబడమని పంపించారు. కానీ కొంతసేపటికి దుండగులు తోపుడు బండ్లలో సోడాబాటిల్స్, రాళ్లు, కర్రలు తీసుకొని వచ్చేసరికి వాళ్లిద్దరూ పత్తా లేకుండ పోయారు. హరూన్ రషీద్ మళ్లీ పోలీసు కంట్రోల్ రూంకు ఫోన్ చేసాడుగానీ అన్ని చోట్లకు సహాయం పంపించే స్థితిలో మేము లేమని వాళ్లు జవాబు చెప్పారు. దుండగులు యధేచ్ఛగా కాంపౌండ్‌లో ఉన్న వాహనాలను ధ్వంసం చేసి ఆ రాత్రికి కాంపౌండ్‌కు ఎదురుగా ఉన్న మెహతా ఎస్టేట్లో తలదాచుకున్నారు. డైమండ్ జూబిలీ కాంపౌండ్‌లోని ముస్లింలు ఆ రాత్రి భయంభయంగా గడిపారు.

9 వ తేదీ పొద్దున్న 10 గంటలప్పుడు హిందువుల గుంపు కాంపౌండ్ వెనకగోడ దూకి లోపలికి వచ్చి పెట్రోల్ తడిపిన గుడ్డలకు నిప్పంటించి ఇళ్ల మీదకి విసరసాగారు.

అప్పటికి కాంపౌండ్ గేట్ దగ్గర కామత్ అనే ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో పోలీస్ పికెట్ ఉంది. కానీ వాళ్లు చేయి కాలు కదపకుండ చూస్తూ ఊరుకున్నారు. దుండగులు నెమ్మదిగా డైమండ్ జూబిలీ కాంపౌండ్‌కు ఎదురుగా ఉన్న రెండు బిల్డింగుల మీదికి చేరారు. వాటిలో ఒక దానిలో ఆ ప్రాంత శివసేన కార్పొరేటర్ ఉంటాడు. ఆ బిల్డింగుల మీది నుండి వాళ్లు మండుతున్న వస్తువులను కాంపౌండ్‌లోని ఇళ్ల మీదికి విసరసాగారు. పోలీసులు అప్పటికీ చూస్తూ ఊరుకున్నారు. వారిలో కొందరు తమ చొక్కాల మీద ఉన్న గుర్తింపు చిహ్నాలను గుట్టుచప్పుడు కాకుండా తొలగించి జేబులో పెట్టుకున్నారు.

పరిస్థితి బాగాలేదని గమనించి కాంపౌండ్‌లోని ముస్లింలు మధ్యాహ్నం 2–00 గంటలకు ఒకే ఒక నివాసంలోకి (డైమండ్ మంజిల్) చేరుకున్నారు. ఆ ఇంటిమీద దాడి మొదలయింది. మీ అల్లామియాను పిలుచుకోండి' అంటూ హేళన చేస్తూ మండే వస్తువులు విసరసాగారు. కొంతమంది శివసేన నాయకులు ఆ గుంపులో ఉన్నట్టు హరూన్ రషీద్ గమనించాడు. అంతలో అక్కడికొక పోలీస్ జీపు వచ్చింది గానీ పోలీసులు శివసేన నాయకులతో కబుర్లు చెప్తూ జోక్ చేస్తూ కూర్చున్నారు తప్ప బాధితులకు సహాయం చేయడానికి ఎటువంటి ప్రయత్నం చేయలేదు.

సాయంత్రం 6 గంటలు అయ్యేసరికి దాడి తీవ్రతరమయింది. కాంపౌండ్‌లోని ముస్లింలు ఒక్కొక్కరుగా ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోయారు. హరూన్ రషీద్ కూడ వెళ్లిపోయాడు. పొద్దున్న 6 గంటలకు అతను వచ్చి చూసేసరికి కాంపౌండ్ దాదాపు మొత్తం తగలబడిపోయి ఉంది. రాత్రంతా సర్చిలైట్లు వేసి మరీ దహనకాండ కొనసాగించారని అతనికి తెలిసింది.

శివసేన దాడుల నుండి ముస్లింలకు రక్షణ కల్పించకపోవడంలోనే కాక, శివసేన దుండగుల పేర్లు స్పష్టంగా బాధితులు చెప్పినప్పటికీ వారి పైన కేసులు పెట్టకపోవటంలోనూ పోలీసులు తమ పక్షపాత వైఖరిని స్పష్టంగా ప్రదర్శించారు. చాలా కేసులు ఏ రకమైన ఇన్వెస్టిగేషన్ లేకుండ మూసివేయబడ్డాయి.

ఆంటాప్ హిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 1993 జనవరి నెలలో జరిగిన హింసాకాండకు గురయిన ముస్లింలు ముసాఫిర్‌ఖానా రిలీఫ్ క్యాంప్‌లో ఉంటూ తమ పైన జరిగిన దాడులకు బాధ్యులయిన వారి పేర్లు వివరంగా పేర్కొంటూ సీనియర్

ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు ఇచ్చారు. అయినప్పటికీ ఎటువంటి పరిశోధన చేయకుండ జూన్ నెలలో ఈ కేసులన్నీ మూసివేయడం జరిగింది.

ధారవి పోలీస్ స్టేషన్ పరిధిలో జనవరి 8 నాడు సాయిబాబా మందిరం దగ్గర జరిగిన ఘంటానాద కార్యక్రమం దొమ్మీకీ హింసాకాండకూ దారితీసింది. అయినా ఆ కార్యక్రమంలో పాల్గొన్నవారినీ, రెచ్చగొట్టే ఉపన్యాసాలు ఇచ్చిన వక్తలనూ ఎందుకు అరెస్టు చేయలేదని కమిషన్ సీనియర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఘాగ్రేని ప్రశ్నించగా, 'ఆ సమావేశంలో జనం విపరీతంగా ఉండడం వల్ల ఎవరినీ గుర్తించలేకపోయాం' అని జవాబు చెప్పాడు. అదే పోలీస్ స్టేషన్‌కు చెందిన కృష్ణ శ్యాంరావ్ పాటిల్ అనే కానిస్టేబుల్ తన వాంగ్మూలంలో ప్రతాప్ చంద్ర ఆరేకర్ అనే బిజెపి నాయకుడు హిందువులను రెచ్చగొట్టే ఉపన్యాసం ఇచ్చాడని చెప్పినప్పటికీ ఈ సీనియర్ ఇన్‌స్పెక్టర్ మాత్రం తనకేమీ తెలీదనే అంటాడు. అబ్దుల్ గనీ అనే ఒక బాధితుడు తన ఇంటిమీదికి జనాన్ని తీసుకొచ్చిన 'కోనా' అని పిలవబడే వీడియో ఫోటోగ్రాఫర్ పేరు ఇన్‌స్పెక్టర్ ఘాగ్రేకి చెప్పాడు. అయితే 'హొనా' అనే పేరుతో ఒక వీడియోగ్రాఫర్ ఉన్నాడు గానీ 'కోనా' అన్న పేరుగలవాడు లేడు కాబట్టి ఎవ్వరినీ అరెస్టు చేయలేదని ఇన్‌స్పెక్టర్ అంటాడు. పోనీ ఆ 'హొనా' అన్న అతన్నే పిలిపించి అతనే ఇతనేమో పరిశోధించ లేకపోయావా అని కమిషన్ ప్రశ్నించగా, ఆ పని చేసేలోపల ఫిర్యాది అబ్దుల్ గనీ తన స్వగ్రామానికి వెళ్లిపోయాడనీ అక్కడ చనిపోయాడనీ అందువల్ల ఆ పని చేయలేదనీ జవాబు చెప్తాడు! అతీకుర్ రెహమాన్ సైఫి అనే మరొక బాధితుడు రాజు కుంచి కుర్వె, ఆరేకర్, గణేశ్ మార్వాడి అనే ముగ్గురు దుండగుల పేర్లు స్పష్టంగా చెప్పినా వారెవ్వరినీ పోలీసులు అరెస్టు చేయలేదు. ఎందుకు చేయలేదని కమిషన్ ప్రశ్నించగా, వాళ్లు దొరకలేదని (దాదాపు 3 సంవత్సరాల తరువాత కూడ) ఇన్‌స్పెక్టర్ ఘాగ్రె జవాబు చెప్తాడు.

ఇది ఒక పోలీస్ స్టేషన్ ప్రత్యేకతో లేక ఒక ఇన్‌స్పెక్టర్ ప్రత్యేకతో కాదు. నగరమంతటా ఇది జరిగింది. కేసులు పెట్టిన చోట కూడ ఆ ఘటనల్లో ఏదైనా కుట్ర, ప్రణాళిక ఉన్నాయేమో చూడడానికి పోలీసులు నిరాకరించారు. డోంగ్రీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వరుసగా ముస్లింలను కత్తి పోట్లకు గురి చేసిన ఘటనల వెనుక ఏదైనా ప్రణాళిక ఉందేమో పరిశీలించావా అని కమిషన్ సీనియర్ ఇన్‌స్పెక్టర్

చంద్రకాంత్ ప్రతాప్ రావ్ బాగ్వెని ప్రశ్నించగా, 'నాకేమనిపిస్తుందంటే చాలామంది హిందువులకు విడివిడిగా దాదాపు ఒకేసారి ఒక ముస్లింను పొడిచి కక్ష తీర్చుకోవాలన్న ఆలోచన వచ్చినట్టుంది' అని జవాబు చెప్తాడు!

అదే పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇమాంవాడ బిఐటి చౌల్స్‌లో హిందువులు, ముస్లింల మధ్య పెద్దెత్తున దొమ్మీ జరిగింది. పోలీసులు కాల్పులు జరిపి అదుపు చేయవలసి వచ్చింది. 33 రౌండ్ల కాల్పులలో ఒక ముస్లిం చనిపోయాడు. దొమ్మీ చల్లబడిన తరువాత పోలీసులు అక్కడికి అక్కడే 81 మంది ముస్లింలను అరెస్టు చేసారు గానీ ఒక్క హిందువును కూడ అరెస్టు చేయలేదు. ఒక్క హిందువును సహితం అరెస్టు చేయలేకపోవడానికి కారణమేమిటని కమిషన్ అడిగిన ప్రశ్నకు సీనియర్ ఇన్‌స్పెక్టర్ బాగ్వె దగ్గర జవాబు లేదు.

మరికొన్ని ఉదాహరణలు తరువాత సెక్షన్లో చూద్దాం.

## పోలీసులు - ముస్లింలు

శివసేన పట్ల పక్షపాతం చూపించడం, శివసేన కార్యకర్తల నేరాలను కప్పిపెట్టే ప్రయత్నం చేయడం మాత్రమే కాక ముంబాయి పోలీసులు అనేక సందర్భాలలో ప్రత్యక్షంగానే ముస్లిం వ్యతిరేక వైఖరిని ప్రదర్శించారు. దీనికి కొన్ని ఉదాహరణలు ఇప్పటికే ఇచ్చాము. మరికొన్ని ఇక్కడ చూద్దాం.

పైధోనీ పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో జరిగిన ఘటనలను వ్యాఖ్యానిస్తూ ఆ ప్రాంత సీనియర్ ఇన్‌స్పెక్టర్ పి.ఎస్.కదం వైఖరి గురించి కమిషన్ ఈ విధంగా అభిప్రాయపడింది.

> 'దొమ్మీలలో హిందూ గుంపుల పాత్రను దాచి పెట్టడానికి పోలీసులు స్పష్టంగా ప్రయత్నం చేసారు. ఇన్‌స్పెక్టర్ కదం నుండి ఈ విషయాలు ఒక్కొక్కటీ క్రాస్-ఎగ్జామినేషన్‌లో బలవంతంగా రాబట్టవలసి వచ్చింది. మరొక విచిత్రమైన విషయం ఏమిటంటే, హిందువులూ ముస్లింలూ దొమ్మీకి దిగిన చోట్ల కూడ కాల్పులు కేవలం ముస్లింల మీదనే జరిపినట్టున్నారు. కాల్పులలో గాయాలు ముస్లింలకు మాత్రమే అయ్యాయి'.

ఎల్. టి. మార్గ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనలను వ్యాఖ్యానిస్తూ–

> 'ముస్లింలు అధికంగా నివసించే ప్రాంతాలలో జరిపిన కాల్పులలాగా కాక, హిందువులు అధికంగా నివసించే ప్రాంతాలలో పోలీసులు జరిపిన కాల్పులు ఏ మాత్రం ప్రభావం చూపలేదు. దహనాలకూ లూటీకీ విధ్వంసానికీ పాల్పడుతున్న గుంపులను ఈ కాల్పులు ఎంత మాత్రం అదుపు చేయలేదు. కేవలం 100–200 అడుగుల దూరం నుండి జరిపిన కాల్పులలో సహితం గుంపులో ఒక్కరూ గాయపడక పోవడాన్ని బట్టి చూస్తే, కాల్పులు మొత్తంగా గాలిలోకే జరిపారా అని అనుమానం వస్తుంది' అని కమిషన్ అనింది.

జోగేశ్వరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనల గురించి చెప్తూ,

> 'ఈ ప్రాంతంలో కూడ కమిషన్ గమనించిందేమిటంటే దొమ్మీలలో హిందువుల గుంపు ఉందని ఒప్పుకోవడానికి సహితం పోలీసులు ఇష్టపడక పోవడం. క్రాస్ ఎగ్జామినేషన్లో ఒత్తిడి పెట్టి ఈ వాస్తవాన్ని బయటకు లాగవలసి వచ్చింది' అన్నారు.

బైకుల్లా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనలను సమీక్షిస్తూ కమిషన్ పోలీసుల తీరును తీవ్రంగా అభిశంసించింది.

> 'కమిషన్ ముందు హాజరయిన వారి వాంగ్మూలాలు చాలా బాధ కలిగిస్తాయి. పోలీసుల పక్షపాత వైఖరిని అవి స్పష్టంగా చూపిస్తాయి. ముస్లిం బాధితుల ఫిర్యాదులకు పోలీసులు సరిగ్గా స్పందించలేదు. కొన్ని సందర్భాలలో వారి మతం పేరిట వారిని వెక్కిరించడం, వారి మీదనే తప్పుడు కేసులు పెట్టడం కూడ జరిగింది' అని కమిషన్ అభిప్రాయపడింది.

ఘట్‌కోపర్ పోలీస్ స్టేషన్ ప్రాంతం గురించి మాట్లాడుతూ, డిసెంబర్ అల్లర్లలో సహితం రెండు వైపుల నుండి హింస జరిగిన విషయాన్ని వివరించి,

> 'వాస్తవాలు ఈ విధంగా ఉండగా, ఈ స్టేషన్ సీనియర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్, అతని ఎసిపి, డిసిపిలు డిసెంబర్‌లో జరిగిన అన్ని ఘటనలూ ముస్లింలు పాల్పడినవేనన్న అభిప్రాయాన్ని గట్టిగా

నమ్ముతున్నారు. పోలీసుల ఏకపక్ష వైఖరి సాక్ష్యంలో స్పష్టంగా బయల్పడింది. 1992 డిసెంబర్లో హిందువులు, ముస్లింలు ఇద్దరూ దాడికి పాల్పడిన ఘటనలు అనేకం ఉన్నాయని వాస్తవికంగా ఒప్పుకొనే బదులు ఈ సీనియర్ ఇన్‌స్పెక్టర్ మొండిగా హింస అంతా ముస్లింలే చేసారని అంటాడు. ఈ తప్పుడు వైఖరి అతని పై అధికార్లలో కూడ ఉంది' అని కమిషన్ అభిశంసించింది.

డోంగ్రీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఘటనల గురించి వ్యాఖ్యానిస్తూ –

'1992 డిసెంబర్ లోనూ 1993 జనవరిలోనూ జరిగిన హింసాత్మక ఘటనల నేర పరిశోధన చాలా అసంతృప్తికరంగా జరిగిందని చెప్పాలి. పోలీసులు హిందువులతో, మరీ ముఖ్యంగా శివసేనతో కుమ్మక్కయ్యారన్న అభిప్రాయం కలుగుతుంది' అని కమిషన్ అనింది.

ఆంటాప్ హిల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనల గురించి వ్యాఖ్యానిస్తూ, 'పోలీసుల నడవడిక చాలా ఆందోళన కలిగించే విధంగా ఉంది' అని కమిషన్ అనింది.

'కొన్ని సందర్భాలలో పోలీసులు చేతులు ముడుచుకు కూర్చొని దొమ్మీలకు పాల్పడుతున్న వారిని యధేచ్ఛగా తమ కార్యకలాపాలు కొనసాగనిచ్చారు. కొన్ని సందర్భాలలో వారిని ప్రోత్సహించారు. వారితో చేతులు కలిపారు. ఈ నేపథ్యంలో, నమోదు చేసిన నేరాల పరిశోధనలో కనిపించే లోపాలు కాకతాళీయంగా జరిగినవి కావనీ సాక్ష్యాన్ని కప్పి పెట్టడానికి ఉద్దేశ్యపూర్వకంగా జరిగిన ప్రయత్నమనీ అర్థమవుతుంది. పోలీసులలో ముస్లింల పట్ల వ్యతిరేకత ఉండిందని సాక్ష్యాలు స్పష్టం చేస్తున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే, పోలీసుల నడవడిక శాంతి భద్రతల యంత్రాంగం పట్ల విశ్వాసాన్ని నాశనం చేసేటట్టు ఉండింది' అని కమిషన్ అభిప్రాయపడింది.

కొన్ని ఘటనలను పరిశీలిస్తే పోలీసుల ఏకపక్ష వైఖరి ఎంత సంపూర్ణంగా ఉండిందో అర్థం అవుతుంది.

దేవనార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బైంగన్‌వాడిలో 1992 డిసెంబర్ 8న హిందువులు, ముస్లింల మధ్య పెద్దఎత్తున దొమ్మీ జరిగింది. ఇరువురూ పాల్గొన్నారనడానికి ఆధారంగా ముస్లింల అంగళ్లు 58, హిందువులవి 53 ధ్వంసం అయ్యాయి. కానీ పోలీసులు అరెస్టు చేసిన 36 మంది ముద్దాయిలూ ముస్లింలే. పోలీసు కాల్పులలో చనిపోయిన 9 మంది ముస్లింలే. ఒక్క హిందువుకు మాత్రమే బుల్లెట్ గాయం అయింది.

అదే రోజు అదే పోలీస్ స్టేషన్ పరిధిలోని గోవండి ప్రాంతంలో పోలీసులు అల్లరికి పాల్పడుతున్న ముస్లింల గుంపును చెదరగొట్టబోగా వారు పోలీసుల పైన కత్తులతో దాడి చేసారని ఒక ఎఫ్ఐఆర్ నమోదు అయింది. అయితే కొంచెం లోతుగా పరిశీలిస్తే, ఆ 'అల్లరి'లో హిందువులకు చెందిన నివాసాలు 40 ధ్వంసం కాగా ముస్లింలవి 207 ధ్వంసం అయ్యాయని కమిషన్ గమనించింది. అంటే అది నిజానికి ముస్లింలు చేసిన అల్లరి కాదని హిందూ ముస్లిం దొమ్మీ అని అర్థం అవుతుంది. కానీ ఎఫ్ఐఆర్‌లో ఎక్కడా హిందువుల గుంపు ప్రస్తావనే లేదు.

పోలీసుల రక్షణ కోరిన ముస్లింలకు అనేక సందర్భాలలో చేదు అనుభవం ఎదురయింది. అగ్రిపాదా పోలీస్‌స్టేషన్ పరిధిలోని బిఐటి చౌల్స్ నివాసులలో అత్యధికులు హిందువులు కాగా కొద్దిమంది ముస్లింలు. జనవరి 8 నాడు హిందువుల గుంపు ముస్లింలు నివసిస్తున్న చౌల్ నంబర్ 12 పైన రాళ్లతో, సోడాబాటిల్స్, పెట్రోల్ బాంబులతో దాడి చేసారు. 'సాయిబులను చంపండి' 'పాకిస్తాన్‌కు తరిమేయండి' అంటూ నినాదాలు ఇచ్చారు. చౌల్ నంబర్ 12లో నివసిస్తున్న ముంతాజ్ రెహమాన్ భయపడి పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేయగా ఫోన్ తీసుకున్న వ్యక్తి తాను ఎవరో చెప్పకుండ 'అప్పుడే ఏమయింది? నోరు మూసుకుని పడి ఉండు' అని అరిచి ఫోన్ పెట్టేసాడు. అదే చౌల్‌లో నివసించే మెహరున్నిసా మహమ్మద్ యాకూబ్ అన్సారీకి కూడ అటువంటి అనుభవమే ఎదురయింది. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా, 'పాకిస్తాన్‌కు పారిపో, ఇక్కడ ఎందుకుంటావు – చావడానికా' అని జవాబు లభించింది.

భోయివాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న కెఫే షేలార్ అనే హోటల్ యజమాని తన హోటల్ పైన దాడి జరిగే ప్రమాదం ఉందని జనవరి 10వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసాడు. అతను ముస్లిం. అతని ఫిర్యాదును పోలీసులు పట్టించుకోలేదు. ఆ హోటల్ నుండి పోలీస్ స్టేషను కేవలం అయిదు నిముషాల నడకే అయినా

పోలీసులు ఎటువంటి సహాయం పంపించలేదు. అతను ఊహించినట్టే అతని హోటల్ పైన దాడి జరిగింది. 7 లక్షల ఆస్తి లూటీ అయింది.

ఎం.ఆర్.ఏ మార్గ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక పోలీస్ కానిస్టేబుల్ తన కస్టడీలో ఉన్న ముద్దాయిని శివసేన కార్యకర్తలకు అప్పగించి చంపించిన ఘటన కమిషన్ పరిశీలనలో వెలికి వచ్చింది. డిసెంబర్ 8 నాడు ఒక దొమ్మీలో పాల్గొన్న బాబు అబ్దుల్ షేఖ్ అనే వ్యక్తిని ఇన్‌స్పెక్టర్ సాల్వి అరెస్టు చేసి, పోలీస్‌స్టేషన్‌కు తీసుకుపొమ్మని విద్యాధర్ రఘునాథ్ షేలార్ అనే కానిస్టేబులకు అప్పగించాడు. కొంతసేపటికి ఇన్‌స్పెక్టర్ వెనక్కిరాగా ఒక బ్రిడ్జి దగ్గర బాబు అబ్దుల్ షేఖ్ తీవ్రమైన కత్తిపోటు గాయాలతో పడి ఉన్నాడు. అతనిని పొడిచిన శివసేన కార్యకర్తలు రక్తంతో తడిసిన కత్తులతో సహా అక్కడే ఉన్నారు. అతనిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయాడన్నారు.

'నీ కస్టడీలో ఉన్న వ్యక్తి హత్యకెట్లా గురయ్యాడ'ని కానిస్టేబుల్ షేలార్‌ను పైస్థాయి పోలీస్ అధికారులు ప్రశ్నించగా, ముద్దాయి తన చేతినుండి తప్పించుకొని పారిపోయాడనీ, పారిపోతున్న వాడిని శివసేన వాళ్లు చంపారనీ అన్నాడు. కానీ అదే నిజమైతే అతను వెంటనే పోలీస్ స్టేషన్లో రిపోర్టు ఇవ్వాలి కదా, గుట్టుచప్పుడు కాకుండ ఎందుకు ఊరుకున్నాడన్న ప్రశ్నకు జవాబు లేదు. అతని పై అధికారులు అతని మాటలు విశ్వసించి విచారణ ముగించినప్పటికీ, జస్టిస్ శ్రీకృష్ణ సంతృప్తి చెందలేదు. ఇతర సాక్షులను విచారించి, ఆ కానిస్టేబుల్ మృతుడిని కావాలనే శివసేన వారికి అప్పగించాడని నిర్ధారించారు.

బైకుల్లా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఒక సంఘటనను కమిషన్ వివరంగా పరిశీలించింది. నారియెల్‌వాడి ప్రాంతంలో అబ్దుల్ హక్ కాసిం అలీ అన్సారీ అనే వ్యక్తికి ఒక టైలరింగ్ సంస్థ ఉంది. డిసెంబర్ 7వ తేదీన ఈ సంస్థ పైన దాడి జరిగింది. దాడి చేసిన వారు స్థానికులే కాబట్టి అన్సారీ వాళ్లలో కొందరిని గుర్తుపట్టాడు. సదా, ఛోటు, సునీల్, రాజేశ్ అనే నలుగురి పేర్లతో సహా పోలీసులకు ఫిర్యాదు ఇచ్చాడు. ఈ నలుగురు శివసేన కార్యకర్తలు. తన సంస్థను దోచుకున్నారనీ మెషిన్లు ఎత్తుకు పోయారనీ బిల్డింగ్‌ను తగలబెట్టారనీ ఫిర్యాదు చేసాడు. నిజానికి దాడి జరిగినప్పుడు సీనియర్ పోలీస్ కానిస్టేబుల్ పటాంకర్, ఇన్‌స్పెక్టర్ వాహులె, సబ్ ఇన్‌స్పెక్టర్ రాందేశాయి అక్కడే ఉన్నారు. వాళ్ల సమక్షంలోనే దాడి జరిగినా వాళ్లు ఏమీ చేయలేదు.

అన్సారీ ఫిర్యాదు ఇచ్చిన తరువాత కూడ పోలీసులు వాళ్లను అరెస్టు చేయలేదు. 7వ తేదీ రాత్రి అన్సారీ సంస్థ ఎదుటే సదా, ఛోటు అనే ఇద్దరు ముద్దాయిలు ఇన్‌స్పెక్టర్ వాహులెతో నవ్వుతూ కబుర్లు చెప్తూ కనిపించారు. పొద్దున్న మళ్లీ దాడి చేసారు. అన్సారీ ఫోన్ మీద సీనియర్ ఇన్‌స్పెక్టర్ పటాంకర్‌కు ఫిర్యాదు చేయగా, బందోబస్తు మీద ఉన్న పోలీసులు వస్తారు లెమ్మన్నాడు. ఒక గంట తరువాత ఇన్‌స్పెక్టర్ వాహులె నాయకత్వంలోని పోలీస్ పార్టీ అక్కడికి వచ్చింది. వాళ్లు మాటామంతీ లేకుండ లోపలికి వచ్చి అన్సారీనీ, అతని అసిస్టెంట్‌నూ ఇనపరాడ్లతో కొట్టి వ్యాన్లో ఎక్కించి పోలీస్ స్టేషన్‌కు తీసుకుపోయారు. ఇది చూసి అన్సారీ దగ్గర పనిచేసే సిబ్బందిలో సగం మంది పారిపోగా మిగిలిన సగంమందిని అరెస్టు చేసారు. వాళ్లందరి మీదా పోలీసులు కేసు పెట్టారు. లాకప్‌లో ఉన్న అన్సారీ పోలీసులు కొట్టిన దెబ్బలకు తన చేయి విరిగిందని వైద్యం చేయించమని అడగగా, 'కాలు విరగలేదు సంతోషించు' అని ఇన్‌స్పెక్టర్ వాహులె తిరస్కారంగా జవాబు చెప్పాడు.

బెయిల్ మీద బయటికొచ్చిన తరువాత అన్సారీ తాను మొదట ఇచ్చిన ఫిర్యాదు మీద కేసు పెట్టించాలని చాలా ప్రయత్నం చేసాడు. జనవరి 4వ తేదీన ఇన్‌స్పెక్టర్ వాహులె అతని సంస్థ వద్దకు వచ్చి రాజీపడమని అతనిని బలవంతం చేసాడు. దాడి చేసిన వాళ్లను తాను గుర్తుపట్టలేదని బలవంతంగా స్టేట్‌మెంట్ రాయించుకున్నాడు. కానీ జస్టిస్ శ్రీకృష్ణ కమిషన్ ముందు హాజరయి అన్సారీ జరిగిన విషయం మొత్తం వివరించి ఆధారాలు చూపించగా, కమిషన్ అతని వాంగ్మూలం విశ్వసనీయమైనదని నిర్ధారించి, 'దుండగులు శివసేన ముఖ్యులు కాబట్టి పోలీసులు ఈ కేసు పరిశోధనను ఉద్దేశ్యపూర్వకంగా తొక్కి పెట్టారు' అని పేర్కొంది. ఇన్‌స్పెక్టర్ వాహులెనే కాక సీనియర్ ఇన్‌స్పెక్టర్ పటాంకర్‌ను కూడ తప్పుపట్టింది.

బైకుల్లా పోలీస్ స్టేషన్ పరిధిలోని పఠాన్‌చాల్‌పైన జనవరి 10వ తేదీన హిందువుల గుంపు రాళ్లతోనూ సోడాబాటిల్స్‌తోనూ దాడి చేసింది. చాల్ నివాసులయిన ముస్లింలు ఫిర్యాదు చేయగా పోలీసులు వచ్చారుగానీ దుండగులను తరిమేసే బదులు చాల్ నివాసులనే వేధించారు. వాళ్లు నిరసన తెలుపుతూ ఊరేగింపు తీసారు. దానికి ప్రతిగా హిందూ మహిళలు పోలీసుల వేధింపులకు వ్యతిరేకంగా తాము కూడ ఒక ఊరేగింపు తీసారు.

ఈ గొడవల మధ్య పోలీసులొక ఘోరమైన హత్య చేసారు. పఠాన్‌చౌల్‌లోని హసన్ మియావాగ్లె ఇంటిలోకి చొరబడి అతని భార్యనూ కుమార్తె యాస్మిన్‌నూ తుపాకీతో బెదిరించి అతని కొడుకు షానవాజ్‌ను లాక్కుపోయారు. అతన్ని తంతూ తుపాకి మడమలతో కొడుతూ బయటకు తీసుకుపోయారు. వ్యాన్లో ఎక్కించే ముందు అతని వీపులో తుపాకితో కాల్చి చంపి శవాన్ని వ్యాన్ ఎక్కించారు.

షానవాజ్ సోదరి యాస్మిన్ కమిషన్ ముందు హాజరయి ఇచ్చిన వాంగ్మూలాన్ని కమిషన్ ప్రాథమికంగా విశ్వసించి అప్పటికప్పుడే ఈ హత్య పైన విచారణ జరిపి తగు చర్య తీసుకొమ్మని సురేందర్ కుమార్ అనే డిసిపిని ఆదేశించింది. అతను పరిశోధన జరిపినట్టు జరిపి, 'కేవలం ఇద్దరు ముగ్గురు ముస్లిం సాక్షుల మాటలను బట్టి షానవాజ్‌ను పోలీసులే చంపారని నిర్ధారించలేము' అని కమిషన్‌కు తన నివేదిక సమర్పించాడు. అతని రిపోర్టును 'దుర్మార్గమైనది'గా అభివర్ణిస్తూ 'దానిని పరిశీలించడమైనా, విచారణ జరిపిన పద్ధతి గురించి వ్యాఖ్యానించడమైనా శుద్ధదండగ' అని జస్టిస్ శ్రీకృష్ణ అన్నారు.

ఇమామ్‌వాడ బిఐటి చౌల్స్‌లో నివసించే పోలీసు కానిస్టేబుళ్ల ఇళ్లపైన డిసెంబర్ నెలలో ముస్లింలు దాడి చేసి విధ్వంసం సృష్టించినందుకు ప్రతీకారంగా పోలీసులు ఆ తరువాత ఆ చౌల్స్‌లో నివసించే ముస్లింలపైన తీవ్రస్థాయిలో ప్రతీకారం తీర్చుకున్నారు. అజీజ్ మర్చంట్ ఎన్‌కౌంటర్ హత్య దీనికొక ఉదాహరణ. అజీజ్ మర్చంట్‌కు గుండె జబ్బు, అల్సర్ ఉండేవి. దాదాపు పడక మీది నుండి లేవలేని స్థితిలో ఉన్నాడు. ఈ విషయమే అతనికి వైద్యం చేసిన డాక్టర్ మోలెదీనా కమిషన్ ముందు సాక్ష్యం చెప్పాడు. కానీ జనవరి 10 నాడు 20–25 మంది సాయుధ పోలీసులు అతని ఇంట్లోకి ప్రవేశించి ఇల్లంతా చిందరవందర చేసి అతని భార్య సల్మాను పక్కకు నెట్టేసి అజీజ్‌ను తీసుకుపోయారు. అజీజ్ 11వ తేదీన ఒక దొమ్మీలో పాల్గొన్నాడని, అప్పుడు జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడని ప్రకటించారు. కానీ సల్మా సాక్ష్యాన్ని బట్టి, అజీజ్‌కు వైద్యం చేసిన డాక్టరు సాక్ష్యాన్ని బట్టి, అతనిని పోలీసులు ముందు రోజే తీసుకుపోయి కాల్చి చంపారని కమిషన్ భావించింది.

ఇద్దరు పోలీస్ కానిస్టేబుల్స్‌ను ముస్లింల గుంపు హతమార్చిన దేవనార్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు ముస్లింలపైన విపరీతంగా హింసకు పాల్పడ్డారు. అష్ఫర్

ఖాన్ ఆషిక్ ఖాన్ అనే వ్యక్తి తన తమ్ముడు జహీర్ ఖాన్‌తో పాటు డిసెంబర్ 28న శివాజీనగర్ రామమందిరం పక్క నుండి పోతుండగా పోలీసులు ఆపారు. కర్రలతో, తుపాకి మడమలతో కొట్టారు. పక్కనే బందోబస్తులో భాగంగా కుర్చీలు వేసుకొని కూర్చున్న పోలీస్ అధికారులు చూస్తూ ఉన్నారు తప్ప తమ సిబ్బందిని వారించలేదు. పోలీసులు కొడుతుండగా జహీర్ ఖాన్ తప్పించుకున్నాడు గానీ అస్ఘర్ ఖాన్‌ను కిందపడేసి 'తురకోడా' అంటూ తన్నారు. అతను స్పృహ కోల్పోయాడు. కొంతసేపటికి స్పృహ వచ్చేసరికి తన జేబులో ఉన్న 5000 రూ॥లు, తన చేతి గడియారం పోయాయని గమనించాడు. పోలీసులతన్ని ఛీత్కరించుకొని 'ఇక పారిపో' అన్నారు. అస్ఘర్ ఖాన్ లేచి వెళ్లిపోతుండగా దగ్గరున్న శివసేన శాఖ కార్యకర్తలు అతనిని కత్తితో బెదిరించారు.

డిసెంబర్ 8వ తేదీన నూర్–ఇ–ఇలాహీ మసీదు దగ్గర అబ్దుల్ అష్రాఫి అనే మదరసా అధ్యాపకుడు కూర్చుని ఉండగా బయట అలజడి వినిపించింది. అతను బయటకు తొంగి చూడగా జనం చెల్లాచెదురయి పరుగెత్తుతున్నారు. పోలీసులు కాల్పులు జరుపుతున్నారు. అంతేకాక మసీదుకూ కొన్ని దుకాణాలకూ పోలీసులు నిప్పు పెట్టడం చూశాడు. నిప్పు ఆర్పడానికి అష్రాఫి, మరికొందరు ప్రయత్నించగా పోలీసులు మసీదు లోపలికి ప్రవేశించి వారిని కొట్టి బయటకు లాక్కుపోయారు. తుపాకీ గురి పెట్టి లైన్లో నిలబడమన్నారు. మసీదు కమిటీ కార్యదర్శి అబ్దుల్ గఫార్‌ను నేరుగా ఛాతీలో కాల్చి చంపారు. యాకూబ్ అనే మరొక వ్యక్తిని కడుపులో కాల్చి తీవ్రంగా గాయపరిచారు. హఫీజ్ మహమ్మద్ కాఫిల్‌ను తన్ని తమతో తీసుకుపోయారు. అతని ఆచూకీ ఆ తరువాత తెలియలేదు.

ఇటువంటి ఘటనలను కమిషన్ వ్యాఖ్యానిస్తూ, ముస్లింల గుంపు ఇద్దరు కానిస్టేబుళ్లను చంపినందుకు ప్రతీకారంగా దేవనార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు ముస్లింల పైన ప్రతీకారం తీర్చుకోవడానికి పూనుకున్నారనీ, హత్యల పైన పరిశోధన చేస్తున్నామన్న నెపం మీద అమాయకులయిన ముస్లింలను హింసకు గురి చేసారనీ అభిప్రాయపడింది.

ధారవి పోలీస్ స్టేషన్ పరిధిలోని మదీనా మసీదు దగ్గర సఫీక్ ఖాన్ అనే అతనికి రెడీమేడ్ బట్టల అంగడి ఉండింది. డిసెంబర్ 8 నాడు స్థానిక శివసేన శాఖ కార్యకర్త లైన అశోక్ దారువాలా, గణేశ్, విజయ్, బాలు, అతుల్, సురేశ్ తదితరుల

నాయకత్వంలో ఒక హిందూ యువకుల గుంపు అతని ఇంటి పైన, అంగడి పైన దాడి చేసారు. అతని చేత బలవంతంగా 'జైశ్రీరాం' అన్న నినాదం ఇప్పించారు. అతని ఇంటిని శివసేన శాఖ కార్యాలయంగా మార్చదలచుకున్నామని చెప్పి అతనిని తరిమేసారు. అంతపనీ చేసారు. అతను కొన్ని రోజుల తరువాత తిరిగి వచ్చి చూసేసరికి అతని ఇల్లు శివసేన కార్యాలయంగా మారింది. దాని పైన శివసేన జెండా ఎగురుతున్నది. ఖాన్ ధారవి పోలీస్ స్టేషన్‌కే కాక డిసిపికి, నగర పోలీస్ కమీషనర్‌కు కూడ ఈ విషయం ఫిర్యాదు చేసాడు. ధారవి పోలీస్ స్టేషన్ చుట్టూ చాలాసార్లు తిరిగాడు. అయినప్పటికీ అతని ఇంటిని అతనికి అప్పగించలేదు. చాలా నెలల తరువాత అప్పటి డిసిపి రాకేశ్ మారియా బదిలీ అయి పాండే అనే అధికారి డిసిపిగా వచ్చిన తరువాత ఖాన్ మళ్లీ అభ్యర్థించగా పాండే చొరవ తీసుకొని అతని ఇంటినుండి శివసేన కార్యాలయాన్ని తొలగించి ఖాన్‌కు తిరిగి ఇప్పించాడు. ఈ మాత్రం చేసిన ఒక్క పోలీస్ అధికారి అయినా ముంబాయిలో ఉన్నందుకు జస్టిస్ శ్రీకృష్ణ అభినందనలు తెలియచేసారు.

డోంగ్రీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆ పోలీస్ స్టేషన్‌కు కేవలం 100 అడుగుల దూరాన (అంటే దాదాపు పక్కనే అని చెప్పుకోవచ్చు) ఉన్న తాకివాలా బిల్డింగ్‌లోని ముస్లింల ఇళ్లు 16, దర్వేష్ బిల్డింగ్‌లోని ముస్లింల ఇళ్లు 10, ఆయేషాబాయి బిల్డింగ్‌లోని ముస్లింల ఇళ్లు 8, ఛోటానీ మన్జిల్‌లోని ముస్లింల ఇళ్లు 57 లూటీకీ, దహనానికి గురయిన విషయాన్ని కమిషన్ ప్రస్తావిస్తూ, 'పోలీస్ స్టేషన్‌కు అంత సమీపంలో ఉన్న ఇళ్ల తలుపులు విరగొట్టి యధేచ్ఛగా దోచుకోవడం, తగలబెట్టడం సాధ్యమయిందంటేనే పోలీసుల నిర్లక్ష్యవైఖరి ఎంతటిదో అర్థం అవుతుంది' అనింది.

ముస్లింలు పోలీసులపైన తుపాకులతో కాల్పులు జరిపిన అనేక ఘటనలను ముంబాయి పోలీసులు ప్రచారంలో పెట్టారు. పోలీసుల దాడులు ఎక్కువగా ముస్లింల పైననే జరగడాన్ని సమర్థించుకోవడానికి ఇది పనికి వచ్చింది. కానీ కమిషన్ ఈ ఘటనలను ఒక్కొక్కటి పరిశీలించి ఇవి చాలావరకు అవాస్తవాలని నిర్ధారించింది. కమిషన్ ముందు వాంగ్మూలం ఇచ్చిన అసిస్టెంట్ పోలీస్ కమీషనర్ జెండె కూడ నిజాయితీగానే ఈ విషయాన్ని ఒప్పుకున్నాడు. 'ముస్లింలు పోలీసుల పైన, హిందువుల పైన తుపాకులతో కాల్పులు జరిపిన అనేక ఘటనల గురించి ప్రచారం జరిగింది గానీ పరిశోధన మీదట ఇవి అవాస్తవాలని తేలింది' అన్నాడు.

ఒకటి రెండు ఘటనలను పరిశీలిస్తే ముంబాయి పోలీసులు ముస్లింలను టెర్రరిస్టులుగా చిత్రీకరించడానికి ఎంత దూరం పోయారో అర్థం అవుతుంది.

ఇబ్రహీం రహింతుల్లా రోడ్‌లోని సులేమాన్ బేకరీపైన జనవరి 9 నాడు పోలీసులు జరిపిన దాడిలో 9 మంది ముస్లింలను కాల్చిచంపారు, 78 మందిని అరెస్టు చేసారు. ఈ చర్యను సమర్థించుకోవడానికి పోలీసులు సులేమాన్ బేకరీని పెద్ద టెర్రరిస్టు స్థావరంగా చిత్రీకరించే ప్రయత్నం చేసారు. ఆరోజు పొద్దున్న బేకరీ పై భాగం నుండి పోలీసుల పైన కాల్పులు జరిగాయనీ, కాల్పులు జరిపిన ముగ్గురిలో ఒకరి చేతిలో స్టెన్‌గన్, ఇద్దరి చేతిలో రివాల్వర్లు ఉన్నాయనీ పోలీసులు అన్నారు. దీనితో పోలీసులు నగర జాయింట్ పోలీస్ కమీషనర్ ఆర్.డి. త్యాగి ఆధ్వర్యంలో దాడికి దిగారు. బేకరీ కిటికీ అద్దాలు పగలగొట్టి లోపలికి పోయి, నిచ్చెన ఎక్కి పై అంతస్తులోకి పోయి ముస్లింల కాల్పులను ఎదుర్కొని కాల్పులు జరిపి 9 మందిని చంపి 78 మందిని అరెస్టు చేసామని ఎఫ్‌ఐఆర్ రాసుకున్నారు.

ఈ వీరోచిత కార్యంలో నలుగురు పోలీసులకు గాయాలయ్యాయని అన్నారుగానీ వాళ్ల పేర్లు ప్రకటించలేదు, వాళ్లను కమిషన్ ముందు సాక్షులుగా ప్రవేశపెట్టలేదు. వాళ్లను మించిన సాక్షులు ఉండరు కాబట్టి వాళ్లను ప్రవేశపెట్టక పోవడం నిజాన్ని దాచడం కోసమేనని కమిషన్ అభిప్రాయపడింది.

అరెస్టయిన 78 మంది, చనిపోయిన 9 మంది కలిసి మొత్తం 87 మంది ఒక మామూలు బేకరీలో ఇరుక్కుని ఉన్నారంటే వాళ్లను టెర్రరిస్టులుగా భావించాలా లేక పోలీసుల దాడికి భయపడి అక్కడ దాక్కున్నారనుకోవాలా అన్న ప్రశ్న కూడ కమిషన్ వేసింది.

ముస్లింలు జరిపారని చెప్తున్న కాల్పులకు ఏ ఆధారాలూ పోలీసులు చూపించలేదు. దుండగుల చేతిలో గన్ ఉందని చెప్తూ, ఒక ఎకె-47 షెల్‌ను చూపించి ఇది వాళ్ల తుపాకి నుండి వచ్చిందని అన్నారు! నిజానికి పోలీసుల ఒప్పుకోలు ప్రకారమే పోలీసుల చేతిలో ఎకె-47 లు ఉన్నాయి కాబట్టి అది పోలీసుల తుపాకికి చెందినదే అయి ఉంటుందని కమిషన్ అభిప్రాయపడింది.

బేకరీ పై అంతస్తులోకి పోవాలంటే సన్నటి నిచ్చెన ఎక్కి తాడు పట్టుకొని దూకాలనీ, పై అంతస్తులో తుపాకులు పట్టుకున్న టెర్రరిస్టులు గానీ ఉన్నట్టయితే

పోలీసులు ఒక్కొక్కరుగా పై అంతస్తులోకి విజయవంతంగా పోయి 9 మందిని చంపి 78 మందిని అరెస్టు చేసి తామెవరూ చావకుండ తిరిగి రావడం సాధ్యం కాదనీ కూడ కమిషన్ అభిప్రాయపడింది.

సారాంశంలో, అన్నిచోట్లలాగే సులేమాన్ బేకరీ ఘటనలో కూడ ముస్లింలు పోలీసుల పైన రాళ్లు, కర్రలు, సోడాబాటిల్స్‌తో బేకరీ నుండి, పక్కన ఉన్న చున్నాభట్టి మసీదు నుండి దాడి చేసినట్టున్నారనీ, పోలీసులు ప్రతీకారంగా పెద్దెత్తున దాడికి దిగేసరికి అందరూ సులేమాన్ బేకరీలో రక్షణకోసం దూరారనీ, పోలీసులు బేకరీలోకి ప్రవేశించి విచ్చలవిడిగా కాల్పులు జరిపి 9 మంది అమాయకులను పొట్టన బెట్టుకున్నారనీ కమిషన్ నిర్ధారించింది. ఈ ఘోరకృత్యానికి జాయింట్ పోలీస్ కమీషనర్ త్యాగి స్వయంగా బాధ్యత వహించవలసి ఉంటుందనింది.

హిందువులు సంప్రదాయకమైన ఆయుధాలతోనే దొమ్మీలకు దిగారుగానీ ముస్లింలు తుపాకులు, అందులోనూ ఆటోమేటిక్ తుపాకులు ప్రయోగించారనీ, అవి వారికి పాకిస్తాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ సరఫరా చేసిందనీ, అందువల్లనే పోలీసులు ముస్లింల మీద ఎక్కువగా చర్యలు తీసుకోవడం జరిగిందనీ ఒక అభిప్రాయం కలిగించడానికి శివసేన, ముంబాయి పోలీసులు ప్రయత్నం చేసారు. జస్టిస్ శ్రీకృష్ణ ఒక్కొక్క ఘటననూ పరిశీలించి ఈ 'తుపాకుల' కథలలో అత్యధిక భాగం అబద్ధమని తేల్చారు. 'ఐఎస్ఐ హస్తం' ఉందనడానికి ఏ ఆధారం లేదని కమిషన్ ముందు పోలీస్ అధికార్లే ఒప్పుకున్నారు.

ముస్లింల ఇళ్లపైన పోలీసులు దాడిచేసినప్పుడు స్త్రీలతో అవమానకరంగా ప్రవర్తించిన ఘటనలు అనేకం కమిషన్ దృష్టికి వచ్చాయి. ఇమామ్‌వాడ బిఐటి చౌల్స్‌లో నివసించే జులేఖా హస్సన్ షేఖ్ 56 సంవత్సరాల స్త్రీ. డిసెంబర్ 8 నాడు, పాలు తేవడం కోసం బజారుకు పోయిన మనుమడి కోసం ఎదురు చూస్తూ (అది అప్పుడే కర్ఫ్యూ సడలించిన సమయం) ఆమె మెట్లమీద నిలబడి ఉండగా పోలీసులు ఆమె ఇంటి పైన దాడి చేసారు. ఇక్కడెందుకు ఉన్నావు అంటూ కర్రలతో నడుము మీద, వీపు మీద, మోకాళ్లమీద కొట్టారు. మోకాళ్లమీద కొడుతూ, 'డ్యాన్స్ చేస్తే ఈ వయసులో కూడ అందంగా ఉంటావు సుమా' అంటూ ఆమెను హేళన చేసారు.

పోలీసులెవరయినా నిష్పక్షపాతంగా ఉండే ప్రయత్నం చేస్తే శివసేనవారు ఊరుకోలేదు. ముంబాయి పోలీసు ఉన్నతాధికారులలోని ఏకైక ముస్లిం అయిన అడిషనల్ పోలీస్ కమీషనర్ ఎ.ఎ. ఖాన్‌ను తొలగించాలంటూ ఊరేగింపులు తీసారు. అతను హిందువులపైన అత్యాచారాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. అతనిని బర్తరఫ్ చేయాలంటూ మూడుసార్లు మోర్చాలు తీసినవాడు శివసేన ఎంఎల్ఎ మధుకర్ సర్పోట్‌దార్. ఇతను స్వయంగా జీపునిండా ఆయుధాలు పెట్టుకొని నగర వీధులలో తిరుగుతూ దొరికిపోయిన ఘనుడు. పోలీసులే అయితే 'అతనిని అరెస్టు చేయకపోదురేమో గానీ ఆలస్యంగా రంగంలోకి దించిన సైన్యానికి జనవరి 11 నాడు సర్పోట్‌దార్ దొరికాడు. అతని జీపులో అతను కాక ఆరుగురు శివసైనికులు ఉన్నారు. ఒక 0.32 రివాల్వర్, ఒక 0.20 పిస్టల్, ఒక 0.99 పిస్టల్, రెండు గొడ్డళ్లు, రెండు హాకీ కర్రలు దొరికాయి. సైన్యం అతన్ని పట్టుకొని పోలీసులకు అప్పగించింది. సర్పోట్‌దార్ దగ్గర దొరికిన ఆయుధాలలో రెండింటికి (పిస్టోళ్లకు) లైసెన్స్ లేదు. 'ముంబాయి టాడా చట్టం కింద నోటిఫైడ్ ప్రాంతం అయినప్పటికీ, లైసెన్స్ లేని ఆయుధాలు కలిగి ఉండటం టాడా సెక్షన్ 5 కింద నేరం అయినప్పటికీ, పోలీసులు అతని మీద టాడా కేసు పెట్టే ఆలోచన చేయలేదు, అతనికి కోర్టు బెయిలు ఇవ్వడాన్ని వ్యతిరేకించలేదు, పెట్టిన సీదాసాదా కేసులో కూడ మూడేండ్ల తరువాత కూడ చార్జిషీటు పెట్టలేదు' అని జస్టిస్ శ్రీకృష్ణ వ్యాఖ్యానించారు.

దాదాపు అదే సమయంలో, ముస్లింలకు అనుకూలంగా ఉంటాడని పేరుపడ్డ కాంగ్రెస్ ఎంపి సునీల్‌దత్ కుమారుడు సంజయదత్ దగ్గర లైసెన్స్ లేని ఆయుధం దొరికిందన్న కారణంగా అతని పైన టాడా కేసుపెట్టి చాలాకాలం జైలులో ఉంచిన సంగతి తెలిసిందే.

సులేమాన్ బేకరీ ఘటనలాంటిదే ఆర్ఎకెఈ మార్గ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హరి మసీదు కాల్పుల ఘటన. 10 జనవరి నాడు జరిగిన ఈ ఘటనలో ఆరుగురు ముస్లింలు పోలీసు కాల్పులలో చనిపోయారు. పోలీసుల కథనం ప్రకారం, దాదాపు 2500 మంది ముస్లింలు మారణాయుధాలతో హరి మసీదు దగ్గర సమావేశమై చుట్టుపక్కల ఉన్న హిందువులు నివాసాలను తగలబెడుతూ ముందుకు సాగారు. మసీదు నుండి కాల్పులు కూడా జరిపారు. ఈ హింసాకాండను అదుపు చేయడానికి పోలీసులు కాల్పులు జరపగా ఆరుగురు ముస్లింలు చనిపోయారు.

కమిషన్ ఈ ఘటనకు సంబంధించిన ఒక్కొక్క విషయాన్నీ తరచి తరచి ప్రశ్నించి ఇది మొత్తంగా అబద్ధం అని నిర్ధారించింది. మొదటిగా, మసీదు సమీపంలోని ఏ ఒక్క హిందూ నివాసానికీ ఎటువంటి అపాయం జరగలేదు. రెండు, ఘటన జరుగుతున్నప్పుడు పోలీస్ స్టేషన్‌కు అందిన వైర్‌లెస్ సమాచారం ప్రకారం మసీదు దగ్గర పెద్ద హిందువుల గుంపు కూడ మోహరించి ఉండింది. హిందువులకూ ముస్లింలకూ మధ్య దొమ్మీ జరిగిందన్న విషయాన్ని కప్పిపెట్టి కేవలం ముస్లింలు దహనకాండకు పాల్పడినట్టు చూపించాలని పోలీసులు తరువాత ప్రయత్నం చేసారు. చివరిగా, చనిపోయిన ఆరుగురి శవాలూ మసీదులోపలే ఉన్నాయిగానీ బయటకాదు. మసీదు వైపు నుండి కాల్పులు జరిగాయని నమ్మడానికి కూడ ఆధారాలేమీ లేవని కమిషన్ నిర్ధారించింది.

నిజానికి జరిగిందేమిటంటే మసీదు సమీపంలో ఇరువర్గాలూ మోహరించి ఘర్షణపడ్డారు. పోలీసులు వచ్చేసరికి నమాజ్ వేళ అయింది. మసీదులో 100 మందికి పైగా నమాజ్ చేస్తున్నారు. సబ్ ఇన్‌స్పెక్టర్ కాప్సె నాయకత్వంలో పోలీసులు మసీదులోకి ప్రవేశించి నమాజ్ చేస్తున్న వారిపైన గుళ్లవర్షం కురిపించారు. కాప్సె చేసిన ఈ నేరాన్ని డిసిపి బిష్ణోయ్ వెనకేసుకురావడాన్ని కూడ కమిషన్ తీవ్రంగా తప్పుపట్టింది. కాప్సె కాల్పులు జరపలేదనీ తాను వచ్చిన తరువాతే కాల్పులకు ఆదేశం ఇవ్వడం జరిగిందని డిసిపి ఇచ్చిన వాంగ్మూలం అందరి సాక్ష్యాలకు విరుద్ధంగా ఉందని కమిషన్ అనింది. 'తన కింద అధికారికి అండగా నిలబడడం గొప్ప లక్షణమే కావచ్చును గానీ అతని మాటలు నమ్మలేకుండ ఉన్నాం' అనింది. మొత్తానికి పోలీసు యంత్రాంగం పై నుండి కిందిదాకా అబద్ధాలు చెప్పి హరి మసీదులో జరిగిన ఘోరమైన హత్యాకాండను దాచి పెట్టాలని ప్రయత్నం చేయడాన్ని కమిషన్ తీవ్రంగా దుయ్యబట్టింది. పోలీసులు మాటలు 'పూర్తిగా నమ్మశక్యం కానివి' అనీ 'కల్పితమనీ' 'కాల్పులు సమర్థనీయం కాదు' అనీ నిర్ధారించింది.

అదే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన నూరుల్లా హుస్సేన్ షేఖ్ హత్య పోలీసుల వైఖరిని సూచించే మరొక ఉదంతం. జనవరి 10 నాడు వీళ్లు నివసించే ప్రాంతం మీద హిందువుల గుంపు దాడిచేసి ఇళ్లు ధ్వంసం చేయసాగారు. అతను, అతని భార్య, ఇతర బంధువులూ పారిపోతుండగా అయిదారు మంది కర్రలతో కత్తులతో దాడిచేసి నూరుల్లాను కిందపడేసి అతని పైన కిరోసిన్ పోసి తగలబెట్టి చంపారు.

అయితే ఈ హత్య గురించి కేసు రిజిస్టర్ చేయడానికి అతని భార్య షకీలా బాను చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఆమె ఆరేడుసార్లు పోలీస్ స్టేషన్‌కు పోయి చెప్పినా అసిస్టెంట్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ భాగ్వత్ మాధవ్ కోలీ, సబ్ ఇన్‌స్పెక్టర్ కాప్సె హత్యకేసు నమోదు చేసుకోలేదు. చివరికి 'మనిషి కనబడడం లేదు' అన్న ఎఫ్ఐఆర్ నమోదు చేసారు. శ్రీకృష్ణ కమిషన్ ఏర్పాటయిన తరువాత షకీలా బాను వచ్చి మొరపెట్టుకునేదాకా కేసు కూడ నమోదు కాలేదు. 'పోలీస్ అధికారులు కోలి, కాప్సె కావాలనే ఈ పని చేసారు. ఫిర్యాది ముస్లిం అన్న తిరస్కార భావంతో కావచ్చు, హంతకులను కాపాడే ఉద్దేశ్యంతో కావచ్చు' అని కమిషన్ వ్యాఖ్యానించింది.

సబ్ ఇన్‌స్పెక్టర్ కాప్సె మీద మరొక తీవ్రమైన ఫిర్యాదు కూడ ఉంది. హరి మసీదు కాల్పుల ఘటన గురించి పైన చెప్పాము. కాల్పులలో చనిపోయిన ఆరుగురి శవాలను ఎత్తి వ్యాన్లో వేయమని కాప్సె మహమ్మద్ ఆదం అనే యువకుడికి పురమాయించాడు. ఆ తరువాత ఆదంను కూడ వ్యాన్ ఎక్కమని తీసుకుపోయాడు. అప్పటినుండి ఆదం ఆచూకీ తెలీదు. అతని తల్లి రోషన్‌బీ ఆ తరువాతి రోజునుండి వరుసగా ఎనిమిది రోజులు పోలీస్ స్టేషన్‌కు పోయి తన కొడుకు గురించి అడిగింది. మాకేమీ తెలీదని పోలీసులు అన్నారు. రోషన్‌బీ ఆ తరువాత నగర పోలీస్ కమీషనర్‌కు, హోంమంత్రికి అర్జీలు పెట్టుకుంది. హైకోర్టులో రిట్ పిటిషన్ వేసింది. కానీ దేనికీ ఫలితం దక్కలేదు. ఆదం ఆచూకీ ఇప్పటికీ తెలీదు.

## ముగింపు

శ్రీకృష్ణ కమిషన్ నివేదిక మొత్తం చదివితే బహుశా అన్నిటికంటె కొట్టొచ్చినట్టు కనిపించే విషయం, శివసేన పైన చర్య తీసుకోవడానికి పోలీసు యంత్రాంగంలోనూ అధికార యంత్రాంగంలోనూ ఉన్న వెరపు. పోలీస్ అధికారులే కాదు, అప్పటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి సుధాకరరావు నాయక్ సహితం కమిషన్ ముందు హాజరయి ఇదే వైఖరి వ్యక్తం చేసాడు. శివసేన నాయకులను సకాలంలో అదుపులోకి తీసుకొని ఉండవచ్చును కదా అంటే 'ఆపని చేస్తే ముంబాయి తగలబడుతుందని భయపడ్డాము' అంటాడు. 'అయినా ముంబాయి తగలబడకుండ ఉండలేదు కదా' అన్న జస్టిస్ శ్రీకృష్ణ వ్యంగ్యోక్తి ఉచితమైనదే.

ఈ భయం పైనుండి కిందిదాకా ఉంది. బాల్‌థాకరే శివసేన అధికార దినపత్రిక 'సామ్నా'లో నిత్యం రాస్తున్న రెచ్చగొట్టే రాతల పైన అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏ చర్య తీసుకోలేదు. జనవరి 1, 1997 నాటి సంపాదకీయాన్ని శ్రీకృష్ణ కమిషన్ ప్రత్యేకంగా ప్రస్తావించి దాని పైన కేసెందుకు పెట్టలేదని పోలీస్ అధికార్లను ప్రశ్నించింది. పెట్టకపోవడానికి వాళ్లు చెప్పిన కారణం పైన వివరించాము. అదే విధంగా, ముస్లిం బాధితులు శివసేన కార్యకర్తల పేర్లు ఇచ్చినప్పటికీ ఎందుకు అరెస్టు చేయలేదని ఇన్‌స్పెక్టర్‌లను కమిషన్ ప్రశ్నిస్తే, 'అరెస్టు చేస్తే అల్లర్లు మరింత పెరుగుతాయని చేయలేదు' అని జవాబు చెప్పారు.

ఆనాటి నుండి ఈ నాటిదాకా శివసేనపట్ల, సంఘపరివార్ సంస్థల పట్ల ఇదే వైఖరి కొనసాగుతున్నది. వాళ్లు సినిమాహాల్ పైన రాళ్లు వేస్తే సినిమా ప్రదర్శన రద్దు చేయాలని ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. వాళ్లు పాకిస్తాన్ జట్టును ముంబాయిలో అడుగు పెట్టనివ్వమని బెదిరిస్తే క్రికెట్ అధికార యంత్రాంగమే మ్యాచ్‌ను రద్దు చేస్తుంది. వాళ్లనేమైనా అంటే గొడవ ఎక్కువ అవుతుంది కాబట్టి వాళ్ల ఆదేశాలకు తలఒగ్గడం ఉత్తమం అనే వైఖరి సర్వత్రా వ్యాపించింది. ఈ 'టెర్రర్' ను జయించకపోతే భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడం సాధ్యం కాదు.

శ్రీకృష్ణ కమిషన్ నివేదిక మాటకొస్తే ఎవరినయితే కమిషన్ ప్రధాన దోషులుగా గుర్తించిందో వారే ఈ లోపల మహారాష్ట్రలో అధికారానికి వచ్చారు. కమిషన్ నివేదిక పైన చర్య తీసుకోవలసింది వారే. తాము ఏ చర్య తీసుకోబోతారో వారు ప్రకటించారు. కమిషన్ చేసిన సూచనల్లో కేవలం సాంకేతికమైన వాటిని మహారాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. అంటే పోలీసులకు నేరపరిశోధనలో ఇంకా బాగా తర్ఫీదు ఇవ్వాలి, మంచి వైర్ లెస్ పరికరాలు ఇవ్వాలి వగైరా. వేరే ఏ అభిప్రాయాన్ని సూచననూ ఆమోదించలేదు. అల్లర్లలో శివసేన కుట్ర ఉందని ఆమోదించలేదు. పోలీసులలో ముస్లింల పట్ల వ్యతిరేకత ఉందని ఒప్పుకోలేదు. పాకిస్తాన్ పాత్ర, ఐఎస్ఐ పాత్ర ఉన్నాయని నమ్మడానికి ఆధారాలేవీ లేవంటే అంగీకరించలేదు.

అల్లర్లకు ఏ వ్యాఖ్యానాన్నయితే కమిషన్ తిరస్కరించిందో దానినే మహారాష్ట్ర ప్రభుత్వం పునరుద్ఘాటించింది. 'దేశద్రోహులయిన ముసింల హింసాత్మక చర్యలే' అల్లర్లకు నాంది అనీ, వారి వెనుక పాకిస్తాన్ హస్తం ఉందనీ, ముస్లింల

అతివాదంతోనూ, వారి పట్ల లౌకికవాదం పేరిట సాగుతున్న బుజ్జగింపు ధోరణితోనూ విసిగిపోయిన హిందువులు తిరగబడ్డారే తప్ప అల్లర్లలో హిందుత్వవాద సంస్థల కుట్రే లేదనీ అనింది.

కాబట్టి శ్రీకృష్ణ కమిషన్ నివేదిక ఫలితంగా ముంబాయి పోలీస్ యంత్రాంగంలో ప్రక్షాళన ఏదీ జరగకపోవచ్చు, హింసకు పాల్పడిన శివసేన వారికి చట్టం నుండి ఏ అపాయమూ రాకపోవచ్చు.

అయినప్పటికీ కమిషన్ ప్రయాస వృధా కాదు. బాబ్రీ మసీదు కూల్చివేతతో దేశ సామాజిక రాజకీయ జీవితంలో ప్రజాస్వామ్యానికి, ప్రజాస్వామ్య విలువలకూ పెద్ద ప్రమాదకారిగా ముందు కొచ్చిన హిందుత్వవాద ఫాసిజాన్ని ఎదుర్కునే పెద్ద కర్తవ్యానికి ఈ నివేదిక, అందులో వెలికి వచ్చిన సత్యాలు తోడ్పాటునీయగలవు. ఈ ఫాసిజం గురించి శ్రీకృష్ణ కమిషన్ నివేదిక మనకు మరింత వివరణాత్మకమైన అవగాహన ఇయ్యగలదు. దానిని స్వీకరించి, అవగాహన చేసుకొని ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కృషి చేయడం మనందరి కర్తవ్యం.

మానవహక్కుల వేదిక బుక్‌లెట్‌గా వచ్చింది
జనవరి 1999

# దళితులకు చేయాల్సింది ఇంకా చాలా ఉంది

**గౌ॥ జస్టిస్ పున్నయ్య కమిషన్**
**హైద్రాబాద్.**

**అయ్యా,**

**విషయము :** దళితుల పట్ల వివక్ష, అత్యాచారాలు – ప్రభుత్వ విధానాలు, చట్టాలు – తగు సూచనలు – గురించి

రాష్ట్రంలో దళితులు వివిధ రంగాలలో అనుభవిస్తున్న వివక్షను పోగొట్టడానికి, దళితుల పైన జరుగుతున్న భౌతికదాడులను అరికట్టడానికి ఉపయోగపడగల కొన్ని సూచనలు మీ ముందుంచుతున్నాము. మీరు ప్రభుత్వానికి సమర్పించబోయే నివేదికలో ఈ సూచనలకు చోటు కల్పించాలని కోరుతున్నాం. దాదాపు 15 సంవత్సరాలుగా హక్కుల ఉద్యమంలో పనిచేసిన అనుభవం మేము చేస్తున్న ఈ సూచనలకు ఆధారం. ఆ అనుభవంతో మేము చేస్తున్న ఈ కింది సూచనలను పరిశీలించి, మీరు ప్రభుత్వానికి ఇవ్వబోయే సలహాలలో భాగం చేస్తారని ఆశిస్తాము.

1. ప్రభుత్వ విధానాలు, చట్టాలకు సంబంధించిన సూచనలు చేసే ముందు ఒక విషయం స్పష్టం చేయాలి. అణచివేతకు గురయ్యే ఏ ప్రజలకైనా న్యాయం చేయడానికి అత్యున్నతమైన పద్ధతి వారికి సామాజికంగా ఆర్థికంగా బలం చేకూర్చడం. అప్పుడు అణచివేతను కొంతమేరకైనా వారే ఎదుర్కోగలుగుతారు. అణచివేసే వర్గాలు కూడ కొంతమేరకైనా వెనక్కి తగ్గుతాయి.

రాష్ట్ర ప్రభుత్వం దళితులు అనుభవిస్తున్న వివక్షనూ అణచివేతనూ దౌర్జన్యాలనూ విశ్లేషించి పరిష్కార మార్గాలను సూచించమని మిమ్మల్ని కమిషన్‌గా నియమించడం ఒక మేరకు హర్షణీయమే. కానీ ఒక ముఖ్య పరిష్కార మార్గాన్ని ఆ ప్రభుత్వమే కొద్దికొద్దిగా మూసేస్తున్నది. ఈ మార్గానికి 'సంక్షేమం' అని పేరు. అయితే అందులో అనేక అంశాలు ఇమిడి ఉన్నాయి.

దళితులకు ఉపాధి కల్పించే చర్యలు, వనరుల్ని వారి చేతిలో పెట్టగల భూ సంస్కరణలు, చదువుకునే అవకాశం కల్పించే సాంఘిక సంక్షేమ హాస్టళ్ళు, ఉచిత విద్య బోధించే ప్రభుత్వ పాఠశాలలు, చవక బియ్యం, బావులు తవ్వుకోలేని పేద దళిత రైతులకు చవక రుణాలు, చవక కరెంటు, అందుబాటులో నైపుణ్యం గల వైద్య సేవలు – ఇవన్నీ వారి బలాన్ని పెంచుతాయి. అణచివేతను ఎదుర్కొనే శక్తినీ ఆత్మస్థైర్యాన్నీ ఇస్తాయి. ఎదుటివారి అహంభావాన్నీ స్వాతిశయాన్నీ తగ్గిస్తాయి.

దళితులకు శక్తినిచ్చే ఈ విధానాలు, చర్యల విషయంలో ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం వెనకడుగు వేస్తున్న విషయం తెలిసిందే. ఈ తిరోగమనాన్ని సవరించకుండా సమస్యకు పరిష్కారం వెతకాలనుకోవడం ఒంటిచేత్తో గుర్రపుస్వారీ చేయడం లాంటిది.

2. అయినప్పటికీ దాడులు, వివక్షలను ఎదుర్కొనడానికి చట్టపరమైన, విధాన పరమైన చర్యలను అన్వేషించడం వృథా అని మా అభిప్రాయం కాదు. కొన్ని నిర్దిష్టమైన చర్యలను దిగువ సూచిస్తాము.

అంటరానితనం ఏదో ఒక రూపంలో అమలయ్యే గ్రామాలలో ఆ దురాచారానికి తలవంచాలన్న బలమైన ఒత్తిడి ఉంటుంది. దళితులలో దానిని వ్యతిరేకించే సాహసవంతులెవరైనా ఉంటే వారి పైన కూడ ఉంటుంది.

ఈ ఒత్తిడిని పోగొట్టాలంటే దానిని నిలబెట్టే గ్రామ పెత్తందార్ల పైన దృష్టి పెట్టాలి. వారి పాత్ర ఈ విషయంలో స్పష్టంగా కనిపించకపోవచ్చును కాబట్టి నేరస్మృతి ఇందుకు సరిపోదు. ఆర్థిక రాజకీయ చర్యలు అవసరం. అంటరానితనం పాటించడంలోనూ, ఊరందరి చేతా పాటింపజేయడంలోనూ తాము ప్రధాన పాత్ర నిర్వహించినంత కాలం వ్యవస్థ నుండి పొందే రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలు వారికి దక్కవన్న భయం ఉండాలి.

ఉదాహరణకు 'అభివృద్ధి పనుల' సివిల్ కాంట్రాక్టులు ఈ గ్రామ పెత్తందార్ల ధనార్జనకు ఒక ముఖ్య వనరు. అంటరానితనం పాటించే గ్రామాలలో అటువంటి అభివృద్ధి పనులేవీ ప్రభుత్వం చేపట్టకూడదు. 'జన్మభూమి' కింద చేపట్టే పనులు కూడ అటువంటి గ్రామాలకు మంజూరు చేయకూడదు. అంటరానితనం పాటించడం మానేసేంతవరకు ఏ కాంట్రాక్టులూ మంజూరు కావన్న భయం పెత్తందార్లకు ఉండాలి.

మంచినీళ్ల ట్యాంకుల వంటి కొన్ని అత్యవసరమైన పనులకు ఈ విషయంలో మినహాయింపు ఇయ్యవచ్చు. అయితే అటువంటి మినహాయింపులు ఇచ్చినప్పుడు కూడ ఆ పనుల కాంట్రాక్టు ఆ ఊరి వాళ్లకు ఇవ్వకూడదు. అంతేకాదు వేరే వ్యక్తులు కాంట్రాక్టు తీసుకుని ఆ ఊరివాళ్లకు దానిని సబ్ కాంట్రాక్టు ఇచ్చే ప్రయత్నం చేస్తే ఆ కాంట్రాక్టును రద్దుచేసే అధికారం కూడ ప్రభుత్వం చేతిలో ఉండాలి.

ఆర్థిక ఒత్తిడి కాకుండా రాజకీయ ఒత్తిడి కూడ పెట్టడం అవసరం. ఎన్నికల అభ్యర్థిత్వం విషయంలో పంచాయతీరాజ్ చట్టం నుండి ప్రజాప్రాతినిధ్యం చట్టం వరకు అంటరానితనం కింద వచ్చే నేరాలలో పాల్గొనడమనేది ప్రస్తుతం అనర్హత కాదు. ఇతర నేరాల లాంటిదే అది కూడ. నేరం రుజువైతేనే అభ్యర్థి అనర్హుడవుతాడు. ఈ పరిస్థితి పోవాలి. పి.సి.ఆర్. చట్టం కిందగానీ, ఎస్.సి, ఎస్.టి (అత్యాచారాల నిరోధక) చట్టం కిందగానీ ఒక వ్యక్తి పైన పోలీసులు చార్జిషీటు పెట్టినట్టయితే ఆ వ్యక్తి పంచాయతీ నుండి పైస్థాయిదాకా ఎన్నికలలో పోటీ చేయడానికి అనర్హుడన్న నియమం పెట్టాలి. నేరానికి శిక్షపడితేనే అనర్హులవుతారన్న సాధారణ ఎన్నికల నియమానికి ఈ రూపంలో సవరణ చేయాలి.

అంటరానితనం ఏదైనా ఒక రూపంలో (ఉదాహరణకు హోటళ్ళలో రెండు గ్లాసుల వ్యవస్థ, వేరు వేరు మంచినీళ్ల బావులు, వేరు వేరు చెరువులు ఉండడం వగైరా) అమలవుతున్నట్టు తెలిసిన ఊరి గ్రామ పంచాయతీకి ప్రభుత్వం తగుమాత్రం నోటీసు ఇచ్చి ఆ లోపల దానిని సవరించకపోతే పంచాయతీని రద్దు చేయవచ్చునన్న నియమం పెట్టాలి. మొత్తం మీద – అంటరానితనాన్ని పాటించే గ్రామాలలో పెద్దమనుషులుగా ఉంటూ, అంటరానితనాన్ని కాపాడే సామాజిక ఒత్తిడిని ఒక పక్క నిలబెడుతూ, అదే సమయంలో ఆ ఊరిలో ప్రజాప్రతినిధులుగా చలామణి కావడం, ఆ ఊరిలో ప్రభుత్వ కాంట్రాక్టులు చేసుకుని ప్రయోజనం పొందడం అసాధ్యం కావాలి.

ఆ ఒత్తిడి గ్రామ పెత్తందార్ల పైన పెట్టకపోతే అంటరానితనం పాటించాలన్న ఒత్తిడి నుండి గ్రామాలకు విముక్తి ఉండదు.

3. అంటరానితనం మామూలు సందర్భాలలో పాటించినా పాటించకున్నా, దళితులు ఏదైనా విషయంలో తమ హక్కుల కోసం నిలబడినా ఘర్షణ పడినా వారిని కాళ్లబేరానికి తెప్పించడానికి సాంఘిక బహిష్కరణకు గురిచేసే గ్రామాలు ఉన్నాయి. వారిని పనులకు పిలువకపోవడం, ఊరిలోని అంగళ్లలో వారికి సరుకులు అమ్మక పోవడం, ఏ విషయంలోనూ వారితో ఎవ్వరూ ఏ సంబంధం పెట్టుకోకూడదని నియమం పెట్టడం జరుగుతున్నది. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలలో ఇది తరచూ జరుగుతున్నది. ఈ సాంఘిక బహిష్కరణ కూడ చాలా బలమైన సామాజిక ఒత్తిడి ద్వారా అమలవుతుంది. అటువంటి చోట్ల కూడ పై నియమాలను వర్తింపజేయాలి.

4. గ్రామీణస్థాయి పెత్తందార్ల పైనే దృష్టి పెట్టడం ఎందుకని అడగవచ్చును. వాళ్ళ పై నుండే వాళ్ళంతా మంచి వాళ్ళని కాదు. నిజానికి మన రాష్ట్రంలోని రాజకీయ పార్టీలన్నిటికీ అంటరానితనం విషయంలో ఒక నీచమైన ద్వంద్వ వైఖరి అలవాటయి పోయింది. పై స్థాయిలో అన్ని పార్టీలూ అంటరానితనానికీ కుల వివక్షకూ వ్యతిరేకమే. కానీ అన్ని పార్టీల పునాది అయిన కింది స్థాయి పెత్తందార్లు తమ ఊర్లలో, వాడలలో కులవివక్షనూ అణచివేతనూ అమలు చేయడంలో, చేయించడంలో ముఖ్యపాత్ర వహిస్తుంటారు. మళ్లీ వ్యవస్థ కల్పించే సకల ఆర్థిక రాజకీయ ప్రయోజనాలు పొందుతూ ప్రధాన రాజకీయ పార్టీల ప్రాబల్యానికి పునాదిరాళ్ళుగా పనిచేస్తుంటారు. ఈ ప్రయోజనాలు దెబ్బతింటే తప్ప ఈ రెండు నాల్కల రాజకీయార్థిక వ్యవస్థలో చలనం రాదు.

5. ఇప్పటికే ఈ రకమైన ఒత్తిడి పెట్టే అధికారాలు ఒక మేరకు చట్టంలో ఉన్నాయి గానీ, అవి అమలు కావడం లేదు. పిసిఆర్ చట్టం సెక్షన్ 10ఎ లోనూ ఎస్.సి, ఎస్.టి (అత్యాచారాల నిరోధక) చట్టం సెక్షన్ 16 లోనూ దళితుల పైన అత్యాచారాలకు పాల్పడే లక్షణాన్ని కలిగి ఉన్న గుంపుల పైన ప్రభుత్వం ఉమ్మడిగా జుర్మానా విధించవచ్చునని ఉంది. అత్యాచారాలను నివారించడానికి ఒక వ్యక్తి పైనగానీ ఒక గుంపు పైనగానీ తగు నివారణ చర్య తీసుకునే అధికారం కలెక్టర్ నుండి ఎం.ఆర్.ఓ. దాకా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ లందరికీ ఎస్.సి., ఎస్.టి. (అత్యాచారాల

నిరోధక) చట్టం సెక్షన్ 17 కింద ఉంది. ఎటువంటి నివారణ చర్యలు చేపట్టవచ్చునో సూచించే 'స్కీం'లు ప్రభుత్వం రూపొందించవచ్చునని కూడ సెక్షన్ 17 (3) అంటుంది.

ఈ అధికారాలను ఎన్నడయినా ఎక్కడయినా వినియోగించి ఉంటే సవర్ణ హైందవ గుంపుల పైన కొంతయినా ఒత్తిడి ఉండేది. కానీ ఎక్కడా వీటిని వినియోగించడం లేదు. సందర్భం వచ్చినప్పుడల్లా వీటిని వినియోగించాలని ప్రభుత్వానికి సూచించడం అవసరం.

సెక్షన్ 17(3) అవకాశం కల్పించే 'స్కీం'లు ఏవీ మన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటిదాకా రూపొందించలేదు. అత్యాచారాలలో కీలకపాత్ర నిర్వహిస్తున్న వ్యక్తులను, లేదా కీలకమైన సహకారం ఇచ్చే వ్యక్తులను దూరంగా వెలివేయడం (ఎక్స్టర్న్ చేయడం) ఇటువంటి (సెక్షన్ 17 అనుమతించే) ఒక నివారణ చర్య కాగలదు. ఆదివాసీ ప్రాంతాలకు సంబంధించి సెక్షన్ 10లో ఇప్పటికే అటువంటి అధికారం ఉంది. (దానిని కూడ ఎక్కడా అమలు చేయలేదన్నది వేరే సంగతి.) 17(3) అవకాశం కల్పించే 'స్కీం'ల ద్వారా అదే అధికారాన్ని దళితవాడల పైన దాడులకు పురికొల్పే వారికి కూడ వర్తింప చేయవచ్చు. ఇటువంటి ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చేయాలని సూచించవలసిన అవసరం ఉంది.

ప్రజలకు మేలు చేసే అధికారాన్ని (బెనిఫిషెంట్ పవర్) చట్టం ప్రభుత్వానికి ఇచ్చేది వినియోగించేందుకు తప్ప పుస్తకాలలో దాచుకోవడానికి కాదని న్యాయశాస్త్ర కోవిదులయిన జస్టిస్ పున్నయ్యగారికి మేము చెప్పనవసరం లేదు. సుప్రీంకోర్టు అనేక తీర్పులలో ఈ విషయాన్ని స్పష్టం చేసింది.

6. కేసుల మాటకొస్తే, దళితులొక అత్యాచారం గురించి ఫిర్యాదు చేయగానే కేసు రిజిస్టర్ చేసి నిజాయితీగా నేరపరిశోధన చేసే పోలీసు అధికారులు కొద్దిమందే. దీనికి విరుగుడు ఎస్.సి, ఎస్.టి. (అత్యాచారాల నిరోధక) చట్టంలోని సెక్షన్ 4 లో ఉంది. ఈ చట్టం కింద నిర్వహించవలసిన విధిని ఉద్దేశపూర్వకంగా విస్మరించిన అధికారికి ఆరునెలల జైలు శిక్ష వేయవచ్చునని ఈ సెక్షన్ అంటుంది. మాకు తెలిసి ఈ సెక్షన్ను వినియోగించిన సందర్భం ఒక్కటి కూడ లేదు. అవకాశం ఉన్న ప్రతి సందర్భంలోనూ వినియోగించమని ప్రభుత్వాన్ని ఆదేశించవలసిన అవసరం ఉంది.

అత్యాచారాల కేసులను 'రాజీ' చేయడానికి పోలీస్ అధికారులు ప్రయత్నించడం నేరమని ఈ సెక్షన్‌కు ఒక వివరణ చేర్చమని ప్రభుత్వానికి సూచించవలసిన అవసరం ఉంది. దళితుల ఫిర్యాదుల పైన నిజాయితీగా నేర పరిశోధన చేపట్టకుండా సవర్ణులను కూడ పిలిచి వారి వద్ద ఒక 'కౌంటర్' ఫిర్యాదు తీసుకుని, లేదా వారే వచ్చి ఎంతటి అసంబద్ధమైన 'కౌంటర్' ఫిర్యాదు ఇచ్చినా దానిని కూడ నమోదు చేసుకుని ఇద్దరినీ రాజీకి రమ్మనడం మన పోలీస్ అధికారులకు అలవాటయి పోయింది. ఎస్.సి, ఎస్.టి అత్యాచారాల నేరాలు రుజువు కాకుండా పోవడానికి ఇదొక ముఖ్యకారణం. ఈ రకమైన రాజీ ప్రయత్నాన్ని సెక్షన్ 4 కింద నేరంగా ప్రకటించడం అవసరం.

7. క్రైస్తవ మతం పుచ్చుకున్న దళితులకు ఎస్.సి, ఎస్.టి (అత్యాచారాల నిరోధక) చట్టం వర్తించదనీ, లేదా దళితులపైన దాడి చేసిన గుంపులో సవర్ణులతో బాటు కొందరు దళితులు కూడ ఉన్నట్టయితే ఆ దాడికి ఈ చట్టం వర్తించదనీ రకరకాల సందేహాలు తరచూ ముందుకొస్తున్నాయి. ఈ మధ్య కర్నూలు జిల్లా కలెక్టరు, రంగారెడ్డి జిల్లా ఎస్.పి, కర్నూలు స్పెషల్ కోర్టు జడ్జి ఈ రకమైన అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

ఇటువంటి సందేహాలు వచ్చినప్పుడల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు వివరణ ఇవ్వడం, సమస్య అప్పటికి చల్లారడం జరుగుతున్నది. అయితే కర్నూలు స్పెషల్ (ఎస్.సి., ఎస్.టి. అత్యాచార కేసుల) కోర్టు జడ్జి లేవదీసిన సందేహం అట్లా తీరేది కాదు. దానికి ఉన్నత న్యాయస్థానాలయినా జవాబు చెప్పాలి, పార్లమెంటయినా చెప్పాలి. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్న కూటమిలో భాగమే కాబట్టి పార్లమెంటు తగిన సవరణ చేపట్టడానికి కృషి చేయవలసిందిగా వారికి ఈ కమిషన్ సూచన ఇస్తుందని ఆశిస్తాము.

8. రిజర్వేషన్ల అమలు విషయంలో కూడ 'సరిగ్గా జరగడం లేద'ని ఆందోళన వ్యక్తం చేసి ఊరుకోకుండా, కొన్ని గట్టి చర్యలు తీసుకోవడం అవసరం. విద్యా సంస్థలలో పెత్తందారీ కులాల పట్టు చాలా బలంగా ఉంది కాబట్టి 'బ్యాక్ లాగ్' సమస్య అక్కడ మరీ ఎక్కువగా ఉంది.

ఒక ఎయిడెడ్ విద్యా సంస్థ రిజర్వేషన్లు సక్రమంగా అమలు చేయని పక్షంలో వారికి నోటీస్ ఇచ్చి కొంత గడువు ఇచ్చి 'ఎయిడ్' రద్దు చేసేయాలి. ప్రభుత్వ విద్యాసంస్థ

అయితే దానికి బాధ్యుడయిన అధికారి పైన శాఖాపరమైన చర్య తీసుకోవాలి. రిజర్వేషన్ల అమలుకు అడ్డం పడటాన్ని సర్వీస్ రూల్స్‌లో శిక్షార్హమైన చర్యగా పేర్కొనాలి.

అన్ని రంగాలలోనూ బ్యాక్‌లాగ్‌లు నింపడానికి పూర్తి ప్రాధాన్యత ఇచ్చి, యోగ్యతలో తగు మాత్రం సడలింపు ఇవ్వాలి.

## ముగింపు:

పై సూచనలు ఎక్కువగా దళితుల పట్ల వివక్ష పాటించేవారిని, దాడులు చేసేవారిని నిర్బంధ పద్ధతులలో నిరోధించే చర్యలే. వాటి ఆవశ్యకత చాలా ఉందిగానీ ఈ నిర్బంధ చర్యల కంటే ముఖ్యమైనవి మరి రెండున్నాయి. ఒకటి, కుల వివక్షకు వ్యతిరేకమైన సామాజిక సంస్కృతిని పెంపొందించే చర్యలు, కుల అహంకారాన్ని కులతత్వాన్ని అధిగమించినవారిని ప్రోత్సహించే చర్యలు. కులాంతర వివాహాలు చేసుకున్న వారికి కొంత పారితోషికం ఇవ్వడం వినా ప్రభుత్వం ఈ విషయంలో ఇప్పుడేమీ చేయడం లేదు. ఈ కృషి మొత్తం ప్రభుత్వమే చేయాలనిగానీ, ప్రధానంగా ప్రభుత్వమే చేయాలనిగానీ అనలేము. అయితే ప్రసార సాధనాల పైన, విద్యా వ్యవస్థ పైన ప్రభుత్వానికుండే పట్టు దృష్ట్యా ప్రభుత్వానికి ఈ విషయంలో చెప్పుకోదగ్గ బాధ్యత ఉంది. కానీ ప్రభుత్వం చేస్తున్నది శూన్యం.

రెండవది మొదట్లోనే ప్రస్తావించాము. ఇవి దళితులకు బలం చేకూర్చే చర్యలు.

i) భూసంస్కరణల అమలు మన రాష్ట్రంలో చాలా అసంతృప్తికరంగా జరిగిన సంగతి తెలిసిందే. ఇప్పటికే మిగులు భూములుగా గుర్తించిన వాటిని వేగంగా సేకరించి పూర్తిగా పంచాలి. పంచిన భూములు రకరకాల రూపంలో తిరిగి భూస్వాముల చేతిలోకి పోయిన సందర్భాలనేకం ఉన్నాయి. దీనిని సత్వరం సవరించాలి.

అయితే ఇవన్నీ చేసినా చాలదు. ఒక కొత్త భూసంస్కరణల చట్టం తీసుకురావలసిన అవసరం ఉంది. వ్యవసాయ భూములతో పాటు ఆ కుటుంబానికి ఉండే వ్యవసాయేతర ఆదాయాన్నీ ఆస్తులను కూడ లెక్కలోకి తీసుకుని సీలింగ్‌ను సవరించి ఎటువంటి లొసుగులు లేని చట్టాన్ని రూపొందించి అమలు చేయాలి.

ప్రభుత్వ భూములు దళితులకు, ఇతర పేదలకు పంచే బదులు అమ్మేయాలన్న ఆలోచన, పెట్టుబడిదారీ కార్పొరేషన్లకు లీజుకియ్యాలన్న ఆలోచన కట్టిపెట్టి వాటిని దళితులు, పేదల ప్రయోజనానికి వినియోగించాలి.

ii) కనీస వేతనాలను నిర్ణయించడం మాత్రమే ప్రస్తుతం ప్రభుత్వ బాధ్యతగా ఉంది. వాటిని కూలివాళ్లే ఆందోళన చేసి అమలు చేయించుకోవలసి వస్తున్నది. అది వారికి సాధ్యం కాని చోట కనీస వేతనాలు పొందలేకపోతున్నారు. ప్రభుత్వం బాధ్యత తీసుకుని వాటిని అమలు చేయించాలి. కనీస వేతనాలు ఎప్పుడో ఒకసారి పెంచడం కాకుండా పెరిగే ధరలను బట్టి వాటిని సవరించే వి.డి.ఏ (Variable D.A.) సౌకర్యం కనీస వేతనాల షెడ్యూలులోనే చేర్చాలి.

iii) దళితులలో సంవత్సరంలో సగం రోజులు కూడ పని దొరకని వాళ్ళే ఎక్కువ. అందరికీ ప్రతిరోజూ పని కల్పించే దీర్ఘకాల లక్ష్యంతో ఉపాధి పథకాలూ అభివృద్ధి పథకాలూ రూపొందించాలి.

iv) వివక్షనూ దాడులనూ ఎదుర్కొనడానికి దళితులకు బలం కల్పించే విషయంలో ఆదాయం, వనరులు, ఉపాధి చర్యలకు ఎంత ప్రాముఖ్యం ఉందో విద్యకు కూడ అంత ఉంది. విద్య ప్రైవేటీకరణ, ప్రభుత్వ విద్యాసంస్థల నిరాదరణ దళితుల విద్యావకాశాలను చాలా దెబ్బ తీస్తున్నాయి. ఈ పరిస్థితిని పట్టుదలగా సవరించాలి. సాంఘిక సంక్షేమ హాస్టళ్ళను మూసేసి వాటి స్థానంలో (తక్కువ సంఖ్యలో) ఆశ్రమ పాఠశాలలు ప్రారంభించాలన్న ఆలోచన మన రాష్ట్ర ప్రభుత్వం ఒక దశలో ప్రకటించి విద్యాసంఘాల ఒత్తిడి వల్ల తాత్కాలికంగా వెనక్కి తీసుకుంది. ఆ ప్రతిపాదనను పునరుద్ధరించే ఆలోచన చేయకూడదు. ఆశ్రమ పాఠశాలలు ఎన్ని ప్రారంభించినా అభ్యంతరం లేదుగానీ సాంఘిక సంక్షేమ హాస్టళ్ళను మూసేయడానికి మాత్రం వీలు లేదు.

నిజానికి సంక్షేమ హాస్టళ్ళను సంస్కరించవలసిన అవసరం చాలా ఉంది. వాటిని శుభ్రంగా ఉంచాలి. కనీస పౌష్టిక విలువలున్న శుభ్రమైన తిండి పెట్టాలి.

v) దళితులకు అందకుండా పోతున్న మరొక వ్యవస్థ వైద్యం. అతిసారం వంటి వ్యాధులకు బలయ్యేవారిలో ఆదివాసుల తరువాత దళితులే ఎక్కువ. ప్రభుత్వ రంగంలోని ఆరోగ్య సేవలను మెరుగుపరచడం, అవినీతినీ, రోగులను పీడించే సిబ్బంది కుసంస్కారాన్నీ పోగొట్టడం అవసరం. ప్రస్తుతం ప్రభుత్వరంగ వైద్య సేవలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయి ఉన్నాయి.

ఈ సూచనలను మీరు పరిశీలించి ప్రభుత్వానికిచ్చే సలహాలలో వీటికి స్థానం కల్పిస్తారని ఆశిస్తాము.

*మానవహక్కుల వేదిక తరఫున ఇచ్చిన వినతి పత్రం*

*11 నవంబర్ 1999*

# ఎన్నికల సంస్కరణలు, రాజ్యాంగ సమీక్ష ఎందుకోసం?

మన దేశ రాజకీయ, ఆర్థిక వ్యవస్థలలో మార్పులు తీసుకొచ్చే ప్రయత్నం చాలా వేగంగా జరుగుతున్నది. ప్రతి మార్పూ చాలా అవసరమనీ ఇన్నాళ్లూ అది లేకపోవడం వల్లనే మనం వెనుకబడి ఉండిపోయామనీ అంటున్నారు. మనల్నీ నమ్మమంటున్నారు.

అంత గుడ్డిగా అన్ని మార్పులూ మన మంచికేనని నమ్మేవారెవరూ లేరు.

ఎన్నికల వ్యవస్థలో సంస్కరణలు, రాజ్యాంగ సమీక్ష ఇప్పుడు వార్తలలో నలుగుతున్నాయి. నిజానికి ఎన్నికల వ్యవస్థ ప్రజల అభీష్టానికి మరింత బాగా అద్దం పట్టేటట్టు సంస్కరించడం అవసరమని పని హక్కుతో సహా అనేక ఇతర మౌలిక హక్కులను రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులుగా చేర్చేలా సవరించడం అవసరమని దేశంలోని ప్రజాతంత్రవాదులు చాలా కాలంగా కోరుకుంటున్నారు. అనేక ప్రతిపాదనలు కూడ చేశారు.

కానీ ఇప్పుడు అధికారికంగా వస్తున్న ప్రతిపాదనల లక్ష్యం అదేనా?

రాజ్యాంగ సమీక్ష కోసం 11 మంది పెద్దమనుషుల కమిటీ ఒకటి వేస్తున్నారు. వాళ్లు ఎంత పెద్దమనుషులయినా కావచ్చును గానీ 'రాజ్యాంగాన్ని సమీక్షించి పెట్టండి' అని ప్రజలు ఎన్నుకున్న వారు కారు. వేరే ఏ అర్థంలోనూ ఇంత వైవిధ్యం ఉన్న ఈ దేశంలోని భిన్న ఆకాంక్షలకు ప్రతినిధులు కారు. యాభై ఏళ్ల అనుభవం తరువాత ఈ దేశంలోని 'పెద్దమనుషు'లంతా ప్రజాస్వామ్యం, సమత, సంక్షేమాల పట్ల చెందుతున్న

విసుగుకు వారు ప్రతినిధులు కావచ్చు. ఆ విసుగు నుండే ఎక్కువ ప్రతిపాదనలు రాబోతాయి. అందుకే ప్రజాస్వామ్య పురోభివృద్ధి కోరుకునేవారు 'రాజ్యాంగ సమీక్ష' అవసరమన్న ప్రతిపాదన గురించి ఆందోళన చెందుతున్నారు. ఈ రాజ్యాంగంలో మార్చవలసిందేమీ లేదన్న భావన వల్ల కాదు.

ఎన్నికల సంస్కరణలకు కొత్త కమిషన్‌ను వేయవలసిన అవసరం లేకుండా ప్రభుత్వం లా కమిషన్‌కే ఆ బాధ్యత అప్పగించింది. లా కమిషన్ దాదాపు అయిదేళ్ల పాటు శ్రమించి కొన్ని నిర్దిష్టమైన ప్రతిపాదనలను ఆమోదించింది. అందులో కొన్ని మంచి ప్రతిపాదనలున్నాయి గానీ లా కమిషన్ అనుసరించే మౌలిక వైఖరిలోనే అభ్యంతరకరమైన విషయాలున్నాయి.

ఎన్నికల సంస్కరణలంటూ చేపడితే – అది ఎన్నికల ప్రక్రియను మరింత ప్రజాస్వామికం చేయడం కోసమే, దాని ప్రాతినిధ్య స్వభావాన్ని మరింత పెంచడం కోసమే కావాలి. అంతే తప్ప ప్రభుత్వాల స్థిరత్వాన్ని పెంచడం కోసం, ఎన్నికల నిర్వహణ ఖర్చు తగ్గించడం కోసం, బహుళ పార్టీ వ్యవస్థ స్థానంలో రెండు మూడు పార్టీల వ్యవస్థను సాధించడం కోసం, చిన్న చిన్న పార్టీలు లేకుండా చేయడం కోసం, ఎన్నికల రంగం మీద 'కులం', 'ప్రాంతం' మొదలయిన ప్రభావాలు లేకుండా చేయడం కోసం ఎన్నికల సంస్కరణలు చేపడితే ఎన్నికల వ్యవస్థ ప్రజాస్వామ్య స్వభావం పెరిగే బదులు తగ్గే ప్రమాదం ఉంది.

లా కమిషన్ ప్రతిపాదించిన సంస్కరణలలో ఎన్నికల వ్యవస్థను ప్రజలకు మరింత దగ్గరకు తీసుకొచ్చే ప్రతిపాదన ఏదీ లేదనే చెప్పాలి. కానీ ఎన్నికల రాజకీయాలలో అవినీతినీ, అవకాశవాదాన్నీ తగ్గించే ప్రతిపాదనలు కొన్ని ఉన్నాయి. బహుశా అన్నిటి కంటే ముఖ్యమైనది పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని చట్టరీత్యా తప్పనిసరి చేయడం. ఇది కమ్యూనిస్టు పార్టీలతో సహా అన్ని పార్టీలనూ ఇబ్బంది పెట్టే విషయమే కాబట్టి ఈ సవరణను పార్లమెంటు చేపడుతుందో లేదోగానీ చేపడితే మంచిదే. ఎన్నికల వ్యయాన్ని తగ్గించడానికి చేసిన ప్రతిపాదనలు కూడ ఉన్నాయి. నల్లధనం విపరీతంగా ఉన్న మన సమాజంలో ఈ సవరణలు ఎంతమేరకు అమలవుతాయని అనుమానించేందుకు ఆస్కారం ఉంది. అయినప్పటికీ ఎంత జరిగితే అంతవరకు మేలే అనుకుంటే అవి ఉపయోగకరమైన ప్రతిపాదనలే.

కానీ లా కమిషన్ ప్రతిపాదనల లక్ష్యాలలో పైన పేర్కొన్న రెండవ కోవకు చెందిన వైఖరి చాలా బలంగా ఉంది. రెండు మూడు పార్టీలే ఉంటే పరిపాలనలో స్థిరత్వం ఉంటుంది కాబట్టి చిన్న చిన్న పార్టీలకు మనుగడ లేకుండా చేయాలంట. దీనికి జర్మనీనీ ఇంగ్లండ్‌నూ అమెరికానూ ఉదాహరణగా చూపిస్తుంది లా కమిషన్. కానీ ప్రపంచంలో వేరే ఏ దేశంలోనూ లేనంత వైవిధ్యం ఉన్న మన దేశంలో రెండు పార్టీల వ్యవస్థ కంటే బహుళ పార్టీ వ్యవస్థే సహజం కావచ్చు. అది అసహజం అని ముందుగానే ఒక నిర్ణయానికొచ్చి దానిని నిర్బంధంగా అమలు చేస్తే ఉన్న కాస్త ప్రజాస్వామ్యం కూడా పోవచ్చు.

చిన్న పార్టీలు లేకుండా చేయడానికి లా కమిషన్ చేసిన ప్రతిపాదన చాలా అభ్యంతరకరమైనది. ఏదైనా ఒక పార్టీకి ఒకటి రెండు నియోజక వర్గాలలో బలముందనుకోండి. అక్కడ అభ్యర్థులను నిలబెట్టి ఒకరిద్దరు ఎం.ఎల్.ఏలను గెలిపించుకుందామంటే కుదరదంట. ఆ పార్టీ కొన్ని నియోజక వర్గాలలోనే పోటీ చేసినా, దాని అభ్యర్థులకు వచ్చే వోట్లు రాష్ట్రం మొత్తం మీద పోల్ అయిన వోట్లలో కనీసం 5 శాతం ఉండాలంట. లేకపోతే ఆ పార్టీ గెలుచుకున్న ఆ ఒకటి రెండు సీట్లు కూడ రద్దు చేసేయాలంట.

ఒక చిన్న ప్రాంతానికి, లేకపోతే ఒక అల్ప సంఖ్యాక ప్రజావర్గానికి పరిమితమయి పని చేసే పార్టీలను లేకుండా చేయడం దీని లక్ష్యం అనే విషయం స్పష్టమే. ఎన్నికలలో పోటీ చేసే పార్టీ అభ్యర్థులందరికీ వచ్చే వోట్లు రాష్ట్రం మొత్తం మీద పోల్ అయిన వోట్లలో అయిదు శాతం మించి ఉంటేనే ఆ పార్టీ గెలుచుకున్న సీట్లు దక్కుతాయి. లేకపోతే ఆ నియోజకవర్గాలలో రెండవ స్థానంలో ఉన్న అభ్యర్థికి ఎం.ఎల్.ఏ పట్టం కట్టబెడతారు. ఇది చాలా అన్యాయమైన వైఖరే కాక అవాస్తవికమైన వైఖరి కూడ. మన రాష్ట్రంలో ఆదివాసులు 6 శాతం ఉన్నారు. ఆదివాసులలో మాత్రమే పని చేసి ఇతర ప్రాంతాలలో వోట్లు సంపాదించలేని ఒక ఆదివాసీ పార్టీ ఉందనుకోండి. ఆ పార్టీ ఒకవేళ ఏజెన్సీలోని అన్ని నియోజకవర్గాలలో గెలిచినా, బయట ఎక్కడా దానికి ఓట్లు రావు కాబట్టి దానికొచ్చే మొత్తం ఓట్లు '5 శాతం' నియమానికి తక్కువే ఉండవచ్చు. అప్పుడు గెలిచిన ఆ ఆదివాసీ పార్టీ అభ్యర్థులందరూ ఓడినట్టే అవుతుంది. రెండవ స్థానంలో నిలిచిన 'జాతీయ పార్టీ' అభ్యర్థిదే గెలుపు అవుతుంది.

ఒక ప్రత్యేకమైన ప్రజావర్గం సమస్యల గురించి ప్రత్యేకంగా ఆలోచించి, అందుకోసమే పని చేసే వాళ్లు ఆ ప్రజలు మెచ్చినా వారి ప్రతినిధులు కాలేరు. బలవంతంగా ఏదైనా ప్రధాన స్రవంతి పార్టీలోగానీ ఐక్య సంఘటనలోగానీ భాగం కావలసిందే. ఇంత బలవంతంగా 'రెండు పార్టీల' (లేక 'రెండు కూటముల') వ్యవస్థను తయారు చేయాలని పూనుకోవడం ప్రజాస్వామ్యాన్ని పెంపొందించే సూచనా లేక దిగజార్చే సూచనా? దీని వల్ల చిన్న సంఖ్యలో ఉన్న ఆదివాసీ, దళిత, మైనారిటీ ప్రజలకు నష్టం కాదా? ఏదైనా ' ప్రధాన స్రవంతి' పార్టీ లేక కూటమితో రాజీపడకపోతే వారికి రాజకీయ మనుగడ ఉండదని చట్టం చేయడం ఏ రకమైన ప్రజాస్వామ్యం?

దీనికి తోడుపోయే మరొక సూచన – స్వతంత్ర అభ్యర్థులు పోటీ చేయడానికి వీలు లేదనేది. స్వతంత్ర అభ్యర్థులు 'నాన్ సీరియస్' గానే పోటీ చేస్తారంట. చాలా అరుదుగానే తప్ప డిపాజిట్ కూడ దక్కించుకోరంట. కాబట్టి కేవలం రాజకీయ పార్టీల అభ్యర్థులు మాత్రమే పోటీ చేసేటట్టు చట్టాన్ని సవరిస్తారంట.

నిజానికి ఏ పార్టీకి చెందని ప్రజా ఉద్యమకారులు ఎన్నికలలో పాల్గొని – గెలిచినా గెలవకున్నా – సమస్యలను సమర్థంగా ప్రజలలో చర్చకు పెట్టడంలో సఫలమయిన ఉదంతాలెన్నో ఉన్నాయి. అది ప్రజాస్వామ్యానికి మేలు చేసిందే తప్ప నష్టం చేయలేదు. ఈ అవకాశం లేకుండా ఎందుకు చేయాలి?

ప్రజాస్వామ్యమంటేే లా కమిషన్ సభ్యుల వంటి పెద్దమనుషులకు ఎంత విసుగుగా ఉందో ఈ ప్రతిపాదనలు సూచిస్తాయి. ఎవరు పడితే వాళ్లు పార్టీలు పెడతారు, ప్రతీ వెధవా పోటీ చేసి పెద్ద పెద్ద పార్టీలను వెక్కిరిస్తాడు అనే విసుగు; ఇంతింత పొడవు బ్యాలెట్ పేపర్లు అచ్చు వేయాలి అనే విసుగు ఇందులో ధ్వనిస్తాయి.

రాజ్యాంగ సమీక్ష చివరికి ఏ రూపం తీసుకుంటుందోగానీ ఆ ప్రతిపాదన వెనక ఉన్న ఆరాటం కూడ ఈ కోవకు చెందినదే. రాజ్యాంగాన్ని సమీక్షించి ఇంకా ఎక్కువ హక్కులు కల్పిస్తామంటే ఎవరూ కాదనరు. రాజ్యాంగంలోని సంక్షేమ రాజ్య భావనకు పటిష్టమైన రూపం ఇచ్చి గ్లోబలైజేషన్ పేరు మీద తీసుకొస్తున్న మార్పులకు అడ్డుకట్ట వేద్దామన్న ప్రతిపాదన ఎవరైనా పెడితే కూడ ఎవరూ కాదనరు. కాని ఇప్పుడు వస్తున్న ప్రతిపాదన ఇందుకు పూర్తిగా విరుద్ధమైన కోణం నుండి వస్తున్నదన్న సహేతుకమైన సందేహం ఉండబట్టే చాలామంది అభ్యంతరం చెప్తున్నారు.

రాజ్యాంగ సమీక్ష జరగాలని పట్టుబడుతున్న హిందుత్వవాదులకు ఈ రాజ్యాంగంలోని ప్రజాతంత్ర అంశాల పట్ల, సంక్షేమ అంశాల పట్ల అభిమానం ఏ రోజూ లేదు. వాటికి దారితీసిన స్వాతంత్రపూర్వకాలపు ప్రజా ఉద్యమాలలోగానీ సంస్కరణలలోగానీ వాళ్లు ఎన్నడూ పాల్గొనకపోగా, చాలా సందర్భాలలో వ్యతిరేకించారు. ఇవ్వాళ వాళ్లు రాజ్యాంగాన్ని సమీక్షించాలి అని పట్టుబడితే ఆందోళన కలగడం సహజం.

అయినప్పటికీ చర్చను వ్యతిరేకించడం కంటే పెరుగుతున్న గ్లోబలైజేషన్ ప్రభావాన్నీ, హిందుత్వవాద ఉన్మాదం ప్రభావాన్నీ ఎదుర్కోవడంలో ఒక సాధనంగా ఉపయోగపడేటట్టు రాజ్యాంగంలోని ప్రజాతంత్ర విలువలను పటిష్ట పరచే లక్ష్యంతో చర్చలో పాల్గొనడమే మేలు.

*మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది*
*14 ఫిబ్రవరి 2000*

# ఎన్నికల సంస్కరణలు స్థిరత్వం కోసమేనా?

ఎన్నికల వ్యవస్థలోని లోపాల గురించి ఫిర్యాదు చేయని వారెవ్వరూ లేరు. బహుశా రాజకీయ విభేదాల కతీతంగా ఈ దేశంలో అందరూ అంగీకరించే కొద్ది విషయాలలో ఇదొకటేమో! 'అందరూ' అని ఎందుకంటున్నామంటే ఎన్నికల వ్యవస్థను భ్రష్టు పట్టించడానికి కారణమైనవారు, దాని వల్ల చాలా ప్రయోజనం పొందుతున్నవారు కూడ ఆ వ్యవస్థ దిగజారిపోయిందని, దానిని సంస్కరించాలని వేదికలెక్కి ఉపన్యాసాలిస్తుంటారు.

ఇప్పుడు ఎన్నికల సంస్కరణల కోసం కొన్ని నిర్దిష్టమైన ప్రతిపాదనలను లా కమిషన్ ప్రభుత్వం ముందు పెట్టింది. దాని మీద 200 పేజీల రిపోర్టు తయారు చేసింది.

మామూలుగా లా కమిషన్ తనంతట తాను శాసన సవరణలను రూపొందించదు, ప్రతిపాదించదు. ఫలాన విషయంలో ఇప్పుడున్న చట్టాన్ని పరిశీలించి అందులోని లోపాలను చర్చించి సవరణలు సూచించమని ప్రభుత్వం అడిగినప్పుడు మాత్రమే లా కమిషన్ కదులుతుంది. ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన ఒకే ఒక్క అంశం గురించి మాత్రమే కేంద్ర ప్రభుత్వం లా కమిషన్‌ను సూచనలడిగింది. ఎలక్షన్ పిటిషన్లు (గెలిచిన అభ్యర్థి ఎన్నిక చట్టవిరుద్ధమని ఓడిపోయిన అభ్యర్థి వేసే కేసు) త్వరగా విచారించడానికి అవసరమయిన సూచనలు చేయమని 1995 నవంబర్ 2న కేంద్ర ప్రభుత్వం అప్పటి లా కమిషన్‌ను అడిగింది. ఎలక్షన్ పిటిషన్‌లను కోర్టులు సివిల్ దావాలలాగ విచారిస్తుండడం వల్ల తప్పొప్పులు తేలేసరికి సాధారణంగా ఎన్నికయిన పదవి గడువు

తీరిపోతుంటుంది. అందువల్ల వాటిని త్వరగా విచారించే ప్రత్యామ్నాయ విధానాన్ని సూచించమని ప్రభుత్వం లా కమిషన్‌ను కోరినట్టుంది.

లా కమిషన్ నుండి స్పందన రానందువల్లనేమో, ప్రభుత్వం 1998 ఆగస్ట్ 3న ఒక రిమైండర్ పంపించింది. అయితే అప్పటికే లా కమిషన్ చైర్మన్ బాధ్యతలు చేపట్టిన జీవన్ రెడ్డిగారు ఎవరూ అడగకుండానే కేవలం ఎలక్షన్ పిటిషన్ల మీదనే కాకుండా మొత్తంగానే ఎన్నికల వ్యవస్థ గురించి అభిప్రాయ సేకరణ మొదలుపెట్టి ఉన్నారు. ఈ రిమైండర్ లభించినదే తడవుగా ఆయన ఎన్నికల వ్యవస్థను సంస్కరించే ప్రతిపాదనలు మొత్తం ప్రభుత్వం ముందు పెట్టారు. 1999 మే 29న ఆయన కేంద్ర ప్రభుత్వ న్యాయశాఖ మంత్రి రాంజెత్మలానికి సమర్పించిన ఆ నివేదిక ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం పరిశీలనలో ఉంది.

అడగకుండానే చొరవ తీసుకున్నందుకు జీవన్ రెడ్డి గారిని తప్పు పట్టనవసరం లేదు. ఆయన నిజానికి తన శక్తి మేరకు శాసన వ్యవస్థను సమూలంగా మార్చడానికి ఉబలాటపడుతున్నారని లా కమిషన్ చైర్మన్‌గా ఆయన అనేక విషయాలలో తీసుకుంటున్న చొరవను బట్టి అర్థం అవుతుంది.

అయిదేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న కొత్త టాడా బిల్లుకు ఇప్పటికే తుది రూపం ఇచ్చేశారు. రాజ్యాంగ సమీక్ష కమిషన్‌లో దాని చైర్మన్ వెంకటాచలయ్యగారి కంటే చురుకైన పాత్ర నిర్వహిస్తున్నారు. ఇప్పుడు అడగకుండానే ఎన్నికల సంస్కరణల కోసం రాజ్యాంగం నుండి ప్రజాప్రాతినిధ్య చట్టం దాకా అనేక సవరణలు ప్రతిపాదించే ఈ రిపోర్టు తయారు చేశారు. బాధ్యతలు గలవాళ్లు తమ పైవాళ్లు పురమాయించే దాకా 'నాకెందుకొచ్చింది' లెమ్మనే వైఖరితో కబుర్లతో కాలక్షేపం చేసే అధికార సంస్కృతి నెలకొని ఉన్న ఈ దేశంలో స్వంత చొరవ తీసుకున్న వ్యక్తిని ఆ కారణంగా నిందించనవసరం లేదు.

అయితే ఆ చొరవ ఏ గమ్యానికి పోతున్నదనేదే ప్రశ్న.

పాలనలో ప్రజలకు ప్రాతినిధ్యం కల్పించడం కోసం ఎన్నికలు జరుపుకుంటాం. ప్రజలందరూ ప్రత్యక్షంగా పాలనా నిర్ణయాల ప్రక్రియలో పాల్గొనడం గ్రామ పంచాయితీ స్థాయిలో సహితం కష్టం కాబట్టి ఏదో ఒక రూపంలో ఎన్నికలు జరుపుకొని ప్రజా

ప్రతినిధులతో ఏర్పడే ప్రభుత్వాన్ని ఎన్నుకోక తప్పదు. ఎన్నికలే ప్రజాస్వామ్యం కాదుగానీ ఎన్నికలు లేని ప్రజాస్వామ్యం ఉండజాలదు. ఎటొచ్చీ ఆ ఎన్నికల వ్యవస్థ రూపురేఖలలో చాలా వైవిధ్యం ఉండగలదు. వీటి తులనాత్మక పరిశీలనకు ఒకే ఒక ప్రమాణం ఉంటుంది. ప్రజలకు పాలనా వ్యవస్థలో ఎంత లోతయిన ప్రాతినిధ్యం లభిస్తుందనేది ఆ ప్రమాణం.

అందువల్ల ఎన్నికల సంస్కరణల గురించి మాట్లాడుకోవడమంటే ప్రాతినిధ్య స్వభావాన్ని పెంచే మార్గాల గురించి మాట్లాడుకోవడం. ఆ లక్ష్యంతో జరిపే చర్చే ప్రజాస్వామ్యం పెంపుదలకు తోడ్పడుతుంది. వేరే ఏ లక్ష్యంతోనో చర్చించి ఎన్నికల వ్యవస్థను సంస్కరిస్తున్నామనడంలో అర్థం లేదు.

ఎన్నికల సంస్కరణలకు సంబంధించిన ప్రతిపాదనలు చేయడంలో తన లక్ష్యమేమిటో లా కమిషన్ ప్రకటించింది. ప్రకటించిన లక్ష్యాలను నిజంగా అనుసరించకపోవచ్చుననేది అటుంచి, ఈ లక్ష్యాలలో 'ఎన్నికల వ్యవస్థ ద్వారా పాలనలో ప్రజాభీష్టానికి లభించే ప్రాతినిధ్యాన్ని మరింత లోతుగా అభివృద్ధి చేయడం' అనేది లేదు. మరి ఏముందంటే, లా కమిషన్ ప్రకటించుకున్న ప్రధాన లక్ష్యం ఎన్నికల వ్యవస్థను మరింత పారదర్శకంగా, న్యాయబద్ధంగా తయారు చేయడం. రెండవ లక్ష్యం 'ప్రభుత్వాల స్థిరత్వాన్ని పెంచడం'. ఇందులో రెండవ దానికి ప్రాతినిధ్య స్వభావం పెంపుదలతో ఏమీ సంబంధం లేకపోగా దానికి వ్యతిరేకం కాగలదు కూడ. మొదటిది దానంతటదే ఆహ్వానించదగ్గదే కాక ప్రాతినిధ్యాన్ని పెంపాదించడానికి పరోక్షంగా ఉపయోగపడగలదు. అయితే నిజంగా ఉపయోగపడుతుందా అనేది ఆ లక్ష్యసాధన కోసం ప్రతిపాదించే విధాన సంస్కరణలను బట్టి ఉంటుంది. ప్రభుత్వాల స్థిరత్వం సంస్కరణల ప్రధాన లక్ష్యమైతే పారదర్శకత కోసం సూచించే సంస్కరణలు కూడ ఆ రంగే పులుముకుంటాయి. అప్పుడు పారదర్శకత ప్రాతినిధ్యానికి పెద్దగా దోహద పడకపోవచ్చు.

ఇవి మా లక్ష్యాలు అని లా కమిషన్ ప్రకటించిన చోట పై రెండు లక్ష్యాలనే ప్రస్తావించిందిగానీ దిగువన వేరొక ముఖ్య లక్ష్యాన్ని పలుచోట్ల పేర్కొనింది. అది, కులం, ప్రాంతం, మతం ప్రాతిపదికన ఏర్పడిన పార్టీలకు ఎన్నికల రంగంలో చోటు లేకుండా చేయడం. జాతీయ పార్టీలు మాత్రమే ఉండాలి. అంటే మొత్తంగా

సమాజమంతటికీ ప్రాతినిధ్యం వహించే పార్టీలే ఉండాలి. ఏదో ఒక సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం వహించే రాజకీయాలు లా కమిషన్ దృష్టిలో సంకుచిత రాజకీయాలు. అటువంటి రాజకీయాలకు ఎన్నికల వ్యవస్థలో చోటు లేకుండా చేయాలి. (ఎన్నికల వ్యవస్థ నుండి బలవంతంగా బయటికి నెట్టేస్తే ఆ రాజకీయాలు వేరే రూపంలో కొనసాగవా? అప్పుడు వాటి కోసం టాడా చట్టం ఎలాగూ ఉంటుంది. దానికి కూడ ఇదే లా కమిషన్ ఆమోద ముద్ర వేసి చట్టం చేయమని ప్రభుత్వానికి అప్పగించింది.)

ఎన్నికల రాజకీయాలలో జాతీయ పార్టీలు మాత్రమే ఉండాలి. అవి కూడ రెండు మూడు మాత్రమే ఉండాలి. (ఎందుకు? బ్రిటన్లో మూడు పార్టీలే ఉన్నాయి, అమెరికాలో రెండే ఉన్నాయి, జర్మనీలో నాలుగే ఉన్నాయి. ఆ దేశాలు ఎంత బాగున్నాయి చూడండి! అందుకు.) ఒకవేళ 'సంకుచిత' ప్రాతిపదిక మీద చిన్న పార్టీలు ఏర్పడినా అవి ఏదో ఒక 'జాతీయ కూటమి' లో భాగం కావాలి. చట్టం వాటిపైన ఆ రకమైన ఒత్తిడి పెట్టి బలవంతంగా ఆ పరిణామాన్ని సాధించాలి.

ఇది లా కమిషన్ ప్రతిపాదన. అందుకోసం రాజ్యాంగానికి ప్రజాప్రాతినిధ్య చట్టానికి అనేక సవరణలను లా కమిషన్ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదన 'స్థిరత్వాన్ని' లక్ష్యంగా పెట్టుకున్న ప్రతిపాదన. అయితే పరిపాలనలో స్థిరత్వమే ఎన్నికల సంస్కరణల లక్ష్యం కాగలదనుకున్నా దానికి ఇదొక్కటే సాధనం కానక్కరలేదు. కాబట్టి రెండు లేక మూడు పెద్ద పార్టీల వ్యవస్థే ఉండాలని కోరుకోవడం దానంతటదే ఎన్నికల సంస్కరణలకు లా కమిషన్ ఎంచుకున్న ఒక లక్ష్యమని భావించవలసి ఉంటుంది. చిల్లర మల్లర పార్టీల గుంజులాటలో చకచకా నిర్ణయాలు తీసుకొని గబగబా దేశాన్ని అభివృద్ధి చేసేయగల ఎఫిషియెన్సీని భారత ప్రజాస్వామ్యం కోల్పోయిందన్న అసహనం – ఇవ్వాళ మధ్యతరగతి, ధనిక వర్గాల్లో తరచూ వినిపించే అసహనం – లా కమిషన్ ప్రతిపాదనల వెనుక స్పష్టంగా ఉంది. పాలనా వ్యవస్థలో స్థిరత్వాన్ని కోరుకోవడం కూడ అభివృద్ధి వేగంగా కావాలన్న లక్ష్యంతోనే తప్ప పాలనలో ప్రజాస్వామ్యానికి మరింత లోతయిన ప్రాతిపదిక కల్పించాలన్న ఆరాటంతో కాదు. స్థిరత్వం తప్పనిసరిగా ప్రజాస్వామ్యాన్ని పెంపొందిస్తుందన్న నమ్మకమేం లేదు. అది పరిస్థితులను బట్టి ఉంటుంది.

అటువంటి స్థిరత్వాన్ని ఎన్నికల సంస్కరణల లక్ష్యంగా ఎంచుకొని, దానికి సాధనంగా రెండు లేక మూడు జాతీయ పార్టీల లేక కూటములలోకి దేశ రాజకీయాలను

బలవంతంగా నెట్టే శాసన సవరణలను ప్రతిపాదించే సంస్కరణలు ఎన్నికల వ్యవస్థలో ప్రజాస్వామ్యాన్ని పెంపొందించే బదులు మరింత దిగజార్చే ప్రమాదం ఉంది.

ఈ సూచనల వివరాలు దిగువ చూద్దాముగానీ, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతను దృష్టిలో పెట్టుకొని లా కమిషన్ చేసిన సూచనల గురించి మొదట చెప్పుకుందాం. అందులో ప్రధానమైనది ఎన్నికలలో పాల్గొనే ప్రతి పార్టీలోనూ అంతర్గత ప్రజాస్వామ్యం ఉండాలనేది. అంతర్గత ప్రజాస్వామ్యం ఉందని ఎన్నికల కమిషన్‌ను ఒప్పించలేని పార్టీ తన గుర్తింపును కోల్పోతుంది. ఎన్నికలలో పాల్గొనే అర్హతను కోల్పోతుంది.

ఇది నిస్సంకోచంగా ఆహ్వానించదగ్గ ప్రతిపాదనే. 'తన అంతర్గత వ్యవహారాలలో ప్రజాస్వామ్యం పాటించని పార్టీ దేశాన్ని పరిపాలించేటప్పుడు ప్రజాస్వామ్య సూత్రాలను గౌరవిస్తుందని నమ్మలేము' అన్న లా కమిషన్ అభిప్రాయంతో ఏకీభవించవచ్చును. రాజకీయ పార్టీల కార్యవర్గాన్ని రహస్య బ్యాలట్ ద్వారా ఎన్నుకోవాలి. అన్ని స్థాయిలలోనూ తీర్మానాలు, నిర్ణయాలు రహస్య బ్యాలట్ ద్వారా మెజారిటీ సభ్యులు ఆమోదించాలి. క్రమశిక్షణకు ఒక కచ్చితమైన నియమావళి ఉండాలి, దాని ప్రకారం మాత్రమే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి. పార్టీ నిధుల విషయంలో జమాఖర్చు లెక్కలు స్పష్టంగా ఉండాలి. ఎన్నికల కమిషన్‌కు ఈ అన్ని నియమాలు సక్రమంగా అమలవుతున్నాయా లేదా అని పర్యవేక్షించే అధికారం ఉంటుంది. అమలుకాని పక్షంలో ఎన్నికల కమిషన్ ఆ పార్టీ గుర్తింపును రద్దు చేస్తుంది.

పార్టీ సభ్యులకు పార్టీ తీర్మానాలపైన రహస్య బ్యాలట్ ద్వారా ఓటు వేసి అభిప్రాయం తెలియచేసే హక్కు, కార్యవర్గాన్ని రహస్య బ్యాలట్ ద్వారా ఎన్నుకునే హక్కు ఉన్న రాజకీయ పార్టీలు దేశంలో ఏవీ లేవు. ఒక్కొక్క పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం కొంతమేరకు ఉంటే ఉండవచ్చునుగాక. అందువల్ల (కమ్యూనిస్టు పార్టీలతో సహా) ఎవ్వరికీ ఈ ప్రతిపాదనలు నచ్చకపోవచ్చునుగానీ వీటిని ఆహ్వానించవలసిందే.

అయితే రిజిస్ట్రేషన్ అర్హత పొందడానికి లా కమిషన్ సూచించే మరొక నియమం కొంత ఆలోచించతగింది. రాజకీయ పార్టీల లక్ష్యాలు భారత రాజ్యాంగ లక్ష్యాలే అయి ఉండాలన్నది ఈ నియమం. ప్రతీ రాజకీయ పార్టీకి తన లక్ష్యాలు తెలిపే ప్రణాళిక

ఒకటి ఉండాలనీ, రిజిస్ట్రేషన్ కోరేటప్పుడు దానిని ఎన్నికల కమిషన్‌కు సమర్పించాలనీ, ఈ లక్ష్యాలు భారత రాజ్యాంగ లక్ష్యాలకూ ఆదర్శాలకూ లోబడి ఉండాలనీ, లేకపోతే ఆ పార్టీకి రిజిస్ట్రేషన్ నిరాకరించాలనీ లా కమిషన్ అంటుంది. వేరొక చోట ప్రజాస్వామ్యం, సోషలిజం, లౌకికవాదం అనే రాజ్యాంగ ఆదర్శాలకు అన్ని పార్టీలూ కట్టుబడి ఉండాలనీ, కట్టుబడి ఉండని వాటికి ఎన్నికలలో పాల్గొనే అర్హత ఉండకూడదనీ లా కమిషన్ అంటుంది.

భారత రాజ్యాంగ లక్ష్యాలలోని సమతా న్యాయాలతో మాకేమీ పేచీ లేదుగానీ, ఈ నియమాన్ని గురించి కొంచెం ఆలోచించడం అవసరం. ఒకటి – సోషలిజం, లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం అనే మాటలకు ఒకే ఒక అర్థం ఉందని చెప్పలేము. ఒక పార్టీ లక్ష్యాలు వీటికి అనుగుణంగా ఉన్నాయా లేదా అని ఎవరు నిర్ణయించాలి? బిజెపి లౌకికవాద పార్టీ కాదని తక్కిన పార్టీలన్నీ అంగీకరించినా, వారిదే కుహనా లౌకిక వాదమనీ, హైందవ సంస్కృతే నిజమైన లౌకిక సంస్కృతి అనీ బిజెపి అంటుంది. దళిత, వెనుకబడిన కులాల అవసరాల ప్రాతిపదికన నడిచే రాజకీయాలు లౌకికవాద రాజకీయాలు కావని వాదించేవారు ఈ దేశంలో చాలా మంది ఉన్నారు. ఆ రాజకీయాలను కమ్యూనల్ రాజకీయాలు అనడం కద్దు. అయితే భారతదేశంలో కులనిర్మూలనా రాజకీయాలే నిజమైన లౌకికవాద రాజకీయాలు కాబట్టి, దళిత కులాల ఆకాంక్షల ప్రాతిపదికన నడిచే రాజకీయాలే నిజమైన లౌకికవాద రాజకీయాలని ఇవతలి వైపు నుండి వాదించే అవకాశం ఉంది. ఈ సంవాదాన్ని తేల్చగలవారెవ్వరు? ఎన్నికల కమిషన్ తేల్చగలదా? తేల్చి కదా రిజిస్ట్రేషన్ ఇవ్వాలి?

రాజ్యాంగ ప్రవేశికలో సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయం అనే లక్ష్యాలే కాక దేశ సమగ్రత, ఏకత కూడ అంతర్భాగాలే. కానీ దేశంలోని సరిహద్దు రాష్ట్రాలలో ఈ 'ఏకత'ను ప్రశ్నించే రాజకీయాలే బలమైనవి. ఏ పార్టీకి ఆ రాజకీయాలు ఉండడానికి వీలు లేదనీ, ఉంటే అటువంటి పార్టీకి ఆ రాష్ట్రంలో ఎన్నికలలో పాల్గొనడానికి అవసరమైన రిజిస్ట్రేషన్ దక్కదనీ నియమం పెడితే ఎన్నికల నుండి ప్రధాన రాజకీయ ఆకాంక్షను వెలివేయడమవుతుంది కదా?

వేర్పాటు హక్కుల ఉద్యమం దృష్టిలో ఇది అభ్యంతరకరమైన కాంక్షకాదు. ఏ ప్రజలకైనా తమ మనుగడకు సంబంధించిన స్వయం నిర్ణయాధికారం ఉంటుందనేది ఒక రాజకీయ హక్కు. అయితే అభ్యంతరకరమైన రాజకీయాల విషయంలో కూడ

వాటిని వెలివేయడం ఎంతవరకు సబబనే ప్రశ్న వస్తుంది. ప్రజాస్వామ్యం పేరు మీద అప్రజాస్వామికమైన రాజకీయ పోకడలకు సహితం స్వేచ్ఛ ఇవ్వాలా అనేది సులభంగా జవాబు చెప్పగల ప్రశ్న కాదు. టర్కీ, అల్జీరియా వంటి దేశాలు ఈ సమస్యను బలంగా ఎదుర్కొంటున్నాయి. టర్కీలో ముస్లిం మతవాద పార్టీల కూటమికి ఎన్నికలలో మెజారిటీ సీట్లు లభించినప్పటికీ వారి రాజకీయ లక్ష్యం ఆ దేశ లౌకిక రాజ్యాంగానికి విరుద్ధం కాబట్టి వారి చేతికి అధికారం ఇవ్వకుండా సైన్యం అడ్డుపడింది. దాని ఫలితంగా ప్రజలలో చెప్పుకోదగ్గ మద్దతు ఉన్న మతవాదం హింసాత్మక రూపం తీసుకొని అంతర్యుద్ధ పరిస్థితి ఏర్పడింది. మన లా కమిషన్ పెట్టే షరతులు కూడ ఇటువంటి పరిస్థితికే దారి తీయవచ్చు. అట్లాగని ఫాసిస్టు పోకడలకు కూడ పూర్తి స్వేచ్ఛ ఇయ్యవలసిందేనా అంటే ఆ ప్రశ్నకు సులభమైన జవాబు ఉందని అనలేము గానీ నిషేధం కంటే సంవాదాన్ని నమ్ముకోవడం మొత్తం మీద ప్రజాస్వామ్య సంరక్షణకూ పురోగమనానికీ ఎక్కువ ఉపయోగపడుతుందని చెప్పగలము.

అదెట్లాగున్నా పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని తప్పనిసరి చేసిన కారణంగా ఫిరాయింపులను పూర్తిగా నియంత్రించవచ్చునని లా కమిషన్ భావించింది. ప్రస్తుతమున్న చట్టం ప్రకారం ఎన్నికయిన ప్రజా ప్రతినిధి పార్టీ ఫిరాయిస్తే తన సీటు కోల్పోవలసి ఉంటుంది గానీ, చట్ట సభలో ఆ పార్టీకి చెందిన వారిలో మూడవ వంతు కంటే ఎక్కువ మంది ఫిరాయిస్తే అది 'ఫిరాయింపు' కాక 'చీలిక' కిందికి వస్తుంది కాబట్టి సీట్లు వదులుకోనక్కరలేదు. ఇది విపరీతంగా దుర్వినియోగానికి గురయింది కాబట్టి ఈ మినహాయింపును తొలగించాలని లా కమిషన్ ఇప్పుడు ప్రతిపాదించింది. అంటే ఒకసారి ఒక పార్టీ టికెట్‌పైన ఎన్నికయిన వ్యక్తి ఎట్టి పరిస్థితిలోనూ ఆ అయిదేళ్ళూ ఆ పార్టీలో కొనసాగవలసిందే. లేదా తన సీటు కోల్పోవాలి. పార్టీలు తీసుకునే నిర్ణయాలను పార్టీ సభ్యులు రహస్య బ్యాలట్ ద్వారా మెజారిటీగా ఆమోదించాలన్న అంతర్గత ప్రజాస్వామ్య సూత్రాన్ని ప్రవేశపెడుతున్నాము కాబట్టి, ఆ పార్టీ టికెట్ పైన ఎన్నికయిన వ్యక్తి అయిదేళ్లపాటు ఇష్టమున్నా లేకున్నా ఆ పార్టీకే కట్టుబడి ఉండాలనీ లేకపోతే సీటు వదులుకోవడానికి సిద్ధపడాలనీ నియమం పెట్టడం ప్రజా ప్రతినిధుల హక్కులకు భంగకరం కాదని లా కమిషన్ వాదన. మన రాజకీయ నాయకులు దీనికి కూడ ఏదో ఒక విరుగుడు కనిపెట్టరు అని నమ్మగలిగితే, ఇది ఆలోచించదగ్గ ప్రతిపాదనే!

నేర చరిత్ర గల అభ్యర్థులను పోటీకి అనర్హులు చేసే విషయంలోనూ లా కమిషన్ ఒక ప్రతిపాదన చేసింది. ఎన్నికల పోటీ న్యాయంగా, నిష్పక్షపాతంగా జరగడానికి అది అవసరమనింది. ఇప్పుడున్న చట్టం ప్రకారం నేరం రుజువయి శిక్షపడితేనే అనర్హత వస్తుంది. అయితే ఈ రకమైన నేరాలకు పాల్పడే వ్యక్తులు రాజకీయ బలం, పరపతి గలవారు కావడం వల్ల వారికి వ్యతిరేకంగా మాట్లాడడానికి స్వతంత్రులయిన సాక్షులు ముందుకు రారు కాబట్టి నేరాలు రుజువు కావడం కష్టమనీ, అందువల్ల కొన్ని రకాల నేరాలలో నేరం రుజువయ్యేదాకా ఆగకుండా కోర్టు అభియోగాలు మోపినట్టయితే చాలు వారిని ఎన్నికలలో పోటీ చేయడానికి అనర్హులుగా భావించాలనీ లా కమిషన్ ప్రతిపాదన. జీవితఖైదు విధించగల అన్ని నేరాలూ, విభిన్న ప్రజావర్గాల మధ్య విద్వేషాన్నీ శతృత్వాన్నీ రెచ్చగొట్టే నేరాలూ ఈ కోవలోకి రావాలని లా కమిషన్ ప్రతిపాదన.

నేరం రుజువయ్యేదాకా ఆగకుండా చార్జిషీటు ఆధారంగా న్యాయస్థానం అభియోగాలు మోపితే అనర్హులుగా భావించాలన్న ప్రతిపాదనతో సూత్రప్రాయంగా అభ్యంతరం ఉండనవసరం లేదుగానీ ఇక్కడ రెండు విషయాలు ఆలోచించాలి. నేరాలన్నిటినీ ఒకే గాటన కట్టి అభియోగాలు ఏ కారణంగా ఎదుర్కొంటున్నా వారిని 'నేరచరిత్ర గలవారు' అనడం భావ్యం కాదు. కార్మిక రైతాంగ ఉద్యమాలు నుండిగానీ ఇతర రాజకీయ ఉద్యమాల నుండిగానీ ఎన్నికల రంగంలోకి ప్రవేశించిన వ్యక్తుల మీద తప్పుడు కేసులో సరయిన కేసులో గానీ మొత్తానికి కేసులుండే అవకాశం ఉంది. నేరం రుజువయ్యేదాకా ఆగాలా లేదా అన్న సంగతి అటుంచి, అసలు ఈ నేరాలను అనర్హత కలిగించేవిగా భావించడం సబబా? ఉద్యమకారుల నడవడిక ఎల్లప్పుడూ సరిగ్గానే ఉంటుందని అనలేముగానీ ఉద్యమాలలో భాగంగా నేరాలకు పాల్పడిన వారిని కూడ 'నేరచరిత్రులు' అనే అనైతిక జీవుల కోవలో చేర్చడం కరెక్టా? పైగా ఇప్పుడు అభియోగం మోపితే చాలునని లా కమిషన్ భావించే నేరాలలో విభిన్న వర్గాల మధ్య విద్వేషం, శత్రుత్వం రెచ్చగొట్టే నేరాలను (సెక్షన్ 153 ఎ, 505 ఐపిసి) చేర్చారు. అనేక ప్రజాతంత్ర ఉద్యమ నినాదాలకు ఈ ముద్ర వేయొచ్చు. ప్రజాతంత్ర ఉద్యమాలలో గట్టిగా పాల్గొంటే ఎన్నికలకు అనర్హులయ్యే పరిస్థితి వస్తుందేమోనన్న భయం ఉండడం ప్రజాస్వామ్యానికి మంచిదా? రెండు, నిజంగా హేయమైన నేరాలలో అభియోగాలు ఎదుర్కోవడాన్ని అనర్హతగా భావించడంలో అర్థం ఉందిగానీ జీవితఖైదు

విధించగల నేరాలు' అని టోకుగా అనడం ఎంతవరకు ఉచితం? చట్టం చేసే ఏ వర్గీకరణ అయినా తన లక్ష్యానికి అనుగుణంగా ఉండాలన్న ప్రాథమిక న్యాయసిద్ధాంత సూత్రాన్ని జీవన్‌రెడ్డి గారికి జ్ఞాపకం చేయనవసరం లేదు. ఎన్నికలు ప్రజాస్వామ్య ప్రక్రియ కాబట్టి సాంఘికంగా అప్రజాస్వామికమైన నేరాలు ఎన్నికల విషయంలో అనర్హతకు ప్రమాణం కాగలవుగానీ ఎక్కువ శిక్ష ఉన్న నేరాలు ప్రమాణం ఎందుకవుతాయి? ఉదాహరణకు అంటరానితనం, లైంగిక అత్యాచారం, అవినీతి, ఎన్నికల అక్రమాలు మొదలయిన నేరాలలో న్యాయస్థానం అభియోగం మోపితే చాలు ఆ వ్యక్తి ఎన్నికల పోటీకి అనర్హులయినట్టేనంటే కొంత అర్థం ఉంటుంది.

## స్థిరత్వం

ఎన్నికల వ్యవస్థ పారదర్శకంగా, న్యాయంగా ఉండాలన్న లక్ష్యంతో లా కమిషన్ చేసిన సూచనలను చూసిన తరువాత, స్థిరత్వం అనే లక్ష్యం నుండి వచ్చిన సూచనలను చూద్దాం. ఇవి ప్రాథమికంగానే అభ్యంతరకరమైనవని మొదట్లోనే చెప్పాము.

'చిన్న చిన్న పార్టీలు అనేకం ఉండడం దేశపాలనలో అస్థిరతకు దారి తీస్తున్నది. విశాలమైన జాతీయ ప్రయోజనాలు కాక సంకుచితమైన కులం, ప్రాంతం మొదలయిన పాక్షిక ప్రయోజనాలు గల పార్టీలు ఉండడం కూడ అస్థిరతకు దారి తీస్తున్నది. కేవలం రెండు లేక మూడు జాతీయ పార్టీలు మాత్రమే ఉండే స్థితికి దేశ రాజకీయాలను బలవంతంగా నెట్టాలి. అది వెంటనే సాధ్యం కాదు కాబట్టి కేవలం రెండు లేక మూడు జాతీయ కూటములలోకి అన్ని పార్టీలనూ నెట్టాలి'. ఇది లా కమిషన్ స్థిరత్వం కోసం చేసే సూచనల లక్ష్యం.

అసంఖ్యాకమైన భాషలు, కులాలు, జాతులుగా విడిపోయి ఉన్న భారతదేశంలో విభిన్న ప్రయోజనాలను, దృక్పథాలను వ్యక్తం చేసే అనేక రాజకీయ లక్ష్యాలుండడం సహజం. ఈ భిన్న ప్రయోజనాలను కాదని ఒక జాతీయ ప్రయోజనాన్ని గుర్తించి దానికి కట్టుబడి ఉండే రాజకీయ లక్ష్యాలు సహితం ఉండవచ్చునుగాక, కాని అవి మాత్రమే ఉండాలనడంలో అర్థం లేదు. దాని కోసం చట్టమే రాజకీయ లక్ష్యాలపైన ఒత్తిడి పెట్టాలనడం అణచివేత తప్ప వేరే ఏమీ కాదు. స్థిరత్వానికి ప్రజాస్వామ్యాన్ని తాకట్టు పెట్టే వైఖరి ఎన్నికల సంస్కరణలకు చోదకశక్తి అయితే ఇటువంటి వికారమైన సూచనలే పుడతాయి.

ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్నాయనుకోండి. ఆ ఎన్నికలలో పోటీ చేసే ఏ పార్టీకయినా ఆ రాష్ట్రంలో మొత్తం పోలయిన వోట్లలో అయిదు శాతం రావాలంట. వచ్చినట్లయితేనే ఆ పార్టీ గెలిచిన సీట్లు ఆ పార్టీకి దక్కుతాయి. లేకపోతే గెలిచిన సీట్లు కూడ వారికియ్యకుండ రద్దు చేసి రెండవ స్థానంలో ఉన్న వారికిచ్చేస్తారు. ఇది లా కమిషన్ సూచన.

ఒక చిన్న కులం లేక తెగకు చెందిన ప్రజల కోసం పని చేస్తూ, వారి ఓట్లు పెద్ద సంఖ్యలో ఉన్న ఒకటో రెండో నియోజకవర్గాలలో పోటీ చేసి గెలిచి, వారికి నిజాయితీగా చట్ట సభలలో ప్రాతినిధ్యం వహించాలన్న ఆలోచనకు ఎన్నికల ప్రజాస్వామ్యంలో చోటు ఉండకూడదనేది లా కమిషన్ అభిప్రాయం. అటువంటి పార్టీ తనకిష్టమున్నా లేకున్నా ఏదో ఒక పెద్ద కూటమిలో భాగం కావాలి. రాష్ట్రం మొత్తం మీద పోలయిన ఓట్లలో ఆ కూటమి 5 శాతమైనా పొందితేనే ఆ పార్టీకి తాను గెలిచిన ఒకటో రెండో సీట్లు దక్కుతాయి.

ఉదాహరణకు, మన రాష్ట్రంలో ఆదివాసుల జనాభా 6 శాతం. కేవలం ఆదివాసులలో పని చేసే రాజకీయ పార్టీ అన్ని ఆదివాసీ నియోజకవర్గాలలోనూ పోటీ చేసి గెలిచినా ఆదివాసుల ఓట్లలో అన్నీ ఆ పార్టీకే పడకపోవచ్చును కాబట్టి ఆ పార్టీకి వచ్చే ఓట్లు రాష్ట్ర జనాభాలో 5 శాతం మించకపోవచ్చు. అప్పుడు అన్ని ఏజెన్సీ నియోజక వర్గాలలోనూ ఆ పార్టీ గెలుపును రద్దు చేసి రెండవ స్థానంలో ఉన్న టిడిపి లేక కాంగ్రెస్ అభ్యర్థికి ఆ సీట్లు ఇస్తారు. ఈ పరిస్థితి తప్పించుకోవాలంటే ఆ ఆదివాసీ పార్టీ ఒంటరిగా పోటీ చేయకుండా తెలుగుదేశం కూటమిలోనో కాంగ్రెస్ కూటమిలోనో చేరి తన అర్హతను నిలబెట్టుకోవాలి. ఏ రకంగా చూసినా ఆ ఆదివాసీ పార్టీ పైన తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీల పెత్తనాన్ని నెలకొల్పడం ఈ సవరణ ఫలితం.

ఇది స్థిరత్వానికి తోడ్పడుతుందేమోగానీ ప్రజాస్వామ్యానికి నష్టకరం. స్థిరత్వం దానికదే ప్రజాస్వామ్యానికి దోహదకారి అయినట్టు ఎన్నికల సంస్కరణలకు స్థిరత్వాన్ని ముఖ్య ప్రమాణంగా లా కమిషన్ ఎంచుకుందిగానీ లేకపోతే ఇటువంటి సూచనలు చేయగలిగేది కాదు.

చిన్న పార్టీల మనుగడే ప్రశ్నార్థకం అయితే ఇంక ఏ పార్టీ లేని స్వతంత్ర అభ్యర్థుల సంగతేమిటి? స్వతంత్ర అభ్యర్థులనసలు పోటీ చేయనీయకూడదని లా

కమిషన్ సూచన. స్వతంత్ర అభ్యర్థులందరూ నాన్ సీరియస్ గానే పోటీ చేస్తారంట. వాళ్ల వల్ల బ్యాలట్ పేపర్ సైజు పెరగడం తప్ప ఒరిగేదేమీ లేదంట. ఒకవేళ వాళ్లు గెలిచినా ఎప్పుడు ఏ కూటమిలో చేరతారో తెలియక అస్థిరత తెచ్చి పెడతారంట.

ప్రజా ఉద్యమకారులుగా, సంస్కర్తలుగా ప్రజలలో పని చేసి మన్ననలు పొంది ఏ పార్టీలోనూ చేరడం ఇష్టం లేక స్వతంత్రంగా పోటీ చేసి గెలిచి చట్ట సభలలో నిజాయితీగా ఆ ప్రజలకు ప్రాతినిధ్యం వహించినవారు చాలామంది ఉన్నారన్న సంగతి లా కమిషన్ గుర్తించదలచుకోలేదు. ఇప్పుడు అటువంటి వారి సంఖ్య తగ్గిపోయిందంటే దానికి కారణం మొత్తంగానే రాజకీయాలలో వచ్చిన భ్రష్టత్వం. ఆ కారణం చాలుననుకుంటే మొత్తంగా ఎన్నికల వ్యవస్థనే రద్దు చేసేయొచ్చు. కేవలం స్వతంత్ర అభ్యర్థిత్వాన్ని మాత్రం రద్దు చేయడం ఎందుకు?

నిజానికి ఎన్నికల వ్యవస్థలో ప్రజాస్వామ్యాన్ని, ప్రాతినిధ్య స్వభావాన్ని పెంచే సవరణలు అనేకం సమాజంలో చర్చకు వస్తుంటాయి. ఎన్నికల సంస్కరణల మీద 200 పేజీల సుదీర్ఘమైన వర్కింగ్ పేపర్ రాసిన లా కమిషన్ వాటిలో ఒక్క దానిని కూడ చర్చించలేదంటే కారణం ఎన్నికల సంస్కరణలకు లా కమిషన్ ఎంచుకున్న లక్ష్యాలలో ప్రజాస్వామ్యాన్ని, ప్రాతినిధ్యాన్ని పెంచాలన్నది లేకపోవడం.

అయిదేళ్లకొకసారి ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకోవడమే కాకుండా, ఆ అయిదేళ్ల పాటు ఆ ప్రజాప్రతినిధులు ప్రజలకు ఏదో ఒక రూపంలో జవాబుదార్లుగా ఉండాలన్నది సమాజంలో తరచుగా చర్చ జరిగే విషయాలలో ఒకటి. ప్రజలకు నచ్చకపోతే ఆ ప్రజా ప్రతినిధిని 'రీకాల్' చేసే హక్కు ఉండాలనే ప్రతిపాదన ఇందులో భాగమే. దీనిని వ్యవస్థీకరించడంలో ఇబ్బందులుండవచ్చు. నియోజకవర్గంలో ఎంత మంది కోరుకుంటే 'రీకాల్' కోసం వోటింగ్ నిర్వహించాలి, ఎంతమంది ఆ ప్రతిపాదనకు అనుకూలంగా వోటు వేస్తే అది గెలిచినట్టు భావించాలి అనేవి సులభంగా నిర్ణయించగల విషయాలు కాకపోవచ్చు. కానీ ఆశ్చర్యం కలిగించే విషయం ఏమిటంటే లా కమిషన్ చేసే ఎన్నికల సంస్కరణల చర్చలో ఈ ప్రస్తావనే లేకపోవడం.

ప్రాతినిధ్యం దృష్టితో చూసినప్పుడు నియోజకవర్గాల సైజు కూడ ఒక సమస్యే. మన పార్లమెంటు సభ్యులొక్కొక్కరు 10 లేక 15 లక్షల మందికి ప్రతినిధులు. వాళ్ల పార్టీ విధానాలు, వ్యక్తిగత నిజాయితీల సంగతి అటుంచి, ఈ రకమైన ప్రాతినిధ్యానికి

నిజంగా అర్థం లేదు. ఇంగ్లండ్‌లో ఒక్కొక్క పార్లమెంట్ నియోజకవర్గం మన మండలమంత ఉంటుంది. అంటే అక్కడ ఎం.పి మన ఎం.పి.పి అధ్యక్షునితో సమానం. మన పార్లమెంట్ నియోజకవర్గాన్ని అంతగా తగ్గిస్తే పార్లమెంటు సైజు విపరీతంగా పెరిగిపోతుంది కాబట్టి అది ఆచరణయోగ్యమైన పరిష్కారం కాకపోవచ్చునుగానీ అధికార వికేంద్రీకరణ పెద్దఎత్తున చేపట్టి స్థానిక సంస్థల అధికారాలు పెంచడం ఆచరణ యోగ్యమైన పరిష్కారం కాగలదు. ఏ స్థాయిలో చేయగల నిర్ణయాలను ఆ స్థాయికి చెందిన పాలనా వ్యవస్థకు, ప్రతినిధుల సభలకు అప్పగించినట్టయితే కొద్ది అధికారాలు మాత్రమే ఢిల్లీకి చెందుతాయి. ఇది కొత్తగా మేము చేస్తున్న ప్రతిపాదన కాదు. రాజ్యాంగం రాసిన రోజుల నుండి ఈ చర్చ ఉన్నదే. ప్రస్తుతమున్న ప్రాదేశిక నియోజకవర్గాలు ఆయా ప్రదేశాలలోని పెత్తందారీ వర్గాలకే ప్రాతినిధ్యం ఇస్తాయనీ, దళితులకు ఆదివాసులకు వేరే నియోజకవర్గాలు ఉండాలనీ ఒక డిమాండ్ స్వాతంత్ర పూర్వకాలం నుండి ఉంది. చట్టసభలు మగవాళ్ల సభలుగా ఉన్నాయనీ, స్త్రీలకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ ఉండడం మాత్రమే కాదు, అది రాజ్యాంగ సవరణ దాకా వచ్చి ఆగిపోయింది. దీని చర్చే లా కమిషన్ చేయలేదు.

ఎన్నికల సంస్కరణలకు ప్రభుత్వాల స్థిరత్వం లక్ష్యం కావడానికే వీలు లేదు. పారదర్శకత ఒక లక్ష్యం కాగలదు కాని ప్రాతినిధ్యం ప్రధాన లక్ష్యం కావాలి. ప్రాతినిధ్యాన్ని పూర్తిగా వదిలి పెట్టి స్థిరత్వాన్ని ప్రధానం చేసి పారదర్శకతను రెండవస్థాయి లక్ష్యంగా పెట్టుకొని ప్రాతినిధ్యాన్ని నిజానికి దిగజార్చే ప్రతిపాదనలు చేసిన లా కమిషన్ విజ్ఞతను ఏమనాలి?

*మానవహక్కుల వేదిక బులెటిన్ 2*
*జూన్ 2000*

# ఆర్థికసంఘం సిఫార్సులు అంత అన్యాయంగా లేవు

ఆర్థిక సంఘం (పదకొండవ ఫైనాన్స్ కమిషన్) సూచనల గురించి చంద్రబాబు చేస్తున్న గొడవ ఉచితమా, అనుచితమా అనేది సాధారణ దినపత్రికల పాఠకులకు అర్థం కాకపోవచ్చు. కష్టపడి అభివృద్ధి సాధిస్తున్న రాష్ట్రాలను చిన్నచూపు చూసి, తమ నిర్లక్ష్యం కారణంగా వెనుకబడిపోయిన రాష్ట్రాలకు ఎక్కువ వనరులు కట్టబెట్టడం ద్వారా వెనుకబడి ఉండిపోవడమే ఉత్తమం అన్న సందేశాన్ని పదకొండవ ఫైనాన్స్ కమిషన్ ఇచ్చిందని చంద్రబాబు ఆరోపణ.

ఈ రకమైన వాదన కొత్తది కాదు. చపక బియ్యం కూలివాళ్ళలో సోమరితనాన్ని పెంచుతుందనీ, నిరుద్యోగ భృతి బేవార్సు బతుకులను ప్రోత్సహిస్తుందనీ తరచుగా వింటుంటాం. అయ్యోపాపం అంటూ వెనుకబాటుతనానికి రాయితీలు ఇస్తుంటే, అదే బాగుందని జనం అక్కడే ఉండిపోతారని ఈ రకమైన వాదన వినిపించే వాళ్ళ ఉద్దేశం.

సంక్షేమ వ్యవస్థ కొంతమంది మీద ఈ రకమైన ప్రభావం వేస్తుందని ఒప్పుకోవచ్చు. కానీ మెజారిటీ ప్రజలకు ఇది వర్తిస్తుందని నమ్మడానికి ఆధారమేమీ లేకున్నప్పటికీ ఈ రకమైన వ్యాఖ్యల ప్రాచుర్యానికేమీ లోటు లేదు. భూ సంస్కరణలను వ్యతిరేకించే వాళ్ళు, చవక డిపోలను వ్యతిరేకించే వాళ్ళు, ఉద్యోగ భద్రతను వ్యతిరేకించే వాళ్ళు, సబ్సిడీలను వ్యతిరేకించే వాళ్ళు – వీరి నోట ఈ వాదన తరచు వింటుంటాం. చంద్రబాబు ఈ వాదననిప్పుడు కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంబంధాలకు కూడ వర్తింపజేస్తున్నారు.

మన రాజ్యాంగం దేశ ఆర్థిక వనరుల పైన అధికారాన్ని ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం చేతిలో పెట్టింది. ప్రధానమైన పన్నులు కేంద్ర ప్రభుత్వం వసూలు చేసుకుంటోంది. అయితే ఆర్థిక వనరులలో కొంత భాగం రాష్ట్రాలకు ఇవ్వవలసి ఉంటుంది. ఎంత భాగం అనే విషయం నిర్ణయించడానికి ఒక ఫైనాన్స్‌ను కమిషన్ను రాష్ట్రపతి (అంటే కేంద్ర ప్రభుత్వం) ఏర్పాటు చేస్తారు. ఈ కమిషన్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 280 కింద ఏర్పడుతుంది.

ఇప్పటివరకు కేంద్రం సేకరించే పన్నులలో రాష్ట్రాల వాటా ఎంత ఉండాలి అనే విషయంపైన ఫైనాన్స్ కమిషన్‌లు తీసుకునే నిర్ణయాలపై చర్చ ప్రధానంగా జరిగేది. దేశ రాజకీయార్థిక వ్యవస్థలో 'ఫెడరలిజం' వర్ధిల్లాలని కోరుకునే పార్టీలన్నీ కూడ రాష్ట్రాలకు మరింత ఎక్కువ వనరులు ఇవ్వాలని డిమాండ్ చేసేవి. ఇప్పుడు మొట్టమొదటిసారిగా రాష్ట్రాల వాటా ఎంత అనే చర్చ వదిలిపెట్టి ఏ రాష్ట్రం వాటా ఎంత అనే అంశాన్ని చంద్రబాబు ముందుకు తీసుకొచ్చారు. 'అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలు', 'వెనుకబడి ఉండిపోయిన రాష్ట్రాలు' అంటూ రాష్ట్రాలను రెండుగా వర్గీకరించి, ఇందులో మొదటి వర్గానికి చెందిన రాష్ట్రాలకు ఎక్కువ పనరులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. చేతకానివాళ్ళు వెనుకబడి ఉంటారనీ, సమర్థులు అభివృద్ధి చెందుతారనీ, సామర్థ్యానికి పారితోషికంగా ఎక్కువ వాటా వారి చేతిలో పెట్టాలని ఆయన సిద్ధాంతం. చేతకానితనమే వెనుకబాటుతనానికి కారణమా? సామర్థ్యం నుండే అభివృద్ధి వస్తుందా? అన్న ప్రశ్నలు వేసుకుంటే ఈ వాదన పునాదులు కదిలిపోతాయి. ఈ ప్రశ్నలు వేసుకోకుండా ఆ అభిప్రాయాలను గుడ్డిగా నమ్ముతూ వాటి చుట్టూ ఆర్థిక సిద్ధాంతాలను తయారు చేసుకుంటే సమాజంలో వర్గాల మధ్య అసమానతలు పెరిగినట్టే రాష్ట్రాల మధ్య కూడ అసమానతలు పెరుగుతాయి.

నిజానికి పదకొండవ ఫైనాన్స్ కమిషన్ చంద్రబాబు చెబుతున్నంత బాధ్యతారహితంగా వ్యవహరించలేదు. జనాభా ఎక్కువ ఉన్న రాష్ట్రాలకు ఎక్కువ వాటా ఇచ్చిందనీ, అందువల్ల కుటుంబ నియంత్రణను ప్రజలకు అలవరచే ప్రయత్నం చేయని ప్రభుత్వాల అలసత్వానికి బహుమానం ఇచ్చినట్టయిందనీ చంద్రబాబు వాదిస్తున్నారు. జనాభా పెరుగుదల కేవలం ప్రభుత్వ అలసత్వం ఫలితం కాదనీ, దానికి అనేక సాంఘిక ఆర్థిక కారణాలున్నాయనీ గుర్తించినట్లయితే, ఆ సాంఘిక ఆర్థిక కారణాలను

అధిగమించడానికి అవసరమైన చేయూత ఇవ్వవలసి ఉంటుందని గుర్తించగలుగుతాం. అయినా చంద్రబాబు వంటి విమర్శకులను దృష్టిలో ఉంచుకునే కాబోలు పదకొండవ ఫైనాన్స్ కమిషన్ ప్రస్తుత జనాభా లెక్కలు తీసుకోకుండా 1971 జనాభా లెక్కలను ఆధారంగా తీసుకుంది. అప్పటికి జనాభా నియంత్రణను ఒక కార్యక్రమంగా చేపట్టిన రాష్ట్రమేదీ లేదు కాబట్టి ఈ ప్రమాణాన్ని ఎంచుకోవడంలో వివక్ష ఏమీ లేదు.

తలసరి ఆదాయం తక్కువ ఉన్న రాష్ట్రాలకు పదకొండవ ఫైనాన్స్ కమిషన్ కేటాయింపులు ఎక్కువ ఇచ్చిందని మరొక అభియోగం. నిజానికి కేంద్ర పన్నుల కేటాయింపులో ఫైనాన్స్ కమిషన్‌లు ఈ ప్రమాణాన్ని ఎప్పుడూ లెక్కలోకి తీసుకుంటూనే ఉన్నాయిగానీ ఈ సారి (పదకొండవ ఫైనాన్స్ కమిషన్) దీని 'వెయిటేజ్'ను కొంచెం పెంచింది. ఇది తప్పనుకుంటే ఏం చేయాలి? ఇప్పటికే తలసరి ఆదాయం సాపేక్షంగా ఎక్కువ ఉన్న రాష్ట్రాలకే ఎక్కువ ఇవ్వాలా? ఇది రాష్ట్రాల మధ్య అసమానతలను పెంచదా? అభివృద్ధిలో ప్రాంతీయ సమతుల్యం ఉండాలన్నది ఒక హేతుబద్ధమైన, ప్రజాస్వామికమైన లక్ష్యం కాదా?

తలసరి ఆదాయం తక్కువ ఉండడానికి 'నిర్లక్ష్యం, అసమర్థత తప్ప వేరే కారణమేమీ లేదనుకుంటే ఇది అసమర్థతను ప్రోత్సహిస్తుందనుకోవచ్చు. కానీ ఉత్తరప్రదేశ్, ఒరిస్సా, బీహార్ వంటి రాష్ట్రాల పాలనలో అసమర్థత పాలు కొంచెం ఎక్కువే ఉన్నప్పటికీ అవి ఆర్థికంగా పురోగమించకపోవడానికి అదొక్కటే కారణం కాదు. పదకొండవ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ ఖుస్రో గారు ఒక దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వేరే రెండు కారణాలను ప్రస్తావించారు. కొండల మధ్య ఉన్న హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాలలోకి ప్రైవేట్ పెట్టుబడి వనరులు ఎక్కువ ప్రవహించడం కష్టం కాబట్టి ప్రభుత్వ వనరులు సాపేక్షంగా ఎక్కువ ఇవ్వవలసి ఉంటుంది కదా అన్నారు. మిలిటెన్సీ ప్రభావం ఎక్కువ ఉన్న జమ్ము కాశ్మీర్, అస్సాం, నాగాలాండ్ వంటి రాష్ట్రాలలో కూడ ప్రైవేట్ కంపెనీలు పెట్టుబడి పెట్టడానికి వెనుకాడతాయని గుర్తుచేశారు. ఆయన చెప్పని మరొక కారణాన్ని కూడ ప్రస్తావించవచ్చు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒరిస్సా, బీహార్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలలో సాంఘిక అసమానతలు, అణచివేతల పాలు సాపేక్షంగా ఎక్కువే. ఆ రాష్ట్రాలు ఆర్థికంగా అభివృద్ధి చెందకపోవడానికి, చెందినమేరకు అది పేదలకు దక్కకపోవడానికి ఇదొక ముఖ్య

కారణం. తమ చేతులలో లేని నైసర్గిక, రాజకీయ, సాంఘిక పరిస్థితులకు ప్రజలను బాధ్యులను చేసి శిక్షించవచ్చునా?

'సామర్థ్యానికి' గుర్తింపు ఇవ్వాలని చంద్రబాబు ప్రదర్శిస్తున్న ఆరాటానికి అర్థం తనూ, తన పాలనా చాలా సమర్థమైనవని చెప్పుకోవడం. కానీ రెండు విషయాలలో పదకొండవ ఫైనాన్స్ కమిషన్ 'సామర్థ్యానికి' ఇచ్చిన వెయిటేజ్‌ను చంద్రబాబు ప్రభుత్వం అందుకోలేకపోయింది. వీటిలో ముఖ్యమైనది పన్నుల సేకరణ. సమర్థవంతంగా పన్నులు వసూలు చేసే రాష్ట్రాలకు కేంద్ర వనరులలో కొంచెం ఎక్కువ వాటా ఇవ్వాలని ఫైనాన్స్ కమిషన్ ప్రతిపాదించింది. అయితే ఈ సామర్థ్యం లోపించింది కాబట్టి మన రాష్ట్ర ప్రభుత్వం దీని వలన ప్రయోజనం పొందలేకపోయింది. దానికి ఎవరినో నిందించడం ఎందుకు? ఆదాయ – వ్యయాల సమతుల్యాన్ని పాటించడంలో క్రమశిక్షణ గల ('ఫిస్కల్ డిసిప్లిన్' గల) రాష్ట్రాలకు కొంత వెయిటేజ్ ఇవ్వాలని కూడ పదకొండవ ఫైనాన్స్ కమిషన్ ప్రతిపాదించింది. అది కూడా చంద్రబాబు ప్రభుత్వం అందుకోలేకపోయింది.

నిజానికి పదకొండవ ఫైనాన్స్ కమిషన్ ఆలోచనా ధోరణి సరళీకరణకూ, ప్రపంచీకరణకూ అనుకూలమైనదే. ఎటొచ్చీ వీటిని అర్థం చేసుకునేటప్పుడు వివిధ రాష్ట్రాలలోనూ, ప్రాంతాలలోనూ ఉన్న భిన్న సమస్యలను లెక్కలోకి తీసుకోవడం అవసరమని పదకొండవ ఫైనాన్స్ కమిషన్ భావించింది. ఆ మేరకు హేతుబద్ధంగా వ్యవహరించింది.

ఈ వివాదంలో యాభై ఏళ్ళుగా చర్చకు వస్తున్న ఒక విషయం ఈ సారి చర్చకే రాకుండాపోయింది. అదేమిటంటే కేంద్రం చేజిక్కించుకునే వసరులలో రాష్ట్రాలకు ఎంత దక్కాలన్న ప్రశ్న, 10వ ఫైనాన్స్ కమిషన్ 29 శాతం ఇస్తే, 11వ ఫైనాన్స్ కమిషన్ దానిని 29.5 శాతానికి మాత్రమే పెంచింది. అది అంత తక్కువ ఎందుకుండాలన్న చర్చ చేస్తే, దాని గురించి గొడవ పెట్టుకుంటే అన్ని రాష్ట్రాలకూ, 'ఫెడరలిజం' మూల సూత్రాలకూ మేలు జరిగేది కాదా?

*ఆంధ్రప్రభ దినపత్రిక*
*31 ఆగస్టు 2000*

# కొంత సత్యం కొరవ భ్రమలు

జస్టిస్ పున్నయ్య కమిషన్ నివేదిక పైన, ఆ నివేదికలోని సూచనల పైన దుమ్మెత్తి పోసిన వారున్నారు. పున్నయ్యగారికీ, వారిని కమిషన్ ఏక సభ్యునిగా నియమించిన రాష్ట్ర ప్రభుత్వానికీ దురుద్దేశ్యాలు ఆపాదించిన వారూ ఉన్నారు.

అది అనవసరం. వేరే దేనికీ కాకపోయినా అందరూ ఆలోచించడం మరిచిపోయిన కొన్ని ప్రాథమిక, సామాజిక, రాజకీయ సత్యాలను జ్ఞాపకం చేయడానికి జస్టిస్ పున్నయ్య కమిషన్ కృషి పనికొచ్చింది. అన్ని కమిషన్లలాగ హైదరాబాద్‌లోని ఒక ప్రభుత్వ కార్యాలయంలో కూర్చొని 'అందరూ వచ్చి మీ సూచనలో సలహాలో ఇక్కడే అందజేయండి' అని ప్రకటించి ఊరుకోకుండా పున్నయ్యగారు జిల్లా జిల్లా తిరిగి బహిరంగ సమావేశాలు నిర్వహించి పారదర్శకంగా విషయ సేకరణ చేయడం వల్ల అంటరానితనం, దాని పర్యవసానమయిన సమస్యలు కొన్ని వారాలపాటు దినపత్రిక మొదటి పేజీ వార్తలయ్యాయి.

అది చిన్న విషయం కాదు.

'ఎస్.సి., ఎస్.టి.లపైన అత్యాచారాలను నివారించడానికి' ఉద్దేశించిన కమిషన్ ఎస్.సి.ల సమస్యలకిచ్చిన ప్రాముఖ్యంలో దశాంశం కూడ ఎస్.టి.ల సమస్యల కివ్వలేదని విమర్శించే హక్కు ఆదివాసులకు ఉంటుందిగానీ వేరే ఎవ్వరికీ పున్నయ్యగారి పరిశ్రమ విస్తృతి మీద సహేతుకమైన విమర్శ పెట్టే అవకాశం ఉందనుకోను.

అయినప్పటికీ వారు సూచించిన పరిష్కారాలలో మెచ్చుకోదగ్గవి కొన్ని ఉన్నా విమర్శించవలసినవే ఎక్కువ ఉన్నాయని చెప్పక తప్పదు. ఒక్కొక్క సూచననూ పట్టుకుని

‘ఇది ఇట్లా కాక ఇంకొకరకంగా ఉండవలసింది’ అనడం పెద్ద కష్టం కాదుగానీ స్థూలంగా పున్నయ్యగారు పరిష్కారాల పట్ల అనుసరించిన వైఖరినే విమర్శించవలసిన అవసరం ఉంది.

వారి సూచనలు మరీ మెతకగా ఉన్నాయనడం కేవలం వారి కంటే మనం ‘రాడికల్’ అని రుజువు చేసుకోవాలనే ఉబలాటం వల్ల కాదు. దానికి హేతుబద్ధమైన కారణం ఉంది.

## ఇంత మెత్తటి చర్యలు సరిపోతాయా?

అన్ని సమస్యలకూ కఠినమైన పరిష్కారాలే సరయినవనడం సహేతుకం కాదు. అయితే అన్నిటినీ మెత్తగానే పరిష్కరించాలనడమూ సహేతుకం కాదు. అది సమస్యకు ఉండే సామాజిక స్వభావాన్ని బట్టి ఉంటుంది. లేమి నుండి, అణచివేత నుండి, తెలియనితనం నుండి, బలహీనత నుండి పుట్టిన తప్పులను మెత్తగా, అవసరమైతే సానుభూతితో పరిష్కరించవచ్చు. కండకావరం నుండి పుట్టిన తప్పులను అట్లా పరిష్కరించలేం. అలాగని దాని పైన అనాగరికమైన హింస ప్రయోగించమనీ, నిర్విచక్షణగా అణచివేయమనీ అనడం లేదు గానీ ‘గుర్తెరిగి దెబ్బతీయడం’ అవసరం.

దళితులు సవర్ణుల నుండి, ఆదివాసులు ఆదివాసీయేతరుల నుండి ఎదుర్కొనే అణచివేత ఈ కోవకు చెందినది. పున్నయ్యగారికి ఈ విషయం తెలియదని అనుకోలేము గానీ వారు సూచించిన పరిష్కారాలు మాత్రం తెలియనివారు ఇవ్వగలిగినవే. నచ్చజెప్పాలి, సంజాయించాలి, బహుమతుల వంటి ప్రోత్సాహకాలు ఇవ్వాలనీ, చట్టాల అమలును పర్యవేక్షించడానికి పలు పర్యవేక్షక అధికారులను ఒక దొంతరగా నియమించాలనీ పున్నయ్యగారు ప్రధానంగా సూచిస్తున్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి పేద తల్లిదండ్రులను అనునయించే పద్ధతిలో వ్యవహరించాలంటే అర్థం ఉందిగానీ సవర్ణుల చేత కుల అహంకారం మాన్పించడానికి కూడ అదే మంచి పద్ధతి అంటే ఒప్పుకోవడం కష్టం. అంటే నచ్చజెప్పవలసిందీ ప్రచారం చేయవలసిందీ ఏమీ లేదని కాదు. దాని ప్రయోజనం దానికి ఉంటుంది.

కానీ అదే ప్రధాన పరిష్కారం కాజాలదు. సామాజిక మోతుబరులూ రాజకీయ పెత్తందార్లూ, ఎవరైతే అంటరానితనాన్ని పదిలంగా నిలబెడుతున్నారో, వారి పెత్తనాన్నీ మోతుబరితనాన్నీ దెబ్బతీసే మార్గాలు వెతకాలి. అంటే పొట్టమీద – కాకపోతే బొజ్జమీద – కొట్టాలి. అనాగరికమైన సాంప్రదాయాలను కొనసాగించేవారు ఆర్థిక రాజకీయ రంగాలలో నాగరికత ఫలాలను అనుభవించడం అసాధ్యం చేయాలి. ఈ సూత్రాన్ని ప్రాతిపదిక చేసుకుని ఒక్కొక్క రంగంలోనూ ప్రభుత్వము, పౌర సమాజము (ఇది ప్రభుత్వం బాధ్యత మాత్రమే కాదు కాబట్టి) ఏమేం చేస్తే బాగుంటుందో ప్రభుత్వానికి సూచించవలసిందిగా మానవ హక్కుల వేదిక జస్టిస్ పున్నయ్య గారిని కోరుతూ విజ్ఞాపన పత్రం ఇవ్వడం జరిగింది. పున్నయ్యగారి నివేదికలో ఈ స్ఫూర్తి లోపించడం దురదృష్టకరం.

## చట్టంలో సవరణలు

వారి సూచనలలో ఉపయోగకరమైనవి అసలే లేవని కాదు, కొన్ని ఉన్నాయి. వాటిని ముందు ప్రస్తావించి, విమర్శకు తరువాత వద్దాం. ఎస్.సి., ఎస్.టి. (అత్యాచారాల నిరోధక) చట్టంలో కొన్ని సవరణలు చేయాలని వారు సూచించారు. దళితుల పైన దళితేతరులు చేసిన అత్యాచారాలన్నీ ప్రస్తుతం ఉన్న ఎస్.సి., ఎస్.టి చట్టం పరిధిలోకి రావు. అదనంగా, 'బాధితులు దళితులు అన్న కారణంగా' నేరస్తులు ఆ నేరానికి పాల్పడ్డారనీ, లేదా 'బాధితులను కించపరచడం కోసం' ఆ నేరానికి పాల్పడ్డారనీ రుజువు కావాలి. ఘటన నుండే ఈ ఉద్దేశ్యాన్ని నిర్ధారించడానికి వీలులేదు. అదనంగా ఉద్దేశ్యం రుజువు కావాలి. అది రుజువు కాలేదని చెప్పి సవర్ణుల పైన కేసు కొట్టేసిన సందర్భాలు చాలా ఉన్నాయి.

కులం మన సమాజంలో చాలా బలమైన వ్యవస్థ. కులతత్వం మన చైతన్యంలోనూ అంతే బలమైన అంశం. అందువల్ల సవర్ణులు దళితుల పైన అత్యాచారాలకు పాల్పడితే కులతత్వంతోనే చేసి ఉంటారనీ, బాధితులను కించపరచడం కోసమే చేసి ఉంటారనీ, కాదని రుజువు చేసుకునే బాధ్యత ముద్దాయి పైనే ఉంటుందనీ చట్టం భావించడం సబబుగా ఉంటుంది. జస్టిస్ రామస్వామి సుప్రీంకోర్టు జడ్జిగా 1992లో ఇచ్చిన ఒక తీర్పులో ప్రస్తావనావశంగా ఈ మాటే అన్నారు. అయితే ఎస్.సి., ఎస్.టి. (అత్యాచారాల నిరోధక) చట్టం అందుకు భిన్నంగా ఉంది.

అంతకుముందు చేసిన పౌరహక్కుల పరిరక్షణ చట్టం (పిసిఆర్ చట్టం) 1955 లో 'ఈ చట్టంలో నేరంగా ప్రకటించబడిన చర్యకు ఎవరైనా పాల్పడినట్టయితే, అది అంటరానితనం కారణంగానే జరిగిందని తద్విరుద్ధంగా రుజువయ్యేంత వరకు కోర్టు భావిస్తుంది' అని సెక్షన్ 12లో అన్నారు. 1989లో చేసిన ఎస్.సి., ఎస్.టి (అత్యాచారాల నిరోధక) చట్టంలో ఇది తీసేసి, నేరమే కాక ఉద్దేశ్యం కూడ విడిగా రుజువు కావాలని పెట్టారు.

పౌరహక్కుల పరిరక్షణ చట్టం, 1955లోని సెక్షన్ 12 వంటిది ఎస్.సి., ఎస్.టి (అత్యాచారాల నిరోధక) చట్టంలో కూడ చేర్చాలని జస్టిస్ పున్నయ్యగారు ఒక్క మాటలో అని ఉంటే సరిపోయేది. ఆయన 'అంత దూరం' పోలేదుగానీ, దళితులను బహిరంగ స్థలంలో అవమానపరచడం, దళిత స్త్రీ పైన లైంగిక హింసకు పాల్పడడం అనే నేరాల నిర్వచనంలో 'వారిని కించపరిచే ఉద్దేశ్యంతో చేసినట్టయితే' అన్న మాటలను తొలగించాలని సూచించారు. అంతవరకు బాగానే వుంది గానీ, ఆ సవరణలు పార్లమెంటు చేసేదాకా రాష్ట్రం ఆగకుండ తానే చేపట్టాలని అని ఉంటే బాగుండేది. పార్లమెంటు చేసిన ఏ నేర చట్టాన్నయినా రాష్ట్రం సవరించి రాష్ట్రపతి ఆమోదం పొందినట్టయితే, ఆ రాష్ట్రం మేరకు ఆ సవరణ అమలవుతుంది. పున్నయ్యగారు ఈ మాట అనకపోయేసరికి మన రాష్ట్ర ప్రభుత్వం చాలా సంతోషంగా ఆ సవరణకు సంబంధించిన సూచనను 'ఆమోదించి' తన మాటగా కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. దాని వల్ల దళితులకు దక్కిందేమీ లేదుగానీ రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రం పరువు దక్కింది.

ఇంకొక ఉపయోగకరమైన సూచన కూడ పున్నయ్యగారు చేశారు. ఎస్.సి., ఎస్.టి. (అత్యాచారాల నిరోధక) చట్టం కింద కేంద్రం కొన్ని నిబంధనలను చేసింది. రూల్ 7 ప్రకారం, ఆ చట్టం కింద నేర పరిశోధన డిఎస్‌పి ర్యాంకు అధికారే చేయాలి తప్ప అంతకంటే చిన్న అధికారి చేయకూడదు. పైస్థాయి అధికారి అయితే స్థానిక అగ్రకుల పెత్తందార్ల ఒత్తిడికి లొంగకుండ నిర్భయంగా నేరపరిశోధన జరుపుతాడన్నది వారి ఉద్దేశ్యం కావచ్చు. ఈ ఉద్దేశ్యం ఎంత వాస్తవికమైనదనే విషయాన్ని అటుంచి, ఆ రూల్ పెట్టింది బాధితుల మేలు కోరే తప్ప ముద్దాయి రక్షణ కోసం కాదనేది స్పష్టమే.

అయితే ఏ సంక్షేమ నియమాన్నైనా బలవంతులకు అనుకూలంగా వ్యాఖ్యానించగల మన కోర్టులు రూల్ 7ను అగ్రకుల ముద్దాయిలకు ఒక కవచంగా మలిచాయి. కేసులో నేర పరిశోధన ఎస్.ఐ. గానీ, సి.ఐ. గానీ చేసినట్టయితే ఆ చార్జిషీట్ చెల్లదని హైకోర్టు కేసును కొట్టేసిన ఉదంతాలు, కింది కోర్టు శిక్ష విధిస్తే హైకోర్టు (ఇతరత్రా సాక్ష్యాలు బలంగా ఉన్నా) కేవలం ఈ కారణంగా ముద్దాయికి విముక్తి కల్పించిన ఉదంతాలు అనేకం ఉన్నాయి. మన హైకోర్టు ఈ విషయంలో ముందు స్థానంలో నిలిచింది. (అయితే ఈ మధ్యనే ఈ వైఖరి సరయినదా అన్న సందేహం రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు న్యాయమూర్తులకు విడివిడిగా వచ్చి, రూల్ 7ను ముద్దాయికి అనుకూలంగా వ్యాఖ్యానించడం సబబా అన్న సందేహాన్ని పెద్ద బెంచికి నివేదించారు.)

రూల్ 7ను మొత్తంగానే తొలగించాలని పున్నయ్యగారు ఇప్పుడు సూచించారు. ఎస్.ఐ. కంటే డి.ఎస్.పిలు తప్పనిసరిగా నిష్పక్షపాతంగా వ్యవహరిస్తారని నమ్మడానికి ఆధారాలేమీ లేవు కాబట్టి, ఆ నియమం ఉండి దళితులకు చేసిన మేలుకంటే దానికి కోర్టులు చేసిన వక్ర వ్యాఖ్యల వల్ల జరిగిన నష్టం ఎక్కువ కాబట్టి దానిని మొత్తంగా తొలగించాలని పున్నయ్యగారు సూచించడం మంచిదే. అయితే ఈ సవరణను రాష్ట్ర ప్రభుత్వం చేసేసి (రాష్ట్రపతి ఆమోదం పొంది) ఈ రాష్ట్రం మేరకైనా అమలు చేయాలని వారు నిర్దిష్టంగా అనకపోవడం వల్ల ఈ మార్పు కూడ మన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సిఫారసు చేసేసి చేతులు దులిపేసుకుంది.

## సామాజిక చర్యలు:మరీ ఇన్ని భ్రమలుంటే ఎట్లా?

చట్ట సవరణల సంగతి ఇట్లాగుంటే, సామాజిక చర్యలుగా పున్నయ్యగారు సూచించినవి చాలా అసంతృప్తికరంగా ఉన్నాయని చెప్పాలి. కొన్నయితే హాస్యాస్పదంగా ఉన్నాయని సగౌరవంగా అనకతప్పదు.

పోలీసులూ, ఇతర ప్రభుత్వ అధికారులూ గ్రామాలకు పోయి మీటింగులు పెట్టి హితబోధ చేస్తే కులం సమస్య – లేదా కనీసం అంటరానితనం – రూపుమాసి పోతుందన్న పున్నయ్యగారి విశ్వాసాన్ని హాస్యాస్పదం అనక తప్పదు. నాలుగు నెలల కాలంలో అంటరానితనాన్ని రాష్ట్ర వ్యాప్తంగా రూపుమాపే అద్భుతమైన స్కీంగా ఆయన

సూచించిన దానిని మీకు చెప్తే మీరు నవ్వుతారు. ఒక్కొక్క పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టరు ప్రతీ శుక్రవారము తన పరిధిలోని రెండు గ్రామాలకు పోయి గ్రామంలోని ప్రజా ప్రతినిధులను, పరపతి గల వర్గాలనూ కూర్చోబెట్టి పిసిఆర్ చట్టం పూర్వాపరాలు, స్వరూప స్వభావాలు వివరించి చెప్పి, దానిని అమలు చేయడానికి వారందరి సహకారమూ కావాలని కోరినట్టయితే నెలలో ఎనిమిది గ్రామాలలో ఆ అధికారి అంటరానితనాన్ని రూపుమాపగలడు. ఎస్.ఐ.తో బాటు సి.ఐ. కూడ రంగంలోకి దిగి తాను వేరే రెండు గ్రామాలలో అదే పని చేసినట్టయితే ఇద్దరూ కలిసి ఒక నెల రోజులలో 16 గ్రామాలలో అంటరానితనాన్ని రూపుమాపగలరు. ఒక్కొక్క పోలీసు స్టేషన్ పరిధిలో సగటున 64 గ్రామాలున్నాయి కాబట్టి అన్ని పోలీసు స్టేషన్ పరిధులలోనూ ఇదే జరిగితే నాలుగు నెలలలో రాష్ట్ర వ్యాప్తంగా అంటరానితనం అంతరించిపోతుంది. ఇదీ ఆయన సూచన.

పదహారు నాలుగులు అరవై నాలుగు అన్నదొక్కటే ఇందులో నిర్వివాదం.

మరొకచోట పోలీసులే కాక ఎమ్మార్వో, ఎమ్డీవో తదితర అధికారులు కూడ ఈ పనిలో నిమగ్నం కావాలన్నారు. ప్రతీ నెలా 30వ తేదీని 'పౌరహక్కుల దినం'గా పాటించాలనీ, ఆ రోజున ఈ అధికారులు గ్రామాలకు పోయి సర్పంచ్, ఉపసర్పంచ్ తదితర ప్రజా ప్రతినిధులు, టీచర్లు మొదలయిన వారి సహాయంతో గ్రామంలోని గుడిలోనికి దళితులను ప్రవేశ పెట్టడం, బావులు, చెరువులకు దళితులను తీసుకుపోయి నీళ్లు తీసుకోనివ్వడం, రెండు గ్లాసులు పెట్టిన చాయ్ దుకాణాలలో వాటిని తొలగించడం అనే మూడు పనులు చేయాలనీ అన్నారు. ప్రతీ మండలంలోనూ నెలకొక గ్రామంలో ఈ కార్యక్రమాన్ని అమలు చేసినట్టయితే ఒక నెలలో 1125 గ్రామాలలోనూ, ఒక సంవత్సరంలో 13,500 గ్రామాలలోనూ, రెండు సంవత్సరాల మూడు నెలలలో రాష్ట్రంలోని 30,000 గ్రామాలలోనూ అంటరానితనం సమసిపోతుందన్నారు.

హాస్యాస్పదమైన ఈ కూడికలూ, గుణకారాలను పక్కనబెడితే ఈ ప్రతిపాదనలలో రెండు అభిప్రాయాలు అంతర్లీనంగా ఉన్నాయి. ఒకటి, హితోపదేశం (అందులోనూ ఒక రోజు మాత్రమే) చేస్తే అంటరానితనం పోతుంది. రెండు, ఆ బాధ్యత పురమాయించబడ్డ అధికారగణానికి అంటరానితనం తొలగిపోవాలన్న సంకల్పం ఉంది.

## పెత్తందార్ల ప్రయోజనాలను దెబ్బతీయాలి

హితోపదేశం ఒక రోజు కాకపోతే వంద రోజులు చేస్తామనుకోండి. ఎమ్మార్వోలూ, ఎమ్డీవోలూ, ఎస్.ఐ.లే కాక నిజంగా ఆ హితవచనాల మీద నమ్మకమున్న వారే చేస్తారనుకోండి. దానితో కుల వివక్ష పోతుందా? హితవచనాల వల్ల ఏ ప్రయోజనమూ ఉండదనడం లేదు. నైతిక స్పృహ అనేదొకటి ఉండడం మనిషికుండే విలక్షణమైన గుణాలలో ఒకటి. దానిని మేల్కొలిపే ప్రయత్నమెప్పుడూ పూర్తిగా వృథా కాదు. అయితే కుల వివక్షను, అందులోనూ దళితుల పట్ల సవర్ణులలో ఉండే వైఖరులను పోగొట్టడానికి హితవచనాలు సరిపోవని గడచిన యాభై ఏళ్ల చరిత్ర చెప్తుంది. స్థానిక పెత్తందారీ కులాల ప్రయోజనాలను దెబ్బతీసే మార్గమేదైనా అన్వేషించాలి.

ఒక గ్రామంలో లేక పట్టణంలో అందరికంటే ఆర్థికంగా రాజకీయంగా ఎక్కువ బలమున్నవాళ్లే అందరికంటే ఎక్కువగా కుల వివక్ష పాటిస్తారని సూత్రీకరించజాలము. కానీ కుల వివక్ష, కులపరమైన అణచివేత – ఆర్థిక రాజకీయ పెత్తనంతో సన్నిహితంగా ముడిపడి ఉన్నాయని స్థూలంగా చెప్పవచ్చు. అది ఒక్కొక్కచోట, ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్క రూపం తీసుకోవచ్చు.

అందువల్ల అంటరానితనం, దళితులపైన దాడులు అధికంగా ఉండేచోట మొత్తంగానే ఆర్థిక రాజకీయ పెత్తనాన్ని అనుభవించడానికీ, దానివల్ల ప్రయోజనం పొందడానికి ఉండే అవకాశాలను దెబ్బతీయడం అవసరం. ఒక ప్రాంతాన్ని ఎస్.సి., ఎస్.టి. (అత్యాచారాల నిరోధక) చట్టంలోని సెక్షన్ 17 కింద 'అత్యాచారాలు తరుచుగా జరిగే ప్రాంతం'గా ప్రకటించినట్టయితే ఆ ప్రకటన అమలులో ఉన్నంత కాలం ఆ ప్రాంతంలో నివసించే దళితేతరులెవ్వరికీ సివిల్ కాంట్రాక్టులు ఇవ్వకూడదు. ప్రభుత్వ కొనుగోళ్ళేవీ వారి దగ్గర చేయకూడదు. ఇది చాలా బలంగా పని చేస్తుందనడానికి సందేహమక్కరలేదు. ఈ సూచన మానవహక్కుల వేదిక (HRF) జస్టిస్ పున్నయ్యగారికి చేసింది గానీ వారి సాత్విక దృష్టికిది రుచించినట్టు లేదు.

రాజకీయంగా కూడ దెబ్బతీయవచ్చును. స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు ప్రస్తుతం రొటేషన్ పద్ధతిలో నిర్ణయిస్తున్న సంగతి తెలిసిందే. ఒకసారి దళితులకు రిజర్వ్ అయిన సీటు శాశ్వతంగా దళితులకే ఉండదు. రొటేషన్ పద్ధతి వల్ల దళితేతరులకు ఆ సీటు

పొందే అవకాశం ఒకసారి కాకపోతే ఒకసారి వస్తుంది. పెత్తందారీ కులాలవాళ్ళు స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు స్థిరంగా ఉండిపోకూడదని కొట్లాడి ఈ 'హక్కు' సాధించుకున్నారు. ఇప్పుడు పైన పేర్కొన్నట్టు సెక్షన్ 17 కింద 'ప్రకటిత ప్రాంతం'గా ఉన్నదానిలో అన్ని స్థానిక సంస్థలలోని అన్ని పోస్టులూ దళితులకే – ఆ ప్రకటన అమలులో ఉన్నంత కాలం – రిజర్వ్ అయి ఉండేటట్టు నియమాలను సవరించాలి. అప్పుడు ఆ ప్రకటనను తొలగించుకుని 'రొటేషన్ హక్కు' పొందడానికి స్థానిక పెత్తందారీ కులాలవారు తమ నడవడికను చక్కదిద్దుకుంటారు.

ఇది 'ఉమ్మడి శిక్ష' కాదా అంటారేమో. అంటే, అగ్ర కులాలకు చెందిన సద్వర్తనులకు కూడ ఈ శిక్ష వర్తిస్తుంది కదా అంటారేమో. వర్తిస్తుంది కానీ ఒక్కొక్కసారి అటువంటి ఒత్తిడి పెట్టకతప్పదు. ఉమ్మడి జుర్మానాలు చట్టంలో ఎప్పటినుండో ఉన్నాయి. పిసిఆర్ చట్టంలోనూ ఉన్నాయి. సూత్రప్రాయంగా ఈ ప్రతిపాదన అంతకంటే భిన్నమైనది కాదు.

ఇంక ప్రభుత్వ అధికారుల సంగతి. మన దేశంలోని ప్రభుత్వ సిబ్బందిలో నూటికి తొంభై మందికి అంటరానితనంగానీ ఏ అన్యాయంగానీ తొలగిపోవాలన్న కోరిక లేశమంత కూడ లేదు. వాళ్లు లెక్చర్లిచ్చి ప్రజలను మార్చేదెప్పుడు? అంటరానితనాన్నీ, కులవివక్షనూ అరికట్టడానికి ఉద్దేశించిన చట్టాల కింద వారి విధుల్ని వారు సక్రమంగా నిర్వర్తిస్తే చాలు. ఈ అవసరాన్ని జస్టిస్ పున్నయ్యగారు బాగానే నొక్కి చెప్పారుగానీ ఆ అవసరం తీర్చే సంకల్పం వారిలో ఎంత ఉందన్న ప్రశ్న వేసుకోలేదు. వేసుకోకపోగా, వారినే ప్రధాన సాధనం చేసుకుని ప్రజలలో మేల్కొలుపు తీసుకురావచ్చునని అహేతుకంగా భావించారు.

ఎస్.సి., ఎస్.టి. (అత్యాచారాల నిరోధక) చట్టం కింద ఒక అధికారి నిర్వర్తించ వలసిన బాధ్యతలను తెలిసీ నిర్వర్తించకపోయినట్టయితే అది కూడ నేరమేననీ, దానికి ఒక సంవత్సరం జైలుశిక్ష అనీ ఆ చట్టంలోని సెక్షన్ 4 అంటుంది. వేరే ఏ చట్టంలోనూ ఇటువంటి అంశం లేదు. అయినప్పటికీ కేసు నమోదు చేయని ఎస్.ఐ.లు, నేర పరిశోధన నిజాయితీగా చేయని డి.ఎస్.పి.లు, 'అత్యాచారాల' కేసులన్నీ బూటకపు కేసులేనని ప్రకటనలిచ్చే ఎస్.పి.లు, బాధితులకు నష్టపరిహారం ఇవ్వడానికి ముప్పై 'కొర్రీలు' పెట్టి ఆఫీసు చుట్టూ తిప్పుకునే కలెక్టర్లు, ఆ చట్టాన్ని వీలయినంతగా నీరుగార్చే

జడ్జిలు – ఈ జాబితా చాలా పెద్దదే. వీళ్లలో ఎవరిమీదా సెక్షన్ 4 పనిచేయలేదు. పనిచేయడం కష్టం కూడ. కేసు ఎవరు పెట్టాలి, ఎవరు పరిశోధించాలి, ఎవరు సాక్ష్యాలు చెప్పాలి, ఎవరు ప్రాసిక్యూట్ చేయాలి, ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఎవరు ఇవ్వాలి?

సెక్షన్ 4 బలమైనదే గానీ (అమలు కానంత) బలమైనది. ఆ వజ్రాయుధాన్ని అట్లాగే ఉండనిచ్చి అంతకంటే చిన్నదైనా సులభంగా పనిచేసే సాధనాన్ని రూపొందించు కోవడం మంచిది. దళితులకూ ఆదివాసులకూ హక్కులు కల్పించే చట్టాలను అమలు చేసే బాధ్యతలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, ఆ బాధ్యతకు హానిచేయడం విధి నిర్వహణలో 'మిస్ కాండక్ట్' కిందికి వస్తాయని ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ నియమాలలో రాసినట్టయితే వారిలో భయమూ కొంచెం ఎక్కువే ఉంటుంది, ఒకసారి కాకపోతే ఒకసారి వారి నిర్లక్ష్యానికి ఉచితమైన శిక్షా పడుతుంది. క్రిమినల్ కోర్టులో శిక్ష పడుతుందన్న భయం తెల్లబట్టల ఉద్యోగ వర్గానికి ఉండదుగానీ విధి నిర్వహణలో మిస్ కాండక్ట్ కింద ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు పోతాయన్న భయం మాత్రం ఎక్కువే ఉంటుంది.

ఇటువంటి భయాలేవీ పెట్టకుండ పర్యవేక్షక కమిటీలు, కమిటీల మీద కమిటీలు ఎన్ని ప్రతిపాదించినా – పున్నయ్యగారు చాలా ప్రతిపాదించారు – ప్రయోజనమేమీ ఉండదు. తమ మనసులలో నమ్మకం లేనివారు, విషయం పట్ల సీరియస్‌నెస్ లేనివారు, ఒకరినొకరు పర్యవేక్షించుకొని ఏం సాధిస్తారు?

## ఉద్యమాల ఆవశ్యకత

దళిత, ఆదివాసీ ప్రజల సొంత చొరవనూ, సంఘటిత ఉద్యమాలనూ ప్రోత్సహించడం – లేదా అడ్డం పడకుండా ఉండడం – ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చేయగల ఒక ముఖ్యమైన ఉపకారం. ఆ ఒక్క ఉపకారం ప్రభుత్వం చేస్తే దళితులూ ఆదివాసులూ తమ హక్కులు తామే కాపాడుకుంటారని నా అభిమతం కాదు. కుల నిర్మూలన ఉద్యమాల ఒత్తిడి ఫలితంగా పుట్టిన చట్టాలనూ వ్యవస్థలనూ అమలు చేయడం, వాటి చేత పని చేయించడం ప్రభుత్వానికి ఉండే ముఖ్య కర్తవ్యం. సామాజిక జీవితంలో కుల పెత్తన సంస్కృతినీ ఆచారాలనూ దెబ్బతీయడం కూడ

ప్రభుత్వం కర్తవ్యాలలో ఒకటి. జస్టిస్ పున్నయ్యగారు ఈ రెండు కర్తవ్యాలను దృష్టిలో పెట్టుకునే పైన ఉదహరించిన సూచనలు చేశారు. ఆ సూచనలలోని లోపాలను వివరంగానే ఎత్తి చూపాము. అయితే ప్రభుత్వం నిర్వర్తించగల ఈ కర్తవ్యాలే కాక బాధితులు ఉద్యమాల ద్వారా పెట్టగల ఒత్తిడి కూడ కుల వివక్షను అంతం చేయడానికి చాలా అవసరం. దీనికి అడ్డం రాకుండ ఉండడం ప్రభుత్వం చేయగల పనులలో ఒకటి.

ఈ విషయంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితి చాలా అసంతృప్తికరమైనది. ఆ సంగతి జస్టిస్ పున్నయ్యగారికి చాలా మంది దళిత, ఆదివాసీ ఉద్యమకారులు వివరంగానే చెప్పి ఉంటారు. అయినప్పటికీ ఈ కోణాన్ని వారి నివేదికలో ప్రస్తావించలేదు. దళిత, ఆదివాసీ హక్కుల కోసం కృషిచేసే సంస్థలను ప్రభుత్వ కార్యక్రమాలలో భాగస్వాముల్ని చేయాలని పున్నయ్యగారు అన్నారు గానీ స్వతంత్రంగా ఆ సంస్థలు చేపట్టే ఉద్యమాల ఆవశ్యకతను, అవి ఒకవేళ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగినా వాటిని ప్రభుత్వం గౌరవించవలసిన ఆవశ్యకతను ఆయన తన నివేదికలో ప్రస్తావించకపోవడం ఒక తీవ్రమైన లోపంగానే భావించాలి.

చుండూరు నుండి జీలుగుమిల్లి దాకా మన అనుభవం ఏమిటంటే – దళిత, ఆదివాసీ ఉద్యమాలకు వీలయితే తీవ్రవాదం అని పేరు పెట్టి అణచివేయడం, లేకపోతే అమలుచేసే ఉద్దేశ్యం లేని హామీలిచ్చి చల్లార్చడం, వారు లేవదీసిన సమస్యల పరిష్కారాన్ని సాగదీసి రెచ్చగొట్టి, రెచ్చిపోయిన తరువాత పోలీసులను పెట్టి తన్నించడం – ఈ పాలనా సంస్కృతిని గుర్తించి, ఒక పేరు పెట్టి, దానిని వదులుకొమ్మని ప్రభుత్వానికి నిక్కచ్చిగా చెప్పలేకపోవడం పున్నయ్య కమిషన్ నివేదికలోని ఒక ముఖ్య లోపం.

ఉద్యమించే హక్కు దళితులకూ ఆదివాసులకూ రాజకీయంగా, సామాజికంగా బలాన్ని ఇస్తుంది. వారికి ఆర్థికంగా బలం కల్గించే చర్యలు కూడ అవసరం. అందులో రెండింటిని పున్నయ్యగారు ప్రస్తావించారు. ఒకటి భూమి సమస్య, రెండవది కనీస వేతనాల సమస్య. దళితుల, ఆదివాసుల భూములను సవర్ణ రైతులు ఆక్రమించుకుని ఉన్నట్టయితే వారిని తొలగించి హక్కుదారులకు అప్పగించాలనీ, అలాగే భూస్వాములూ

ధనిక రైతుల అనుభవంలో ఉన్న ప్రభుత్వ భూముల నుండి వారిని తొలగించి దళితులకూ ఆదివాసులకూ ఆ భూములు పంచాలనీ అన్నారు. ఇందులో మొదటిది విజయనగరం నుండి చిత్తూరు దాకా రాష్ట్రం నలుమూలలా ఉన్న సమస్య. ఈ విషయంలో పున్నయ్య కమిషన్ సూచనను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి జీవో నెంబర్ 92లో దానికి చోటు కల్పించింది. దళితులకు కాగితం మీద పంచిన భూములను దళితేతరుల ఆక్రమణ నుండి విడిపించడానికి వివిధ జిల్లాలలో ఆందోళన చేస్తున్న ఉద్యమకారులు దీనిని ఉపయోగించుకోవచ్చు.

అయితే మొత్తంగానే రాష్ట్ర ప్రభుత్వం దూకుడుగా ప్రోత్సహిస్తున్న ప్రపంచీకరణ విధానాలు దళితులు, ఆదివాసులు, ఇతర పేదలను ఆర్థికంగానూ సామాజికంగానూ బలహీనపరుస్తున్న విషయం తన పరిధిలోకి రాదని జస్టిస్ పున్నయ్యగారు భావించారో లేక ప్రభుత్వాన్ని విమర్శించడానికి మొహమాటపడ్డారో తెలీదుగానీ చాలా ముఖ్యమైన ఈ విషయం ఆయన నివేదికలో చోటుచేసుకోలేదు.

రెండవదే కారణం అయి ఉండాలి. ఎందుకంటే నివేదిక ముగింపులో ఆయన సంక్షేమ చట్టాలను అమలు చేయవలసిన అధికారుల వైఫల్యాలు, లోపాల వల్ల 'ప్రభుత్వానికి చెడ్డ పేరు రావడం దురదృష్టకరం' అన్నారు. 'ప్రభుత్వం' అనే దాని వైఫల్యాలు, లోపాలు తక్కువేమీ కావు కాబట్టి ఇది దురదృష్టకరం కాదుగానీ, ఇతరత్రా తన కర్తవ్యాన్ని అభినందనీయంగా నిర్వహించిన జస్టిస్ పున్నయ్యగారికి ప్రభుత్వం పట్ల 'సాఫ్ట్ కార్నర్' ఉండడం నిజంగా దురదృష్టకరమే.

*మానవ హక్కుల వేదిక బులెటిన్ 5*
*ఏప్రిల్ 2002*

# కాగల కార్యానికి ముందస్తు ఆశీస్సులు

రెండవ లేబర్ కమిషన్ రిపోర్టు మీద ఇప్పటికే చాలామంది చాలా రాశారు, మాట్లాడారు. ఎక్కువ భాగం అందులోని కార్మిక వ్యతిరేక అంశాలను ఖండించడమే జరిగింది తప్ప ఆ నివేదిక గురించి సమగ్రమైన సమీక్ష ఇప్పటికెవరూ చేయలేదు. అటువంటి సమీక్ష కేవలం సమగ్రత కోసమే కాక ఇతరత్రా కూడ అవసరం. అవాంఛనీయమైన పరిణామాలను సమూలంగా వ్యతిరేకిస్తూ కూడ దానికి అక్కడక్కడ అడ్డుకట్ట వేయగల చిన్న చిన్న ప్రయత్నాలను ప్రోత్సహించడం ప్రజాతంత్ర కృషిలో ఎప్పుడూ జరగవలసిందే. అందుకు పనికి వచ్చే అంశాలు రెండవ లేబర్ కమిషన్ రిపోర్టులో లేకపోలేదు.

రెండవ లేబర్ కమిషన్ ఏర్పాటునూ, దాని 'టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్'నూ ప్రపంచీకరణలో భాగంగా జరిగిన పనులుగా విమర్శకులు సహేతుకంగా గుర్తించారు. అయితే (వారు అంటున్నట్టు) ఆ కమిషన్ సభ్యులు ప్రపంచీకరణను నిర్విమర్శగా ఆరాధించే వ్యక్తులు కారు. అందువల్ల తమకు అప్పగించిన అజెండా కార్మికులకు అన్యాయం చేయగలదని వారు గుర్తించారు. ముఖ్యమైన విషయాలలో ఆ అజెండాకు తగిన సూచనలు చేస్తూ కూడ కొన్ని విషయాలలో తమ నుంచి ప్రభుత్వం ఆశించిన సూచనలు ఇవ్వడానికి నిరాకరించారు. మరికొన్ని విషయాలలో ఆ అజెండా పరిధిలోనే కార్మికులకు కొంత భద్రత కల్పించే ప్రయత్నం చేశారు.

వారి నివేదికను కేంద్ర ప్రభుత్వం ఉన్నదున్నట్టు ఆమోదించవలసిన అగత్యం లేదు. తనకు నచ్చిన విషయాలు స్వీకరించి మిగిలిన వాటిని తిరస్కరించవచ్చు.

ఆ పని 'దేశ అభివృద్ధి' పేరుమీదనే జరగబోతుంది కాబట్టి ఆ అభివృద్ధి అసలు లక్షణం ఏమిటో ప్రజలకు వివరించడానికి ప్రభుత్వమే నియమించిన ఈ కమిషన్ అభిప్రాయాలు, సూచనల సమగ్ర పాఠం ఉపయోగపడుతుంది. ఆ విమర్శ రేపు రాబోయే చట్ట సవరణలను కొంతమేరకయినా బలహీనపరచడానికి ఉపయోగపడితే అది కూడ ఒక ప్రయోజనమే.

i) సంఘటిత రంగంలో ప్రస్తుతం అమలులో ఉన్న చట్టాల క్రమబద్ధీకరణకు సూచనలు చేయడం;

ii) అసంఘటితరంగ కార్మికులకు కనీస రక్షణ కల్పించే ఒక సమగ్ర చట్టాన్ని సూచించడం.

రెండూ కేంద్ర ప్రభుత్వం రెండవ లేబర్ కమిషన్‌కు ఆదేశించిన కర్తవ్యాలు. 'క్రమబద్ధీకరణ' అని తెలుగులోకి మేము అనువాదం చేసిన ఇంగ్లీష్ పదం rationalisation. 'హేతుబద్ధీకరణ' అనే మాట ఎబ్బెట్టుగా లేకపోతే ఆ మాటే వాడి ఉండవచ్చు. ప్రస్తుతం సంఘటిత రంగానికి వర్తించే చట్టాలు అహేతుకంగా ఉన్నాయనీ, వాటిని హేతుబద్ధంగా సవరించడానికి సూచనలిమ్మనీ రెండవ లేబర్ కమిషన్‌ను కేంద్ర ప్రభుత్వం కోరింది.

ఏ కోణం నుంచి చూసినప్పుడవి అహేతుకంగా ఉన్నాయి? ఇన్నాళ్లూ లేనిది అవి అహేతుకంగా ఉన్నాయని ప్రభుత్వం ఈరోజు ఎందుకనుకుంటున్నది? ఈ ప్రశ్నకు జవాబును దాచిపెట్టే ప్రయత్నం ప్రభుత్వం చేయలేదు. నిర్మొహమాటంగానే చెప్పింది. ప్రపంచీకరణ; వర్తక పారిశ్రామిక సరళీకరణ; వేగంగా వస్తున్న సాంకేతిక మార్పులు, వాటికి పారిశ్రామిక రంగంపైన, ఉత్పత్తి ప్రక్రియపైన, ఉపాధిపైన, ఉపాధిని నిలబెట్టుకోవడానికి అవసరమైన శిక్షణపైన, కార్మికులను ఒక చోటి నుంచి మరొక చోటికి తరలించే అవసరంపైన ఉండగల ప్రభావం; ఆర్థిక సామర్థ్యాన్ని సాధించుకోవడానికీ నిలబెట్టుకోవడానికీ అంతర్జాతీయ రంగంలో పోటీకి నిలబడడానికీ అవసరమైన చర్యలు – వీటిని దృష్టిలో పెట్టుకున్నట్టయితే ప్రస్తుత కార్మిక చట్టాలు అహేతుకంగా ఉన్నాయని ప్రభుత్వం భావిస్తున్నది. వాటికి అనుగుణంగా కార్మిక చట్టాలను తిరగరాయడానికి సూచనలిమ్మని కమిషన్‌కు ఏలిన వారి ఆదేశం. ఇవి

కేంద్ర ప్రభుత్వం కాగితం మీద పెట్టిన విషయాలే. మన ఊహకూ వ్యాఖ్యలకూ ఏమీ విడిచిపెట్టలేదు.

ఇందులో ప్రపంచీకరణ, వర్తక పారిశ్రామిక సరళీకరణ, అంతర్జాతీయ ఆర్థిక రంగంలో పోటీకి నిలబడడం అనేవి ప్రధానమైన విషయాలు. సాంకేతిక మార్పులను వాటి కోణం నుంచి చూసినప్పుడు మాత్రమే ప్రస్తుత కార్మిక చట్టాలు ఆ మార్పులకు అనుగుణంగా లేవని ప్రభుత్వానికి తోచింది. లేకపోతే సాంకేతిక మార్పులు రావడంలో కొత్త ఏముంది? మన దేశంలోని కార్మిక చట్టాలు చాలావరకు బాగా పాతవి. వాటిని జారీచేసిన తరువాత సాంకేతిక మార్పులు అనేకం వచ్చాయి. చిన్న చిన్న సవరణలు మినహా చట్టాలలో పెద్ద మార్పులేం అవసరం కాలేదు. సాంకేతిక మార్పులకు కార్మిక చట్టాలు నిజంగానే అవరోధమైన చోట, ఆ మార్పు చట్టానికి అడ్జస్ట్ కావలసిందే తప్ప చట్టాన్ని మార్చేది లేదన్న విధానపరమైన వైఖరి కూడ ఉండేది. ఇప్పుడు ఆ వైఖరిలో మార్పు రావడం వల్ల సమస్య వచ్చింది.

ఒక్క ఉదాహరణ ఇక్కడే ఇచ్చుకుంటే ఉపయోగకరంగా ఉంటుంది. ఒక పరిశ్రమలో కొత్త సాంకేతిక ప్రక్రియను ప్రవేశపెట్టదలచుకున్నారనుకోండి. దాని మీద పనిచేయడానికి అవసరమైన నేర్పు ఇప్పుడున్న కార్మికులందరికీ ఉండదు. పైగా ఇప్పుడున్నంత మంది కార్మికులు అప్పుడు అవసరం ఉండరు. ఆ నేర్పును సంపాదించుకోగల వయసు దాటిపోయిన వారిని, ఇతరులను కూడ తక్కువ ఖర్చుతో ఇంటికి పంపించి మిగిలిన వారికి శిక్షణ ఇచ్చి (లేదా అందరినీ పంపించేసి శిక్షణ పొందిన కొత్త వారిని నియమించి) కొత్త సాంకేతిక ప్రక్రియను ప్రవేశపెట్టే స్వేచ్ఛ తమకు ఉండాలని యజమానులు కోరుకుంటారు. ప్రస్తుతం ఉన్న పారిశ్రామిక వివాదాల చట్టం ప్రకారమయితే తొలగించే వారందరికీ గ్రాట్యుటీయే కాక అదనంగా అంత మొత్తం నష్టపరిహారం ఇయ్యవలసి ఉంటుంది. వంద మంది కంటే ఎక్కువ పనిచేసే కంపెనీ అయితే ఈ తొలగింపుకు ప్రభుత్వం అనుమతి తీసుకోవలసి ఉంటుంది. సీనియారిటీని దృష్టిలో పెట్టుకొని జూనియర్లనే ముందు తొలగించ వలసి ఉంటుంది. కొత్త శిక్షణకు సీనియర్లే (వయసు, అలవాట్ల రీత్యా) సిద్ధంగా ఉండరు కాబట్టి, వాళ్లను తొలగించి జూనియర్లను కొనసాగించడాన్ని చట్టం ఆమోదించదు కాబట్టి, సీనియర్లకు అదనంగా నష్టపరిహారం ఇచ్చి తమ హక్కు వదులుకొమ్మని

సంజాయించవలసి ఉంటుంది. దీనిని మార్చాలన్నది ప్రభుత్వం లక్ష్యం. సాంకేతిక మార్పులకు చోటు కల్పించడం కోసం శిక్షణ పొందిన, లేక పొందగల వారిని మాత్రం ఉంచుకొని (అది కూడ అవసరం ఉన్న మేరకే) తక్కిన వారిని అతి తక్కువ ఖర్చుతో (అంటే గ్రాట్యుటీ మాత్రం ఇచ్చి) ఎవరి అనుమతీ అక్కర లేకుండా ఇంటికి పంపించే ఏర్పాటు (ఆ మాట అనకుండా 'ఇతర పారిశ్రామిక రంగాలకు తరలిపోయే సౌలభ్యం కల్పించడం' అన్నారు) చట్టానికి ఆమోదనీయం కావాలని ప్రభుత్వం ఆదేశం. విధాన దృక్పథంలో వచ్చిన మార్పు వల్ల ఇది అవసరమయిందే తప్ప 'సాంకేతిక మార్పులకు' కార్మిక చట్టాలు వాటంతటవే ఆటంకం కాలేదు.

సాంకేతిక పురోగమనం సమాజానికి లాభదాయకం కాదా అని ఆవేశపడబోతారు. దీనికి జవాబుగా చెప్పుకోవలసిన విషయాలు చాలా ఉన్నాయి. సాంకేతిక పురోగమనం సమాజానికి లాభదాయకమని యజమానులు దానిని ఎంచుకోరు, తమకు లాభదాయకమని ఎంచుకుంటారు. అయితే అది శ్రామికుల ఉత్పాదన శక్తిని పెంచుతుంది కాబట్టి స్థూలమైన అర్థంలో సమాజానికి లాభదాయకమే కావచ్చు. కానీ కథ అక్కడితో అయిపోదు. ఆ సాంకేతిక ప్రక్రియ స్వభావాన్ని బట్టి, ఇతర పరిస్థితులను బట్టి దాని వల్ల ఈ స్థూలమైన అర్థంలో ప్రయోజనమే కాక నిర్దిష్టమైన అర్థంలో నష్టాలు కూడ ఉండగలవు. అవి ఉపాధి అవకాశాల వినాశనం, ఆర్థిక అంతరాల పెరుగుదల, అభివృద్ధి కేంద్రీకరణ, పర్యావరణ విధ్వంసం మొదలయిన అనేక రూపాలలో ఉండగలవు. అందువల్ల సాంకేతిక మార్పు విషయంలో ఆచితూచి వ్యవహరించడం అవసరం. తమ లాభాలు తప్ప వేరే ఏమీ చూసుకోని పరిశ్రమల యజమానులు ఆ పని చేయరు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో ప్రభుత్వం, కోర్టులు మాత్రం ఆ పనిని చేస్తున్నాయి. నిర్దిష్టమైన చట్టాల పరిధిలో చేస్తున్నాయి. ఇంతకంటే మెరుగయిన పర్యవేక్షణను ప్రతిపాదించడం ఆమోదనీయమే అవుతుందిగానీ ఉన్నదానిని తొలగించి యజమానుల లాభదృష్టే సరయిన నిర్ణయం చేస్తుందనడంలో అర్థం లేదు. నిజానికి యజమానుల లాభదృష్టి సామాజికంగా సరయిన నిర్ణయం చేస్తుందని కూడ మన విధానకర్తలు అనడం లేదు. అది ఉత్పాదన సామర్థ్యాన్ని పెంచుతుందని, అంతర్జాతీయ పోటీలో తట్టుకునే బలాన్ని ఇస్తుందని, పెట్టుబడి దిగుమతులకు అనువయిన వాతావరణాన్ని కల్పిస్తుందని మాత్రమే అంటున్నారు. సామాజిక శ్రేయస్సుకు 'మారోగోలీ' అంటున్నారు.

కాబట్టి రెండవ లేబర్ కమిషన్ టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్ మొదటి అంశంలోని అన్ని లక్ష్యాలూ వెరసి ఒకటే: ప్రపంచీకరణకు అనుకూలంగా సంఘటిత రంగంలోని కార్మిక చట్టాలను తిరగ రాయాలి. మరి ఈ పని చేస్తే కార్మికులందరూ 'అసంఘటిత' కార్మికుల స్థాయికి దిగజారిపోతారు కదా? అందుకే రెండవ అంశం చేర్చారు. అసంఘటిత రంగ కార్మికులకు 'కనీస రక్షణ' కల్పించే ఒక స్థూలమైన చట్టాన్ని రూపొందించమన్నారు. మన పాలకులు బొత్తిగా దయలేని వారు కారు.

నిజానికి అసంఘటిత రంగంలో చాలా వైవిధ్యం ఉంది. ఆ రంగంలో కార్మికులకు నిజంగా న్యాయం చేయాలంటే ఒక్కొక్క రకమైన అసంఘటిత శ్రమనూ విడిగా తీసుకొని దాని స్వభావానికి అనుగుణ్యమైన చట్టం చేయవలసి ఉంటుంది. రెండవ లేబర్ కమిషన్‌కు ప్రభుత్వం సూచించింది అది కాదు. అసంఘటిత రంగంలోని భిన్నత్వాన్ని లెక్కలోకి తీసుకోకుండ అందరికీ టోకున 'కనీస రక్షణ' కల్పించే ఒక గొడుగులాంటి చట్టాన్ని ('అంబ్రెల్లా లెజిస్లేషన్' అనేది ప్రభుత్వం వాడిన మాటే – మేము కల్పించిన ఉపమానం కాదు) సూచించమనింది. కమిషన్ తన కర్తవ్యాన్ని దానికి అనుగుణంగానే అర్థం చేసుకునింది.

కమిషన్ సమాజంలోని వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలను ఆహ్వానించింది. పరిశ్రమల యజమానులు, కార్మిక సంఘాలు, ప్రభుత్వ ప్రతినిధులు కార్మిక చట్టాల 'క్రమబద్ధీకరణ' గురించి తమ అభిప్రాయాలు తెలియజేశారు. పరిశ్రమల యజమానులు, ప్రభుత్వ ప్రతినిధులు కోరిన మార్పులు ఇవి:

1. ఒక పారిశ్రామిక సంస్థను మూసేసే విషయంలో గానీ, అక్కరలేని కార్మికులను తాత్కాలికంగా 'లే-ఆఫ్' చేసే విషయంలో గానీ, పూర్తిగా తొలగించే విషయంలో గానీ యాజమాన్యానికి పూర్తి స్వేచ్ఛ ఉండాలి. గ్రాట్యుటీ, ప్రావిడెంట్ ఫండ్ తప్ప వేరే ఏ నష్టపరిహారం ఇయ్యవలసిన అవసరం ఉండకూడదు. ముందస్తు నోటీసు ఇవ్వడం, ప్రభుత్వం అనుమతి తీసుకోవడం వగైరా ఆంక్షలు ఉండకూడదు. కోర్టుల జోక్యం ఉండకూడదు.

2. ఒక పారిశ్రామిక సంస్థ చేపట్టే ఉత్పత్తిలో, దానికి అనుబంధంగా జరిగే పనులలో దేనినయినా ఎప్పుడయినా కాంట్రాక్టుకు ఇచ్చి కాంట్రాక్ట్ కార్మికుల ద్వారా చేయించుకునే స్వేచ్ఛ, లేదా రోజువారీ పనిలోకి తీసుకునే క్యాజువల్ కార్మికుల చేత

చేయించుకునే స్వేచ్ఛ యజమాన్యానికి ఉండాలి. దీనిపైన చట్టం ఏ ఆంక్షలూ పెట్టకూడదు, ప్రభుత్వమూ కోర్టులూ జోక్యం చేసుకోకూడదు.

కమిషన్ ఈ రెండు కోరికలనూ పాక్షికంగా ఆమోదించింది. కార్మికులను లే ఆఫ్ చేయడానికి అది ఎంత పెద్ద సంస్థ అయినా సరే ప్రభుత్వం అనుమతి తీసుకోనక్కర లేదనింది. మూసివేసే విషయంలో 300 మంది కంటే ఎక్కువ కార్మికులున్న సంస్థ అయితేనే మూసివేయడానికి ముందుగా ప్రభుత్వం అనుమతి తీసుకోవాలనింది (ప్రస్తుతమున్న చట్టంలో 100 మంది కంటే ఎక్కువ కార్మికులున్న సంస్థ లేఆఫ్‌కూ, తొలగింపుకూ, మూసివేతకూ కూడ ప్రభుత్వం అనుమతి తీసుకోవాలి). అయితే నష్టాలలో ఉన్న సంస్థను బలవంతంగా నడిపించమనడంలో అర్థం లేదు కాబట్టి, అటువంటి సంస్థల మూసివేతను ఒక హక్కుగా గుర్తించడం అవసరమని వాదిస్తూ, అనుమతి కోసం పెట్టుకున్న అర్జీ మీద ప్రభుత్వం 60 రోజుల లోపల జవాబు చెప్పకపోతే అనుమతి ఇచ్చినట్టే భావించాలని కమిషన్ అంటుంది. నిజంగానే యాజమాన్య ప్రయత్న లోపం లేని కారణాల వల్ల సంస్థ నష్టాలలో పడినట్టయితే దానిని బలవంతంగా కొనసాగించాలనడం ఎవరికీ ప్రయోజనకరం కాదుగానీ, నిజంగా నష్టాలలో ఉందా లేక మూసివేయడం కోసం నష్టాలలో ఉన్నట్టు కృత్రిమంగా చూపించబడుతున్నదా అన్నదే అసలు సమస్య. అందుకోసమే ప్రభుత్వ అజమాయిషీ అనేది కనీసం వంద మంది కంటే ఎక్కువ కార్మికులు ఉన్న సంస్థ విషయంలో సామాజికంగా అవసరం అని భావింపబడింది. ఇప్పుడు 60 రోజులలోగా ఏ సంగతీ తేల్చకపోయినట్టయితే అనుమతి ఇచ్చినట్టేనని అంటే ఆ మాత్రం ఆలస్యాన్ని ప్రభుత్వ అధికారుల నుండి పొందడం యాజమాన్యాలకు కష్టం కాదు. కాయితం మీద పెన్ను పెట్టకుండ డబ్బు సంపాదించుకునే మార్గం లేదా కాయితం మీద పెన్ను పెట్టనందుకు డబ్బు సంపాదించుకునే మార్గం లభిస్తే మన అధికారగణానికి అంతకంటే ఏం కావాలి?

వెరసి, ఎంత పెద్ద కంపెనీ అయినా సరే, ఎంతమంది కార్మికులనయినా సరే లేఆఫ్ చేయడానికీ, తొలగించడానికీ కంపెనీని మూసివేయడానికీ ప్రభుత్వ అనుమతి తీసుకోనక్కర లేదని రెండవ లేబర్ కమిషన్ అభిప్రాయపడినట్టే భావించవచ్చు. కోర్టుల జోక్యాన్ని తొలగించడానికి మాత్రం కమిషన్ ఒప్పుకోలేదు. మూసివేత, తొలగింపు, లేఆఫ్‌ల విషయంలో వివాదం లేవదీసి కోర్టుకు ఎక్కే అవకాశాన్ని కార్మికులకు మిగిల్చింది.

యాజమాన్యాలు ఎప్పుడూ సహేతుకమైన కారణాల వల్లనే ఈ చర్యలకు పాల్పడతారని భావించినట్టయితే ప్రస్తుత ఆర్థిక వ్యవస్థలో ఇటువంటి ఆంక్షలు పెట్టడం అర్థరహితం అనుకునే అవకాశం ఉంది. కానీ అది నిజం కాదు. ఆ సంగతి రెండవ లేబర్ కమిషన్ సభ్యులకు బాగానే తెలుసును. నైపుణ్యంతో ఉత్పాదన క్రియ నిర్వహించడం ద్వారా మాత్రమే లాభాలు సంపాదించుకోవలసిన అగత్యం పెట్టుబడిదారులకు లేదు. ఆస్తులను అడ్డుపెట్టుకొని అనేక రూపాలలో డబ్బు సంపాదించు కోవచ్చు. దానికోసం లేని నష్టాలు ఉన్నట్టు చూపించవచ్చు, ఉన్న మార్కెట్ లేనట్టు చూపించవచ్చు. కార్మిక సంఘాలను దెబ్బతీయడానికి లేఆఫ్‌లు చేపట్టవచ్చు, నోరున్న కార్మికుల నోరు నొక్కేయడానికి రిట్రెంచ్ చేయవచ్చు. ఫ్యాక్టరీ మూసేసి కమర్షియల్ కాంప్లెక్స్ కట్టి అద్దెకిచ్చుకోవచ్చు. ఇన్నీ, ఇంకా ఎన్నో కారణాలుండగలవు కాబట్టే యాజమాన్య నిర్ణయాలకు – కనీసం 100 కంటే ఎక్కువ మంది కార్మికులున్న కంపెనీల విషయంలో – ప్రభుత్వం పర్యవేక్షణ ఉండాలని చట్టం భావిస్తుంది. కార్మిక శాఖలో పేరుకుపోయిన అవినీతి కారణంగా ఈ పర్యవేక్షణ అసమర్థంగా ఉంటే ఉండవచ్చుగాక, కాని దానికి సహేతుకమైన కారణం లేదనుకోవడం పొరబాటు.

అయితే తొలగించిన కార్మికులకు నష్టపరిహారం ఇచ్చే విషయంలో కమిషన్ యాజమాన్యాల కోరికను తిరస్కరించడమే కాక, ఇప్పుడున్న దానికంటే ఎక్కువ ఇవ్వాలని సూచించింది. ఈ సూచనను ప్రభుత్వం పక్కన పెట్టే అవకాశం ఉంది కాబట్టి, కమిషన్ ఈ విషయంలో అనుసరించిన వైఖరిని వివరించడం అవసరం. ప్రపంచీకరణ ఒత్తిడుల నేపథ్యంలో ఇప్పుడున్న పరిమితమైన అర్థంలో సహితం ఉద్యోగ భద్రత ఉండడం సాధ్యం కాదన్న పాలకుల వాదనతో ఏకీభవిస్తూనే, దాని స్థానంలో అర్థవంతమైన సామాజిక భద్రతను (సోషల్ సెక్యూరిటీని) ప్రవేశపెట్టాలని కమిషన్ భావించింది. ఇక్కడ సామాజిక భద్రత అంటే అర్థం ఉద్యోగం కోల్పోయిన కార్మికుడు తిరిగి ఉద్యోగం సంపాదించుకునేదాకా కనీస ఆదాయం ఉండేటట్టు చూడడం. ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇవ్వడమో, లేక తొలగించిన యాజమాన్యం తగు మొత్తం నష్టపరిహారం ఇవ్వడమో దీనికి మార్గం అని భావించి, మొదటిది మన దేశంలో లేదు కాబట్టి రెండవది అవసరమని చెప్పి, ప్రస్తుతం చట్టంలో ఉన్న నష్టపరిహారం కన్నా ఎక్కువ మొత్తాన్ని కమిషన్ సూచించింది. ఆ మొత్తాన్ని ముందే కార్మికుని చేతిలో పెట్టినట్టయితేనే తొలగింపు చట్టబద్ధం అవుతుందనింది.

కాంట్రాక్ట్ కార్మికులను వినియోగించే 'స్వేచ్ఛ' విషయంలో కూడ కమిషన్ యాజమాన్యాల కోరికకూ కార్మిక సంఘాల అభ్యంతరానికీ మధ్యస్తంగా సూచనలిచ్చింది. ప్రతీ సంస్థలోనూ ఒక కేంద్ర, లేక ప్రధాన ఉత్పత్తి (లేక సేవా) రంగం ఉంటుంది. సైకిళ్ల ఫ్యాక్టరీ సైకిళ్లు ఉత్పత్తి చేస్తుంది, బొగ్గుగని బొగ్గు తవ్వి తీస్తుంది, ఆస్పత్రి వైద్య సేవలందిస్తుంది. ఇవి ఆ సంస్థల ప్రధాన ఉత్పత్తులు, లేక సేవలు. ఇవి కాక, ఈ ప్రధాన ఉత్పత్తి లేక సేవకు అనుబంధంగా అనేక పనులు జరుగుతుంటాయి. ఊడవడం, తుడవడం, నిత్యం జరిగే లోడింగ్, అన్లోడింగ్, మిషన్ల రిపేర్లు, బొగ్గు తవ్వకం కోసం పై మట్టి తొలగించడం, ఆస్పత్రికి అనుబంధంగా మందుల విక్రయం, డయాగ్నోస్టిక్ సేవలు, ఉద్యోగుల కోసం క్యాంటీన్ నడపడం ఇత్యాది కార్యాలు. ఇవన్నీ అనుబంధ కార్యాలే అయినప్పటికీ ఇవి అనునిత్యం జరుగుతాయి, ఇవి జరగనిదే ఆ సంస్థ చేసే ప్రధాన ఉత్పత్తి లేక సేవ జరగదు. ఇవి కాక అప్పుడప్పుడు మాత్రమే జరిగే పనులు కొన్ని ఉంటాయి – బిల్డింగ్‌కు రంగులు వేయడం, ఏదయినా ముడిసరుకును నెలకొకసారి తెచ్చిపడేయడం వగైరా.

ఇందులో మూడవ కోవకు చెందిన పనులను మాత్రమే కాంట్రాక్టుకు ఇయ్యవచ్చుననీ, నిత్యం జరిగే పనులలో – అంటే మొదటి రెండు కోవలకు చెందిన పనులలో – సంస్థ తన కార్మికులనే పెట్టి పని చేయించుకోవాలని కార్మిక సంఘాలు చాలాకాలంగా ఆందోళన చేస్తున్నాయి. చట్టం అంత దూరం పోలేదుగానీ, నిత్యం జరిగే పనిలో కాంట్రాక్ట్ కార్మికుల నియామకాన్ని నిషేధించే అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేతిలో కాంట్రాక్ట్ కార్మిక చట్టంలోని సెక్షన్ 10(1) పెట్టింది. ప్రభుత్వాలు ఆ అధికారాన్ని కొంతమేరకు ఉపయోగించుకొని కొన్ని పారిశ్రామిక రంగాలలో కొన్ని రకాల పనులలో కాంట్రాక్ట్ కార్మికుల వినియోగాన్ని నిషేధించి ఉన్నాయి. కోర్టులు దయతలచి ఆ నిషేధాజ్ఞలను కొట్టేయని సందర్భాలలో అవి అమలవుతున్నాయి కూడ.

ఈ సెక్షన్ 10(1)ని పూర్తిగా తొలగించివేయాలనీ, ఏ రంగంలోనయినా కాంట్రాక్ట్ కార్మికులను నియమించడంపైన ఎటువంటి నిషేధంగానీ, నిషేధం పెట్టే అధికారం గానీ చట్టంలో ఉండకూడదనీ యాజమాన్యాల వాదన. రెండవ లేబర్ కమిషన్ కూడ సెక్షన్ 10(1)ని తొలగించాలన్న సూచనకు అనుకూలంగానే

స్పందించింది. అంటే ఒక పారిశ్రామిక రంగంలో లేక సంస్థలో నిత్యం జరిగే పనులలో కాంట్రాక్ట్ కార్మికుల నియామకాన్ని నిషేధించే అధికారం ప్రభుత్వానికి ఉండకూడదనింది. అయితే యాజమాన్యాలు కోరే పూర్తి స్వేచ్ఛ వారికి ఇవ్వకుండా, ఒక సంస్థ చేపట్టే ప్రధాన లేక కేంద్ర ఉత్పత్తి (లేక సేవా) రంగాలలో కాంట్రాక్ట్ కార్మికుల నియామకాన్ని చట్టమే నిషేధించాలని సూచించింది. ప్రధాన లేక కేంద్ర ఉత్పత్తిలో కాంట్రాక్ట్ కార్మికుల నియామకాన్ని నిషేధించడానికీ, నిత్యం తప్పనిసరిగా జరిగే పనిలో నిషేధించడానికీ చాలా తేడా ఉండగలదు. మొదటిది రెండవ దానిలో ఒక భాగం (ఒక్కొకసారి అతి చిన్న భాగం) మాత్రమే. ఉదాహరణకు ఒక గనిలో ఖనిజాన్ని తవ్వితీసే పని మాత్రమే ప్రధాన లేక కేంద్ర ప్రక్రియ. దానికి అనుబంధంగా పై మట్టి (ఓవర్ బర్డెన్ అంటారు) తొలగించే పని, ఖనిజాన్ని ముక్కలు చేసి ప్యాక్ చేసే పని, లోడ్ చేసే పని, మెయింటెనెన్స్ పని, నీళ్లు బయటకు తోడే పని, కార్మికుల కోసం క్యాంటీన్ నడిపే పని, ఊడ్చే పని, తుడిచే పని వగైరాలన్నీ అనునిత్యం అవసరమే అయినప్పటికీ ఇవి ఆ సంస్థ ప్రధాన ఉత్పత్తి ప్రక్రియ కిందికి రావు. ఈ పనులలో కాంట్రాక్ట్ కార్మికులను నియమించడాన్ని చట్టం ఇప్పటిదాకా నిషేధించకున్నా, ఆ నిషేధాన్ని ప్రకటించే అధికారం కాంట్రాక్ట్ కార్మిక చట్టంలోని సెక్షన్ 10(1) ప్రభుత్వానికి ఇచ్చింది. ప్రభుత్వాలు దానిని ఒకమేరకు సద్వినియోగం చేశాయి.

ఇప్పుడు ఆ అధికారాన్ని పూర్తిగా తొలగించి, కేవలం ప్రధాన లేక కేంద్ర ఉత్పత్తి ప్రక్రియలో మాత్రమే కాంట్రాక్ట్ కార్మికుల నియామకాన్ని నిషేధించాలనడం అత్యధిక శాతం కార్మికులను కాంట్రాక్ట్ కార్మికుల బతుకుకు వదిలేయడమే అవుతుంది. నిజానికి చాలా సంస్థలలో ఇప్పటికే ఈ వరవడి మొదలయింది. సెక్షన్ 10(1) ఇచ్చిన అధికారాన్ని ఉపయోగించడం దాదాపు మానేశాయి కాబట్టి ఇది నిరాటంకంగా సాగుతున్నది. ఇది కార్మికులను ఏళ్లతరబడి నిత్య అభద్రతలో ఉంచుతుంది. ప్రతీ సంవత్సరమూ కాంట్రాక్టర్ మారుతుంటాడు గానీ కొత్తగా వచ్చిన కాంట్రాక్టరు కొత్త కార్మికులను తెచ్చుకోడు. తెచ్చుకుంటే వాళ్లకు పని నేర్పించడానికే కొన్ని నెలలు పడుతుంది. పాతవాళ్లను కొనసాగించడం అతనికే ప్రయోజనకరం కాబట్టి వారినే కొనసాగిస్తాడు. అందువల్ల ఈ 'కాంట్రాక్ట్ కార్మికులు' ఏళ్ల తరబడి అదే సంస్థలో అదే పనిలో కొనసాగుతుంటారు. అయితే నిత్య అభద్రతలో – ఏ సంవత్సరం కొత్తగా

వచ్చిన కాంట్రాక్టరు ఏం చేస్తాడోనన్న భయంలో – బతుకుతుంటారు. వారి జీతాలు కూడ ఒక పద్ధతి ప్రకారం పెరగవు, ఇతర సదుపాయాలేవీ ఉండవు. అన్ని సంస్థలలో ఇప్పటికే నడుస్తున్న ఈ కపట నాటకాన్ని శాశ్వతం చేయడమే కమిషన్ సూచన ఫలితం.

కార్మిక – యాజమాన్య వివాదాల పరిష్కారం విషయంలో కూడ రెండవ లేబర్ కమిషన్ కార్మికుల సంఘటిత శక్తిని పెంపొందించవలసిన అవసరాన్ని ఒక పక్క గుర్తిస్తూనే, వివాదాల పరిష్కారం జటిలంగా తయారు కావడానికి గల ప్రధాన కారణాన్ని గుర్తించకపోవడం వల్ల అవాస్తవిక వైఖరినే చివరికి ప్రదర్శించింది.

పారిశ్రామిక వివాదాలు ద్వైపాక్షిక చర్చల (నెగోషియేషన్) లోనయినా పరిష్కారం కావాలి, కార్మిక శాఖ అధికారుల మధ్యస్తం (కన్సిలియేషన్) లోనయినా పరిష్కారం కావాలి. కోర్టుల (అడ్జుడికేషన్) లోనయినా పరిష్కారం కావాలి. ప్రస్తుతం నడుస్తున్నది ఈ వరుస క్రమం. ఎక్కువ భాగం వివాదాలు మూడవ దశలోనే పరిష్కారం అవుతున్నాయనీ, అది అవాంఛనీయం అనీ కమిషన్ అంటుంది. కానీ దానికి బాధ్యులెవరన్నది గుర్తించదు. ద్వైపాక్షిక పరిష్కారాలనూ అధికారుల మధ్యస్తాలనూ యాజమాన్యాలు చులకనగా చూడడం దీనికి ప్రధాన కారణం. లేకపోతే సమస్యలు చర్చలలో పరిష్కారం కాకుండ కోర్టుకెక్కాలని ఏ కార్మికులు కోరుకుంటారు?

కార్మికులు డిమాండ్లు లేవదీసి చర్చిద్దాం రమ్మంటే యాజమాన్యాలు రావు. మధ్యస్తానికి రమ్మని కార్మిక శాఖ అధికారులు పంపే నోటీసులకు జవాబుండదు. ప్రతి తేదీకీ కార్మిక శాఖ కార్యాలయంలో నిష్ఫలంగా హాజరు వేయించుకొని రావడంతో కార్మిక సంఘాల బాధ్యుల బతుకు సగం గడిచిపోతుంది. ఈ రెండు ప్రక్రియలనూ గౌరవించని యాజమాన్యాల మెడలు వంచే ఏర్పాటేదీ ఇప్పుడు లేదు, రెండవ లేబర్ కమిషన్ సూచించనూ లేదు. ద్వైపాక్షిక చర్చలకు కూర్చోవడానికి నిరాకరించినా, మధ్యస్తం నోటీసులను గౌరవించకున్నా అప్పటికప్పుడే భారీగా జుర్మానా వేసి దానిని కార్మికులకు పంచే నియమమేదయినా ఉంటే తప్ప ప్రయోజనం ఉండదు.

లేదా సమ్మె హక్కునయినా బలోపేతం చేయాలి. చర్చలకు రాకపోతే సమ్మె చేస్తారన్న భయం ఉంటే చర్చలకూ, మధ్యస్తాలకూ యజమానులు హాజరవుతారు. పారిశ్రామిక వివాదాలు న్యాయబద్ధంగా పరిష్కారం కావాలంటే కార్మిక సంఘాలు

బలంగా ఉండడం అవసరం అని కమిషన్ గుర్తించింది. అవి రోజురోజుకూ బలహీనపడుతుండడం దురదృష్టకరం అని బాధపడింది. అంత వరకు బాగానే ఉంది. కానీ చర్చలకూ మధ్యస్తాలకూ యజమానులు రానప్పుడు సంఘం బలంగా ఉండి ఏం ప్రయోజనం? చిత్తశుద్ధితో ద్వైపాక్షిక చర్చలలో పాల్గొనకపోవడం 'అన్ ఫెయిర్ లేబర్ ప్రాక్టీస్' అనీ, అది శిక్షార్హమైన నేరమనీ చట్టం అంటుంది. కానీ ఆ శిక్ష పడవలసింది క్రిమినల్ కోర్టులో, కేసు పెట్టవలసింది ప్రభుత్వం. అది ఎప్పుడూ జరగదు. దాని వల్ల వివాదం పరిష్కారానికి తక్షణ ప్రయోజనమేమీ లేదు. యాజమాన్యం చర్చలలో చిత్తశుద్ధితో పాల్గొననట్టయితే కార్మికులకు సమ్మె చేసే హక్కు ఉందని చట్టం గుర్తించినట్టయితే ప్రయోజనం ఉంటుంది.

ఈ సంగతి రెండవ లేబర్ కమిషన్ సభ్యులకు తెలియకపోలేదనడానికి తార్కాణం వారు బొంబాయి కార్మిక నాయకుడు దత్తా సామంత్ వ్యవహారశైలిని ప్రస్తావించిన వైనం. దత్తా సామంత్ కార్మిక శాఖ అధికారుల మధ్యస్తాలను ఎప్పుడూ ఆహ్వానించేవాడు కాదు. డిమాండ్లు పెట్టేవాడు, యాజమాన్యాలు దిగిరాకపోతే నేరుగా సమ్మె పిలుపు ఇచ్చేవాడు. ఈ ఎత్తుగడ ఫలితం ఇచ్చిన విషయం కమిషన్ తన నివేదికలో గుర్తించింది.

అయితే ఈ ఎత్తుగడ అన్ని సందర్భాలలోనూ పనిచేయదు. పెద్ద సంస్థలలో పనిచేసినంత సులభంగా చిన్న సంస్థలలో పనిచేయదు. అది పనిచేయాలంటే, యాజమాన్యాలు ద్వైపాక్షిక చర్చలలో గానీ కార్మిక శాఖ మధ్యస్తాలలో గానీ చిత్తశుద్ధితో పాల్గొననట్టయితే (అన్ని డిమాండ్లు వెంటనే ఒప్పేసుకోవాలని కాదు, నిజాయితీగా పరిష్కార ప్రయత్నంలో భాగం కావాలి) కార్మికులకు సమ్మె చేసే హక్కు ఉందని చట్టమే గుర్తించాలి.

ఈ అవసరాన్ని గ్రహించకుండా, పారిశ్రామిక సమస్యలు ద్వైపాక్షికంగానో, మధ్యస్తంలోనో పరిష్కారమయి పోవాలనుకోవడం అవాస్తవికం. అన్నీ తెలిసి కూడ రెండవ లేబర్ కమిషన్ సభ్యులు ఈ అవాస్తవిక వైఖరిని అనుసరించడం దురదృష్టకరం. ప్రభుత్వ అధికారుల దగ్గరికి, కోర్టుకు కూడ పోకుండ పారిశ్రామిక వివాదాలు పరిష్కారం కావడానికి యోగ్యమైనదిగా వారు భావించే ఒక యంత్రాంగాన్ని సూచించారు. ప్రతీ సంస్థలోనూ ఒక ఫిర్యాదుల పరిష్కార కమిటీ ఒకటి ఉంటుంది. అందులో సగం మంది యాజమాన్య ప్రతినిధులూ సగం మంది కార్మిక ప్రతినిధులూ ఉంటారు.

కార్మికుల వ్యక్తిగత సమస్యలన్నీ మొదట ఆ కమిటీ దగ్గరకు పోవాలి. ఈ సమస్యలను గుర్తింపు పొందిన యూనియనే కాక ఏ యూనియన్‌నైనా (పది శాతం సభ్యత్వం ఉంటే చాలు) లేవదీయవచ్చు. అక్కడ పరిష్కారం కాని పక్షంలో సమస్య మధ్యవర్తిత్వానికి పోవాలి.

ఈ మధ్యవర్తిత్వం కార్మిక శాఖ అధికారుల దగ్గర కాదు. ప్రభుత్వ అధికారులెవ్వరూ మధ్యవర్తిత్వం చేయకూడదని కమిషన్ అభిప్రాయం. దానికి వేరే మధ్యవర్తులు (ఆర్బిట్రేటర్స్) ఉంటారు. వీరు ఆ సంస్థలోని కార్మికులూ యాజమాన్యమూ ఇరువురూ అంగీకరించిన పెద్దమనుషులు కావచ్చు. లేదా కార్మిక సంబంధాల కమిషన్ ఎంపిక చేసినవారు కావచ్చు. ప్రతీ రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ ఒక కార్మిక సంబంధాల కమిషన్ ఉండాలనేది రెండవ లేబర్ కమిషన్ సూచనలలో ఒకటి.

మధ్యవర్తి దగ్గర సమస్య పరిష్కారం కాకపోతే అది కార్మిక సంబంధాల కమిషన్ దగ్గరకు పోతుంది. అక్కడ కూడ పరిష్కారం కాకపోతే లోక్ అదాలత్‌కు పోతుంది. ఎక్కడా కాకపోతేనే కోర్టుకు పోతుంది.

వ్యక్తిగత సమస్యలను ఏ యూనియన్ అయినా లేవదీయవచ్చునని చూశాం. సంస్థలోని కార్మికుల ఉమ్మడి సమస్యలను లేవదీసే హక్కు ఒకే ఒక 'సంప్రదింపుల ప్రతినిధి' (నెగోషియేటింగ్ ఏజెంట్)కి ఉంటుంది. సంస్థలో ఏ యూనియన్ కయినా 66 శాతం మించి సభ్యత్వం ఉన్నట్టయితే ఆ యూనియనే సంప్రదింపుల ప్రతినిధి అవుతుంది. లేనిపక్షంలో 25 శాతం మించి సభ్యత్వం ఉన్న అన్ని యూనియన్ల నుంచి దామాషా పద్ధతిలో ఎంపిక చేసిన కమిటీ సంప్రదింపుల ప్రతినిధి అవుతుంది. ఒకసారి గుర్తింపు పొందిన సంప్రదింపుల ప్రతినిధికి ఆ గుర్తింపు నాలుగు సంవత్సరాలు ఉంటుంది. ఆ నాలుగేళ్లు ఆ కమిటీ తప్ప వేరే ఎవ్వరికీ కార్మికుల ఉమ్మడి సమస్యల పైన వివాదం లేవదీసే అధికారం ఉండదు. సమ్మెకు పిలుపు ఇచ్చే అధికారం కూడ ఈ కమిటీకే ఉంటుంది. అయితే ఆ సమ్మె పిలుపు ఇతరత్రా చట్టబద్ధంగా ఉండడమే కాక ఇప్పుడు మరొక నియమాన్ని కూడ పాటించాలి. కార్మికులలో రహస్య బ్యాలట్ వోటింగ్ పెట్టి సమ్మెకు 51 శాతం అనుకూలత పొందిన తరువాతే సమ్మెకు పిలుపు ఇవ్వాలి. చట్టవిరుద్ధంగా సమ్మెకు పిలుపునిచ్చిన యూనియన్ గుర్తింపును రద్దుచేస్తారు. ఆ తరువాత రెండు సంవత్సరాలు దానికి గుర్తింపు ఇవ్వరు. చట్టవిరుద్ధమైన సమ్మెలో కార్మికులు పాల్గొన్నట్టయితే ఒక రోజుకు మూడు రోజుల జీతం కోసేయాలి.

ఇవి చాలా నష్టకరమయిన సూచనలు. నాలుగు సంవత్సరాల కోసం సంప్రదింపుల ప్రతినిధిగా ఎన్నికయిన యూనియన్, లేక సంఘం అందులో నాలుగోవంతు కాలం గడవకముందే కార్మికుల అభిమానాన్ని కోల్పోయినా, యాజమాన్యానికి అమ్ముడుపోయినా, సమస్యలు చేపట్టడం మానేసినా నాలుగేళ్లు కార్మికులు ఆ ప్రతినిధి ద్వారానే వివాదాలు లేవదీయాలనడం ఏ విధంగా న్యాయం? సమ్మెకు పిలుపిచ్చే హక్కు కూడ వారికి మాత్రమే ఉంటుందంటే కార్మికులకు అన్ని అన్యమార్గాలూ మూసేయడమే కాదా?

సమ్మె హక్కును అన్నిరకాలుగానూ కట్టుదిట్టం చేసేసి సంప్రదింపులు, మధ్యవర్తిత్వాలకు మూడు అంచెలు నిర్దేశించి వాటి ద్వారానే అన్ని వివాదాలు పరిష్కారం కావాలనీ, ఆఖరుగా మాత్రమే కోర్టుకు పోవాలనీ కమిషన్ అంటుంది. సంప్రదింపులలోనూ మధ్యవర్తిత్వంలోనూ యాజమాన్యం చిత్తశుద్ధితో వ్యవహరించకపోతే వారి పైన ఒత్తిడి పెట్టే మార్గం కార్మికులకు ఏముంది? మన దేశంలో పారిశ్రామిక వివాదాలు ఎక్కువగా కోర్టుకు పోతున్నాయని కమిషన్ వాపోయిందిగానీ దానికి కారణమేమిటో విశ్లేషించలేదు. కార్మికులకు కోర్టుల మీద మోజు ఉండడం దానికి కారణం కాదు. కోర్టులంటే వకీళ్లకు తప్ప వేరే ఎవ్వరికీ మోజు ఉండే అవకాశం లేదు. సంప్రదింపులు, చర్చలు, మధ్యస్తాలంటే యాజమాన్యాలకు ఉండే తృణీకార భావం వల్ల వివాదాలు కోర్టుకు పోతున్నాయి.

కోర్టుతో ఒక సౌకర్యం ఏమిటంటే ఇరుపక్షాలూ హాజరు కావడం కోసం అది అనంతంగా ఎదురు చూస్తూ కూర్చోదు. కొంత అవకాశం ఇచ్చిన తరువాత ఎక్స్-పార్టీ అవార్డు జారీచేసే అధికారం కోర్టుకు ఉంది. మధ్యస్తంలో అది సాధ్యం కాదు. మధ్యస్తమంటేనే ఇరువురూ ఒప్పుకున్న పరిష్కారానికి అక్షరరూపం ఇవ్వడం అని అర్థం. కాబట్టి దానిలో ఎక్స్‌పార్టీ అవార్డులుండవు. బలవంతులయిన పక్షాన్ని రప్పించడానికి బలహీనుల వద్ద గానీ మధ్యస్తం చేసే అధికారి దగ్గర గానీ ఏ అస్త్రం లేనప్పుడు అది విఫలం కాక తప్పదు. మధ్యస్తాలకూ కోర్టు కేసుకూ మరొక తేడా కూడ ఉంది. అసమానుల మధ్య మధ్యస్తమంటే అర్థం బలహీనులను రాజీపడమని ఒత్తిడి పెట్టడమే. మధ్యస్తాలలో ఎక్కువ భాగం అదే జరుగుతుంది. ఈ రాజీకి ఏ సూత్రాలూ వర్తించవు. ఒత్తిడే దాని ఏకైక సూత్రం. కోర్టులో వేరే అవలక్షణాలు

ఎన్ని ఉన్నా అది రాజీపడమని ఒత్తిడి పెట్టదు. ఆమోదం పొందిన న్యాయసూత్రాల ప్రకారం మంచో చెడో ఒక తీర్పు ఇస్తుంది.

కార్మికులు సంఘటితపడి ద్వైపాక్షిక చర్చలలో తమ సమస్యలు సమర్థంగా పరిష్కరించుకోవాలనీ, బలహీనపడుతున్న కార్మిక సంఘాలను ఇందుకోసం బలోపేతం చేయాలనీ రెండవ లేబర్ కమిషన్ తన నివేదికలో ఒకటికి రెండు చోట్ల అన్నప్పటికీ, వారు పారిశ్రామిక మధ్యస్తాలకు సంబంధించిన ఒక పార్శ్వాన్ని అసలే చూడకపోవడం వల్ల చాలా నష్టకరమయిన వ్యవస్థను సూచించారు.

## అసంఘటిత రంగం

ఇక అసంఘటిత రంగ కార్మికుల కోసం రెండవ లేబర్ కమిషన్ డిజైన్ చేసిన 'గొడుగు'ను పరామర్శిద్దాం.

'సంఘటిత రంగం', 'అసంఘటిత రంగం' అనేవి ఏ చట్టంలోనూ నిర్వచించిన మాటలు కావు. అవి వ్యవహారంలో పుట్టుకొచ్చిన మాటలు. కార్మికుల సంఖ్య కొంచెం ఎక్కువ ఉండి, ఉద్యోగ భద్రత కొంచెం ఉండి, సాంకేతిక స్థాయి ఆధునికంగా ఉండి, యజమాని అనే వాడొకడు స్పష్టంగా ఉండి, జీతాలు కొంత మెరుగ్గా ఉండి, యూనియన్లు ఉండి, కార్మిక సంక్షేమ చట్టాలు ఎప్పుడూ కాకున్నా అప్పుడప్పుడయినా అమలవుతూ ఉండే సంస్థలను 'సంఘటిత రంగం' అనీ, ఈ లక్షణాలు కొన్ని గానీ, అన్నీ గానీ లేని సంస్థలను లేదా ఉపాధి ప్రక్రియలను 'అసంఘటిత రంగం' అనీ వ్యవహరిస్తారని స్థూలంగా చెప్పుకోవచ్చు.

సంఘటిత రంగంలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులనూ, క్యాజువల్ కార్మికులనూ అసంఘటిత రంగ కార్మికులుగా లెక్కించడం జరుగుతున్నది. వీరేకాక ఇంకా చాలారకాల శ్రామికులు 'అసంఘటితం' నిర్వచనం కిందికి వస్తారు. ఒక జాబితా తయారు చేయడమే కష్టం. వీరికి యూనియన్లు ఉండవు, ఉద్యోగ భద్రత ఉండదు, కొన్ని కార్మిక సంక్షేమ చట్టాలు వర్తించవు, వర్తించేవి కూడ అమలు కావు, అమలు చేయించుకునే మార్గాలు అందుబాట్లో ఉండవు. జీతాలు (లేక సంపాదన) చాలా తక్కువ స్థాయిలో ఉండడమే కాక వాటిలో క్రమబద్ధమైన పెరుగుదల ఏదీ ఉండదు. తరుగుదల ఉండదన్న భరోసా ఉండదు. అనారోగ్యం, పనిస్థలంలో ప్రమాదాలు, స్త్రీలయితే కాన్పులు, మొదలయిన

కారణాల వల్ల వైద్య సహాయం అవసరమయితే దానిని కల్పించే వ్యవస్థ లేదు. అటువంటి సమయాలలో 'వేతనంతో సెలవు' పొందే అవకాశం లేదు. యజమాని అనే వాడెవడయినా ఉంటే వాడితో వేతన ఒప్పందాలు ఉండవు, ప్రభుత్వమే దయదలచి ఏవైనా జీవోలు జారీచేసినా అవి అమలు కావు.

అసంఘటిత రంగంలో కొందరికి యజమాని ఎవరనేది స్పష్టంగా ఉండదు. కొందరికి అసలు యజమానే ఉండదు. కార్మిక సంక్షేమ చట్టాలు చాలావరకు యజమాని – ఉద్యోగి అన్న సంబంధాన్ని ఆశ్రయించి ఉంటాయి. అందువల్ల వాటిని అసంఘటిత రంగానికి అన్వయించాలన్నా కష్టమే. సొంత రిక్షా పెట్టుకున్న రిక్షా కార్మికులు, సొంత షాపు పెట్టుకున్న మంగలులు, పది ఇళ్ళ నుంచి బట్టలు తెచ్చి ఉతికే చాకలివాళ్ళు, సొంత పడవ, వలలు పెట్టుకొని చేపలు పట్టే మత్స్యకారులు, ఊరందరి పశువులు మేపుకొచ్చే పశువుల కాపర్లు, పది ఇళ్ళలో అంట్లు తోమే పనిమనుషులు, ఏరోజు ఏ రైతు పిలిస్తే ఆ రోజు అతని పొలంలో పనిచేసే వ్యవసాయ కూలీలు, తాము లైసెన్స్ తెచ్చుకున్న చెట్టెక్కి కల్లుతీసి చెట్టుకిందే దాన్ని అమ్మే గీత కార్మికులు, పట్టణాలలో అడ్డామీద నిలబడి ఏ బిల్డింగ్ కాంట్రాక్టర్ పిలిస్తే అతనితో పోయి తాపీ పనో తట్టలు మోసే పనో చేసే పట్టణ ప్రాంత కూలీలు, కమిషన్ ఏజెంటు దగ్గర బీడీ ఆకో, పొగాకో తీసుకొని బీడీలు చుట్టి కంపెనీకి అప్పగించే బీడీ కార్మికులు, పట్టణాలలో తోపుడు బండ్ల మీద వందరకాల సరుకులు అమ్ముకుంటూ తిరిగే చిల్లర బేరగాళ్లు, రోడ్డు పక్కన చిత్తుకాగితాలు, పాత సీసాలు, ఇనప తుక్కు ఏరి వర్తకులకు అమ్ముకొని బతికేవారు – వీరంతా యజమాని లేని, లేక యజమాని ఫలాన అని స్పష్టంగా తెలీని అసంఘటిత కార్మికులు. వీళ్లకు జీతం, డి.ఏ, ప్రావిడెంట్ ఫండ్, ప్రసూతి సెలవు, ఆరోగ్య భద్రత, గ్రాట్యుటీ, వేతనంతో సెలవు మొదలైన హక్కులను అర్థవంతంగా కల్పించాలంటే ఇప్పుడున్న కార్మిక సంక్షేమ చట్టాల స్వరూపమే మార్చవలసి ఉంటుంది.

అసంఘటిత రంగంలోని కొందరికి ఇప్పటికే ప్రత్యేకమైన చట్టాలు రూపొందించారు. బీడీ కార్మికులకు, బిల్డింగ్ కార్మికులకు, హమాలీలకు, కాంట్రాక్ట్ కార్మికులకు వేరు వేరు సంక్షేమ చట్టాలున్నాయి. ఆయా రంగాల నిర్దిష్టతను దృష్టిలో ఉంచుకొని తయారుచేసిన చట్టాలివి. అటువంటి చట్టాలే రిక్షా కార్మికులకు, ఇళ్ళల్లో

పనిమనుషులకు, చాకలి, మంగలి తదితర వృత్తుల వారికి, ఇతర అసంఘటిత కార్మికులకు రూపొందించినట్టయితే చాలా ఉపయోగకరంగా ఉండేది. ఆ కోణం నుంచి ప్రభుత్వం మీద కార్మిక ఉద్యమం ఎన్నడూ ఒత్తిడి పెట్టలేదు. పెట్టకపోవడానికి కారణం భారత కార్మికోద్యమంలోని ప్రధాన బలహీనత: అది సంఘటిత రంగ కార్మికోద్యమమే తప్ప కార్మికులందరి ఉద్యమం కాదు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వానికి అసంఘటిత కార్మిక వర్గం గుర్తుకు రావడానికి కారణం వారి మీద ప్రేమ కాదు. సంఘటిత రంగాన్ని అసంఘటితం చేసే విధాన మార్పులు ఆ రంగంలోని కార్మికులకు, వారి యూనియన్లకు, సామాజిక ప్రజాభిప్రాయానికి మింగుడు పడాలంటే అసంఘటిత రంగానికి ఎంతో కొంత కనీస భద్రత కల్పించడం అవసరం. అందుకే అసంఘటిత రంగంలోని ఒక్కొక్క వర్గాన్ని విడిగా పరిశీలించి వారి వారి పరిస్థితులకు తగిన సంక్షేమ చట్టాన్ని రూపొందించమని కోరకుండా, టోకున కొంత కనీస భద్రత కల్పించే సూచనలు ఇమ్మని రెండవ లేబర్ కమిషన్‌ను కోరింది.

కమిషన్ తన నివేదికలో అసంఘటిత రంగ కార్మికుల జీవిత పరిస్థితుల గురించి వివరంగానే చర్చించింది. తమ అవగాహన, సానుభూతి చూపించింది. ఈ మధ్య ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న చర్చలను లెక్కలోకి తీసుకొని సెక్స్ వర్కర్లను కూడా అసంఘటిత కార్మికులుగా భావించి వారి సమస్యలను ప్రస్తావించింది. (అయితే గృహిణులు చేసే ఇంటి పనిని అసంఘటిత శ్రమలో లెక్కించలేదు).

1991 జనాభా లెక్కలలో 34 కోట్ల మంది భారతీయులు తమను తాము కార్మికులుగా నమోదు చేసుకున్నారని కమిషన్ అంటుంది. వారిలో 90.6 శాతం మంది అసంఘటిత రంగానికి చెందినవారు. వ్యవసాయం, అటవీ ఉత్పత్తులు, తోటలు, చేపల వేటలలో పనిచేసే 19.1 కోట్ల మందిలో 19.0 కోట్ల మంది (అంటే 99.2 శాతం) అసంఘటిత రంగ కార్మికులు. పారిశ్రామిక ఉత్పత్తి రంగంలోని 2.89 కోట్ల కార్మికులలో 2.16 కోట్లు (అంటే 75 శాతం) అసంఘటిత కార్మికులు. బిల్డింగులు, రోడ్లు మొదలయిన కట్టడపు పనులలో ఉన్న కార్మికులలో 78 శాతం, వర్తక వాణిజ్య రంగంలోని కార్మికులలో 98 శాతం, రవాణా ప్రసార రంగాలలో 61.5 శాతం అసంఘటిత కార్మికులు.

ఈ గణాంకాలు సమస్య పరిమాణాన్ని సూచిస్తాయి. కానీ ప్రభుత్వం రెండవ లేబర్ కమిషన్‌ను సూచించమని కోరిన పరిష్కారం పరిధి చాలా చిన్నది. కమిషన్ అసంఘటిత రంగాన్ని విహంగ వీక్షణం చేసి అందులోని కార్మికుల సమస్యలను క్లుప్తంగా ఏకరువు పెట్టి కొంచెం ఆవేశపడి 'రాజ్యాంగాన్ని ప్రకటించిన యాభై ఏళ్ల తరువాత కూడ దేశ శ్రామిక జనాభాలో 90 శాతానికి హామీ ఇచ్చిన హక్కులకు భరోసా కల్పించలేకపోతున్నామంటే మనం చెప్పేదానికీ చేసేదానికీ పొంతన లేదని అనడంలో తప్పు లేదు' అంటుంది.

అయితే తాను మాత్రం చేయమన్న పనికి పరిమితమయిన సూచనలు మాత్రమే చేసింది. టోకున కనీస భద్రత కల్పించడానికి కమిషన్ చేసిన ప్రధాన సూచన అసంఘటిత రంగ శ్రామికులకు సంక్షేమ నిధి లేక నిధులు ఏర్పాటు చేయడం. అసంఘటిత రంగ శ్రామికులందరూ తమ పేర్లు వగైరా కార్మిక శాఖ వద్ద నమోదు చేసుకుంటారు. అందరికీ గుర్తింపు కార్డులు ఇస్తారు. వారి వేతనం, లేక సంపాదన నుంచి కొంత, యజమాని అనేవాడు ఉంటే అతని ఆదాయం నుంచి కొంత, ప్రభుత్వ బడ్జెట్ నుంచి కొంత, ఆయా రంగాల వర్తక వాణిజ్య పారిశ్రామికవేత్తల నుంచి పన్ను రూపంలో కొంత సేకరించి ఒక సంక్షేమ నిధి (లేక నిధులు) నెలకొల్పుతారు. అదే అసంఘటిత కార్మిక రంగానికి అందియ్యబోయే గొడుగు. నిరుద్యోగ భృతి, ప్రసూతి సహాయం, గ్రాట్యుటీ, అనారోగ్య భృతి, వృత్తిలో తగిలే గాయాలకు, కలిగే అనారోగ్యానికి నష్టపరిహారం – అన్నీ ఈ నిధి నుంచే పొందుతారు.

కేరళ రాష్ట్రం ఇటువంటి నిధులు దాదాపు 30 నిర్వహిస్తున్నది. అసంఘటిత రంగ కార్మికుల సమస్యల మీద దృష్టిపెట్టి తగు చర్యలు చేపట్టిన రాష్ట్రాలలో కేరళ ప్రథమం. (హమాలీల హక్కులు, భద్రత విషయంలో మహారాష్ట్ర మంచి వ్యవస్థనే రూపొందించింది. అసంఘటిత రంగ కార్మికులకు ఏమీ చేయని రాష్ట్రాలలో మనది ఒకటి). అదే స్ఫూర్తితో రెండవ లేబర్ కమిషన్ పై ఆలోచన చేసింది.

దానిని వ్యతిరేకించవలసిన అవసరమేమీ లేదుగానీ, ఈ సంక్షేమ నిధి పరిధిలోకి రాని విషయాలు చాలా ఉన్నాయి. వేతనాలు (లేక ఆదాయం), పని స్థలంలో భద్రత వీటిలో రెండు. యజమాని – ఉద్యోగి సంబంధం ఎక్కడున్నా అక్కడ కనీస వేతనాల చట్టం అమలవుతుంది. దానికి సంఘటితం – అసంఘటితం అన్న తేడా లేదు.

అయితే అసంఘటిత రంగానికి సంబంధించిన కనీస వేతనం జీవోలు అమలుకావడం చాలా కష్టం. వాటిని అమలు చేయించుకునే ప్రయత్నమే కార్మికులకు దుస్సాహసంగా కనిపిస్తుంది. యజమాని అనేవాడు స్పష్టంగా లేనిచోట ఒక కనీస ఆదాయ ప్రమాణాన్ని నిర్వచించి దానిని నిలబెట్టే ప్రయత్నమూ అవసరమే. అది ఒక్కొక్క రంగంలోనూ ఒక్కొక్క రకంగా ఉండవలసి ఉంటుంది. పని స్థలంలో ఆరోగ్యం, భద్రతల విషయమూ అంతే. ప్రస్తుతమున్న చట్టాలు ఫ్యాక్టరీలకూ గనులకూ మాత్రమే వర్తిస్తాయి. అసంఘటిత రంగంలో కూడ శరీర అవయవాలకు అపాయం కలిగించే ప్రమాదాలకు తావు ఉంటుంది. అంతకంటే ఎక్కువగా వృత్తి రోగాలకు (ఆక్యుపేషనల్ డిసీజస్) అవకాశం ఉంటుంది. వాటి గురించి అవగాహన లేదు, జాగ్రత్తలు తెలియవు.

రెండవ లేబర్ కమిషన్ కనీసం ఈ రెండు విషయాలలోనయినా నిర్దిష్టమైన సూచనలు చేసి ఉండవలసింది. ప్రభుత్వం నిర్దేశించిన 'కనీస రక్షణ'లో ఇవి భాగం కాదని ఎందుకు అనుకోవాలి? ఆ కనీస రక్షణను సంక్షేమ నిధికి కుదించి వేయడం ద్వారా, ప్రభుత్వం ఏ కారణంగా అసంఘటిత రంగానికి కొంత రక్షణ కల్పించాలని భావించిందో, దానికే – అంటే సంఘటిత రంగం నుంచి అసంఘటిత రంగంలోకి నెట్టివేస్తున్న కార్మికులకు కొంత ఉపశమనం కలిగించే కర్తవ్యానికే – కమిషన్ తన ప్రయత్నాన్ని పరిమితం చేసినట్టయింది. ఇంకొంచెం విశాలంగా ఆలోచించినట్టయితే అసంఘటిత రంగంలో ముందు నుంచీ ఉన్న సమస్యలకు కొంతమేరకయినా పరిష్కారం దొరికి ఉండేది. కమిషన్ అసంఘటిత రంగ కార్మికుల సమస్యల గురించి చేసిన సవివరమయిన సమీక్షలో ఆ స్పృహ కనిపిస్తుందిగానీ సూచనల దగ్గరికొచ్చేసరికి పాలకుల అవసరాలకే కమిషన్ ఆలోచనలు పరిమితం అయ్యాయి.

*మానవహక్కుల వేదిక బులెటిన్ 6*
*మే 2007*

# నిర్బంధ చట్టాల్ని కేంద్రీకృతం చేసే సిఫార్సులు

సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టంలోని వివిధ అంశాలను సమీక్షించి, వాటిని మానవ హక్కుల పరిరక్షణ బాధ్యత వెలుగులో సవరించడమా లేక ఆ చట్టం స్థానంలో మరింత మానవీయమైన చట్టాన్ని ప్రవేశపెట్టడమా, ఏం చేయడం ఉచితంగా ఉంటుందో సలహా ఇమ్మని కేంద్ర ప్రభుత్వం అయిదుగురు సభ్యులు గల కమిటీని నియమించింది. దాని అధ్యక్షుడు రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయిన బి.పి. జీవన్ రెడ్డిగారు కాగా ఇతర సభ్యులు డా. ఎస్. బి. నకాడె అనే మాజీ వైస్ ఛాన్సలర్, పి.శ్రీవాత్సవ అనే మాజీ కేంద్ర హోం శాఖ కార్యదర్శి, రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ వి. ఆర్. రాఘవన్, పత్రికా విలేఖరి సంజయ్ హజారికా.

సైనిక బలగాలకు విపరీత అధికారాలు కల్పిస్తున్నదని విమర్శకు లోనైన చట్టాన్ని సమీక్షించే కమిటీలో ఒక రిటైర్డ్ సైనిక అధికారిని సభ్యుని చేయడం అనుచితం అని కేంద్ర ప్రభుత్వానికి తోచినట్టు లేదు. కమిటీ ప్రజలతో మాట్లాడి ప్రజాభిప్రాయం సేకరించినట్టే సైనిక దళాలతోనూ మాట్లాడి వారి అభిప్రాయాలూ తీసుకోవాలనడం వేరు. సైన్యానికి చెందిన మాజీ అధికారిని ఆ కమిటీలో సభ్యుడిని చేయడం వేరు. అది న్యాయమే అనేటట్టయితే, ఈ చట్టానికి గురైన వ్యక్తుల ప్రతినిధిని ఒకరిని కూడ కమిటీలో వేయడం న్యాయం అనిపించుకోదా? ప్రజల తరఫున ఉన్నాడు అని చెప్పదగ్గ వ్యక్తి పత్రికా విలేకరి అయిన సంజయ్ హజారికా ఒక్కడే. అతను అస్సాంకు చెందినవాడు, ప్రజల హక్కుల గురించి ఆవేదన చెందే పాత్రికేయుడు. అయినప్పటికీ అతనిని బాధితుల ప్రతినిధి అనడానికి వీలు లేదు. కమిటీ అధ్యక్షుని పేరు మీద

‘జీవన్‌రెడ్డి కమిటీ’గా పేరు పొందిన ఈ విచారణ సంఘం నవంబర్ 2004లో తన పని మొదలుపెట్టి 2005 జూన్ 6 నాటికి తన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం మాత్రం ఏమీ చేయకుండా కూర్చుంది. వారి నివేదికను ఆమోదించలేదు, తిరస్కరించలేదు, బహుశా చర్చించనే లేదు.

ఇట్లా ఎంత కాలమైనా కొనసాగి ఉండవచ్చు, కొనసాగిన సందర్భాలు లేకపోలేదు. అయితే ‘ది హిందూ’ దినపత్రిక ఆ నివేదిక ప్రతిని సంపాదించి దానిని బహిర్గతం చేసింది. జీవన్‌రెడ్డి కమిటీ సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టాన్ని రద్దు చేయవలసిందిగా సిఫారసు చేసిందన్న అభిప్రాయం ‘ది హిందూ’ కల్పించేసరికి కొంత సంచలనం కలిగింది. జీవన్‌రెడ్డి కమిటీ ఆ చట్టాన్ని (క్లుప్తంగా దానిని సాయుధ బలగాల చట్టం అందాం) రద్దు చేయమని చెప్పిన మాట నిజమే గానీ, అందులోని అనేక అంశాలను చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టంలో చేర్చమనింది కూడ. వెరసి జీవన్‌రెడ్డి కమిటీ ఏమందో, దానిలోని మంచి చెడులేమిటో తెలుసుకోవడం అవసరం.

సైనిక బలగాలు ప్రాణాన్నీ, స్వేచ్ఛనూ హరిస్తాయి కాబట్టి వాటి కార్యకలాపాలను, నడవడికను నియంత్రించడానికి నియమాలుండడం అవసరం. సైన్యం కార్యకలాపాలు యుద్ధానికే పరిమితమైనట్టయితే అంతర్జాతీయ యుద్ధ నియమాలు సైనిక బలగాల నడవడికను నియంత్రిస్తాయి. అయితే పౌర సమాజంలో సైన్యాన్ని ప్రయోగించేటట్టయితే దాని కార్యకలాపాలను నియంత్రించడానికి ఒక చట్టం అవసరం. ఎందుకంటే ఎవరి ప్రాణాన్ని గానీ, స్వేచ్ఛను గానీ చట్టం నిర్దేశించే పద్ధతిలో తప్ప ఇతరత్రా తీసేయడానికి వీలు లేదనేది భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులలో ఒకటి.

సైనిక బలగాలను పౌర సమాజంలో ప్రయోగించనే వద్దని నిర్ణయించుకుంటే ఈ సమస్య రాదు. అయితే సాధారణ చట్టం కూడ సైనిక బలగాలు దొమ్మీలను అదుపుచేసే కర్తవ్యం నిర్వర్తించే పరిస్థితి రావచ్చునని భావిస్తుంది. ఒక దొమ్మీని అదుపు చేయడం కోసం సైనిక బలగాల సహాయం అవసరం అని భావిస్తే ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేటు హోదా గల అధికారి ఆ సహాయం కోరవచ్చునని సిఆర్‌పిసిలోని సెక్షన్ 130 అంటుంది. అప్పుడు సైన్యం ఆ అధికారి అదుపులో పనిచేస్తుంది. పోలీసులకు సిఆర్‌పిసిలో వర్తించే అన్ని నియమాలూ ఆ సందర్భంగా సైన్యానికి వర్తిస్తాయి.

మరైతే ఒక ప్రత్యేకమైన సైనిక బలగాల చట్టం ఎందుకు అవసరమైంది? సిఆర్‌పిసి సైన్యానికి కేవలం దొమ్మీలను అదుపుచేసే సందర్భంలో మాత్రమే ఒక సహాయక పాత్రను నిర్దేశించింది. దానిని ఆ ఘటనకే పరిమితం చేసింది. అంటే ఆ దొమ్మీ చెదిరిపోగానే సైనిక బలగాలు వెనక్కి వెళ్ళిపోవాలి. కాని దానికి ఆ పాత్ర చాలదనుకోవడం వల్లనే ప్రత్యేక చట్టం అవసరం అయింది. సాయుధ పోరాట రాజకీయాలు తలెత్తిన ప్రాంతాలలోనే ఈ అవసరం పాలకులకు తోచింది.

సాయుధ పోరాటాలు ప్రజా సమూహాల ఉమ్మడి చర్యల రూపంలో మాత్రమే జరగవు. (చట్టం వీటిని దొమ్మీలు అంటుంది.) ఆయుధాలు ధరించి తిరిగే కొద్దిమంది మిలిటెంట్ల హింసాత్మక చర్యలూ ఉంటాయి. తరచుగా అవే ఎక్కువ ఉంటాయి. ఈ మిలిటెంట్లను భౌతికంగా ఏరివేయడం, వారికి ఆశ్రయం ఇచ్చే నివాసాలను ధ్వంసం చేయడం అనే రెండు కర్తవ్యాలు నిర్వర్తించడం అవసరం అని పాలకులు భావించారు. ఆ రెండు కర్తవ్యాలూ పోలీసులే చేయలేరా అంటే రెండు సమస్యలున్నాయి. అంతటి శిక్షణ పోలీసులకు ఉండదన్నది ఒకటి. రెండవది, పైకి చెప్పడానికి సిగ్గుపడేది, ఏమిటంటే సాయుధ పోరాట రాజకీయాలను మొట్టమొదట ఆశ్రయించింది జాతి ఉద్యమాలు. నాగాలు, మిజోలు, మైతీలు, కాశ్మీరీలు, సిక్కులు వగైరా. ఆ ప్రాంతాలలో పోలీసులు కూడ ఈ జాతులకే చెంది ఉంటారు కాబట్టి వాళ్ళను నమ్మడం కష్టం అన్నది రెండవ కారణం. ఈ రెండు కారణాల వల్ల మిలిటెంట్ రాజకీయాలపైన ప్రయోగించడానికి సైనిక బలగాలను దించడం అవసరం అని పాలకులు భావించారు. కేవలం ఒక్కొక్క ఘటనకు పరిమితం కాకుండా నిరంతరాయంగా సైన్యం పనిచేయడం అవసరం అని భావించారు. అది నిర్వర్తించవలసిన కర్తవ్యాలకు చట్టపరమైన ఆమోదం (లేక ఆచ్ఛాదన) కల్పించడానికొక కొత్త చట్టం అవసరం అయింది. సాయుధ బలగాల చట్టానికి మూలం ఇక్కడుంది.

ఇదంతా జీవన్‌రెడ్డి కమిటీ గుర్తించిందన్న అభిప్రాయం నేను కలిగించి ఉంటే పొరపాటే. ఈ వాస్తవాలను చూసి ఉంటే కమిటీ సూచనలు ఇంకా మెరుగ్గా ఉండేవి. కానీ జీవన్‌రెడ్డి కమిటీ వీటిని చూడలేదు. పోలీసుల బలం చాలదు కాబట్టి సైనిక బలగాలను ప్రయోగించడం అవసరం అనీ, అలాగే సిఆర్‌పిసి వారికి నిర్దేశించిన పాత్ర సరిపోదు అనీ ప్రకటించి ప్రత్యేక చట్టం అవసరం అన్న అభిప్రాయానికి

వచ్చేసింది. పోలీసుల బలం ఎందుకు చాలదో చెప్పలేదు గానీ, సిఆర్‌పిసి వారికి నిర్దేశించిన పాత్ర ఎందుకు చాలదంటే దొమ్మీలు రాజ్యాధికారాన్నీ, రాజ్యం భద్రతనూ సవాలు చేయవనీ, రాజ్యం భద్రతను సాయుధంగా సవాలుచేసే సందర్భం వచ్చినప్పుడు ఆ చట్టం నిర్దేశించే పాత్ర చాలదనీ జీవన్‌రెడ్డి కమిటీ అంటుంది. ఈ విశ్లేషణకూ సాయుధ బలగాల చట్టం సైనిక బలగాలకిచ్చే విశేష అధికారాలకూ పొంతన ఏమిటి? రాజ్యం భద్రతను పరిరక్షించడానికి వ్యక్తులను కాల్చి చంపడం, నివాసాలను కూల్చడం అనే అధికారాలున్న బలగం అవసరమనే నిర్ధారణకు ఏ విధంగా వచ్చారు?

ఏ విధంగానైతేనేం, వచ్చారు.

మిగిలిన విషయాలు చూసే ముందు సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టం చరిత్ర కొంచెం చూద్దాం. ఈ పేరుతో ఈశాన్య భారత రాష్ట్రాల కోసం ఒక చట్టం, జమ్మూ కాశ్మీర్ కోసం ఒక చట్టం ఉన్నాయి. రెండింటి మధ్య స్వల్పమైన తేడాలు మాత్రమే ఉన్నాయి. మొట్టమొదట వచ్చింది సాయుధ బలగాల (అస్సాం, మణిపూర్) ప్రత్యేక అధికారాల చట్టం, 1958. పేరులో అస్సాం, మణిపూర్ అని ఉన్నా దీనికి కారణం నాగాల జాతి పోరాటం. అప్పటికి నాగాలాండ్ అనే రాష్ట్రం లేదు. 'నాగా కొండల ప్రాంతం' అస్సాం రాష్ట్రంలో ఉండేది. మణిపూర్ (అప్పుడూ, ఇప్పుడూ) ఉత్తర భాగంలో నాగాలు నివసించే జిల్లాలు ఉన్నాయి. 1947లో నాగాలు మీ ఇండియాతో మాకేం సంబంధం లేదు, మా పాటికి మమ్మల్ని బతకనివ్వండి అని అంటే పదేళ్ళు ఇండియాలో ఉండి చూడండి, ఆ తరువాత మీ భవితవ్యాన్ని మీరే నిర్ణయించుకుందురని హామీ ఇచ్చి, పదేళ్ళు గడిచిన తరువాత సైన్యాన్ని దించి సాయుధ బలగాల చట్టాన్ని చేశారు మన పాలకులు.

ఇది చాలా చిన్న చట్టం. కాగితానికి రెండు వైపులా అచ్చువేసినట్టయితే ఒకే పేజీలో ఇముడుతుంది. అధికారాన్నీ హక్కులనూ సమన్వయపరచి, హక్కుల రక్షణ కోసం అధికారానికి పరిమితులు పెట్టి, మరీ అవసరమనుకున్న చోట దానికి షరతులు పెట్టి, వీటిని అతిక్రమించినట్టయితే దానిపైన విచారణ జరిపే వ్యవస్థను రూపొందించి– ఇవన్నీ ఉన్నట్లయితే చట్టం పెద్దదిగా ఉంటుంది, క్లిష్టంగా ఉంటుంది. కాని అధికారాన్ని కట్టబెట్టడమే లక్ష్యం అయిన చట్టం పెద్దదిగా ఎందుకుండాలి?

అందుకే ఇది చాలా చిన్నది. ఈ చట్టం వర్తించే రాష్ట్రాలను మొత్తంగా గానీ, అందులో ఒక భాగాన్ని గానీ కల్లోలిత ప్రాంతంగా ప్రకటించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికీ, కేంద్ర ప్రభుత్వానికీ కూడ ఉంది. ఎప్పుడు ప్రకటించవచ్చునంటే ఆ ప్రాంతంలో పౌర పాలనకు సహాయకంగా సాయుధ బలగాలను దించడం అక్కడ నెలకొన్న కల్లోలం, లేక ప్రమాదకర పరిస్థితుల దృష్ట్యా అవసరం అనుకున్నప్పుడు. ఆపైన సాయుధ బలగాలు రంగంలోకి దిగుతాయి. వారికి ప్రధానంగా ఉండే అధికారాలు నాలుగు. నిషేధాజ్ఞలను అతిక్రమిస్తున్న వ్యక్తి పైన కాల్పులు జరపవచ్చు, ప్రాణం సైతం తీయవచ్చు. సాయుధ మిలిటెంట్లకు గానీ నేరారోపితులకు గానీ ఆశ్రయం ఇవ్వడానికి ఉపయోగించే నిర్మాణాలను, సాయుధ దాడులు చేయడానికి ఉపయోగించే నిర్మాణాలను, ఆయుధాగారాలుగా ఉపయోగించే, లేక ఉపయోగించగల నిర్మాణాలను ధ్వంసం చేయవచ్చును. నేరంలో నిందితుడైన వ్యక్తిని లేక నేరం చేశాడన్న సందేహం ఉన్న వ్యక్తిని లేక నేరం చేయబోతాడన్న సందేహం ఉన్న వ్యక్తిని అరెస్టు చేయవచ్చు. అరెస్టు చేయడానికి ఎంత అవసరమైతే అంత బలప్రయోగం చేయవచ్చు. ఆయుధాలను గానీ, దొంగిలించిన వస్తువులను గానీ, అపహరించిన వ్యక్తిని గానీ దాచి ఉంచారని సహేతుకంగా భావించే ఏ ప్రదేశంలోకైనా ఎటువంటి వారంట్ లేకుండా ప్రవేశించవచ్చు, సోదా చేయవచ్చు, అరెస్టు చేయవచ్చు. దీనికి ఎంత అవసరమైతే అంత బలప్రయోగం చేయవచ్చు.

ఆయుధాలు పట్టుకొని ఒక రాజకీయ లక్ష్యంతో పోరాటం చేసేవాళ్ళను, అందులో భాగంగా తమ లక్ష్యానికి అడ్డం వచ్చే వాళ్ళను హింసకు గురిచేయడానికి సందేహించని వాళ్ళను ప్రభుత్వం ఉపేక్షించాలా, ఏ ప్రభుత్వమైనా ఉపేక్షించగలదా అని అడుగుతారేమో. ఉపేక్షించాలని గానీ, ఏ ప్రభుత్వమైనా ఉపేక్షించగలదని గానీ ఎవరూ అనరు. అయితే దీనికోసం ప్రభుత్వ బలగాలకిచ్చే అధికారం విచ్చలవిడి హింసకు దారితీసే అవకాశం లేకుండా కట్టడి చేసే ఆంక్షలు ఆ అధికారాన్ని కల్పించే చట్టంలో అంతర్భాగంగా ఉండడం అవసరం. సాధారణ చట్టం కూడ హింసను అదుపు చేసే అధికారం పోలీసులకు ఇస్తుంది గానీ దానికోసం కనీస బలప్రయోగం – అంటే అదుపు చేయడానికి ఏ మేరకు అవసరమో ఆ మేరకు మాత్రమే – చేయాలని పలు రూపాలలో నొక్కి చెపుతుంది. నిజంగా పోలీసులు బలప్రయోగానికి

పాల్పడినప్పుడు అది ఆ సందర్భంలో కనీసమైన బలప్రయోగమేనా అని నిర్ణయించే నిష్పాక్షికమైన వ్యవస్థ ఏదీ లేకపోవడం వల్ల తరచుగా గరిష్ట బలప్రయోగాన్నే సరైనదిగా పోలీసులు చలామణి చేయగలుగుతున్నారు గానీ, హేతుబద్ధమైన పరిమితులతో కూడిన బలప్రయోగ అధికారం ఉండడం దానంతటది ఆక్షేపణీయం కాదు. సాయుధ బలగాల చట్టం అన్ని పరిమితులనూ తీసేసి, 'ఎంత అవసరమైతే అంత బలప్రయోగం చేయ వచ్చును' అంటుంది.

దీని పర్యవసానాన్ని వివరించాలంటే ఆనాటి నుంచి ఈ నాటిదాకా ఈ చట్టం కల్పించిన ఆచ్ఛాదనను వాడుకొని వివిధ సాయుధ బలగాలు ఎంత విచ్చలవిడి హింసకు పాల్పడ్డాయో చెప్పవలసి ఉంటుంది. ఒక్క ఈశాన్య భారత రాష్ట్రాలలోనే కాదు, జమ్మూ-కాశ్మీర్‌లో కూడ. ఎందుకంటే ఈ చట్టం నమూనాలోనే ఆ రాష్ట్రానికి వర్తించే ఒక సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని జారీచేసి దానికింద లక్షల సంఖ్యలో సైన్యాన్నీ పారామిలిటరీనీ అక్కడ దించారు.

ఈ విచ్చలవిడితనం పట్ల నిరసనే జీవన్‌రెడ్డి కమిటీ ఆవిర్భావానికి కారణం. అందులో చివరి ఘట్టాన్ని కమిటీ తన రిపోర్టులో ప్రస్తావించింది. 2004 జూలై 10-11 తేదీల మధ్య రాత్రి అస్సాం రైఫిల్స్ బలగాలు తంగ్‌జాం మనోరమాదేవి అనే యువతిని తన ఇంటి నుంచి తీసుకుపోయి కాల్చి చంపారు. చంపే ముందు ఆమె పైన లైంగిక అత్యాచారానికి పాల్పడ్డారన్న అనుమానం కూడ ఉంది. ఈ హత్యకు నిరసనగా పెద్దఎత్తున ప్రజలు కదిలారు. 12 మంది స్త్రీలు ఇంఫాల్‌లోని అస్సాం రైఫిల్స్ కార్యాలయం వద్ద తమను తాము వివస్త్రలు చేసుకొని 'భారత సైనికులారా, మమ్మల్ని కూడ రేప్ చేయండి' అని నినదించడం యావద్దేశానికి షాక్ ఇచ్చింది. ఆ తరువాత కొనసాగిన నిరసన ఫలితంగా కేంద్ర హోంమంత్రి మణిపూర్‌కు పోవడం, అక్కడి ప్రజాసంఘాలు ఆయనను కలిసి సాయుధ బలగాల చట్టాన్ని రద్దు చేయమని డిమాండ్ చేయడం ఈ కమిటీ ఆవిర్భావానికి కారణం.

అయితే మనోరమాదేవి హత్య కంటే చాలా ముందు నుంచే ఇరోంచాను షర్మిల అనే స్త్రీ సాయుధ బలగాల చట్టాన్ని రద్దు చేయాలన్న డిమాండ్‌తో నిరాహారదీక్ష చేస్తున్నది. 2000 సంవత్సరం నవంబర్ 2వ తేదీన మణిపూర్ రాజధాని ఇంఫాల్

ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఒక బస్‌స్టాండ్‌లో నిలబడ్డ జనం పైన అస్సాం రైఫిల్స్ జవాన్లు కాల్పులు జరిపి 10 మందిని చంపిన ఘటనకు నిరసనగా మొదలుపెట్టిన నిరాహార దీక్షను ఆమె ఈ నాటికీ కొనసాగిస్తున్నది. ప్రభుత్వ వైద్యులు బలవంతంగా గొట్టాల ద్వారా ఎక్కిస్తున్న ద్రవ పదార్థం తప్ప వేరే ఏ ఆహారమూ తీసుకోవడం లేదు.

ఈ నేపథ్యంలో ఏర్పడిన కమిటీ, ఒక వ్యక్తిని నేరుగా కాల్చి చంపడానికి సాయుధ బలగాల చట్టం సైనిక బలగాల సిబ్బందికి ఇచ్చిన అధికారం ఎంతవరకు సబబు అన్న ప్రశ్న ప్రధానంగా వేసుకోవలసి ఉండింది. వేసుకోకుండా, రాజ్యం ఉనికినే ప్రశ్నించే ఉద్యమాలు నడుస్తున్న చోట సిఆర్‌పిసి సైనిక బలగాలకు కల్పించే పాత్ర, ఇచ్చే అధికారాలు చాలవనీ, సాయుధ బలగాల చట్టం ఇచ్చే విశేష అధికారాలు అవసరమనీ నిర్ణయించడం (ఎంత మర్యాదగా చెప్పాలన్నా) విచారకరం అనక తప్పదు. ఈ నిర్ణయం చేసిన సందర్భంలో కమిటీ ఇచ్చిన ఉదాహరణ నుంచి వారి ఆలోచనా రీతిని ఊహించవచ్చునేమో. 1984లో ఇందిరాగాంధీ హత్య అనంతరం ఢిల్లీలో జరిగిన సిక్కుల ఊచకోతను ప్రస్తావిస్తూ, అటువంటి సందర్భాలలో సైనిక బలగాలు సాధారణ చట్టం అదుపులో పనిచేసినా ఫరవాలేదు గానీ రాజ్యం ఉనికికి, భద్రతకు ముప్పుతెచ్చే అశాంతి చెలరేగినప్పుడు ఆ అధికారాలు చాలవన్నారు. ఇది మామూలు మనుషులకు ఆశ్చర్యం కలిగించే అభిప్రాయం. అమాయకులైన సిక్కు ప్రజానీకం పైన పనిగట్టుకొని గుంపులను రెచ్చగొట్టిన కాంగ్రెస్ నాయకులను అదుపు చేయడానికి సిఆర్‌పిసిలోని సమతుల్యమైన అధికారాలు సరిపోతాయి గానీ, తమ భూభాగాన్ని అన్యాయంగా భారత్‌లో కలిపారని చారిత్రక ఆధారాలతో సహా పోరాటం చేస్తున్న వారిని ఎదుర్కొనడానికి విపరీత అధికారాలు కావాలనడం – జీవన్‌రెడ్డి గారు క్షమిస్తే – వికృతమైన ఆలోచన అనక తప్పదు.

నిజమే, ఆ విపరీత అధికారాలను సుప్రీంకోర్టు తీర్పు పరిధిలోకి కుదించి అర్థం చేసుకోవాలని ఈ రిపోర్టు అంటుంది. వారు అన్నా, అనకపోయినా అది తప్పనిసరి. ఎందుకంటే ఒక చట్టానికి హైకోర్టు లేక సుప్రీంకోర్టు చేసే వ్యాఖ్య ఆ చట్టంలో భాగంగా పరిగణించబడుతుంది. ఆ వ్యాఖ్య వెలుగులోనే ఆ చట్టాన్ని అర్థం చేసుకోవలసి ఉంటుంది.

సాయుధ బలగాల చట్టం చెల్లదంటూ నాగా ప్రజల మానవ హక్కుల ఉద్యమం సుప్రీంకోర్టులో వేసిన కేసులో (ఎన్.పి.ఎం. హెచ్.ఆర్ వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా) తుది తీర్పు సుప్రీంకోర్టు 1997లో ఇచ్చింది. ఆ చట్టం రాజ్యాంగ విరుద్ధం అని కొట్టివేయవలసింది పోయి, దానిని తగు రీతిలో కుదించి వ్యాఖ్యానించినట్టయితే రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు అంది. కుదింపుకు సుప్రీంకోర్టు ఉపయోగించిన ప్రమాణాలలో కొన్ని ఆ చట్టంలోనే ఉన్నాయి. కొన్ని రాజ్యాంగం నుంచి వచ్చాయి.

**ఇవేమిటంటే:**

1. సాయుధ బలగాలు స్థానిక అధికార యంత్రాంగానికి అండగా పని చేస్తాయే తప్ప దానిని పక్కన పెట్టి దాని పని తామే చేయవు. ఇద్దరూ పరస్పర సహకారంతో శాంతిస్థాపన కోసం కృషి చేయాలి.

2. సాయుధ బలగాలు ఎవరినైనా అరెస్టు చేస్తే వారిని వెంటనే స్థానిక పోలీసులకు అప్పగించాలి. వారు వెంటనే కోర్టులో హాజరు పెట్టాలి. మొత్తం కలిసి 24 గంటలు మించకూడదు. అదే విధంగా, సోదా చేసిన క్రమంలో స్వాధీనం చేసుకున్న వస్తువులను కూడ స్థానిక పోలీసు స్టేషన్లో అప్పగించాలి.

3. సాయుధ బలగాలు సోదా చేసేటప్పుడు సాధారణ చట్టంలో పోలీసులు చేసే సోదాలకు వర్తించే నియమాలను పాటించాలి.

4. నిషేధాజ్ఞలు ఉల్లంఘిస్తున్న వ్యక్తిపైన సైనిక బలగాలు నేరుగా కాల్పులు జరపవచ్చుననీ, ప్రాణం సైతం తీయవచ్చుననీ చెప్పే సెక్షన్ రాజ్యాంగ విరుద్ధమేం కాదనీ, అది చెల్లుబాటు అవుతుందనీ అంటూ, అదే సమయంలో 'కనీస బలప్రయోగం మాత్రమే చేయాల'ని సుప్రీంకోర్టు అంది. పరస్పర విరుద్ధంగా కనిపించే ఈ రెండు అభిప్రాయాలనూ కలిపితే ఫలితం గందరగోళం తప్ప వేరే ఏమీ కాదు. కనీసం కంటే ఎక్కువ బలప్రయోగం చేసి ప్రాణం తీశారంటే, కనీస బలప్రయోగం చేయాలని సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ ప్రాణం తీయవచ్చునన్న చట్టం రాజ్యాంగబద్ధమేననింది కాబట్టి తప్పేమీ లేదని సైనిక బలగాలు దబాయించగలవు. మహా అయితే అది

పొరబాటు కాగలదు గానీ నేరం కాదనగలవు. కాబట్టి, 'కనీస బలప్రయోగం' అని సుప్రీంకోర్టు చేర్చిన షరతుకు పెద్దగా అర్థం లేదు.

5. సాయుధ బలగాలపైన అధికార దుర్వినియోగానికి సంబంధించిన ఫిర్యాదు ఎవరైనా చేసినట్టయితే దాని పైన క్షుణ్ణంగా విచారణ జరపాలి, ఫిర్యాదు నిజమని తేలితే బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలి, ఘటనకు పాల్పడిన వారిని ప్రాసిక్యూట్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలి. అయితే 'క్షుణ్ణంగా' విచారణ ఎవరు జరపాలో, ఏ విధంగా జరపాలో చెప్పనంత కాలం ఇటువంటి ఆదేశాలకు ఆచరణాత్మకమైన అర్థమేమీ లేదు. అయినా, సుప్రీంకోర్టు 'అధికార దుర్వినియోగం' అన్న డొంక తిరుగుడు ప్రయోగం చేసింది గానీ సాయుధ బలగాల పైన వచ్చే అభియోగాలన్నీ వారు ఏదో ఒక నేరానికి పాల్పడ్డారనే. అది హత్య కావచ్చు, అక్రమ నిర్బంధం కావచ్చు, బలవంతపు అపహరణ కావచ్చు, లైంగిక హింస కావచ్చు – అన్నీ నేరాలే తప్ప కేవలం 'అధికార దుర్వినియోగం' కాదు. వీటి మీద స్థానిక పోలీసులు కేసు రిజిస్టర్ చేయాలనీ, నిష్పక్షపాతంగా నేర పరిశోధన జరపాలనీ, కోర్టులో నేరవిచారణ జరగాలనీ, సైనిక బలగాలు ఆ నేర విచారణతో పూర్తిగా సహకరించాలనీ అనకుండా ఫిర్యాదుల పైన క్షుణ్ణంగా విచారణ జరిపి (ఎవరు జరపాలో!) ఫిర్యాదు నిజమని తేలితే నష్టపరిహారం ఇవ్వాలి, ప్రాసిక్యూషన్ చేపట్టాలి అనడంలో పెద్దగా అర్థం లేదు.

సుప్రీంకోర్టు తీర్పు మీద ఇప్పుడు ఈ వ్యాఖ్యలెందుకంటే, సైన్యానికి ఇచ్చే అధికారం ఆ తీర్పుకు లోబడి ఉంటే చాలుననేది జీవన్‌రెడ్డి కమిటీ అభిప్రాయం. అదనంగా ఇంకొక రెండు ఈ కమిటీ చేర్చింది. కాల్పులు జరిపేటప్పుడు శరీరం పై భాగాన కాక కింది భాగాన గురి పెట్టమన్నారు. ఇది సైతం వారి స్వంత ఆలోచన కాదు. సైనిక అధికార యంత్రాంగమే సాయుధ బలగాల చట్టం చాటున విధులు నిర్వర్తిస్తున్న జవాన్లకు జారీచేసిన నియమావళిలో ఇదే సూక్తి ఉంది. ఎవరు చేస్తే ఏమిలే, మంచిదే కదా అంటారేమో. సమస్య ఎక్కడొస్తుందంటే, 'అనుమానితుల మీద నేరుగా కాల్పులు జరపవచ్చు! ప్రాణం తీయవచ్చు' అని చట్టం ఇచ్చిన అధికారం చెల్లుతుందని చెప్పిన తరువాత శరీరం కింది భాగానికి గురి పెట్టి కాల్చాలి అన్న

ఆదేశానికి అర్థం ఏముంది? కింది భాగానికి గురి పెట్టి కాల్చాను గానీ పొరబాటున పైకి వెళ్ళి అతని ప్రాణం పోయిందంటాడు. ప్రాణం తీసేట్టుగా కాల్పులు జరిపే అధికారం చట్టమే ఇచ్చింది కాబట్టి అతనిని చట్టం ఏమని తప్పు పట్టగలదు?

మొత్తానికి, సైనిక బలగాలను ప్రయోగించే సందర్భాన్ని గురించి, వాటికి ఉండగల అధికారాల గురించి సాధారణ చట్టం చెప్పేది సరిపోదనీ, సైనిక బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టం ఇచ్చే అధికారాలు, ఆ చట్టం పరిధి అవసరమేననీ అంటూ ఆ అధికారానికి ఇప్పటికే సుప్రీంకోర్టు విధించిన పరిమితులూ, సైనిక అధికారులే స్వయంగా విధించిన పరిమితులూ కూడ అవసరమనీ, అవి అందులో అంతర్భాగమనీ జీవన్‌రెడ్డి కమిటీ అభిప్రాయపడింది. వాటిని చట్టంలో రాసేయడం అవసరం అనింది.

జీవన్‌రెడ్డి కమిటీ చెప్పింది ఇదే అయితే పెద్దగా చర్చ జరిగేది కాదు. సాయుధ బలగాల చట్టం రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు ఎప్పుడో చెప్పింది. సాధారణ చట్టాలు సరిపోవని కూడ సుప్రీంకోర్టు చెప్పింది. అలాగే ప్రత్యేక అధికారాలు ఏ పరిమితికి లోబడి ఉండాలో కూడ చెప్పింది. సుప్రీంకోర్టు విధించే పరిమితులు చట్టంలో ఉన్నట్టే లెక్క. అయితే చట్టంలో స్పష్టంగా రాసిన వాటినే గౌరవించడం కష్టమైనప్పుడు అంతర్లీనంగా ఉన్న వాటిని ఏం గౌరవిస్తారు? కాబట్టి అంతర్లీనంగా ఉన్న దానిని చట్టంలో స్పష్టంగా రాసేయడం అవసరం అని జీవన్‌రెడ్డి కమిటీ అభిప్రాయపడింది. అంతవరకు బాగానే ఉందిగానీ ఈ మాటలు చెప్పడానికే అయితే 147 పేజీల రిపోర్టు రాయవలసిన అవసరం ఉండలేదు. అయిదు పేజీల రిపోర్టు సరిపోయేది.

అయితే జీవన్‌రెడ్డి గారి దృష్టి వేరే చోట ఉంది. ఆయుధాలు పట్టుకొని రాజ్యాన్నీ, దాని అధికారాన్నీ సవాలుచేసే ఉద్యమాలను ఎదుర్కొనడానికి వేరు వేరు చట్టాలుండడం మంచిది కాదనీ, ఒక చట్టం ఉంటేనే సమర్థంగా ఎదుర్కోవడం సాధ్యం అవుతుందనీ ఆయన అభిప్రాయం. ఒకే సమగ్ర శాసనం తయారుచేసే ప్రయత్నం 'పోటా'ను ఉపసంహరించుకున్న మరునాడే మొదలైంది. అప్పుడు కూడ ఒకే చట్టం రూపొందించవలసిన 'అవసరాన్ని' ప్రతిపాదించిన వారిలో ఒక దశలో భారత లా కమిషన్ చైర్మన్‌గా ఉన్న జీవన్‌రెడ్డి గారొకరు. ఇప్పుడు ఈ నివేదికను గాని ప్రభుత్వం అమలుచేస్తే అది పూర్తవుతుంది.

మిలిటెంట్ ఉద్యమాలపైన నిషేధం ప్రయోగించడానికి అధికారం ఇచ్చే చట్టాలు, వారు చేసే హింసాత్మక చర్యలను మరింత 'సమర్థంగా' విచారించే ప్రత్యేక నేర విచారణ వ్యవస్థ, వారిని ఎదుర్కొనడానికి సాయుధ బలగాలకు విశేష అధికారాలిచ్చే చట్టాలు అనేవి మూడూ వేరువేరుగా ఉంటూ వచ్చాయి. ఇందులో మూడవ కోవకు చెందిన చట్టాలు దేశంలో కొన్ని ప్రాంతాలకే పరిమితం అయ్యాయి. నిషేధ అవసరాలకు చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం, 1967 ఉంది. వివిధ రాష్ట్రాలలో రాష్ట్ర స్థాయి చట్టాలు (ఉదాహరణకు ఆం. ప్ర. పబ్లిక్ సెక్యూరిటీ చట్టం) ఉన్నాయి. రెండవ అవసరానికి టాడా, పోటా వంటి చట్టాలు, రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ సంఘటిత నేరాల నియంత్రణ చట్టం వంటివి ఉండేవి (కొన్ని ఇంకా ఉన్నాయి). మూడవ అవసరానికి సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టాలు (ఈశాన్య రాష్ట్రాలకొకటి, జమ్మూకాశ్మీర్‌కు ఒకటి), కల్లోలిత ప్రాంతాల చట్టాలు (పంజాబ్‌లో ఒకటి, ఆంధ్రప్రదేశ్‌లో ఒకటి) ఉన్నాయి.

మిలిటెంట్ ఉద్యమాలను నిషేధించే అధికారం, వారి హింసాత్మక చర్యలను సమర్థంగా విచారించి కఠినంగా శిక్షించే అధికారం, వారిని వేటాడి ఏరివేసే అధికారం అనే మూడూ ఒకే చట్టంలో ఉంటే మరింత బలంగా ఉంటుందని వాదించిన, వాదిస్తున్న వారు నిజానికి చాలామంది ఉన్నారు. న్యాయమూర్తులుగా ఉన్న, లేక ఉండిన వారు ఎక్కువగా ఈ వాదన వైపు మొగ్గు చూపుతున్నారు. పైగా ఆ చట్టాలు ఒక ప్రాంతానికో, ఒక సందర్భానికో పరిమితం కాకుండా రాజ్యాంగ యంత్రం చేతిలో ఒక సార్వత్రిక ఆయుధంగా ఉండాలని వారు వాదిస్తున్నారు. 'పోటా'ను రద్దుచేసిన తరువాత ఆ చట్టంలోని ప్రధాన అంశాలను చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టంలో చేర్చడం ద్వారా ఈ పని సగం పూర్తిచేశారు. (అయితే 'పోటా'లోని అత్యంత అభ్యంతరకమైన అంశాన్ని, అంటే ముద్దాయి పోలీసుల కిచ్చిన ఒప్పుకోలును సాక్ష్యంగా స్వీకరించచ్చునన్న నియమాన్ని తొలగించారు.)

ఇప్పుడు సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టాన్ని రద్దుచేసి అందులోని ప్రధాన అంశాలను (సుప్రీంకోర్టు ఆదేశించిన పరిమితుల మేరకు సవరించి) అదే చట్టంలో అయిదవ అధ్యాయంగా చేర్చాలన్నది జీవన్‌రెడ్డి కమిటీ సూచన. ఆ పని చేసినట్టయితే, చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం భారత రాజ్యం

ఉనికినీ, అధికారాన్నీ, స్వరూపాన్నీ సవాలు చేసే అన్ని మిలిటెంట్ ఉద్యమాలనూ ఎదుర్కొనడానికి ప్రభుత్వానికి విశేష అధికారాలిచ్చే సమగ్ర శాసనం అవుతుంది. ఏ ఒక్క ప్రాంతానికో, సందర్భానికో పరిమితం కాని సార్వత్రిక శాసనం అవుతుంది. ఈ ప్రతిపాదన జీవన్‌రెడ్డి కమిటీ రిపోర్టులోని ప్రధాన అంశం అని భావించవలసి ఉంటుంది. నిర్బంధ చట్టాలకు ఆ విధంగా సమగ్రత కల్పిస్తే ఏం జరుగుతుందంటే విడివిడిగా ఒక్కొక్క చట్టంలోనూ ఉన్న అణచివేత అధికారాలకుండే లక్షణాలు ఒకదానికొకటి తోడై అన్నీ మరింత నిర్బంధ పూర్వకంగా తయారవుతాయి.

నక్సలైట్ ఉద్యమాన్ని ఒక ఉదాహరణగా తీసుకొని ఈ 'సమగ్రత' పర్యవసానాలను వివరించవచ్చు. కేంద్ర ప్రభుత్వం చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం కింద నక్సలైట్ ఉద్యమాన్ని ఎప్పుడూ నిషేధించలేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వంత చట్టాన్ని చేసుకొని తన సరిహద్దుల పరిధిలో మావోయిస్టు పార్టీని నిషేధించింది. అయితే 'పోటా'లోని టెర్రరిస్టు సంస్థల జాబితాలో మావోయిస్టు పార్టీని కేంద్ర ప్రభుత్వం చేర్చి ఉంది. దానివల్ల 'పోటా'లోని ప్రత్యేక నేర విచారణ వ్యవస్థ ఆ పార్టీకీ వర్తించింది. అయితే 'పోటా'ను రద్దుచేసి అందులోని ప్రధానమైన అంశాలను చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టంలో (కొన్ని ఆహ్వానించదగ్గ సవరణలతో) రాసిన తరువాత ఏం జరిగిందంటే ఈ చట్టం కల్పించే నిషేధ అధికారాలు దేశ వ్యాపితంగా మావోయిస్టు పార్టీకీ వర్తించడం మొదలయింది. అంటే ఆ మేరకు మావోయిస్టు పార్టీపైన దేశ వ్యాపిత నిషేధం వచ్చింది.

ఇప్పుడు జీవన్‌రెడ్డి కమిటీ రిపోర్టును అనుసరించి సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని రద్దుచేసి అందులోని ప్రధాన అంశాలను (సుప్రీంకోర్టు సూచించిన పరిమితులను కలుపుకొని) చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టంలో చేర్చేస్తే ఏం జరుగుతుందంటే మావోయిస్టు ఉద్యమంపైన సైనిక బలగాలను విశేష అధికారాలతో మోహరించవచ్చు. ప్రస్తుతం మావోయిస్టుల పైన సైన్యాన్ని మోహరించినట్టయితే అది సాధారణ చట్టాల పరిధిలో ఉండాలి తప్ప విశేష అధికారాలిచ్చే చట్టం లేదు. బహుశా అందుకేనేమో వాళ్ళ పైన సైన్యాన్ని ఇప్పటిదాకా దించలేదు. జీవన్‌రెడ్డి కమిటీ సిఫారసులు అమలుచేస్తే సైన్యానికి విశేష అధికారాలిచ్చి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలోనూ దించవచ్చు. మావోయిస్టు ఉద్యమంలో

ప్రధానంగా పేద వర్గాలు, దళిత ఆదివాసీ ప్రజానీకం భాగస్వాములనేది తెలిసిన సంగతే. పోలీసు చర్యలు వారికి ఎంతటి హాని కలిగించాయో హక్కుల సంఘాల నివేదికలు పదే పదే బయట పెట్టాయి. జీవన్‌రెడ్డి కమిటీ పుణ్యాన సైన్యం రంగంలోకి దిగినట్టయితే ఏం జరగగలదో ఊహించాలంటేనే భయం వేస్తుంది.

జీవన్‌రెడ్డి కమిటీ రిపోర్టు గురించి ఇంకొక్క విషయం కూడ చెప్పాలి. అదేమిటంటే కేంద్ర ప్రభుత్వానికి ఒక ప్రాంతాన్ని కల్లోలిత ప్రాంతంగా ప్రకటించే విషయంలో ఈ రిపోర్టు సూచించే సవరణ పూర్తిగా ఏకపక్ష అధికారాన్ని కట్టబెడుతుంది. తొలినాడు ఈ చట్టంలో ఒక ప్రాంతాన్ని కల్లోలిత ప్రాంతంగా ప్రకటించి సైన్యాన్ని పంపమని కేంద్ర ప్రభుత్వాన్ని కోరే అధికారం రాష్ట్ర ప్రభుత్వానిది మాత్రమే. రాష్ట్రంలో ఒక ప్రాంతంలో కల్లోలం లేక ప్రమాదకర పరిస్థితులు ఏర్పడి, పౌరపాలన చేయి దాటిపోయేంతగా విషమించిందనీ, పౌరపాలనకు అండగా సైన్యాన్ని దింపితేనే పాలన సాధ్యమనీ రాష్ట్ర ప్రభుత్వం భావించినట్టయితే ఆ ప్రాంతాన్ని కల్లోలిత ప్రాంతంగా ప్రకటించి సైన్యాన్ని పంపమని కేంద్ర ప్రభుత్వాన్ని కోరవచ్చును. 1972లో ఈ చట్టాన్ని సవరించి, రాష్ట్ర ప్రభుత్వం కోరకున్నా కేంద్ర ప్రభుత్వమే ఆ నిర్ణయం తీసుకోవచ్చునన్నారు. అయితే సైన్యం మోహరింపుకు ప్రమాణం మాత్రం అదే. మోహరించబోయే ప్రాంతంలో కల్లోలం లేక ప్రమాదకర పరిస్థితులు ఎంతగా విషమించి ఉండాలంటే పౌరపాలనకు అండగా సైన్యాన్ని దించనిదే పాలన సాగదనిపించేంతగా. ఈ అభిప్రాయానికి రాష్ట్ర ప్రభుత్వం రాకున్నా కేంద్ర ప్రభుత్వమే రావచ్చునన్నది 1972లో చేసిన సవరణ సారాంశం. 'ప్రాంతీయ' అస్తిత్వాన్ని ప్రాతిపదికగా గల సాయుధ పోరాట ఉద్యమాల పట్ల 'ప్రాంతీయ' ప్రభుత్వాలు (కాంగ్రెస్ పార్టీకి చెందినవే అయినా) మెతకవైఖరి ప్రదర్శిస్తున్నాయన్న అనుమానంతో వారు కోరకున్నా తానే సైన్యాన్ని పంపే అధికారం కేంద్రానికి ఉండాలని భావించి ఈ సవరణ చేశారు.

జీవన్‌రెడ్డి కమిటీ ఆ అధికారాన్ని విస్తృతం చేసింది. పైన చెప్పినట్టు రాష్ట్రం కోరుకోవాలన్నా, కేంద్రం తానే పంపాలన్నా రెండు పరిస్థితులు ఉండాలి. ఆ ప్రాంతంలో కల్లోలం లేక ప్రమాదకర స్థితి ఉండాలి. దానిని ఎదుర్కోడానికి పౌరప్రభుత్వానికి సైనిక బలగాల సహాయం అవసరమన్న అభిప్రాయానికి ప్రభుత్వం రావాలి. కల్లోలిత ప్రాంతాల ప్రకటనను ఎవరైనా కోర్టులో సవాలుచేస్తే ఈ రెండు పరిస్థితులు

ఉన్నాయనడానికి ప్రాథమిక ఆధారాలు ఆ ప్రభుత్వం చూపించవలసి ఉంటుంది. జీవన్‌రెడ్డి కమిటీ ఈ రెండు పరిస్థితులు ఉన్నప్పుడే కాకుండా 'ఒక రాష్ట్రంలో లేక ఒక ప్రాంతంలో ఆంతరంగిక కల్లోలాన్ని అణచడానికి సైనిక బలగాలను దింపడం అవసరం అని కేంద్ర ప్రభుత్వం భావించినట్టయితే' ఆ రాష్ట్రాన్ని, లేక ఆ ప్రాంతాన్ని కల్లోలిత ప్రాంతంగా ప్రకటించి సైనిక బలగాలను పంపించవచ్చునంది. అంటే ఆంతరంగిక కల్లోలం ఉంటే చాలు. దానిని రాష్ట్ర పౌరపాలనా యంత్రాంగం ఎదుర్కోగలదా లేదా అన్న ప్రశ్నతో నిమిత్తం లేకుండా కేంద్ర ప్రభుత్వం సైన్యాన్ని దించవచ్చు. ఆ రాష్ట్ర ప్రభుత్వం ఒక వేళ 'నేను అదుపు చేయగలను. మీ సహాయం అక్కర లేదు' అన్నా, అదుపు చేయగల సామర్థ్యం ఉందని రుజువు చేసినా కూడ కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా సైన్యాన్ని పంపించవచ్చు. పైగా ఇది సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టంలాగ ఎంపిక చేసిన కొన్ని రాష్ట్రాలకే కాదు, దేశమంతటికీ వర్తిస్తుంది. దీని ఫలితంగా ఎప్పుడైనా, ఎక్కడైనా ఆంతరంగిక కల్లోలం ఉందని చెప్పి ఏకపక్షంగా సైన్యాన్ని దించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది.

ఇది అవాంఛనీయమైన కేంద్రీకరణ అనడంలో సందేహం లేదు. దానికి గల కారణం కోసం ఎంతో దూరం వెతకనక్కర లేదు. 'జాతి భద్రత అన్నిటి కంటే ప్రధానమైన కర్తవ్యం' అన్న కమిటీ అభిప్రాయం ఇంతటి కేంద్రీకరణను సూచించడానికి గల ప్రత్యక్ష కారణం. పైగా జాతిభద్రత అనే ప్రయోగానికి వారిచ్చిన వివరణను గమనిస్తే ఇది జాతి ప్రజల జీవితాలకు భద్రత కాదు, రాజ్యం భద్రత అని సులభంగా అర్థం అవుతుంది. రాజ్యం భద్రత అత్యంత ప్రధానమైన పాలనా లక్ష్యం అనీ, ప్రజల ప్రాథమిక హక్కులు, ప్రజాస్వామ్య పాలన మొదలైన ఇతర పాలనా విలువలు, లక్ష్యాలు దాని తరువాతేననీ కమిటీ రిపోర్టు స్పష్టంగా అంటుంది. ఈ ప్రాధాన్యతను తలకిందులు చేసి ప్రజల ప్రాథమిక హక్కులు, ప్రజాస్వామ్య పాలన అన్నిటి కంటే ప్రధాన లక్ష్యాలని ప్రతిపాదించినట్టయితే నిర్బంధ చట్టాల గురించి కలిగే అభిప్రాయం కూడ తలకిందులవుతుంది.

ఇదీ జీవన్‌రెడ్డి కమిటీ రిపోర్టు అసలు స్వరూపం కాగా ఆ కమిటీ సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టం రద్దును సిఫారసు చేసిందంటూ పెద్దఎత్తునే ప్రచారం జరిగింది. కేంద్ర ప్రభుత్వమేమో ఆ పని చేయబోవడం లేదని ప్రకటించేసింది.

ఫలితమేమిటంటే ప్రజలు – ముఖ్యంగా మణిపూర్‌లో – మళ్ళీ రోడ్ల మీదికొచ్చి సాయుధ బలగాల చట్టాన్ని ఉపసంహరించుకోవాలని ఉద్యమిస్తున్నారు. అర్థమయ్యీ కాక జీవన్‌రెడ్డి కమిటీ సిఫారసులను అమలుచేయాలని డిమాండ్ చేస్తున్న వారూ ఉన్నారు. అర్థమైన వారి మీద కూడ జీవన్‌రెడ్డి కమిటీ చేసిన ఒక విచిత్రమైన వాదన ప్రభావం ఉన్నట్టుంది. ఆ వాదన – నిర్బంధ అధికారాలను ఒక ప్రాంతానికే పరిమితం చేస్తే అది తమ ప్రాంతం పట్ల చిన్న చూపు లేక వివక్ష అని ఆ ప్రాంతం వారు భావించే అవకాశం ఉంది. వాటిని దేశానికంతా వర్తింపజేస్తే ఈ వివక్ష అనే భావన పోతుంది అనేది!

*మానవహక్కులు వేదిక బులెటిన్ 8*
*మే 2007*

# విచారణలు, విషాదాలు!

'సల్వాజుడుం' అని పిలవబడే సంస్థ లేక ఉద్యమం లేక రౌడీ మూక ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అండదండలతో నిరాయుధులైన ప్రజల మీద హింసకు పాల్పడుతున్నదన్న అభియోగంపైన విచారణ జరిపి నివేదిక ఇమ్మని జాతీయ మానవహక్కుల కమిషన్‌ను సుప్రీంకోర్టు ఆదేశించటం చాలామందికి సంతోషం కలిగించింది. సంతోషించినందుకు ఆక్షేపించడానికేం లేదుగానీ, ఎవరిమీద సయితే విచారణ జరపబోతున్నారో వారు దాన్ని సాగనివ్వరనీ, ఏ ప్రభుత్వం అండదండలతో వాళ్లు యథేచ్ఛగా హింసకు పాల్పడుతున్నారన్న అభియోగాన్ని కమిషన్ విచారించబోతున్నదో ఆ ప్రభుత్వం అండదండలతోనే అడ్డుపడబోతారనీ నిస్సంకోచంగా చెప్పవచ్చు.

విచారణ వస్తువే విచారణ ప్రక్రియకు ఆటంకమయితే విచారణ కమిషన్ ఏం తేల్చగలుగుతుంది? దాదాపు 14 ఏళ్ల కింద ఇదే జాతీయ మానవహక్కుల కమిషన్ ఆంధ్రప్రదేశ్‌లో ఒక విచారణ కోసం తరలివచ్చింది. పోలీసులు ఎన్‌కౌంటర్ల పేరిట హత్యలకు పాల్పడుతున్నారన్న అభియోగాన్ని విచారణకు స్వీకరించాక ఈ విషయంలో ప్రజలేమనుకుంటున్నారో తెలుసుకోవడానికి అది బయలుదేరి వచ్చింది. వచ్చినవాళ్ళు చిన్నాచితక మనుషులు కారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఒకరు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఒకరు, ఇద్దరు హైకోర్టు మాజీ న్యాయమూర్తులు, ఒక రిటైర్డ్ కేంద్ర ప్రభుత్వ అధికారీ వచ్చారు. కరీంనగర్, వరంగల్, నల్లగొండలలో విచారణ నిర్వహించారు. వారికి తెలిసిన ఏకైక పద్ధతిలో నిర్వహించారు. ఒక ప్రభుత్వ అతిథి గృహాన్ని విచారణ కేంద్రంగా ఎంచుకున్నారు. ఫలాన తేదీ పొద్దున్న 10 గంటల నుంచి ఫలానచోట విచారణ జరుగుతుందనీ, ప్రజలెవరైనా వచ్చి ఎన్‌కౌంటర్ల విషయంలోగానీ మొత్తంగా నక్సలైట్ ఉద్యమం, ప్రభుత్వ

చర్యలు అనే అంశాల మీద గాని చెప్పవలసిందేమైనా ఉంటే చెప్పవచ్చునని పత్రికా ప్రకటన ఇచ్చారు.

మేము ఆ మూడు జిల్లాలలోని ఎన్‌కౌంటర్ మృతుల కుటుంబాలను ఒక జీపులో పట్టేంత మందిని సమీకరించి తీసుకుపోయాము. అంతకంటే మాకు స్తోమతా లేదు, బాధితులలో కదలికా లేదు. ఒక్క కరీంనగర్లో మాత్రం విచారణ సక్రమంగా జరిగింది. అంటే పోలీసులు జోక్యం చేసుకోలేదు. మేము విచారణ స్థలానికి పోగానే కరీంనగర్ డిఎస్పీ వచ్చి కరచాలనం చేసి 'ఇది మీ రోజు, మా జోక్యం ఉండదు' అన్నాడు. మేము తీసుకొచ్చిన పోలీసు బాధితులు చెప్పవలసింది చెప్పారు. నక్సలైట్ బాధితులు కూడ కొందరొచ్చి వాళ్ళు చెప్పవలసిందీ చెప్పారు. మమ్మల్ని ఒకటి రెండు సూటిపోటి మాటలన్నారు గానీ అల్లరేం జరగలేదు. మరుసటిరోజు వరంగల్లో విచారణ జరగవలసిన చింతగట్టు గెస్ట్ హౌస్‌లో మేము వెళ్లేసరికి అప్పటికే చాలా పెద్ద గుంపు పోగయి ఉంది. మేము చూస్తూ ఉండగానే గుంపు ఇంకా పెద్దదయింది. అది మమ్మల్ని అల్లరి పెట్టడానికి పోలీసులు పోగుచేసిన గుంపని అర్థం అయింది. మేము కమిషన్‌కు ఫిర్యాదు చేయడానికి గెస్టహౌస్ లోపలికి వెళ్లి విజిటర్స్ రూంలో కూర్చున్నాము. అయితే ఈ నాటకానికి డైరెక్టర్ అయిన అప్పటి వరంగల్ ఒ.ఎస్.డి. ఉమేష్ చంద్ర వచ్చి 'ఇది మీరు కూర్చోవలసిన చోటు కాదు. బయటకు వెళ్లండి' అన్నాడు. తాను పోగుచేసిన గుంపు చేత దెబ్బలు తినకుండ మేము తప్పించుకుంటామేమోనని అతని ఆదుర్దా.

కొంతసేపటికి కమిషన్ తన విచారణ మొదలుపెట్టింది. మేము తీసుకొచ్చిన పోలీసు బాధితులు కొంచెం చెప్పారు. అంతలో పోలీసులు తెచ్చిన గుంపు దాడికి దిగారు. మాపైన చేయి చేసుకున్నారు. అక్కడున్న పోలీసులు చోద్యం చూస్తూ నిలబడ్డారు. కొంచెం సేపటికి మానవహక్కుల కమిషన్ పెద్దలు జోక్యం చేసుకొని అందరినీ శాంతంగా ఉండవలసిందిగా కోరారు. ఆ తరువాత సద్దుమణిగిందిగానీ పోలీసు బాధితులెవ్వరూ అక్కడ మిగలలేదు. నక్సలైట్ బాధితులు మాత్రం మిగిలారు. కమిషన్ వారి వాంగ్మూలాలు స్వీకరించి విచారణ ముగించింది. పోలీసుల లక్ష్యం నెరవేరింది. మరుసటి దినం నల్గొండలోనూ అదే జరిగింది. మాకు హాని జరగగలదని భయపడి కన్నబిరాన్‌గారు స్వయంగా రాగా ఆయనపైన కూడ చేయి చేసుకున్నారు.

రేపు సుప్రీంకోర్టు ఆదేశం మేరకు జాతీయ మానవహక్కుల కమిషన్ ఛత్తీస్‌గఢ్‌లో చేపట్టబోయే విచారణ ఇంతకంటే కూడ ఏకపక్షంగా ముగియగలదు. దానికి రెండు

కారణాలున్నాయి. ఇక్కడ నిరంతరాయంగా ప్రజల హక్కుల కోసం పనిచేస్తున్న వారమున్నాము. ఆనాడు జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను రప్పించగలిగాము, స్తోమత ఉన్న మేరకు బాధితులను తీసుకుపోగలిగాము. చత్తీస్‌గఢ్‌లో హక్కుల కోసం పనిచేసే ఏకైక స్థానిక సంస్థ పియుసిఎల్. వారికి విస్తృత నిర్మాణం లేకపోగా ఆ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బినాయక్ సేన్ ఇప్పటికే ఒక సంవత్సరంగా జైలులో ఉన్నారు. మరొక కార్యకర్త టి.జి.అజయ్‌ని సుప్రీంకోర్టు ఆదేశం (జాతీయ మానవ హక్కుల కమిషన్ విచారణకు ఆదేశించాక) తరువాత కూడ అరెస్టు చేశారు. డాక్టర్ సేన్ మీద అభియోగం జైలులో ఉన్న సన్యాల్ అనే మావోయిస్టు నాయకుడిచ్చిన ఉత్తరాలను బయటున్న మావోయిస్టు పార్టీ నాయకులకు చేరవేశాడని. చేరవేసాడనే అనుకున్నా ఆ ఉత్తరాలలో ఏ హత్యకూ పురమాయింపు లేదు, ఏ విధ్వంసానికీ పథక రచన లేదు. అటువంటప్పుడు అది నేరం ఎట్లాగయింది? ఒకవేళ అయిందనుకున్నా జిల్లా కోర్టు నుంచి సుప్రీంకోర్టు దాకా అన్ని న్యాయస్థానాలలోనూ ఒక సంవత్సర కాలం బెయిల్ నిరాకరించవలసిన అవసరం ఏముంది?

అజయ్ మీద కేసు మరీ అన్యాయమైనది. అతను 2004 ఎన్నికలప్పుడు పరిశీలన నిమిత్తం తిరుగుతుండగా మావోయిస్టు సానుభూతిపరులు అతనిని పోలీస్ ఏజెంట్‌గా అనుమానించి, నిర్బంధించి కెమెరా గుంజుకున్నారు. ఆ కెమెరా తిరిగి ఇప్పించమని అతను మావోయిస్టు నాయకత్వానికి రాసిన ఉత్తరాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు, మావోయిస్టులతో సంబంధాలున్నాయని అజయ్‌పైన కేసు పెట్టారు. పాపం అతనికి బెయిల్ దొరకడానికి ఎంతకాలం పడుతుందో? ఇది ఒక పక్క పరిస్థితి కాగా రెండవ పక్క పోలీసులు ఇక్కడ లాగ అక్కడ కొత్తగా నక్సలైట్ వ్యతిరేక గుంపును పోగు చేయనక్కర లేదు. సల్వాజుడుం ఇప్పటికే తయారయి వుంది. వాళ్ల చర్యల గురించే జాతీయ మానవ హక్కుల కమిషన్ రేపు విచారణ చేపట్టబోయేది. కోర్టు విచారణను కాదు కదా, వారికి ఏ ప్రమాదమూ కలిగించబోని జర్నలిస్టులు, హక్కుల సంఘాల వాళ్ల విషయ సేకరణను కూడ వారెన్నడూ సహించలేదు. సహించకపోవడం అంటే ఊరికే అభ్యంతరం చెప్పడం కాదు. మీద పడి కొడతారు; నిర్బంధించి కెమెరాలూ పుస్తకాలూ గుంజుకుంటారు; వెంబడించి తరిమేస్తారు. ఖమ్మం జిల్లాకు చెందిన తెలుగు మీడియా ప్రతినిధులు ఈ చేదు అనుభవాన్ని చాలాసార్లు రుచి చూశారు.

అయినప్పటికీ సుప్రీంకోర్టు ఆదేశించిన విచారణ సక్రమంగా జరిగేట్టు చూడడం చాలా అవసరం. మావోయిస్టుల ప్రభావాన్ని ఎదుర్కొనడానికి చట్టబద్ధమైన మార్గాలేవీ అనుసరించడం సాధ్యం కాదనుకుంటున్న పాలకులు, మావోయిస్టు బాధితులు, వ్యతిరేకులు పాల్పడే ప్రతీకార హింసకు చట్ట విరుద్ధంగా లైసెన్స్ ఇచ్చి సమాజం మీద వదిలే వికృతమార్గాన్ని ఎంచుకున్నారు. అది సల్వాజుడుం రూపంలో ఛత్తీస్‌గఢ్‌లో 'సఫలం' అయిందని భావించడం వల్ల జార్ఖండ్‌లోనూ, ఒరిస్సాలోనూ అదే ప్రయత్నం మొదలయింది. మణిపూర్‌లో జరుగుతున్న జాతి పోరాటానికి వ్యతిరేకంగానూ అదే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఎత్తుగడ కేవలం ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచన కాదు. కేంద్ర హోంశాఖ తన 2005–2006 నివేదికలో నక్సలైట్ ప్రభావం ఉన్న రాష్ట్రాలలో స్థానిక ప్రతిఘటనా దళాలనూ గ్రామ రక్షణ దళాలనూ ప్రోత్సహించాలని సలహా యిచ్చినట్టు రాసుకుంది; సల్వాజుడుం ఒక మంచి ఉదాహరణ అని ప్రశంసించింది.

సల్వాజుడుం స్వభావాన్ని బహిర్గతం చేయగల మానవ హక్కుల కమిషన్ విచారణ సఫలమైతే ఈ క్రమానికి సుప్రీంకోర్టు అడ్డుకట్ట వేయగలదు. దీనికి ఒక మార్గం కమిషన్ తన విచారణను కేవలం దంతెవాడ జిల్లాలో జరుపకుండా భద్రాచలంలో గానీ ఏటూరునాగారంలో గానీ కనీసం రెండు మూడు రోజులు కూర్చుని మన రాష్ట్రంలోకి పారిపోయి వచ్చిన ఛత్తీస్‌గఢ్ వాసుల వాంగ్మూలాలు స్వీకరించడం. ఎంతలేదన్నా 30 వేల మంది ఇప్పటికే పారిపోయి వచ్చారు. ఎక్కువ భాగం ఖమ్మం జిల్లాలోనూ, తక్కువగా వరంగల్ జిల్లాలోనూ తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకొని బతుకుతున్నారు. వాళ్లందరూ మావోయిస్టు అభిమానులు కారు గానీ మినహాయింపు లేకుండ అందరూ సల్వాజుడుం బాధితులే. రకరకాల భయాలు వారి మెదళ్లపైన పనిచేస్తున్న కారణంగా వారిలో చాలామంది మాట్లాడకపోవచ్చు. కానీ ప్రయత్నం చేస్తే కొద్దిమంది ముందుకొచ్చి విచారణలో పాల్గొంటారు. ఈ అవకాశం మానవ హక్కుల కమిషన్ ఇవ్వకపోతే వారి విచారణ ఘోరంగా విఫలం అయ్యే ప్రమాదం ఉంది. అప్పుడు కేంద్ర ప్రభుత్వం దర్శకత్వంలో వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వినాశనకరమైన వ్యూహం అప్రతిహతంగా వ్యాపించే ప్రమాదం ఉంది.

*ఆంధ్రజ్యోతి దినపత్రిక*
*20 మే 2008*

# సచార్ చెప్పిన సత్యాలు



భారత ముస్లిముల
స్థితిగతులపై వాస్తవ నివేదిక

# సామజిక స్థాయిలో
# ముస్లింలు దళితులకే దగ్గర

**చా**లాకాలం పాటు చర్చలో ఉండబోయే నివేదిక ముస్లింల సామాజిక ఆర్థిక స్థితిగతులపైన రాజిందర్ సచార్ అధ్యక్షతన ఏర్పడిన కమిటీ సమర్పించిన వివరమైన రిపోర్టు. ముస్లింల స్థితిగతుల గురించే కాక మన సామాజిక జీవితంలో విభిన్న సామాజిక వర్గాల సాపేక్ష స్థితి గురించి కూడ ఈ నివేదికలో చాలా సమాచారం ఉంది.

భారతదేశంలో ముస్లింల స్థితి సవర్ణ హిందూ కులాలకూ ఎస్సి, ఎస్టిలకూ మధ్యస్తంగా ఉందనీ, కొన్ని విషయాలలో ముస్లింలు ఎస్సి, ఎస్టిలతో సమానంగా వెనుకబడి ఉన్నారనీ ఈ నివేదిక సారాంశం. ఎస్సి, ఎస్టిలను కలిపేయకుండా వేరువేరుగా లెక్కించి ఉంటే చాలా విషయాలలో ముస్లింల స్థితిగతులు ఎస్సిల స్థితిగతులకు సమానం అని తేలేది. అట్లాగే 'ఇతర హిందువులు' అనే శీర్షికన అగ్రకులాలనూ బిసిలనూ కలిపేయకుండా వేరుగా చూపించి ఉంటే సామాజిక విషయాలలో హిందూ అగ్రకులాల ఆధిపత్యం ఎంతగా ఉందో కూడ స్పష్టం అయి ఉండేది.

రిజర్వేషన్లు ఉండడం వల్ల ఎస్సి, ఎస్టిలు ఎక్కడ లాభపడ్డారో, రిజర్వేషన్లు లేక ముస్లింలు ఎక్కడ నష్టపోయారో ఈ నివేదిక స్పష్టంగా చూపిస్తుంది. 'సచార్ కమిటీ సిఫారసులను అమలు చేయాలి' అన్న నినాదం వింటున్నాంగానీ, సిఫారసులే ఈ నివేదికలోని అత్యంత బలహీనమైన అంశం. నివేదికలో స్పష్టంగా చూపించిన పరిస్థితిని సవరించాలంటే కమిటీ చేసిన వాటి కంటే ఇంకా బలమైన సిఫారసులు కావాలి.

'భారతదేశంలోని ముస్లింల సామాజిక, ఆర్థిక, విద్యాసంబంధమైన స్థితిగతుల గురించి నిర్దుష్టమైన సమాచారం లేకపోవడం వల్ల ఆ వర్గం యొక్క సామాజిక ఆర్థిక వెనుకబాటుతనాన్ని తొలగించడానికి అవసరమైన విధానాలు, పథకాలు రూపొందించడం కష్టంగా ఉంది' అని కేంద్ర ప్రభుత్వం గుర్తించి, ఆ సమాచారం సేకరించి సమగ్రమైన నివేదిక ఇచ్చే నిమిత్తం ఒక ఉన్నతస్థాయి కమిటీని 2005 మార్చి 9వ తేదీన నియమించింది. ఆ కమిటీ అధ్యక్షులు రిటైర్డ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, పియుసిఎల్ మాజీ జాతీయ అధ్యక్షుడు అయిన రాజిందర్ సచార్ కాగా సభ్యులు శ్రీ సయ్యద్ హమీద్, డా. టి.కె. ఊమెన్, శ్రీ ఎం.ఏ. బాసిత్, డా. రాకేశ్ బసంత్, డా.అఖ్తర్ మజీద్, డా. అబుసలే షరీఫ్. వీరిలో ఒక ఎం.ఏ బాసిత్ తప్ప అందరూ విద్యారంగంలో ఉన్నత పదవులు నిర్వహిస్తున్నవారే. బాసిత్ కర్నాటక రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికా విభాగం డైరెక్టర్.

వీరు అందుబాట్లో ఉన్న అన్ని మూలాల నుంచి సమాచారం సేకరించి నవంబర్ 2006 కల్లా నివేదికను కేంద్ర ప్రభుత్వం ముందుంచారు. ముస్లింల స్థితిగతుల తులనాత్మక పరిశీలన ఈ నివేదిక లక్ష్యాలలో ముఖ్యమైనది కాబట్టి ఇతర సామాజిక వర్గాలతో పోలిక కోసం ఎస్‌సి, ఎస్‌టిలను ఒక వర్గంగా, ముస్లింలను ఒక వర్గంగా, 'ఇతరులను' ఒక వర్గంగా తీసుకున్నారు. కొన్ని విషయాలలో 'ఇతరుల'లో హిందూ వెనుకబడిన కులాలను వేరు చేసి ఒక వర్గంగా చూపించారు. కొన్ని విషయాలలో 'ఇతర మైనారిటీల'ను (అంటే సిక్కు, బౌద్ధ, క్రైస్తవ, యూదు, పార్సీలను) వేరు చేసి ఒక వర్గంగా చూపించారు. అన్ని విషయాలలోనూ ఈ అయిదు వర్గాలనూ విడివిడిగా లెక్కించి ఉంటే బాగుండేది. అట్లా చేయకపోవడానికి సమాచార లభ్యతలోని అసమగ్రత ముఖ్యకారణం అనిపిస్తుంది. మంచికైనా చెడుకైనా దేశ రాజకీయ సామాజిక సంవాదం నిర్మొహమాటంగా కులాలు, మతాల ప్రాతిపదికన జరుగుతున్నప్పటికీ, పది సంవత్సరాలకొకసారి జరిగే జనాభా లెక్కలలో మాత్రం కులాలలో ఎస్‌సి, ఎస్‌టిలను మాత్రమే గుర్తించడం జరుగుతున్నది. అయితే నేషనల్ శాంపిల్ సర్వే సంస్థ (ఎన్ఎస్ఎస్ఓ) కులాన్ని ఒక సామాజిక వాస్తవికతగా గుర్తించడం వల్ల హిందూ కులాల స్థితిగతుల గురించి సమాచారం ఇప్పుడు కొంత లభ్యమవుతున్నది. సచార్ కమిటీ నివేదిక 2001 జనాభా లెక్కల పైననే కాక, ఎన్ఎస్ఎస్ఓ 61వ రౌండు

(2004–2005) గణాంకాలపైన, పోలిక కోసం 55వ రౌండు (1999–2000) గణాంకాలపైన ప్రధానంగా అధారపడింది. ఇవి కాక అవసరాన్ని బట్టి వివిధ రాష్ట్ర ప్రభుత్వాల నుంచి, కేంద్ర ప్రభుత్వ శాఖల నుంచి సమాచారం సేకరించి ఉపయోగించుకున్నారు.

ముస్లింల పట్ల వ్యతిరేక భావాన్ని రెచ్చగొట్టడానికి వాడుకునే అనేక విషయాలను గణాంకాల ఆధారంగా విశ్లేషించి జవాబు చెప్పడం సచార్ కమిటీ నివేదిక చేసిన సేవలలో ఒకటి.

**జనాభా**

వీటిలో మొదటిది జనాభా. ముస్లింలు కుటుంబ నియంత్రణ పాటించరనీ ఒక్కొక్క మగవాడూ నలుగురు స్త్రీలను పెళ్ళి చేసుకుంటాడనీ, అందువల్ల వారి జనాభా వేగంగా పెరిగి చివరికి భారత దేశంలో హిందువులు మైనారిటీ అయిపోయే ప్రమాదం ఉందనీ ఒక ప్రచారం సంఘ్ పరివార్ చాలాకాలంగా చేస్తూ ఉంది. ముస్లింల పట్ల ద్వేషం అత్యధికంగా రెచ్చగొట్టబడ్డ గుజరాత్‌లో 'మేము అయిదుగురం, మా వాళ్ళు ఇరవై నాలుగు' అన్న అసహ్యకరమైన నినాదం ముస్లింల గురించి నరేంద్రమోడి, ప్రవీణ్ తొగాడియా వంటి వారు ప్రచారం చేయడం జరిగింది. (ప్రతీ ముస్లిం పురుషుడూ నలుగురు భార్యలను చేసుకుంటాడనీ, ఒక్కొక్క భార్య ఆరుగురిని కంటుందనీ దీని భావం. అన్ని సామాజిక వర్గాలలాగా ముస్లింలలో కూడ పురుషుల కంటే స్త్రీల సంఖ్య కొంచెం తక్కువనీ, దానివల్ల ఒక్కొక్కడూ నలుగురిని చేసుకోవడం సాధ్యం కాదని గుర్తించగల సాధారణ లోకజ్ఞానానికి సహితం ఈ ప్రచారం అతీతం.)

సచార్ కమిటీ జనాభా లెక్కలన్నిటినీ పరిశీలించింది. ప్రాంతాల వారీగా, మతవర్గాల వారీగా విశ్లేషించింది. భారతదేశ జనాభా పెరుగుదల రేటు క్రమంగా తగ్గుతున్నదనీ, అన్ని ప్రాంతాలలో అన్ని మతవర్గాలలో ఈ పోకడ కనిపిస్తుందనీ అయితే ముస్లింలలో ఈ మార్పు కొంచెం ఆలస్యంగా మొదలయిందనీ నిర్ధారించింది. 1961లో దేశ జనాభాలో ముస్లింలు 10.7 శాతం ఉన్నారనీ, 2001లో ముస్లిం జనాభా 13.4 శాతానికి చేరుకుందనీ, అయితే అన్ని వర్గాలలాగే ముస్లింలలో కూడ పెరుగుదల రేటు తగ్గుతూ ఉందనీ, ప్రస్తుత పోకడలు ఇట్లాగే కొనసాగితే ముస్లింల

జనాభా దేశ జనాభాలో 18 లేక 19 శాతం దగ్గర స్థిరపడుతుందని సవివరంగా చూపించింది. ఇకనైనా ముస్లింలు దేశంలో మెజారిటీ అయిపోబోతున్నారన్న ప్రచారం సంఘ్ పరివార్ ఆపుతుందేమో చూద్దాం.

మెజారిటీ అయిపోతారన్న ప్రచారం అవాస్తవమే అయినా, ముస్లింల నిష్పత్తి పెరుగుతున్న విషయం వాస్తవమే కదా అని సంఘపరివార్ అనవచ్చు. కానీ దీనికి కారణం వారు ప్రచారం చేసే మత సంబంధమైన విషయాలు కావు.

దేశ జనాభా పెరుగుదల రేటులో ప్రాంతాల వారీగా చాలా తేడాలున్నాయి. దక్షిణ భారతదేశంలోని నాలుగు రాష్ట్రాలలో అది వేగంగా పడిపోతున్నది. ముస్లింల జనాభా పెరుగుదల రేటు కూడ ఈ రాష్ట్రాలలోనే బాగా తగ్గిపోయింది. దక్షిణ భారతదేశంలోని ముస్లిం జనాభా పెరుగుదల రేటు ఉత్తర భారతదేశంలోని మొత్తం జనాభా పెరుగుదల రేటు కంటే తక్కువ. ఏ సామాజిక ఆర్థిక ప్రత్యేకతలైతే దక్షిణ భారతదేశంలో జనాభా నియంత్రణను వేగవంతం చేశాయో అవి దక్షిణ భారతదేశంలోని ముస్లింల మీదా పని చేశాయి. అదే విధంగా ఏ కారణాలైతే ఉత్తర భారతదేశంలో జనాభా నియంత్రణ మందకొడిగా ఉండడానికి దోహదం చేశాయో ఆ కారణాలే అక్కడి ముస్లింలపైనా పని చేశాయి. మన దేశ జనాభాలోని ముస్లింలలో 22 శాతం ఉత్తరప్రదేశ్‌లోనే నివసిస్తున్నారని దృష్టిలో ఉంచుకుంటే ముస్లిం జనాభా పెరుగుదల రేటు సగటు జనాభా పెరుగుదల రేటు కంటే ఆలస్యంగా, మందకొడిగా తగ్గడానికి మామూలుగా ప్రచారమయ్యే కారణాల కంటే ఉత్తరప్రదేశ్ వెనుకబాటుతనం ముఖ్యకారణమని చెప్పుకోవచ్చునేమో! ముస్లింలు పెద్ద సంఖ్యలో నివసించే జమ్మూకాశ్మీర్ జనాభా పెరుగుదల రేటు కంటే ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్, రాజస్థాన్ జనాభా పెరుగుదల రేటు ఎక్కువ. ముస్లింల జనాభా పెరుగుదల గురించి పనిగట్టుకుని దుష్ప్రచారం చేసే సంఘ్ పరివార్‌కు సామాజికంగా, రాజకీయంగా బలం ఉండేది ఈ రాష్ట్రాలలోనే కావడం వల్ల ఎవరు ఎవరిని నిందించాలో తెలియని పరిస్థితి ఉందనుకోవాలి.

కారణాలు ఏవైతేనేం, దేశం మొత్తం మీద తీసుకున్నప్పుడు జనాభా పెరుగుదల రేటు 1970 తరువాత తగ్గుముఖం పట్టగా, ముస్లిం ప్రజానీకంలో ఈ తగ్గుదల దశాబ్దం ఆలస్యంగా మొదలైంది. దేశంలోని కొన్ని ప్రాంతాలలోనూ ఆలస్యంగా

మొదలైంది. కానీ తగ్గుదల మొదలైన తరువాత వేగంగా జరుగుతున్నది. 1991-2001ల మధ్య హిందువుల జనాభా పెరుగుదల రేటు 2.8 పాయింట్లు పడిపోగా, ముస్లింల జనాభా పెరుగుదల రేటు 3.4 పాయింట్లు పడిపోయింది. వాసెక్టమీ లేక ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకునే విషయంలో సంసిద్ధత ముస్లింలలో తక్కువే అయినప్పటికీ మిగతా గర్భనిరోధక చర్యల పట్ల అనుకూలత ఇతర ప్రజా సమూహాల కంటే ముస్లింలలో తక్కువ లేదని పరిశోధనలు తెలుపుతున్నాయి. ఈ శతాబ్దం చివరి నాటికి అన్ని సామాజిక వర్గాల జనాభా పెరుగుదల రేటు ఒకటవుతుందనీ, అప్పటికి ముస్లింల జనాభా దేశ జనాభాలో 18 లేక 19 శాతం చేరి అక్కడితో ఆగిపోతుందనీ సచార్ కమిటీ అంచనా వేసింది. ఏ రాష్ట్రాలలోనైతే దేశ ముస్లిం జనాభా సాపేక్షంగా ఎక్కువ ఉన్నారో ఆ రాష్ట్రాలలో వైద్య, ఆరోగ్య సేవలు, స్త్రీలలో విద్యాభివృద్ధి, పేదరికం తగ్గుదల మొదలైన లక్ష్యాలపైన ఇతర రాష్ట్రాలతో సమానంగా దృష్టిపెట్టి ఉంటే ఇంతటి తేడా కూడ బహుశా ఉండేది కాదని సచార్ కమిటీ అంటుంది. ఎందుకంటే స్వచ్ఛందంగా జనాభాను అదుపు చేసుకోవడానికి స్త్రీలలో మెరుగైన విద్యావ్యాప్తి, పిల్లల ఆరోగ్యానికి భరోసా, కనీస జీవన ప్రమాణాల భద్రత ఎక్కువగా దోహదం చేస్తాయని అన్ని పరిశోధనలూ తెలుపుతున్నాయి.

## విద్య: స్కూలు దశ

విద్య అంటే అక్షరాస్యత మాత్రమే కాదుగానీ అక్షరాస్యత సులభంగా అర్థమయ్యే ప్రమాణం. 2001 జనాభా లెక్కల ప్రకారం అక్షరాస్యత ఎస్‌సి, ఎస్‌టిలలో 52.2 శాతం, ముస్లింలలో 59.1 శాతం, ఇతరులలో 70.8 శాతం. మొదట్లో చెప్పినట్టు ఎస్‌సి, ఎస్‌టిల గణాంకాలు కలిపేయకుండా వేరుగా చూపించి ఉంటే ముస్లింలలో అక్షరాస్యత ఎస్‌సిలలో అక్షరాస్యతకు బాగా దగ్గర అన్న విషయం స్పష్టమయ్యేది.

అక్షరాస్యత తరువాత లెక్కించవలసింది స్కూలుకు పోతున్న పిల్లల నిష్పత్తి. దీనికి 1999-2000కు సంబంధించిన గణాంకాలనూ 2004-2005కు సంబంధించిన గణాంకాలనూ సచార్ కమిటీ పరిశీలించింది. 1999-2000లో ముస్లిం పిల్లలలో స్కూలుకు పోయేవారి నిష్పత్తి హిందూ అగ్రకులాల కంటే, బిసిల కంటే బాగా తక్కువ ఉండింది గానీ ఎస్‌సి, ఎస్‌టిల కంటే మెరుగుగా ఉండింది. 2004-2005 నాటికి ఎస్‌సి, ఎస్‌టిలలో బడికిపోయే పిల్లల నిష్పత్తి ముస్లింలను దాటి

పోయింది. ముస్లింలలో 6 నుంచి 14 సంవత్సరాల వయసున్న పిల్లలలో 25 శాతం అసలు బడి ముఖమే చూడనివారు. ఎస్‌సి, ఎస్‌టిలతో సహా వేరే ఏ సామాజిక వర్గం స్థితీ ఇంత అధ్వాన్నంగా లేదు. ఇతర వెనుకబడిన వర్గాల చదువు పట్ల ప్రభుత్వం పెడుతున్న శ్రద్ధతో పోలిస్తే ముస్లింల చదువు పట్ల పెడుతున్న శ్రద్ధ చాలా తక్కువ కావడం దీనికి ఒక ముఖ్య కారణం. ఒక వేళ ఏమైనా చేయాలని ప్రభుత్వానికి తోచినా 'ఓటు బ్యాంకు రాజకీయాలు' అంటూ గగ్గోలు పెట్టే వారు చాలా మంది ఉండనే ఉన్నారు.

బడికి ఎందరు పోతున్నారన్న ప్రశ్న తరువాత, బడికిపోయిన వారు సగటున ఎన్ని సంవత్సరాలు చదువుతున్నారన్న ప్రశ్న వేసుకోవాలి. అన్ని వర్గాల సగటు 4 సంవత్సరాలు కాగా (అంటే బడికిపోయే పిల్లలు సగటున 4వ తరగతితో చదువు ఆపేస్తారని అర్థం) ముస్లింలలో 3 సంవత్సరాల 4 నెలలే. ఇది ఎస్‌సి, ఎస్‌టిలతో సహా అన్ని సామాజిక వర్గాల కంటే తక్కువ.

అయితే జనాభా పెరుగుదలలాగే బడికిపోయే పిల్లల నిష్పత్తి, సగటు విద్యా కాలాల విషయంలో కూడ ప్రాంతాలవారీ తేడాలున్నాయి. దక్షిణ భారత రాష్ట్రాలు, గుజరాత్, మహారాష్ట్రలలో ముస్లింల స్థితి ఈ విషయంలో మెరుగుగానే ఉంది. మళ్ళీ ప్రధాన లోపం హిందీ రాష్ట్రాలలోనే.

5వ తరగతి పూర్తి చేసిన వారెంత మంది, 7వ తరగతి పూర్తి చేసిన వారెంత మంది, 10వ తరగతి పూర్తి చేసిన వారెంత మంది, ఇంటర్ పూర్తి చేసిన వారెంత మంది అన్న లెక్కలు తీస్తే, గ్రామీణ ప్రాంతాలలో ముస్లింల స్థితి సరిగ్గా ఎస్‌సి, ఎస్‌టిలతో సమానంగా ఉంది. ఎస్‌టిల కంటే ఎస్‌సిల స్థితి కొంత మెరుగ్గా ఉంటుంది. కాబట్టి ఎస్‌సి, ఎస్‌టిలను కలిపేయకుండా వేరువేరుగా ముస్లింలతో పోల్చినట్టయితే గ్రామీణ ప్రాంతాలలో ముస్లింల విద్యాప్రమాణాలు ఎస్‌సిల కంటే అధ్వాన్నంగా ఉన్నాయని కనిపించి ఉండేది. పట్టణ ప్రాంతాలలో మాత్రం ముస్లింలలో విద్యా ప్రమాణాలు పై స్థాయికి పోయేకొద్దీ దేశ సగటులో సగానికంటే ఎక్కువ లేకపోయినప్పటికీ ఎస్‌సి, ఎస్‌టిల కంటే మెరుగే.

గ్రామీణ ప్రాంతాల పిల్లలను పట్టణ ప్రాంతాల పిల్లలతో సమానం చేయగల ఉన్నత ప్రమాణాలు గల విద్యను అందించే లక్ష్యంతో జవహర్ నవోదయ

విద్యాలయాలు ఏర్పడ్డాయి. దేశంలో అవి 551 ఉన్నాయి. వాటిలో ఒకటిన్నర లక్షల మంది పిల్లలు చదువుకుంటున్నారు. అయితే ఈ స్కూళ్ళలో ముస్లిం విద్యార్థుల నిష్పత్తి 4 శాతం మాత్రమే. దేశ జనాభాలో ముస్లింలు 13.4 శాతం అని (పోనీ గ్రామీణ జనాభానే తీసుకుంటే గ్రామీణ భారతంలో ముస్లింలు 12 శాతం అని) దృష్టిలో పెట్టుకుంటే ఇది వారి జనాభా వాటాతో పోలిస్తే చాలా తక్కువ.

స్కూలులో చేరడమే కాదు, చదువు పూర్తి చేయడమూ ముఖ్యమే అని చెప్పుకున్నాం. స్కూలులో చేరిన ముస్లిం పిల్లలలో 44 శాతం 5వ తరగతి పూర్తి చేస్తున్నారు. ఎస్‌సిలలో ఇది 39 శాతం, ఎస్‌టిలలో (ఇక్కడ ఈ రెండు గణాంకాలు వేరు వేరుగా చూపారు) 32 శాతం. అయితే 5వ తరగతి పాసైన వారిలో ఎంత మంది 7వ తరగతి పూర్తి చేస్తారు, 7వ తరగతి పాసైన వారిలో ఎంత మంది హైస్కూలు పూర్తిచేస్తారు అన్న లెక్కలలో ముస్లింలు ఎస్‌సి, ఎస్‌టిలతో సమానం. (మొదటిది 65 శాతం, రెండవది 50 శాతం). హైస్కూలు పాసైన వారిలో ఎంతమంది కాలేజీ చదువు పూర్తి చేస్తారన్న లెక్క తీసుకుంటే, ముస్లింలలో అది 26 శాతం, ఎస్‌సి ఎస్‌టిలలో 23 శాతం. ఈ అన్ని విషయాలలోనూ 'ఇతరులు', అంటే హిందూ సవర్ణకులాలు, సాపేక్షంగా బాగా మెరుగైన స్థితిలో ఉన్నారని వేరే చెప్పనవసరం లేదు. స్కూలులో చేరే వారిలో 5వ తరగతి పాసయ్యే వారిలో 7 పూర్తిచేసేవారు 75 శాతం, 7 పాసయ్యేవారు 62 శాతం, 5వ తరగతి పాసయ్యే వారిలో హైస్కూలు పూర్తి చేసేవారు మళ్ళీ 62 శాతం, హైస్కూలు పూర్తి చేసే వారిలో కాలేజీ పూర్తి చేసే వారు 34 శాతం. ఇందులో అగ్ర కులాలను, బిసిలను వేరు చేస్తే హిందూ అగ్ర కులాలతో పోల్చినప్పుడు ముస్లింల స్థితి ఎంత అధ్వాన్నంగా ఉందో ఇంకా స్పష్టం అవుతుంది.

## విద్య: కాలేజీ దశ

ఉద్యోగాలకు కాలేజీ డిగ్రీ, అందులోనూ ఏదైనా సాంకేతిక విద్యకు సంబంధించిన డిగ్రీ లేక డిప్లొమా చాలా ముఖ్యం. ఈ విషయంలో ముస్లిం ప్రజానీకం చాలా వెనుకబడి ఉన్నారని సచార్ కమిటీ నివేదిక తెలుపుతుంది. దేశ జనాభాలో 20 సంవత్సరాల వయసు పైబడిన వారిలో 3.8 కోట్ల మందికి ఏదైనా డిగ్రీ లేక డిప్లొమా ఉంది. ఇది ఆ వయసు గల జనాభాలో 6 శాతం. అందులో సాంకేతిక విద్యలో క్వాలిఫికేషన్ పొందిన వారు వెయ్యిలో 70 మంది. ముస్లింలలో 20

సంవత్సరాల వయసు పైబడిన వారిలో డిగ్రీ లేక డిప్లొమా గల వారు వెయ్యిలో 10 మంది మాత్రమే. వారి స్థితి ఎస్‌సి, ఎస్‌టిల కంటే కొంచెం మెరుగే అయినా 'ఇతరుల'తో పోలిస్తే సగం కంటే తక్కువ.

ఉన్నత విద్య విషయంలో సచార్ కమిటీ బిసిల గణాంకాలు విడిగా సేకరించింది కాబట్టి బిసిల స్థితినీ ముస్లింల స్థితినీ పోల్చవచ్చు. ఒక సామాజిక వర్గానికి ఉన్నంతలో న్యాయం జరుగుతున్నదని చెప్పాలంటే దేశ జనాభాలో వారి నిష్పత్తి ఎంత ఉందో డిగ్రీ లేక డిప్లొమా పొందిన విద్యావంతులలో వారి నిష్పత్తి అంత ఉండాలి. బిసిల విషయంలో డిగ్రీ లేక డిప్లొమా పొందిన వారి నిష్పత్తి దేశ జనాభాలో బిసిల నిష్పత్తిలో 2/3వ వంతు ఉండగా, ముస్లింలలో ఇది 1/2 మాత్రమే. (ముస్లింలకు విద్యా ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్లు ఇవ్వడాన్ని కొన్ని బిసి సంఘాలు కూడ వ్యతిరేకిస్తున్నాయి కాబట్టి వారి స్థితి వీరి కంటే అన్యాయం అని గుర్తించడం అవసరం) హిందూ అగ్రకులాల విషయానికొస్తే, జనాభాలో వారి వాటా కంటే డిగ్రీ లేక డిప్లొమా గల ఆ కులాల వారిలో వారి వాటా రెండున్నర రెట్లను మించి ఉంది. ముస్లింల మేలు కోసం ప్రభుత్వం ఏం చేయజూసినా 'ఓటు బ్యాంకు రాజకీయాలు' అంటూ రోడ్డెక్కి అరిచేది ఎక్కువగా వీళ్ళే.

ఉద్యోగ అర్హతలలో సాంకేతిక విద్యకుండే ప్రాముఖ్యం తెలిసిందే. 2001 సెన్సెస్ ప్రకారం 20 సంవత్సరాలు పైబడిన దేశ జనాభాలో 1000లో 70 మందికి సాంకేతిక విద్యలో డిగ్రీ లేక డిప్లొమా ఉండగా, ముస్లింలలో 1000లో 10 మందికే ఆ విద్యార్హతలు ఉన్నాయన్న సమాచారాన్ని పైన ప్రస్తావించాము. 2004-2005 ఎన్‌ఎస్‌ఎస్ రౌండ్ సేకరించిన సమాచారాన్ని ఆధారం చేసుకుని ఈ విషయాన్ని సచార్ కమిటీ మరింత వివరంగా విశ్లేషించింది. వెనుకబడిన వర్గాల వారు డిగ్రీల విషయంలో పోటీపడలేకపోయినా డిప్లొమాల విషయంలో పడగలరన్న అభిప్రాయం ఉంటుంది. కాబట్టి సచార్ కమిటీ రెండిటి గణాంకాలనూ వేరువేరుగా విశ్లేషించింది. డిగ్రీల విషయం చూస్తే, అగ్రకులాలలో 20 సంవత్సరాలు పైబడిన వారిలో వెయ్యిలో 80 మందికి పైగా సాంకేతిక విద్యలో డిగ్రీలు కలిగి ఉండగా బిసిలలో 20 మంది, ఎస్‌సి ఎస్‌టిలలో 10 మంది, ముస్లింలలో 17 మంది కలిగి ఉన్నారు. డిప్లొమాల విషయమే చూసినా హిందూ అగ్రకులాలలో 20 సంవత్సరాల వయసు పైబడిన

జనాభాలో వెయ్యిలో 40 మంది డిప్లొమాలు కలిగి ఉన్నారు. బిసిలలో 20 మంది, ఎస్సి ఎస్టిలలో 10 మంది, ముస్లింలలో 15 మంది డిప్లొమా పాసైన వారు ఉన్నారు.

రిజర్వేషన్ల రూపంలో గానీ, ఇతర రూపాలలో గానీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టడం వల్ల హైందవ సమాజానికి చెందిన బిసిలు, ఎస్సి, ఎస్టిలు కాలక్రమంలో ఉన్నత విద్య విషయంలో తమ స్థితిని కొద్దికొద్దిగా మెరుగు పరచుకోగలుగుతుండగా చదువు విషయంలో ప్రభుత్వం ఏ ప్రత్యేక చర్యలు చేపట్టని ముస్లింలలో ఇది సాపేక్షంగా స్వల్పంగా ఉంది. పాత గణాంకాలు దొరకడం కష్టం కాబట్టి కాలానుగతమైన మార్పును అంచనా వేయడానికి సచార్ కమిటీ ఇప్పుడున్న జనాభాలోనే తరాల మధ్య నున్న తేడాను విశ్లేషించే మార్గం ఎంచుకుంది. 51 సంవత్సరాలు పైబడిన వారిలో వివిధ సామాజిక వర్గాలలో కాలేజీ చదువు పూర్తి చేసిన వారి నిష్పత్తిని తీసుకొని, 40–50 సంవత్సరాలు, 30–40 సంవత్సరాలు, 20–30 సంవత్సరాలు మధ్యనున్న వారిలో అదే నిష్పత్తితో పోల్చారు. మొదటి వర్గం స్వాతంత్ర్యం వచ్చిన తరువాత విద్యావంతులైన తొలితరం స్థితిని సూచిస్తుందని భావించినట్టయితే, అప్పట్లో అగ్రకులాలలో డిగ్రీ చదువుకున్న వారి నిష్పత్తితో పోలిస్తే ముస్లింలలో ఆ నిష్పత్తి అయిదవ వంతే ఉన్నప్పటికీ బిసిలు, ఎస్సి, ఎస్టిల కంటే ముస్లింలే మెరుగు. కానీ, ఆ తరువాత బిసి, ఎస్సి, ఎస్టిలు సాపేక్షంగా కొంత వేగంగానే తమ స్థితిని మెరుగుపరుచుకోగా ముస్లింలు వెనుకబడ్డారు.

అప్పటికీ ఇప్పటికీ ఈ నిష్పత్తి అగ్రకులాలలో మూడున్నర రెట్లయింది. ముస్లింలలో రెండుంబావు రెట్లయింది. ఇప్పుడు బిసి జనాభాలో డిగ్రీ చదువుకున్న వారి నిష్పత్తి ముస్లిం నిష్పత్తి కంటే 50 శాతం ఎక్కువ. ఎస్సి, ఎస్టిలలో ఆ నిష్పత్తి ఇప్పటికింకా ముస్లింల కంటే తక్కువే ఉన్నప్పటికీ ఇవే పాలనా విధానాలు కొనసాగితే ఇంకొక్క తరంలో ఎస్సి, ఎస్టిలు ఈ విషయంలో ముస్లింలనే దాటిపోగలరు. (అయితే ఇక్కడ ఎస్సి, ఎస్టిలను కలిపేసిన విషయం గుర్తుంచుకోవాలి. విడదీసినట్టయితే ఎస్సిలలో డిగ్రీ ఉన్న వారి నిష్పత్తి ఇప్పటికే ముస్లింల అదే నిష్పత్తికి చేరువై ఉండవచ్చు. ఎస్టిలలో ఇంకొక రెండు తరాలకు కూడ కాకపోవచ్చు) పట్టణ ప్రాంతాలను విడిగా తీసుకుంటే చాలా రాష్ట్రాలలో ఇప్పటికే ముస్లింలు ఎస్సి,ఎస్టి

కంటే ఈ విషయంలో వెనుకబడి ఉన్నారని సచార్ కమిటీ అంటుంది. ముస్లింలకు కూడా విద్యారంగంలో రిజర్వేషన్లు, స్కాలర్ షిప్పులు, ఆశ్రమ పాఠశాలలు వగైరా నెలకొల్పవలసిన అవసరానికి ఇంతకంటే బలమైన వాదన అక్కరలేదు.

## విద్య: ఉన్నత స్థాయి

పేరుగాంచిన ఉన్నత విద్యా సంస్థలలో ముస్లింల స్థానం ఏమిటి అన్న ప్రశ్నకు జవాబు ఇంకా నిరాశాజనకంగా ఉండబోతుందని ఊహించడం కష్టం కాదు. బిసిలకు రిజర్వేషన్ ఇస్తామంటేనే అగ్రకులాల వారు నానా రచ్చ చేసి సుప్రీంకోర్టుకు పోయి స్టే తెచ్చుకున్న ఐఐఎం, ఐఐటిల గురించి సచార్ కమిటీ సమాచారం సేకరించింది. ఐఐఎంలలోని 4,743 మంది విద్యార్థులలో కేవలం 63 మంది ముస్లింలు (1.3 శాతం) కాగా ఐఐటిలలోని 27,161 మంది విద్యార్థులలో 894 మంది ముస్లింలు (3.3 శాతం). దేశ జనాభాలో ముస్లింలు (2001 జనాభా లెక్కల ప్రకారం) 13.4 శాతం అన్న విషయం దృష్టిలో ఉంచుకోవాలి. ప్రతిష్టాత్మకమైన వైద్య విద్యాసంస్థలలో కూడ ఇదే పరిస్థితి. ముస్లిం విద్యార్థులు కేవలం 4 శాతం ఉన్నారు.

2004-2005 సంవత్సరానికి సంబంధించి 129 విశ్వవిద్యాలయాల సమాచారం సేకరించిన సచార్ కమిటీ పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులలో ముస్లింలు అతి తక్కువగా ఉన్న విషయాన్ని చూపించింది. మొత్తం పిజి విద్యార్థులలో 50 శాతం కంటే కొంచెం ఎక్కువ హిందూ అగ్రకులాలు, 24 శాతం బిసిలు, 14 శాతం దాకా ఎస్‌సి ఎస్‌టిలు ఉండగా 5 శాతం మాత్రమే ముస్లింలు ఉన్నారు. (మిగిలిన వారు సిక్కులు, బిసి జాబితాలో లేని క్రైస్తవులు వగైరా). విద్యా వ్యవస్థలో రిజర్వేషన్లు లేకపోవడం వల్ల ముస్లింలు ఎంతగా వెనుకబడి పోయారో ఈ గణాంకాలు స్పష్టంగా చూపిస్తాయి.

## మదరసాలు, మాధ్యమం

ముస్లింలు పిల్లలను బడికి పంపే బదులు మదరసాలకు పంపుతారు కాబట్టి వారిలో విద్యా ప్రమాణాలు తక్కువగా ఉండవచ్చుననీ, అది వారి తప్పే కనుక ప్రభుత్వాన్ని గానీ హిందూ సమాజాన్ని గానీ నిందించడంలో అర్థం లేదని వాదించేవారు ఉంటారు. దీనిని దృష్టిలో ఉంచుకుని సచార్ కమిటీ ఎంతమంది ముస్లిం పిల్లలు

మదరసాలకు పోతున్నారన్న సమాచారం సేకరించింది. ఆ సమాచారం సారాంశం ఏమిటంటే బడికి పోయే ముస్లిం పిల్లలలో 66 శాతం ప్రభుత్వ పాఠశాలలకు పోతారు. 30 శాతం ప్రైవేట్ పాఠశాలలకు పోతారు. 4 శాతం మాత్రమే మదరసాలలో చదువుకుంటారు. ఉత్తర భారతదేశంలో ఈ నిష్పత్తి 7 శాతం దాకా ఉండగా దక్షిణ భారత దేశంలో 1.7 శాతం మాత్రమే. ఏదైనా, విద్యా విషయంలో ముస్లింలు వెనుకబడి ఉండడానికి మదరసాలకు పోవడం కారణం ఎంతమాత్రం కాదు.

ఇక్కడ అవగాహనా లోపం వల్ల తలెత్తే గందరగోళం కొంత ఉందని సచార్ కమిటీ గుర్తించి దానిని కూడా వ్యాఖ్యానించింది. మదరసా అనేది పాఠశాల. అది లౌకిక పాఠశాలకు ప్రత్యామ్నాయం. మదరసాకు పోయే పిల్లలు లౌకిక పాఠశాలలకు పోరు. కానీ కేవలం మత బోధ చేయడానికి మసీదులకు అనుబంధంగా మక్తాబ్ అనే ధార్మిక విద్యాసంస్థ ఉంటుంది. అందులో అరబ్బీ నేర్పిస్తారు, ఖురాన్ చదివిస్తారు. ఇది లౌకిక పాఠశాలకు ప్రత్యామ్నాయం కాదు. లౌకిక పాఠశాలకు పోయే పిల్లలు అదనంగా మక్తాబ్‌లకు కూడ మతబోధ కోసం పోతారు. ఈ రెండింటికీ తేడా తెలియక అన్నిటినీ మదరసాలుగా భావించడం వల్ల మదరసాలలో చదువుకునే ముస్లిం పిల్లల సంఖ్య చాలా ఎక్కువ అనే అభిప్రాయం ప్రచారం అయిందని సచార్ కమిటీ వ్యాఖ్యానించింది. అయితే రెండింటినీ కూడినా కూడ వచ్చే సంఖ్య తక్కువే. ఎందుకంటే స్కూలుకు పోయే పిల్లలలో మతబోధ కోసం ఊరి మసీదుకు అనుబంధంగా ఉండే మక్తాబ్‌కు పోయే పిల్లలు 4 శాతమే. అంటే మదరసాలు, మక్తాబ్‌లూ కలిపినా వాటికి హాజరయ్యే పిల్లలు 8 శాతమే కాబట్టి ధార్మిక పాఠశాలలకు పిల్లలను పంపడంలో ముస్లిం పెద్దలకున్న మోజు వల్ల వారిలో అవిద్య ప్రబలిందన్న నిందకు ఆధారం లేదు.

మరైతే కారణాలేమిటి అన్న ప్రశ్న వేసుకున్నప్పుడు పేదరికం అధికంగా ఉండే అన్ని సామాజిక వర్గాలకు సామాన్యంగా ఉండే కారణాలతో బాటు కొన్ని ప్రత్యేకమైన కారణాలు కూడ కనిపిస్తాయి. నిజానికి పేదరికం ఒక్కటే వెనుకబాటుతనానికి కారణం కాదని రుజువు చేసే గణాంకాలు కూడ సచార్ కమిటీ ఇచ్చింది. ముస్లింలలో పేదలను, ఇతరులను వేరు చేసి ఈ రెండు ఉపవర్గాలూ సమాజంలోని విద్యావంతులలో ఏ నిష్పత్తిలో ఉన్నారో తెలిపే గణాంకాలు ఇచ్చింది

(పేదలు అనే మాటను ఏ విధంగా నిర్వచించారనేది ప్రస్తుతానికి అనవసరం – నిర్వచనం ఇటూ అటూ మార్చినా గణాంకాలలో తేడా ఏమీ రాబోదు). దేశ జనాభాలో ముస్లింలు 2001 జనాభా లెక్కల ప్రకారం 13.4 శాతం అని చెప్పుకున్నాం. 2004–2005 ఎన్ఎస్ఎస్ లెక్కల ప్రకారం పేద వర్గాలకు చెందిన గ్రాడ్యుయేట్లలో ముస్లింలు 10.5 శాతం, ఇతర వర్గాలకు చెందిన గ్రాడ్యుయేట్లలో 6.8 శాతం. పేద వర్గాలలోని పోస్ట్ గ్రాడ్యుయేట్లలో ముస్లింలు 7 శాతం, ఇతర వర్గాలలోని పోస్ట్ గ్రాడ్యుయేట్లలో 6.4 శాతం. గ్రాడ్యుయేట్లలో పేదవర్గాలలోనే ముస్లింల నిష్పత్తి ఎక్కువ ఉండడం ఆశ్చర్యం కలిగించవచ్చును గానీ, అందులో ఆశ్చర్యపడడానికేమీ లేదు. అన్ని అవకాశాలలోనూ సింహభాగం తీసుకునేది హిందూ అగ్రకులాలు. పేదలలో వారి సంఖ్య తక్కువ కాబట్టి వారి తాకిడి తక్కువ. కాబట్టి పేద వర్గాలలో ఎస్‌సి, ఎస్‌టి, బిసిల ముస్లింల వాటా ఎక్కువ ఉంటుంది. అయితే ఇక్కడ విషయం ఏమిటంటే పేదలు కాని ముస్లింలు సహితం గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లలో తమ జనాభా దామాషాలో సగం కూడా లేరు.

ప్రత్యేక కారణాలు కొన్ని ఉన్నాయన్నారు కదా! వాటిలో బోధనా మాధ్యమాన్ని సచార్ కమిటీ వివరంగా ప్రస్తావించింది. ముస్లింలందరి మాతృభాష ఉర్దూ కాకపోయినప్పటికీ ఉర్దూ మాతృభాష అయిన వారికి తమ మాతృభాషలో చదువుకునే అవకాశం సరిగ్గా లభ్యం కావడం లేదని గణాంకాలతో సహా చూపించింది. ఒక్క మహారాష్ట్రలో మాత్రమే ముస్లింలలో ఎంత నిష్పత్తి ఉర్దూను తమ మాతృభాషగా భావిస్తారో ముస్లిం పిల్లలలో అంత నిష్పత్తి ఉర్దూ మాధ్యమంలో చదువుకుంటున్నారు. కర్ణాటక ముస్లింలలో దాదాపు 70 శాతం ఉర్దూను మాతృభాషగా భావిస్తుండగా ముస్లిం పిల్లలలో 45 శాతం మంది మాత్రమే ఉర్దూ మాధ్యమంలో చదువుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ముస్లింలలో 80 శాతం ఉర్దూ తమ మాతృభాషగా భావిస్తుండగా (ఈ నిష్పత్తి దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువ) 20 శాతం మంది మాత్రమే ఉర్దూ మాధ్యమంలో చదువుకుంటున్నారు. బీహార్‌లో 60 శాతం ముస్లింలు ఉర్దూ మాతృభాష కలవారు కాగా వారి పిల్లలలో 30 శాతం మాత్రమే ఉర్దూ మాధ్యమంలో చదువుకుంటున్నారు. అయితే అన్నిటికంటే అధ్వాన్నమైన స్థితి ఉర్దూకు పుట్టినిల్లయిన ఉత్తరప్రదేశ్‌ది. అక్కడ ముస్లింలలో 45 శాతానికి మాతృభాష ఉర్దూ కాగా ఉర్దూ మాధ్యమంలో చదువుకుంటున్న ముస్లిం పిల్లలు 2 శాతం మాత్రమే!

దేశంలోని ముస్లింలలో 22 శాతం ఉత్తరప్రదేశ్ వాసులేనని గుర్తుంచుకుంటే మాతృ భాషలో విద్యాబోధన ముస్లిం పిల్లలకు ఎంతగా నిరాకరించబడుతున్నదో అర్థం అవుతుంది. ఉన్నంతలో ఉర్దూ మాధ్యమానికి మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోనే ప్రోత్సాహం లభిస్తున్నదని ఉత్తర భారత దేశంలోని ప్రభుత్వాలు తమకు సమాచారం ఇచ్చే విషయంలో సహితం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించాయనీ సచార్ కమిటీ అనింది. ముస్లింల వెనుకబాటుతనంలో 'హిందీ రాష్ట్రాల' పాపం చాలా ఉందని మొదట్లోనే చెప్పుకున్నాం కదా.

## ఉపాధి

సచార్ కమిటీ ఉపాధి అవకాశాలను మూడుగా వర్గీకరించి ముస్లింల ఉపాధి పరిస్థితిని విశ్లేషించింది. స్వయం ఉపాధి, దిన కూలీ (క్యాజువల్), స్థిరమైన ఉద్యోగాలు (రెగ్యులర్) అనే మూడు విభాగాలను సచార్ కమిటీ గుర్తించింది. ముస్లింలలో అధికభాగం స్వయం ఉపాధిపైన, ఆ తరువాత దినకూలీ పైన, ఆ తరువాత స్థిరమైన ఉద్యోగాల పైన ఆధారపడతారని సమాచారాన్ని విశ్లేషించి తెలిపింది. హిందూ అగ్రకులాలకు స్వయం ఉపాధి ప్రథమం (ఇందులో వ్యవసాయం కూడా ఉందని గుర్తుంచుకోవాలి), స్థిరమైన ఉద్యోగాలు ద్వితీయం, దినకూలీ తృతీయం. ఎస్‌సి ఎస్‌టిలకు దినకూలీ ప్రథమం, స్వయం ఉపాధి ద్వితీయం, స్థిరమైన ఉద్యోగాలు తృతీయం. హిందూ బిసి కులాలకు కూడ స్వయం ఉపాధి ప్రథమం, కానీ మిగిలిన రెండూ దాదాపు ఒకే మోతాదులో జీవనాధారం కల్పిస్తాయి.

స్థిరమైన ఉద్యోగాల విషయంలో ముస్లింలది అన్ని ఇతర సామాజిక వర్గాల కంటే దయనీయమైన స్థితి. స్థిరమైన ఉద్యోగాలు ఎక్కువగా లభించేది పట్టణ ప్రాంతాలలోనే కాబట్టి ఈ విషయం చూడడానికి పట్టణ ప్రాంత జనాభాను విడిగా తీసుకోవచ్చు. పట్టణ ప్రాంత అగ్రకులాలలోని ఉద్యోగులు, కార్మికులలో 49 శాతానికి స్థిరమైన ఉద్యోగాలుండగా, ఎస్‌సి ఎస్‌టిలలో ఈ నిష్పత్తి 40 శాతం, బిసిలలో 36 శాతం, ముస్లింలలో కేవలం 27 శాతం. అదే పట్టణ ప్రాంతాలలో ముస్లింలలో 64 శాతం మంది స్వయం ఉపాధి పైన ఆధారపడుతుండగా, బిసిలలో ఆ నిష్పత్తి 51 శాతం, హిందూ అగ్రకులాలలో 55 శాతం, ఎస్‌సి ఎస్‌టిలలో 43 శాతం. అయితే 'స్వయం ఉపాధి' అనే దాంట్లో కడుపునిండా కూడు పెట్టని నికృష్టమైన పనుల

నుంచి మంచి ఆదాయమిచ్చే వాటి దాకా చాలా ఉంటాయి. కాబట్టి ప్రధానంగా స్వయం ఉపాధిపైన ఆధారపడే ముస్లింలు ఏ రకమైన వృత్తులలో లేక వ్యాపకాలలో ఎక్కువగా ఉన్నారో తెలుసుకుంటే తప్ప చిత్రం పూర్తి కాదు. ముస్లింలు అధికంగా పని చేసే రంగాలు పొగాకు ఉత్పత్తులు (ఈ రంగంలో పని చేసే కార్మికులలో మగవాళ్ళలో 41 శాతం, ఆడవాళ్ళలో 35 శాతం ముస్లింలు), దుస్తుల తయారీ (మగవాళ్ళలో 30 శాతం, ఆడవాళ్ళలో 17 శాతం ముస్లింలు), మోటార్ వాహనాల అమ్మకం, రిపేరు (26 శాతం ముస్లింలు), ఎలక్ట్రికల్ ఉత్పత్తులు (23 శాతం ముస్లింలు), వర్తక రంగంలో పనిచేసే ఉద్యోగులు (27 శాతం ముస్లింలు).

స్వయం ఉపాధిపైన ఆధారపడే వారిలో వీధివీధీ తిరుగుతూ వస్తువులు అమ్మే వారు 8 శాతం కాగా ముస్లింలలో ఆ నిష్పత్తి 12 శాతం. స్వయం ఉపాధి పైన ఆధారపడే స్త్రీలలో స్వంత ఇంట్లోనే పనిచేసేవారు 51 శాతం కాగా, ముస్లింలలో అది 70 శాతం. ముస్లిం స్త్రీలు బయటికి పోయి పని చేయడం సాంప్రదాయక కట్టడి కారణంగా కష్టం కావడం వల్ల చిన్నాచితక ఉత్పత్తి కేంద్రాలు, షాపులు ఇంట్లో నుండే నడుపుతారు. స్వంత శ్రమతో ఇంట్లోనే ఉండి ఉపాధి పొందే మహిళల నిష్పత్తి ముస్లింలలో ఇతర సామాజిక వర్గాలలో కంటే ఎక్కువ. శ్రామికులుగా నమోదైన ముస్లిం మహిళలలో దాదాపు 80 శాతం ఈ కోవకు చెందిన వారు. వేరే ఏ సామాజిక వర్గంలోనూ ఈ నిష్పత్తి 65 దాటదు. ఈ రకమైన పని ఎక్కువగా సబ్ కాంట్రాక్టు రూపంలో ఉంటుందనీ, ఆరోగ్యమూ, ఆదాయమూ రెండూ కూడ హీనంగా ఉంటాయనీ సచార్ కమిటీ వ్యాఖ్యానించింది.

స్వయం ఉపాధి అనేది అసంఘటిత రంగంలో భాగం. ఇంగ్లీషులో ఇన్ఫార్మల్ సెక్టర్ అంటారు. అయితే అసంఘటిత రంగంలో వేరే ఉపాధి ప్రక్రియలు కూడా ఉన్నాయి. సంఘటిత రంగంతో పోలిస్తే ఇక్కడ ఆదాయాలు తక్కువ, అభద్రత ఎక్కువ. ముస్లింలలో వేరే అన్ని సామాజిక వర్గాల కంటే ఎక్కువ మంది అసంఘటిత రంగంలో ఉన్నారు. పట్టణ ప్రాంత కార్మికులలో సంఘటిత రంగంలో ఉండే వారి నిష్పత్తి బిసిలలో 22 శాతం, ఎస్‌సి ఎస్‌టిలలో 18 శాతం ఉండగా ముస్లింలలో 8 శాతం మాత్రమే.

పోలీసులలోనూ, సైన్యంలోనూ ముస్లింలు ఎందరున్నారన్న సమాచారం సచార్ కమిటీ సంబంధిత ప్రభుత్వ శాఖల నుంచి కోరినప్పుడు భారతీయ జనతాపార్టీ నేతలు చాలా రచ్చచేసిన విషయం పత్రికలలో చదివాము. అయినప్పటికీ సచార్ కమిటీ ఆ సమాచారం సేకరించగలిగింది. రక్షణ రంగంలోని వివిధ హోదాలలో హిందూ అగ్రకులాలు 52 శాతం, బిసిలు 23 శాతం, ఎస్‌సి, ఎస్‌టిలు 12 శాతం ఉండగా ముస్లింలు కేవలం 4 శాతం ఉన్నారు. కేంద్ర పోలీసు సంస్థలలో హిందూ అగ్రకులాలు 42 శాతం, బిసిలు, ఎస్‌సి ఎస్‌టిలు చెరి 23 శాతం ఉండగా ముస్లింలు 6 శాతం ఉన్నారు. రాష్ట్ర పోలీసు సంస్థలలో అగ్రకులాలు 37 శాతం, బిసిలు 21 శాతం, ఎస్‌సి, ఎస్‌టిలు 26 శాతం ఉండగా ముస్లింలు 7 శాతం ఉన్నారు. ఇవి 2004–2005 గణాంకాలు కాగా, 2001 జనాభా లెక్కల ప్రకారమే దేశ జనాభాలో ముస్లింలు 13.4 శాతం అని పైన చూశాము. 'మత ఘర్షణల'లో పోలీసులు, ఇతర భద్రతా సిబ్బంది హిందువుల పట్ల పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని తరచుగా వినవచ్చే ఆరోపణల వెనుక ఈ వాస్తవం కూడ ఉందని గుర్తుంచు కోవాలి.

కార్మికులలో ఏ రోజు కారోజు పని వెతుక్కునే వారిని క్యాజువల్ అనీ కొంత స్థిరత్వం ఉండే ఉద్యోగులను రెగ్యులర్ అనీ అనడం రివాజు. క్యాజువల్ కార్మికులెవరికీ పని భద్రత ఉండదు. రెగ్యులర్ అని పిలవబడే వారందరికీ కూడ ఒకే రకమైన భద్రత ఉండదు. లిఖిత పూర్వకమైన అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఉండటం కొంత ఎక్కువ భద్రత ఇస్తుంది. సామాజిక వర్గాల వారీగా రెగ్యులర్ కార్మికులలో ఎంత మందికి ఈ మేరకు భద్రత ఉందని లెక్కలు వేస్తే ముస్లింలది అందరికంటే అధ్వాన్నమైన స్థితి. రెగ్యులర్ ఉద్యోగాలు చేస్తున్నారు అనుకునే ముస్లింలలో 72 శాతానికి అపాయింట్‌మెంట్ లెటర్ లేదు. హిందూ అగ్రకులాలలో ఈ నిష్పత్తి 50 శాతం కాగా, బిసిలలో, ఎస్‌సి ఎస్‌టిలలో 62 శాతం. లిఖిత పూర్వకమైన ఉద్యోగ ఒప్పందం ఉన్న వారిలో మూడేళ్ళు మించిన ఉద్యోగకాలం (టెన్యూర్) ఉన్నవారు అగ్రకులాలలో 42 శాతం కాగా, బిసిలలో 32 శాతం, ఎస్‌సి, ఎస్‌టిలలో 34 శాతం, ముస్లింలలో 23 శాతం. ప్రావిడెంట్ ఫండ్ వంటి హక్కులు కలిగి ఉండేవారు హిందూ అగ్రకులాలకు చెందిన ఉద్యోగులలో 55 శాతం మంది ఉండగా అది బిసిలలో 42 శాతం, ఎస్‌సి, ఎస్‌టిలలో 43 శాతం, ముస్లింలలో 29 శాతం. నికరమైన నెల జీతం ఉండేవారు

అగ్రకులాలకు చెందిన రెగ్యులర్ ఉద్యోగులలో 95 శాతం, బిసిలలోనూ ఎస్‌సి, ఎస్‌టిలలోనూ 89 శాతం, ముస్లింలలో 82 శాతం మంది ఉన్నారు.

ఒక పద్ధతి ప్రకారం కనిపించే పై వ్యత్యాసాలకు వివక్షే కారణం కాకపోవచ్చు. ముస్లింలు ఎక్కువగా పనిచేసే ఆర్థిక రంగాల స్వభావమే అది కావచ్చు. అయితే ఆ ఆర్థిక రంగాలకు ఆ స్వభావం ఉండడానికి కారణం వాటిలో ఎక్కువగా ముస్లింలు పని చేయడమేనేమో అని కూడ చూడవలసి ఉంటుంది.

## బ్యాంకు రుణాలు

ఒక సామాజిక వర్గం బ్యాంకు రుణాలు ఏ మేరకు పొందగలుగుతున్నదనేది ఆర్థిక అభివృద్ధిలో వారు ఏ మేరకు పాల్గొంటున్నారనే దానికి ఒక సూచిక. ఈ విషయంలో కులాలవారీ గణాంకాలు దొరకనట్టున్నాయి. అయితే మైనారిటీలకు బ్యాంకు రుణాలు అందించడం అనే లక్ష్యం ప్రభుత్వ విధానాలలో భాగంగా బ్యాంకుల పైన ఉంది కాబట్టి ముస్లింలకు సంబంధించిన గణాంకాలను రిజర్వ్ బ్యాంకు సచార్ కమిటీకి ఇవ్వగలిగింది.

ప్రభుత్వ బ్యాంకులలోనూ, ప్రైవేట్ బ్యాంకులలోనూ కూడా ముస్లింల అకౌంట్ల నిష్పత్తి వారి జనాభా నిష్పత్తి కంటే కొంచెం మాత్రమే తక్కువ. ప్రభుత్వ బ్యాంకులలో ముస్లింల సేవింగ్స్ తదితర ఖాతాలు 12.2 శాతం, ప్రైవేట్ బ్యాంకులలో 11.3 శాతం ఉన్నాయి. అయితే రుణాల మొత్తంలో ముస్లింల వాటా (సచార్ కమిటీ వేసిన అంచనా ప్రకారం) ప్రభుత్వ బ్యాంకులలో 4.6 శాతం మాత్రమే కాగా ప్రైవేట్ బ్యాంకులలోనూ 6.6 శాతం మాత్రమే. తలసరి రుణం హిందువులతో పోలిస్తే ముస్లింలు పొందుతున్నది ప్రభుత్వ బ్యాంకులలో మూడవ వంతు మాత్రమే (33 శాతం) కాగా ప్రైవేట్ బ్యాంకులలో 40 శాతం మాత్రమే. ఉద్యోగాల కంటే స్వయం ఉపాధి, వర్తక రంగాలలో ముస్లింలు అధికంగా ఉన్న కారణంగా బ్యాంకు రుణాల లభ్యత ఎంత ఉన్నదనేది వారి ఆర్థిక స్థితిగతులకొక ముఖ్య సూచిక. అదేమంత ఆశాజనకంగా లేదని ఈ గణాంకాలు తెలుపుతాయి.

రాష్ట్రాలవారీ గణాంకాలు తీసుకున్నా కూడా దాదాపు అన్ని రాష్ట్రాలలోనూ బ్యాంకు రుణాల మొత్తంలో ముస్లింల వాటా జనాభాలో వారి వాటాకు సమానంగా

లేకపోగా అందులో సగం, మూడవ వంతు, నాలుగవ వంతు, అయిదవ వంతు, దేశ రాజధాని అయిన ఢిల్లీలోనైతే 24వ వంతు (జనాభాలో ముస్లింలు 100కి 12 మంది కాగా బ్యాంకు రుణాలలో 100 రూపాయలకు 50 పైసలే వారికిచ్చినవి) ఉంది. ఇందుకు రెండే మినహాయింపులు. ఒరిస్సా జనాభాలో ముస్లింల నిష్పత్తి ఎంతో బ్యాంకు రుణాలలో వారి వాటా కూడ అంతే. తమిళనాడు జనాభాలో ముస్లింలు 5.6 శాతం కాగా బ్యాంకు రుణాలలో వారి వాటా అంత కంటే 20 శాతం ఎక్కువ – 6.6 శాతం.

చివరికి జనాభాలో ముస్లింలు 67 శాతం ఉన్న జమ్ము కాశ్మీర్‌లోనూ బ్యాంకు రుణాలలో ముస్లింల వాటా 54.4 శాతం మాత్రమే. జనాభాలో 24 శాతం అయిన హిందువుల వాటా బ్యాంకు రుణాలలో 40 శాతం.

ముస్లింలు ఎక్కువ సంఖ్యలో నివసిస్తున్న జిల్లాలను తీసుకుని చూస్తే ఈ స్థితి మరింత కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. దేశంలో ముస్లింల జనాభా 40 శాతం మించిన జిల్లాలు 11 ఉన్నాయి. ఈ జిల్లాల సగటు ముస్లిం జనాభా 51.4 శాతం. కానీ అక్కడున్న బ్యాంకుల (ప్రభుత్వ, ప్రైవేటు కలుపుకుని) రుణాలలో ముస్లింల వాటా 11.6 శాతం మాత్రమే. ఈ జిల్లాలలో ఒకటైన మన హైదరాబాద్‌లో ముస్లింలు జనాభాలో 41.2 శాతం కాగా బ్యాంకు రుణాలలో వారి వాటా 3.2 శాతం. జనాభాలో 26 నుంచి 40 శాతం దాకా ముస్లింలు ఉన్న 12 జిల్లాలలో ముస్లిం జనాభా వాటా 34.2 శాతం కాగా బ్యాంకు రుణాలలో వారి వాటా 19.3 శాతం.

జనాభాలో ముస్లింల నిష్పత్తి 22 నుంచి 26 శాతం దాకా ఉన్న 10 జిల్లాలలో ముస్లిం జనాభా వాటా 24.1 శాతం కాగా బ్యాంకు రుణాలలో వారి వాటా 6.3 శాతం. మైనారిటీలు అధికంగా నివసించే జిల్లాలలో వారికి బ్యాంకు రుణాలు విరివిగా అందేటట్టు చూడమని బ్యాంకులకు రిజర్వ్ బ్యాంకు ఆదేశాలు ఉన్నప్పటికీ ఇదీ పరిస్థితి!

## లఘు పరిశ్రమల రుణాలు, నాబార్డ్ రుణాలు

ముస్లింలు ఉద్యోగాల కంటే స్వయం ఉపాధి రంగంలోనూ చిన్న వర్తక రంగంలోనూ అధికంగా ఉన్నారు కాబట్టి వారు తమ అభివృద్ధికి చిన్నతరహా పరిశ్రమలలోకి ప్రవేశించడం ఒక మార్గం. దీనికి ప్రత్యేకంగా రుణాలు ఇచ్చే సంస్థ

భారత లఘుపరిశ్రమల అభివృద్ధి బ్యాంకు (సిడ్బి SIDBI). సిడ్బి 2000–2006 మధ్య ఇచ్చిన రుణాలలో కేవలం 1.5 శాతం ముస్లింలకు అందింది. అందిన మేరకు కూడ తక్కువ మొత్తాలు అందాయి. సిడ్బి ఇచ్చిన సగటు రుణం 1.66 కోట్ల రూపాయలు కాగా, ముస్లిం వ్యక్తులకిచ్చిన సగటు రుణం 63 లక్షల రూపాయలు మాత్రమే.

నాబార్డ్ గ్రామీణ అభివృద్ధి కోసం రుణాలు ఇవ్వడం ఒక ముఖ్య లక్ష్యంగా గల సంస్థ. 2004–05, 2005–06 సంవత్సరాలలో నాబార్డ్ ఇచ్చిన ఉత్పత్తి రుణాలలో 3.2 శాతం ముస్లింలకు అందింది. పెట్టుబడి రుణాలలో 3.9 శాతం ముస్లింలకు అందింది. అన్ని వసతులలాగా ఈ విషయంలోనూ ముస్లింలకు అందుతున్న వాటా వారి జనాభా దామాషా కంటే బాగా తక్కువ.

## సామాజిక, భౌతిక వసతులు

ఈ శీర్షిక కింద సచార్ కమిటీ ముస్లింలకు స్కూళ్ళు, ఆస్పత్రులు తదితర సామాజిక వసతులు, రోడ్లు, కరెంటు, తాగునీరు, రవాణా సదుపాయాలు వగైరా భౌతిక వసతులు ఇతరులతో సమానంగా అందుతున్నాయా లేదా అన్న చర్చ చేసింది. గణాంకాల లభ్యతలోని సమస్యల కారణంగా పల్లెల గురించి మాత్రమే ఒక నిర్ధారణకు రాగలిగింది. ముస్లింలు అధికంగా నివసించే గ్రామీణ ప్రాంతాలలో సామాజిక భౌతిక వసతుల స్థితి సగటు కంటే హీనంగా ఉందని నిర్ధారించింది. పెద్ద గ్రామాలలో సాధారణంగా వసతులు చిన్న గ్రామాల కంటే మెరుగ్గా ఉంటాయి కాబట్టి సచార్ కమిటీ సైజుల వారీగా గ్రామాలను తీసుకుని పరిశీలించింది. 1000 మంది కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామాన్ని చిన్న గ్రామం అని, 1000–2000 లోపు జనాభా ఉన్న గ్రామాలను ఒక మోస్తరు పరిమాణం గల గ్రామం (మోడరేట్) అని, 2000 పైబడిన జనాభా గల గ్రామాన్ని పెద్ద గ్రామం అని మూడు వర్గాలుగా విభజించింది. గ్రామ జనాభాలో ముస్లింల నిష్పత్తిని బట్టి మళ్ళీ మూడుగా విభజించింది – ముస్లింలు 10 శాతంలోపు ఉన్న గ్రామాలు, 10 నుంచి 40 శాతం దాకా ఉన్న గ్రామాలు, 40 శాతం మించి ఉన్న గ్రామాలు.

ఈ విశ్లేషణ ఫలితాలు ఆశ్చర్యం కలిగిస్తాయి. గ్రామంలో స్కూలు ఉండడం, వైద్య సదుపాయం అందుబాట్లో ఉండడం, పోస్టాఫీసు అందుబాట్లో ఉండడం, బస్టాప్ ఉండడం, పక్కా రోడ్డు ఉండడం అనే అయిదు వసతులూ ముస్లింలు తక్కువగా

ఉన్న గ్రామాలలో మెరుగుగాను, ముస్లింలు ఎక్కువగా ఉన్న గ్రామాలలో హీనంగానూ ఉన్నాయి. బడి విషయంలో పెద్ద గ్రామాలలో ఈ తేడా అంతగా కనబడదు గానీ చిన్న గ్రామాలలో కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. 1000 లోపు జనాభా ఉన్న గ్రామాలను తీసుకుంటే వాటిలో ముస్లింలు 10 శాతంలోపు ఉన్న గ్రామాలలో 80 శాతం బడి కలిగి ఉన్నాయి. ముస్లింలు 40 శాతం మించి ఉన్న గ్రామాలలో 69 శాతం మాత్రమే బడి కలిగి ఉన్నాయి. బస్సు వసతి సగటున దాదాపు 40 శాతం గ్రామాలకు ఉండగా, ముస్లింలు 40 శాతం మించి ఉన్న గ్రామాలలో 32 శాతానికి మాత్రమే ఉంది. పెద్ద గ్రామాలలో 67 శాతానికి బస్సు వసతి ఉండగా ముస్లింలు 40 శాతం మించి ఉండే గ్రామాలలో 45 శాతానికి మాత్రమే ఉంది. పక్కా రోడ్డు పెద్ద గ్రామాలలో సగటున 82 శాతానికి ఉండగా, ముస్లింలు 40 శాతం మించి ఉండే గ్రామాలలో 72 శాతానికి మాత్రమే ఉంది. వైద్య వసతి పెద్ద గ్రామాలలో 10 శాతంలోపు ముస్లింలు ఉన్న వాటిలో 75 శాతానికి ఉండగా, ముస్లింలు 40 శాతం మించి ఉన్న గ్రామాలలో 64 శాతానికి మాత్రమే ఉంది. పోస్టు, టెలిగ్రాఫ్ సేవలు పెద్ద గ్రామాలలో ముస్లింల సంఖ్య 10 శాతంలోపు ఉన్న వాటిలో 84 శాతానికి అందుబాట్లో ఉండగా, ముస్లింలు 40 శాతం మించి ఉన్న ఊర్లలో 63 శాతానికి మాత్రమే అందుబాట్లో ఉన్నాయి. పెద్ద గ్రామాల విషయంలో కనిపించిన ఈ తేడాలన్నీ ఒక మోస్తరు గ్రామాలలోనూ కనిపిస్తాయి. చిన్న ఊర్లలో ఎట్లాగూ ఈ వసతులు ఎక్కువ ఉండవు కాబట్టి ఈ తేడా అంతగా కనిపించదు.

రాష్ట్రాల వారీగా తీసుకుంటే ముస్లింలు అధికంగా నివసించే గ్రామీణ ప్రాంతాలలో విద్యా వ్యవస్థ హీనంగా ఉన్న ఘనత పశ్చిమబెంగాల్, బీహార్‌లకు దక్కుతుంది. వైద్య వ్యవస్థ విషయంలో ఈ ఘనత అస్సాం, జమ్మూకాశ్మీర్, పశ్చిమ బెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్‌లకు దక్కుతుంది. పోస్టు, టెలిగ్రాఫ్ సదుపాయాల విషయంలో ఇవే రాష్ట్రాలలో ముస్లింల జనాభా అధికంగా ఉన్న ప్రాంతాలలో వసతులు కడుహీనంగా ఉన్నాయి. పక్కా రోడ్ల విషయంలోనూ ఈ రాష్ట్రాలే ప్రధాన దోషులుగా నిలబడతాయి – జార్ఖండ్‌తో బాటు. అన్ని విషయాలలోనూ దక్షిణ భారత రాష్ట్రాలు, మహారాష్ట్ర పరిస్థితి సాపేక్షంగా నయం.

కరెంటు వాడకం విషయమూ అంతే. కరెంటు వాడకాన్ని బట్టి గ్రామాలను సచార్ కమిటీ ఆరు వర్గాలుగా విభజించింది. అసలే కరెంటు లేని గ్రామాలు ఒక

చివర, 90 శాతం పైగా నివాసాలకు కరెంటు ఉన్న గ్రామాలు ఆ చివర పెట్టి మధ్యలో నాలుగు వర్గాలు చేశారు. అసలే కరెంటు లేని గ్రామాలలో ముస్లింల జనాభా గ్రామ జనాభాలో దాదాపు 10 శాతం ఉంది. 90 శాతం పైగా నివాసాలకు కరెంటు ఉన్న గ్రామాలలో ముస్లింల జనాభా 5 శాతం ఉంది. ముస్లిం జనాభా నిష్పత్తి తగ్గే కొద్దీ అదే వరసలో విద్యుదీకరణ పెరగడం కనిపిస్తుంది. ఇదే విషయాన్ని ఇంకొక రకంగా చూడవచ్చు. దేశంలో చిన్న గ్రామాలలో (1000 లోపు జనాభా కలిగినవి) అసలే కరెంటు లేనివి 29 శాతం దాకా ఉండగా, ముస్లిం జనాభా 40 శాతం మించి ఉన్న చిన్న గ్రామాలలో దాదాపు 40 శాతం కరెంటు లేనివి. ఒక మోస్తరు (1000 నుంచి 2000 వేల జనాభా కలిగిన) గ్రామాలలో కరెంటు లేనివి 14 శాతం కాగా, ముస్లింల జనాభా 40 శాతం మించి ఉన్న ఒక మోస్తరు గ్రామాలలో కరెంటు లేనివి 23 శాతం. పెద్ద గ్రామాలలో (2000 పైబడిన జనాభా కలిగినవి) అసలే కరెంటు లేనివి 5 శాతం కాగా, ముస్లిం జనాభా 40 శాతం మించి ఉన్న పెద్ద గ్రామాలలో అసలే కరెంటు లేనివి 10 శాతం.

రక్షిత మంచినీటి లభ్యతలో పట్టణ ప్రాంతాలలో ముస్లింలు సగటు కంటే కొంచెం మాత్రమే వెనుకబడి ఉన్నారు కానీ గ్రామీణ భారతంలో 25 శాతం జనాభాకు రక్షిత మంచినీరు అందుబాట్లో ఉండగా, ముస్లింలలో 15 శాతానికి మాత్రమే ఉంది.

ఇళ్ళు, టాయిలెట్ల విషయంలో మాత్రమే ముస్లింల స్థితి అంత హీనంగా లేదు. పక్కా ఇళ్ళు కలిగి ఉండే విషయంలో ముస్లింల స్థితి సగటు కుటుంబం స్థితితో సమానం. ఒక్క హిందూ అగ్రకులాలు మాత్రమే వారి కంటే మెరుగైన స్థితిలో ఉన్నారు. టాయిలెట్లు కలిగి ఉండే విషయంలో హిందూ అగ్రకులాల కంటే కూడ ముస్లిం గృహాలది మెరుగైన స్థితి. ప్రైవసీకి, ముఖ్యంగా స్త్రీల విషయంలో, ముస్లింలు సాంస్కృతికంగా ఇచ్చే విలువ దీనికి కారణం అయి ఉంటుందని సచార్ కమిటీ వ్యాఖ్యానించింది. అయితే పేదరికం అధికంగా ఉన్న సామాజిక వర్గం ఒకే వసతి మీద ఇంత ఖర్చు పెడితే వేరే ఎక్కడో చాలా కోల్పోతూ ఉంటుందనేది విదితమే.

మొత్తానికి భారతదేశంలో ముస్లింలు సామాజిక భౌతిక వసతులు హీనంగా ఉన్న ఒక ఉపప్రదేశంలోకి నెట్టబడ్డారని వ్యాఖ్యానించడం అతిశయోక్తి కాబోదు.

## పేదరికం

ఆర్థిక స్థోమతను ఆదాయంతో కొలవవచ్చు, ఖర్చుతోనూ కొలవవచ్చు. పేదల ఆదాయమూ తక్కువ ఉంటుంది, వారు చేసే ఖర్చూ తక్కువ ఉంటుంది. సచార్ కమిటీ వివిధ సామాజిక వర్గాలలో పేదరికాన్ని పోల్చడానికి నెలవారీ తలసరి సగటు ఖర్చును ప్రమాణంగా తీసుకుంది. 2004-2005 లెక్కల ప్రకారం హిందూ అగ్రకులాలలో తలసరి నెలరోజుల ఖర్చు 1023 రూపాయలు ఉండగా, బిసిలలో 646 రూపాయలు, ముస్లింలలో 635 రూపాయలు, ఎస్‌సి, ఎస్‌టిలలో 520 రూపాయలు. కాని పట్టణ ప్రాంతాలను విడిగా తీసుకుంటే ముస్లింలు ఎస్‌సి, ఎస్‌టిలతో సమానం. ఇద్దరి తలసరి నెల రోజుల ఖర్చు 800 రూపాయలు. బిసిలలో అది 950 రూపాయలు, అగ్రకులాలలో 1470 రూపాయలు ఉంది. పట్టణం చిన్నదైన కొద్దీ ముస్లింల స్థితి మరింత దిగజారడం కనిపిస్తుంది. జనాభా 50 వేలకు తక్కువ ఉన్న ఊర్లలో ముస్లింలలో నెలరోజుల తలసరి ఖర్చు ఎస్‌సి, ఎస్‌టిల కంటే తక్కువ.

పట్టణ ప్రాంత ముస్లింలలో అంతర్గత అసమానత కూడ ఎక్కువే. పట్టణ ప్రాంత పేదరికం ముస్లింలలో ఎస్‌సి, ఎస్‌టిలతో సమానంగా ఉందని చెప్పుకున్నాం. అయితే బాగా పేద వర్గాలలో ముస్లింల నిష్పత్తి ఎక్కువ. నెలకు తలసరి 350 రూపాయల ఖర్చుతో బతికే ముస్లింలు పట్టణ ప్రాంత జనాభాలో 17 శాతం. అదే నిష్పత్తి ఎస్‌సి, ఎస్‌టిలలో 15.7 శాతం. ధనిక వర్గాలలో ఇద్దరి స్థానమూ ఒకటే. మధ్యస్తంగా ఉండేవారు ముస్లింలలో కొంచెం తక్కువ, ఎస్‌సి, ఎస్‌టిలలో కొంచెం ఎక్కువ.

రాష్ట్రాల వారీ గణాంకాలూ ఇదే వాస్తవాన్ని చూపిస్తాయి. అయితే పశ్చిమ బెంగాల్, బీహార్, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ పట్టణ ప్రాంతాలలో ముస్లింలలో తలసరి ఆదాయం ఎస్‌సి, ఎస్‌టిల కంటే తక్కువ. అయితే అన్ని చోట్లా గ్రామీణ ప్రాంతాలలో ముస్లింల స్థితి ఎస్‌సి, ఎస్‌టిల కంటే సాపేక్షంగా మెరుగైనదే.

దరిద్రరేఖకు దిగువన ఉన్న జనాభా నిష్పత్తి కూడ ఇదే చిత్రాన్ని ఇస్తుంది. 2004 - 2005 లెక్కలలో భారతదేశంలో దరిద్రరేఖకు దిగువన ఉన్న జనాభా నిష్పత్తి 22.7 శాతం. అగ్రకులాలలో ఇది 8.7 శాతం, బిసిలలో 21 శాతం, ముస్లింలలో 31 శాతం, ఎస్‌సి, ఎస్‌టిలలో 35 శాతం. మళ్ళీ పట్టణ ప్రాంతాలలో ఎస్‌సి, ఎస్‌టిల

కంటే కూడ ముస్లింలలోనే నిరుపేదలు ఎక్కువ. దరిద్రరేఖకు దిగువన ఉండే పట్టణ ప్రాంత జనాభా నిష్పత్తి ఎస్‌సి, ఎస్‌టిలో 36.4 శాతం కాగా, ముస్లింలలో 38.4 శాతం. అయితే దరిద్రరేఖ అనేది పేదలెందరు అనే విషయం చెప్తుంది తప్ప వాళ్ళు ఎంత పేదగా ఉన్నారని చెప్పదు. దరిద్రరేఖకు దిగువన ఉన్నవారు ఎంత దిగువన ఉన్నారో చూడడం కూడ సమగ్ర పరిశీలనకు అవసరం. దీనికొక మార్గం, దరిద్రరేఖకు దిగువన ఉన్నవారు, సగటున ఆ రేఖను సూచించే ఆదాయంలో ఎంత శాతం (సగం, ముప్పావు వగైరా) ఆదాయం కలిగి ఉన్నారో లెక్కించడం. ఈ లెక్క తీస్తే, పట్టణ ప్రాంతాలలో దరిద్రరేఖకు దిగువన ఉన్న ముస్లింలు సగటున దరిద్రరేఖను సూచించే ఆదాయంలో 77 శాతం ఆదాయం కలిగి ఉండగా, ఎస్‌సి, ఎస్‌టిలలో ఆ నిష్పత్తి 76 శాతం.

అన్ని సామాజిక వర్గాలలాగా ముస్లింలలో కూడ కాలక్రమంలో దరిద్రరేఖకు దిగువన ఉన్నవారి సంఖ్య తగ్గుతున్నది. అయితే ముస్లింలలో ఈ తగ్గుదల గ్రామీణ ప్రాంతాలలో ఉన్నంత పట్టణాలలో లేకపోవడం వల్ల, ముస్లింలలో పేదరికం పట్టణాలలో కేంద్రీకృతమై ఉందని సచార్ కమిటీ విశ్లేషించింది.

## ప్రభుత్వ ఉద్యోగాలు

మంచి జీతాలు, భద్రత, హోదాల కారణంగా చాలామంది ఇప్పటికీ ప్రభుత్వ ఉద్యోగాలను కాంక్షిస్తారని చెప్తూ ముస్లింలు ఈ రంగంలో ఎంతమేరకు ఉన్నారన్న విశ్లేషణ సచార్ కమిటీ చేపట్టింది. ఇక్కడ ప్రభుత్వ ఉద్యోగాలు అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల శాఖలలోని ఉద్యోగాలే కాక ప్రభుత్వరంగ సంస్థలలోని ఉద్యోగాలు కూడా. అన్నిచోట్లా ముస్లింలు తమ జనాభా నిష్పత్తి కంటే చాలా తక్కువ ఉన్న విషయం సచార్ కమిటీ బయట పెట్టింది.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ముస్లింలు 6.3 శాతం ఉన్నారు. రైల్వేలో 4.5 శాతం, బ్యాంకులలో 2.2 శాతం, పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో 5 శాతం, భద్రతా సంస్థలలో 3.2 శాతం, విశ్వవిద్యాలయాలలో 4.7 శాతం ఉన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో మొత్తం 4.9 శాతం ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలలో 3.3 శాతం, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో 10.8 శాతం ఉన్నారు. ఇందులో ఈ చివరి సంఖ్య ఒక్కటే జనాభాలో ముస్లింల దామాషా అయిన 13.4 శాతానికి కొంచెమైనా దగ్గరకొస్తుంది.

ఐఎఎస్‌లో ముస్లింలు 3 శాతం, ఐపిఎస్‌లో 4 శాతం ఉన్నారు. అందులో అనివార్యమైన ప్రమోషన్ మీద ఐఎయస్, ఐపియస్ హోదా పొందిన వారిని మినహాయించి సివిల్ సర్వీసెస్ పరీక్ష రాసి ఐఎయస్, ఐపియస్ హోదా పొందిన వారిని మాత్రమే లెక్కిస్తే ముస్లింలలో వారు 2.4 శాతం, 2.3 శాతం మాత్రమే. ఒక్క ఐఎయస్, ఐపియస్‌లే కాక యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే పరీక్షల ద్వారా ఎంపిక చేసే అన్ని సర్వీసుల స్థితీ ఇదే. 2003, 2004లలో ఈ పరీక్షలు రాసిన వారిలో 4.9 శాతం మాత్రమే ముస్లింలు. చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే పరీక్షలు రాసిన వారిలో ఉత్తీర్ణులైన వారి నిష్పత్తి అగ్రకులాలతో సమానంగా ఉంది. అంటే ఉన్నతస్థాయి పరీక్షలు, పదవులు అందుకోగలిగితే ముస్లింలు అందరిలాగా రాణించగలరు – అందుకోలేకపోవడమే సమస్య.

వివిధ ప్రభుత్వ శాఖలలో ముస్లింలు ఉన్నదే తక్కువంటే ఆ ఇంత కూడ కిందిస్థాయి ఉద్యోగాలలోనే తప్ప పై స్థాయి ఉద్యోగాలలో కాదు. 14 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించే రైల్వేలో ముస్లింలు 4.5 శాతం మాత్రమే కాగా అందులో 98.7 శాతం గ్రూప్ సి, గ్రూప్ డి పోస్టులలో ఉన్నారు. 1.3 శాతం మాత్రమే గ్రూప్–ఎ, గ్రూప్ బి (అంటే ఆఫీసర్) పోస్టులలో ఉన్నారు.

ఈ విషయాన్ని ఇంకొక కోణం నుంచి కూడ చూడవచ్చు. రైల్వేలోని గ్రూప్ ఎ పోస్టులలో 72 శాతం సవర్ణ హిందువులు, 18 శాతం ఎస్‌సి, ఎస్‌టిలు ఉండగా కేవలం 3 శాతం ముస్లింలున్నారు. కింది స్థాయి ఉద్యోగాల కొచ్చేసరికి వాటి సంఖ్య చాలా ఎక్కువ కాబట్టి ముస్లింల సంఖ్య ఎక్కువే ఉంది గానీ ఆ స్థాయిలోనూ ముస్లింల వాటా 5 శాతమే. అంటే ఏ స్థాయిలోనూ వారి వాటా జనాభాలో వారి వాటాతో పోల్చదగ్గది కాదు. ఆ ఉన్న కొద్దిమంది కూడ నూటికి 98.7 నిష్పత్తిలో కింది స్థాయి పోస్టులలోనే ఉన్నారు.

అన్ని సర్వీసుల విషయమూ అంతే. కేంద్ర పారామిలటరీ బలగాలైన బి.ఎస్.ఎఫ్, సి.ఆర్.పి.ఎఫ్, సి.ఐ.ఎస్.ఎఫ్, సశస్త్ర సీమాబల్ లలో ముస్లింల వాటా పై స్థాయి ఉద్యోగాలలో 3.6 శాతం, కింది స్థాయి ఉద్యోగాలలో 4.6 శాతం. రెండు స్థాయిలలోనూ వారి వాటా వారి జనాభా నిష్పత్తి కంటే బాగా తక్కువే. కానీ ఉన్న వారిలో 96 శాతం కిందిస్థాయి ఉద్యోగాలలోనే ఉన్నారు.

విశ్వవిద్యాలయాలలోని బోధన, బోధనేతర సిబ్బంది గణాంకాలను కూడ సచార్ కమిటీ సేకరించింది. బోధన సిబ్బందిలో అగ్రకులాలు 45 శాతం ఉండగా బోధనేతర సిబ్బందిలో 47 శాతం ఉన్నారు. బిసిలు బోధన సిబ్బందిలో 35 శాతం దాకా ఉండగా బోధనేతర సిబ్బందిలో 18 శాతం ఉన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలు బోధన సిబ్బందిలో 7.4 శాతం, బోధనేతర సిబ్బందిలో 16.9 శాతం ఉన్నారు. ముస్లింలు బోధన సిబ్బందిలో 3.7 శాతం, బోధనేతర సిబ్బందిలో 5.4 శాతం ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలలోని ఉన్నత స్థాయి మేనేజర్ హోదాలో హిందూ అగ్రకులాలు 70 శాతం దాకా ఉండగా రిజర్వేషన్ పుణ్యాన ఎస్‌సి, ఎస్‌టిలు 20 శాతం ఉన్నారు. రిజర్వేషన్లు లేని బిసిలు, ముస్లింలు చెరి 3 శాతం ఉన్నారు. హోదాలో కింది కొచ్చే కొద్దీ బిసిల సంఖ్య కొద్దిగాను, ఎస్‌సి, ఎస్‌టిల సంఖ్య గణనీయంగానూ పెరగడం కనిపిస్తుందిగానీ అతి తక్కువ హోదాలో సహితం ముస్లింలు 5 శాతం మించి లేరు.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలోనూ ఇదే చిత్రం. ఏ రాష్ట్రంలోను (జమ్ము కాశ్మీర్‌తో సహా) ముస్లింల భాగస్వామ్యం వారి జనాభా దామాషాతో సమానం కాదు. నాలుగు రాష్ట్రాలలో తప్ప (పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్) వేరే ఎక్కడా అందులో సగం కూడ లేదు. అన్ని రాష్ట్రాల కంటే మెరుగైన ఆంధ్రప్రదేశ్‌లో సైతం జనాభాలో ముస్లింలు 9.2 శాతం కాగా ప్రభుత్వ ఉద్యోగులలో వారి నిష్పత్తి 5.6 శాతం! బహుశా అన్నిటి కంటే ఆశ్చర్యం కలిగించేది జమ్ము కాశ్మీర్ పరిస్థితి. ఆ రాష్ట్ర జనాభాలో ముస్లింలు 68 శాతం కాగా, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులలో ముస్లింలు కేవలం 18.1 శాతం. (ఇవి కాశ్మీర్ లోయకు సంబంధించిన గణాంకాలు కావు, మొత్తం రాష్ట్రానికి సంబంధించినవి).

రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో ఉద్యోగాలు కాక రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో ఉద్యోగాలను తీసుకుంటే పరిస్థితి కొంచెం మెరుగుగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో ముస్లిం సిబ్బంది 10.7 శాతం. ఇది సైతం జనాభాలో వారి వాటా కంటే తక్కువే అయినా ఇతర రంగాలకు సంబంధించిన గణాంకాలంత హీనంగా లేదు. గుజరాత్, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో ముస్లింల వాటా జనాభాలో వారి వాటా కంటే కొంచెం ఎక్కువ.

## సంక్షేమ పథకాలు

వివిధ సామాజిక వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలుచేసే విషయం తెలిసిందే. పేదలు, చిన్న పిల్లలు, మహిళలు, రైతులు మొదలైన వర్గాల కోసం చేపట్టే ఈ పథకాలు ఆయా వర్గాలలోని ముస్లిం ప్రజానీకానికి ఎంతమేరకు అందుతున్నాయన్న సమాచారం సేకరించడానికి సచార్ కమిటీ ప్రయత్నించింది. అయితే లబ్ధిదారుల మతాన్ని నమోదు చేయని కారణంగా ఈ సమాచారం అన్ని రాష్ట్రాల నుంచి లభ్యం కాకపోవడం వల్ల పాక్షికమైన చిత్రం మాత్రమే ఇవ్వగలిగారు.

కేరళలో దరిద్రరేఖకు దిగువన ఉన్న పేదలలో ముస్లింలు 30.7 శాతం. కానీ పేదల కోసం ఉద్దేశించిన ఏ పథకంలోనూ ముస్లిం లబ్ధిదారులు 30 శాతం కూడ లేరు. గ్రామీణ అభివృద్ధి శాఖ చేపట్టే స్కీంలలో 12 శాతం ముస్లింలకు లభిస్తున్నాయి. తక్కిన పథకాల లబ్ధిదారులలో ముస్లింలు 5 నుంచి 18 శాతం దాకా ఉన్నారు. సహకార సంస్థల రుణాల లబ్ధిదారులలో మాత్రం 25 శాతం ఉన్నారు.

ఉత్తరప్రదేశ్‌లో పేదలలో 23.6 శాతం ముస్లింలు కాగా పేదల కోసం ఉద్దేశించిన వివిధ పథకాలలో ముస్లిం లబ్ధిదారుల వాటా 3 నుంచి 14 శాతం దాకానే ఉంది. స్వర్ణ జయంతి ఉపాధి పథకంలో అత్యధికంగా 16 శాతం ఉంది.

అంగన్‌వాడీల స్థాపన బడికి పోయే వయసు లేని పిల్లలకు ఆటపాటలు నేర్పడానికి ఉద్దేశించబడింది. ఆ వయసు పిల్లలకు పౌష్టికాహారం అందించడం కూడా ఆ వ్యవస్థ లక్ష్యాలలో ఒకటి. ఇది సమగ్ర శిశు అభివృద్ధి సేవ (ఐసిడిఎస్) అనే ప్రోగ్రాం ద్వారా అమలవుతుంది. పేదరికం అధికంగా ఉన్న సామాజిక వర్గాల పిల్లలకు ఇది చాలా ఉపయోగకరంగా ఉండగల పథకం. ఈ పథకం 11 శాతం మేరకే అమలవుతున్నదని (అంటే అందవలసిన పిల్లలలో 11 శాతానికి మాత్రమే అందు తున్నదని) సచార్ కమిటీ వ్యాఖ్యానిస్తూ, అందులోనూ ముస్లింల వాటా ఇతర వెనుకబడిన సామాజిక వర్గాలతో పోలిస్తే హీనంగా ఉందని అనింది. బిసిలలో అర్హులైన పిల్లలలో 13 శాతానికి ఐసిడిఎస్ సేవలు అందుతుండగా ఎస్‌సి ఎస్‌టిలలో 10 శాతానికి, ముస్లింలలో 8 శాతానికి మాత్రమే అందుతున్నదని 2004-2005

గణాంకాలు తెలుపుతున్నాయి. ఇక్కడ కూడ మళ్ళీ 'హిందీ రాష్ట్రాల' పరిస్థితి మరీ హీనం. ఆ రాష్ట్రాలలో అంగన్‌వాడి సేవలు అర్హులైన పిల్లలలో 3 శాతానికి మాత్రమే అందుతున్నాయి.

పౌష్టికాహారానికి మరొక ఆధారమైన మధ్యాహ్న భోజన పథకం స్థితీ ఇంతే. ఆ పథకం ప్రభుత్వ స్కూళ్ళకే తప్ప ప్రైవేటు విద్యాసంస్థలకు వర్తించదు. మొత్తం స్కూలుకు పోగల వయసున్న పిల్లలలో (అంటే 6 నుంచి 16 సంవత్సరాలలోపు వయసున్న పిల్లలలో) 27 శాతం మధ్యాహ్న భోజన పథకం నుంచి ప్రయోజనం పొందుతున్నారు. అయితే ఎస్‌సి ఎస్‌టిలలో ఈ నిష్పత్తి 35 శాతం ఉండగా, బిసిలలో 28 శాతం, ముస్లింలలో 23 శాతం ఉంది.

మైనారిటీల అభ్యున్నతి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నెలకొల్పిన వివిధ సంస్థలున్నాయి. వాటి గురించి సచార్ కమిషన్ కొంత చర్చ చేసింది. వాటి వలన కొంత ఉపయోగం ఉన్నప్పటికీ వాటికి కేటాయిస్తున్న నిధులు నామమాత్రం కావడం వల్ల అవి తమ లక్ష్యాన్ని సాధించలేకపోతున్నాయని సచార్ కమిషన్ నిర్ధారించింది.

## రిజర్వేషన్లు, ఇతర ప్రత్యేక హక్కులు

భారతదేశంలో ముస్లింల సామాజిక ఆర్థిక స్థితిగతుల గురించి వివరమైన చిత్రాన్ని ఇచ్చిన పిదప, ఈ వెనుకబాటుతనాన్ని అధిగమించడానికి ప్రత్యేకమైన చర్యలేవైనా ప్రభుత్వాలు చేపట్టాయా అన్న ప్రశ్న సచార్ కమిటీ వేసుకుంది. అన్ని రంగాలలోనూ ముస్లిం ప్రజానీకం హిందూ అగ్రకులాల కంటే బాగా వెనుకబడి ఉన్నారనీ, బిసిలకు సంబంధించి విడిగా సమాచారం ఉన్న రంగాలలో బిసిల కంటే కూడ వెనుకబడి ఉన్నారనీ, ఎస్‌సి, ఎస్‌టిలకు సన్నిహితంగా ఉన్నారనీ ఈ చిత్రం చెబుతుంది. మొదట్లో చెప్పినట్టు, ఎస్‌టి, ఎస్‌టిలను కలగలపకుండా వేరుచేసి పరిశీలించి ఉంటే, ఎస్‌సిలు చాలా విషయాలలో ఎస్‌టిల కంటే సాపేక్షంగా మెరుగుగా ఉంటారు కాబట్టి ముస్లింల స్థితి ఎస్‌సిల స్థితికి మరింత సన్నిహితం అనే విషయం స్పష్టం అయి ఉండేది.

అయితే బిసిలకూ ఎస్‌సి, ఎస్‌టిలకూ సమాన అవకాశాలు కల్పించే దిశగా రిజర్వేషన్లు, స్కాలర్ షిప్పులు, ప్రత్యేక హాస్టళ్ళు, ఆశ్రమ పాఠశాలలు మొదలైన హక్కులూ

వసతులూ కల్పించిన ప్రభుత్వాలు ముస్లింల విషయంలో అటువంటి చొరవ తగురీతిలో తీసుకోలేదు. అందువల్ల తమ స్థితి నుంచి బయటపడడానికి స్వశక్తి తప్ప ముస్లింలకు వేరే ఆసరా లేకుండా ఉంది. వారి స్వంత శక్తి చాలని కారణంగా వారి స్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టు ఉంది.

విద్యా ఉద్యోగ రిజర్వేషన్లు అసమాన అవకాశాలను అధిగమించడానికొక ముఖ్యసాధనం కాబట్టి ఈ ప్రయత్నం వివిధ రాష్ట్రాలలో ఏ మేరకు జరిగిందన్న విశ్లేషణ సచార్ కమిటీ చేపట్టింది. భారతదేశంలోని ముస్లింలలో నాలుగు చారిత్రక స్రవంతులకు చెందిన వారున్నారు. కొందరు విదేశాల నుంచి వచ్చిన ముస్లింల సంతతిగా తమను తాము భావిస్తారు. కొందరు మతం మార్చుకున్న హిందూ అగ్రకులాల వారి సంతతి. కొందరు వివిధ ఉత్పాదక వృత్తులకు చెందిన వారు. ఇందులో చాలావరకు హిందూ బిసి కులాల నుంచి మత మార్పిడి ద్వారా ముస్లింలైన వారే. చివరివర్గం అంటరాని కులాల నుంచి, ఆదివాసుల నుంచి ముస్లింలైనవారు. ఉత్తర భారతదేశంలో ఇందులో మొదటి రెండు వర్గాలకు చెందిన వారిని అష్రాఫ్ అనీ, మూడవ వర్గానికి చెందిన వారిని అజ్లాఫ్ అనీ, నాలుగవ వర్గానికి చెందిన వారిని అర్జాల్ అనీ వ్యవహరిస్తున్నారని సచార్ కమిటీ తెలిపింది. దేశంలోని అన్ని ప్రాంతాలలోనూ ఈ రకమైన వర్గీకరణ వ్యవహారంలో లేకపోవచ్చును గానీ సమకాలీన ముస్లిం ప్రజానీకం పై నాలుగు స్రవంతుల నుంచి రూపొందిన వారేనని చెప్పుకోవచ్చు.

ఇందులో చివరి వారికి ఎస్‌సిలుగా గుర్తింపు ఇవ్వడం ఉచితంగా ఉంటుందనీ, అట్లా జరగకపోవడం వారికి అన్యాయం చేసిందనీ సచార్ కమిటీ భావించింది. అయితే ఇవ్వాళ ఎస్‌సిగా ఉండి ముస్లింగా మతం మార్పిడి చేసుకున్న వ్యక్తి సహితం ఎస్‌సి గుర్తింపు కోల్పోతున్న పరిస్థితిలో, చారిత్రకంగా అంటరాని ప్రజానీకంలో భాగంగా ఉండి ఇస్లాం స్వీకరించిన వారిని ఎస్‌సిలుగా గుర్తించాలన్న కోరిక తీరడం రాజకీయంగా కష్టం కావచ్చు. ఆ కారణంగా, ముస్లింలలో సామాజిక ఆర్థిక వెనుకబాటుతనాన్ని గుర్తించటం అంటూ జరిగిన రాష్ట్రాలలో సైతం ఎస్‌సిలుగా ఉండవలసిన ముస్లిం వర్గాలు బిసి జాబితాలో ఉన్నారు. ఎస్‌సిలలో కాకపోతే కనీసం 'అత్యంత వెనుకబడిన వర్గాల' (ఎంబిసి) జాబితాను సృష్టించి దాని కోటా విడిగా కల్పించి వీరిని అందులో చేర్చాలని సచార్ కమిటీ అభిప్రాయపడింది.

ఇక రిజర్వేషన్ల విషయంలో ఉనికిలో ఉన్న పరిస్థితి ఏమిటో చూద్దాం. కేరళ కర్ణాటక రాష్ట్రాలు ముస్లింలను మొత్తంగానే బిసిలుగా గుర్తించి ఇతర బిసి వర్గాలతో బాటు రిజర్వేషన్లు ఇస్తున్నాయి. తమిళనాడు రాష్ట్రం ముస్లింలలో దాదాపు 95 శాతాన్ని బిసిలుగా గుర్తించింది. ఆంధ్రప్రదేశ్ కొంతకాలం ముస్లింలలో కొద్దిమందిని మాత్రం బిసిలుగా గుర్తించింది. ఈ మధ్య ముస్లింలందరినీ బిసి జాబితాలో చేర్చాలని ప్రయత్నించి రెండుసార్లు కోర్టులో ఓడిపోయింది. ప్రస్తుతం ముస్లింలలో అందరినీ కాక అధికభాగాన్ని బిసిలుగా గుర్తించే చట్టాన్ని జారీచేసింది. అది కూడా కోర్టు లిటిగేషన్లో నలుగుతూ ఉంది.

ఇతర రాష్ట్రాల విషయానికొస్తే ముస్లింలలో కొన్ని వర్గాలను బిసిలుగా గుర్తించి రాష్ట్ర బిసి జాబితాలో చేర్చిన రాష్ట్రాలు చాలా ఉన్నాయి. ఉత్తరాంచల్, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్, అస్సాం, హిమాచల్ ప్రదేశ్‌లలో అతి కొద్ది ముస్లిం వర్గాలు మాత్రమే బిసిలుగా గుర్తింపు పొందారు. పంజాబ్‌లో, ఛత్తీస్‌గఢ్‌లో ముస్లింలెవ్వరూ బిసిలు కారు. బీహార్, మహరాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో చెప్పుకోదగ్గ సంఖ్యలో ముస్లిం ఉపవర్గాలు బిసి జాబితాలో చేర్చబడ్డాయి. మొత్తంగా భారతదేశ ముస్లింలలో 40.7 శాతం బిసిలుగా గుర్తించబడ్డ వర్గాలలో ఉన్నారనీ, దేశంలోని బిసి జనాభాలో వారు 15.7 శాతం అనీ సచార్ కమిటీ తెలిపింది.

నిజానికి ముస్లింల స్థితిగతుల గురించి సచార్ కమిటీ వెలువరించిన వాస్తవాలను దృష్టిలో ఉంచుకున్నట్టయితే ముస్లింలు మొత్తంగానే – పిడికెడు నవాబీ కుటుంబాలను మినహాయించి – రిజర్వేషన్లకు అర్హులై ఉండాలి. అన్ని విషయాలలోనూ ముస్లింలు హిందు బిసిల కంటే వెనుకబడి ఉండగా, వీరిలో వంద శాతమూ రిజర్వేషన్లు పొందుతుండగా, వారిలో కేవలం 40.7 శాతం మాత్రమే అర్హులెట్లా అవుతారు?

ఈ సందర్భంగా సచార్ కమిటీ వ్యక్తపరచిన అభిప్రాయాన్ని మొత్తంగా ఉటంకించడం ఉచితంగా ఉంటుంది. ముస్లిం సమాజంలో వారు అష్రాఫ్, అజ్లాఫ్, అర్జాల్ అన్న మూడు వర్గాలను – చారిత్రక మూలాల ఆధారంగా గుర్తించిన సంగతి చూశాము. ఆ ప్రాతిపదిక మీదనే ముస్లింలకు రిజర్వేషన్లు, ఇతర ప్రత్యేక హక్కులు కల్పించాలని సచార్ కమిటీ అభిప్రాయపడింది:

*సామాజిక నిర్మాణం ప్రాతిపదికన ముస్లింలలో మూడు వర్గాలను గుర్తించవచ్చును – అష్రాఫ్, అజ్లాఫ్, అర్జాల్ అనేవి ఈ మూడు. ఈ మూడు వర్గాలకు భిన్నమైన చర్యలు అవసరం. రెండవ వర్గమైన అజ్లాఫ్ బిసిలకు ప్రత్యేక హక్కులు అవసరం. అవి హిందూ బిసిల హక్కులను పోలి ఉండాలి. ఎస్‌సిలతో పోల్చదగ్గ సంప్రదాయ వృత్తులు కలిగిన మూడవ వర్గం అణచివేత దొంతర కింద నలుగుతున్నారు కాబట్టి వారి అభ్యున్నతికి బహుముఖమైన చర్యలు అవసరం. రిజర్వేషన్లు వాటిలో ఒకటి. వీరిని అత్యంత వెనుకబడిన వర్గం (ఎంబిసి)గా గుర్తించాలి.*

## ప్రభుత్వం ఏం చేయాలి?

మైనారిటీ వర్గాలకు సామాజిక ఆర్థిక న్యాయం అన్నదొక్కటే కాక సాంస్కృతిక గుర్తింపు, భద్రత అనేవి కూడా సమస్యలుగానే ఉంటాయని చెప్తూ, తమ కమిటీని పరిశీలించమన్నది సామాజిక ఆర్థిక అసమానతలను మాత్రమే కాబట్టి వాటికే పరిమితం అయ్యామని సచార్ కమిటీ ముగింపు అధ్యాయంలో అనింది.

ఈ అసమానతకు కారణం ఉద్దేశ్యపూర్వకమైన వివక్ష అని ముస్లింలు భావిస్తున్నారనీ, ఆ నిరసన వల్ల సమస్య మరింత జటిలం అయిందనీ కూడ అనింది. అయితే ఉద్దేశ్యపూర్వకమైన వివక్ష నిజంగా ఉందా లేదా అన్న ప్రశ్న వేసుకోలేదు, జవాబు వెతకలేదు. ముస్లింల స్థితి చాలా దయనీయంగా ఉందని తెలిపే సమాచారాన్ని విశ్లేషణాత్మకంగా వెలికితీసి బయటపెట్టిన సందర్భాలలో కూడ వారిని ఉద్దేశ్య పూర్వకంగా భారత సమాజం, పాలకులు ఆ స్థితిలోకి నెట్టారా లేక ఎవరి దురుద్దేశాలతో నిమిత్తం లేకుండా చారిత్రక కారణాల వల్ల అట్లా జరిగిపోయిందా అన్న చర్చకు సచార్ కమిటీ కావాలనే దూరం ఉండిపోయింది. ఆ చర్చ పెట్టుకోవడం ముస్లిం ప్రజానీకం స్థితిగతులను వాస్తవికంగా గుర్తించి మెరుగుపరచగల చర్యలను సూచించే తక్షణ కర్తవ్యానికి నష్టకరం అని భావించారేమో.

వైవిధ్యాన్ని గౌరవిస్తూ, ముస్లింలను అభివృద్ధి ప్రవంతిలోకి తీసుకొచ్చే విధానాలు రచించే ఆవశ్యకతను సచార్ కమిటీ నొక్కి చెప్పింది. దీని కోసం అనేక సూచనలు చేసింది.

## 1. జాతీయ సమాచార బ్యాంకు

ప్రజా జీవితానికీ, పరిపాలనకూ సంబంధించిన సమాచారం సామాజిక వర్గాల వారీగా లభ్యం కాకపోవడం వల్ల వివిధ సామాజిక వర్గాల స్థితిగతులు, వారికి ప్రభుత్వం ఎంత చేస్తున్నది మొదలైన విషయాలు తెలియడం కష్టంగా ఉంది. ఎస్‌సి ఎస్‌టిల విషయంలో కొంత మేరకు సమాచారం దొరుకుతున్నది గానీ బిసిలు, ముస్లింల విషయంలో సమాచారం దొరకడం లేదు. వివిధ సామాజిక వర్గాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి ఒక జాతీయ సమాచార బ్యాంకులో పొందుపరచాలని సచార్ కమిటీ సూచించింది. ఇందులో వారి స్థితిగతుల గురించే కాక ప్రభుత్వ పథకాలు వారికి ఏ మేరకు అందుతున్నాయి, ఎంతమంది ప్రయోజనం పొందుతున్నారు ఇత్యాది విషయాలు కూడ పొందుపరచాలి.

## 2. పర్యవేక్షక కమిటీ

ఈ సమాచారం అందుబాట్లోకి వచ్చినట్టయితే ప్రభుత్వ పథకాల పర్యవేక్షణ సులభతరం అవుతుంది. దాని కోసం కేవలం ప్రభుత్వ అధికారులే కాక విద్యావంతులు, పౌరసంస్థల బాధ్యులు కూడ సభ్యులుగా ఉన్న పర్యవేక్షక కమిటీలను నెలకొల్పి వ్యవస్థీకరించాలి. ఎప్పటికప్పుడు ప్రభుత్వ పథకాలు ఏ సామాజిక వర్గానికెంత అందుతున్నాయో పరిశీలించి సలహాలూ, సూచనలూ ప్రభుత్వానికి ఇవ్వడం ఈ పర్యవేక్షక కమిటీ కర్తవ్యం.

## 3. సమాన అవకాశాల కమిషన్

మైనారిటీ అయినందుకు తాము వివక్షకు గురి అవుతున్నామని ముస్లింలు భావిస్తున్న విషయం తమ విచారణలో పదేపదే ముందుకొచ్చిందని సచార్ కమిటీ అనింది. ఏ రకమైన వర్గ వివక్షయినా భారత రాజ్యాంగానికి విరుద్ధం. అటువంటి ఫిర్యాదులను పరిశీలించడానికి న్యాయస్థానాలే కాక జాతీయ మానవ హక్కుల కమిషన్, మైనారిటీ కమిషన్ వగైరా సంస్థలున్నప్పటికీ న్యాయస్థానాలలో వ్యాజ్యాలు నడపడంలో ఉన్న సమస్యలు ఒకెత్తు కాగా, మిగిలిన కమిషన్‌ల అధికారాలు, పరిధి పరిమితమైనవని సచార్ కమిటీ గుర్తించింది. మైనారిటీలు వివక్షకు సంబంధించి

ఫిర్యాదు చేసుకుని న్యాయం పొందగల వేదిక ఉండడం, దానికి ఈ విషయంలో స్పష్టమైన అధికారాలుండడం అవసరం అని భావించింది. ఈ సందర్భంగా బ్రిటన్లోని జాతి సంబంధాల చట్టాన్ని (రేస్ రిలేషన్స్ యాక్ట్ను) ఒక నమూనాగా ప్రస్తావించింది. తాను సూచించిన న్యాయ వేదికకు సమాన అవకాశాల కమిషన్ అనే పేరును కూడ సచార్ కమిటీ ప్రతిపాదించింది.

## 4. పాలనలో భాగస్వామ్యం

పాలనలో తగు భాగస్వామ్యం లేకపోవడం అభివృద్ధి ఫలాలను అందుకోలేకపోవడానికి ఒక కారణం కాగలదని సచార్ కమిటీ గుర్తించింది. అన్ని స్థాయిలలోనూ ప్రాతినిధ్య వ్యవస్థలలో అగ్రకులాలది పెద్ద వాటా కాగా ఎస్సి ఎస్టిలకు గ్రామ పంచాయితీ నుంచి పార్లమెంటు దాకా జనాభా దామాషాలో ప్రాతినిధ్యం రాజ్యాంగమే కల్పించింది. బిసిలకూ స్త్రీలకూ గ్రామ పంచాయితీ నుండి జిల్లా పరిషత్ వరకు రిజర్వేషన్ కల్పించబడింది. ముస్లింలకు మాత్రం ఏ స్థాయిలోనూ ఇది లేదు. ఒక్క ఆంధ్రప్రదేశ్లో మాత్రమే పంచాయితీలలో (అన్ని స్థాయిలలోనూ), మునిసిపాలిటీలలో, సహకార సంస్థలలో మైనారిటీల నుండి కోఆప్ట్ చేసుకునే ఏర్పాటు ఉంది. ఈ మార్గం ద్వారా సభ్యులైన వారికి ఓటు వేసే హక్కు లేకున్నా కనీసం తమ వర్గానికి చెందిన సమస్యలను చర్చకు పెట్టే హక్కు, అవకాశం ఉన్నాయి. సచార్ కమిటీ ఈ ఏర్పాటును అభినందిస్తూ, ముస్లింలకు పరిపాలనలో భాగస్వామ్యం కల్పించవలసిన అవసరాన్ని నొక్కి చెప్పింది. ఏ కారణంగానో రిజర్వేషన్ కల్పించాలని సూచించే బదులు నామినేషన్ పద్ధతి పెంచాలనింది. అయితే ఓటుహక్కు లేని నామినేటెడ్ ప్రతినిధులు ఉండడం వల్ల లభించే ప్రయోజనం స్వల్పమే.

ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలలో ఎస్సిలకు రిజర్వ్ చేసిన అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలన్నీ ముస్లింలు అత్యధికంగా నివసించే ప్రాంతాలనే విషయాన్ని గణాంకాలతో సహా సచార్ కమిటీ చూపించింది. దీని వల్ల, కనీసం తాము అధిక సంఖ్యలో నివసించే ప్రాంతాలలోనైనా తమ వారిని ఎన్నుకునే అవకాశం లేకుండా పోయిందని కమిటీ ముందు హాజరైన వారు అన్నారని చెప్పింది. సవర్ణ హిందువులు తమ రాజకీయ ఆధిపత్యాన్ని చేజారనియ్యకుండా ఉండడానికి

ముస్లింలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలకే ఎస్‌సి రిజర్వేషన్‌ను పరిమితం చేయడం దీనికి కారణం అనేది స్పష్టమే. నియోజకవర్గాల డీలిమిటేషన్ చేపట్టినప్పుడు ఈ స్థితిని సవరించాలని సచార్ కమిటీ సూచించింది. ఈ మధ్యనే దేశవ్యాప్తంగా పూర్తయిన డీలిమిటేషన్ ఈ సూచనను లెక్కించిందో లేదో తెలీదు.

## 5. వైవిధ్యం పెంపుదల

మైనారిటీలు తమ వాడలకు, మొహల్లాలకు పరిమితం కావడం మంచిది కాదని గుర్తించి, నివాస స్థలాలలో, విద్యాలయాలలో, ఆటస్థలాలలో వైవిధ్యాన్ని, సహజీవనాన్ని ప్రోత్సహించే సూచనలు సచార్ కమిటీ ఇచ్చింది. విద్యాసంస్థలకూ, నివాస కాలనీల బిల్డర్లకూ తగిన ప్రోత్సాహకాలు ఇవ్వడం ఒక ముఖ్యసూచన. నగరంలో ప్రభుత్వ స్థలాల వినియోగాన్ని గురించి నిర్ణయం తీసుకునేటప్పుడు భిన్నమతాల వారు కలిసి ఉండే ప్రాంతాలలో పార్కులకు, ఆటస్థలాలకు, లైబ్రరీలకు భూములు ఎక్కువ కేటాయించాలనేది మరొక సూచన. సామాజిక రంగాలలో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు సాంస్కృతిక, సామాజిక వైవిధ్యాన్ని గురించి అవగాహన కల్పించే శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలనేది చాలా ముఖ్యమైన సూచన.

## 6. విద్యారంగం

ఒక సామాజిక వర్గం పురోగమనంలో విద్యకుండే ప్రాముఖ్యం దృష్ట్యా దీని మీద సచార్ కమిటీ చాలా దృష్టి పెట్టింది. ప్రాథమిక విద్య దశలోనే ముస్లింల స్థితి మరీ హీనంగా ఉందని సచార్ కమిటీ గుర్తించింది. స్కూలుకు పోయేవారి నిష్పత్తి, వారిలో అయిదవ తరగతి పూర్తి చేసేవారి నిష్పత్తి ఈ రెండూ చాలా తక్కువగా ఉన్నాయి. ఆ దశ దాటిన వారిలో చదువు కొనసాగించే వారి నిష్పత్తి మరీ అంత హీనంగా లేదు. కాబట్టి 14 సంవత్సరాల వరకు ఉచితంగా, నిర్బంధంగా చదువు నేర్పించాలని రాజ్యాంగం ప్రభుత్వం పైన పెట్టిన బాధ్యత ముస్లింల విషయంలో చాలా కీలకమైనదని సచార్ కమిటీ భావించింది. ప్రైవేట్ స్కూళ్ళు ముస్లింలకెక్కువగా అందుబాట్లో ఉండవు కాబట్టి ఉన్నత ప్రమాణాలు గల ప్రభుత్వ పాఠశాలలను ముస్లింలు అధికంగా నివసించే ప్రాంతాలలో నెలకొల్పాలనింది. ముస్లిం కుటుంబాలు – ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలో – ఇరుకైన చిన్న ఇళ్ళలో నివసిస్తున్నారు కాబట్టి

ప్రాంతీయంగా స్టడీ సెంటర్లు నెలకొల్పాలని, అక్కడ కూర్చొని చదువుకునే వాతావరణం కల్పించాలని అనింది. ఆడపిల్లలకు ప్రత్యేక పాఠశాలలు అన్ని చోట్లా లేకపోవడం ముస్లిం అమ్మాయిలు చదువు మానుకోవడానికి ఒక కారణం కాబట్టి హైస్కూలు స్థాయిలో అటువంటి ప్రత్యేక పాఠశాలలు నెలకొల్పాలనింది. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలలాగే ముస్లింలకు – ముఖ్యంగా అమ్మాయిలకు హాస్టళ్ళు నెలకొల్పాలనింది. మాతృభాషలో విద్యాబోధన విద్యాభివృద్ధికి చాలా కీలకం కాబట్టి ఉర్దూను మాతృభాషగా గల ముస్లిం వర్గాలున్న చోట ఉర్దూ మాధ్యమంలో స్కూళ్ళు నెలకొల్పాలనింది. ఉర్దూలో పాఠ్యపుస్తకాలు విరివిగా లభ్యం అయ్యేలాగ చూడాలనింది. మాధ్యమం సంగతి అటుంచి, ఉత్తర భారతదేశంలో త్రిభాషా సూత్రం కింద ఇంగ్లీష్ – హిందీ – సంస్కృతం నేర్పడం ఆనవాయితీ అయిపోయిన కారణంగా ఉర్దూ భాషను స్కూల్లో చదువుకునే అవకాశం సైతం లేకుండా పోయిందని వాపోయింది.

పాఠ్యాంశాలలోని విషయాలపైన కూడ సచార్ కమిటీ దృష్టి పెట్టింది. మన సమాజంలోని వైవిధ్యం పాఠ్యాంశాలలో కూడ ఉండాలనీ, లేకపోతే మైనారిటీ వర్గాలకు చెందిన పిల్లలు పాఠాల నుండి మానసికంగా దూరమయ్యే ప్రమాదం ఉందని అనింది. మైనారిటీలను కించపరిచే వ్యాఖ్యలు పాఠ్యాంశాలలో లేకుండా చూసుకోవడం అవసరం అనింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం విద్యా రంగంలో కృషి చేసే ఎన్జీవోల సహకారంతో పాఠ్యపుస్తకాలను ప్రక్షాళన చేసిన వైనాన్ని ఈ సందర్భంగా ప్రశంసించింది. అధ్యాపకులకిచ్చే తర్ఫీదు (టీచర్ ట్రైనింగ్) కూడ వైవిధ్యాన్ని గౌరవించే విశాల దృక్పథాన్ని నేర్పేదిగా ఉండాలనింది.

ఉన్నత విద్యలో ముస్లింల భాగస్వామ్యం చాలా తక్కువ అని గుర్తించిన సచార్ కమిటీ దానిని మెరుగుపరచడానికి కొన్ని సూచనలు చేసింది. అన్నిటి కంటే సరళమైనది, సులభంగా అమలయ్యేది రిజర్వేషన్. అయితే ఏ కారణంగానో సచార్ కమిటీ విద్యాసంస్థలకు ప్రోత్సాహకాలు కల్పించే ప్రత్యామ్నాయాన్ని ఎంచుకుంది. విద్యాలయాలకూ యూనివర్సిటీలకూ నిధులు సమకూర్చే యు.జి.సి వాటిలోని సామాజిక వైవిధ్యాన్ని బట్టి ఎక్కువ నిధులు ఇవ్వాలని అనింది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడులలో అనేక ముస్లిం సంస్థలు మైనారిటీ విద్యాసంస్థలు నెలకొల్పి ముస్లింలలో విద్యా వ్యాప్తికి కృషి చేస్తున్న వైనాన్ని ప్రస్తావించి, అయితే ఆ సంస్థలు ముస్లింలలోని

పేదలకు అందుబాట్లో లేవని సచార్ కమిటీ వ్యాఖ్యానించింది. ఆ సంస్థలు పేదలకిచ్చే సీట్లను బట్టి ప్రభుత్వం వాటికిచ్చే వసతులు, ఆర్థిక సహాయం ఉండాలని సూచించింది.

మదరసాలలో చదువుకునే ముస్లిం పిల్లల శాతం చాలా తక్కువే అయినప్పటికీ ఆయా ప్రాంతాలలో అవే వారికి పాఠశాలలుగా ఉన్నాయి కాబట్టి వాటిని హైస్కూళ్ళతో ముడి పెట్టి మదరసాలో చదువు ముగించిన పిల్లలు నేరుగా హైస్కూలులో లేక కాలేజీలో చేరే అవకాశం కల్పించాలని సచార్ కమిటీ సూచించింది.

## 7. ఉపాధి

విద్య విషయంలో లాగే ఉపాధి విషయంలో కూడ సచార్ కమిటీ కచ్చితమైన హక్కులు కల్పించే సూచనలు కాక, సమాచార పారదర్శకత, ప్రోత్సాహకాలు మొదలైన మార్గాలను వెనుకబాటుతనానికీ వివక్షకూ విరుగుడుగా సూచించింది. అధికంగా స్వయం ఉపాధి రంగంలో చిక్కుకున్న ముస్లిం ప్రజానీకానికి బ్యాంకు రుణాలు అందుతున్నది చాలా తక్కువ కావడం వారి ఉపాధి అవకాశాలలోని స్తబ్దతను సూచిస్తుంది. బ్యాంకును అప్పు అడిగిన వారు ఏ సామాజిక వర్గానికి చెందిన వారు, వారికి అప్పు ఇచ్చిందీ లేనిదీ తెలిపే సమాచారాన్ని బ్యాంకులు పారదర్శకంగా నమోదుచేసి ఉంచాలనీ, అమెరికాలో ఇటువంటి నియమం వివక్షను అరికట్టడానికి పనికొచ్చిందనీ సచార్ కమిటీ అంటుంది. 2001 జనాభా లెక్కలను బట్టి చూస్తే ముస్లింలు అధికంగా నివసించే ప్రాంతాలలో బ్యాంకు శాఖలు తక్కువ ఉన్నాయని తెలుస్తున్నది కాబట్టి, ముస్లింలు అధికంగా నివసించే ప్రాంతాలలో శాఖలు తెరిచే బ్యాంకులకు ప్రోత్సాహం కల్పించాలని సచార్ కమిటీ అంటుంది. నాబార్డ్ వంటి సంస్థలు మైనారిటీలకు ప్రయోజనకరమైన పథకాలపైన ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అంటుంది. ముస్లింల జనాభా 25 శాతం మించి ఉన్న జిల్లాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధుల కేటాయింపు జరగాలని అంటుంది. ఎస్సి ఎస్టిలకు బిసిలకు ఉన్నట్టు ముస్లింలకు కూడ ప్రత్యేక కేంద్ర ప్రభుత్వ పథకాలు ఉండాలని అంటుంది.

సామర్థ్యాన్ని పెంచడం కోసం ముస్లింలు అధికంగా నివసించే ప్రాంతాలలో ఐటిఐలు, పాలిటెక్నిక్‌లు విరివిగా నెలకొల్పాలని సచార్ కమిటీ సూచించింది. స్వయం ఉపాధి మీదనూ, దినకూలీ మీదనూ ముస్లింలు ఎక్కువగా ఆధారపడుతున్నారు కాబట్టి రెండవ లేబర్ కమిషన్ సిఫారసులు త్వరగా అమలుచేయడం ముస్లిం ప్రజానీకానికి

చాలా ఉపయోగకరం అనింది. ముస్లింలకు ఎక్కువగా ఉద్యోగాలిచ్చే సంస్థలకు ప్రోత్సాహం ఇవ్వడం, ఉద్యోగ ప్రకటనలు ఉర్దూలో కూడ ఇవ్వడం, సంస్థలు తమవి 'సమాన అవకాశాల సంస్థలు' అని ప్రకటించుకోవడం ద్వారా వెనుకబడిన వర్గాల వారు కూడ అప్లై చేసుకోవడాన్ని ప్రోత్సహించడం వగైరా చర్యలను సచార్ కమిటీ సూచించింది. ముస్లింలు అధికంగా నివసించే ప్రాంతాలలోని పోలీస్‌స్టేషన్లు, ఆస్పత్రులు వగైరా సంస్థలలో కనీసం ఒక్కో అధికారి అయినా ముస్లిం ఉండేటట్లు చూడాలన్నదొక్కటీ నిర్దిష్టమైన ప్రతిపాదన.

సచార్ కమిటీ సూచనల స్వరూపం ఈ పాటికి అర్థమై ఉంటుంది. కచ్చితమైన హక్కులు కల్పించమని చెప్పకుండా హక్కులు లభించే దిశగా ప్రోత్సాహకాలు ఇవ్వడం, పారదర్శకత నెలకొల్పడం, వ్యవస్థ తమకు కూడ చోటు కల్పిస్తుందన్న విశ్వాసం కలిగించడం, ఇత్యాది చర్యలు సూచించడం సదుద్దేశంతో అనుసరించిన వ్యూహమే అయి ఉండవచ్చు. రిజర్వేషన్లు, కోటాలు కలిగించినంత వ్యతిరేకత ఇవి కలిగించవు. అందువల్ల వీటికి రాజకీయ ఆమోదం సులభతరం కావచ్చు. అయితే మన దేశ పాలనా యంత్రాంగంతో మనకున్న అనుభవం ఏమిటంటే కచ్చితమైన హక్కులకే భరోసా లేదు. అనిర్దిష్టమైన సూచనలు ఆమోదం పొందేయవచ్చు కాని ఆ తర్వాత ఏమీ జరగకపోవచ్చు. అందుకే మొదట్లోనే అన్నాము – సచార్ కమిటీ సిఫారసుల కంటే వారి నివేదిక విలువైనదని.

కాగా, తాను సూచించిన చర్యలకు అవసరమైన నిధులను నిరుపయోగంగా ఉన్న ముస్లిం ప్రజల ధార్మిక ఆస్తులను అమ్మి, లేక వ్యాపార సంస్థలకు లీజుకిచ్చి సేకరించడం సబబుగా ఉంటుందన్న సచార్ కమిటీ సూచన ఎంతవరకు ఆమోదించదగ్గదన్నది చర్చించాల్సిన విషయమే. ఎక్కువగా పట్టణ ప్రాంతాలలో ఉన్న వక్ఫ్ ఆస్తులు ఇప్పుడు చాలా విలువైనవనడంలో సందేహం లేదు. వాటి నుంచి ముస్లిం ప్రజలు పెద్దగా ప్రయోజనం పొందుతుండకపోవచ్చు. అయితే నిరుపయోగంగా ఉన్న వాటిని వ్యాపార వనరులుగా మార్చడం ద్వారా డబ్బు సంపాదించి దానిని ముస్లిం ప్రజల లౌకిక అభ్యున్నతి కోసం ఖర్చు పెట్టాలన్నది అనేక సమస్యలకు దారితీయగల సూచన. దీని మీద ఇంకా చాలా చర్చ జరగవలసి ఉంది.

మానవహక్కుల వేదిక బులెటిన్ 9
డిసెంబర్ 2008

# మద్రాసు హైకోర్టు రగడ ముందూ వెనకా

ఫిబ్రవరి 19న మద్రాసు హైకోర్టులో జరిగిన రగడ ఒక రకంగా మేలు చేసింది. శ్రీలంకలోని పరిస్థితి గురించి మనకు ఉండవలసీ లేకుండపోయిన ఆసక్తిని రగిల్చింది. నిజానికి శ్రీలంక పరిస్థితి గురించి అవగాహన లేకపోతే మద్రాసు హైకోర్టు గొడవ అర్థం కాదు. అది లేకనే, సుప్రీంకోర్టు విచారణ జరపమని నియమించిన జస్టిస్ బి.ఎన్.శ్రీకృష్ణ రెండే రెండు రోజులలో ఒక మధ్యంతర నివేదిక ఇచ్చేసి అందులో తప్పు ప్రధానంగా లాయర్లదే అని అనగలిగారు. ఆయన న్యాయబుద్ధి గలవాడు, పక్షపాతరహితుడు అంటూ ఆయన నియామకాన్ని స్వాగతించిన మద్రాసు న్యాయవాదులు కంగు తిన్నారు.

2006 తరువాత క్రమంగా తన దేశానికి చెందిన మీడియాను, మానవహక్కుల కార్యకర్తలనూ తమిళ ప్రాంతమైన వన్నీకి పోనివ్వకుండ నిరోధించిన శ్రీలంక ప్రభుత్వం అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న హ్యూమన్ రైట్స్ వాచ్‌ను మాత్రం పోనివ్వక తప్పలేదు. వారిని కూడ పోనివ్వకపోతే అంతర్జాతీయంగా పరువు పోతుందని భయపడ్డారేమో తెలియదు. ఆ సంస్థ డిసెంబర్లో ఒకటి, ఫిబ్రవరిలో ఒకటి రెండు వివరమైన నివేదికలు విడుదల చేసింది. ఎల్‌టిటిఇతో ఉండిపోయి దేశ ఈశాన్య తీరంలో చిక్కుకుపోయిన రెండున్నర లేక మూడు లక్షల తమిళ ప్రజానీకానికి తిండి లేదు, నీళ్లు లేవు, వైద్యం లేదు, ఆస్పత్రులలో సహితం భద్రత లేదు అనేది ఈ నివేదికల సారాంశం. కిలినోచ్చితో మొదలుపెట్టి ఎల్‌టిటిఇని వెనక్కి తరిమిన క్రమంలో శ్రీలంక సైన్యం నిరాయుధులైన పౌరులపైన గుండ్ల వర్షాలు అనేక పర్యాయాలు కురిపించిందని సోదాహరణంగా ఈ

నివేదికలు తెలుపుతాయి. ఫిబ్రవరి నెల మధ్యభాగం నాటికి 5150 మంది పౌరులు తీవ్రంగా గాయపడ్డారనీ, అందులో 1123 మంది చనిపోయారనీ తెలుపుతాయి. ప్రస్తుతం ఈ సంఖ్యలు 7000, 2000కు చేరుకున్నాయని ఒక అంచనా. ఆస్పత్రుల మీద గుండ్లవర్షం కురిపించిన ఘటనలను తేదీలతో సహా ఈ నివేదికలలో ఇచ్చారు. ముల్లైత్తివు జనరల్ ఆస్పత్రిపైన డిసెంబర్ 15, 19, 20 తారీఖులలో, వడ్డకచ్చి ఆస్పత్రిపైన డిసెంబర్ 17 తారీఖు నాడు, కిలినోచ్చి జనరల్ ఆస్పత్రిపైన డిసెంబర్ 22, 30 తేదీలలో, వల్లిపురం ఆస్పత్రిపైన ఈ సంవత్సరం జనవరి 19, 21, 22 తారీఖులలో, పుట్టక్కుదియురిప్పు ఆస్పత్రిపైన అత్యధికంగా జనవరి 10, 13, 31, ఫిబ్రవరి 2, 3, 5, 10 తారీఖులలో శ్రీలంక సైన్యం మందుగుండ్లు కురిపించిందని చెప్పాయి.

ఎల్‌టిటిఇ అదుపులో ఉన్న 'యుద్ధ ప్రాంతం' నుంచి తమిళులను బయటకు రమ్మని శ్రీలంక ప్రభుత్వం ఆహ్వానిస్తున్నది. కొన్ని సురక్షిత ప్రాంతాలను గుర్తించి అక్కడ ఎటువంటి ప్రాణాపాయమూ ఉండదని హామీ ఇస్తున్నది. కానీ అక్కడ కూడ ప్రజలకు సైన్యం దాడులు తప్పడం లేదు. ఉదాహరణకు ఎ-35 జాతీయ రహదారి పక్కన ఉన్న 35 చదరపు కిలోమీటర్ల వైశాల్యం గల ప్రాంతాన్ని జనవరి 21న శ్రీలంక సైన్యం సురక్షిత ప్రాంతంగా ప్రకటించి కరపత్రాలు అచ్చువేసి పంచగా చాలామంది తమిళులు అక్కడ చేరారు. అక్కడున్న ఒక స్కూలు ఆటస్థలంలో ఎక్కువ మంది గుమిగూడారు. అదే భోజనం పొట్లాల సరఫరా కేంద్రం కూడ. జనవరి 22, 23, 24 తేదీలలో ఈ ఆటస్థలం మీదకు దాని చుట్టుపక్కల శ్రీలంక సైన్యం విచ్చలవిడిగా తూటాలు కురిపించగా 30 మంది పౌరులు చనిపోయారు. పక్కనే ఉన్న ఐక్యరాజ్యసమితి సిబ్బంది కార్యాలయం మీద 24, 25 తేదీలలో శ్రీలంక సైన్యం కురిపించిన గుండ్ల వర్షంలో మరొక 9 మంది చనిపోయారు.

ఎల్‌టిటిఇ ప్రాంతం నుంచి తప్పించుకుపోవడానికి ప్రయత్నించేవారి పట్ల తమిళ పోరాటకారులు సైతం చాలా క్రూరంగా, నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించే సంగతి కూడ హ్యూమన్ రైట్స్ వాచ్ నివేదిక దృష్టాంతాలతో సహా వివరించింది. ఫిబ్రవరి 9 నాడు సుదంతిరపురం వద్ద శ్రీలంక సైన్యం దాడి నుంచి తమను తాము కాపాడుకుంటూ వెనక్కి పోతున్న ఎల్‌టిటిఇ బలగాలు ఎప్పటిలాగే ప్రజలను కూడ

తమతో బాటే వెనక్కురమ్మని ఒత్తిడిపెట్టాయి. ఆ ఆదేశాన్ని తిరస్కరించి అక్కడే ఉండిపోవాలని చూసినవారిపైన ఎల్‌టిటిఇ బలగాలు కాల్పులు జరిపి 17 మందిని చంపారు. గతంలో కూడ వన్ని ప్రాంతాన్ని వదిలి బయటికి పోవాలంటే ఎల్‌టిటిఇ అనుమతి తీసుకోవలసి ఉండింది. 2008 నుంచి ఆ అనుమతి పొందడం కష్టతరం అయింది. ఇప్పుడు అనుమతి ప్రసక్తి లేదు. నేరుగా కాల్చి చంపడమే జవాబు. ఫిబ్రవరి నెలలోనే ఒకరోజు యుద్ధ ప్రాంతానికీ సురక్షిత ప్రాంతానికీ అంచున ఉన్న మురసముద్దై అనే చోట ఇరుపక్షాలూ కాల్పులు జరుపుకుంటుండగా ఇటు వైపునుంచి అటువైపుకు పారిపోవాలని చూసినవారిపైన వెనుక నుంచి ఎల్‌టిటిఇ, ముందు నుంచి శ్రీలంక సైన్యం కాల్పులు జరిపాయి. ఎంతమంది చనిపోయిందీ తెలీదు.

పోనీ ధైర్యం చేసి ఎల్‌టిటిఇ ప్రాంతం నుంచి తప్పించుకున్న తమిళులు తర్వాతయినా సురక్షితంగా ఉంటారా అంటే అదేం లేదు. యుద్ధ ప్రాంతం సరిహద్దు నుంచి చివరి మజిలీ అయిన వావున్నియా పట్టణం చేరే లోపల వారిని అయిదు సార్లు సోదా చేస్తారు. అతి ముఖ్యమైన సోదా ఒమంతై చెక్‌పోస్ట్ దగ్గర జరుగుతుంది. అక్కడ 18–35 సంవత్సరాల మధ్య వయస్సున్న మగవాళ్లను వేరుచేసి మిగిలిన వాళ్లను వావున్నియా పంపిస్తారు. ఒమంతైలో నిలిపేసిన వారు మళ్ళీ కనిపించకపోవచ్చు. వావున్నియా చేరిన వారు కూడ ముళ్లకంచె, సైన్యం పహరాలోనే బతకాలి.

తమిళనాడు ప్రజలలో ఉన్న ఆగ్రహాన్ని ఈ నేపథ్యంలో చూడాలి. కోపగించుకునే వారుతా ఎల్‌టిటిఇ మద్దతుదారులు కారు. నిజానికి ఎల్‌టిటిఇ ఒక ఫాసిస్టు సంస్థ అనేదే అత్యధికుల అభిప్రాయం. ఈ తేడా తెలియని జస్టిస్ శ్రీకృష్ణ తొందరపడి తయారుచేసిన తన మధ్యంతర నివేదికలో ఆందోళన చేస్తున్న న్యాయవాదులందరినీ 'ఎల్‌టిటిఇ అనుకూలురు' అని మొదటి పేరాలోనే వర్ణించారు. అక్కడి నుంచే ఆ నివేదిక నిష్పాక్షికత కోల్పోయింది. తమిళనాడులో జనవరి నెలాఖరు నుంచి శ్రీలంక తమిళుల పట్ల సానుభూతితో రకరకాల రూపాలలో ఆందోళన నడుస్తున్నది. దానిలో లాయర్లు ముఖ్యపాత్ర నిర్వహిస్తున్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలోనూ, నిన్న మొన్న పాకిస్థాన్‌లో జరిగిన ప్రజాస్వామ్య పునరుద్ధరణ పోరాటంలోనూ లాయర్లు ముఖ్య పాత్ర నిర్వహించడాన్ని అందరూ గొప్ప విషయంగా భావించేటప్పుడు ఈ సంఘీభావ ఉద్యమంలో లాయర్ల పాత్రను జస్టిస్ శ్రీకృష్ణ, ది హిందూ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌ల

దినపత్రికల సంపాదకులు ఈసడించుకోవడం ఎందుకు? ఈ లాయర్లు సమాజం అట్టడుగు వర్గాలకు చెందిన యువ న్యాయవాదులు కావడమే అందుకు కారణం అన్న విమర్శకు జవాబుందా?

ఆందోళన చేస్తున్న లాయర్లకు ఫిబ్రవరి 17న హైకోర్టుకు వచ్చిన సుబ్రమణ్య స్వామి కనిపించాడు. వాళ్లు నినాదాలిచ్చుకుంటూ అతను కూర్చున్న కోర్టులోకి పోయి అతనిపైన కోడిగుడ్లు విసిరారు. కోడిగుడ్ల సంగతి అటుంచి కోర్టు హాల్‌లో నినాదాలివ్వడం నిస్సందేహంగా తప్పే. అయినా సుబ్రమణ్య స్వామి కోర్టులోనైనా బయటైనా కొట్టదగ్గ వ్యక్తి కాదు. భారత ప్రజా జీవితంలో – ఏ అర్హతా లేకున్నా కేవలం మీడియా ప్రాపకం పుణ్యాన ప్రజాజీవితంలో బతికి వున్న నికృష్ట జీవులెవరయినా ఉంటే వారిలో ఇతను ప్రథముడు. అయినా లాయర్లు నినాదాలిచ్చుకుంటూ వెళ్లి అతనిపైన కోడిగుడ్లు విసరడం సెక్షన్ 147 ఐపిసి కింద మాత్రమే నేరం. అది బెయిలబుల్ నేరం. వారిని అరెస్టు చేయడానికి పోలీసులు యుద్ధం చేయవలసిన అవసరమేం ఉండలేదు. అయితే వారి నేరాన్ని నాన్ బెయిలబుల్ చేయడానికి కాబోలు సుబ్రమణ్య స్వామిని వారు 'బ్రాహ్మణ శునకం' అని తిట్టారని చెప్పి సెక్షన్ 158ఎ చేర్చారు. అతను ఎల్‌టిటిఇని ఉద్దేశించి 'ఇంటర్నేషనల్ పరయ్యా' అన్న తిట్టు వాడాడని 'ది హిందూ' సైతం రాసింది. తమిళం నుంచి ఇంగ్లీష్‌లోకి పోయిన పరయ్యా అన్న మాటకు ఇంగ్లీష్‌లో వెలివేయబడిన వారు అన్న అర్థం మాత్రమే ఉండవచ్చు. ఎల్‌టిటిఇని అంతర్జాతీయంగా అందరూ వెలివేశారన్న అర్థంలో తాను ఆ మాట ప్రయోగించానని సుబ్రమణ్య స్వామి సమర్థించుకోవచ్చు. కాని తమిళంలో పరయ్యా అనేది అంటరానితనాన్ని సూచించే మాట, ఒక తిట్టు కూడ. కాబట్టి అధికంగా దళితులయిన లాయర్లు అతనిపైన ఎస్‌సి, ఎస్‌టి కేసు పెట్టాలనడంలో తప్పేముంది?

18వ తేదీన లాయర్ల నాయకుడు ఇమ్మాన్యుయేల్‌ను పోలీసులు అరెస్టు చేసినప్పుడు గొడవేమీ కాలేదు. 19వ తేదీన తక్కిన లాయర్లు హైకోర్టు ఆవరణలో ఉన్న పోలీస్ స్టేషన్‌లోకి పోయి సుబ్రమణ్యస్వామి పైన కేసుపెట్టి అరెస్టు చేస్తే తామూ అరెస్టవుతామనడంతో ఘర్షణ మొదలయింది. వాళ్ళను పోలీసులు బలవంతంగా వ్యాన్ ఎక్కించే ప్రయత్నం చేసేసరికి ఆందోళన చేస్తున్న లాయర్లు తిరగబడ్డారు.

పోలీసుల పైన రాళ్లు వేశారు. పోలీస్‌స్టేషన్‌కు నిప్పుపెట్టారు. పోలీసులు హైకోర్టు గేట్లు వేసి ఎదురుదాడికి దిగారు. సాయంత్రం 5.15 కు నగర పోలీస్ కమిషనర్ వచ్చాడు. ఆ తరువాతే లాఠీచార్జికి అధికారికంగా ఆదేశం లభించిందని జస్టిస్ శ్రీకృష్ణ సహితం ఒప్పుకుంటున్నారు. ఆ ఆదేశం లభించిన పోలీసులు విపరీతమైన బీభత్సానికి పాల్పడ్డారు. కోర్టు లోపల, కోర్టు కార్యాలయాల లోపల, లైబ్రరీలో, చుట్టుపక్కల వీధులలో ఉండే లాయర్ల ఆఫీసులలో, జిరాక్స్ షాపులలో, హోటళ్లలో కనిపించిన ప్రతి లాయరునూ కొట్టారు, కంప్యూటర్లను విరగ్గొట్టారు, కాగితాలు విసిరేశారు. భయపడిన జడ్జీలు చాలామంది టాయిలెట్లలోకి వెళ్లి తలుపులు వేసుకున్నారంట. ఇరు పక్షాలను శాంతింపజేయడానికి వచ్చిన జడ్జి ఆర్ముగం పెరుమాళ్‌కు కూడ తల మీద లాఠీ దెబ్బ తగిలింది. పోలీస్ కమిషనర్ సమక్షంలోనే ఇవన్నీ జరిగినా అతని తప్పేమీ లేదని జస్టిస్ శ్రీకృష్ణ తన మధ్యంతర నివేదికలో అనేశారు. వారి తుది నివేదిక ఇంకొంచమైనా నిష్పాక్షికంగా ఉండాలంటే తమిళులు ఎందుకు ఆందోళన చెందుతున్నారో అర్థం చేసుకోవలసి ఉంటుంది. చేసుకుంటాడని ఆశిద్దాం.

*ఆంధ్రజ్యోతి దినపత్రిక*

*11 మార్చి 2009*

# దారి తప్పిన 'విచారణ'

నిరుడు కర్ణాటకలో క్రైస్తవుల పైన దాడుల గురించి ఆ రాష్ట్ర ప్రభుత్వం ఒక న్యాయవిచారణ కమిషన్‌ను నియమించింది. ఆ రాష్ట్ర హైకోర్టులోనూ, మన హైకోర్టులోనూ కూడ జడ్జిగా పని చేసి రిటైరయిన జస్టిస్ బి.కె. సోమశేఖరను న్యాయవిచారణ కమిషనర్‌గా ఎంపిక చేసింది. ఆయనగారు ఆ విచారణను క్రైస్తవంపైన న్యాయ విచారణగా మలచి నడుచుకుంటున్న తీరు అపూర్వమని చెప్పుకోవాలి. జడ్జిగా ఉన్నప్పుడు సోమశేఖర గారు తన విధి నిర్వహణకు సంబంధించిన నియమాలను గాలికి వదిలాడన్న చెడ్డ పేరేమీ లేదు. రిటైరయిన పిదప మన రాష్ట్రంలో ఏలేరు స్కాంపైన న్యాయ విచారణ జరపటానికి ఆయననే నియమించారు. కానీ మతం విషయానికొచ్చేసరికి అన్ని న్యాయ సంబంధమయిన నియమాలు మరిచిపోయాడు. భజరంగ్ దళ్, శ్రీరామ సేన, హిందూ జాగరణ్ మంచ్‌లను బోను నుంచి తప్పించి ఏసుక్రీస్తును బోనులో నిలబెట్టి విచారణ చేస్తున్నాడు.

అధికార యంత్రాంగం వైఫల్యాలనూ లాలూచీనీ అవినీతినీ వెలికి తీయడానికి ప్రజలు న్యాయ విచారణ కమిషన్లను కోరడం, ప్రభుత్వాలు నియమించడం జరుగుతుంటుంది. ఆ యంత్రాంగం తన వైఫల్యాలను గురించి తాను జరుపుకునే పరిశోధనలూ విచారణలూ విశ్వసనీయంగా ఉండవు కాబట్టి వాస్తవాలు బయటకు రావాలంటే పారదర్శకమైన బహిరంగ విచారణ జరపాలన్న అభిప్రాయం దీనికి మూలం. న్యాయమూర్తిగా పని చేసిన వ్యక్తికి ఇందుకు కావలసిన నైపుణ్యం, దృష్టి కోణం ఉంటాయని ఆశించడం జరుగుతుంది కాబట్టి ఈ విచారణలను జడ్జిలుగా పనిచేసినవారికి అప్పగించడం జరుగుతుంటుంది. కర్ణాటక విషయానికొస్తే, 2006 నుంచి ఆ రాష్ట్రంలో క్రైస్తవుల పైన హిందుత్వవాద సంస్థలు చేస్తున్న దాడులను,

వేధింపులను అధికార యంత్రాంగం విచారించకపోగా తాను కూడ అందులో భాగం అయింది. పోలీసులే కాదు ఇతర పాలనా శాఖలూ అయినాయి. ప్రార్థనా స్థలాల పైన దాడి చేసి పాస్టర్‌ను కొట్టి కుర్చీలనూ చిత్రపటాలనూ మత చిహ్నాలనూ ధ్వంసం చేసిన వారే పోలీస్‌స్టేషన్‌కు పోయి అక్కడ బలవంతపు మతమార్పిడి జరుగుతున్నదని ఫిర్యాదు చేస్తారు. హింసకు పాల్పడిన వారిపైన చర్య తీసుకునే బదులు పోలీసులు ప్రార్థనా స్థలాల నిర్వాహకులపైన శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్నారని కేసులు పెడతారు. ఒక్కొక్కసారి అరెస్టు చేస్తారు, ఒక్కొక్కసారి తాసీల్దారు వద్ద హాజరయి బాండు ఇమ్మని ఆదేశిస్తారు. జిల్లా అధికారులు చర్చిలను మూసివేసి తాళం వేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇదంతా రెండేళ్ళకు పైగా జరుగుతుండగా, నిరుడు ఆగస్ట్ 17, సెప్టెంబర్ 21 తేదీల మధ్య 28 చోట్ల దాడులు జరగడం, సెప్టెంబర్ 14న ఒక్కరోజే ఒకే సమయంలో ఒకే పద్ధతిలో దక్షిణ కన్నడ, ఉడిపి జిల్లాలలో 12 చోట్ల క్రైస్తవ ప్రార్థనా స్థలాల పైన 'జై శ్రీరాం', 'జై భజరంగ బలీ' అన్న నినాదాలు ఇస్తూ కర్రలు పట్టుకున్న గుంపులు దాడిచేసి విధ్వంసం చేయడం, వారిని నివారించని పోలీసులు ఆ తరువాత నిరసన తెలిపిన క్రైస్తవులను తరిమి తరిమికొట్టి అరెస్టు చేయడం దేశమంతటి దృష్టినీ ఆకర్షించింది.

న్యాయవిచారణ అంటూ జరిగితే ఇందులో అధికార యంత్రాంగం నిర్వాకం గురించి, యెడ్యూరప్ప ప్రభుత్వం స్పందన గురించి జరగవలసి ఉండింది. ప్రభుత్వం కొంత వరకు ఆ పని చేసింది. అధికార యంత్రాంగం వైఫల్యాలను వెలికి తీసే లక్ష్యంతో జస్టిస్ సోమశేఖర కమిషనను నియమించింది గానీ, 2008 సెప్టెంబర్‌లో జరిగిన దాడులకు 'దారి తీసిన పరిస్థితుల' పైన కూడ విచారణ జరపమనింది. దాడులు జరుగుతున్నప్పుడు యెడ్యూరప్ప ప్రభుత్వం అనుసరించిన వైఖరిని దృష్టిలో పెట్టుకున్నప్పుడు ఇది ఉద్దేశ్యపూర్వకంగా జరిగిందనే భావించాలి. సోమశేఖర గారు దానిని వాడుకొని న్యాయవిచారణను క్రైస్తవంపైన, మత స్వేచ్ఛపైన విచారణగా మలచారు. హిందుత్వవాదులు విచారణ కమిషన్ ముందు హాజరయి బైబిల్‌ను డాక్యుమెంటుగా ప్రవేశపెట్టి, తమపైన జరిగిన హింస గురించి వాంగ్మూలం ఇవ్వడానికి వచ్చిన క్రైస్తవులను బైబిల్ గురించి క్రాస్ ఎగ్జామిన్ చేస్తున్నారు. విగ్రహారాధనను విమర్శించే బైబిల్ వాక్యాలు హిందువుల మనోభావాలను కించపరిచేవిగా లేవా అనీ, హిందువుల పైన ద్వేషం రెచ్చగొట్టేవిగా లేవా అనీ, సామాజిక శాంతికీ దేశ సమగ్రతకూ

సమైక్యతకూ ఆ బైబిల్ వాక్యాలు అవరోధం కాదా అని ఎదురు ప్రశ్నలు అడుగుతున్నారు. 'అందువల్లనే దాడులు జరిగాయి' అనే నిర్ధారణకు న్యాయ విచారణ కమిషన్ రావడానికి తగిన 'మెటీరియల్' జస్టిస్ సోమశేఖర గారికి అందిస్తున్నారు. ఆయన తనకు పురమాయించబడ్డ కర్తవ్యానికి ఈ ప్రశ్నలు అసందర్భమైనవి అని వాటిని నివారించే బదులు ఆ ప్రశ్నలకు తావిచ్చే దిశగా తన విచారణ పరిధిని పెంచుకున్నాడు. ఆయనిచ్చిన అవకాశాన్ని పూర్తిగా వాడుకుంటున్న హిందుత్వవాదులు బైబిల్‌లోని కొన్ని వాక్యాలను తొలగించవలసిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించమని ఆయనను కోరారు. ఆయన ఆ అభ్యర్ధనను కూడ పరిశీలిస్తున్నాడు!

సోమశేఖర కమిషన్ ఈ నెల 12వ తేదీన బెంగుళూరులోని ఒక న్యాయ కళాశాలతో కలిసి నిర్వహించిన సెమినార్ ఆయన వైఖరికి అద్దం పడుతుంది. న్యాయ విచారణ కమిషన్ అవగాహన పెంపొందించడం కోసం, విజ్ఞుల అభిప్రాయాలు వినడం కోసం ఈ సెమినార్ నిర్వహిస్తున్నట్లు కమిషన్ చైర్మన్ హోదాలో ఆయన ప్రకటించుకున్నాడు. సెమినార్‌లో ఆయనతో సహా పలువురు వక్తలు మాట్లాడారు. మొత్తం 6 ప్రసంగాలు ఏర్పాటు చేశారు. వాటిలో ఒకటి మాత్రం ఆయనకు నిర్దేశించిన కర్తవ్యానికి సంబంధించినది ('మత మైనారిటీలకు చట్టపరమైన రక్షణ'). తక్కిన అయిదు 'మత ప్రచారంలో సామాజిక భద్రత, నైతికతలకు సంబంధించిన సమస్యలు', 'మతమార్పిడికి సంబంధించి ప్రస్తుతం ఉన్న చట్టాలు, వాటి సామాజిక ప్రభావం, ఏవయినా సవరణలు లేక కొత్త చట్టాలు అవసరమా?', 'మత మార్పిడి మత ద్వేషాలను రెచ్చగొట్టే నేరం కిందికి వస్తుందా?' 'మత మార్పిడి సామాజిక శాంతిని భగ్నం చేయడం అనే నేరం కిందికి వస్తుందా?' 'మతాన్ని విశ్వసించడం, ఆచరించడం, ప్రచారం చేయడం-వీటిలోని చట్టపరమైన అంశాలు' అనేవి.

వక్తలలో ఒకరు తప్ప అందరూ మత మార్పిడి అనేది సామాజిక శాంతికీ భద్రతకూ దేశ సమైక్యత భంగకరం అనే మాట్లాడారు. దాదాపు 3 శతాబ్దాల మత ప్రచారం తరువాత కూడ దేశ జనాభాలో 3 శాతం దాటని క్రైస్తవాన్ని గురించి ఇంతటి ఆందోళన వ్యక్తం చేయడం – హక్కులు, న్యాయాన్యాయాల సంగతి అటుంచి – కనీస విజ్ఞత గల అభిప్రాయమా అన్న సందేహం జడ్జిగారికి గానీ వక్తలకు గానీ రాకపోవడం హిందుత్వవాదులు మెదళ్ల తలుపులు మూసేసే ద్వేష వాతావరణాన్ని

దేశంలో ఎంతగా రెచ్చగొట్టారన్న దానికి సూచిక. అదట్లా ఉంచి, మైనారిటీల పైన జరిగిన దాడుల విషయంలో అధికార యంత్రాంగం ప్రదర్శించిన నిర్వ్యాపకత్వం గురించి, లాలూచీ గురించి విచారణ జరపమని కూర్చోబెట్టిన కమిషన్ ఈ చర్చ చేపట్టడం సబబా అని జస్టిస్ సోమశేఖర గారికి సందేహం రాకపోవడం అత్యంత ఆందోళనకరం.

దావణగిరి జిల్లాలో అధికార యంత్రాంగం తాళాలు వేసిన క్రైస్తవ ప్రార్థనా స్థలాలను తెరిపించాలని కోరుతూ కొందరు క్రైస్తవులు సోమశేఖర కమిషన్‌ను అభ్యర్థించగా ఆయన జారీచేసిన ఆదేశం వారి కమిషన్ చేయబోయే న్యాయ నిర్ణయానికి అద్దం పడుతుంది. తాళాలు తీయడాన్ని తప్పక అనుమతించవలసిందేనని ఉపోద్ఘాతంలో అంటూ, దానికి ఆయన 19 షరతులు విధించాడు. ఇతర మతస్తుల భావాలను గాయపరిచే మాటలు మాట్లాడకూడదనీ, ఎటువంటి చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడకూడదనీ, ప్రార్థనకు వెళ్ళే ప్రతి వ్యక్తి తన పేరు, చిరునామా, ప్రార్థనాస్థలం పేరు, దాని నిర్వాహకుల వివరాలు, ప్రార్థన సమయం వగైరాలన్నీ లిఖితపూర్వక వాంగ్మూలం రూపంలో అధికార యంత్రాంగానికి ఇచ్చి వెళ్లాలనీ వగైరా షరతులు పెట్టారు. అదృష్టవశాత్తు వేరే కొందరు దావణగిరికి చెందిన క్రైస్తవులు అదే అభ్యర్థనతో హైకోర్టులో కేసు వేయగా హైకోర్టు బాధితులకు కాక దాడిచేసిన వారికి అండగా ఉన్నందుకు అధికార యంత్రాంగాన్ని అభిశంసించి, పోలీసులు సమర్పించిన నివేదిక ప్రకారం చూసినా బలవంతపు మతమార్పిడి జరిగిన ఆధారాలేమీ లేవని ప్రకటించి ప్రార్థనా స్థలాలను పోలీసు తాళాల నుంచి విముక్తం చేసింది.

*ఆంధ్రజ్యోతి దినపత్రిక*

*30 జూలై 2009*

# కమిషన్ నివేదికలు
# సామాజిక న్యాయం

జాగ్రత్తగా చదివితే – ఇందులోని ఒక్కొక్క వ్యాసం వెనక ఆయా నివేదికల ద్వారా ప్రజలకు మేలు జరగాలన్న బాలగోపాల్ తపన, ఆరాటం, హాని జరగకూడదన్న పట్టుదల కనిపిస్తాయి.

.....



ఒక హక్కుల కార్యకర్తగానే కాదు, పరిశోధకుడిగా, ప్రజా మేధావిగా బాలగోపాల్ ఈ నివేదికలను లోతుగా విశ్లేషించి, వాటి మంచిచెడులను సమాజానికి తెలియజేశారు. కమిషన్లు సేకరించిన సమాచారం, వాటిని అవి పరిశీలించిన పద్ధతి, చేసిన సిఫార్సులు, అన్నిటినీ క్షుణ్ణంగా పరిశీలించి ఏవి ప్రజానుకూలమైనవో, ఏవి కావో, ఏవి ప్రజాస్వామ్యానికి దోహదపడేవో, ఏవి కావో సహేతుకంగా వివరించి చెప్పిన వ్యాసాలు ఇవి. చట్టం చెప్పే న్యాయం మాత్రమే కాదు, సామాజిక న్యాయం కూడా ఉందా లేదా అని సాధికారికంగా చెప్పడం ఈ వ్యాసాల విశిష్టత.

.....

ఇందులో చర్చించబడిన అంశాలన్నీ భారత రాజకీయ సంవాదంలో చాలా ముఖ్య పాత్ర పోషించినవి, మరెంతో కాలం పోషించబోయేవి కూడా. కాబట్టి అందరూ చదివి వీటిని తమ అవగాహనలో భాగం చేసుకోవాలని కోరుతున్నాం.

.....

మానవహక్కుల వేదిక ప్రచురణ ₹ 300/-